

విద్వత్సభ సంపాత దశాబ్ది దీపిక



తెలంగాణ విద్వత్సభ దశాబ్ది విశిష్ట సంచిక

(2017-2026)


ధర్మార్థ సిద్ధ్యర్థం జ్యోతిశ్శాస్త్రమనుత్తమమ్
తెలంగాణ విద్వత్సభ
పండితాః సమదర్శినః
ॐ
జ్యోతిష పితామహుడు పరాశరుడు

విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక

దశాబ్ది మహోత్సవాల విశిష్ట సంచిక

(2017-2026)



సంపాదక వర్గము

యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

దివ్యజ్ఞాన సిద్ధాంతి

మరుమాముల వేంకటరమణ శర్మ

ప్రచురణ

తెలంగాణ విద్వత్సభ, భాగ్యనగరము

తెలంగాణ

విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక

దశాబ్ది మహోత్సవాల విశిష్ట సంచిక
(2017-2026)

ముద్రణ : ఆషాఢ బహుళ తదియ, చవితి
2026 ఆగష్టు 1, 2 శని, ఆదివారాలు
(తెలంగాణ విద్వత్సభ దశాబ్ది
మహోత్సవాల సందర్భం)

ప్రచురణ విరాళం : రూ. 500/-


టైప్ సెట్టింగ్ : సమంత గ్రాఫిక్స్
హైదరాబాద్.
సెల్ : 98495 51462

ముద్రణ : సాయి తిరుమల ప్రింటింగ్ ప్రెస్
చిక్కడపల్లి, హైదరాబాద్.
సెల్ : 9246552072

ప్రతులకు : యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి
సెల్ : 9440792801

దివ్యజ్ఞాన సిద్ధాంతి
సెల్ : 9849567669

మరుమాముల వేంకటరమణ శర్మ
సెల్ : 94410 15469



విషయసూచిక

ప్రజ్ఞాన ప్రభ ... విద్వత్సభ - దశాబ్ది దర్పణం - సంపాదక వర్గము	3
శృంగేరి జగద్గురువుల సన్నిధిలో విద్వత్సభ సిద్ధాంత సదస్సు	8
పరిపూర్ణ అధ్యయనంతో జ్ఞాన సముపార్జన - తెలంగాణ విద్వత్సభ సిద్ధాంత సదస్సులో శృంగేరి జగద్గురువు విదుశేఖర భారతి స్వామి ఉద్బోధ	10
జ్యోతిశాస్త్ర వైశిష్ట్యాన్ని భావితరాలకు అందించాలి తెలంగాణ విద్వత్సభ పండితులకు కంచి స్వామి ఉద్బోధ	18
విశ్వేశతీర్థ శ్రీపాదులకు విద్వత్సభ గురువందనమ్ - తెలంగాణ విద్వత్సభ	20
పంచాంగం - స్వరూపం (ధర్మం ఆచరణ) : ఆకెళ్ల జయకృష్ణశర్మ సిద్ధాంతి	22
సఫలం జ్యోతిష శాస్త్రమ్ : యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి	26
వేదాంగ జ్యోతిష్యం - శాస్త్ర వైభవం : గుడి ఉమామహేశ్వర సిద్ధాంతి	28
ఆచారాలు పండుగలు : డా॥ అయాచితం నటేశ్వర శర్మ	35
పండుగల నిర్ణయ సమీక్ష - పరిశీలన : గాడిచెర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి	42
వర్షసూచనలు - పంచాంగ ఆవశ్యకత : ఓరుగంటి మనోహరశర్మ సిద్ధాంతి	45
మౌఢ్య నిర్ణయ వ్యత్యాసం : చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి	50
ఆధునిక కాలంలో జ్యోతిష ప్రభావము : మాడుగుల శశిభూషణశర్మ సోమయాజి	52
జ్యోతిషామయనం చక్షుః : డా. మహావాది సంధ్యాలక్ష్మీ	54
తెలంగాణ విద్వత్సభా వైభవమ్ : రాయప్రోలు మల్లికార్జున శర్మ	56
నవగ్రహ అనుగ్రహమ్ : దివ్యజ్ఞాన సిద్ధాంతి	58
ఆలయాల ధర్మరక్షణలో జ్యోతిష్కుల పాత్ర : డా॥ బెజుగామ రామమూర్తి	64
ఆలయ నిర్వహణ - అర్చకులు - పాలకులు - భక్తుల సమన్వయము : గంగవరం ఆంజనేయశర్మ	66
మన పంచాంగములు పూర్వ పద్ధతి - దృక్ పద్ధతి ఒక సమీక్ష : కుప్పా ఆంజనేయ శాస్త్రి	72
ముహూర్తాలు - అభిజిత్ లగ్న విచారణ : గౌడవర్తి సంపత్కుమార్ అప్పలాచార్యులు	84
జ్యోతిషశాస్త్రం : - శ్రీమన్నారాయణ్	89
జ్యోతిషము : వేద సమ్మతము : అష్టకాల నరసింహరామశర్మ	93
సంస్కారాల ప్రయోజనం : అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని	99
నక్షత్రోత్పన్న వ్యాధులు (జ్వరం) - పరిశీలన : డా. వై. వి. రాజ్యలక్ష్మి రావు	104
పంచాంగం పరిజ్ఞానం : గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి	111
వివాహ పొంతనం ... నామనక్షత్ర ప్రాధాన్యత : తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య	113
ప్రాకృతిక ఉత్పాతాలు - భవిష్యత్తులో రాబోయే ప్రమాదాలకు సూచనలు : డా. వై. వి. రాజ్యలక్ష్మి రావు	118
ధర్మ మార్గ నిర్దేశకులు పురోహితులు : మదునూరి వెంకటరామశర్మ	122

కుజదోష ప్రభావం పరిహారములు : ఎస్‌టిజి అంతర్వేది కృష్ణమాచార్య	128
రత్నధారణ : డాక్టర్ మరుదాడు అహల్యాదేవి	132
జ్యోతిష పండితుల సమాగమం : అప్పాల శ్యామప్రణీత శర్మ	137
జ్యోతిషం - శుద్ధి ప్రక్రియ : సాగి కమలాకర శర్మ	139
అష్టకవర్గ - జ్యోతిర్వైద్యం : డా.ఎస్.ప్రతిభ	145
ధర్మశాస్త్ర కోవిదుల విద్వత్సభ : వనం జ్వాలా నరసింహారావు	150
సంస్కారాలు - సంస్కరణల అవసరాలు : జాలా సోమనాథ శాస్త్రి	154
జ్యోతిషశాస్త్రం దశ దిశ : మరుమాముల వేంకటరమణ శర్మ	157
సూర్య సిద్ధాంతమే శిరోధార్యం : డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి	160
జ్యోతిషశాస్త్ర మూలాలు - వైజ్ఞానిక విశ్లేషణ : ఆచార్య తాడేపల్లి పతంజలి	166
గ్రహణ నిర్ణయ విశేషము : శాస్త్రుల కృష్ణమూర్తి సిద్ధాంతి	171
తెలంగాణ ధార్మిక చైతన్య ప్రతీక - తెలంగాణ విద్వత్సభ దశాబ్ది ప్రస్థానం	173
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2017	174
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2018	190
తెలంగాణ విద్వత్సభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానము	204
2018 సంవత్సరంలో తెలంగాణ విద్వత్సభ తీర్మానాలు	205
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2019	208
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2020	211
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2021	214
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2022	217
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2023	220
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2024	223
పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2025	227
తెలంగాణ విద్వత్సభ ప్రాంతీయ విద్వత్సమ్మేళనం	229
తెలంగాణ విద్వత్సభ ఆవిష్కరణలు	230
అపురూప చిత్రమాలిక	231
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల ఇన్విటేషన్ : 2017	236
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల ఇన్విటేషన్ : 2018	240
తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు : 2026	244
న్యూస్ పేపర్ కటింగ్‌లు	248
తెలంగాణలో విఖ్యాతి గడించి కీర్తిశేషులైన ప్రముఖ సిద్ధాంతులు	250

ప్రజ్ఞాన ప్రభ ... విద్వత్సభ
దశాబ్ది దర్పణం

సనాతన ధర్మంలో వేదానికి నేత్రం లాంటిది జ్యోతిష్య శాస్త్రం. అయితే పండుగల నిర్ణయంలో, ముహూర్తాల ఎంపికలో పంచాంగ కర్తలకు, సిద్ధాంతులకు మధ్య సమన్వయం సాధించి, సమాజానికి ఒకే విధమైన మార్గదర్శకత్వం చేయాలన్నది ఎప్పటినుంచో ఉన్న ఒక పెద్ద ఆవశ్యకత. ఈ చారిత్రక అవసరాన్ని తీరుస్తూ, తెలంగాణ ధార్మిక సమాజాన్ని ఏకీకృతం చేసే దిశగా అంకురార్పణ జరిగిన మహత్తర ఘట్టమే "తెలంగాణ విద్వత్సభ" ఆవిర్భావం.

ఆవిర్భావం - సంస్థాగత నిర్మాణం

ప్రప్రథమ జ్యోతిష్య మహాసభ ద్వారా జ్యోతిష్య పండితులు, సిద్ధాంతులు, పంచాంగ కర్తల మధ్య అద్భుతమైన సమన్వయం, సారూప్యత సాధ్యమైంది. ఈ మేధోమథనం కేవలం ఒక్క సభకే పరిమితం కాకూడదని, ఈ ధార్మిక యజ్ఞం శాశ్వత ప్రాతిపదికన నిరంతరం కొనసాగాలని పండితులు తీర్మానించారు. ఆ మహత్తర సంకల్పం నుండి పురుడుపోసుకున్న విశిష్ట ధార్మిక సేవా సంస్థే 'తెలంగాణ విద్వత్సభ'.

ఈ సంస్థ ఏర్పాటులో పలువురు ఉద్దండులు కీలక పాత్ర పోషించారు. వర్గల్ విద్యా సరస్వతి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మసిద్ధాంతి గారు అధ్యక్షులుగా, జ్యోతిర్మయ మహాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు మార్గదర్శకులుగా ఈ సభ కొలువుదీరింది. సుప్రసిద్ధ 'దర్శనమ్' ఆధ్యాత్మిక పత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వెంకటరమణ శర్మ గారు కోశాధికారిగా, ఇంకా ఎందరో ఉద్దండులైన సిద్ధాంతులు కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించి ఈ సంస్థకు బలమైన పునాదులు వేశారు.

జగద్గురువుల, పీఠాధిపతుల మంగళాశాసనాలు

త్రిమత సంప్రదాయాలకు చెందిన ఎందరో జగద్గురువులు, పీఠాధిపతులు తెలంగాణ విద్వత్సభ చేస్తున్న ధార్మిక కృషిని గుర్తించి అవ్యాజమైన వాత్సల్యంతో తమ మంగళాశాసనాలు అందించడం ఈ సంస్థ చేసుకున్న మహద్భాగ్యం.

శృంగేరి శారదా పీఠం : దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానం వారు, వారి కరకమల సంజాతులైన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి వారు ఈ సభను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. 2022 డిసెంబరులో 50 మంది విద్వత్సభ సిద్ధాంతులు, సభ్యులు శృంగేరి వెళ్లి జగద్గురువుల సమక్షంలో పంచాంగ సదస్సును నిర్వహించారు. సభ ఆచరిస్తున్న పండుగల నిర్ణయాల వెనకున్న శాస్త్ర ప్రమాణాలను గమనించిన జగద్గురువులు ఎంతో సంతోషించి, ప్రతి సంవత్సరం సభ రూపొందించే పండుగల జాబితాలకు తమ 'శ్రీముఖాలను' (ఆశీర్వచన పత్రాలను) అందిస్తున్నారు.

కంచి కామకోటి పీఠం : కంచి కామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు సికింద్రాబాద్‌లోని స్కందగిరి దేవాలయానికి విచ్చేసినప్పుడు, విద్వత్సభ సిద్ధాంతులు వారి సమక్షంలో సమావేశమయ్యారు. సభ నిర్వహిస్తున్న సమ్మేళనాలు, పంచాంగ గణిత సమన్వయం గురించి తెలుసుకున్న స్వామివారు హర్షం వ్యక్తం చేసి తమ ఆశీర్వనుగ్రహం కురిపించారు.

శ్రీ గురుమదానంద సరస్వతి పీఠం : పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు ప్రతి ఏటా సమ్మేళనాలకు తమ అనుగ్రహాన్ని అందిస్తూ, సిద్ధాంతులంతా సమన్వయంతో సాగేలా నిరుపమానమైన మార్గదర్శకత్వం చేస్తున్నారు.

వీరితో పాటు, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి, శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీ ప్రతధర రామానుజ జీయర్ స్వామి, ఉత్తరాది మఠం పీఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థులు, ఉడిపి పెజావర్ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విశ్వేశతీర్థ స్వామి వారు తదితర ఎందరో మహాత్ములు వివిధ సందర్భాల్లో విద్వత్సభను అభినందించి ఆశీర్వదించారు.

ప్రభుత్వానికి, ధార్మిక సమాజానికి మధ్య వారధిగా విద్వత్సభ చేస్తున్న సేవలకు ప్రభుత్వాల నుండి సంపూర్ణ ఆదరణ లభిస్తోంది.

తొలినాళ్లలో నాటి ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారు విద్వత్సభ పండితులు ఏకగ్రీవంగా నిర్ణయించే పండుగల తేదీలనే ప్రభుత్వం అధికారికంగా గుర్తిస్తుందని హామీ ఇచ్చి, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయించారు.

ఇటీవలే ఎనిమిదవ విద్వత్సమ్మేళనం విజయవంతంగా పూర్తయిన తర్వాత, సభ కార్యవర్గం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి పండుగల జాబితాను సమర్పించింది. పండుగల నిర్ణయంలో పండితులందరూ సమన్వయంతో చర్చించి, ఎలాంటి గందరగోళాలకు, వివాదాలకు తావు లేకుండా జాబితాను అందిస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రి గారు మనసారా ప్రశంసించారు. విద్వత్సభ భవిష్యత్ కార్యకలాపాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా పూర్తి చేయూత అందిస్తామని వారు హామీ ఇవ్వడం అత్యంత హర్షణీయం.

మహాసభల ప్రయాణం

తొలి రెండు సభల అఖండ విజయంతో ఈ ధార్మిక చైతన్యాన్ని రాష్ట్రమంతటా విస్తరించాలని విద్వత్సభ సంకల్పించింది. ప్రభుత్వానికి ఒక దిక్సూచిలా నిలుస్తూ 3వ సభ నుండి 9వ సభ వరకు వివిధ పుణ్యక్షేత్రాల్లో అద్భుతమైన సమ్మేళనాలను నిర్వహించింది :

నల్లకుంటలోని శృంగేరి శంకర మఠం, వర్గల్ విద్యా సరస్వతి దేవాలయ ప్రాంగణంలో సభలను అత్యంత దివ్యంగా నిర్వహించింది.

భాగ్యనగర శివార్లలోని తూముకుంట శ్రీ రామభద్ర క్షేత్రంలో వంద మందికి పైగా సిద్ధాంతుల భాగస్వామ్యంతో మహాసభను జరిపింది.

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి (యాదగిరిగుట్ట) లోని శ్రీ హయగ్రీవ గాయత్రీ ఆశ్రమంలో ధర్మశాస్త్రాలకు అనుగుణంగా చర్చా గోష్ఠులు నిర్వహించింది.

బేగంపేటలోని పుష్పగిరి సంస్థాన మఠంలో నిర్ణయ సింధు, ధర్మ సింధు తదితర శాస్త్రాల ఆధారంగా లోతైన చర్చలు జరిపి ఏకగ్రీవంగా పండుగలను నిర్ణయించింది.

అట్టహాసంగా దశాబ్ది మహోత్సవాలు

గత తొమ్మిది సంవత్సరాలుగా "అసిధారా వ్రతం"లా అప్రతిహతంగా సాగుతున్న ఈ విద్వత్సభ సమ్మేళనాలు ఇప్పుడు పదవ వసంతంలోకి అడుగుపెట్టాయి. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 2026 ఆగస్టు 1, 2 తేదీలలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు రోజుల పాటు నాలుగు ప్రధాన సదస్సులుగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సదస్సుల్లో జ్యోతిష్యం, వంచాంగం, ఆగమ, ధర్మశాస్త్రాలకు సంబంధించి రాష్ట్రంలోని సుప్రసిద్ధ పండితులు ప్రత్యేక ప్రసంగ పాఠాలు అందించనున్నారు.

ఇదే వేదికపై, 'గేయ వాల్మీకి'గా ప్రసిద్ధిగాంచిన బ్రహ్మశ్రీ రుక్మాభట్ల నరసింహ స్వామి గారికి ప్రతిష్ఠాత్మక

'జీవన సాఫల్య పురస్కారాన్ని', అలాగే మరో 12 మంది వరిష్ట పండితులకు విశేషమైన సేవా పురస్కారాలను తెలంగాణ విద్వత్సభ సగౌరవంగా అందించబోతోంది.

విశిష్ట కానుక: "విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక"

తెలంగాణ విద్వత్సభ పదేళ్ల నిరంతరాయ ధార్మిక కృషి అనిర్వచనీయమైనది. పండుగల విషయంలో మీడియాలో ఎలాంటి గందరగోళమైన చర్చలకు తావులేకుండా పండి తులందరినీ సమన్వయపరిచి సమాజానికి మార్గదర్శనం చేస్తున్న విద్వత్సభ అడుగుజాడలు పదిలంగా భద్రపర చాల్సినవి.

ఈ మహత్తర ప్రస్థానంలో... మొదటి రెండు సంవత్సరాలు రవీంద్ర భారతిలో నిర్వహించిన సభల నుండి మొదలుకొని నల్లకుంట శంకరమఠం, వర్గల్, తూముకుంట రామభద్ర క్షేత్రం, యాదగిరిగుట్ట హయగ్రీవ గాయత్రీ ఆశ్రమం, పుష్పగిరి జగద్గురు సంస్థానం వరకు ... గత తొమ్మిదేళ్లుగా జరిగిన విద్వత్సమ్మేళనాల సమగ్ర నివేదికలను సచిత్రంగా ఈ సంచికలో పొందుపరిచాము.

అంతేకాకుండా, తెలుగునాట విఖ్యాతులైన జ్యోతిష్య, వేద, ఆగమ శాస్త్ర విద్వాంసులు వివిధ అంశాలపై రచించిన అమూల్యమైన పరిశోధనా వ్యాసాలను క్రోడీకరించి "విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక" అనే విశిష్ట శీర్షికతో ఈ ప్రత్యేక సంచికను మీ ముందుకు తీసుకువస్తున్నాం.

దశాబ్ది మహోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు; గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని సమీక్షిస్తూ, భవిష్యత్తుకు నూతన సంకల్పాలతో ముందుకు సాగే స్ఫూర్తిదాయకమైన సందర్భం. ఇది సంస్థ అభివృద్ధికి, సభ్యుల ఐక్యతకు, సమాజ శ్రేయస్సుకు బలమైన పునాది వేస్తుంది.

దశాబ్ది మహోత్సవాల శుభ సందర్భంగా, తెలంగాణ విద్వత్సభ ధార్మిక సమాజానికి అందిస్తున్న అపురూపమైన మేధో కానుక ఈ సంచిక. సంస్థ భవిష్యత్ ప్రణాళికలకు సైతం దిశానిర్దేశం చేయబోతున్న ఈ "విద్వత్సభ సంహిత - దశాబ్ది దీపిక"ను ప్రతి ఒక్కరూ ఆదరించి, ఇందులోని విజ్ఞానాన్ని భావితరాలకు అందిస్తారని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ... ఈ సంచికను ఆవిష్కరిస్తున్నాం.

యాయవరం చంద్రశేఖర శర్మ
అధ్యక్షులు, తెలంగాణ విద్వత్సభ

దివ్యజ్ఞాన సిద్ధాంతి
కార్యదర్శి, తెలంగాణ విద్వత్సభ

మరుమాముల వేంకటరమణ శర్మ
కోశాధికారి, తెలంగాణ విద్వత్సభ



శృంగేరి జగద్గురువుల సన్నిధిలో
విద్వత్సభ సిద్ధాంత సదస్సు

తెలంగాణ విద్వత్సభ ధన్యమైంది. దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం జగద్గురువులు విద్వత్సభ విద్వన్మూర్తులందరినీ అనుగ్రహించారు. సిద్ధాంతులు, పంచాంగకర్తలు, వేద, శాస్త్ర పండితులు, పురోహితుల బృందానికి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామివారు ప్రత్యేకంగా సమయమిచ్చి ధార్మిక దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా పండగలు, గ్రహణాలు, మౌఢ్యమిలకు సంబంధించి జరిగిన గోష్ఠిలో జగద్గురువులు చూపిన మార్గదర్శనం విద్వత్సభ బృందాన్ని ముగ్ధులను చేసింది.

తెలంగాణ విద్వత్సభ పక్షాన హైదరాబాద్ నుండి 30 వ తేదీ బుధవారం మధ్యాహ్నం సరిగ్గా ఒంటి గంటకు సిద్ధాంతులు, పండితులు, పురోహితులు బృందం 50 మంది బస్సులో శ్రీ దక్షిణామ్నాయ జగద్గురు శృంగేరి శారదా పీఠం చేరుటకు బయలుదేరాము. తెల్లవారి అనగా గురువారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు శృంగేరి చేరుకున్నాం. వెంటనే శుచియై, శ్రీశ్రీశ్రీ జగద్గురు విధుశేఖరభారతి స్వామివారిని అందరం కలిసి సామూహిక భిక్షా వందనం సమర్పించి, దివ్యాశీస్సులు పొందాం. మరుమాముల వేంకటరమణ శర్మ (దర్శనమ్ శర్మ) ప్రతి ఒక్కరినీ శ్రీ స్వామివారికి వ్యక్తిగత పరిచయం చేసారు. తెలంగాణ నుండి మీరందరు రావడం సంతోషం. రేపు ఉదయం ప్రత్యేక సభ ఉంటుందని, అందరూ నిర్ణీత సమయానికి రావాలని సూచించారు.

తరువాత మహాప్రసాదము, విశ్రాంతి తీసుకుని, సాయం కాలం 5 గంటల నుండి విద్వత్సభ నిర్వహణలో శ్రీ గురు మందిరములో డాక్టర్ శ్రీ శూలపాణి గారి బృందంచే శ్రీ తిరుపతి వేంకట కవులు రచించిన శ్రీ కృష్ణ రాయబారం నాటక ప్రదర్శన జరిగింది. సుమారు ఒక గంటపాటు ఈ



నాటకాన్ని అందరితో కలిసి, శ్రీ స్వామి వారు కూడా చివరి వరకు తిలకించి, ఎంతో ఆనందాన్ని తెలియజేస్తూ, మన ప్రాచీన సాంప్రదాయాలు,ధర్మ ప్రబోధ విషయాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రదర్శనలు ప్రస్తుత సమాజానికి అవసరం అని శ్రీ మహాభారతంలో అపాత్రధారులను ఆశీర్వదించారు. అంతే గాక వారు కోరినట్లు ప్రతి సంవత్సరం అవకాశం ఉంటుందని అనుగ్రహించారు.

రాత్రి 8.30 నిమిషాల నుండి శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహా సన్నిధానం వారిచే జరిగిన శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర స్వామి వారి అభిషేక, పూజా కార్యక్రమంలో పాల్గొన్నాం. శ్రీ స్వామి తెలంగాణ విద్వత్సభ పక్షాన వచ్చిన వారందరికి ఆశీరనుగ్రహాన్ని అందించారు. నాటక ప్రదర్శన చేసిన పాత్రధారులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

శ్రీకృష్ణ రాయబారం అను నాటకంలో అతిథి పాత్రగా మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు విదురుని పాత్ర చక్కగా పోషించారు.

2వ తేదీ శుక్రవారం ఉదయం శ్రీ శారదా మాతా, శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి మందిరాలను, శ్రీ స్వామి వారల అధిష్ఠాన మందిరాలను దర్శించుకున్న పిదప, సరిగా 9

గంటలకు ప్రత్యేక సమావేశ మందిరంలో, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ తీర్థ సన్నిధానం వారి అధ్యక్షతన తెలంగాణ విద్వత్సభ వారితో సభ ఏర్పాటైంది. ముందుగా శ్రీ స్వామి వారికి సభావందనం తర్వాత దర్భనమ్ శర్మ గారు ప్రస్తావన చేస్తూ ఇది చరిత్రలో అపురూప ఘట్టం అని, దీనితో విద్వత్సభ ధన్యమైందని స్వామి వారు మన యందు ఎంతో అవ్యాజమైన కరుణా కటాక్షాలతో అవకాశం కల్పించారని వారికి మనం సాష్టాంగ ప్రణామాలు సమర్పిస్తూ, సిద్ధాంతులను, శాస్త్ర పండితులను ఒక్కొక్కరిని విడివిడిగా పరిచయం చేయించారు.

తెలంగాణ విద్వత్సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతిని ఉద్దేశించి స్వామి వారు మూఢమ నిర్ణయ విషయంలో ప్రస్తావించారు. మా పూర్వీకులైన పెద్దలు, గురువులు ఏ మార్గాన్ని అనుసరించారో, అదే పద్ధతిని కొనసాగిస్తున్నామని సిద్ధాంతిగారు తెలిపారు. వ్యత్యాసం రావడానికి గణితంలో తేడాలున్నాయని, రెండింటికి ప్రమాణాలుండుట వల్ల ఇబ్బంది ఏర్పడుతుందని స్వామి వారు అంగీకరించారు. గడచిన ఉపాకర్మ, వరలక్ష్మీ వ్రతాచరణ ఏ విధంగా జరిగిందని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. పూర్వ పద్ధతి ప్రకారం తిథి, వార, నక్షత్రాలు, గ్రహణ, మూఢమలకు ధృక్ పద్ధతిని అనుసరిస్తున్నా మని గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి స్వామి వారికి విన్నవించారు. కోజాగరి వ్రతం, రాబోవు విజయదశమి గూర్చి స్వామి వారి దృష్టికి చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్తి సిద్ధాంతి తెచ్చారు.

మీ ప్రాంతాన్ని అనుసరించి, ధర్మ శాస్త్ర ప్రకారం వ్రత, పండుగలు విద్వత్సభ ద్వారా నిర్ణయిస్తున్నారు. ఇది చాలా సంతోషించతగిన విషయం. రాబోవు విజయదశమి విషయంలో ఇక్కడి నిర్ణయం గాకుండా, మీరు నిర్ణయించిందే సరియైంది అన్నారు. ఎందుకంటే ఈ పీఠంలో జరుపబడు ఉత్సవాలకు అనుగుణంగా ఇక్కడి నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేసారు. ఇవి మీ ప్రాంత సాంప్రదాయాలకు సరిపోవన్నారు. అయినా ఒక సందేహం ఏర్పడినప్పుడు సభ ద్వారా చర్చించి నిర్ణయం తీసుకోవడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, తెలంగాణ విద్వత్సభకు మా ఆశీరనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని, అవకాశం లభించినపుడు ఇక్కడ చర్చలు చేయవచ్చని సూచించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సభలో స్వామి వారు ఓపికగా, శ్రద్ధగా విని, చివరకు అనుగ్రహ భాషణం చేసారు. పాల్గొన్న వారందరికి ప్రత్యేకంగా ప్రసాదం అందించారు. శ్రీ మహా సన్నిధానం వారి ఆంతరంగికులైన కృష్ణ మూర్తి పీఠం తరపున ఘనంగా సత్కరించారు.

ఇందులో శాస్త పండితులు శాస్త్రుల వేంకటేశ్వర శర్మ, శృంగేరి పీఠ ఆస్థాన జ్యోతిష పండితులు శంకరమంచి రామకృష్ణ శర్మ సిద్ధాంతి, శాస్త్రుల కృష్ణ మూర్తి శర్మ సిద్ధాంతి, ముద్దు రాజన్న సిద్ధాంతి, శంకరమంచి శివ శర్మ సిద్ధాంతి, బోర్పట్ల భాస్కరాచార్య సిద్ధాంతి, ఓరుగంటి నాగరాజ శర్మ సిద్ధాంతి, జ్యోషి ప్రశాంత్ శర్మ సిద్ధాంతి, ఓరుగంటి రామారావు సిద్ధాంతి, కులకర్ణి నరేశ్ శర్మ సిద్ధాంతి, విద్వత్సభ గౌరవ సలహాదారులు బోర్పట్ల హనుమంతాచార్యులు, విద్వత్సభ సమన్వయ కర్త కె. భీంసేన్ మూర్తి, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ ఏప్రిల్ 9వ తేదీ జరుపబోవు బ్రహ్మ గర్జన కరపత్రాన్ని స్వామి వారికి సమర్పించి, దివ్యాశీస్సులు పొందారు.

వేదపండితులు జనమంచి సీతారామ శర్మ, జ్యోతిష పండితులు ఆదరాసుపల్లి శ్యాం మోహన్ శర్మ, మహేష్ చందర్ భరద్వాజ, త్రిగుళ్ల శ్రీనివాస శర్మ, యం. నటరాజ శర్మ , గుణవంత రావు జ్యోషి, గౌరీభట్ల రఘురామ శర్మ, నాదెళ్ల సదాశివ శర్మ ఉన్నారు.

ఈ కార్యక్రమానికి పూర్తిగా సహకరించిన వేద శాస్త్ర ప్రవర్ధక సభ అధ్యక్షులు వ్యాసోజ్జల రాధాకృష్ణ శర్మ, కోశాధికారి రాచర్ల రవిచంద్ర శర్మ, పీఠంలో సహకరించిన శృంగేరీ ఆస్థాన వేదపండితులు తంగిరాల శివకుమార శర్మ. జగద్గురువుల వ్యక్తిగత కార్యదర్శి బ్రహ్మశ్రీ తంగిరాల దక్షిణా మూర్తి, మనకు వాహన సౌకర్యాన్ని అందించిన వ్యాసోజ్జల రామశర్మ గారికి, ఫోటోగ్రాఫర్ బి. రామచందర్ రావు గారికి, సన్నిధి ఛానల్ వారికి విద్వత్సభ పక్షాన ధన్యవాదాలు తెలియజేసారు.

పరిపూర్ణ అధ్యయనంతో జ్ఞాన సముపార్జన

తెలంగాణ విద్వత్సభ సిద్ధాంత సదస్సులో శృంగేరి జగద్గురువు విధుశేఖర భారతి స్వామి ఉద్బోధ

తెలంగాణ విద్వత్సభ ధన్యమైంది. దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం జగద్గురువులు విద్వత్సభ విద్వన్మూర్తులందరినీ అనుగ్రహించారు. సిద్ధాంతులు, పంచాంగకర్తలు, వేద, శాస్త్ర పండితులు, పురోహితుల బృందానికి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామివారు ప్రత్యేకంగా సమయమిచ్చి ధార్మిక దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా పండగలు, గ్రహణాలు, మౌఢ్యమిలకు సంబంధించి జరిగిన గోష్ఠిలో జగద్గురువులు చూపిన మార్గదర్శనం విద్వత్సభ బృందాన్ని ముగ్ధులను చేసింది.

శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే ।
సర్వదా సర్వదా స్మాకం సన్నిధిం సన్నిధిం క్రియాత్ ।
శ్రుతిస్మృతిపురాణానాం ఆలయం కరుణాలయం
నమామి భగవత్పాద శంకరం లోకశంకరమ్ ॥

మనయొక్క సనాతన వైదిక ధర్మం అత్యంత శ్రేష్ఠమైనది. ఈ ధర్మంలో ప్రాధాన్యంగా చెప్పినటువంటి విషయాలు రెండు. ఇక్కడ వేదములలో, శాస్త్రములలో, పురాణములలో, ఇతిహాసా లలో ఎన్ని విషయాలు చెప్పినా కూడా అవన్నీ ఈ రెండు విషయాల్లో ఏదో ఒక విషయానికి సంబంధించినవే అయి వుంటాయి. ప్రధానంగా ఏ విషయాలు చెప్పారో ఆ విషయాలకు సంబంధించిన విషయాలనే ఇంకా బాగా ప్రజలకు తెలియ జేయడానికి మన పూర్వీకులు అనేక గ్రంథాలు రచించారు. ఏమిటా రెండు విషయాలు అంటే మొదటిది మనిషి అయినటు వంటివాడు తన జీవితంలో విశేషంగా భగవదారాధన చేసి, భగవంతుని పరిపూర్ణమైన కృపను పొంది తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలి అనేటటువంటిది. రెండవది ప్రతి మనిషి తన జీవితాన్ని సత్పురుషుడిగా జీవించాలి, నడుపుకోవాలి. అదేవిధంగా భగవదనుగ్రహానికి పాత్రులం కావాలి. ఎన్ని శాస్త్రాలు, ఆగమాలు, ఎన్ని చర్చలు ఏమి



చేసినా కూడా అన్నీ మనల్ని క్రమేణా ఆ భగవంతుని యొక్క సన్నిధికి చేర్చేటటువంటి విషయాలే అయ్యుంటాయి. అందులో ఒక సామాన్యమైన విషయం నుండి తీసుకొని సర్వోత్తమమైన అద్వైత సిద్ధాంతం వరకు అన్ని విషయాలను తెలుసుకోవాలి. ఇది అత్యంత ప్రాథమికమైన విషయం.

కాబట్టి అటువంటి అద్వైత సిద్ధాంతం వరకు అన్ని విషయాలను మన గ్రంథాలలో ఉపదేశం చేసివున్నారు. అందులోనూ మన శాస్త్రముల యొక్క వైశిష్ట్యం ఏమిటంటే ఏ ఒక విషయాన్ని చెప్పినా కూడా దానికి కావలసినటువంటి ఉపపత్తుల్ని ఎంతో నైపుణ్యంతో ప్రతిపాదన చేసి, ఎంతో విస్తృతమైన చర్చలు చేసి తీర్మానం చేస్తారు. అందులోనూ అనేక న్యాయములు అని అంటారు. న్యాయము... న్యాయము అంటే మనం న్యాయము అనే శబ్దం అనేక అర్థాల్లో ప్రసిద్ధంగా ఉంది. కానీ శాస్త్రమీమాంసాల్లో, వేదాంతశాస్త్రాల్లో న్యాయం అనేటటువంటి శబ్దానికి అర్థం ఏమిటంటే, కొన్ని చోట్ల ఒక నియమం అని అర్థం. కొన్ని

అధికరణాల్లో ఒక్కొక్క విచారానికి ఒక్కొక్క అధికరణం అని పెట్టారు. ఆ అధికరణంలో ఒక విషయాన్ని తీర్మానం చేస్తారు. అలా ఇంకో విషయాన్ని తీర్మానం చేయాలంటే ఇంకొక అధికరణం. అంటే ఒక అధికరణంలో ఒక విషయాన్ని నిర్ణయం చేసి, ఈ అధికరణం ద్వారా నిర్ణయం కానటువంటి విషయం ఏదైతే ఉందో దానికోసం మళ్లీ ఇంకో అధికరణాన్ని రచించి, విచారణ చేసేటటువంటి క్రమం, పద్ధతి ఇది. మొట్టమొదట అసలు విషయం ఏమిటి? ఈ విషయం మీద ఉన్న అభిప్రాయ భేదాలు ఏమిటి? ఆ అభిప్రాయభేదాల్లో పూర్వపక్షం ఏమిటి? ఆ పూర్వపక్షం యొక్క యుక్తులు ఏమిటి? ఇక సిద్ధాంతం ఏమిటి? ఆ సిద్ధాంతానికి సంబంధించిన యుక్తులు ఏవైతే ఉన్నాయో అవన్నీ చూపడం, చివరకు విషయ నిర్ణయం చేయడం.

ఇలా పూర్వపక్షం చూపిన విషయాల మీద సిద్ధాంతి చూపించేటటువంటి ఆక్షేపణలు, అలాగే సిద్ధాంత పక్షాన్ని ప్రబలంగా ఉపపాదనం చేయడంకోసం, బలపరచడం కోసం యుక్తులు అవన్నీ ఏవైతే ఉంటాయో ఇవన్నీ చూపిస్తూ ఒక విషయాన్ని నిర్ణయం చేయడానికి అధికరణాన్ని రచన చేస్తుంటారు. ఇలా ఈ నియమాలన్నింటినీ చూపించి, ప్రతి ఒక్క అధికరణంలోనూ ఒక న్యాయ ఉత్పాదన అని శాస్త్రాల్లో వాడుతుంటారు. అంటే ఒక న్యాయాన్ని ఆ అధికరణాల్లో తీర్మానం చేయడం. అందుకే ఇక్కడ ఏమి చేస్తుంటారంటే శాస్త్రాల్లో ఉన్న అన్ని వాక్యాలను తీసుకొని ఎవరూ విచారణ చేయరు. ఒకేరకంగా ఉన్నటువంటి అనేక వాక్యాల్లో ఒక వాక్యం తీసుకొని ఒక అధికరణ తీసుకొని దానిలో ఒక విషయాన్ని నిర్ణయం చేస్తారు. అపుడు మిగతా వాక్యాల్లో ఎక్కడైతే ఇదేరకంగా సంశయాలు, అభిప్రాయభేదాలు ఏర్పడతాయో ఆ మిగతా అన్ని వాక్యాల్లోనూ ఇక్కడ చెప్పిన న్యాయ నియమం ఏదైతే ఉందో, సిద్ధాంతి ఏదైతే నియమం చూపించి ఆ సిద్ధాంతి అధికరణార్థాన్ని తీర్మానం చేసాడో, దీనికి చూపించిన యుక్తులన్నీ చూపించి పెట్టుకొని దీనితోనే వేరే అధికరణాలతో నిర్ణయం చెయ్యాలి అని చెప్పడం. దానిని న్యాయం అంటారు. కానీ, కొన్ని కొన్ని విషయాల్లో ఏమి చేస్తుంటారంటే ప్రత్యేకంగా చర్చ చేస్తూ ఒక నియమాన్ని చేస్తుంటారు. ఆ అధికరణంలో చూపించిన న్యాయానుసారంగా ఇక్కడకూడా ఇక్కడ కూడా విషయ



నిర్ణయం చెయ్యాలి అని చెబుతారు. ఈ రకంగా శాస్త్రంలో విశేషమైన చర్చను ఎలా చెయ్యాలి? నిర్ణయం ఎలా చెయ్యాలి? అనే ఒక గొప్ప మార్గాన్ని మన శాస్త్రములలో చూపించారు.

కాబట్టి ఇప్పుడు ఏదో ఒక విషయం చెప్పి, నేను ఈ విషయం చెబుతున్నాను కాబట్టి నీవు ఒప్పుకోవాలి అని అలా చెప్పలేదు. వాస్తవంగా మహర్షులు ఒక మాట చెప్పారంటే దానికి తిరుగుండదు. కానీ, ఎవరికైతే తర్కాలు చేయడంలో యుక్తులు ఉంటేగాని మేము విషయాన్ని ఒప్పుకోము అని యుక్తులమీద ఎవరికైతే అభిరుచి ఉంటుందో అలాంటివారికి ఈ విషయాన్ని తెలియజేయడం కోసం ఈ చర్చామార్గాన్ని అనుసరించాలి. వాస్తవంగా మహర్షులు ఏదైతే చెప్పారో దానిని ఒప్పుకోవాలి. మహర్షుల జ్ఞానం ఎటువంటిది? వారెన్నో అలౌకిక విషయాలను తెలుసుకొని, కఠోరమైన తపస్సు చేసి వ్యావహారికమైన భోగాలన్నిటినీ వారు వదలిపెట్టి, ఇవన్నీ తుచ్ఛములు అని వారు నిర్ణయం చేసి ఎంతో కఠోరమైన తపస్సులు చేసి ఈశ్వరానుగ్రహ పాత్రులై దివ్యదృష్టిని పొంది ఎన్నో తత్త్వాలను వారు సాక్షాత్కారం చేసుకొని, సాక్షాత్కారం చేసుకున్న విషయాలను వాళ్లలాగా మిగతావాళ్ళు అంత కఠోరమైన తపస్సు చేసి సాక్షాత్కారం చేసుకోలేరు కాబట్టి, సామాన్యులను అనుగ్రహించడం కోసం వారు అనేక శాస్త్రగ్రంథాలను రచించారు. ఆ గ్రంథాలలో మనకు అనేక విషయాలను ఉపదేశం చేసియున్నారు. కనుక, అటువంటి

మహాజ్ఞానులైన మహర్షులు చెప్పిన విషయాలమీద మళ్ళీ మనం సంశయపడటానికి అవకాశమే లేదు.

అయినప్పటికీ ఎవరికైతే బాగా యుక్తుల మీదే అభిరుచి ఉంటుందో, మాకు ప్రతిదానికి ఒక యుక్తిని చూపిస్తేగాని మేం ఒప్పుకోం అనేటటువంటివారు ఎవరైతే ఉన్నారో వారికోసం అనేక విధమైన శాస్త్రకారుల అనంతరకాలంలో వచ్చిన ప్రతి శాస్త్రంలోనూ వుంది ఇలాంటి సంప్రదాయం. వ్యాకరణంలో, తర్కంలో, వేదాంతంలో, మీమాంసలో, జ్యోతిష్యంలో అన్ని శాస్త్రాల్లోనూ ఇటువంటి క్రమం ఉంది. అంటే ఒక క్రమం పెట్టుకొని దాని ప్రకారం ధర్మశాస్త్రాల్లో ఒక న్యాయం పెట్టుకొని ఆ న్యాయం ప్రకారం విషయాన్ని నిర్ణయం చేయడం అనేటటువంటి ఒక పద్ధతి వెనుకటి కాలం నుంచి ఉంది. అయితే ఇక్కడ కొంతమందికి ఒక ప్రశ్న ఏమి ఉదయిస్తుందంటే మన ధర్మంలో అనేక దర్శనాలున్నాయి, అనేక శాస్త్రాలు ఉన్నాయి, న్యాయం ఉంది, వేదాంతం ఉంది, వ్యాకరణం ఉంది. ఒక్కొక్క దర్శనంలో ఒక్కొక్క సిద్ధాంతం ఉంది. ఈ మహర్షి ఒకలాగ, ఆ మహర్షి ఒకలాగ చెబుతున్నారు. మహర్షుల్లోనే ఇప్పుడు తేడా వస్తున్నాయి. మహర్షులు ఏం చెప్పారో దానిని మనం ఒప్పుకోవాలి అని అంటున్నారు సరే! కానీ, ఇప్పుడు ఒక మహర్షి చెప్పినదానికి విరుద్ధంగా ఇంకో మహర్షి చెప్పినట్లుగా మనకు కనబడుతోంది. అయితే దీని సమన్వయాన్ని చూపించినవారే జగద్గురువులు ఆదిశంకరాచార్యులు.

వాస్తవంగా ఇక్కడ విరోధం లేదు అనేటటువంటి విషయాన్ని సమన్వయం చేసి చూపించినవారు ఆదిశంకరులు. వారు ఏం చేశారు అంటే ఒక్కొక్క మహర్షి చెప్పిన విషయాలు విభిన్నంగా ఉండవచ్చు, కానీ, ఈ విభేదాలన్నీ కూడా ఎందుకు వచ్చినాయంటే అధికారి భేదాన్ని పెట్టుకొని ఈ విభేదాలు భిన్నభిన్నంగా విషయప్రతిపాదన మహర్షులు చేశారు. అంటే లోకంలో జిజ్ఞాసువులైన వాళ్ళయొక్క బుద్ధి సామర్థ్యం ఒకే రకంగా ఉండదు. వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి ఒక్కొక్కరికి వాళ్ళ వాళ్ళ బుద్ధికి తగిన ఉపదేశం చేసి, ఒకేసారి సిద్ధాంత ఉపదేశం చేస్తే దానిని అందరూ అర్థం చేసుకోలేరు. కాబట్టి వాళ్ళ వాళ్ళ శక్తిసామర్థ్యాలను అనుసరించి దానికి తగిన మార్గదర్శనం






చేయాలి అనేటటువంటి ఉద్దేశంతో ఒక్కో మహర్షి ఒక్కోరకంగా సిద్ధాంతాన్ని చూపారు. కానీ ఆ ఒక్కొక్క సిద్ధాంతం ద్వారా మనం కొన్ని కొన్ని విషయాలు తెలుసుకోవలసి ఉంటుంది. పరమార్థము ఏదైతే ఉందో దానిని తెలుసుకోవాల్సి నటువంటిది మన కర్తవ్యం. కానీ ఒకేసారి ఆ పరమార్థమైన విషయాన్ని తెలుసుకోవడం కష్టం. ఆ పారమార్థికమైన విష యాన్ని తెలుసుకోవాలంటే ఒక సోపానక్రమంలో మనం వెళ్ళాలి. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వెళ్ళాలి. దానినే సోపానక్రమం అంటారు శాస్త్రంలో. సోపానక్రమంగా మనం విషయాలను తెలుసుకొని ఆ పారమార్థికమైన వస్తువును మనం తెలుసు కోవాలనే ఉ ద్దేశంతో సోపానక్రమంగా ఉపదేశం చేయడంకోసం ఒక్కో మహర్షి ఒక్కోదానిని ఉపదేశించారు. ఇక్కడ విరోధాన్ని మనం చూడకూడదు. ఆ మహర్షులు మనమీద అనుగ్రహ దృష్టితో, మనకర్థమయ్యేవిధంగా ఎలా ఉపదేశించారు, దాని వెనక ఆ మహర్షుల యొక్క కారుణ్యం మనమీద ఎంత ఉ న్నది అనేదానిని మనం చూడాలి. మన పూర్వీకులు చూపిన ఆ సమన్వయమార్గాన్ని మనం తెలుసుకోవాలి. కాబట్టి అన్నింటికీ ఒక సమన్వయం ఉంది.

మన ధర్మంలో, మన గ్రంథాల్లో అన్ని విషయాలకు ఒక విశేషమైన సమన్వయం ఉంది. ఆ సమన్వయాన్ని చూసుకొని మనం ముందుకు వెళుతుండాలి. ఎక్కడైనా కాస్త విభిన్నంగా ఉన్నట్లుగా కనిపించిన వెంటనే దీనిమీద ఆక్షేపణలు చేస్తుంటారు. మీలో ఐకమత్యం లేదు, మీలో విభేదాలున్నా యని ఆక్షేపిస్తుంటారు. కానీ ఒక విషయం అందరూ తెలుసుకోవాల్సినదేమిటంటే ఈ ప్రపంచానికే ఐకమత్యం అనేటటువంటి పదార్థాన్ని పరిచయం చేసినదే మన ధర్మం. మన గ్రంథాలు. సమస్త మానవాళికి ఐకమత్యం అంటే ఏమిటి? అదెలా ఉండాలి అనే పరిచయం చేసినదే మన ఆచార్యులు, శంకర భగవత్పాదులు మొదలైనవారు. ఐకమత్యంతో ఎలా మెలగాలి అనే దానిని చూపారు. ఆ సమన్వయాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకొని, దాని ప్రకారంగా ముందుకు వెళ్ళాలి. అది మన కర్తవ్యం. అప్పయ్యదీక్షితులవారు తమ సిద్ధాంత సంగ్రహం అనే గ్రంథంలో ప్రారంభంలోనే ఈ మాట చెబుతారు. వారు ఈ సిద్ధాంత సంగ్రహ గ్రంథాన్ని రచించిందే వేదాంతంలో








విషయ ప్రతిపాదన చేసేటటువంటి పక్షాలు ఎన్ని ఉన్నాయి అనేదానిని చూపించడం కోసం వారు ఈ గ్రంథాన్ని వ్రాశారు. ఒక్కోచోట ఒక్కో పక్షం పెట్టుకొని విషయ ప్రతిపాదన చేస్తుంటారు. ఎంతమంది ఎన్నిరకాలుగా చెప్పినా కూడా చదువుకునేవారు వాళ్ళ భ్రమను పోగొట్టడం కోసం సిద్ధాంత లేష సంగ్రహం అన్నారు. మరి ఇన్ని పక్షాలు మీరు చూపిస్తే చదువుకునేవాడికి ఇంకా గందరగోళం అవుతుంది కదా అంటే దానికి సమాధానం చెబుతూ ఆరంభంలో ఈ మాట అన్నారు. పూర్వాచార్యులందరూ వ్యావహారికమైన విషయాలేవైతే ఉన్నాయో, ఆ విషయాలమీద వాళ్ళకు పరిపూర్ణ తాత్పర్యం లేదు. పరిపూర్ణమైన తాత్పర్యం పారమార్థికమైనటువంటి జీవబ్రహ్మైక్యంలోనే.

ఈ వ్యావహారికమైన విషయాల్లో ఉండేటటువంటి భేదాలను వాళ్ళు జనులకు అర్థమవడంకోసం చూపించారు. ధర్మ శాస్త్రాల్లోనూ ఉదాహరణకు ఒక ఏకాదశి విషయ ఆచరణ తీసుకుంటే దానిలో చాలా భేదాలున్నాయి. ఇప్పుడు ఆస్తికు లందరిలోనూ అందరూ ప్రతి ఒక్క ఆస్తికుడు ఒకేరోజు ఏకాదశి ఆచరణ చేయట్లేదు. వాళ్ళ వాళ్ళ పద్ధతులు వేరే వేరే ఉన్నాయి. అక్కడేమంటే ఆయా పూర్వాచార్యులు ఒక్కో పద్ధతిని చెప్పారు కాబట్టి, ఆ పద్ధతిననుసరించి వాళ్ళ వాళ్ళ ఆచరణలు చేస్తున్నారు. ఆ ఆచరణ ఉద్దేశం భగవత్ప్రాప్తి అంతే. పూర్వాచార్యులు చెప్పిన ప్రమాణాలను పెట్టుకొని మనం ఉన్నటు వంటి భేదాల అనుసారంగా ఆయా సంప్రదాయాలు, ఆచరణలు కొన్ని కొన్ని వచ్చాయి. అలాగని ఎక్కడైతే నిర్ణయం చేయవచ్చు అనేటటువంటి పరిస్థితి ఎక్కడైతే ఉందో అక్కడ తప్పకుండా మనం నిర్ణయం చేయాలి. అక్కడ అనవసరంగా ఈ గందరగోళానికి అవకాశం ఇవ్వకూడదు. అయితే కొన్నిసార్లు తీర్మానం చేయవచ్చు. చేయాల్సి వుంటుంది. కానీ అలాంటప్పుడు కూడా కొన్నిసార్లు తీర్మానం కాకుండా ఒక్కొక్కరు ఒక్కోరకంగా చెప్పడం, ఒకరు ఒకరోజు, ఇంకొకళ్ళు ఇంకొకరోజు చేయడం ఈవిధంగా అవుతోంది. దానికి అవకాశం ఇవ్వకుండా అన్నిటినీ ఒక సమన్వయంగా సమన్వయం చేసుకొని, దానికి ఒక ఉపపత్తిని చూపించి, ఆ విషయాన్ని తీర్మానం చేయాలి. అందులో ముఖ్యంగా శాస్త్రంలో ఈ రకమైన ప్రభేదాలు ఉంటాయి, వాటన్నిటికీ ఒక సమన్వయమార్గం ఉంటుంది అనేటటువంటి విషయాలను ఇక్కడకొచ్చిన పండితులందరికీ చెబుతుంటే మీకు అర్థమవుతుంది. కానీ సామాన్యులకు ఇవన్నీ అర్థము కావు. వాళ్ళకు వచ్చిన ఆ భ్రమలను ఇంకా పెంచేటటువంటివారు నాస్తికులు.

ఈ చర్చలు ఇవన్నీ ఏమున్నా కూడా అవన్నీ ప్రతి శాస్త్రములో ఉండనే ఉంటాయి. ప్రతి శాస్త్రంలోనూ ఇటువంటి పక్షభేదాలు ఉంటాయి, చర్చలు జరుగుతుంటాయి. చర్చ యొక్క పర్యవసానం ఏమవుతుంది అంటే ఇదే సిద్ధాంతం, దీనిని అందరూ ఒప్పుకోవాలి కొన్నిసార్లు చర్చల పర్యవసానం ఇలా అవుతుంది. కొన్నిసార్లు చర్చల పర్యవసానం ఇంకోరకంగా ఉంటుంది. మొత్తం చర్చంతా చేసిన తర్వాత ఇది వీళ్ళ పక్షం, ఇది వారి పక్షం. ఈ పక్షాన్ననుసరించేవారు ఇలాగ, ఆ పక్షాన్ననుసరించేవారు అలాగ అని జరుగుతుంటాయి. చర్చయొక్క పర్యవసానం రెండువిధాలుగా జరుగుతుంటుంది. సంపూర్ణంగా చర్చ చేసి దీని తీర్మానం ఇంతే, ఎవరైనా సరే దీనిని అనుసరించాలి అనే తీర్మానాలు జరుగుతుంటాయి.

ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయమేమిటంటే మన ధర్మశాస్త్రాలు, స్మృతులు వీటిల్లో అనేకవిధమైన ఆచరణల గురించి చెప్పారు. లోకంలో ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే



శాస్త్రంలో చెప్పిన విషయాలు ఇప్పుడు ఆచరణలో లేవు. కొన్ని మాత్రమే ఆచరణలో మాత్రమే ఉన్నాయి. అన్నింటికీ వేదం మూలం. ఎక్కడైతే కొన్ని విషయాల్లో సాక్షాత్తుగా వేదవాక్యం మనకు దొరకనప్పుడు మహర్షులు చెప్పిన వాక్యానికి మూలభూతమైన శ్రుతి వాక్యం ఒకటి ఉంది. దానిని అనుసరించే మహర్షులు చెప్పారు. అలాగే కొన్నిచోట్ల ఆచారాలు, ప్రతియొక్క ఆచరణకు ఒక మహర్షి వాక్యం, శ్రుతివాక్యం చూపించాలంటే అలా పద్ధతిలేదు. మన పూర్వీకులు ఆచరిస్తూ వచ్చారు కాబట్టి మనకు అదే ప్రమాణం. విరోధే తనపేక్షంస్యాత్ అసతిహ్యనుమానం - అనే సూత్రం ప్రకారం ఏదైనా ఒక స్మృతివాక్యాన్ని మనం తీసుకున్నప్పుడు ఆ స్మృతివాక్యం యొక్క అర్థం ప్రత్యక్షంగా మనకు ఉపలబ్ధమైన శ్రుతివాక్యంతో విరుద్ధంగా ఉంటే గనుక అప్పుడు స్మృతి కంటే శ్రుతి ప్రబలం కాబట్టి శ్రుతి వాక్యాన్ని తీసుకోవాలి. అనుమానం అంటే మన తెలుగులో వచ్చే అర్థం అనుమానం కాదు, శాస్త్రం ప్రకారం అనుమానం అంటే ఊహ. అన్నింటికీ ప్రమాణం ఏమిటంటే ప్రామాణికుల నిర్ణయం. మూలం కనుక లభించనప్పుడు విశేషంగా చర్చ చేసి, ఒక నిర్ణయం చేయాలి. ప్రత్యక్ష వాక్యం ఉంటే మనకు సంశయం లేదు. కొన్ని విషయాల్లో ప్రామాణికులైన గురువులు దానిని ఏ తీర్మానం చేస్తారో దానిని మనం ఆచరించాలి. ఇది కాబట్టి వెనుకటి నుంచి వచ్చినటువంటి ఒక పద్ధతి.

స్మృతుల్లో ఇది చేయరాదు అని ఉంటుంది. కానీ ఆచరణలో అది ఉంది. అలాగని ప్రామాణికులైన వాళ్ళు కూడా దానిని ఆచరణ చేశారు. స్మృతి వాక్యం మనకు కూడదు అని లభిస్తుంటే, కానీ ఆచరణ చేసేటటువంటివాళ్ళు ప్రామాణికులైన వాళ్ళు కూడా దానిని ఆచరణ చేస్తూ ఉండడం కొన్ని విషయాల్లో మనకు కనిపిస్తుంది. అంతిమ నిర్ణయం ఏమిటంటే శాస్త్రజ్ఞులు, జ్యేష్టుల తీర్మానమే ఇక్కడ అంతిమమైనటువంటిది. అది అలా చేయడానికి వీలులేదు. అలాగైతే చాలా విషయాల్లో ఆక్షేపణలు వస్తాయి. శాస్త్రకారులు ఎలాగైతే నిర్ణయం చేశారో, వాళ్ళు చెప్పిన న్యాయాలు ఏవైతే ఉన్నాయో ఆ న్యాయములు మనం పెట్టుకొని తద్వారా విషయప్రతిపాదన చేయాలి.

అదేరకంగా జ్యోతిషంలో కూడా విశేషంగా అదే



చేయాలి. అనేక విషయాల్లో అయినంతవరకూ సంపూర్ణంగా ఒక తీర్మానం చేసి, ఒక ఐకమత్యంతో విశేషంగా ముందుకు వెళ్ళవలసిన అవసరం చాలా ఉంది. అందులోనూ విశేషంగా ఇప్పుడు చెప్పినట్లుగా మిగతా శాస్త్రాలు, న్యాయము, వేదాంతం, మీమాంస ఈ శాస్త్రాలకంటే జ్యోతిష శాస్త్రం మరియు దానిలో చెప్పిన కాలములు ఇవన్నీ కూడా ప్రజలకు చాలా దగ్గరగా ఉంటాయి. మిగతా శాస్త్రములు పండితులు వాళ్ళ వాళ్ళల్లో మాత్రమే చర్చకు వస్తుంటాయి. జ్యోతిషంలో చెప్పినటువంటి ఆచరణలు ఇవన్నీ సామాన్యులు చేయనటువంటి అవసరం ఉంది. మన శ్రేయస్సుకోసం శాస్త్రంలో ఎన్నో ఆచరణలు చెప్పారు. కానీ సామాన్యులకు శాస్త్రంలో ఇంత విచారం ఉంటుంది అనే విషయం తెలియదు. సరైన నిర్ణయం చేసి చెప్పేవారికంటే వారిని దారి తప్పించేవాళ్ళే చాలామంది ఉంటారు కాబట్టి, దానిద్వారా చాలా చర్చలు, ఆక్షేపణలు జరుగుతూ ఉంటాయి. కాబట్టి విశేషంగా, సంపూర్ణంగా ఒక సమన్వయం చేసుకొని, ప్రతిపాదన చేయాల్సిన, ప్రజలకు మార్గదర్శనం చేయవలసిన అవసరం ఎంతో ఉంది.

కాబట్టి దీనినే ప్రధాన ఉద్దేశంగా పెట్టుకొని మీరు కొన్ని సంవత్సరాలుగా "తెలంగాణ విద్వత్సభ" ద్వారా విశేషంగా జ్యోతిషశాస్త్రంలో, అందులోనూ మనకు ప్రాచీనకాలం నుంచి వచ్చినటువంటి సిద్ధాంతానుసార క్రమాన్ని పెట్టుకొని, జ్యోతిషశాస్త్రంలో, సిద్ధాంతంలోనూ విశేష పరిశ్రమ చేస్తున్నటువంటి జ్యోతిషశాస్త్ర విద్వాంసులందరూ కలసి ఈ 'విద్వత్సభ' ద్వారా ప్రతీ సంవత్సరం అనేకమైన తీర్మానాలు చేస్తూ ఉండడం విశేషమైనది. చాలా సంతోషకరమైన విషయం.

ధర్మశాస్త్రంలోనూ ముఖ్యంగా ధర్మసింధు మరియు నిర్ణయసింధు ఈ రెండిటినీ అనుసరించి దాదాపు 99 శాతం అన్ని విషయాలు ఇందులోనే తీర్మానం అవుతాయి. కొన్నిచోట్ల మాత్రం కొన్ని విషయాలకు మనకు ఇందులో ఎక్కడైనా సరైన తీర్మానం కానప్పుడు, ప్రాంతీయ భేదాలు వచ్చినప్పుడు ఈ గ్రంథాలను కాకుండా ఇంకా ఏదో శాస్త్రాలను శోధించి, చూసి నిర్ణయం చేయవలసి ఉంటుంది. ఉదాహరణకు క్రిందటిసారి మొన్న జరిగిన ఉపాకర్మ. యాజుషోపాకర్మ. అది రెండు రకాలుగా వచ్చింది కాబట్టి రెండు రకాలుగా ఆచరణ జరిగింది. ఆ చర్చ చేసినప్పుడు కొన్నిసార్లు తీర్మానం ఏమిటంటే వారి పద్ధతి ప్రకారం అప్పుడు ఆచరణ, వీరి ఆచరణ ప్రకారం ఇప్పుడు ఆచరణ ఉంటుంది. ఫలితంలో ఏవిధమైన వ్యత్యాసం ఉండదు. ప్రామాణికులు చెప్పారు కాబట్టి ఆ రెండు గ్రంథాలు ప్రామాణికంగా ఉన్నాయి కాబట్టి ముఖ్యంగా ధర్మసింధు, నిర్ణయసింధు ఇంకా అదీ కాకుండా మనకు కొన్ని గీతా గ్రంథాలు కూడా ఉన్నాయి. వాటిని ఒక్కోసారి ఆచరణలోకి తీసుకొని తర్కించి నిర్ణయం చేయవలసి ఉంటుంది. దీనిని కూడా సరిగ్గా తెలుసుకొని అక్కడ సరియైన నిర్ణయం కొన్నిసార్లు మనం చేయవలసి ఉంటుంది. కొన్ని కొన్నిసార్లు మనకు నిర్ణయం చేయవలసి వస్తుంది. ధర్మసింధు, నిర్ణయసింధువుల్లో ఒకరకంగా ఉండి, కొన్ని పురాణ గ్రంథాల్లో ఇంకో రకంగా ఉంటుంది. కొన్నిచోట్ల విషయ నిర్ణయం చేసేటప్పుడు సాక్షాత్తుగా పురాణ వచనం తీసుకొని నిర్ణయం చేయడం కూడా ఉంది. అభిప్రాయభేదం ఉన్నా కూడా పురాణ వచనమే ప్రమాణంగా తీసుకొని నిర్ణయం చేయడం కూడా ఉంది. ఒక విషయం తీర్మానం చేయాలి



అంటే ఇవన్నీ చూసి ఒక విషయాన్ని మనం తీర్మానం చేయవలసిన అవసరం ఉంది.

కాబట్టి ఇప్పుడు మేమేం చేయాలి అది చూడాలా, ఇది చూడాలా అనేటటువంటి సందేహం వచ్చినప్పుడు చివరకు ప్రామాణికుల తీర్మానం అనేది ఇక్కడ మనకు అంతిమం. సంశయాస్పదమైన విషయాలు ఏవైతే ఉన్నాయో అక్కడ ప్రామాణికుల తీర్మానం అంతిమమైనటువంటిది అని పెట్టుకొని ఆ రకంగా పెట్టుకొని మనం చాలా సమన్వయంగా మనం ముందుకు వెళ్ళవచ్చు. ఈ రకంగా వచ్చేకాలంలో ఈ విభేదాలన్నీ పోయి, ఇప్పుడే చాలా విశేష ప్రయత్నం చేసి ఒక ఐకమత్యాన్ని తీసుకురావడానికి మీరు ప్రయత్నం చేస్తున్నారు. ఇదేరకంగా భవిష్యత్తులో మీరు ఈవిధంగా ముందుకు వెళ్ళాలి. తద్వారా విశేషమైన శ్రేయస్సుకు జనులందరూ పాత్రులు కావాలి.

జ్యోతిశ్శాస్త్రం అనేది కూడా ఎంతో విస్తృతమైన శాస్త్రం. దానిలోనూ ఎన్నో విషయాలు ఉన్నాయి. జ్యోతిషశాస్త్రం అంట ముహూర్తం, తిథి, నక్షత్రాలు తెలుసుకోవడం అనేదాన్ని బట్టి జ్యోతిషశాస్త్ర పండితుడు కాలేడు. ఎన్నో విషయాలను, ఎన్నో విస్తృతమైన బృహద్గ్రంథాలు ఎన్నో ఉన్నాయి, ఆ గ్రంథాలను అధ్యయనం చేస్తూ ముందుకు వెళ్ళవలెను. కొంతమంది సగం సగం అధ్యయనం చేసి మాకంతా తెలుసు, మేము మొత్తం జ్యోతిషశాస్త్రం అధ్యయనం చేశామంటే కుదరదు.

ఉదాహరణకు నా దగ్గరకు ఒక వ్యక్తి వచ్చి, సంస్కృతంలో నాలుగు మాటలు మాట్లాడి నా దగ్గరకు వచ్చి, నేనెవరు అని అంటే నీవు ఎక్కడ చదువుకున్నావు, ఏమి చదువుకున్నావు. నాయన మా గురువుగారి దగ్గర తర్కశాస్త్రం చదివాను అన్నాడు. నీవు మాట్లాడింది చూస్తే అలా లేదు కదా! నీవు చెప్పిన ఆ పండితులు సాక్షాత్తు మా గురువుగారి దగ్గర చదువుకున్నాడు. మా గురువుగారే ఆయనకు తర్కశాస్త్రం బోధించాడు. నీవు ఆయన దగ్గర తర్కం చదువుకున్నావు అంటే అలా కనబడలేదు. అంటే దానికి ఆయన ఒకసారి 40 రోజుల ఒక శిబిరంలో తర్కశాస్త్రం అధ్యయనం చేశాను అన్నాడు. అంటే అతను 40 రోజుల శిబిరంలో తర్కశాస్త్రం అధ్యయనం చేయడం కుదరదు. అతను చదివింది గోరంత. ఆ విషయం తర్కశాస్త్రం పూర్తి అధ్యయనం చేసినవారికి మాత్రమే అది తెలుస్తుంది. విద్వాంసులే తప్పులు చేస్తున్నారు కాబట్టి చక్కగా విశేషంగా జ్యోతిశ్శాస్త్రం యొక్క అధ్యయనం కూడా బాగా సంపూర్ణంగా జరగాలి. శాస్త్రాధ్యయనం అంటే సంపూర్ణంగా అక్కడ ఉన్న విషయాలు జిహ్వాగ్రంలో ఉండాలి. అది సంపూర్ణ అధ్యయనం అంటే. అలా జరిగితే మిగతా సగం సగం చదువుకున్నవాళ్ళ తప్పులు తప్పులుగా విషయ ప్రతిపాదన చేయడం, జనులకు దానిద్వారా భ్రాంతి కలిగే అవకాశం ఉండదు. ఆ జ్ఞానం, అధ్యయనం సంపూర్ణంగా జరగకపోవడమనేది కూడా ఇక్కడొక ప్రధాన అంశం.

కాబట్టి అది కూడా చక్కగా జరగాలి. ఇప్పుడొచ్చిన వాళ్ళల్లో చాలామంది శిష్యులను తయారుచేసిన జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఉన్నారు. ఈవిధంగా పారంపరికంగా వచ్చిన విద్య వృద్ధి చెందాలి. అదేరకంగా ఈ గ్రంథాల ద్వారా విషయ తీర్మానాలు జరిగి, ఒక సమన్వయంతో ముందుకు వెళ్ళాలి. భవిష్యత్తులోనూ ఇటువంటి సభలు, సమావేశాలు అప్పుడప్పుడూ విశేషంగా జరుగుతుండాలి. ఆయా సందర్భాల్లో చర్చలు జరిగి, ఇంకా అనేకవిధమైన తీర్మానాలు జరగాలి. కొన్ని విషయాలకు కాస్త చర్చ జరగాల్సి వుంది. ఒకేసారి తీర్మానం చేయడం కుదరదు. అటువంటి విషయాలకోసం అప్పుడప్పుడు యథాయోగ్యంగా ఆయా సందర్భాల్లో చేసి, ఆ విషయాలను కూడా భవిష్యత్తులో తీర్మానం చేద్దాం! ఇందుకు అందరు పండితులు సంసిద్ధంగా ఉండి మున్ముందుకు సాగాలి!!

జ్యోతిశాస్త్ర వైశిష్ట్యాన్ని భావితరాలకు అందించాలి

తెలంగాణ విద్వత్సభ పండితులకు కంచి స్వామి ఉద్బోధ

పరమపూజ్య శ్రీ కంచి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు జూన్ 6 సోమవారం సాయంకాలం శ్రీ స్కందగిరి దేవాలయంలో తెలంగాణ విద్వత్సభను అనుగ్రహించి దివ్యాశీస్సులు అందజేశారు.

తెలంగాణ విద్వత్సభ పక్షాన కోశాధికారి, దర్శనమ్ సంపాదకులు మరుమాముల వెంకట రమణ శర్మ అభ్యర్థన మేరకు స్వామివారు అనుగ్రహించడానికి అంగీకరించారు. ఎంతో వైభవంగా జరిగిన ఈ విద్వత్సభ అనుగ్రహ సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ సిద్ధాంతి, జ్యోతిష పండితులు, శాస్త్ర పండితులు విచ్చేశారు.

ముందుగా స్వామివారికి తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి విద్వత్సభ పక్షాన ఫలతాంబూలాదులను సమర్పించి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం దర్శనమ్ శర్మ స్వాగతోపన్యాసంతో సభ ప్రారంభమైంది. స్వామివారి ఆజ్ఞానుసారం విద్వత్సభ సభ్యులను పరిచయం చేసుకుని, అభిప్రాయాలను వ్యక్తం చేయమనగా మొదట యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ గతంలో పండుగల వివాదంలో ప్రాంతీయాచారానికే ప్రాధాన్యమివ్వాలని స్వామివారు సూచించారని గుర్తు చేశారు.

శృతి, స్మృతి పురాణాలలోని ధర్మ శాస్త్ర విషయాలను పరిశీలించి పండుగల నిర్ణయాలు చేస్తున్నామని విద్వత్సభ గౌరవ సలహాదారులు ఆకెళ్ల జయకృష్ణ శర్మ సిద్ధాంతి తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధాంతులు, జ్యోతిష పండితుల సమన్వయంతో సమాజ శ్రేయస్సుకై తెలంగాణ విద్వత్సభ





కృషి చేస్తుందని ఉపాధ్యక్షులు, ప్రముఖ జ్యోతిష పండితులు సాగి కమలాకర శర్మ తెలిపారు.

ప్రముఖ జ్యోతిష విద్వాంసురాలు, విద్వత్సభ సహాయ కార్యదర్శి శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రామాణికత లేని విషయాలను ప్రసార మాధ్యమాలలో ప్రచారం చేస్తుండడం బాధాకరమన్నారు.

గౌరవ సలహాదారులు, స్కందగిరి ఆలయ ట్రస్ట్ సభ్యులు గుడి సోమనాథ శర్మ సిద్ధాంతి వ్యక్తిగతంగా సిద్ధాంత భేదాలున్నా పండగల నిర్ణయ వియంలో తెలంగాణ విద్వత్సభ ఒకే వేదికపైకి వచ్చి ఏకాభిప్రాయ సాధన జరుగుతుందన్నారు.

స్వామివారి దివ్యానుగ్రహం లభించడం మా అదృష్టమని, ఉపాధ్యక్షులు శ్రీ సంతాన మల్లికార్జున దేవాలయ వ్యవస్థాపకులు చెప్పెల హరినాథ శర్మ అన్నారు.

2017 సంవత్సరంలో జరిగిన రెండు రోజుల తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో ఏర్పడిన తెలంగాణ విద్వత్సభ రాబోయే సంవత్సర పండుగల నిర్ణయాలను ప్రతి సంవత్సరం సభలు జరిపి, జాబితాను సిద్ధం చేస్తుంది. దీని ప్రకారమే ప్రభుత్వం సెలవులను ప్రకటిస్తుందని కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి వివరించారు.

వ్యక్తిగతంగా విభేదాలు లేకుండా, శాస్త్రపరంగా అనేకత్వం అనుకోకుండా చర్చలు జరిపితేనే మంచిదని సహాయ కార్యదర్శి, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యదర్శి గాడిచెర్ల నాగేశ్వర శర్మ సిద్ధాంతి అన్నారు.

ఉపాధ్యక్షులు శ్వేతార్క గణపతి దేవాలయ వ్యవస్థాపకులు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ దర్శనమ్ శర్మ కృషి ఫలితంగా తెలంగాణ విద్వత్సభకు ఈ మహదవకాశం లభించడం విశేషం, ఈ సందర్భంగా శ్రీ స్వామివారికి మేమెంతగానో ఋణపడి ఉన్నామన్నారు.

ఉపాధి కొరకు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా, మా కుటుంబం సనాతన ధర్మానికే అంకితం అయిందని చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి వారి కుమారులతో సహా శ్రీ స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

గత 30 సంవత్సరాల క్రితం నుంచి మెదక్ జిల్లాలో విద్వత్సభ ప్రారంభమైందని, దాని క్రమంలోనే ప్రస్తుతం తెలంగాణ విద్వత్సభ ఏర్పడిందని సమన్వయకర్త, తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య సలహాదారులు బోర్పట్ల హనుమంతాచారి వివరించారు.

బోర్పట్ల రాఘవేంద్రాచారి సిద్ధాంతి మాట్లాడుతూ, విద్వత్సభ నిర్ణయాలను అందరం కచ్చితంగా ఆచరిస్తున్నామని, మహాత్ముల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

ఈ సమావేశానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన దోర్బల ప్రభాకర శాస్త్రి, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, తెలంగాణ విద్వత్సభ కృషిని శ్రీ స్వామివారికి వారి మాటలలో వివరించారు.

అనంతరం స్వామివారు అందరి మాటలను దృష్టియందుంచుకుని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా వివరిస్తూ, ఓపికగా ఎంతో సమయాన్ని వెచ్చించి తమ సుదీర్ఘ అనుగ్రహభాషణం చేశారు. అంతేగాక తెలంగాణ విద్వత్సభకు కొన్ని సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. భావితరాల వారికి కావలసిన అవసరాలను దృష్టియందుంచుకుని, మనం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ తమ దివ్యాశీస్సులను అందించారు.

ఈ సభలో జూలా సోమనాథ శాస్త్రి, మార్తి సత్యనారాయణ శర్మ, యువ సిద్ధాంతులు జ్యోషి ప్రశాంత్, బోర్పట్ల భాస్కరాచార్య, నరేశ్ కులకర్ణి, కొదుమగల్ల వేణుగోపాలాచార్య, కొమండూరి పార్థసారథి ఆచార్య, కాసుల రాధాకృష్ణ శర్మ, లక్ష్మీగణపతి శర్మ, మొకిరాల లక్ష్మణమూర్తి శర్మ పాల్గొన్నారు. వీరితో పాటు మంగేశ్ కులకర్ణి, జి. పాండురంగశర్మ, పాలెపు రాజేశ్వర శర్మ తదితరులు పాల్గొని శ్రీ స్వామివారి దివ్యాశీస్సులు అందుకున్నారు.

విశ్వేశతీర్థ శ్రీపాదులకు విద్వత్సభ గురువందనమ్

తెలంగాణ విద్వత్సభ

సనాతన ధర్మ పరిరక్షణకోసం పండితు లందరూ సమన్వయంతో సమాజాన్ని జాగృతం చేయాలని జగద్గురు మధ్వాచార్య మూల మహాసంస్థానం శ్రీ పెజావర అధోక్షజ ఉడుపి పీఠాధీశ్వరులు శ్రీశ్రీ 1008 విశ్వేశతీర్థ శ్రీపాదులవారు ఉద్బో దించారు. మంగళవారం సాయం త్రం సికింద్రాబాద్ సైనిక్పురి వివేకానందపురంలో గల పూర్ణబోధ విద్యాపీఠంలో శ్రీ విశ్వేశతీర్థస్వామి వారికి 'తెలంగాణ విద్వత్సభవారు అంగరంగవైభవంగా గురు వందనమ్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పండితులు, సిద్ధాంతులు పాల్గొన్నారు.

గురువందనమ్ అనంతరం శ్రీవిశ్వేశతీర్థ స్వామి వారు అనుగ్రహభాషణం చేస్తూ ధర్మాచరణ, పరిరక్షణకోసం అందరూ నిబద్ధతతో కంకణబద్ధులు కావాలన్నారు. జాతిని చైతన్యవంతం చేయడానికి పండితులు, జ్ఞానులు నిస్వార్థంగా కృషిచేయాలని సూచించారు. తెలం గాణలో జ్యోతిష పండితులు, పంచాంగకర్తలు, సిద్ధాంతులు ఒక్క తాటిపైకి వచ్చి ఆర్షసంస్కృతిని, వైదికధర్మాన్ని పరివ్యాప్తం చేయటానికి విద్వత్సభను ఏర్పాటుచేసుకోవటం ప్రశంసనీయ మన్నారు. ఈ సభ వల్ల లోకకళ్యాణం జరగాలన్నారు.

తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్ర శేఖరశర్మ, కార్యదర్శి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి శ్రీ మరుమాముల వెంకటరమణశర్మలు శ్రీ విశ్వేశతీర్థస్వామి వారికి ఫలాలు, గజమాల, వస్త్రాలు, శాలువా, గురుదక్షిణ, జ్ఞాపికతో ఘనంగా సభక్తికంగా గురువందనమ్





సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ స్వామి వారిని పరిచయం చేశారు. సభలో శ్రీ గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, సమన్వయకర్త శ్రీ భీంసేన్ మూర్తి వేదపండితులు నటరాజశర్మ, రాయప్రోలు మల్లికార్జున శర్మ, శ్రీనివాసశర్మ, శేషశర్మ, మంగేష్ కులకర్ణి, శశికాంత్ నాని తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవ - మాధవ సేవ

సాక్షాత్ రుక్మిణిదేవిచే పూజించబడి జగద్గురు మధ్వాచార్యులచే ప్రతిష్టించబడిన ఉడుపి శ్రీకృష్ణుడి దర్శనం మహా సౌభాగ్యము, మంగళకరము. ఇక్కడి విశేషమేమనగా ఎనిమిది మఠాలకు సంబంధించిన పీఠాధిపతులే స్వయంగా శ్రీకృష్ణ పూజా పర్యాయం అని పిలుస్తారు. శ్రీకృష్ణుడి పూజా శ్రీకృష్ణుడి పూజా కైంకర్యాలను నిర్వహిస్తారు. అష్టమఠముల పీఠాధిపతులు 2 సంవత్సరాలకు ఒకరు చొప్పున పూజా కైంకర్యాలు, దేవస్థానం సకల బాధ్యతలను నిర్వహిస్తారు. దీనినే కైంకర్య సౌభాగ్యం ఎనిమిది మంది పీఠాధిపతులకు తమ జీవితకాలంలో 2 లేదా మూడు మార్లు లభిస్తుంది, 4 సార్లు లభించడం అరుదు. అయితే 8 సంవత్సరాల వయస్సులో సన్యాసాశ్రమం స్వీకరించిన పేజావర మఠాధిపతులు పరమపూజ్య శ్రీ విశ్వేశతీర్థ శ్రీపాదులవారికి శ్రీకృష్ణుడిని పూజించే సౌభాగ్యం 5వ సారి లభించడం ఉడుపి చరిత్రలో మొదటిసారి. స్వాములవారి 2 సంవత్సరాల ఈ పర్యాయ మహోత్సవం కన్నులవిందుగా జరిగి ఉడుపి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ రెండు సంవత్సరాల పర్యాయ అవధిలో మఠం -సిద్ధాంతం అనే భేదాలు లేకుండా అనేకమంది పీఠాధిపతులు ఉడుపి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.

శ్రీ విశ్వేశతీర్థుల వారి 1931 ఏప్రిల్ 27న జన్మించారు. యతికుల చక్రవర్తి బిరుదాంకితులైన స్వామీజీ ద్వైత వేదాంత ప్రబోధం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. బెంగుళూరులో పూర్ణప్రజ్ఞా విద్యాపీఠాన్ని స్థాపించి వేదాంత బోధన, ప్రచారం కోసం అవిరళ కృషి సల్పు తున్నారు. కర్ణాటకలోని రామకుంజలో శివల్లి మాధవ మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన విశ్వేశ తీర్థుల పూర్వాశ్రమ నామం వెంకట్రామ.

రాష్ట్రపతితో సహా అనేక రాజకీయ ప్రముఖులు స్వామివారి ఆశీర్వాదంతో పునీతులయ్యారు. దేశంలోని పలు ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అనుకూలమయ్యే విధంగా స్వాములవారు నూతన వసతి గృహాలు నిర్మించారు. అంతేగాక మానసిక వికలాంగులై అత్యంత క్లిష్ట పరిస్థితిని అనుభవిస్తున్న బాల బాలికలకు ప్రత్యేకంగా ఉచితంగా వసతి, ఆహారాన్ని అందించే ఆశ్రమాన్ని తమ పర్యాయ కాలంలో నిర్మించారు.

ముఖ్యంగా హిందూ సమాజ జాగృతికై 'ధర్మ సంసత్' పేరుతో దేశంలోని వేలాది మంది సాధువులు పీఠాధిపతుల సమక్షంలో రామ మందిర నిర్మాణంతో పాటు సమాజం హిందూ ఎదుర్కొంటున్న సమస్యలపై దిశా నిర్దేశం చేయడమే గాక హైందవా సోదరా సర్వే న హిందూ పతితో భవేత్ అనే నినాదాన్ని సమాజానికి అందించారు. విశేషంగా తమ పూజా కైంకర్య పర్యాయం 2 రోజులలో పూర్తవుతుంది అనే సమయంలో కంచి పీఠాధిపతుల అనారోగ్యం విషయం తెలుసుకుని కృష్ణుడి సన్నిధానంలో విశేష పారాయణం, పూజలు ఆచరించడం ద్వారా ఇతర పీఠాధిపతుల పై వారికి గల స్నేహభావాన్ని చాటుకున్నారు.

పంచాంగం - స్వరూపం
(ధర్మం ఆచరణ)

"జ్ఞాత్వా కర్మాణి కుర్వీత" కర్మలను గురించి తెలుసుకుని ఆచరించడమే శ్రేయోదాయకం. ప్రతి మానవుడు సిద్ధాంతమే మూలముగా తన మనుగడ సాగిస్తూ తద్వారా పురుషార్థ ప్రధా నములు సాధిస్తూ విశేషఖ్యాతిని పొంది అంతిమ లక్ష్యమైన మోక్ష సామ్రాజ్యాన్ని సైతం పొందగలుగుతున్నాడు. అట్టి ఐహికాముష్మిక నిర్వాణ రూప సుఖత్రయ ప్రాప్తి సాధనములను ఆధ్యాత్మిక ఆధిదైవిక, ఆధిభౌతిక రూప దుఃఖత్రయ నివారణోపాయములను బహుమార్గాలతో విస్తరించివున్న కాలస్వరూపమైన పరమాత్మను సేవించుట ద్వారానే సిద్ధిస్తుంది అనేది వేదచోదితమైంది. అదే పంచాంగమని, వేదాంగముగా తెలియజేయు సిద్ధాంత సంహితయని తెలియుచున్నది.

వేదములందలి కర్మభాగము, ఉపాసనాభాగము ఏ సమయంలో ఏది చేయాలో, ఏది అనుకూలంగా ఉంటుందో నిర్ణయిస్తాయి. ఏవిధంగానైతే గుడ్డివాడు నడిచేటప్పుడు ఎత్తు పల్లములలో, రాళ్లు, ముళ్లలో బాధపడుతూ బురద, పేడలలో కాలుపెడుతూ పలుమార్లు దుఃఖిస్తాడో... అలా ఎవరైనా సరైన సమయాన్ని విచారించక కార్యాలను కనుక చేసినట్లయితే కష్ట నష్టాలను అనుభవిస్తారు. కాబట్టి యోగ్యమైన సమయాన్ని గుర్తించి కార్యాలను చేసినట్లయితే మంచి ఫలితాలను ఇస్తుంది. ఇందుకు పంచాంగంలోని విషయాలను మనకు ఎంతో ఉపకరిస్తాయి.

ఆదిపురుషుడు మహాకాలమును ఆధారంగా చేసుకుని మూల ప్రకృతిని గుణవైషమ్యంగా నొనర్చి చతుర్ముఖ బ్రహ్మ ద్వారా అనేక బ్రహ్మాండములను సృష్టించాడు. ఇందు సమస్త ప్రాణికోటి కూడా కాలాధీనంగా నడుస్తున్నది. ఇందుకు చంద్ర సూర్యులు, గ్రహతారలు ఆకాసమున మనకు నిదర్శనాలు. జీవనదులు ప్రవహించడం, కొండలు, సముద్రాలు నిలిచి ఉండడం ఇవి భూభాగమున దృష్టాంతాలు.

ప్రతి మానవుడు జీవితంలో తనకు నిర్ణయించిన ఆయుః ప్రమాణము కూడా కాలపరిమితిలోనిదే. అట్టి కాలపరిమితిలో తనకై ఏర్పరచిన స్వల్ప సమయంలో సైతం జాతకర్మలు, అక్షరాభ్యాసం తదితర మహాటరీన్నత కార్యములు ఏ రీతిగా ఎప్పుడు చేయాలో, పుణ్యకాలము, విషఘటికాది దుష్కాలముల గురించి, వ్రతాలు ఏ సమయాన ఆచరిస్తే సర్వసౌ ఖ్యాలు పొందుతామో, పితృదేవతల తృప్తికై చేసే ధర్మాది శ్రాద్ధముల విషయము, జాతక సంబంధమైన విషయాలు మొదలైనవి తెలుసుకోవాలంటే పంచాంగమే ఆధారం. అటు వంటి పంచాంగాన్ని చక్కగా గణన చేసి ప్రజలకు అందిం చాలంటే ఎంతో శ్రమపడితే గానీ సాధ్యం కాదు.

ప్రస్తుతం మన ప్రాంతంలో అనేక మంది సిద్ధాంతులు ప్రజలకు పంచాంగాలను అందిస్తున్నారు. సిద్ధాంతములలో రెండు విధానములు ప్రస్తుతం వాడుకలో ఉన్నాయి. అవి 1. సూర్య సిద్ధాంతం, 2. దృక్ సిద్ధాంతం. ఇందులో ఏది ఆచరిం చాలనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. దీని విషయంలో సూర్య సిద్ధాన్తసార సంగ్రహమున సూర్య సిద్ధాంతం, దృక్ సిద్ధాంతం దేనికి అనేది స్పష్టంగా గోచరి స్తుంది.

శ్లో॥ సిద్ధాంత గ్రహచారేణ వ్రతధర్మాదికం చరేత్ ।
దృక్సిద్ధ గ్రహచారేణ హటరీరాఫలముదీరయేత్ ॥
ప్రత్యహం తిథి నక్షత్ర యోగస్వానయనే విదుః ।
అబీజ సంస్కృతో గ్రాహ్యః గ్రహణాదౌసబీజకః ॥

శ్లో॥ దృక్సిద్ధ ఖేట గ్రహసాధితాసు కుర్వన్తి
కేచిత్తిథిషు ప్రమాదాత్ ।



శ్రాద్ధాదికం తత్పితృశాపతస్తే పుణ్యక్షయం
దుర్గతి మాప్నువంతి ॥

అనాదిగా భారతదేశమునందు జన్మకాల రవిచంద్ర గ్రహణ ఉదయాస్తమయ వక్ర, వక్రత్యాగ, గ్రహయుద్ధ, చంద్రశృంగోన్నతి, పాతాది ప్రత్యక్ష ఫలములకు దృక్సంస్కార రవిచంద్రులచే గణింపబడిన పంచాంగాన్ని వాడాలి. అప్రత్యక్ష ఫలము లగు వ్రతాది ధర్మనిర్ణయములందు మూల సిద్ధాన్తసమ్మత మగు దృక్ సంస్కారము చేయని రవిచంద్రులచే గణింపబడిన పంచాంగము వాడాలని ధర్మ నిర్ణయ వేదులగు పూర్వాచార్యులు తమ నిర్ణయ గ్రంథంలో రాశారు. ఆ ప్రకారంగా మూల సిద్ధాంతానుసారులైన గణకానంద, గ్రహ లాఘవ, నరకంఠీరవాది తంత్ర, కరణ గ్రంథోక్తరీతులచే గణింపబడిన పంచాంగము అనాదిగా అన్ని కార్యాలయందు వాడుచున్నారు. ఇది శాస్త్రీయమని తెలుపుచున్నప్పటికీ భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన కమిటీవారు వ్యవహారో పయోగమగు దృక్తుల్య నిరయన శాస్త్రీయ పంచాంగములే ప్రచురిస్తూ, ఆ సర్వధర్మ కార్యాచరణకు ఉప యోగించవచ్చు నంటున్నారు. ఈ విషయంలో 'అమృత్సర్'లో జరిగిన జ్యోతిర్విద్వన్మహాసభ నిర్ణయాలను పంచాంగమే 1964 ప్రస్తావించడం సముచితమని నేను భావిస్తున్నాను.

శ్రీ క్రోధి నామ సంవత్సర కార్తీక శు॥ సప్తమి 11-11-1964 తేదీ బుధవారం నుండి 19-11-1964 గురువారం వరకు శ్రీ మహా రుద్రయాగ ప్రభృతి ధర్మానుష్ఠాన విశేషములతో సహా శ్రీ వేద సర్వశాఖా సమ్మేళనం అఖిల భారతీయ ధర్మ సంఘ యాజ మాన్యంలో శ్రీశ్రీశ్రీ మదనంత శ్రీ విభూషిత పరమహంస పరి వ్రాజకాచార్యవర్య కరపాత్రీ మహాస్వాముల వారి తత్వావధానమున దిగ్విజయంగా నెరవేరినది. అందు శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ జగద్గురు శంకరాచార్య జ్యోతిష్పీఠాధ్యక్ష శ్రీకృష్ణబోధాశ్రమ స్వాములవారు, శ్రీ పు॥ పు॥ శ్రీ జగద్గురు శంకరాచార్య

ద్వారకాపీఠాధీశ్వర శ్రీ మదభినవ సచ్చిదానంద తీర్థ స్వాములవారు, శ్రీ ప।। ప।। జగద్గురు పూరీ గోవర్ధన పీఠాదీ, శ్వర శ్రీ నిరంజనదేవతీర్థస్వాములవారు మొదలగు పీఠాధిపతులు శ్రీ పరమానంద తీర్థ బాలసన్యాసి ప్రభృతులగు దండి యోగి అవధూతాధి మహాత్ములను, శాస్త్రార్థ మహారథి మాధవా చార్య ప్రభృతి పండిత ప్రకాండులును, ఢిల్లీ అఖిల భారతీయ సంస్కృత విద్యాపీఠం, వారణాసి హిందూ విశ్వవిద్యాలయం, కలకత్తా, మద్రాసు గవర్నమెంటు సంస్కృత మహావిద్యా లయం మొదలగు సుప్రసిద్ధ విద్యాపీఠముల ప్రతినిధులను, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, మద్రాస్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మొదలైన భారతదేశం లోని వివిధ ప్రాంతములలోని విశిష్ట విద్వద్వర్యులు విచ్చే శారు. ఆర్యసమాజ, బ్రహ్మసమాజ, సిక్కు బౌద్ధాది వివిధ సంస్థ ప్రతినిధులు, శాస్త్రార్థాలలో పాల్గొన్నారు. మొదటి ఏడు దినములు వేద ప్రామాణ్య మీమాంస వేదార్థ నిర్ణయాధార ములు మాక్స్ ముల్లర్ మొదలగు పాశ్చాత్యులు రచించిన వేదభాష్యముల సాంగత్యాసాంగత్యాది విమర్శనలు శ్రీ సాయనాచార్య ప్రణీత భాష్యవ్యతిరిక్తార్థ సంభవాసంభవ విచారణలు మొదలగు గంభీర శాస్త్రీయ విషయముల యందు శాస్త్రవాదములు అఖండముగ నడచి తీర్మానములు గావించబడ్డాయి. ఆ తీర్మానముల పూర్తి పాఠములు కాశీ నుండి వెలువడు సిద్ధాంత పత్రికా సప్తమ సర్వవేద శాఖా సమ్మేళన సంచిక 1964వ సంవత్సరంలో చూడవచ్చు. ఇక చివర 18,19 నవంబర్ తేదీలలో వారణాసి సంస్కృత విశ్వవిద్యాలయ జ్యోతిశ్శాస్త్ర విభాగ అధ్యక్షులైన శ్రీ పండిత జ్యోతిషాచార్యే త్యాది బిరుదాలంకృత మీఠాలాల్ శాస్త్రిగారు జ్యోతిర్విషయా ధ్యక్షులుగాను, శ్రీ ప।। ప।। కరపాత్రీస్వాములవారు ప్రధానా ధ్యక్షులుగను జ్యోతిష సమ్మేళన మహాటరీజ్జ్వలంగా జరిగింది. అందులో పంజాబ్ ప్రాంతం నుండి దైవజ్ఞరత్న రాజజ్యోతిష పండిత ముకుంద వల్లభమిశ్రా మహాటరీదయులు దృగ్గణిత శ్రీ శక్తిధరశాస్త్రి, జ్యోతిషాచార్య ఎం.ఎస్.సి ఆనర్స్, దృగ్గణిత శ్రీప్రియవ్రత శర్మ, దృగ్గణిత సాహిత్య జ్యోతిషాచార్య ఎం.ఎ మొదలైనవారు, శ్రీ పండిత ఈశ్వరదత్తుశర్మ దృశ్యగణ మీమాంసా రచయిత దృగ్గణిత మొదలగు విద్వాంసులు, రాజస్థాన్ నుంచి శ్రీ పండిత సీతారామశాస్త్రి ప్రభృతులును బెంగాల్ ప్రాంతం నుండి పండితులు విచ్చేశారు. హైదరాబాద్ ప్రాంతీయ మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా శివ్వంపేట గ్రామ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ శాస్త్రుల విశ్వనాథశర్మ (సూర్యసిద్ధాంతం) మొదలగు విమర్శకులు, ఆంధ్రప్రదేశ్ మహావిద్వాంసులు శ్రీ పండిత బాణాచార్య (సూర్యసిద్ధాంత) బొంబాయి ప్రాంతం జ్యోతిషాచార్యేత్యాది బిరుదాంకితులు, భూతపూర్వ హిందూ విశ్వవిద్యాలయ జ్యోతిర్విభాగాధ్యక్షులు అయిన శ్రీ పండిత రామవ్యాస పాండ్యేయ (సూర్యసిద్ధాంత) మొదలైన కాశీ పండితులు పై శాస్త్ర వాదంలో పాల్గొన్నారు.

మొదటి దినము సభా ప్రారంభమున శ్రీ పండిత శాస్త్రుల విశ్వనాథశర్మగారు ఈ సందర్భంలో తాను రచించిన జ్యోతిర్మీ మాంసాది శ్లోక ముఖ్య ఘట్టములను చదివి వినిపించారు. పూర్వార్థమున ఉదయం 8.30 ని.ల నుండి పగలు ఒంటి గంట వరకు ప్రామాణ్యవాదమును, ఉత్తరార్థమున పగలు 2.30 ని.ల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు గణితవాదం జరిగింది. మరుసటి దినము పూర్వార్థమున పక్ష, ప్రతిపక్షముల వారికి తిరిగి మరొకసారి వాదమునకు అవకాశమీయబడింది. శ్రీ పండిత ప్రియవతశర్మ దృగ్గణితగారి యొక్క, శ్రీ పండిత రామవ్యాస పాండ్యేయ సూర్యసిద్ధాంత యొక్క వాదములు అఖండముగాను, మహాటరీజ్జ్వలంగా జరి గాయి. తుదకు శ్రీ ప।। ప।। కరపాత్రీస్వాములవారు, శ్రీ పండిత మీఠాలాల్ శాస్త్రిగారును కలిసి ఈ క్రింది తీర్మానము చేసి సభాసదులకు తెలియజేశారు. ప్రాచీనార్ష సిద్ధాంతములన్నీ మనకు ప్రమాణభూతములే.. అందులో విశేషించి ఈ కల్పమునకు సూర్యసిద్ధాంతము పరమోపాధేయము, కాబట్టే విశేష విషయాల్లో ఇతర సిద్ధాంతాలకన్నా సూర్యసిద్ధాంతమే ప్రబలమైనది. "ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం" అనేది శాస్త్ర వేద్యకాల తదనుష్ఠిత క్రియాతజ్జన్య ఫలములందు ఒకదానిని ఏదైనా చక్కగా సమన్వయించకపోవడం వల్లనే నార్ధవాదిక వచన కోటిలో పర్యవసానం పొందుతుంది. బృహత్తర ప్రత్యక్ష ఫలప్రదత్వం అర్థవాద ఫలంగా తెలుసుకోవాలి. జ్యోతిశ్శాస్త్ర వేద్యాలైన కాలవిశేషాలన్నీ దృక్సిద్ధములు. దృశ్యాసన్న గణిత



సిద్ధములై ఉండాలనేది సామాన్యవిధి కాబట్టే గ్రహణగ్రహటరీ దయ స్వశృంగోన్నత ప్రభృతులకు కావలసినన్ని సూక్ష్మ సూక్ష్మతర బీజ సంస్కారములు శాస్త్రమున విధింపబడినాయి. తిథ్యాది సాధనమున దీనికపవాద విధి కనబడుతోంది. సామా న్యము సావకాశమగుటచే నిరవకాశమైన విశేష విధిచే బాది తముగాగలదు. లేక అపవాద విధికి అవకాశం కల్పించియే యుత్సర్గ విధి ప్రవర్తింపగలరు. కాగా గ్రహణ గ్రహటరీదయాలు దృక్సిద్ధములగును తిథ్యాదులు సూర్యసిద్ధాంత సిద్ధ నిరయన 'బాణ వృద్ధి రసక్షయ' పక్ష ఘటిక మానందైక కర్మ సంస్కార సంస్కృత సూర్యచంద్రాంతర లక్షణ దేవతారూప కళాత్మకాదులుగా పంచాంగ నిర్మాణం జరగాలి. అట్టి పంచాంగమే ధర్మకర్మల విషయంలో ధార్మిక, ఆస్థిక మహా జనులకు పరిగ్రాహ్యము కాగలదని తమ నిర్ణయాలను సవివరంగా తెలిపారు. కాబట్టి ఆస్తిక మహాజనులందరూ పై నిర్ణ యాల ప్రకారమే ఆచరించడం ముఖ్యం.

కాబట్టి సిద్ధాంతులకు నా మనవి ఏమిటంటే ప్రస్తుత కాలం లో కలిగే అనేక అనుమానాలను తొలగించి ప్రజలకు సందేహ నివృత్తి కలిగించడానికి ఏకం కావలసిందిగాను, ధర్మాన్ని ఆచరించడానికి మన వంతు సహకారం విధిగా అందించాలని, ఏ మతమైనా స్వధర్మ శాస్త్రమనే ప్రాణాన్ని వీడినట్లయితే అది మృతముకదా! "స్వధర్మే నిధనం శ్రేయః' అనే గీతావాక్యం ఉంది కదా! ధర్మ రక్షణ కోసం ప్రాణాన్ని సైతం వదలవలసి ఉంటుందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి కదా! అంతే కాకుండా "తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ । జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మకర్తు మిహార్హసి" అనే భగవద్వాక్యాన్ని అవశ్యం అనుసరించ వలసిందే. శాస్త్రాన్నే ప్రమాణంగా తీసుకుని ఏది చేయవచ్చో, ఏది చేయకూడదో నిర్ణయించు కుని, గ్రహించి తదనుసారంగా కర్మల్ని ఆచరించడమే నీ కర్తవ్యం. "యః శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారతః । నససిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్ ॥" ఎవరు శాస్త్ర విధిని వదిలి స్వేచ్ఛానుసారంగా చేస్తున్నాడో వాడికి సిద్ధి లభించదు, సుఖము లేదు. ఉత్తమ గతి కూడా లభించదు.

శ్లో ॥ కర్తవ్యమేవ కర్తవ్యం ప్రాణైః కంఠ గతైరపి ।
అకర్తవ్యం నకర్తవ్యం ప్రాణైః కంఠ గతైరపి ॥

స్వస్తి సర్వేషాం సన్మంగళాని భవన్తు

ఆకెళ్ల జయకృష్ణశర్మ సిద్ధాంతి

సఫలం జ్యోతిష శాస్త్రమ్

శ్లో ॥విఫలాన్యన్యశాస్త్రాణి వివాదాస్తేషు కేవలం
సఫలం జ్యోతిషం శాస్త్రం చంద్రార్కౌయత్ర సాక్షిణౌ ॥

ఇతర శాస్త్రాలన్ని కేవలం వివాదాల వల్ల విఫలమైనాయి. సూర్య, చంద్రుల సాక్షిగా జ్యోతిష శాస్త్రం సఫలమైంది. దీనికి నిలువెత్తు నిదర్శనమే ఈ "తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు". ఒక మహత్తర సంకల్పం ఇచ్ఛాశక్తిగా, ఒక అద్భుత రూపకల్పన జ్ఞానశక్తిగా, ఒక అద్వితీయ మహా కార్యక్రమ నిర్వహణ క్రియాశక్తిగా ఏకమైన త్రిశక్తి స్వరూప విశ్వరూపమిది.

శ్రీ గాయత్రీ పీఠం తత్త్వానంద ఋషిగారు, జ్యోతిర్మయ మహాపీఠం, దివ్యజ్ఞాన సిద్ధాంతిగారు, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు వేంకటరమణశర్మగారి సంయుక్త నిర్వహణలో జరుగుతున్న 'తెలంగాణ రాష్ట్ర మహాసభలు' 'న భూతో న భవిష్యతి' గా వెలుగొందుచున్నవి. అవిరళ కృషి సలిపిన ఈ ముగ్గురిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

తెలంగాణ రాష్ట్రంలోని మహానుభావులైన సిద్ధాంతులు, జ్యోతిషపండితులు, ప్రముఖులు, బ్రాహ్మణోత్తములు,



పౌరోహితులు, అర్చకులు అందరు ఈ సభలో దర్శనమగుట మనందరి అదృష్టం, విశేషం. ఇది చరిత్రలో నిలిచిపోయే ఒక మహత్తర ఘట్టం.

దిగ్విజయ మొనర్చుకుంటున్న ఈ మహాసభలకు మొదటి రోజున జరుగు 'సిద్ధాంత సదస్సుకు మరియు సాయంత్రం విద్వత్సభా సమావేశానికి అధ్యక్షులుగా నిర్వహించే బాధ్యత అవకాశం లభించుట నా అదృష్టం.

'కాలమహిమ' చాలా గొప్పది. (శ్రీ మద్భాగవతంలో)

శ్లో ॥యో న్తః ప్రవిశ్య భూతాని, భూతైరత్త్యఖిలాశ్రయః ।
సవిష్ణ్వా ఖ్యో ధి యజ్ఞో సౌ కాలః కలయతాం ప్రభుః॥
(3 స్కంధం, 29 అధ్యా - 38వ శ్లో)

ఏది భూతములలో ప్రవేశించి, భూతములు ద్వారా ఆ భూతములను సంహరించునో, అది అఖిలాశ్రయం, అధియజ్ఞం, విష్ణ్వాఖ్యమునగు కాలం. ఇతరులను వశపరచుకొను వారికి కూడా అది ప్రభువై వుంది. అంతేకాక శ్రీ మద్భగవద్గీతలో కూడా -

"కాలః కలయతామహమ్" అన్నాడు శ్రీకృష్ణభగవానుడు. అనగా గణించువారిలో నేను కాలమును అని అర్థం.

అట్టి మహా మహిమాన్వితమైన కాలమును, కాలస్వరూపుడైన పరమాత్మను సేవించు సిద్ధాంతులచే రూపొందించబడునది కాలస్వరూపమైన 'పంచాంగం'

మనందరకు ఎల్లప్పుడు తప్పనిసరిగా వుపయోగపడటం 'పంచాంగాలు' ద్వైవిధ్యంగా వుండుటకు వీల్లేదు. మన పూర్వీకులు మనకంటే గొప్పవారు. వారి మార్గాన్ని అనుసరించుట మనకు శిరోధార్యము. ఈ విషయములో ఎవరు తప్పు చేసినా, వారు క్షమార్హులుగారు. మనం సమాజానికి మేలు జరిపే ప్రయత్నంలో భాగస్వాములం కాని, వారిని తప్పుద్రోవ పట్టించే అధికారం మనకు లేదు. విజ్ఞులందరు ఈ విషయంలో సహృదయతతో సహకరిస్తారని ఆశిస్తున్నాను.

ధర్మపరిరక్షణ మంటే ధర్మాచరణమే మరియు లోక కళ్యాణం ఈ రెండే మన ప్రధాన కర్తవ్యాలు. ఇందుకుగాను శాస్త్రప్రమాణంతో పాటు మన పూర్వీకుల మార్గమే మనకు శిరోధార్యం, అనుసరణీయం. తద్విరుద్ధంగా వున్న వారితో మనకు అవసరం లేదు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం.

ప్రస్తుతం మనమంతా ఒకే వేదికపైకి వచ్చాం. దీన్ని ఇలాగే కాపాడుకుందాం. దీనివల్ల మనకుగాని, ప్రజలకు గాని, ప్రభుత్వానికి గాని అన్ని విధాలా క్షేమమే జరుగుతుంది. ఇందులో ఎలాంటి విభేదాలకు తావుండదు. ఇది ముమ్మాటికి సత్యం. అనవసరపు రాద్ధాంతాలతో మన విలువలను మనం దిగజార్చుకోవద్దని సభాముఖంగా అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన వారందరికి, ఈ సభలను దిగ్విజయం చేయుటలో సహకరించిన వారందరికి వర్గల్ విద్యా సరస్వతీదేవి దివ్యానుగ్రహం లభించుగాక!

ప్రస్తుత కాలంలో కొందరు జ్యోతిషం మూఢ నమ్మకమని ప్రచారం చేస్తున్నారు. శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వారికి నిజానిజాలు స్పష్టంగా తెలుస్తాయి. జ్యోతిషం మూఢ నమ్మకం గాదు. ఎవరైతే దృఢ విశ్వాసంతో జ్యోతిశ్శాస్త్రాన్ని ఆశ్రయిస్తారో వారికి సంపూర్ణ ఫలితం లభిస్తుంది. ఒకవైపు ప్రభుత్వాలు, కోర్టులు జ్యోతిశ్శాస్త్రాన్ని సమర్థిస్తూ, విశ్వవిద్యాలయాల్లో కోర్సులు ప్రారంభించి డిగ్రీలు, పి.హెచ్‌డిలు అందిస్తుంటే జ్యోతిషం మూఢ నమ్మకం అనడం సమంజసం కాదు. యధార్థాన్ని ప్రజలు అర్థం చేసుకోగలరు.

అసలు వివాదాలే లేని జ్యోతిశ్శాస్త్రాన్ని వివాదాస్పదం చేయడం కూడా విడ్డూరం. సమర్థులు కాని వారితో అనవసరమైన చర్చలు జరిపి ప్రజల, పండితుల మనోభావాలను దెబ్బతీయడం మంచిది కాదు. చర్చలవల్ల ప్రయోజనం ఏ మాత్రం చేకూరదు. శాస్త్రాధ్యయనమే సర్వదా శరణ్యం. అధ్యయనం చేయువారికి ఈ సభలు దోహదం కాగలవు.

యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

వేదాంగ జ్యోతిష్యం - శాస్త్ర వైభవం

భారతీయ సంస్కృతికి, హిందూ సాంప్రదాయానికి మూలాధారము వేద వాఙ్మయము. మనకు వేదము నుండి సదాచారము, ధర్మము, అధర్మము మొదలుగా కలిగిన విషయాలు ఎన్నో సంప్రాప్తమైనవి. అంతే కాకుండా సామాజిక, వైజ్ఞానిక విషయాలన్నింటికీ మూల స్థానమైనటు వంటిది మన వేదము. భారతీయ విద్యలు అన్నీ కూడా వేదము నుండి ఉద్భవించినవే. వేదము యొక్క సమ్యక్ జ్ఞానాన్ని పొందడానికి వేద పురుషునికి షడంగముల యొక్క జ్ఞానము అత్యంత ఆవశ్యకము.

భగవత్పాద శ్రీ శంకరాచార్య కృత బ్రహ్మ సూత్ర భాష్య వ్యాఖ్యాన ప్రారంభంలో ఆచార్య వాచస్పతి మిశ్ర ఈశ్వరుడు, వేదము సామ్యతను యీ విధంగా తెలియజేసినారు.

శ్లో॥ షడ్భిరంగై రుపేతాయ వివిధైరవ్య యైరపి ।
శాశ్వతాయ నమస్కుర్మో వేదాయ చ భవాయచ ॥

ఈశ్వరునికి షడంగాలు, వేదానికి కూడా షడంగాలు. ఈశ్వరుడు అవ్యయుడు, వేదం కూడా అవ్యయము.

ఈశ్వరుని షడంగాలు :

శ్లో॥ సర్వజ్ఞతా తృప్తిరనాది బోధః స్వతంత్రతా
నిత్యమలుప్త శక్తిః ।
అనంత శక్తిశ్చ విభోర్విధిజ్ఞాః షడాహు
రంగాని మహేశ్వరస్య ॥

(వాయు పురాణం)

సర్వజ్ఞత్వం, నిత్యతృప్తి, నిత్యజ్ఞాన స్వరూపం, స్వతంత్రతా, అలుప్త శక్తిః, అనంతశక్తి, ఇవి ఈశ్వరుని షడంగాలు.

ఈశ్వరుని అవ్యయత్వం :

శ్లో॥ జ్ఞానం విరాగతైశ్వర్యం తపస్సత్యం క్షమా ధృతిః ।
ప్రష్టృత్వం ఆత్మసంబోధో హ్యాదిష్టాతృత్వమేవ చ ॥
అవ్యయాని దశైతాని నిత్యం తిష్ఠంతి శంకరే ॥



ఈశ్వరుడు అవ్యయుడు కనుక వేదం కూడా అవ్యయమైనటు వంటిది. జ్యోతిషమ్ వేదాంగం ఎలా అయినది అనే విషయానికి వస్తే -

శ్లో॥ వేదాస్తావ దృజ్ఞ కర్మ ప్రవృత్తా
యజ్ఞాః ప్రోక్తాస్తే తు కాలాశ్రయేణ ।
శాస్త్రాదస్మాత్ కాలబోధో యతః స్యాత్
వేదాంగత్వం జ్యోతిషస్యోక్త మస్మాత్ ॥

వేదంలో మనుష్యుల శ్రేయస్సుకై ఎన్నో విషయాలు చెప్పబడినవి. చెప్పబడిన యజ్ఞ యాగాది క్రతువులు విహిత కాలంలో చేయాలి. ఆ కాలం జ్యోతిశ్శాస్త్రం నుండి తెలుసు కోవలసి వస్తుంది. కనుక జ్యోతిష్యమును వేదాంగమన్నారు.

శ్లో॥ ఛందో పాదౌతు వేదస్య హస్తౌ తు కల్పోత ఉచ్యతే
జ్యోతిషామయనమ్ చక్షుః నిరుక్తం శ్రోత్రముచ్యతే ।
శీక్షా ఘ్రాణంతు వేదస్య ముఖం వ్యాకరణం స్మృతం
తస్మాత్ సాంగ మధీత్య ఏవ బ్రహ్మలోకే మహీయతే॥

అవి (1) శిక్ష, (2) కల్పం, (3) వ్యాకరణం, (4) నిరుక్తం, (5) ఛందస్సు, (6) జ్యోతిషం.

1) శిక్ష : మంత్రములను సరైన రీతిలో ఉచ్చరించడానికి ఉపయోగపడేటువంటి భాగము శిక్ష.

2) కల్పము : కర్మకాండ మరియు యజ్ఞమునకు సంబంధించిన విషయాలను అనుష్ఠించడానికి అనుష్ఠానమును తెలిపే భాగము కల్పము.

3) వ్యాకరణము : శబ్దముల రూప జ్ఞానము కొరకు వ్యాకరణము అనే భాగము.

4) నిరుక్తము : అర్థ జ్ఞాన నిమిత్తమై శబ్ద నిర్వచనము కొరకు నియోగింపబడిన భాగము నిరుక్తము.

5) ఛందస్సు : వైదిక ఛందస్సును తెలిపే భాగం ఛందస్సు.

6) జ్యోతిషము : వేద విహితమైన కర్మ కాండ, యజ్ఞ యాగాదుల పండుగలను అనుష్ఠించడానికి ఉచితానుచిత కాలాన్ని నిర్ణయించే శాస్త్రమే జ్యోతిశ్శాస్త్రము.

మహర్షి పాణిని వేద పురుషుని నేత్రంగా, జ్యోతిషామయనం చక్షుః అని ఉల్లేఖించినాడు. ఏ విధముగా నైతే మనుషులు నేత్రములు లేకుండా వస్తువులను చూడలేరో అదే విధంగా వేద శాస్త్రములను లేదా వేద శాస్త్ర విహిత కర్మలను, జ్యోతిశ్శాస్త్రము యొక్క జ్ఞానము లేకుండా ఆచరించలేరు. భూ గోళము, అంతరిక్షం (అంటే అంతరిక్షంలో ఉన్నటువంటి గ్రహాలు, నక్షత్రాలు), భూగర్భంలో ఉన్న వస్తువుల గురించిన జ్ఞానం మరియు త్రైకాలిక (మూడు కాలాలకు సంబంధించిన) యథార్థ జ్ఞానాన్ని తెలిపే శాస్త్రమే జ్యోతిశ్శాస్త్రము. అందు వలన జ్యోతిశాస్త్రం వేద పురుషుని ప్రాధాన్యమైన అంగము చక్షువుగా చెప్పబడింది. ఉదయం లేచింది మొదలుకొని పడుకునే వరకు గల దినచర్య, సంపూర్ణ జీవనచర్య, గర్భము దాల్చినది మొదలుకొని మరణము వరకు, భవిష్యత్తుకు సంబంధించిన విషయాలు పరలోక పునర్జన్మ విషయాలు మరియు భూత, వర్తమాన, భవిష్యత్ విషయాలెన్నింటినో తెలిపేటటువంటి శాస్త్రము జ్యోతిశ్శాస్త్రము. కనుక భాస్కరాచార్యుడు జ్యోతిశ్శాస్త్రమును ఒక కరదీపికగా వర్ణించడం జరిగింది.

శ్లో॥ యదుపచిత మన్య జన్మని శుభాశుభం తస్య
కర్మనహః పక్తిమ్
వ్యజ్జయతి శాస్త్రమేతత్ తమసి ద్రవ్యాని దీప ఇవ ॥
(లఘు జాతకం)

శ్లో॥ కర్మార్జితం పూర్వభవే సదాది యత్తస్య
పక్తిమ్ సమభివ్యనక్తి

జన్మ జన్మాంతరములలో అంటే వేరే జన్మములలో చేసినటువంటి శుభాశుభ కర్మలకు అనుగుణముగా ఫలములను - ఫల ప్రాప్తి సమయములను విధిగా వ్యక్తీకరిస్తుంది. ఏ విధంగానైతే అంధకారంలో ఉన్న వస్తువులను దీపం వ్యక్తీకరిస్తుందో అదే విధంగా జ్యోతిశాస్త్రము తెలియజేస్తుంది. అందుకే వేద పురుషునికి నేత్రంగా చెప్పడం జరిగింది. నేత్రం యొక్క ప్రధాన కర్తవ్యం **సమ్యక్ అవలోకనం**. అంటే వస్తువులను బాగుగా చూడడము. అయితే జ్యోతిశ్శాస్త్రము అనే నేత్రము మానవుని సామాన్య నేత్రముతో సమానమైనటువంటిది కాదు. ఇందులో భ్రమ, ప్రమాదాల మూలకంగా దృష్టి దోషము రావడంతో వస్తువులను యథార్థంగా చూడలేని పరిస్థితి ఎదురు కాగలదు. అందువలన మిథ్యాభావముతో ఉండడం జరుగుతుంది. కానీ వేద పురుషుని నేత్రం అలాంటిది కాదు. ఇది **ఒక దివ్యజ్ఞానం. దివ్యదృష్టి**. ఈ దివ్య దృష్టితో సంపూర్ణ బ్రహ్మాండమును, సమస్త చరాచరముల ప్రత్యక్ష - అప్రత్యక్ష, వ్యవహిత - అవ్యవహిత, సమస్త కర్మలు, హస్తామలకమై స్పష్ట దృగ్గోచరమవు చున్నవి. శరీరంలో **అన్ని భాగాలు బలంతో సవ్యంగా ఉన్ననూ,** నేత్రములు లేని ఎడల వ్యక్తి స్వయంగా పనులు చేయడంలో ఏ విధంగానైతే సర్వదా అసమర్థుడవు తున్నాడో అదే విధంగా అన్ని శాస్త్రముల అవగాహన పాండిత్యము ఉన్ననూ, **జ్యోతిశ్శాస్త్రము లేకుండా వేద విద్య నభ్యసించిన వ్యక్తి అపూర్ణతతో ఉండగలడు.** కనుక జ్యోతిశ్శాస్త్రము అతి ముఖ్యమైన ప్రాధాన్యతను కలిగి ఉన్నటువంటి శాస్త్రము అని చెప్పడంలో సందేహము లేదు.

కృషి, వ్యాపారము, ఉద్యోగము, యజ్ఞము, సదాచారములు, ధర్మాధర్మములు, వ్యవసాయము మరియు

మనిషి యొక్క జీవనయాత్రకు సంబంధించిన శుభ కాల నిర్ణయమునకు జ్యోతిశ్శాస్త్రము ఒక్కటే సాధనంగా ఉన్నది. వేదవిహిత కర్మలు ఏ కాలంలో చేస్తే శ్రేష్ఠం, ఏ ముహూర్తం ఉత్తమమైనది అనే విషయాలను తెలుసు కోవడానికి కాలం యొక్క జ్ఞానం ఆవశ్యకం. అందుకే వసిష్ఠాది మహర్షులు **ఈ జ్యోతిశ్శాస్త్రాన్ని కాలవిధాన శాస్త్రం అని అన్నారు.**

శ్లో॥ వేదాహి యజ్ఞార్థమభి ప్రవృత్తాః ।
కాలానుపూర్వా విహితాశ్చ యజ్ఞాః ॥
తస్మాదిదం కాలవిధాన శాస్త్రం ।
యో జ్యోతిషం వేద స వేద సర్వం ॥

(విష్ణు ధర్మోత్తర పురాణం, పితామహ సిద్ధాంతం)

కాల విధాన శాస్త్రమైన జ్యోతిశ్శాస్త్రాన్ని కాలం గురించి తెలుసుకోవడం అత్యంత ఆవశ్యకం.

కాలతత్త్వం :

శ్లో॥ ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం
యాతిక్షయం యౌవనం
ప్రత్యాయాన్తి గతాః పునర్న దివసాః
కాలో జగద్భక్షకః ।
లక్ష్మీ స్తోయ తరంగ భంగ చపలా విద్యుచ్చలం జీవితం
తస్మా న్మాం శరణాగతం కరుణయా
త్వం రక్ష రక్షాధునా ॥

(శివాపరాధ క్షమాపణ స్తోత్రం)

కాలమనేటువంటిది భగవత్ స్వరూపం. నిర్గుణ – నిరాకార, సగుణ – సాకార, అనాది – అనంత, సర్వవ్యాపక– సర్వశక్తిమంతమైనదిగా వ్యవహరించ బడుతుంది. అందుకే **కాలాఽధీనం జగత్సర్వం** అన్నారు. సర్వ ప్రాణుల వ్యావహారిక, పారమార్థికమైన అన్ని పనులు కాలాధీనమైనవి. ఆ కాలము జ్యోతిశాస్త్ర ఆధీనమై యున్నది. కనుక మనలో **ఒక జిజ్ఞాస ఉద్భవిస్తుంది.** ఏమని అంటే అసలు కాలం యొక్క పరిభాష ఏమిటి అని? ఈ జగత్తులో ప్రతీ దృశ్య పదార్థము పరివర్తనము చెందుతుంది. ఈ పరివర్తనము చెందుతుంది అనే విషయాన్ని తెలుసు కోవడానికి హేతు (కారణ) భూతమైనటువంటిదే కాలమని వసిష్ఠాది ఋషులు, మహర్షులు నిర్వచించినారు. భూత, వర్తమాన, భవిష్యత్ అనేవి వ్యవహారంలో విభిన్నముగా యున్ననూ పరమార్థం ఒకటే. అంటే కాలం ఒకటే. కాలానికి వశీభూతమై బ్రహ్మ దేవుడు సృష్టి రచన చేస్తాడు. విష్ణువు పరిపాలిస్తాడు. శివుడు సంహారం చేస్తాడు. కాలానికి వశీభూతమై వసంతాది ఋతువులు, ప్రాతర్, మధ్యాహ్న, సాయం కాలములు ఇవన్నీ కాలం యొక్క ప్రతిరూపాలే. అంతే కాకుండా మనుష్యుల యొక్క జనన, మరణాలు, బీజము అంకురముగా మారడము తదనంతరం వృక్షమై పుష్పించి ఫలించి మళ్లీ నశించడం కాలానుసారంగా జగత్తులో జరుగుతున్నటువంటి ప్రక్రియ. **"కాలో బ్రహ్మ। కాలే సర్వం ప్రతిష్ఠితమ్"** ఇది వేద వాక్యం.

పురాణ వచనము :

శ్లో॥ కాలః సృజతి భూతాని కాలః సంహరతి ప్రజాః ।
అగ్నిష్టోమాత్మకం జగత్ ॥

సూర్య అగ్ని, చంద్ర సోమ – యీ రెండింటితో పంచ మహాభూతాలు కుజాది పంచతారా గ్రహములు ఉత్పన్న మైనవి. దాని తర్వాత క్రమంగా సృష్టి వికాసమైనట్లుగా తెలుస్తుంది.

కాల గణన అనేది జ్యోతిశ్శాస్త్రానికి ప్రధానమైనటువంటి అంశం. కాల గణనకు ముఖ్యమైనటువంటివి సూర్య చంద్రులు. మరియు భూమి, గ్రహములు, నక్షత్రములు మొదలగు ఖగోళంలో ఉన్నటువంటి భౌతిక గ్రహములు. అందుకే వీటి గమనాన్ని ఆధారంగా చేసుకొని కాలాన్ని గణించడం జరుగుతుంది. ఈ సూర్యచంద్రుల యొక్క గమనాన్ని ఆధారంగా చేసుకొని రచించినవే పంచాంగములు. పంచాంగములు కాల స్వరూపములు. పంచాంగ కర్తలు దైవజ్ఞులు.

ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం :

శ్లో॥ అప్రత్యక్షాణి శాస్త్రాణి వివాదాస్తేషు కేవలమ్ ।
ప్రత్యక్షం జ్యోతిషమ్ శాస్త్రం చంద్రార్కౌ యత్ర సాక్షిణౌ ॥

నక్షత్ర గ్రహ ప్రభావం సర్వ మానవాళిపై యుంటుంది. కనుక జ్యోతిష్ రూప (దృష్టి) మైన నేత్రము యొక్క ఆవశ్యకత యున్నది. "ధాతవః అనేకార్థాః" అను వచనానుసారం "దృశిర్ ప్రేక్షణే" దృశ్ అనే ధాతువు జ్ఞానం (ప్రజ్ఞ) అనే అర్థ గోచరము

వలన **జ్యోతిశ్శాస్త్రం త్రైకాలిక ప్రభావాన్ని తెలియజేసే** శాస్త్రంగా పరిగణించడం జరిగినది.

జ్యోతిశ్శాస్త్రం – శాసనాత్ శాస్త్రం – కర్తవ్యా కర్తవ్య విషయాలను శాసించునది.

శాస్త్రత్వం శంసనాదపి – సంపూర్ణ అర్థమును తెలియ జేయునది.

అంతేగాకుండా సమస్త శాస్త్రములు అప్రత్యక్షములు, విభిన్న శాస్త్రములలో ఒకరు చెప్పిన దానిని మరొకరు ఖండించడం లేదా శ్లాఘించడం మూలంగా వివాదమాత్రంగా మిగులుతున్నాయి. కానీ జ్యోతిశ్శాస్త్రం ప్రత్యక్ష శాస్త్రం. దీనికి సాక్షీభూతులు సూర్యచంద్రులు. వేదంలోను చెప్పబడినట్టుగా "చంద్రమా మనసో జాతశ్చక్షోः సూర్యో అజాయత".... వేద పురుషుని యొక్క మనస్సు నుండి చంద్రుడు, నేత్రముల నుండి సూర్యుడు ఉద్భవించిరి. వేదము యొక్క ప్రవృత్తి యజ్ఞ సంపాదన మరియు యజ్ఞ విధానము విశిష్ట సమయములలో ఆచరించ వలసి వస్తుంది. యజ్ఞం కొరకై సరైన సమయం, సంవత్సరం, మాసము, ఋతువు, తిథి, నక్షత్ర, పక్ష, దినం, రాత్రి మొదలైనవి జ్యోతిశ్శాస్త్రం ద్వారా పొంది ఆచరించవలసి వుంటుంది. కనుక వేదోక్త నియమ నిర్వహణ కొరకు జ్యోతిశ్శాస్త్ర నితాంతం (సర్వదా) ఆవశ్యకం.

భారతీయ ఋషులు తమ దివ్య ప్రతిభా జ్ఞానంతో అపరోక్షానుభూతితో యీ శాస్త్రాన్ని ఉద్భవింప చేసినారు. ఆ పౌరుషేయమైన వేద సంహితలో సంక్షిప్తంగా ఖగోళీయ గ్రహ గణన మరియు వాటి గతులు నిరూపింప బడినవి. ఈ వేద జ్ఞానాన్ని అనేక మంది ఋషులు వారి వారి శైలిలో చెప్పడం జరిగినది. దీనిని మొట్టమొదట ఉపదేశించిన వారు పితామహ బ్రహ్మగా శాస్త్రములలో చెప్పడం జరిగినది. తదనంతరం యీ జ్యోతిశ్శాస్త్రాన్ని వసిష్ఠ, నారద, బృహస్పతి, గర్గ, పరాశర, వ్యాస, అత్రి, కశ్యప, పులస్త్య మరియు లోమశ అను మహర్షులచే సంరక్షింపబడి, కొంత పరివర్తనంతో వరాహ మిహిరుడు, లగధుడు మొదలగు దైవజ్ఞులకు సంప్రాప్తమయినది. దైవము యొక్క గతిని తెలుసుకునే జ్యోతిర్వేత్తలను దైవజ్ఞులుగా పిలవడం జరిగినది.

శ్లో॥ సూర్యో పితామహో వ్యాసో వసిష్ఠోఽత్రి పరాశరః ।
కశ్యపో నారదో గర్గో మరీచి ర్మనురంగిరాः ॥
లోమశः పౌలశశ్చైవ చ్యవనో యవనో భృగుः।
శౌనకోష్టాదశశ్చైతే జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకాः ॥

ఖగోళ శాస్త్ర చరిత్రను పరీక్షించి చూసినట్లయితే, పూర్వము 18 సిద్ధాంతములు అనగా 18 మంది ఋషులు, గణితవేత్తలు, ఆయా కాలములలో గ్రహగతిని గూర్చి గ్రంథములలో వ్రాసినట్లుగా విశదమగుచున్నది. అవి (1) సూర్య సిద్ధాంతము, (2) పితామహ (బ్రహ్మ) సిద్ధాంతము, (3) వ్యాస సిద్ధాంతము, (4) వసిష్ఠ సిద్ధాంతము, (5) అత్రి సిద్ధాంతము, (6) పరాశర సిద్ధాంతము, (7) కశ్యప సిద్ధాంతము, (8) నారద సిద్ధాంతము, (9) గర్గ సిద్ధాంతము, (10) మరీచి సిద్ధాంతము, (11) మను సిద్ధాంతము, (12)ఆంగీరస సిద్ధాంతము, (13) లోమశ (రోమక) సిద్ధాంతము, (14) పౌలస్య సిద్ధాంతము, (15) చ్యవన సిద్ధాంతము, (16) యవన సిద్ధాంతము, (17) భృగు సిద్ధాంతము, (18) శౌనక సిద్ధాంతము. ఈ 18 సిద్ధాంతములలో ఆ కాలానికి కేవలం 5 సిద్ధాంతముల ద్వారా వచ్చిన గ్రహగతి, గ్రహణములు అనుభవంలోకి వస్తున్నాయని అనగా దృక్ గోచరమవుతున్నాయని కొన్ని వేల సంవత్సరముల క్రితమే మహర్షి వరాహ మిహిరుడు చెప్పియున్నాడు. కనుక ఆ సమయానికి అనుకూలత ఉండే పంచసిద్ధాంతిక అనే గ్రంథమును వ్రాసినాడు. అది 5 సిద్ధాంతముల సారాంశము. అవి ఏమనగా పౌలశ్య, రోమక, సూర్య, బ్రహ్మ, వసిష్ఠ సిద్ధాంతములు.

ఇందులో బ్రహ్మ, వసిష్ఠ సిద్ధాంతములు సరిపోవటం లేదు. పౌలశ్య, రోమక, సూర్య సిద్ధాంతములు ఆ కాలమునకు సరిపోవుచున్నవి అని తన గ్రంథములో వ్రాయడం జరిగినది. అందులో సూర్యసిద్ధాంతము అనే గ్రంథములో అనేకానేక విషయాలు తెలియజేయడం జరిగింది. గ్రహముల యొక్క వ్యాసార్ధములు, ఉపరితల వైశాల్యములు చాలా ఖచ్చితముగా 1% తేడాతో ఆధునిక విజ్ఞానానికి సరిపోయేటట్టుగా తెలియజేయడం జరిగింది. ఇది మన భారతీయ ఖగోళ శాస్త్రానికి ఒక గొప్ప చెప్పుకోదగినటువంటి విషయముగా ఆధునిక శాస్త్రవేత్తలు

పరిగణిస్తున్నారు. ఇందులో బుధ, గురు, శని గ్రహముల విషయంలో దాదాపు వైశాల్యము, వ్యాసార్ధములలో 45% ఆధునిక విజ్ఞానానికి వ్యత్యాసము గోచరిస్తున్నది. అంతేకాకుండా సూర్యసిద్ధాంతంలో గ్రహాలు పరిభ్రమించే మార్గాన్ని వృత్తంగా తెలియజేయడము జరిగింది. అంతేకాకుండా భూమిచుట్టూ సూర్యుడు మొదలుగా కలిగినటువంటి గ్రహములన్నియూ పరిభ్రమిస్తాయని అనే విషయాన్ని తెలియజేయడం జరిగింది. కానీ ఆధునిక శాస్త్రం ప్రకారంగా సూర్యుడి చుట్టూ గ్రహాలు దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తాయనే విషయము అందరికీ తెలిసిన విషయమే.

కనుక పూర్వ సిద్ధాంతము, ఆధునిక సిద్ధాంతములను గమనించి నట్లయితే గ్రహముల యొక్క కక్ష్య ఆకారములలో తేడా ఉండడం మూలంగా గ్రహ గణితములో తప్పనిసరిగా వ్యత్యాసము వచ్చే అవకాశాలు ఉన్నాయి. మధ్యే మార్గంలో కొంతమంది గ్రహణ, మౌఢ్యాదులను దృక్ గణితం ప్రకారంగా తీసుకొని తిథి నక్షత్రాదులను పూర్వసిద్ధాంతం ప్రకారంగా తీసుకొని వ్రతాదులు ఆచరించ వలయుననేటువంటి విషయాన్ని ప్రజల్లోకి తీసుకొని వచ్చినారు. కానీ అది సరియైన పద్ధతి కాదు. ఎందుకనగా వేదవిహిత మైనటువంటి కర్మలను, యజ్ఞ యాగాదులను సరియైన సమయములలో ఆచరించుటకు ఉపయోగ పడేటువంటి శాస్త్రమే ఖగోళ జ్యోతిశ్శాస్త్రము. పూర్వ పద్ధతి ప్రకారంగా సరియైన సమయములు రానప్పుడు దానిని దృష్టిలో పెట్టుకొని కార్యాలు ఆచరించడము వేదవిహితమైనటువంటి విషయాలకు విఘాతమనే చెప్పాలి. ఈ విషయంలో కంచి పరమాచార్యులు దాదాపు 60 సంవత్సరాల క్రితము కుంభకోణంలో భారతదేశంలో ఉన్నటువంటి ఖగోళ శాస్త్రవేత్తలను, వేద పండితులను, శాస్త్ర పండితులను, గణిత శాస్త్రజ్ఞులతో ఒక సదస్సును ఏర్పాటు చేసి అందులో శాస్త్ర విషయమై సుదీర్ఘచర్చ జరిపిన తరువాత దృక్‌సిద్ధాంతము సర్వత్రా సదా ఆచరణీయము అనేటువంటి విషయాన్ని నిర్ణయించడం జరిగింది. దానికి అనుగుణంగా కంచి పీఠము వారు దృక్‌సిద్ధాంత పంచాంగమును అప్పటి నుండి ప్రచురించడం జరుగుతున్నది.

అంతేకాకుండా ఏ గ్రంథము కూడా ఎల్లకాలము సరియైన గ్రహగతిని గ్రహణ సమయములను ఇవ్వజాలదు అని కూడా ఆ గ్రంథములో పేర్కొనడము జరిగినది. కనుక పండితులు, విజ్ఞులు, గణిత శాస్త్రవేత్తలు దృక్ తుల్యతకు సరిపడే గణితాన్ని సూత్రీకరించి తయారు చేసుకోవలసిన ఆవశ్యకతను అప్పుడే చెప్పియున్నాడు అనే విషయాన్ని అందరూ గమనించవలసినది. అనగా గణితమును ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ కాలానుగుణంగా సూత్రీకరించి గణితము చేయవలయును.

శ్లో॥ ఆర్య బ్రహ్మ వరాహ భాస్కర ముఖజ్యోతి ర్విదైః కృతాన్ ।
సిద్ధాన్తానపి దృక్ప్రతీతి రహితాన్ దృష్ట్వా గణేశో కరోత్ ।
విఖ్యాతం గ్రహ లాఘవం తదపి దృక్ సామ్యం న దత్తేధునా ।
తస్మాత్ దృక్ సమతా ప్రపూర్ణ గణితం గ్రంథామ్యహం వేంకటః ॥

శాలివాహన శకం 421 సంవత్సరంలో ఆర్యభట్టీయం, శా.శ. 550 సంవత్సరంలో బ్రహ్మస్ఫుట సిద్ధాంతం, 427లో పంచక సిద్ధాంతం, 854లో మంజులాచార్య వ్రాసిన లఘు మానసం, 961లో శ్రీపతి వ్రాసిన సిద్ధాంత శేఖరం, 1036లో భాస్కరాచార్యుడు వ్రాసిన సిద్ధాంత శిరోమణి, 1442లో గణేశ దైవజ్ఞులు వ్రాసిన గ్రహలాఘవం, మకరందీయం, గణకానందం మొదలగు గ్రహగతులను తెలిపే గ్రంథములు ఆయా సమయములలో దృక్ తుల్యతకు సరిపడేటట్లుగా వ్రాసిన గ్రంథములే. శాలివాహన శకం 1818లో శ్రీ వేంకటేశ్వర శాస్త్రి కేత్కర్ అనే గణిత శాస్త్రవేత్త దృక్ సిద్ధాంత గ్రంథాన్ని కేతకీ గ్రహ గణితం అనే పేరుతో ఆచరణలోకి తీసుకు రావడం జరిగింది. అది ప్రస్తుతము గ్రహగతులు, గ్రహణములు, మౌఢ్యాదులు, గ్రహ రాశీ ప్రవేశాలు అన్నీ దృక్ తుల్యతకు సరియైన ఫలితాలను ఇస్తున్నవి. అంటే భారత ప్రభుత్వము ప్రచురిస్తున్న ఎఫ్‌మరీస్, నాసా వాళ్లు ప్రచురిస్తున్న గ్రహగతులకు సరిపోతున్నది. కనుక దృక్ గణితం ప్రకారంగా వస్తున్న గణితమే సర్వదా సర్వత్ర ఆచరణీయము.

శ్లో॥ మూర్తిత్వే పరికల్పితః శశిభృతో
వర్త్మామ పునర్జన్మనాం ।
ఆత్మేత్యాత్మ విదాం క్రతుశ్చ యజతాం భర్తా
మరజ్యోతిషాం ।
లోకానాం ప్రళయోద్భవ స్థితి విభుశ్చానే కథాయః
శ్రుతౌ ।
వాచం నః ప్రదదాత్వనేక కిరణ స్త్రైలోక్య దీపో రవిః ॥

సూర్యభగవానుడు సమస్త బ్రహ్మాండానికి ఆత్మ స్వరూపుడు. సూర్యుడు భూమి మరియు స్వర్గ లోకముల మధ్యన ఆకాశ మండలములో కాలచక్రములో గ్రహములతో స్థితియై ఉన్నాడు.

సూర్యుని యొక్క కిరణములకు ఒక లక్ష యోజనముల పై భాగంలో చంద్రుడు స్థిరమై యున్నాడు. చంద్రుని యొక్క గతి చాలా వేగవంతమైనది. కనుక అన్ని నక్షత్రముల కంటే ముందు ప్రయాణించడం జరుగుతున్నది. చంద్రుని నుండి ఒక లక్ష యోజనముల పైన అభిజిత్‌తో కూడుకొన్న 28 నక్షత్రముల యొక్క మండలము స్థిరమై యున్నది. భగవంతుడు ఈ కాలచక్రాన్ని నియుక్తం చేసి యున్నాడు.

చంద్రుని నుండి రెండు లక్షల యోజనముల పైన శుక్రగ్రహము స్థిరమై యున్నది.

బుధుడు శుక్రుని పైన రెండు లక్షల యోజనములపై స్థిరమై యున్నాడు. బుధుని యొక్క పై భాగములన రెండు లక్షల యోజనముల పైన కుజగ్రహము స్థిరమై యున్నది. కుజ గ్రహముపై రెండు లక్షల యోజనముల పైన గురు గ్రహము స్థిరమై యున్నది. గురు గ్రహముపై రెండు లక్షల యోజనముల పైన శని గ్రహము స్థిరమై యున్నది. శని గ్రహము యొక్క పై భాగమున 11 లక్షల యోజనముల దూరంలో సప్తర్షి మండలము స్థిరమై యున్నది. సప్తర్షి మండలం యొక్క పై భాగమున 13 లక్షల యోజనముల దూరంలో ధృవ మండలము స్థిరమై యున్నది. ఇది భగవంతుని యొక్క పరమపద మండలంగా పరిగణిస్తారు. ఇది శ్రీమద్ భాగవతములో చెప్పబడి యున్నది.

ధర్మానికి 3 స్కంధములు (ఆధార స్తంభాలు)లుగా వేదం చెప్పినది. అదే విధంగా జ్యోతిశ్శాస్త్రానికి 3 స్కంధములు ధర్మ స్కంధములు.

జ్యోతిశ్శాస్త్ర వైభవం :

శ్లో॥ చాతుర్వర్ణ్యం త్రయో లోకాశ్చరశ్చాశ్రమాః పృథక్
భూతం భవ్యం భవిష్యంచ సర్వం వేదాశ్చ సిధ్యతి ।
పితృదేవ మనుష్యాణాం వేద చక్షు స్సనాతనమ్ ।
తచ్చక్షుర్జ్యోతిషం శాస్త్రం దివ్యం జ్ఞానమతీంద్రియమ్॥

శ్లో॥ యథా శిఖా మయూరాణాం నాగానాం మణయో యథా
తద్వత్ వేదాంగ శాస్త్రాణాం జ్యోతిషం
మూర్ధ్ని సంస్థితం॥

జ్యోతిషం వేదాంగములలో మూర్ధ స్థానీయ మైనటు వంటిది. ఏ విధంగానైతే నెమలి శిఖ తలపై, సర్పముల మస్తకం పైన మణి యున్నట్లుగా, వేదాంగములలో జ్యోతిషానికి సర్వ శ్రేష్ఠ స్థానమైనటు వంటి మూర్ధ్ని స్థానం సంప్రాప్తమై యున్నది. కొన్ని యజ్ఞాలకు సంవత్సరముతో, కొన్నింటికి ఋతువులతో ముడిపడి యున్నవి. తెత్తిరీయ బ్రాహ్మణంలో –

"వసంతే బ్రాహ్మణోగ్ని మాదధీత । గ్రీష్మే రాజన్య ఆదధీత ।
శరది వైశ్య ఆదధీత"

బ్రాహ్మణులు వసంత ఋతువులో అగ్న్యాధానము చేయవలె. క్షత్రియ, వైశ్యులు వరుసగా గ్రీష్మ, శరత్ ఋతువులలో చేయవలె. "ఏకాష్ట కాఆయం దీక్షేరన్ ఫాల్గుణి పూర్ణిమాసి దీక్షేరన్". ప్రాతర్జుహోతి, సాయంజుహోతి, చేయు విధి విధానం వేదం తెలుపుతుంది. సమయ నిర్వహణ కొరకై జ్యోతిష శాస్త్రం అవసరం అవుతుంది. యజ్ఞ సాఫల్యము కేవలం ఉచిత విధానంతో లేదు. ఉచిత నక్షత్ర, సమయములలో చేయడం వలన ఫలితము కలుగుతుంది. రాక్షస పరిభాషలో శ్రుతి వచనం : తే అసురా అయజ్ఞా అదక్షిణా అనక్షత్రాః చ్చ కించ అకుర్వతా తాం కృత్యామేవ అకుర్వతా॥ మృతో యజ్ఞస్తు అదక్షిణః ॥

శ్లో॥ యథా దినం వినా సూర్యం । శశాంకం శార్వరీ వినా
కుటుంబినో వినాపుత్రం శాస్త్రం వై జ్యోతిషం వినా ॥

శ్లో॥ జ్యోతిశ్చక్రేతు లోకస్య సర్వస్యోక్తం శుభా శుభమ్ ।
జ్యోతిర్జ్ఞానం చ యో వేద సయాతి పరమాంగతిమ్॥

శ్లో॥ దివ్యం చక్షుర్గ్రహాణాం దర్శితం జ్ఞాన ముత్తమమ్ ।
విజ్ఞాయార్కాది లోకేషు స్థానం ప్రాప్నోతి శాశ్వతం ॥

జ్యోతిశ్శాస్త్ర స్కంధములు :

శ్లో॥ సిద్ధాన్త సంహితా హోరా రూపం స్కంధ త్రయాత్మకమ్ ।
వేదస్య నిర్మలం చక్షుః జ్యోతిశ్శాస్త్ర మనుత్తమమ్ ॥
వినైతదఖిలం శ్రౌతం స్మార్త కర్మ నసిద్ధ్యతి ।
తస్మాత్ జగద్ధితాయేయం బ్రహ్మణా నిర్మితం పురా ॥

(నారద సంహిత)

1) సిద్ధాన్త (గణన భాగం), 2) సంహితా, 3) హోరా స్కంధం (జాతక భాగము)

స్కంధ త్రయాత్మకమైన జ్యోతిర్వేత్త యొక్క లక్షణం :

శ్లో॥ శాంతో వినీతః శుద్ధాత్మా దేవ బ్రాహ్మణ పూజకః ।
విముఖః పరనిందాసు వేద పాఠీ జితేంద్రియః ॥
దేవతారాధనాసక్తః స్వరశాస్త్ర విశారదః ।
సిద్ధాన్త సంహితా వేత్తా జాతకే చ కృత శ్రమః ॥
ప్రశ్నజ్ఞః శకునజ్ఞశ్చ ప్రశస్తో గణకః స్మృతః ।
ప్రమాణం వచనం తస్య భవత్యేవ న సంశయః ॥

త్రిస్కంధ పారంగతుడైన దైవజ్ఞుని యొక్క వచనం ప్రమాణమై తప్పకుండా అనుభవంలోకి వస్తుందనేది నిస్సందేహం.

స్కంధత్రయములందు పూర్తి జ్ఞానం లేని వాన్ని నక్షత్ర సూచి అంటారు.

శ్లో॥ అవి దిత్వైవ యః శాస్త్రం దైవజ్ఞత్వం ప్రపద్యతే ।
స పంక్తీ దూషకః పాపో జ్ఞేయో నక్షత్ర సూచకః ॥

(మహర్షి వశిష్ఠ)

1. సిద్ధాన్త స్కంధం (గణిత భాగం) :

శ్లో॥ తృట్యాది ప్రళయాంతకాల కలనా మాన ప్రభేదః ।
క్రమాత్ చారశ్చ దుసద్యాం ద్విధా చ గణితం
ప్రశ్నాస్తథా సోత్తరాః ॥
భూదిష్ణ గ్రహ సంస్థితేశ్చ కథనం
యంత్రాది యత్రోచ్యతే ।
సిద్ధాంతః స ఉదాహృతోత్ర గణిత స్కంధ
ప్రబంధే బుధైః॥

ఈ సిద్ధాన్త భాగంలో గణిత విద్య యొక్క ప్రాధాన్యత నిరూపించబడుతుంది. భాస్కరాచార్యుడు తన సిద్ధాన్త శిరోమణి అనే గ్రంథంలో తృటి (చాలా స్వల్పమైన కాలం) మొదలుకొని ప్రళయాంతము కాల గణన చేయబడింది. సౌర, సావన, నక్షత్ర, చాంద్రమాన భేదములను, గ్రహముల యొక్క మార్గీ, వక్రీ శీఘ్ర-మంద, నీచ-ఉచ్చ, దక్షిణ-ఉత్తర గతి వర్ణన, అంక గణిత, బీజ గణితములను తెలపడం జరిగింది. అధిక మాస, క్షయమాసం, సంసర్ప మాసం ప్రభవాది సంవత్సరములు.

2. సంహితా స్కంధం :

వ్యక్తికి సంబంధించిన విషయములను కాకుండా సార్వజనీనమైన దేశ, ప్రపంచ, సామూహిక దేశారిష్టములు, తుఫానులు, వర్ష సూచనలు, గ్రహ యుద్ధములు తద్వారా అరిష్టము, ఉల్కా పాతములు తత్ సంబంధిత సమయములను సిద్ధాన్త భాగ సమన్వయముతో చెప్పడం, మరియు ముహూర్త శాస్త్ర వర్ణన.

3. హోరా శాస్త్రం (జాతక శాస్త్రం)

శ్లో॥ భూ యోభిః పటు బుద్ధిభిః పటుధియాం
హోరాఫల జ్ఞప్తయే ।
శబ్ద న్యాయ సమన్వితేషు బహుశః శాస్త్రేషు దృష్టేష్వపి ।
హోరా తంత్ర మహార్ణవ ప్రతరణే
భగ్నోద్యమానా మహం ।
స్వల్పం వృత్త విచిత్ర మర్థ బహుళం
శాస్త్ర ప్లవం ప్రారభే ॥

(బృహత్ జాతకం)

శ్లో ॥ దశా ప్రభేదేన విచింత యేత్ దృఢం ।
దృఢేతరం చాష్టక వర్గ గోచరైః
దృఢా దృఢం యేగవశేన చింతయేత్
యతి త్రిధా జాతక సూక్ష్మ సంగ్రహః ॥

మానవుని యొక్క సుఖ దుఃఖములు, ఇష్టానిష్టాలు మొదలుగా గల అన్ని శుభాశుభ విషయములను యోచించి చెప్పే శాస్త్రమే హోరా శాస్త్రము.



అనాదికాలంనుండి అఖండభారతావనిలో తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి జనపదాలలో వేదకాలం నుండి సంక్రమించిన అనేక ధర్మాలూ, ఆచారాలూ విశిష్టతను సంతరించుకొని సమస్త దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచాయి. మహా భారతకాలంలో అశ్మకదేశంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం ఎన్నో రాజవంశాల చరిత్రలకు నిలయం. ఈ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రాంతాలనుండి ఆదాన ప్రదానాలుగా కొనసాగుతున్న వేషభూషలూ, ఆచారవ్యవహారాలూ నేటికీ పదిలంగా ఉన్నాయి. ఇవన్నీ భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ సంస్కృతికి అద్దం పడుతూ, విశ్వశ్రేయస్సును కాంక్షిస్తూ, కొనసాగుతున్నాయి. తెలంగాణలోని ప్రతి ఇల్లూ అతిథీ, అభ్యాగతులకు నెలవై, ఇక్కడి ప్రజల హృదయాలలోని సౌజన్యభావనలను ప్రతిబింబిస్తుంది. ఇక్కడి జనులలో తమకు ఉన్నంతలో ఇతరులకు పంచిపెట్టాలనే త్యాగ భావనలు అనాదిగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు దరిజేరితే అక్కునచేర్చుకొంటారనీ, నమ్మితే ప్రాణాలైనా ఇస్తారనీ నిరూపించారు. అందుకే తెలంగాణ ప్రాంతం ఒక విలక్షణమైన సమ్మేళనాల నిలయం.

ఈ ప్రాంతంలోనే పుట్టిన పండుగలలో 'బతుకమ్మ' పేరెన్నిక గన్నది. ఆకృతి ఆరాధనతో ముడిపడిన ఈ పండుగ అంటే అందరికీ ఎంతో ఇష్టం. మహాలయ అమావాస్యనాడు ప్రారంభమయ్యే బతుకమ్మపండుగ దుర్గాష్టమి పర్వదినం నాడు ముగుస్తుంది. అంటే భాద్రపద మాసాంతంలో ప్రారంభమై ఆశ్వీయుజమాసంలోని తొలిదినాలవరకు కొనసాగే ఈ పండుగ రోజుకొక్కతీరుగా పుష్పాలంకారములతో బతుకమ్మను ఆధిపరాశక్తిగా భావిస్తూ కొనసాగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణకు తల్లి వంటిది బతుకమ్మ. పూలతో కూడిన శిఖరాలుగా రూపొందించే బతుకమ్మలను ఇంటిముందు, ఊరిప్రధానకూడలిలో, చెరువు గట్లపై, దేవాలయ ప్రాంగణాలలో ఉంచి, వృత్తాకారంలో లయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఎన్నో నివేదనలతో ముత్తయిదువులైన స్త్రీలు, కన్యలూ పూజించడం బతుకమ్మ పండుగలోని విశేషాంశం. బతుకమ్మలను ఆటపాటలతో పూజించిన తరువాత జలనిమజ్జనం చేసి చద్దులు ఆరగించడం పరిపాటి. ఈ బతుకమ్మ పండుగ తొమ్మిదిరోజులు సాగుతుంది. ఆ తీరు ఇలా ఉంటుంది :-

ప్రతినిత్యం బతుకమ్మకు ఒక విధమైన నైవేద్యం సమర్పించడం సంప్రదాయం.

మొదటిరోజు : ఎంగిలిపూల బతుకమ్మ పితృదేవతలకు ప్రీతి పాత్రమైన మహాలయ అమావాస్యనాడు అర్చించే ఈ



బతుకమ్మను నువ్వులు, బియ్యపు పిండి, నూకలు కలిపిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. 'పెతరమాస'గా ప్రసిద్ధి చెందిన ఈ దినాన ఏది చూసినా, అది పితృ దేవతలకు చెందుతుందని భావిస్తారు.

రెండవరోజు : అటుకుల బతుకమ్మను పూజిస్తారు. ఈ దినాన చప్పటిపప్పు, బెల్లం, అటుకులను నైవేద్యంగా సమర్పిస్తారు.

మూడవరోజు : ముద్దపప్పు బతుకమ్మ. ఈ రోజు ముద్దపప్పు, పాలు, బెల్లంతో వండిన నైవేద్యాన్ని సమర్పిస్తారు.

నాలుగవ రోజు : నానిన బియ్యం బతుకమ్మ. నాన బెట్టిన బియ్యాన్ని, పాలు బెల్లంతో కలిపి నివేదిస్తారు.

ఐదవ రోజు : అట్ల బతుకమ్మ. ఈదినాన అట్లను నివేదిస్తారు.

ఆరవ రోజు : అలుక బతుకమ్మ. ఈ దినాన బతుకమ్మ అలుకబూనుతుందని భావించి, ఏ నైవేద్యాన్ని సమర్పించక పోవడం ప్రత్యకత.

ఏడవరోజు : వేపకాయల బతుకమ్మ. బియ్యపు పిండిని బాగా వేయించి, వేపపండ్ల ఆకృతిలో రూపొందించి బతుకమ్మకు నివేదిస్తారు.

ఎనిమిదవరోజు : వెన్నముద్దల బతుకమ్మ. నువ్వులు, వెన్న, నేయి, బెల్లం కలిపిన మధురపదార్థాన్ని నివేదిస్తారు.

తొమ్మిదవరోజు : చద్దుల బతుకమ్మ. దుర్గాష్టమినాడు ముగింపుగా జరిగే ఈ బతుకమ్మ పండుగ దినాన ఐదు రకాల చద్దులను అమ్మవారికి నివేదిస్తారు.

పెరుగుచద్ది, (దధ్యోదనం), చింతపులుపు చద్ది, (పులిహోర), కొబ్బరి చద్ది, నిమ్మచద్ది అనే ఐదు రకాల చద్దులు ఈ దినాన సమర్పిస్తారు.

బతుకమ్మ పండుగ పూర్తిగా తెలంగాణ ప్రాంతీయ పర్వదినం. ఈ పండుగకు సంబంధించిన ఒక ప్రాచీన కథ ఉంది. పూర్వం ఒక వీరుల కుటుంబంలో ఏడుగురు అన్నదమ్ములుండేవారు. వాళ్లందరూ వివాహితులు. వారికి ఒకే ఒక చెల్లెలుండేది. ఆ అమ్మాయి సౌజన్యమూర్తి. అన్నలకు ఆమె అంటే పంచప్రాణాలు. వదినలకు మాత్రం ఆమె అంటే ఎనలేని అసూయ. ఎప్పుడూ సూటిపోటి మాటలతో మనసును నొప్పించేవారు. ఒకనాడు అన్నదమ్ములంతా వేటకు వెళ్లారు. ఆ సమయంలో వదినలంతా కలసి ఆ అమ్మాయిని మానసికంగా ఎంతో వేధించారు. వారి మాటలకు తట్టుకోలేక ఆ అమ్మాయి ఇల్లొదిలి వెళ్లిపోయింది. ఆ తరువాత వేట ముగించుకాని అన్నలు ఇంటికి తిరిగి వచ్చారు. చెల్లెలు ఏదని భార్యలను నిలదీశారు. వాళ్లు ఏమీ సమాధానం చెప్పకపోయేసరికి, వాళ్లకు విషయం అర్థమై చెల్లెలికోసం వెదకడం ప్రారంభించారు. ఊరంతా గాలించారు. చెట్లూ, పుట్టలూ, వాగులూ, చెరువులూ గాలించారు. ఇలా తిండీ తిప్పలూలేక నిద్రాహారాలు మాని చెల్లెలిని వెదకడంలోనే తిరుగుతూ తిరుగుతూ ఊరి పొలిమేరలోని ఒక బావి వద్దకు చేరుకున్నారు. దాహం తీర్చుకుందామని నీటికోసం బావిలోకి తొంగిచూడగా, అందులో ఒక పెద్ద తామర పువ్వు కనబడింది. ఇంతలో ఆ రాజ్యాన్ని ఏలుతున్న రాజు కూడా వేటాడి దాహం తీర్చుకోవడం కోసం అదే బావిదగ్గరకు వచ్చాడు. దాహం తీర్చుకొని, కనువిందు చేస్తున్న ఆ తామరపువ్వును కోసుకొని, తీసికొనివెళ్లి తన తోటలోని కొలనులో వేశాడు. ఆ తరువాత ఆ కొలనుచుట్టూ

దట్టంగా తంగేడు మొక్కలు మొలిచాయి. కొంత కాలానికి ఆ అపురూపమైన తామరపువ్వుకు విష్ణుమూర్తి, ఒక స్త్రీరూపంగా చేశాడనీ, ఆమె లక్ష్మి అవతారమని చెప్పాడనీ ఐతిహ్యం. ఆమెకు బతుకమ్మ. పూలకు బతుకుతెరువు చూపింది కనుక బతుకమ్మ అయిందని అంటారు. మహిషాసురమర్దిని అయిన అమ్మవారే బతుకమ్మ అనీ మరొక కథ. ఇలా బతుకమ్మ తెలంగాణ పర్వదినంగా ప్రసిద్ధి గాంచింది.

తెలంగాణ ప్రాంత పర్వదినంగా ప్రపంచప్రసిద్ధిపొందిన మరొక పండుగ! **'సమ్మక్క - సారలమ్మ జాతర'**. తెలంగాణ ప్రాంతంలోని వరంగల్లుకు సమీపంలోని గిరిజన గ్రామమైన మేడారం గ్రామంలో జరిగే ఈ జాతర తెలంగాణరాష్ట్రంలో ఘనమైన పండుగగా జరుగుతుంది. మేడారంలో దట్టమైన అడవులు, కొండకోనల నడుమ ఈ చరిత్రాత్మకమైన జాతర జరుగుతుంది. పూర్వం జగిత్యాల ప్రాంతంలోని పొలవాస (పొలాస)ను పాలించిన మేడరాజు ఏకైక పుత్రిక సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణకోసం కాకతీయ ప్రభువు మొదటి ప్రతాప రుద్రుడు పొలాసపై దండెత్తి వచ్చాడు. అతని ధాటికి తట్టుకోలేక మేడరాజు మేడారానికి పారిపోయి, అజ్ఞాతవాసం గడిపాడు. మేడారం పాలకుడైన కోయరాజు పగిడిద్దరాజు కాకతీయులకు సామంతుడు. కరువు కాటకాలవల్ల రాజుకు కప్పాన్ని కట్టలేకపోయాడు. ఈ విషయం తెలుసుకొన్న మొదటి ప్రతాపరుద్రుడు తనకు కప్పం కట్టకపోగా, మేడ రాజుకు ఆశ్రయంకూడా కల్పించాడనే కోపంతో తన మంత్రి యుగంధరుడితో కలిసి మేడారంపై దండెత్తాడు. యుద్ధంలో పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, నాగమ్మ, జంపన్న, గోవింద రాజులు వీరోచితంగా పోరాడారు. కానీ, కాకతీయసైన్యాల ధాటికి తట్టుకోలేకపోయారు. తీవ్రంగా జరిగిన పోరులో మేడరాజు, పగిడిద్దరాజులు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు మరణించారు. వీళ్ల మరణవార్త విని జంపన్న సంపెంగవాగులో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. అందువల్ల సంపెంగవాగుకు **'జంపన్నవాగు'** గా పేరు వచ్చింది.



సమ్మక్క మాత్రం యుద్ధభూమిలో వీరోచితంగా పోరాడి, కాకతీయ సైన్యాలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆమె శౌర్యాన్ని చూసి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. చివరికి సమ్మక్క కూడా శత్రువుల ధాటికి తట్టుకోలేక రక్తధారలతోనే యుద్ధభూమినుండి నిష్క్రమించి, చిలుకగుట్ట-పైకి వెళ్తూ, దారిలోనే ఒక చిలుకగా మారిపోయి, అదృశ్యమైపోయింది. సమ్మక్కకోసం అనుచరులు గుట్టనంతా గాలించినా, ఫలితం లభించలేదు. చివరికి ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిణ కనబడింది. దానిని సమ్మక్క రూపంగా భావించి, ఆనాటినుండి ప్రతిరెండేళ్లకొకసారి మాఘశుద్ధ పౌర్ణిమనాడు 'సమ్మక్క- సారలమ్మ జాతర' జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ జాతరకు తెలంగాణా జనపదాలనుండే గాక సరిహద్దులోని ఇతరరాష్ట్రాలనుండి కూడా లక్షలాదిగా భక్తులు తరలి వచ్చి ఈ జాతరలో మొక్కులు తీర్చుకుంటారు.

తెలంగాణలో ఊరూరా ఉజ్జ్వలంగా కొనసాగే వేడుకలు బోనాలు. విశేషించి ఆషాఢమాసంలో బోనాలపండుగ మహావైభవంగా జరుగుతుంది. **'బోనం'** అంటే అమ్మవారికి నివేదించే నైవేద్యం. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో వండిన అన్నంతోబాటు పాలు, పెరుగు, బెల్లం, మొదలైనవాటితో కూడిన బోనాన్ని (భోజనాన్ని) మట్టి లేక రాగి కుండలలో పెట్టి, తమ తలపై మోస్తూ, మంగళవాద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి గుడికివెళ్లి సమర్పిస్తారు. ఈ బోనాలను పసుపు కుంకుమలతో, వేప రెమ్మలతో అలంకరించి, ముగ్గును రచించి, దానిపై ఒక దీపం ప్రమిదను వెలిగించి, గ్రామదేవతయైన మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ మొదలైన అమ్మవార్ల సన్నిధికి చేరుకొని పూజలు చేసి



సమర్పిస్తారు. ఈ బోనాలను కేవలం ఆషాఢమాసంలోనే కాకుండా శుభకార్యాలు జరిగిన ప్రతి సందర్భంలోనూ సమర్పించడం తెలంగాణ ప్రాంతంలో పరిపాటి.



సాధారణంగా చాంద్రమాన సంవత్సరంలో చైత్రమాసం నుండి ఫాల్గుణమాసం వరకు సంవత్సరాన్ని గణించడం జ్యోతిశ్శాస్త్ర సంప్రదాయం. చిత్రానక్షత్రంతో కూడిన పూర్ణిమ సంభవించే చైత్రమాసంతో పండుగలు ఆరంభమౌతాయి. చైత్రశుద్ధ పాడ్యమినాడు సంవత్సరపు తొలిపండుగను 'ఉగాది' అంటారు. 'యుగాది' అనే పదమే ఉగాదిగా రూపాంతరం చెందింది. ప్రతిమాసారంభదినాన్ని యుగాదిగా భావించడం కాలగణనలోని ఒక అంశం. ఉగాదినాడు ఉషోదయాననే మంగళస్నానాలు చేసి, నూతన వస్త్రాలను ధరించి, ఇష్టదేవతలను ఆరాధించడం, షడ్రుచుల వేపపచ్చడిని, మధురపదార్థాలనూ వండి దేవతలకు నివేదించడం, వేప పచ్చడిని ప్రసాదంగా స్వీకరించడం, దేవాలయాలను సందర్శించడం, తిథివారనక్షత్ర యోగకరణాలతో కూడిన పంచాంగంలోని విశేషాలను పరించి, తెలుసుకోవడం సర్వత్ర కనబడే అంశం. చైత్రశుద్ధ షష్ఠినాడు కుమారస్వామి జన్మతిథి అయిన షష్ఠితిథినాడు పండుగజరుపుకోవడం ఆనవాయితీ.



చైత్రశుద్ధనవమినాడు శ్రీరామజన్మ దినోత్సవాన్ని సీతారాముల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని, ఘనంగా భద్రాద్రిలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణాన్ని జరుపుతారు. ప్రతిపల్లెలోను, ప్రతి దేవస్థానాలలోనూ విశేషోత్సవంగా శ్రీరామనవమి వేడుకలు జరుగుతాయి. నవమి మొదలుకొని తొమ్మిది రోజులపాటు నవరాత్రోత్సవాలను కూడా భక్తిశ్రద్ధలతో జరుపుతారు. చైత్రశుద్ధ పూర్ణిమనాడు హనుమంతుడు సీతాదేవి జాడ తెలుసుకొని, లంకపై విజయం సాధించినందుకు గుర్తుగా ప్రజలంతా హనుమద్విజయోత్సవాన్ని జరుపుకొంటారు. చైత్రశుద్ధ తృతీయనాడు చైత్రగౌరీదేవిని ఇంటింటా ప్రతిష్ఠించి, ఒక నెలరోజుల దాకా అర్చించడం సంప్రదాయం.

వైశాఖమాసంలో తెలంగాణ జనపదాలలో శివునికి, ఆంజనేయునికి, కాలభైరవునికి పత్ర (ఆకు) పూజలు చేయడం కనబడుతుంది. ఈ పూజలలో బెల్లంతో చేసిన పానకాన్ని, గుడాలనూ నైవేద్యంగా సమర్పించి, తీర్థప్రసాదాల రూపంలో స్వీకరిస్తారు. ఈ ఆకుపూజలు ఎక్కువగా రాత్రివేళల్లో జరగడం విశేషం. వైశాఖ శుద్ధ తృతీయనాడు గౌరీ దేవిని ఉద్వాసన చేస్తారు. నెలరోజులుగా సాగిన గౌరీవ్రతాలు ఈ దినంతో ముగుస్తాయి. వైశాఖశుద్ధ పంచమినాడు జగద్గురువైన ఆదిశంకర జయంతిని భక్తిశ్రద్ధలతో చేస్తారు. షష్ఠినాడు జగద్గురువైన రామానుజాచార్యుల జయంతిని జరుపుకొంటారు. చతుర్దశీ తిథినాడు నృసింహజయంతి వైభవంగా జరుపుకుంటారు. వైశాఖ పూర్ణిమనాడు విశేషంగా ఇండ్లలోనూ, దేవాలయాలలోనూ పూజలు చేస్తారు.



జ్యేష్ఠమాసంలో పూర్ణిమనాడు వట సావిత్రీవ్రతాన్ని ముత్తయిదువలు భక్తి, శ్రద్ధలతో చేస్తారు. మృత్యువును ఎదిరించి, తమ భర్త ప్రాణాలను కాపాడిన సతీసావిత్రి మహిళా లోకానికి ఆరాధ్యదైవం. సావిత్రికి వలె తమకూ భర్త అఖండాయుష్యం ఫలంగా లభిస్తుందనే విశ్వాసం ఈ వ్రతాచరణలో ప్రధానంగా కనబడుతుంది.

ఆషాఢమాసంలోని శుక్లపక్ష ఏకాదశి తొలి ఏకాదశిగా సుప్రసిద్ధం. మహావిష్ణువు శేషనయనంపై నిద్రకు ఉపక్రమించే దక్షిణాయన ప్రారంభపుణ్యదినమైన ఈ రోజునే 'శయనైకాదశి'గా కూడా పిలవడం సంప్రదాయం. ఈ దినం నుండే మోక్షప్రాప్తికై సంయములైన యతులు చాతుర్మాస్య దీక్షలు ప్రారంభిస్తారు. ఆషాఢ పూర్ణిమనాడు జగద్గురువైన వ్యాసమహర్షి జన్మతిథిని పురస్కరించుకొని వ్యాసపూర్ణిమను గురుపూజోత్సవంగా జరుపుకొంటారు. ఈ దినాన సంప్రదాయవిద్యలకు నేర్పే గురువులనూ, లౌకిక విద్యలు నేర్పే గురువులకూ శిష్యులు సమ్మాన, సత్కారాలను చేసి తమ గురుభక్తిని చాటుకొంటారు.

శ్రావణమాసంలోని శుక్ల పంచమినాడు నాగదేవతను ప్రసన్నం చేసుకొని, తమ సంతానక్షేమాన్ని కాంక్షిస్తూ, నాగపంచమి పర్వదినాన్ని జరుపుకొంటారు. శ్రావణశుక్రవారం రోజున స్త్రీలు మాంగల్య సౌభాగ్యరక్షణకై 'వరలక్ష్మీ వ్రతాన్ని' ఎంతో భక్తితో జరుపుతారు. శ్రావణపూర్ణిమనాడు రక్షాబంధన మహోత్సవం వైభవంగా జరుగుతుంది. అక్కలూ, చెల్లెళ్లూ తమ రక్షణకోసం అన్నలకూ, తమ్ముళ్లకూ రక్షాసూత్రాలను కడుతూ అన్యోన్యం ప్రేమనూ, వాత్సల్యాన్నీ పొందడం కనబడుతుంది. దీనినే 'రాఖీ పండుగ' అని కూడా పిలుస్తారు. శ్రావణ శుక్లాష్టమినాడు మహాలక్ష్మిని అనేకరూపాలలో పూజించి, మహిళలు తమ ఇళ్ళలోకి లక్ష్మీదేవిని ఆహ్వానించడం, లక్ష్మీదేవి అక్క అయిన జ్యేష్ఠాదేవిని ప్రసన్నం చేసుకొని, ఆమె చెడు దృష్టి తమపై పడకుండా ప్రార్థించడం కనబడుతుంది. దీనినే రాధాష్టమిగా కూడా భావిస్తారు. శ్రావణ బహులాష్టమి నాడు శ్రీకృష్ణజయంతిని పురస్కరించుకొని కృష్ణాష్టమి వేడుకలను ఆ బాలవృద్ధులూ, ఆబాలగోపాలమూ జరుపుకొంటారు. ఈ దినాన పసిపిల్లలను గోపికలుగా, శ్రీకృష్ణునిగా వేషధారణలు చేయించి, పాలు,పెరుగు, వెన్నలతో కూడిన ఉట్లను వేలాడదీసి, వాటిని కొట్టించి, ఆనందిస్తారు. శ్రావణమాసంలోని అమావాస్య పొలాల అమావాస్యగా సుప్రసిద్ధమైంది. ఈ దినాన గోసంపదను పూజించడం, వ్యవసాయ సంబంధి స్వరూపాలను పూజించడం సంప్రదాయం.

భాద్రపదమాసంలో శుద్ధతదియనాడు పార్వతీ దేవి పరమేశ్వరుని పతిగా పొందడంకోసం చేసిన తపస్సునూ, పూజనూ స్మరించుకొని హరితాళికావ్రతాన్ని స్త్రీలు అందరూ ఎంతో భక్తితో ఆచరిస్తారు. శుద్ధచతుర్థినాడు వినాయక చతుర్థి పర్వదిన విశేషమైన ఉత్సాహోల్లాసాలతో జరుగుతుంది. ఇంటింటా, వాడవాడలా, ఊరూరా గణపతి విగ్రహాలను స్థాపించి, తొమ్మిది దినాలవరకు పూజలు చేయడం, పదవ నాడు నీటిలో విగ్రహాలను నిమజ్జనం చేయడం సర్వ సాధారణం. శుద్ధపంచమినాడు ఋషులను పూజించే ఋషి పంచమీవ్రతం ఇంటింటా జరుపుకుంటారు. శుద్ధచతుర్దశినాడు ఈ భువనానికి సంరక్షకుడైన అనంత పద్మనాభుని వ్రతాన్ని అనంతవ్రతంగా జరుపుకొంటారు. పూర్ణిమనాడు ఉమామహేశ్వరవ్రతం వైభవంగా జరుగుతుంది. భాద్రపదబహుళ పాడ్యమినుండి మహాలయపక్షం ప్రారంభమౌతుంది. ఈ పదిహేనుదినాలూ, పితృదేవతల ప్రీత్యర్థంగా ఉపవాసాలూ, దానాలూ, తర్పణాలూ చేస్తారు. భాద్రపద అమావాస్య మహాలయ అమావాస్యగా ప్రసిద్ధం. దీనినే తెలంగాణలో పితృ అమాస్య (పెతరమాస) అని పిలుస్తారు. ఈ దినాన్నే ఊరూవాడా అనే తేడా లేకుండా అంతటా బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలు ప్రారంభమౌతాయి. ఈ దినాన ప్రారంభమైన బతుకమ్మ పండుగలు తొమ్మిది

దినాల పాటు వైభవంగా కొనసాగి, దుర్గాష్టమినాడు బతుకమ్మ పండుగలతో ముగుస్తాయి.



ఆశ్వీయుజ మాసం శక్తి పూజలకు నెలవు. శుద్ధ పాడ్యమినాడు నవరాత్రోత్సవాలకు నాందిగా కలశస్థాపన జరుగుతుంది. ఈ దినంనుండి ప్రతినిత్యం ఒక్కొక్క శక్తి రూపంలో అమ్మవారిని పూజిస్తారు. ఈ ప్రపంచాన్ని కాపాడుతున్న ముగ్గురమ్మలు మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులుగా పూజలలో ఆరాధింపబడుతారు. ఈ నవరాత్రోత్సవాలలో దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి అనేవి ప్రముఖదినాలు. దుర్గాష్టమినాడు ఈ ప్రపంచాన్ని దుర్గతులనుండి కాపాడే దుర్గాదేవిని కొలుస్తారు. తెలంగాణ లోని బతుకమ్మ పండుగలు కూడా ఈ దినాన జరిగే చద్దులబతుకమ్మ పండుగతో ముగుస్తాయి. మహర్నవమినాడు అమ్మవారికి విశేషపూజలను నిర్వహించి, తమ జీవితాలలో నిత్యనూతనత్వం కలగాలని కోరుతారు. విజయదశమి పండుగ 'దసరా' పేరుతో ఎంతో వైభవంగా కొనసాగుతుంది. ఈ దినాన ఏ కొత్తప్రయత్నం చేసినా జయప్రదం అవుతుందనీ, విజయవంతం అవుతుందనీ అందరూ భావిస్తారు. ఈ దినాన 'అపరాజిత' శక్తి, అందరికీ జీవితాలలో విజయాలను అందిస్తుందని నమ్మకం. ఈ దినాన పవిత్రమైన జమ్మి చెట్టుకు పూజించి, ఊరి పొలిమేరను దాటివెళ్లి సీమోల్లంఘనం చేయడం పరిపాటి. ఈ నెలలో పూర్ణిమనాడు క్షీరపాత్రలో చంద్రబింబాన్ని దర్శించి 'కోజాగరవ్రతం' ఎంతో వేడుకగా ఆరుబయట మైదానాలలోనూ చేస్తారు. బహుళద్వాదశినాడు ఆరోగ్యప్రదాత అయిన ధన్వంతరి జయంతిని ఆచరిస్తారు. బహుళత్రయోదశినాడు లక్ష్మీప్రదమైన ధనత్రయోదశి (ధన్‌తేరస్) పర్వదినాన్ని బంగారం కొనుగోలు చేస్తూ, ఇల్లంతా బంగారంతో విలసిల్లాలని కోరుకుంటారు. బహుళ చతుర్దశినాడు అమ్మవారు నరకాసురుణ్ణి వధించిన పుణ్య దినంగా 'నరక చతుర్దశి' పండుగను చేస్తారు. అమావాస్య నాడు ధనలక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ, 'దీపావళి' పండుగను టపాకాయలు కాలుస్తూ, ధగధగ వెలిగే దీపాల వరుసల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు.

కార్తీక మాసారంభదినం అయిన శుద్ధపాడ్యమి నాడు బలిచక్రవర్తిని వామనుడు అనుగ్రహించిన పర్వదినంగా భావించి, బలిపాడ్యమిని జరుపుకొంటారు. పితృదేవతలకు దారి కనబడే విధంగా బలులు పెడుతూ, దీపాలు వెలిగిస్తారు. శుద్ధవిదియనాడు యమధర్మరాజు తన సోదరి ఇంటికి వెళ్లి సోదరి చేతివంటను ఆరగించిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని యమద్వితీయ, భ్రాతృ ద్వితీయ, భగినీహస్త భోజనం పేరుతో పండుగ చేసుకొంటారు. అన్నదమ్ములు అక్కచెల్లెండ్ల దగ్గరికి వెళ్లి వారి చేతివంటను ఆరగించి, వారికి కానుకలకు అందజేసి ప్రేమలను పంచుతారు. శుద్ధచతుర్థి నాడు కొందరు నాగచతుర్థి పండుగను జరుపుకొంటారు. శుద్ధషష్ఠినాడు స్కందషష్ఠి విశేషంగా సాగుతుంది. శుద్ధాష్టమినాడు గోవులకు ప్రీతి పాత్రమైన గోష్ఠాష్టమిని నిర్వహిస్తారు. శుద్ధ ద్వాదశి నాడు క్షీరాబ్ధిద్వాదశి, చిలుక ద్వాదశి పేరుతో పండుగ జరుగుతుంది. దేవతలూ, రాక్షసులూ కలిసి క్షీరసాగరాన్ని మథించినప్పుడు అమృతం ఉద్భవించిన పవిత్రదినంగా దీనిని పరిగణిస్తారు. ఈ దినాన తులసీవ్రతాన్నికూడా ఆచరించడం సంప్రదాయం. శుద్ధచతుర్దశినాడు వైకుంఠచతుర్దశిని మహావిష్ణు ప్రీత్యర్థం జరుపుతారు. పూర్ణిమనాడు విశేషంగా తులసీ వ్రతాలను ఆచరిస్తూ, వనభోజనాలు చేయడం సంప్రదాయం. బహుళ ద్వాదశి నాడు గోవత్సద్వాదశి పర్వదినం ఆవులనూ, లేగదూడలనూ అర్చిస్తూ, గోసంపద మహిమను తెలియజేస్తుంది. అమావాస్యనాడు శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీతను ఉపదేశించిన సందర్భాన్ని స్మరింపజేసే గీతాజయంతి పండుగ జరుగుతుంది.

మార్గశీర్ష మాసంలో ధనుర్మాసవ్రతాలు ప్రారంభమౌతాయి. వైష్ణవాలయాలలో పూజాసంరంభాలు విశేషంగా కొనసాగుతాయి. శుద్ధ పాడ్యమినాడు గురునానక్ జయంతి జరుగుతుంది. శుద్ధాష్టమినాడు కాలభైరవ జన్మదినాన్ని కాలభైరవాష్టమిగా జరుపుకొంటారు. పూర్ణిమనాడు దత్తాత్రేయుని జయంతిని పురస్కరించుకొని 'దత్తజయంతి' వేడుకలను



గురుభక్తితో జరుపుకొంటారు. బహుళాష్టమినాడు కూడా కాలభైరవాష్టమిని జరపడం సంప్రదాయం.

పుష్యమాసంలో మకరసంక్రమణ పుణ్యకాలానికి ముందూ తరువాతా విశేష పర్వదినాలు జరుపుతారు. మకరసంక్రాంతికి ముందు రోజుకి భోగి పండుగ జరుగుతుంది. పొంగలి నైవేద్యంగా జరిగే వైభోగం కనుక ఈ పండుగకు భోగి అనిపేరు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే పుణ్యాదినాన్ని మకర సంక్రాంతి పర్వదినంగా జరుపుకొంటారు. ఈ దినాన నువ్వులూ, బెల్లం, చక్కెరలతో కలిసిన పదార్థాలను భుజించడం ద్వారా వాతావరణంలోని మార్పులను సమతులాహారంతో ఎదుర్కోవడం కనబడుతుంది. సంక్రాంతినాడు వ్యవసాయసంబంధమైన గోసంపదనూ, తత్సంబంధి వస్తువులనూ పూజిస్తారు. ఇళ్ల వాకిళ్లలో గొబ్బెమ్మలతో రంగురంగుల రంగ వల్లికలను రచిస్తారు. సంక్రాంతి మరుసటిరోజున పశువులను ఆరాధించే కనుము పండుగ జరుగుతుంది. శుద్ధ ఏకాదశినాడు వైకుంఠద్వారాలు తెరుచుకొనే పండుగ అయిన వైకుంఠ ఏకాదశిని ఉత్తరాయణ ప్రవేశోత్సవంగా జరుపుకోవడం సంప్రదాయం. మాఘ అమావాస్యనాడు చొల్లంగి అమావాస్య పేరుతో పవిత్రనదీ స్నానాలు చేస్తూ, అఘాలను పోగొట్టే మాఘ అమావాస్యగా జరుపుకోవడం ఆనవాయితీ. పవిత్రనదీస్నానాల వల్ల పాపాలు నశిస్తాయనీ, పుణ్యాలు సంప్రాప్తిస్తాయని జనుల విశ్వాసం.

మాఘమాసంలోని శుద్ధ పంచమినాడు సరస్వతీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసప్రతిష్ఠిత మహాక్షేత్రం అయిన వ్యాసపురి బాసరలో అక్షరాభ్యాస కార్యక్రమాలూ, పూజలూ విశేషానందోత్సాహాలతో జరుగుతాయి. విద్యాలయాల లోనూ, విజ్ఞాన కేంద్రాలలోనూ, సరస్వతీ దేవాలయాలలోనూ విశేషపూజలు జరగడం సంప్రదాయం. శుద్ధసప్తమినాడు సూర్యునికి అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ రథసప్తమి జనుల ఆనందాలతో రంగవల్లిగా మారుతుంది. రథం ముగ్గులు నేత్రపర్వాలౌతాయి. శుద్ధత్రయోదశినాడు విశ్వకర్మ జయంతి. ఈ భువన సృష్టిలో శిల్పదేవతల మహిమను తెలియజేసే విధంగా సాగుతుంది. మాఘ పూర్ణిమనాడు 'మహామాఘి' పేరుతో పాపాలను పోగొట్టే పవిత్రపర్వదినం సాగుతుంది. బహుళచతుర్దశినాడు త్రిభువనాలకూ ఆరాధ్యమైన 'మహాశివరాత్రి' పర్వదినం ప్రపంచమంతా శివనామ స్మరణలతో రుద్రాభిషేకాలతో నిశిపూజలతో వెల్లువెత్తుతుంది. తెలంగాణాలోని వేములవాడ, కీసరగుట్ట, బిక్కనూరు, వరంగల్లు, రామప్పవంటి క్షేత్రాలలో ఉపవాసదీక్షలతో, అభిషేకార్చనలతో ఈ భువనమే ఒక కైలాసంగా మారిపోతుంది. రుద్ర నమకచమక పూర్వక మహాన్యాసార్చనలు నిరంతరాయంగా సాగుతూ శివుణ్ణి సాక్షాత్కరింపజేసే విధంగా అలరారుతాయి. ఇలా మాఘ మాసం అంతా 'మా+అఘ' (పాపాలు వద్దు) అనే లక్ష్యంతో కొనసాగుతుంది.

ఫాల్గునమాస పూర్ణిమనాడు కాముని దహనాన్ని సూచించే 'హోళీ' పండుగ రంగులు చల్లుకోవడంతో రాగాత్మకంగా మారిపోయి ఈ ప్రపంచమంతా అనురాగమయం అని సూచిస్తుంది.

ఇవే కాకుండా తెలంగాణ జనపదాలలో వేదధర్మాన్ని అనుసరించి సాగే సంప్రదాయాలూ, ఆచారాలూ కోకొల్లలు. స్థానిక దేవతలకు సంబంధించిన జాతరలకు ప్రతి జిల్లా నెలవుగా కనబడుతుంది. అన్ని సంప్రదాయాలనూ, సంస్కృతులనూ తనలో లీనం చేసుకొని, వసుధైకకుటుంబ భావాన్ని అణువణువునా, అడుగడుగునా ప్రతిబింబించే తెలంగాణనేల అనేక ధర్మాల సమన్వయానికి ప్రతిరూపం.

సర్వే భవన్తు సుఖినః సర్వే సంతు నిరామయాః ।
సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చిత్ దుఃఖమాప్నుయాత్ ॥

అనే భారతీయతాత్త్విక సిద్ధాంతానికి తెలంగాణ పుణ్యభూమి ప్రతిరూపం. అందుకే తెలంగాణ తల్లి నేలకు, సంస్కృతికీ, సంప్రదాయాలకూ, ఆచారాలకూ సమోవాకాలు!

డా॥ అయాచితం నటేశ్వర శర్మ

పండుగల నిర్ణయ సమీక్ష - పరిశీలన

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంత పెద్దఎత్తున ఏర్పాటు చేసిన జ్యోతిష్య మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన జ్యోతిర్వేత్తలు, పంచాంగ కర్తలు, జ్యోతిషాభిమానులు, వేదపండితులు, బ్రాహ్మణ సోదర సోదరీమణులకు శుభోదయం, శుభాభినందనలు.

గత కొన్ని నెలల క్రితం ఒక ఉపనయన కార్యక్రమంలో శ్రీ తత్వానంద పీఠాధిపతులవారు కలిసినారు. ఆ రోజే వారు మన రాష్ట్రంలోని జ్యోతిష పండితులు పంచాంగ కర్తలతో ఒక సభ ఏర్పాటు చేసి జ్యోతిష విశిష్టతను గాని ప్రాముఖ్యతను ప్రజలకు మరియు ముఖ్యంగా, మన సనాతన ధర్మాచరణ ఆవశ్యకతను నేటి యువతకు అందించాల్సిన బాధ్యతను అందరం కలిసి చేపట్టవలసినదిగా తెలిపినారు. అదేవిధంగా పండుగలు, మౌఢ్యాలు, ముహూర్తాల గురించి కూడా అందరితో చర్చించి ఒక ఏకీకృత విధానానికి నాంది పలుకుతూ అందరం సహకరించుటకు వారు చేసిన ప్రయత్నమే నేటి జ్యోతిష సభల అంతరార్థమని భావిస్తున్నాను. అందుకు నా వంతు అన్నివిధాల సహకారం అందిస్తానని వారికి తెలిపినాను.

తర్వాత కొద్ది రోజుల క్రితం శ్రీ దివ్యజ్ఞాన (విఠలశర్మ) సిద్ధాంతిగారు కూడా ఫోనుచేసి ఈ కార్యక్రమాన్ని శ్రీ గాయత్రీపీఠం. శ్రీ జ్యోతిర్మయ మహాపీఠం మరియు దర్శనమాసపత్రిక అధిపతి శ్రీ వేంకటరమణ శర్మ గార్లతో కలిసి హైదరాబాద్ నందు రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపినారు. ఈ సమావేశములో నన్ను పండుగల విషయమై మాట్లాడవలసిందిగా తెలిపినారు. వారు నాపై ఉంచిన బాధ్యతను నాకు తెలిసిన శాస్త్ర పరిధిలో తమతో పంచుకొన ప్రయత్నిస్తాను. నాకు ఈ అవకాశాన్ని కల్పించిన నిర్వాహకులకు నా హృదయపూర్వక నమస్సు మాంజలులు.



ప్రస్తుత కాలంలో మన హైందవ పండుగలను అన్ని పంచాంగాలు ఒకే రోజు జరుపుకొనునట్లు నిర్ణయించక పోవటం వలన ఇతర మతస్థులతో పాటు చాలా మంది కొంత అవహేళనగా అవమానకరంగా మన జ్యోతిష పండితులను కించపరుస్తూ మాట్లాడటం చాలా బాధాకరంగా అనిపిస్తుంది. అయితే మన వేదాలు శాస్త్రాలు పురాణాల ఆధారంగానే ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో అన్ని మతాలవారు తమ పండుగలను నిర్ణయిస్తారు. ముఖ్యంగా మనం ఇతర మతాలవారి గురించి ఆలోచిస్తే ఉదాహరణకు

క్రైస్తవులు, జనవరి 1 నూతన సంవత్సరాదిగా 25 డిసెంబర్ క్రీస్తు జన్మదినంగా జరుపుకుంటారు. అయితే గుడ్‌ఫ్రైడే నిర్ణయంపై మళ్లీ మన పంచాంగాలతో కొంత సమన్వయం ఉంటుంది. అదే విధంగా ముస్లిం పండుగలు మనం పంచాంగంలో చూపే చంద్రోదయాన్ని బట్టి వారి పండుగలను నిర్ణయిస్తారు. ప్రపంచంవ్యాప్తంగా వారి పండుగలను కూడా వివిధ దేశాలలో వివిధ కారణాల వలన ఒకే రోజు జరపటం లేదు. వారు మనం సూచించే చంద్రోదయం ఆధారంగానే పండుగలు జరుపుకొంటారు. అయితే మన హైందవ పండుగలు నిర్ణయించడం అయితే హైందవ పండుగలు ఇతర మతస్థుల లాగా ఏదో ఒక నిర్దిష్టమైన ఆంగ్లతేది లేదా ముస్లిం తేదిలవలె సమన్వయపరిచి నిర్ణయించుటకు వీలు లేదు. మన పండుగల నిర్ణయమునకు గాను తిథి, నక్షత్రం, యోగ, కరణాలు మరియు కాలము అనగా ప్రాతః, సంగమ, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయంత్ర, ప్రదోష, నిశీకాలములను పరిగణలోకి తీసుకొని ఆయా పండుగలను వ్రతములను నిర్ణయించవలసి ఉంటుంది. ఉదాహరణకు ఉగాది పండుగకు సూర్యోదయ వ్యాప్తి గల తిథిని, వినాయక చవితి శ్రీరామనవమి పండుగలకు, మధ్యాహ్న వ్యాపిని, పితృకర్మలకు అపరాహ్ణ వ్యాప్తిని, నృసింహ జయంతి అదే విధంగా ప్రదోష కాలవ్రతములకు ప్రదోష వ్యాపిని శివరాత్రికి నిశీకాల వ్యాప్తిని గ్రహించవలసి ఉండును. ఇవి కాకుండా చంద్రోదయ వ్యాపిని అనుసరించి సంకష్ట హర చతుర్థి తదితర కొన్ని వ్రతములు నిర్ణయించవలసి యుండును. ఇవి కాకుండా యుగాదులు తిస్రోష్టకాలు, మన్వాదులు, పుణ్యతిథులు, తిరునక్షత్రాలు, సంక్రాంతులు, కార్తెలు ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని పండుగలు నిర్ణయించవలసిన ఆవశ్యకత ఉంటుంది. కాబట్టి ఇతర మతాల వారి పండుగల నిర్ణయమునకు మనకు మధ్య చాలా వ్యత్యాసములు ఉండును. మరియు అనేక శాస్త్రీయ అంశాలు పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

మనం కొంత వెనక్కి వెళ్ళి నిశితంగా పరిశీలిస్తే, గత కొన్ని సంవత్సరాల నుండి మాత్రమే ఈ పండుగల నిర్ణయాల్లో తేడాలు రావడం గమనించదగిన విషయం. అయితే పండుగ నిర్ణయాలు ఎవరు చేసిన నిర్దిష్టమైన శాస్త్ర పరిధిలో మాత్రమే చాలా మట్టుకు నిర్ణయిస్తున్నారన్నది మాత్రం నిజం. అయితే తేడాలు రావడానికి కారణం మాత్రం సిద్ధాంతులు కాదు. కేవలం వారు అనుసరిస్తున్న గణిత పద్ధతులు మాత్రమే మూలకారణం అని చెప్పక తప్పదు. మనం ఒక పదిహేను సంవత్సరాల క్రితం పంచాంగాలు, పండుగల నిర్ణయాలు గమనిస్తే ఇప్పటిలాగా పెద్ద తేడాలు ఉండేవి కావు. ఆ రోజుల్లో నాకు తెలిసిన మట్టుకు మన తెలంగాణ ప్రాంతంలో శ్రీ బోర్పట్ల శేషాచార్యులు, శ్రీ మిరుదొడ్డి శ్రీనివాసాచారి, శ్రీ మిరుదొడ్డి అప్పన్ కందాళై శ్రీనివాసాచార్య సిద్ధాంతి, నిర్మల్‌కు చెందిన గాడిచెర్ల నారాయణ సిద్ధాంతి, శ్రీగుడి నృసింహ సిద్ధాంతి, శ్రీ గుడి రాజేశ్వర శర్మ సిద్ధాంతి, అటు తర్వాత శ్రీ ముక్తేశ్వర సిద్ధాంతి గారి పంచాంగాలు మాత్రమే వెలువడి పాఠకులకు అందుబాటులో ఉండేవి అట్లాగే ఆంధ్రా ప్రాంతము నుండి తంగిరాల, మధుర కృష్ణమూర్తి మొదలైన అతికొద్ది మంది పంచాంగ కర్తల పంచాంగాలు మాత్రమే పాఠకులకు లభ్యమయ్యేవి. అయితే ఆ రోజుల్లో అత్యధిక పంచాంగాలు పూర్వసిద్ధాంతము, సూర్య సిద్ధాంతము, కొంత మంది గణకానందం, గ్రహలాఘవీయం, మొదలైన పద్ధతుల్లో గుణించి ప్రచురించేవారు. గణితాల్లో సమసామ్యత ఉండటం వలన చాలా కొద్ది సందర్భాల్లో మాత్రమే పండుగల గురించి వివాదాలు రావడం అట్టి సమస్యల్ని అందరూ కూర్చొని మంచి అవగాహనతో ఒక నిర్ణయానికి వచ్చేవారు. వారు ఒక మంచి ఐక్యతాభావంతో పాఠకులకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా తమ పరిధిలో చర్చించి, పరిశోధించి మాత్రమే పండుగలకు ఒక రకంగా దాదాపు ఏకీకృత నిర్ణయాలను చేసేవారు. అంతేకాకుండా అప్పటి పంచాంగాలు పంచాంగ కర్తలు ఉండే వారి వారి ప్రాంతాల్లో మాత్రమే చాలా మట్టుకు అందుబాటులో ఉండేవి. రాష్ట్ర స్థాయిలో దాచేపెల్లి వారి గాడిచెర్ల నారాయణ సిద్ధాంతి పంచాంగం, అప్పటి శ్రీరామా బుక్‌డిపో వారి పంచాంగం శ్రీ కొండా శంకరయ్య వారి గుడి నృసింహ సిద్ధాంతి, రాజేశ్వర శర్మ సిద్ధాంతి పంచాంగాలు మాత్రమే మార్కెట్లో అందుబాటులో ఉండేవి.

ప్రస్తుతం కంప్యూటర్స్ ప్రవేశంతో దృక్‌గణిత ఆధారంగా అపరిమిత సంఖ్యలో పంచాంగాలు, క్యాలెండర్‌లు, నేడు అందుబాటులోకి రావడం జరిగింది. ఈ విధమైన కంప్యూటర్

గణితాలు మరియు భారత ప్రభుత్వం ప్రచురించే ఇండియన్ ఎఫిమెరిస్ గ్రంథాల ఆధారంగా చాలా మంది తమకు తాముగా పంచాంగ కర్తలుగా ప్రజలముందుకు రావడం జరిగింది. వీటి ఆధారంగా నేటి తరాల సిద్ధాంతులు కొందరు మట్టుకు దృక్‌గణితంలో తమ పంచాంగ రచన చేస్తే, అత్యధికులు మాత్రం జాతక ముహూర్త భాగాల్లో మాత్రమే తమ పరిధిలో జ్యోతిష సేవలు అందిస్తున్నారు. నేడు పండుగల గురించి తేడారావడానికి ఒక ముఖ్య కారణం తిథి, నక్షత్ర, వృద్ధి, క్షయలపై ఆధారపడి ఉంటుంది. పూర్వపద్ధతిలో ఒక తిథి గాని, నక్షత్రం గాని, బాణవృద్ధి, రసక్షయః అనగా అయిదు ఘడియల వరకు తిథి నక్షత్రాలు వృద్ధి చెందడం అదే విధంగా రస అంటే ఆరు ఘడియల వరకు తగ్గుట జరుగుతుంది. అదే దృక్‌గణితం ప్రకారం ఒక తిథి నక్షత్రం గాని సప్తవృద్ధి, దశక్షయః అంటే ఏడు ఘడియల వరకు వృద్ధి, పది ఘడియల వరకు తిథి నక్షత్రాలు తగ్గడం జరుగుతుంది. ఒక ఘడియ అనగా 24 నిమిషాలు, 2 1/2 ఘడియలకు ఒక గంట కాలంగా పరిగణించాలి. ఈ ప్రమాణాల ఆధారంగా దృక్ గణిత విధానాల పరంగా ముఖ్యంగా శ్రాద్ధాది కర్మలు పండుగల నిర్ణయంలో ఒక్కోసారి రెండు రోజుల్లో కూడా అపరాహ్ణ వ్యాప్తి తిథి లేకపోవుట జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో శ్రాద్ధాది కర్మలను మానుకోమని మాత్రము సిద్ధాంతులకు చెప్ప శక్యము కాని అంశం. ఉదాహరణకు గత ఉగాది విషయంలో ఆలోచిస్తే ఎవరి గణితం ప్రకారం వారి నిర్ణయం శాస్త్ర బద్ధత కలిగినవే. కాని ఇలాంటి క్లిష్ట పరిస్థితులల్లో సమాజహిత ఆలోచించి గతంలో పంచాంగ కర్తలు ఇట్టి సమస్యాత్మక సందర్భాలలో తీసుకున్న నిర్ణయాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏకీకృత నిర్ణయం చేయటం అనేది వాంఛనీయమే. మనం ఒకసారి గతాన్ని గమనిస్తే కేవలం గత 20-25 సంవత్సరాల క్రితం అందుబాటులోకి వచ్చిన కంప్యూటర్లు లేని రోజుల్లో అదేవిధంగా నేటి నాసాకు అంకురార్పణ జరగని పరిస్థితుల్లో కేవలం పూర్వగణితం ప్రకారం మాత్రమే మన పండుగలు ముహూర్తములు గ్రహణాదులు నిర్ణయించుట జరిగింది. అయితే వాటిని పాటించిన సమాజాన్ని మనమొకసారి గమనిస్తే ఎలాంటి కష్టనష్టాలు గాని కలగలేదు. అదేవిధంగా ఆ రోజుల్లో పెట్టిన ముహూర్తాల ఆధారంగా వివాహాది శుభకార్యాలు జరుపుకున్న వారు నేడు ముత్తాతలు తాతలుగా సుఖసంతోషాలతో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. అంటే అప్పటి పూర్వగణిత నిర్ణయాలు సమాజ హితము మరియు అనుభవ పూర్వకముగా శుభప్రదమని మనము గమనించవలసి ఉంటుంది. కాబట్టి ఇటు దృక్ సిద్ధాంత కర్తలకు అటు పూర్వ సిద్ధాంత కర్తలకు నేను చేసుకొనే మనవి ఏమనగా అనవసర పౌరుషాలు, వాద వివాదాల మధ్య జ్యోతిశ్శాస్త్రాన్ని పంచాంగాల ప్రాశస్త్యాన్ని అభాసుపాలు చేయకుండా, కొంత సంయమనంతో నిర్ణయాలు చేయాలి. అదే విధంగా సమాజశ్రేయస్సు హైందవ ధర్మ పరిరక్షణ, మన మన తక్షణ కర్తవ్యం. వేదాలు, శాస్త్రాలను వాటి గొప్పతనాన్ని దృష్టిలో ఉంచుకొని శాస్త్ర పరంగా ఎవరికి నష్టం జరగనపుడు మన పురాతన సాంప్రదాయబద్ధమైన పూర్వగణితాన్ని గౌరవిస్తూ సందేహాలు సమస్యలొచ్చినపుడు వాటిని సమీకృత పద్ధతిలో నిర్ణయించి సమాజానికి ఒక మార్గదర్శకంగా ఉండాలని కోరుతున్నాను. దాదాపు గత దశాబ్దాలపైన కాలం నుండి మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం వారు తర్వాత గత 3 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వారు రాష్ట్రంలోని పంచాంగ కర్తలు, జ్యోతిర్వేత్తలతో పండుగల నిర్ణయాలను శాస్త్రీయ పరిధిలో చర్చించి నిర్ణయించుటకు సమావేశాలు నిర్వహించి సహకరిస్తున్నారు. వారి కృషికి పంచాంగ కర్తల అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ సంవత్సరం ఈ గురుతర బాధ్యతను తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య వారు నిర్వాహకులకు సహకరించి ఈ సభలోనే పండుగల నిర్ణయానికి ముందుకు రావడం ఒక శుభ సూచకంగా భావిస్తున్నాను. నాకు ఈ అవకాశాన్నిచ్చి ఈ వేదిక మీదనుండి తమతో నా అభిప్రాయాలు పంచుకోవడానికి అవకాశం కల్పించిన సభా నిర్వాహకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

రాబోయే రోజుల్లో ఈ వేదిక మీదినుంచి ఒక ఫలవంతమైన సమీకృత పండుగ నిర్ణయాలకు ఒక గట్టి పునాది మీరందరు నిర్మించాలని మనసావాచా కోరుకుంటూ సెలవు. స్వస్తి.

గాడిచెర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి

వర్షసూచనలు - పంచాంగ ఆవశ్యకత

అభిజిన్నక్షత్రముతో కలిసి 28 నక్షత్రములు, ఏడు నాడులు, 12 రాశులలో గ్రహసంచారములను బట్టి వర్షసూచనలు గ్రంథాధారముగా ప్రమాణములు మనకందించారు పూర్వాచార్యులు వాటిని ఒకసారి ఈ సమావేశం ద్వారా మననము చేసుకొందాం.

కృత్తిక, విశాఖ, అనూరాధ, భరణి. ఇవి చండనాడీ నక్షత్రములు శని అధిపతి రోహిణి, స్వాతి, జ్యేష్ఠ, అశ్విని ఇది వాయునాడి కలవి సూర్యుడదధిపతి. మృగశిర, చిత్త, మూల, రేవతి. ఇవి దహననాడి కలవి. అంగారకుడధిపతి. ఆర్ద్ర, హస్త, పూ.షా, ఉభా. ఇవి నీరసనాడి కలవి. బృహస్పతి అధిపతి. పున, ఉత్తర, ఉ.షా, పూ.భా ఇవి జలనాడి కలవి శుక్రుడధిపతి. పుష్య, పుబ్బ, అభిజిత్, శతభిషము ఇవి మేఘనాడి కలవి బుధుడధిపతి. ఆశ్లే, మఖ, శ్రవణం, ధనిష్ఠ ఇవి జలనాడి కలవి. చంద్రుడధిపతి. చంద్రుడు అమృతనాడియందు ఉండిన మూడు, నాలుగు, ఐదు, లేక ఏడు రోజులు వర్షము కురియును. జలనాడి యందు చంద్రుడున్ననూ మిశ్రగ్రహముతో కూడియున్నను ఒకటిన్నర రోజు లేదా 5 రోజులు వర్షము కురియును. నీరసనాడియందు చంద్రుడితో ఇతర గ్రహములున్న ఒకటిన్నర రోజు లేదా 3 రోజులు వర్షించును. అమృతనాడి మొదలు 3 నాడుల యందు సౌమ్యగ్రహములుండి వాటిలో చంద్రుడు చేరిన 12 లేదా 16 రోజులు వర్షము కురియును. సౌమ్యనాడియందు సమస్త గ్రహములుండినను 3 రోజులు వర్షించును. తక్కిన నాడులయందు గ్రహములుండిన గాలిచే



మేఘములు విచ్చిపోయి తుషారవృష్టి కలుగును. యామ్యనాడియందు క్రూర గ్రహములుండిన అనావృష్టి కలుగును. క్రూర గ్రహములు శుభగ్రహములతో కూడియున్న మధ్యవృష్టి కలుగును. ఏకనాడియందు చంద్రాంగారకులు గాని చంద్ర, గురువులు కూడియున్న విశేషముగ వర్షము కలుగును. భూమి యంతయు జలమయమగును. బుధ, శుక్ర గురువు లేక రాశియందుండగ చంద్రుడు కలిసిన విశేష వృష్టి కలుగును. రేవతి, అశ్విని కార్తెల యందు వర్షించిన పది నక్షత్రముల యందు వర్షించదు. ఉత్తరాభాద్ర యందు వర్షించిన పూర్వ సస్యములు చెడిపోవును. అశ్విని యందు వర్షించిన పూర్వ సస్యములు రేవతియందు ఫలించును. బృహస్పతి అంగారకుడు ఏకనాడియందు వున్నప్పుడు చంద్రుడు జలరాశిలో నున్న ఏకార్ణవమగునట్లు వృష్టి కలుగును. సూర్య శుక్రులకు ముందు కుజుడు నడచిన భూమండలమందు తుషారముగను ఖండవృష్టియు కలుగును. గురు శుక్రులు సమసప్తకమందును, రవి గురులు సమసప్తక మందును ఉన్నను వృష్టి కలుగదు. శుభగ్రహ నాడియందు శుభగ్రహములుండి వాటితో చంద్రుడు చేరిన విశేష వృష్టి కలుగదు. చంద్రుడు సౌమ్యనాడియందు సౌమ్య గ్రహములతో చేరియున్నను జలరాశియందున్నను వృష్టి యోగమగుటచే చక్కగా వర్షించును. క్రూరగ్రహములు క్రూర నాడియందు శుభగ్రహములు శుభనాడియందు కల్సియున్న మేఘములు వ్యాపించి దుర్దినమును కలుగచేసి స్వల్పవృష్టియు గ్రహములు మిశ్రమముగనున్న మిశ్రమ వర్షము. ఏకరాశిలో బుధ, శుక్రులతో చంద్రుడు కూడియున్న విశేష వర్షము కురియును. బుధ, శుక్రులు ఏకరాశిలో ఉండి సూర్యనాడిలో సంచరించిన యేకార్ణవముగ వర్షించును. శని, రవి, చంద్రులు విషమముగ నుండి వేర్వేరు నాడులయందు సంచరించిన యుత్పాతములు జనించును. రాజులకు పరస్పరము కలహములు సంభవించును. శుక్రనాడిలో శుక్రుడు తేజస్సు గలవాడైన వర్షాకాలము నందలి వృష్టి గలిగి భూమి విశేషముగ ఫలించును. పురుష గ్రహములు ఏకరాశిలో చేరిన తాపము, నపుంసక గ్రహము ఏక రాశిలో జేరిన శీతము, స్త్రీ గ్రహములు ఏకరాశిలో చేరిన దుర్దినము, స్త్రీ పురుష గ్రహములు ఏకరాశిలో చేరిన వృష్టి, స్త్రీ నపుంసక గ్రహములు ఒక రాశిలో చేరిన మారుతము, పురుష నపుంసక గ్రహములు ఒకరాశిలో చేరిన వృష్టి కలుగును. మకర, కర్కట, మీనము, పూర్ణ జలరాశులు, కుంభ, వృషభములు అర్ధజలరాశులు, మేష, తులా, వృశ్చిక పాదజల రాశులు మిగిలిన శేషరాశులు జలనాశనము యిలా చెప్పుకుంటూ పోతే చాలా విశేషములు కలవు.

ఎన్నో ఏళ్ళ విస్తృత పరిశీలన మరియు పరిశోధనల తరువాత దివ్యజ్ఞానముతో ఋషులు భూమిమీద వాతావరణ 'స్థితి'కి కారణమయ్యే గాలి, తేమ, పీడనములు వంటి భౌతిక విషయములకన్నా ఆవల, అవి అలా వుండడానికి కారణమయ్యే జ్యోతిస్సుల ప్రభావమును గుర్తించి వాతావరణము యొక్క మూలములను తెలుసుకొని వాటికి కారణమయ్యే జ్యోతిస్సుల స్థితి యుతులను నిర్వచించారు. వాటి ఆధారంగా ఉండే ఫలితాలను సూత్రీకరించి సంహితా భాగములో పొందుపరిచారు.

ముందు తరాలవారు వాతావరణపు చారిత్రక సమాచారము మీద ఆధారపడవలసిన అవసరం లేకుండా సంవత్సరానికి ఒకసారి సంవత్సరపు ఆరంభములోనే, రాబోయే 12 నెలలలో భచక్రములో గ్రహముల, నక్షత్రముల స్థితియుతులను గణించుకొని ఆ సంవత్సరము వాతావరణము ఎలా వుంటుంది, వృష్టిభావము ఎలా వుంటుంది అన్న విషయాలను తెలుసుకొని వాటికి అనుగుణముగా తగు జాగ్రత్తలు తీసుకునే మార్గదర్శనము చేసారు.

వర్ష సూచనలు - జ్యోతిష పద్ధతులు :

ఒక సంవత్సర కాల చక్రములో, దేశములో వర్ష పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకోవడానికి ముఖ్యమైన జ్యోతిశ్శాస్త్ర పద్ధతులు క్రిందివిధంగా వున్నాయి.

1. ప్రవర్షణ - సద్యోవర్షణ : "ప్రపంచమునకు అన్నమే ప్రాణము. అన్నము వర్షాధీనము. అందువలన ప్రయత్నపూర్వకంగా వర్షఋతు పరీక్ష చేయవలెను. గర్గ, పరాశర, కశ్యప, వజ్రాది మునుల వలన తెలుపబడిన (మేఘ) గర్భ లక్షణములను దర్శించి నేను వర్షాకాల లక్షణములను తెలియజేయుచున్నాను" అని వచిస్తూ వరాహమిహిరుడు తన బృహత్సంహితలో 21వ గర్భలక్షణాధ్యాయముతో ఆరంభించి 22- గర్భధారణాధ్యాయము, 23 - ప్రవర్షణాధ్యాయము, 24- రోహిణీ యోగాధ్యాయము, 25-

స్వాతీ యోగాధ్యాయము, 26- ఆషాఢీ యోగాధ్యాయము 27 - వాత చక్రాధ్యాయము మరియు 28- సద్యోవర్షణాధ్యాయములలో (ప్రశ్న/శకునముల విధానములో తత్కాల వర్ష సూచన తెలుసుకోవడం) వృష్టి విషయములన్నీ సవివరముగా విశదీకరించినాడు. ఈ అధ్యాయాలలో ప్రతి సంవత్సరము గ్రీష్మ ఋతువు ఆరంభము నుండియే ప్రకృతిని నిరంతరం గమనిస్తూ రాబోయే వర్షర్తువు గురించి అవగతం చేసుకొని సంఘజీవనం సౌకర్యవంతంగా మలచుకొనుటకు శాస్త్రీయ విధానాలు ప్రవచింపబడినవి.

ఈ పద్ధతిలో నక్షత్రములలో చంద్ర సంచారము, ప్రకృతిలో కనిపించే వాతావరణ మార్పులు, వాయు గమనములు (గాలి వీచే దిశలు) ముఖ్య పరిశీలనాంశాలు. వాటి ఆధారముగానే వర్ష సూచన ఫలితాలు గ్రహించాలి. ఈ క్రమంలోనే వరాహమిహిరుడు ఆషాఢీ, రోహిణీ, స్వాతీ యోగములు మరియు వాత చక్రము గమనించడం వంటి వాతావరణ పరిశీలనా విధానములను సూత్రీకరించి ఈ లోకానికి ప్రసాదించినాడు.

2. రాజాది నవనాయక, ఉపనాయక నిర్ణయ విధానము: ఈ విధానములో ప్రతి సంవత్సరం చైత్ర శుక్ల ప్రతిపత్ ప్రవేశ కాలము నుండి, రవి - వివిధ రాశులలో ప్రవేశించే కాలానికి వుండే వారాధిపతులకు ఆ సంవత్సరానికి రాజు, మంత్రి మొదలగు నవనాయకత్వము ఆపాదించి ఏ గ్రహము ఏ నాయకత్వం పొందితే ఆ సంవత్సరం ఫలితం ఎలా వుంటుందనేది సూత్రబద్ధము చేసినారు.

వాతావరణము, వర్ష విషయములలో ఆ సంవత్సరపు వర్షలగ్న కుండలిలో రాజు, మేఘాధిపతి నాయకత్వము పొందిన గ్రహాల స్థితి, బలము, కారకత్వము ఆ సంవత్సర ఫలితాలను సూచిస్తాయి. రవి ఆర్ద్ర నక్షత్రములో ప్రవేశించే నాటి వారమును బట్టి ఆ వారాధిపతి ఆ సంవత్సరానికి మేఘాధిపతి అవుతాడు. ఈ పద్ధతిలో సంబంధిత సంవత్సరానికి నిర్ణయించబడే 'మేఘము' కూడా వర్షము గురించి సూచనా ఫలితాలను ప్రభావితం చేస్తుంది.

3. ప్రత్యబ్ద యోగ పంచకములు : ఈ విధానములో ప్రతి సంవత్సరము క్రింద పేర్కొన్న మాసములలో కొన్ని ప్రత్యేక తిథి, వార నక్షత్రముల కలయిక = (యోగము)ను బట్టి వర్ష సంబంధ సూచనలు గ్రహిస్తారు.

1). జ్యేష్ఠ శుక్ల ప్రతిపత్ యుక్త వార ఫలం (చాంద్రమానములో గ్రీష్మ ఋతువు ప్రారంభము రోజు)

2). ఆషాఢ శుక్లపంచమీ యుక్త వార ఫలం (గ్రీష్మ ఋతువులో 6వ వారం ఆరంభం = మధ్యకాలం)

3). ఆషాఢ శుక్ల స్వాతీ నక్షత్ర యుక్త తిథి ఫలం (స్వాతీ యోగము ఏర్పడిన తిథి - రవిచంద్రుల మధ్య దూరం)

4). ఆషాఢ బహుళ రోహిణీ నక్షత్ర యుక్త తిథి ఫలం (రోహిణీ యోగము ఏర్పడిన తిథి)

5). పుష్య బహుళ అమావాస్య యుక్త వార ఫలం (హేమంత ఋతువు చివరి రోజు)

4). గ్రహ స్థితి, సంచారము - వర్ష యోగములు, అనావృష్టి యోగములు : ఈ పద్ధతిలో సంవత్సరము ప్రారంభ సమయమున వుండే గ్రహ స్థితులను "వర్ష లగ్న కుండలి", "జగల్లగ్న కుండలి"ల ఆధారంగా గణించి గ్రహముల సంచారము వలన కలిగే వివిధ యోగములను గమనించి ఆ సంవత్సర కాలంలో వృష్టి / అనావృష్టి యోగములను మరియు తుఫానుల వంటి వర్ష సంబంధ ఉత్పాతములను సూచించడం జరుగుతుంది.

గ్రహముల స్థితి, యుతి, దృష్టిల ఆధారంగా రవితో ఇతర గ్రహముల సంబంధమును బట్టి ఆ సంవత్సరంలో వుండే వర్ష యోగాలు గమనిస్తారు.

ఉదాహరణకు -

1) కుజ గురు యుతి - మేఘ నాశనం - అనావృష్టి
2) గురు శుక్రులు - సమ సప్తక స్థితి - అనావృష్టి
3) రవి గురులు 6 సమ సప్తక స్థితి - అనావృష్టి
4) రవి - సర్వ గ్రహములు - ఏడింట వున్న - అనావృష్టి
5) బుధ శుక్రుల సామీప్యము (వారి మధ్యలో రవి లేకుండా) - వృష్టి
6) బుధ శుక్రుల మధ్య రవి వున్న - అనావృష్టి
7) రాశి చక్రములో రవి కన్నా ముందు -
   కుజుడున్న - అనావృష్టి
   శుక్రుడున్న - అధిక వృష్టి
   గురువు వున్న - అగ్ని భయము
   బుధుడు వున్న - వాయు పీడ

ఇదే విధానములో ప్రతి అమావాస్యకు తత్కాల గోచార రాశి చక్రము వేసుకొని అందులోని గ్రహముల స్థితి యుతి దృష్టిల ఆధారంగా మరియు రవితో ఇతర గ్రహముల సంబంధమును బట్టి నెలవారీగా వర్షయోగాలు, అనావృష్టి యోగాలు గమనించి వర్ష ఫలితములు సూచించబడతాయి.

ఈ మధ్యకాలంలో వివిధ సమాచార మాధ్యమాల ద్వారా వ్యక్తి గోచార ఫలితాలు ప్రజాదరణ పొందుతున్నట్టుగానే ఈ పద్ధతి ద్వారా తత్కాల గ్రహ యోగములు మరియు గోచారమును బట్టి చెప్పబడుతున్న వాతావరణ జ్యోతిషం ఫలితాలు (వర్ష సూచనలు) కూడా సర్వ జనాదరణ పొందుతున్నాయి.

5. రాశిచక్రములో - కేంద్ర రాశులలో రవి ప్రవేశ కాలము - గ్రహ స్థితి విచారము : ఈ పద్ధతిలో ప్రతి సంవత్సరము రాశిచక్రములో సహజ కేంద్ర రాశులైన మేష, కర్కాటక, తుల, మకర (1,4,7,10) రాశులలో రవి ప్రవేశించే సమయానికి లగ్న కుండలి వేసుకొని అందులోని గ్రహముల స్థితి, యుతి, దృష్టులు, గ్రహ కారకత్వములు, రాశి కారకత్వములు విచారించుకొని వాటి ఆధారముగా వర్షము, వాతావరణ పరిస్థితులు, పంటలు గురించి త్రైమాసిక ఫలితములు గ్రహిస్తారు. ప్రతి కేంద్ర రాశి ఒక్కొక్క త్రైమాసిక కాలమును సూచిస్తుంది. ఈ విధానంలో అనుభవములోనికి వస్తున్న దేశ గోచార సంబంధ ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా వుంటున్నాయి.

6. సప్తనాడీ పద్ధతి : దార్శనికులు అయిన ఋషులు అశ్విన్యాది అభిజిత్ సహా 28 నక్షత్రములకు, అవి ప్రసరించే కాంతుల ఆధారంగా వున్న స్త్రీ, పురుష, అగ్ని, జల మొదలైన తత్వములు గ్రహించి, నక్షత్రము లన్నింటినీ సప్త నాడులలో క్రింద వివరించిన విధంగా వర్గీకరించినారు.

ఈ పద్ధతిలో సంవత్సర వర్ష ఫల నిర్ణయమునకై గోచారములో గ్రహములు ఏయే నక్షత్రములలో - నాడులలో సంచరిస్తున్నాయో దానిని బట్టి ఆ సంవత్సరం కురిసే వర్ష ప్రమాణము, ఫలితాలు గ్రహిస్తారు.

రాహు కేతువులు కాక మిగిలిన సప్త గ్రహాలు ఆయా నక్షత్రాలలో సంచరిస్తున్నప్పుడు సంబంధిత నాడులు ప్రభావితమవుతాయి.

ఈ చక్రములో, కృత్తిక నుండి 7 నక్షత్రాలు "వృష్టి రహిత" స్థితిని సూచించే ఆమృత నాడీ వరకు ఆరోహణ క్రమంలో వుండగా 8వ నక్షత్రము నుండి ఆయా నాడులలో అవరోహణా క్రమంలో 14వ నక్షత్రము వరకు ఒక ఆవృతము పూర్తి చేస్తాయి.

దీని ప్రకారము ఈ విధానములో భ చక్రములోని 28 నక్షత్రములలో అశ్విని నుండి లెక్కించినప్పుడు 9, 10, 23, 24 వ నక్షత్రాలు "పూర్ణ వృష్టి" స్థితికి కారణమవుతున్నాయని సూత్రీకరించినట్లు గ్రహించవచ్చును.

గ్రహ సంచార ఫలములు

శుభ గ్రహాలైన- గురు, శుక్ర, బుధ, చంద్రులు సౌమ్య నాడీలో సంచరిస్తున్నప్పుడు మంచి వర్షములు ఉండును అమృత, జల, నీర నాడులలో సంచరిస్తున్నప్పుడు సమృద్ధిగా వర్షము చెప్పవచ్చును.

పాప గ్రహాలైన రవి, కుజ, శనులు, సౌమ్య నాడీలో సంచరిస్తున్నప్పుడు సాధారణ వర్షములు ఉండును.

ఈ గ్రహాలు దక్షిణాయనములో అమృత, జల, నీర నాడుల నుండి సంచరించిన సాధారణ వర్షపాతము ఉండును.

శుభ గ్రహాలైన - గురు, శుక్ర, బుధ, చంద్రులు దహన, ఛంద నాడులలో సంచరిస్తున్నప్పుడు చిరు జల్లులు కురియును.

పాప గ్రహాలైన రవి, కుజ, శనులు దహన, వాయు, ఛంద నాడులలో సంచరిస్తున్నప్పుడు వర్షాభావము వుండును.

7. కార్తె వాహన నిర్ణయం - వర్ష ఫలాలు

రవి నక్షత్ర ప్రవేశము - జ్యోతిష ప్రాముఖ్యత

భూగోళము మీద సమస్త ప్రాణికోటికి జీవ దాత సూర్యుడే. ఆ సహస్ర కిరణుడి కాంతి లేనట్లైతే ప్రాణికోటి మనజాలదు. భ చక్రములో రవి భ్రమణ కాలము (=భూమి రవి చుట్టూ ఒక ప్రదక్షిణం చేయడానికి) అనగా రవి భ చక్రములోని 27 నక్షత్రములలో సంచరించుటకు పట్టు కాలము ఒక సంవత్సరము. ఈ కాలములో రవి ప్రతి నక్షత్రము లోనూ సుమారు 14 రోజులు సంచరిస్తూ భూమిపై ఏర్పడే ఋతువులను నియంత్రిస్తున్నాడు. ప్రకృతి పరముగా వసంత ఋతువుతో, అంటే రవి అశ్విని నక్షత్రములలో సంచరించడం మొదలైన తరువాత, ప్రతి సంవత్సరము

పునరారంభమవుతుంది. రవి కృత్తికలో ప్రవేశించే కాలానికి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలకు చేరుకొంటూ రవి ఆర్ద్రను చేరుకునే నాటికి ఆవిరి అయిన సముద్ర జలాలు మేఘములై వర్షించడానికి నేపథ్యం స్థిరపడి ప్రకృతి లో వర్ష ప్రక్రియ మొదలవుతుంది. ఈ కారణంగానే రవి ప్రతి నక్షత్రములో వుండు కాలము "కార్తె" గా లోక ప్రసిద్ధ వాతావరణ శాస్త్రపు సాంకేతిక పదము అయింది.

'కార్తె నక్షత్రము' నుండి అంటే 'రవి వున్న నక్షత్రము' నుండి కార్తె ప్రవేశ కాలంలో చంద్రుడున్న నక్షత్రము వరకు లెక్కించి 9చే భాగిస్తే వచ్చే శేషం ఆ కార్తెకు వాహనం అవుతుంది. ఈ పద్ధతిలో సంబంధిత సంవత్సరానికి నిర్ణయించబడే కార్తెవాహనం ఆధారంగా వర్షఫలాలను సూచిస్తారు. వాహనములు సూచించు వర్షఫలములు దిగువ పట్టికలో వివరించబడినవి.

శేష సంఖ్య	కార్తె వాహనం	వర్షఫలం
1.	మూషిక (ఎలుక)	అల్ప వృష్టి
2.	సృగాల (నక్క)	అల్పవృష్టి
3.	మండూకము (కప్ప)	సువృష్టి
4.	మేషము (మేక)	అల్పవృష్టి
5.	మహిష (దున్న)	సువృష్టి
6.	శిఖి (నెమలి)	కండ వృష్టి
7.	గార్దభ (గాడిద)	అల్పవృష్టి
8.	గజ (ఏనుగు)	పర్వత వృష్టి
9.	అశ్వ (గుఱ్ఱం)	పర్వతవృష్టి

ప్రతి సంవత్సరం పంచాంగాలలో ఈ పద్ధతిలో కూడా వర్షఫలాలు సూచిస్తారు.

8. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ కాలము – ఫలితములు :

పైన పేర్కొన్న వర్ష సూచనా పద్ధతులన్నింటిలో వాతావరణ పరిస్థితులు లేదా గ్రహాలు వాటి కారకత్వాలు లేదా నక్షత్రాలు వాటిలో గ్రహ సంచారం ప్రధాన పరిశీలనా అంశాలుగా వున్నాయి.

జ్యోతిషశాస్త్ర పరంగా పండిత పామర ఆదరణ పొందిన వివిధ పద్ధతులలో వరాహమిహిరుడు వివరించిన ప్రవర్షణ విధానము ఒకటి కాగా 'రవి ఆర్ద్ర ప్రవేశ కాలము' మరియొక పద్ధతి. జానపదులలో సైతం 'ఆరు కార్తెలకు పోతు ఆరుద్ర కార్తె', 'ఆరుద్రలో కురిస్తే దారిద్ర్యం లేదు' వంటి సామెతలు ప్రచారం కావడానికి ఈ పద్ధతిలో వున్న విశిష్టతే కారణం అయింది.

ఆర్ద్రా నక్షత్రంలో రవి ప్రవేశ సమయాన్ని బట్టి ప్రకృతిని పాలించే రవి మరి కొన్ని ఇతర ముఖ్య జ్యోతిషాంశములు ఆ సంవత్సరానికి ఉండబోయే వర్ష స్థితి మరియు వర్ష ప్రమాణమును నిర్ధారిస్తాయి.

దార్శనికులైన ఋషులు ఈ మూల సూత్రము ఆధారంగానే వర్ష సూచన ఫలితములు నిర్ణయించారు. వారు సిద్ధాంతీకరించిన ఎనిమిది ముఖ్య జ్యోతిషాంశములు క్రింద ఇవ్వబడినవి.

1. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే తిథి (రవికి చంద్రుడితో వున్న దూరము)

2. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే వారము.

3. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి ఉండే నక్షత్రము (జలకారకుడైన చంద్రుడున్న స్థితి)

4. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే యోగము.

5. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే లగ్నము.

6. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే లగ్నము.

7. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి వుండే అహోరాత్ర భాగము (పగలు లేదా రాత్రి)

8. రవి ఆర్ద్ర నక్షత్ర ప్రవేశ సమయానికి చంద్రుడు సంచరించే నక్షత్రము యొక్క మండలము.

వర్ష సూచనా పద్ధతుల నిర్మాణంలో మన ఋషులు నక్షత్రములను ఆరు మండలములలో వర్గీకరించినారు.

అదే షణ్మండల విధానముగా ప్రసిద్ధి చెందినది.

శ్లో॥ చతుష్కంచ చతుష్కంచ పంచకం త్రికమేవ చ
పంచకం చాధ షట్కంచ భరణ్యాది భ మండలం ॥

తాత్పర్యం: భరణీ నక్షత్రం నుండి వరుసగా 4 నక్షత్రములు మొదటి మండలంలో తరువాత 5 మండలములలో ఒక్కొక్క మండలంలో క్రమంగా 4,5,3,5,6 నక్షత్రములు, మొత్తము 27 నక్షత్రాలు 6 మండలములలో వుంటాయి. రవి ఆర్ద్రా ప్రవేశ కాలానికి సంబంధిత చంద్రస్థిత నక్షత్రాన్నుసరించి ఫలితాలుంటాయి.

ఓరుగంటి మనోహరశర్మ సిద్ధాంతి

మౌఢ్య నిర్ణయ వ్యత్యాసం

సూర్యునితో సంబంధించిన ప్రతి గ్రహం కాంతిహీనమై వుంటుంది. కాంతిహీనమైన గ్రహాలు శుభఫలితాలనీయవు. ఈ స్థితిని అస్తంగత దోషం అంటారు. సూర్యుని సంబంధం వల్ల గ్రహాలు అస్తంగత్వం చెందుతాయి. గ్రహాల్లోని గురుడు, శుక్రుడు అస్తంగతులైనపుడు ఆకాశంలో నక్షత్రరూపంగా మనకు కన్పించరు. ఏ రోజుల్లో గురు, శుక్రులు కనబడరో ఆ రోజులకే 'మూఢమి' అనిపేరు. ఈ కాలంలో శుభకార్యాలు చేయరు. గురుడు అస్తంగత్వం చెందినపుడు 'గురుమూఢమ' అని, శుక్రుడు అస్తంగత్వం చెందినపుడు 'శుక్రమూఢమ' అని పిలుస్తారు. ఇవి పంచాంగాలలో సిద్ధాంతులు గణితం ద్వారా కాల నిర్ణయాన్ని సూచిస్తారు.

ఈ మధ్యకాలంలో మౌఢ్యకాల నిర్ణయంలో వివిధ పంచాంగాలలో వ్యత్యాసం వుండుటవల్ల పురోహితులకు మరియు ప్రజలందరకు ఇబ్బందులెదురవుతున్నాయి. దీనికి కారణం ఒక్కటే, మన పూర్వీకులు ఆచరించిన సనాతన శాస్త్రమే మనకు ప్రమాణం గనుక సిద్ధాంతులందరు ఒకే శాస్త్ర ప్రమాణాన్ని స్వీకరించినపుడు వ్యత్యాసానికి తావుండదు. శాస్త్రప్రమాణ విషయాలను కొన్ని మనం తెలుసుకోవడం అత్యంతావశ్యకం.

మౌఢ్యనిర్ణయ శాస్త్ర ప్రమాణాలు :

కుజాది గ్రహాలకు చేయు సంస్కార క్రమంలో నాల్గవ సంస్కార కేంద్ర భాగాలగు - "షడ్వేదరామైః గురుః"

- సిద్ధాంత గణకానందం.

అనగా గురు గ్రహం 346 భాగాలలో, **"గిరి సప్త రైపైః శుక్రః"**

అనగా 177 భాగాలలో శుక్రుడు పడమర దిశలో అస్తమిస్తున్నారు.

అదే మాదిరిగా - "వేదందుభిః గురుః" అనగా 14 భాగాలలో గురుడు, "పావక నాగ చంద్రైః శుక్రః"

అనగా 183 భాగాలలో శుక్రుడు తూర్పున



ఉదయిస్తున్నారని సిద్ధాంత గణకానందంలో పేర్కొనబడింది. దీన్ని ఆధారంగా చేసుకొని మనమందరం మౌఢ్య నిర్ణయం చేయుచున్నాము. ఇందుకు భిన్నంగా గణితం చేస్తున్న వారివల్ల వ్యత్యాసం వస్తుంది.

2. నాల్గవ సంస్కార శీఘ్ర కేంద్ర భాగాలకు కేవలం శుక్రుడు మాత్రం "తురగాగ్ని పావకైః శుక్రః ప్రాగస్తః" - త్రిదస్రైః పశ్చాదుదయః" అనగా శుక్రుడు 337 భాగలచే తూర్పున అస్తమించి, 23 భాగలతో పడమర ఉదయాన్ని పొందుచున్నాడని తాత్పర్యం.

అంతేకాక శాస్త్రంలో మౌఢ్యదినములు కూడా సుమారు నిర్ణయించి చెప్పారు.

గురుడు పశ్చాదస్తమయ దినం నుండి 30 రోజులు, 10 రోజులలో శుక్రుడు ప్రాగుదయాన్ని పొందుచున్నారు. మరియు కేవలం శుక్రుడు ప్రాగస్తమయదినం మొదలుకొని 71 దినములతో పశ్చాదుదయాన్ని పొందుచున్నాడు. ఇవి సుమారుగా తెలిపినవైనందున ప్రతి సంవత్సరం గణితాగతంగా మార్పులు రావడం సహజం.

భవిష్యత్తు మనమంతా శాస్త్ర ప్రమాణాన్ని అనుసరించి, మౌఢ్య నిర్ణయంలో వ్యత్యాసం రాకుండా చేయవలసివుంది.

ఈ గురు, శుక్రల మౌఢ్యకాలంలో -

శ్లో॥ చౌలోపనయనేవైవ, వివాహోద్యాపనాదికం ।
వేదారంభం గృహారంభం, మహారుద్రం తథైవచ ॥ 1

శ్లో॥ దేవతానాం ప్రతిష్ఠాంచ, గోదానం స్నాతకం చయత్ ।
వ్రత ప్రారంభణంచైవ, నవవధ్వాః ప్రవేశనమ్ ॥ 2

శ్లో॥ వాస్తుకర్మ మహాయజ్ఞం, ఉపాకర్మ తథైవచ ।
విలంబితం ప్రేతకార్యం, మహాదానాదికంచయత్ ॥ 3

శ్లో॥ బాలేవా యదివా వృద్ధే, శుక్రేవా స్తంగతేగురౌ ।
మలమాస ఇవైతాని, వర్జయేద్దేవ దర్శనమ్ ॥

తా॥ చౌలం, ఉపనయనం, వివాహం, ఉద్యాపనం, వేదారంభం, గృహారంభం, మహారుద్రార్చనం, దేవప్రతిష్ఠ, గోదానం, స్నాతకం, వ్రతారంభం, నూతనవధూప్రవేశం, వాస్తుకర్మ, యజ్ఞం, ఉపాకర్మ, బహిర్దశాహప్రేతకర్మ, మహాదానాది, నూతనదేవదర్శనం, మొదలగునవన్నీ చేయకూడదని శాస్త్రం తెలుపున్నందున మూఢమల యొక్క ప్రభావం బలమైంది.

గణిత సూక్ష్మాలు : గురుడు పడమర అస్తమించి, 30 రోజుల వ్యవధి తర్వాత తూర్పున ఉదయించును. తూర్పున ఉదయించి తిరిగి పడమర అస్తమించు దినములు 372 అనగా సుమారు సంవత్సరం 12 రోజుల తర్వాత గురు మూఢమ 1 నెల వచ్చునని అర్థం.

శుక్రుడు పడమర అస్తమించినపుడు 10 రోజుల మూఢము, తూర్పున అస్తమించినపుడు 72 దినములు (రెండు నెలలు 12 రోజులు) మూఢమ వుంటుంది.

ఈ విధంగా ప్రతి సంవత్సరం మూఢమలు వస్తుంటాయి. అయితే మిక్కిలి శుభగ్రహాలైన గురు, శుక్రుల అస్తంగతాల్లో మూఢములు ఆచరించుట శాస్త్ర సమ్మతమై వుంది. మిగతా కుజ, బుధ, శని గ్రహాలకు కూడా మూఢమ కలుగుతుంది. అనగా అస్తంగతులవుతారు. కాని ఆ రోజులలో మనం మూఢమలుగా ఆచరించనవసరం లేదని శాస్త్రం నిర్ణయించింది. శాస్త్రాధారమే మనకు శిరోధార్యం.

సమాజ శ్రేయస్సు కొరకే శాస్త్రం ఏర్పడింది. శాస్త్రాన్ని కాపాడవలసిన బాధ్యత మనపై వుంది. దానివల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగవు. సిద్ధాంతులమంతా ఏకమై ఒకేవిధమైన నిర్ణయాలతో మన పంచాంగాలను సమాజానికి అందించినపుడు పండుగల్లో విభేధాలుగాని, మౌఢ్యాలలో తేడాలుగాని వచ్చే అవకాశం వుండదు.

శాస్త్ర ప్రమాణమే శిరోధార్యంగా స్వీకరించిన మనం, సమాజ శ్రేయస్సుకై ప్రయత్నిస్తున్నందున విమర్శలకు గురికాకుండా వుండగలమని నా అభిమతం.

మౌఢ్యకాలంలో దోషంలేని కార్యాలను కూడా శాస్త్రంలో చెప్పబడినవి.

శ్లో॥ భుజంగమూలగ్రహరోగశాంతిషు,
అలబ్ధయోగే గ్రహణాభిషేకే ।
దోషప్రయుక్తే ష్వ ఖిల వ్రతేషుచ,
ఉత్పాత శాంతౌ న చ మౌఢ్య దోషః ॥

తా॥ ఆశ్లేష, మూలాది దోష నక్షత్రాల్లో జన్మించినపుడు చేయవలసిన శాంతులు, గ్రహచార సంబంధమైన శాంతులు, వ్యాధి నిర్మూలనకు చేయవలసిన జపహోమాదికములు, అనుకోకుండా కల్గిన గ్రహణ సంబంధమైన శాంతి, అభిషేకాదులు, దోషనివారణకు చేసే ప్రాయశ్చిత్తాది వ్రతాదికార్యాలు, ఉత్పాతాలు కలిగినపుడు చేయాల్సిన శాంతులన్నింటికి మౌఢ్యదోషం లేదు.

అంతేకాక మౌఢ్యదోషానికి అపవాదం కూడా శాస్త్రంలో చెప్పబడింది.

1. గురు, శుక్రులలో ఒకరు అస్తమించియుండగా, మరియొకరు తన యొక్క ఉచ్ఛ, మిత్ర, నవాంశ యందున్నపుడు, స్వక్షేత్రమందున్నను మౌఢ్యదోషం వర్తించదు.

2. గురుడు సుముహూర్తమందు బలవంతుడైనచో, కుజాది పాపగ్రహాలు, తృతీయ, లాభ, షష్ఠ, అష్టమ స్థానాలందుండగా, శుక్ర మూఢమ దోషం వుండదని భార్గవముని తెలిపాడు.

3. శుక్రోదయమైతే,గురు అస్తంగత దోషం వర్తించదు. గురు, శుక్రులిద్దరికి అస్తంగతత్వం వస్తే, మౌఢ్య దోషం వుండదని విశేష వచనాలున్నాయి.

అయితే పై శాస్త్రోపవాదాలున్నను మన ప్రాంతంలో గాని, ఎవ్వరుగాని ఈ అపవాదులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఖచ్చితంగా 'మూఢమ' యొక్క ఆచరణనే స్వీకరిస్తున్నారు.

చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి

ఆధునిక కాలంలో జ్యోతిష ప్రభావము

అవతారాణ్యనేకానిహ్యజస్య పరమాత్మనః ।
జీవానాం కర్మఫలదో గ్రహరూపీ జనార్దనః ॥

జ్యోతిషం, ఆధునిక సామాజిక అవసరము :

ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవిక తాపత్రయములు జాతకునియొక్క పూర్వ పుణ్యపాప ఫలముగా సంభవిస్తూ ఉన్నాయి. ఈ తాపత్రయములు జీవునకు సదా ఉండేవే కదా! వ్యక్తులు, వ్యవస్థలు, ప్రాణులు ఈ అంశములకు లోను కావలసినదే. పూర్వకాలంలో వ్యక్తులలో వ్యక్తిగత నిష్ఠా, అనుష్ఠానము, సామూహిక జీవనము, ఉమ్మడి కుటుంబంలో జీవించడము, పెద్దలయొక్క దృష్టి ఇటువంటి కవచములు మరియు స్వజీవనంలో నుంచి తీరిక, ప్రశాంతమైన జీవనవిధానము, ఆర్థిక విషయములలో ఎక్కువగా కూరుకుపోయి ఉండకపోవడము, సుబద్ధమైన సామాజిక వ్యవస్థ, ఉద్యోగభద్రత, నిరాడంబర జీవన విధానము, సాధారణమైన జీవన విధానము, ఇటువంటి అనేక ప్రశాంతమైన కారణముల వల్ల తన జీవితము హెచ్చుతగ్గులు, గెలుపోటములు అనేవాటికి లోనుకాక, ఒకవేళ ఏదైనా సమస్య ఎదురైనప్పటికీ సువ్యవస్థితమైన సామాజిక జీవనం వల్ల ఆయా సమస్యలను తను సమర్థవంతంగా ఎదుర్కోగలిగే అవకాశము ఎక్కువగా ఉండేది.

కానీ ప్రస్తుత ఆధునిక కాలంలో మారిన జీవనవిధానము, ఉద్యోగభద్రత, విఘటనమైన కుటుంబ వ్యవస్థ, సమాజంలో చోటు చేసుకుంటున్న వేగవంతమైన మార్పులు వాటిని ఎదుర్కోవడంలో కలుగుతున్న సమస్యలు, అస్తవ్యస్తమైన జీవన సరళివల్ల వ్యక్తిగత జీవితంలో ఎదురౌతున్న సమస్యలకు స్వంతంగా సమాధానం కనుగొనలేని స్థితి, సమయానికి సరియైన సలహా ఇచ్చేవారు లేనిలోటు, ఇటువంటి ఇంకా అనేక అంశములు సాధారణ జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి.

ఇటువంటి అసందిగ్ధమైన మానసిక స్థితి కలిగిన సమాజానికి ఆలంబనగా ఒక కుటుంబ పెద్దగా, ఎటువంటి స్వార్థభావములు లేక సలహా ఇచ్చే ఒక తల్లిగా, తండ్రిగా, గురువుగా, సోదరునిగా, స్నేహితునిగా జ్యోతిష శాస్త్రము ఈ సమాజమునకు ఉపయోగపడుతున్నది.





1. మానుష దోషము. 2. దైవదోషము అని సమస్యలకు కారణములు. ద్వివిధములని న్యాయశాస్త్రము చెప్పినట్లుగా, వాటి ఉపాయము కూడా "పురుష ప్రయత్నేన మానుష దోషనివృత్తి" అన్నట్లు మానుషదోషము వల్ల కలుగు దోషములను పురుష ప్రయత్నముద్వారా తొలగించుకోవాలని, "దైవదోషం శాన్తికర్మణా" అన్నట్లుగా గ్రహపీడలవల్ల కలుగు సమస్యలు, ఏవైతే మానవ ప్రయత్నంద్వారా నివృత్తి సాధ్యం కాదో వాటిని శాంతికర్మల ద్వారా తొలగించుకోవాలనే మార్గదర్శకం చేస్తూ ఈ సమాజానికి ఈ ఆధునిక కాలంలో జ్యోతిషము నడిపిస్తూనే ఉన్నది. వేదాంగములన్నింటికన్నా జ్యోతిషం సమాజానికి చాలా దగ్గరగా విస్తృత ఉపయోగంలో అన్ని వర్గాల వారికి నిత్యజీవితంలో అందుబాటులో ఉన్నది. "దృష్టం ప్రయోజనం శాస్త్రం" అన్నట్లుగా ఈ శాస్త్రము యొక్క ప్రయోజనము శాస్త్రవేత్తకు, అదేవిధంగా శాస్త్రమును ఆశ్రయించే వ్యక్తులకు కూడా ప్రత్యక్ష అనుభవమును కలిగించేదిగా ఉండటం మనకందరికీ తెలిసిందే.

జ్యోతిషం ఒక మూఢనమ్మకమనీ, దానిని ఆశ్రయించే వారినీ తూలనాడేవారికి శాస్త్రమును ఉపాసిస్తున్న పండితులు, ఆస్తిక సమాజము సరియైన విధంగానే సమాధానం చెప్తున్నప్పటికీ ఒక సంఘటిత సమాజంగా ఈ శాస్త్రమును ఉపాసించే వారంతా ఒక్క తాటిపై కలిసి ఈ అంశంలో సాధించాల్సిన లక్ష్యాలు, సరిదిద్దాల్సిన అంశాలు విమర్శలకు దీటైన సమాధానాన్ని అందించే వ్యవస్థను నిలబెట్టుకుంటున్న ఈ తరుణం రాష్ట్ర అవతరణ తరువాత జరుగుతున్న మహత్పరిణామముగా మరియు భవిష్యత్తు ప్రామాణికంగా ఉజ్జ్వలంగా గోచరిస్తూ ఉన్నది.

జ్యోతిష పండితులు రాజసభలలో, రాజాశ్రయాలలో ఉంటూ ఒక భద్రమైన వాతావరణంలో శాస్త్రపు లోతులను స్వప్రజ్ఞతో, స్పర్ధతో అద్భుతమైన ఫలితాలను అందించినట్లు మనం విని ఉన్నాం. ఆధునిక కాలంలో కూడా పెద్దగా ప్రభుత్వ పోషణ లేకపోయినప్పటికీ శాస్త్రము ఒక ఆచారముగా, కులస్వభావంగా ఎంచుకుని అరకొర వసతులతో జీవనపోరాటం కొనసాగిస్తూ కూడా సమాజానికి సేవలందిస్తూనే ఉన్నారు. అటువంటి సాధనాపరంపర, గురు శిష్యపరంపరలో ఉన్న మహాత్ములందరూ ఈ బృహత్ప్రయత్నంలో ఒక్కటై ఈ ప్రాంతానికి, ఈ దేశానికి సమస్త మానవాళికి, సమస్త జీవకోటికి మంగళప్రదమైన పరిణామాన్ని అందిస్తారనడంలో ఎటువంటి అనుమానం లేదు.

మాడుగుల శశిభూషణశర్మ సోమయాజి



"జ్యోతిషామయనం చక్షుః". జ్యోతిష శాస్త్రం వేద పురుషుని నేత్రాంగం. భవిష్యత్తును దర్శించి మానవునికి దిశానిర్దేశం చేసే మార్గదర్శిని జ్యోతిషం. పంచ స్కంధాత్మకమైన ఈ శాస్త్రంలోని సిద్ధాంతభాగం, గ్రహాల స్థితిగతుల గణన, పంచాంగముల గణన, ముహూర్తాలు, పండుగలు, గ్రహణాలు, మూఢాలు, శుభాశుభకార్యాలకు నియమ, నిషేధాలు తెలియచేసే కరదీపిక పంచాంగం.

హోరాభాగం జాతక పరిశీలన, ఫలితాలు, పరిహారాలు తెలుపుతూ మానవుని మనుగడకు మార్గనిర్దేశం చేస్తుంది. సంహిత భాగంలో అనేకానేక విషయాల మేళవింపు ఉంటుంది. ప్రకృతిలోని అనేక విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ఒక దైవజ్ఞుడు జాతక పరిశీలన చేసి, సరి అయిన పరిహారాలు సూచించడానికి ఎంతో ప్రతిభ, సాధన, అనుభవంతోపాటు, కర్మవిపాకం, పురాణ వాఙ్మయం, ఇతిహాసాలతో పాటు, దేశకాల వస్తు పాత్రలను అనుసరించి అవగాహన, పరిశోధనలు, వైద్యశాస్త్రంతో పాటు అనేకానేక విషయాల పట్ల అవగాహన ఉండాలి.

ఒక దైవజ్ఞునికి శాస్త్ర పఠనమే కాకుండా జాతకాలను సూక్ష్మ పరిశీలన చేసే అనుభవం కూడా ఉండాలి.

జాతకాల్లో కేవలం కుజదోషం, నాగదోషం, పితృదోషం, రాహుకేతు దోషాలు మాత్రమే కాదు అనేకానేక విషయాలు ఉంటాయి. పుట్టిన సమయంలో 2 నిమిషాలు తేడా ఉన్నా షష్ట్యంశలో మార్పు వస్తుంది. జాతకాలను సూక్ష్మ పరిశీలన చేసి మాత్రమే ఫలితాలు చెప్పాలి. అందుకు దైవజ్ఞునికి అనుభవం ఉండాలి. జ్యోతిష శాస్త్రం పట్ల, సరి అయిన అవగాహన ఉండాలి.

జాతకం ఎందుకు తెలుసుకోవాలి :

పూర్వజన్మ కృతం పాపం వ్యాధిరూపేణ బాధతే ।
తచ్ఛాంతిః ఔషధైః దానైః జపహోమ, సురార్చనైః ॥

అంటారు. పూర్వజన్మల పాపాలు వ్యాధి రూపంలో



బాధిస్తాయని, దానికి జపదానహోమ, దేవతార్చనలు చేయాలని, ఓ వైపు చెపుతూనే "అపశ్యమను భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం" అంటారు. పూర్వం చేసిన పాప పుణ్యాలను అనుభవించి తీరాలనేది శాస్త్రవచనం. అనుభవించనిదే పాప పరిహారం కాకపోతే, పరిహారాలు, జపదానహోమాల అవసరం ఏమిటి?

మన పూర్వజన్మల నుండి మనకి తెలియని పాపాల మూటను తలమీద మోసుకువస్తాం. ఆ మూటలోని పాపాలు జీవితంలోని ఏ అంశాలు సూచిస్తున్నాయి? ఎప్పుడు వాటి ప్రభావం ఉంటుందని సూచించేది జ్యోతిషం. పూర్వజన్మలోని పాపాల పరిహారానికి భగవంతుని శరణు వేడుకుంటూ, ఈ జన్మలో తప్పులు చేయకుండా మనని మనం సంస్కరించుకుని, ముందుకు వెళ్ళినపుడు, దోష ప్రభావం అనుభవించినా, దానిలో మునిగి అంతం కాకుండా బయటపడవచ్చు.

దైవజ్ఞుని బాధ్యతలు : నేటి సమాజంలో భగవంతుని పట్ల, జ్యోతిషం పట్ల, వాస్తు పట్ల నమ్మకం కంటే భయం ఎక్కువగా కనబడుతుంది. శాస్త్ర పరిజ్ఞానం తెలియని వారి ప్రచారం వలన అసలు జ్యోతిషశాస్త్రంలోని, ధార్మిక గ్రంథాలలోని విషయాలు మరుగున పడి, అనవసరపు ఆర్భాటాలు ఎక్కువ అవుతున్నాయి. దాని వలన దోష పరిహారాలు సంపూర్ణంగా జరగడం లేదు. తద్వారా జ్యోతిషశాస్త్రం మీద నమ్మకం పోయి అన్య విషయాల మీద శ్రద్ధ చూపేవాళ్లు పెరుగుతున్నారు.

ఈ తరుణంలో శాస్త్ర పరిజ్ఞానం కల్గిన అనుభవజ్ఞులైన జ్యోతిష పండితులు, ఏది తప్పు, ఏది ఒప్పు అని తెలియ చేయాల్సిన అవసరం ఉంది. ప్రచార, ప్రసార సాధనాలు కూడా కేవలం వ్యాపార దృష్టితో కాకుండా, సామాజిక బాధ్యత కల్గి అనుభవజ్ఞులైన, శాస్త పరిజ్ఞానం కల్గిన పండితులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అందుకు పండితులంతా ఒక వేదిక మీదకు వచ్చి ప్రభుత్వాలకు, తద్వారా అందరికి కొన్ని నియమ నిబంధనలు తెలియచేయాల్సిన అవసరం ఉంది. అశాస్త్రీయమైన విషయాలను ఖండించి, శాస్త్రంలోని విషయాలను సామాన్యులకు తెలియచేయాల్సిన అవసరం ఉంది. అన్ని విద్యల్లాగానే ధార్మిక విషయాలు, జ్యోతిషశాస్త్రం కూడా ఒక సబ్జెక్టుగా బోధించినపుడు, రేపటి సమాజానికి సమగ్ర శాస్త్ర పరిజ్ఞానం కల్గిన పండితులని అందించగల్గుతాం.

డా. మహావాది సంధ్యాలక్ష్మి

తెలంగాణ విద్వత్సభా వైభవమ్

ఈ మధ్యకాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంత గొప్పనైన మహాసభలు కనీవినీ ఎరుగని రీతిలో 'న భూతో న భవిష్యతి'గా జరుగుట హర్షణీయం. రాష్ట్రంలోని పలువురు సిద్ధాంతులు, జ్యోతిష పండితులు ఒకే వేదిక మీదకు రావడమే గాక వేలాదిమంది సమక్షంలో ఏకగ్రీవంగా 'తెలంగాణ విద్వత్సభ' అను కోర్‌కమిటీ (సారథ్య బృందం) ఎంపిక చేసుకోవడం అద్భుతమైన విషయం. పండితుల మధ్య ఐక్యతకు ఇది ఒక నిలువెత్తు నిదర్శనం. యావత్ప్రపంచంలోనే చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయే అంశం. తెలంగాణ వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేలా తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు జరుగుట తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టం. ఇందుకు ప్రభుత్వ సహకార, ఆమోదాలు లభించుట ఆనందదాయకమైన అంశం. 'తెలంగాణ విద్వత్సభా వైభవమ్' పూర్తి వివరాలు ఇవిగో!

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో అంతర్భాగంగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సహకారంతో నిర్వహించిన 'విద్వత్సభ' అత్యద్భుతంగా జరిగింది. సెప్టెంబర్ 9వ తేది సాయంత్రం తెలుగు లలితకళా తోరణంలో జ్యోతిష మహాసభల్లో మొదటిరోజున శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారి అధ్యక్షతన 'విద్వత్సభ' సమావేశమైంది. ఈ సమావేశానికి సమన్వయకర్తలుగా శ్రీ వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ (వరంగల్) గారు, శ్రీ బోర్పట్ల హన్మంతాచార్యులు (సంగారెడ్డి) గారు వ్యవహరించారు. రాష్ట్రం నలుమూలల నుండి పంచాంగకర్తలైన 50 మంది సిద్ధాంతులు, 100 మంది జ్యోతిష పండితులు, 100 మంది పురోహితులతో పాటు 100 మంది అర్చకులు కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాలమేరకు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలైన యాదాద్రి, భద్రాచలం, వేములవాడ, బాసర క్షేత్రాల నుండి ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు, చైర్మన్లు, ప్రధాన పురోహితులు పాల్గొనుట విశేషం. 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ గారు స్వాగతోపన్యాసం చేస్తూ - సభనుద్దేశించి సుమారు 30 ని॥లు అందరూ ఆశ్చర్యపోయే విధంగా అనర్గళంగా అద్భుత ప్రసంగం చేసారు.

గతంలో కొంతకాలం కేవలం మెదక్‌జిల్లా బ్రాహ్మణ సంఘంవారు మెదక్ జిల్లాలో 'విద్వత్సభ' ప్రతి సంవత్సరం రాబోవు సం॥ర పండుగల నిర్ణయాల కోసం నిర్వహించేవారు. తర్వాత 3 సం॥ల క్రితం నుండి ఆ బాధ్యతను రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యవారు నిర్వహిస్తూ వచ్చారు. ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు నిర్వహించాలని శ్రీతత్త్వానంద ఋషి గారు (శ్రీగాయత్రి పీఠం), శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు (జ్యోతిర్మయ మహాపీఠం), నేను (అనగా దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక) సంయుక్త ఆధ్వర్యంలో, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ మరియు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వారి సౌజన్యంతో సంకల్పించిన తరుణంలో ప్రతి సంవత్సరం జరిగే 'విద్వత్సభ'ను కూడా ఇందులో అంతర్భాగంగానే జరుపాలనుకోవడంతో అందుకు అంతకుముందు నిర్వహిస్తూ వస్తున్న రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అంగీకరించింది. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ విద్వత్సభ ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల నిర్వాహకుల పక్షాన స్వాగతం పలుకుతున్నాను.

సిద్ధాంతాలు ఏవైనా వుండని గాక! ముఖ్యంగా మన ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుగారు సాకారం చేయాలనుకున్న 'బంగారు తెలంగాణ'లో ప్రజలు పండుగలు జరుపుకోవడంలో ఇబ్బందులెదురు కాకూడదు, పండుగల నిర్ణయ విషయంలో ఈ సభలో నున్న సిద్ధాంతులు, పండితులందరూ కూలంకషంగా చర్చించి, ఒకే నిర్ణయానికి రావాలని కోరుతున్నాను. ఈ విషయంలో ప్రతి ఒక్కరు సంపూర్ణంగా సహకరించాలి.

సుమారు ఒక గంట కాలం సమగ్రంగా చర్చించి, రాబోవు శ్రీ విళంబి నామ సం।।ర పండుగల నిర్ణయాలను అందించారు. సభలోని అందరు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేసారు. అంతేగాక భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలను తీసుకోవడానికి గాను శాశ్వత ప్రాతిపదికగా ఒక 'కోర్‌కమిటీ' (సారథ్య బృందం)ని తయారు చేయాలని 'దర్శనం' శర్మగారు కోరగానే అందరూ అంగీకరించారు. ఏకగ్రీవంగా సిద్ధాంతులు, జ్యోతిష పండితులు కలిసి సుమారు 15 మందితో కోర్ కమిటీని వేసారు. దీనికి 'తెలంగాణ విద్వత్సభ'గా నామకరణం చేసారు. ఈ రోజు ఈ సభలో నిర్ణయించిన వివరాలనే రవీంద్రభారతిలో జరిగిన జ్యోతిష మహాసభల సమాపనోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీమాన్ డా. కె.వి. రమణాచారి గార్కి (కోర్‌కమిటీ) తెలంగాణ విద్వత్సభ బృందం వేదికపై సమర్పించింది. ఇది చాలా మంచి తరుణం. ప్రజలకు, ప్రభుత్వానికి ఎంతో మేలు చేకూర్చే కార్యక్రమాన్ని చేపట్టారని శ్రీరమణాచారి గారు ప్రశంసించారు. 'తెలంగాణ విద్వత్సభ' ఏర్పడటం ముదావహమన్నారు.

ఇంతవరకు సమైక్య రాష్ట్రంలోగాని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గాని ఇలాంటి సభలు జరుగలేదని 'న భూతో న భవిష్యతి'గా ఇంత పెద్ద సభ జరుగడమేగాక తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధాంతులు, జ్యోతిష పండితులందరు ఒకే వేదికపైకి రావడం, ఏకగ్రీవంగా తీర్మానాలు చేయడం, పండుగల తేదీలను ప్రకటించడం, ఏకగ్రీవంగానే తెలంగాణ విద్వత్సభ ఏర్పాటు కావడం హర్షణీయమని సభికులందరు కొనియాడారు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని, చరిత్రలో నిలిచిపోయే విధంగా వుందని నిర్వాహకులను అందరు అభినందించారు.

మరో విశేషమేమిటంటే! సభలో నిర్ణయించిన శ్రీ విళంబి నామ సం।।ర పండుగల వివరాల ప్రకారమే శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి శిష్యులు, శ్రీయతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి గారు స్వయంగా గుణించిన శ్రీవిళంబి నామ సం।।।ర పాకెట్‌సైజు పంచాంగాన్ని మరియు 2018 క్యాలెండర్‌ను రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఉదయమే ఆవిష్కరించుట జరిగింది.

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు దిగ్విజయంగా, ఘనంగా పూర్తి చేసుకున్న తరుణంలో తెల్లవారి గౌరవనీయులు మాన్యశ్రీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట చంద్రశేఖర్‌రావు గారు స్వయంగా నిర్వాహకులను ఆహ్వానించి అభినందించారు. నిర్వాహకులు మరియు కోర్‌కమిటీ అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖర్‌శర్మగారు ముఖ్యమంత్రి గార్కి రాబోవు శ్రీ విళంబి నామ సం।।ర పండుగల నిర్ణయ వివరాలను సమర్పించిన తక్షణమే. అధికారులతో ఆమోదింపచేశారు. ఆ వివరాలన్నీ వార్తాపత్రికలన్నీ ప్రచురించాయి. దీని ప్రకారమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవులు ప్రకటించింది.

ఇకముందు తెలంగాణ రాష్ట్రంలో 'తెలంగాణ విద్వత్సభ' నిర్ణయించిన ప్రకారమే పండుగలు జరుపబడతాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇక భవిష్యత్తులో విభేదాలకు తావుండదు. ప్రజల్లో గందరగోళ పరిస్థితికి శాశ్వతంగా తెరపడింది. ముఖ్యంగా పురోహితులకు, అర్చకులకు మధ్య విభేదాలు లేకుండా జరిగింది. మంచి సుహృద్భావ వాతావరణంలో ఇంతటి గొప్ప కార్యక్రమం జరిగినందులకు అందరూ హర్షించారు, అభినందించారు.

తెలంగాణ విద్వత్సభలో రాష్ట్రంలోని ప్రతి సిద్ధాంతి, ప్రతి జ్యోతిష పండితుడే గాక ఆసక్తిగల అభిమానులందరూ సభ్యులే. సభలో ఏకగ్రీవంగా ఎంపికైన సారథ్య బృందం (కోర్ కమిటీని) రిజిస్ట్రేషన్ చేయించడమైనది. భవిష్యత్తు సిద్ధాంతపరంగా గాని, జ్యోతిష పరంగా గాని, ప్రభుత్వమైనను, సభ్యులైనను, ప్రసార మాధ్యమాలైనను, పత్రికలవారైనను కోర్‌కమిటిని ముందుగా సంప్రదించాలని కోరుచున్నాము.

కోర్ కమిటి దృష్టికి రాకుండా సంబంధించిన విషయాలలో ఏదైనా సమస్యలుత్పన్నమైనచో కోర్ కమిటి బాధ్యత వహించదు. కేవలం లోకకళ్యాణార్థం, సమాజ శ్రేయస్సు కోసమే తెలంగాణ విద్వత్సభ కృషి చేస్తుంది. వ్యక్తిగత సమస్యలకు ఎవరికివారే బాధ్యులవుతారు.

ప్రత్యేక జటిలమైన అంశాల పరిష్కారానికై సబ్ కమిటీలను ఏర్పాటు చేస్తుంది.

భవిష్యత్తులో జరగాల్సిన కార్యక్రమాల గూర్చి ఎవరైనా అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని కోరుతున్నాం. అవసరం, అవకాశాన్ననుసరించి స్వీకరించి తగు చర్య గైకొనుటకు ప్రయత్నిస్తాం.

రాయప్రోలు మల్లికార్జున శర్మ

నవగ్రహ అనుగ్రహమ్

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల సందర్భంగా సమాజానికి జ్యోతిశ్శాస్త్రానికి మూలాధారమైన నవగ్రహాల స్వరూప, స్వభావాలను మరియు శాస్త్రసంబంధమైన అంశాలను సులభంగా అవగాహనయగుటకు చేయు ప్రయత్నమే 'నవగ్రహ అనుగ్రహం' అను జ్యోతిష రూపకం.

జ్యోతిష పండితులచేతనే ప్రస్తుత కాలానుగుణ అంశాలను తెలిపే వినూత్న రూపకల్పన ఇది. శ్రీదివ్యజ్ఞాన సిద్ధాంతిగారు రూపొందించిన నవగ్రహ అనుగ్రహం యొక్క సమగ్ర స్వరూపం.

తెర తీయగనే

ఒక గొప్ప జ్యోతిష పండితుడు (సిద్ధాంతిగారు) ఆసీనుడై వుంటాడు. శాస్త్ర గ్రంథాలతోపాటు ఆధునిక పరికరాలైన స్మార్ట్ ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లు ప్రక్కన వుంటాయి. ఇంతలో రింగ్, రింగ్ మని ఫోన్ మ్రోగుతుంది.

సిద్ధాంతి గారు : హలో! శుభమస్తు! ఎవరండి?

(ఫోన్‌లో) నేనండి! సిద్ధాంతిగారు! నమస్కారం! గీతామూర్తిని మాట్లాడుతున్నాను.

సిద్ధాంతిగారు : ఓ! మీరా! బాగున్నారా తల్లీ! చెప్పండి!

గీతామూర్తి : అయ్యా! ఇప్పుడే మాకు మనుమరాలు (ఫోన్‌లో) పుట్టింది. పాప నక్షత్రం, వివరాలు తెలుసుకోవడానికి మీ వద్దకు రావాలను కుంటున్నాను. రమ్మంటారా! సిద్ధాంతిగారు!

సిద్ధాంతిగారు : ఏం ఫరవాలేదు! రండి అమ్మా! ఇదిగో! తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల సందర్భంగా నన్ను జాతకాలు పరిశీలించడానికి రవీంద్రభారతిలో నియమించారు. వెంటనే రావచ్చమ్మా!

గీతామూర్తి : మేం రావడం పనికివస్తుందా? అని (ఫోన్‌లో) అనుమానపడుతున్నాం సిద్ధాంతిగారు!

సిద్ధాంతిగారు : ఎందుకమ్మా? మీ అమ్మాయి కదా! ప్రసవించింది. మీరు అమ్మమ్మ అవుతారు. మీకు పురుడు (జాతాశౌచం) వుండదు కదమ్మా! తప్పక రావచ్చు.

గీతామూర్తి : అయితే ఇప్పుడే వస్తున్నాను. సంతోషం సిద్ధాంతిగారు.



(ఫల, తాంబూల, దక్షిణలు తీసుకుని సిద్ధాంతిగారి వద్దకు పృచ్ఛకురాలిగా శ్రీమతి గీతామూర్తిగారు ప్రవేశించి, వారికి భక్తి, శ్రద్ధలతో సమర్పిస్తూ, నమస్కరిస్తుంది.

సిద్ధాంతిగారు : అమ్మా! శుభమస్తు! సుమంగళీభవ! మీ అమ్మాయి, పుట్టిన పాప బాగున్నారు కదా! చాలా సంతోషం!

పృచ్ఛకురాలు : అందరూ బాగున్నారు! మీ ఆశీర్వాదం వల్ల మాకు ఏ ఇబ్బందుల్లేవు. మరి మా మనుమరాలి నక్షత్రం, జాతకం గూర్చి తెలుసుకోవచ్చంటారా!

సిద్ధాంతి : అయ్యో! ఎందుకు తెలుసుకోకూడదు? తప్పకుండా తెలుసుకుని, ముందు జాగ్రత్తలు తీసుకోవడానికే కదా! ఈ జాతకాలేర్పడింది. అయితే జాతాశౌచం వున్నవారు మాత్రం రావడం పనికిరాదని పెద్దలు అలా చెప్పారు.

పృచ్ఛకురాలు : స్వామి! మా మనుమరాలు ఈ రోజు, ఇప్పుడే సాయంత్రం 5 గంటలకు, ఇక్కడే (హైదరాబాద్‌లో) జన్మించింది. పాప నక్షత్రం, పాదం, రాశి చెపుతారా?

సిద్ధాంతి : అమ్మా!మీ పాప 10-9-2017 సా. 5 గంటలకు హైదరాబాద్ జన్మస్థలం కదా! అయితే ఒక్క నిమిషం! (ల్యాప్‌టాప్‌లో పరిశీలిస్తూ). అమ్మా! మీ మనుమరాలి నక్షత్రం భరణీ - 1వ పాదం - మేషరాశి, లీలావతి జన్మనామం.

పృచ్ఛకురాలు : అయ్యా! నక్షత్ర దోషం ఏమైనా వుందంటారా! శాంతులు ఏమైనా చేయించాలా? చెప్పండి!

సిద్ధాంతి : అమ్మా! భరణీ నక్షత్రం శాంతి నక్షత్రమే. అయినా 1వ పాదం గనుక స్వల్పదోషం వుంటుంది. పురుడు వెళ్ళిన తర్వాత నక్షత్ర జప, హోమ, దానాదులు చేయిస్తే మంచిది.

పృచ్ఛకురాలు : అలాగే స్వామి! పాపకు ఏ పేరు పెట్టమంటారు. ఏ అక్షరంతో పెడితే మంచిదంటారు?

సిద్ధాంతి : పాపకు తల్లిదండ్రుల ఇష్టానుసారం ఏ పేరైనా పెట్టవచ్చును. నక్షత్రం ప్రకారం పేరు పెట్టాలని శాస్త్రంలో చెప్పబడలేదు. మన పెద్దలెవరు అలా చేయలేదు. జన్మ నామం వేరు, వ్యవహార నామం అనగా పిలిచే పేరు వేరుగా ఉండడం మంచిది.

పృచ్ఛకురాలు : మంచిదయ్యా! మరి మా పాప జాతకం ఎలా వుంది? భవిష్యత్తు బాగుంటుందంటారా? మీరు గొప్ప అనుభవజ్ఞులు, తపస్సంపన్నులు. మీ ద్వారా మాకు తప్పకుండా మంచి జరుగుతుందని కోరుకుంటున్నాను!

సిద్ధాంతి : అలాగేనమ్మా! మీ విశ్వాసం ఎప్పుడూ వమ్ము గాదు. మీ పాప గూర్చి మీరింతగా ఆరాటపడుతున్నారు గనుక, నేను గాదు, నా తపశ్శక్తి ద్వారా ఆ నవగ్రహాల ద్వారానే మీ పాప జాతక ఫలితాలు చెప్పిస్తాను. మీరు నిశ్చింతగా వుండండి!

పృచ్ఛకురాలు : అలాగా స్వామి! నా అదృష్టం. ఇంక కావలసిందేముంది! నన్నేం చేయమంటారు స్వామి?

సిద్ధాంతి : ఏం లేదమ్మా! ఆ దేవతలు ఈ కలికాలంలో మనకు కనబడరు. దివ్యదృష్టితో మాత్రమే చూడాలి. నేను ప్రార్థన చేస్తాను. మీరూ కన్నులు మూసికొని ప్రార్థన చేయండి. తప్పక మనముందు నవగ్రహాలు ప్రత్యక్షమవుతారు.

పృచ్ఛకురాలు : అలాగే స్వామి! (ఇద్దరు కన్నులు మూసి, ముందుగా చంద్రుణ్ణి ప్రార్థిస్తారు) సిద్ధాంతిగారు. (పాప జన్మకుండలి చూస్తుంటారు)

(చంద్రుడు ప్రవేశిస్తాడు. సిద్ధాంతి గారు, పృచ్ఛకురాలు ఇరువురు నమస్కరిస్తారు).

సిద్ధాంతి : చంద్రదేవా! మా ప్రార్థనను మన్నించి, ప్రత్యక్షమైందులకు ధన్యులం. ప్రస్తుతం మీరు మేషరాశిలో వుండి. ఈ జాతకురాలికి ఏవిధమైన ఫలితాలిస్తారో తెలియజేస్తారా స్వామి!

చంద్రుడు : (తన అధిదేవతయైన మహాగౌరిని ధ్యానిస్తాడు)

అమ్మా! మీ మనుమరాలికి మనఃకారకుడ నైన నేను నాల్గవ స్థానంలో శుభ ఫలితాలు కలుగజేస్తాను. మాతృ ప్రేమ సంపూర్ణంగా వుంటుంది. గృహ, వస్తు, వాహన లాభాలుంటాయి. ప్రాథమిక విద్యలో ప్రతిభను కనబరుస్తుంది. సప్తమాధిపతినైన నేను శుభకార్యాలకు ఆటంకాలు కలుగనివ్వను.

సిద్ధాంతి చెప్పినట్లు భరణి నక్షత్రంలో వున్నందున స్వల్ప శాంతితో సంతృప్తి చెందుతాను. శుభమస్తు!

సిద్ధాంతి : సంతోషం స్వామి! (నమస్కరిస్తారు!

పృచ్ఛకురాలు : తర్వాత కుజుణ్ణి ప్రార్థిస్తారు. కుజుడు ప్రవేశిస్తాడు. ఇద్దరు నమస్కరిస్తారు.)

సిద్ధాంతి : కుజదేవా! ఈ అమ్మగారి మనుమరాలి జాతకంలో అష్టమస్థానంలో రవి, బుధులతో కలిసి వున్నారు కదా! పాపకు మీరిచ్చే ఫలితాలు సెలవియ్యండి స్వామి!

కుజుడు : అమ్మా! మీ మనుమరాలి గూర్చి కంగారు పడక్కర్లేదు. కాని జాగ్రత్తపడాలి. నేను అష్టమస్థానంలో రవితో అస్తంగతుడనై, బుధునితో కూడి యున్నందున, మంచి ఫలితాలు ఇచ్చే అవకాశం లేదు. అలాగని చెడు ఫలితాలు కూడా వుండవు. ఎందుకైనా మంచిది. మా గ్రహరాజైన సూర్యగ్రహ అనుగ్రహాన్ని పొందడం అవసరం ఆయన ఆధీనంలో వున్నాను. వారితోపాటు నాకు కూడా జప, తర్పణ, హోమ, దానాదులు జరిపించండమ్మా! శుభం భూయాత్!

సిద్ధాంతి : కుజుడు చెప్పవలసింది చెప్పాడు. విన్నావు గదమ్మా! ఇక బుధుడు వస్తున్నాడు. బుధదేవా! ఈ అమ్మగారి మనుమరాలి జాతకరీత్యా మీరిచ్చు శుభాశుభ ఫలితాలు, పరిహారాలు తెలియజేయండి స్వామి!

బుధుడు : అమ్మా! ఇంతవరకు కుజుడు చెప్పినట్లే నేను అష్టమస్థానంలో గ్రహదేవుడైన రవితో అస్తంగత్వం వచ్చింది. నాకు స్వతంత్రం లేదు. నావల్ల చెడు ఫలితాలుండవు. కాని పాపులతో కలిసివున్నానమ్మా! అందుకే. అశుభ ఫలితాలు రాకుండా జాగ్రత్త పడాలమ్మా! నాకు పచ్చదనం, పెసర్లు, ఆకుపచ్చరంగు చాలా ఇష్టం. ఇవి దానం చేయమ్మా! తప్పకుండా మంచి జరుగుతుంది. మంచి బుద్ధిని కలిగిస్తాను.

సిద్ధాంతి : అమ్మా! బుధుడు చెప్పినట్లు మన ప్రభుత్వం వారు తలపెట్టిన హరితహారంలో పాల్గొని ఒక వంద మొక్కలు నాటిస్తే చాలమ్మా! బుధుడు తృప్తి చెంది, మంచి ఫలితాలనిస్తాడు మరి గురుగ్రహాన్ని ఆహ్వానిద్దాం!

(గురుదేవుడు ప్రవేశం)

గురుదేవా! ఈ చిరంజీవి జాతకంలో మీరిచ్చు ఫలితాలు తెలుపండి స్వామి!

గురుడు : నేను ఈ జాతకంలో శుభఫలితాలనే కలిగిస్తాను. భాగ్యస్థానంలో వున్నాను. మంచి విద్య తెలివితేటలు, ధనలాభం, ధాన్యలాభం, ఉన్నత విద్యా లాభాలున్నాయి. బుద్ధి కారకుడు బుధుడైనా, బుద్ధికి 'బృహస్పతి' అంటారు కదా! నావల్ల బుద్ధి, జ్ఞానం కలుగుతాయి. అన్ని శుభఫలితాలుంటాయి. మీరేం చింతించ నవసరం లేదు. ఇక్కడ తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో కమలాకరశర్మ ఆహ్వానించారు కనుక

ఇక్కడికి వచ్చాను. ఇంకాసేపట్లో నేను కావేరి పుష్కరాల్లో వుంటాను. మీరందరు అక్కడ నన్ను దర్శింతురు గాక! శుభం భవతు!

సిద్ధాంతి : గురుదేవుడు మీ మనుమరాలికి అన్ని శుభఫలితాలు కలిగిస్తానన్నాడు కదా! ఇక బాధలేదు. తర్వాత శుక్రగ్రహాన్ని ఆహ్వానిద్దాం! (శుక్రుడు ప్రవేశం).

శుక్రదేవా! మీరే స్థానంలో వున్నారు స్వామీ? మీరిచ్చే ఫలితాలెలా వుంటాయో తెలియజేస్తారా? స్వామి!

శుక్రుడు : అమ్మా! సప్తమ స్థానంలో నేను శుభ ఫలితాలివ్వడానికి సిద్ధంగా వున్నాను. కాని నా వెంట రాహువున్నాడు తల్లి! గురుడితో రాహువు కలిసివుంటే 'గురుచండాల యోగం' అంటారమ్మా జ్యోతిష పండితులు. ఇపుడు నా పరిస్థితి అలాగే వుంది. ఇపుడైతే ఏమి ఇబ్బంది లేదు. భవిష్యత్తు వివాహ సమయం వచ్చినపుడు ముందుగా మన సిద్ధాంతిని సంప్రదించమ్మా! జాగ్రత్తలు, పరిహారాలు చెపుతాడమ్మా! ఆ విధంగా ఆచరిస్తే భయం వుండదు. అంతా మంచే జరుగుతుంది. ఒక్క విషయమమ్మా! మీ మనుమరాలు గొప్ప కళాకారురాలు అవుతుందమ్మా! ఆరోగ్యం విషయంలో జాగ్రత్త తీసుకోండి! చాలు!

సిద్ధాంతి : విన్నావు గదమ్మా! శుక్రుని సంగతి. ఇక శనిదేవుని ఆహ్వానిద్దాం! (శనైశ్చరుడు ప్రవేశం)

శనిదేవా! మీరు ఈ పాపకు ఏవిధమైన శుభఫలితాలిస్తారో, స్వయంగా మీ ద్వారానే వింటానంటుంది. ఈ తల్లీ! దయతో సెలవియ్యండి స్వామి!

శని : లగ్నాధిపతినైన నేను లాభస్థానంలో వున్నాను. కాని నాకది శత్రుస్థానమైంది. అయినా ఫరవాలేదు. అంతేకాదు ధనాధిపతిని కూడా నేనే లాభస్థానంలో వుండడం మీ పాప అదృష్టమమ్మా! అందరూ నా వల్ల కేవలం చెడు జరుగుతుందనే భయపడుతుంటారు. కాని అది నిజం గాదు. ఏల్నాటిశని అని, అష్టమశని యని, అర్ధాష్టమ శనియని చెప్పి భయపెడుతుంటారు. భయం అవసరంలేదు. స్థానాలు నిజమే గాని నా వల్ల ఎన్నో జీవితంలో గొప్ప లాభాలు జరుగుతాయి వినండి! కర్మ కారకుడనే నేను. వృత్తి, ఉద్యోగం, వ్యవసాయం మొదలగు దీర్ఘకాలికంగా చేసే పనులన్ని నా వల్లనే జరుగుతాయి. పాపకు మాత్రం విశేష ధనలాభం వుంది. అదృష్టవంతురాలు. పాప పుట్టినప్పటినుండి గృహంలో కూడా ధనలాభ యోగముంది. ఇంకేం కావాలి? ఎవరైనా సరే నేను అశుభ స్థానాల్లో నున్నపుడు తగిన జాగ్రత్తలు తీసుకోండి!

శనివారం నవగ్రహ ప్రదక్షిణలు, ఉపవాసం, నాకు ప్రీతికరమైన, నూనె, నువ్వులు, నలుపు వస్త్రాలు దానం చేస్తే చాలు! నా వల్ల ఎలాంటి ఇబ్బందులుండవు, ప్రమాదాలు జరుగవు. భయపడాల్సిన అవసరం ఎంతమాత్రము లేదు.

సిద్ధాంతి : విన్నావు గదమ్మా! శనిదేవుడే మనకు స్వయంగా సెలవిచ్చాడు. శని గూర్చి ఏమాత్రం భయపడక్కర్లేదు. జాగ్రత్తపడుట అవసరమన్నారు. ఇకపోతే మనం రాహువుని ఆహ్వానిద్దాం! (రాహువు ప్రవేశం)

రాహుదేవా! ప్రస్తుతం ఈ జాతకురాలికి ఏవిధమైన శుభాశుభ ఫలితాలు కలుగజేస్తారో చెప్పండి స్వామి!

రాహువు : అమ్మా! నీ మనుమరాలి జాతకంలో నేను సప్తమ స్థానంలో శుక్రునితో కలిసి యున్నందువల్ల కొన్ని మాత్రమే శుభ ఫలితాలివ్వ గలుగుతాను. బాల్యంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! వివాహ సమయం వచ్చినపుడు తప్పకుండా ఈ సిద్ధాంతిని సంప్రదించండి. తప్పక శాస్త్రోక్త పరిహారాలు సూచిస్తారు. వానిని భక్తిశ్రద్ధలతో ఆచరించమ్మా! అశుభాలు తొలగిపోయి. శుభాలు చేకూరుతాయి. గ్రహాలన్నింటిలోమ ఛాయాగ్రహమైన నేను బలవంతుడనే అయినా, నవగ్రహ అధిపతి శ్రీసూర్యభగవానుని ఆజ్ఞమేరకే సంచరిస్తుంటాం. అయితే ఒక్క గ్రహణం సమయం తప్ప మిగతాకాలంలో ఇబ్బంది లేదు. మాకు ఎల్లప్పుడు వక్రగతి సంచారమే వుంటుంది.

సిద్ధాంతి : అమ్మా! ఇంతవరకు రాహుగ్రహ ప్రభావం విన్నాం. మరో చాయాగ్రహమైన కేతుగ్రహ ఫలితాలు విందామా!

(కేతువు ప్రవేశం)

కేతువు : కేతుదేవా! మీరు ఇచ్చే శుభాశుభ ఫలితాలు వివరించండి స్వామి!

చిరంజీవి జాతకంలో నేను లగ్నస్థానంలో వున్నాను. మంచి జ్ఞానాన్ని ప్రసాదిస్తాను. కాని కొద్దిగా భయస్వభావం వుంటుంది. తిరగడం అంటే ఎక్కువ ఇష్టం. ఆరోగ్యంగా వుంటుంది. ఆందోళన అవసరం లేదు. బాల్యంలో సహజమైన అనారోగ్య బాధలున్నా క్రమక్రమంగా తొలగిపోతాయి. నేను శని స్థానంలో వున్నందున శని ఇచ్చే ఫలితాలను ఇస్తాను. ఇందులో సందేహం లేదు. 'శని వత్ రాహు, కుజవత్ కేతు' అని వున్నను ఈ జాతకురాలి కుండలి ప్రకారం మాత్రం ఛాయాగ్రహాలైనమేము ఎవరి స్థానంలో వుంటే ఆ గ్రహ ఫలితాలివ్వాల్సి వస్తుంది. చాలా బాగుంది. భవిష్యత్తులో దూరప్రాంతాలు వెళ్ళే అవకాశం కూడా వుంది.

శుభం భవతు!



సిద్ధాంతి : అమ్మా! నవగ్రహాల్లో అన్ని గ్రహాల ఫలితాలు విన్నావు గదా! ఇప్పుడు గ్రహరాజైన సూర్యుడు ఇచ్చే ఫలితాలు విందాం!

(సూర్యుడు ప్రవేశం, అందరూ లేచి నిల్చుని నమస్కరిస్తారు).

సూర్యదేవా! మీరు ఈ జాతకురాలికి ఏవిధమైన శుభాశుభ ఫలితాలు కలుగజేస్తారో వివరిస్తారా! స్వామీ!

సూర్యుడు : అలాగే! (ముందు ప్రార్థన చేసి) ఈ స్థితిలో గ్రహరాజునైన నేను నా స్వస్థానమైన సింహరాశిలో కుజ, బుధులతో కలసి వున్నాను. కాని అష్టమస్థానం కావడంవల్ల శుభఫలితాలు తక్కువగా వుంటాయి. అలాగని అశుభ ఫలితాలు ఎక్కువగా వుండవు. అయినను మా ప్రీతికొరకు మీరు చేసే దానధర్మాలవల్ల మేం అశుభఫలితాలను కలుగనీయం. సిద్ధాంతి చెప్పినట్లుగా మాకు ప్రీతికరమైన ధాన్యం, వస్త్రం, రత్నం, లోహం మొదలైనవన్ని శ్రద్ధాభక్తితో దానం చేస్తే చాలు! అంతా శుభమే జరుగుతుంది. ఏ గ్రహం అవసరమైనను నన్ను కూడా కలిపి జపహోమాదులు జపించండి! నా ద్వారా తొందరగా మిగతా గ్రహాలు కూడా శుభఫలితాలే ఇస్తాయి. ఆరోగ్య కారకుడనైన నేను పాపకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాను. శుభం!

సిద్ధాంతి : నవగ్రహాలయొక్క అనుగ్రహం మనందరికి లభించింది. మీ మనుమరాలు అదృష్టవంతు రాలమ్మా!

పృచ్ఛకురాలు : సిద్ధాంతిగారు! చివరగా ఒక ప్రశ్న స్వామి! మా మనుమరాలి నక్షత్రాన్ని అనుసరించి ఏమైనా శాంతి ప్రక్రియలు చేయాలా, ఎపుడు చేయాలో వివరంగా చెప్పండి!

సిద్ధాంతి : అమ్మా! మంచి ప్రశ్న వేసావు! మీ మనుమరాలి నక్షత్రం భరణి 1వ పాదం అయింది కదా! భరణి నక్షత్రం శుక్రమహర్దశ అయినా నక్షత్రం మాత్రం శాంతి నక్షత్రం. 1వ పాదానికి స్వల్ప దోషం వుంది. కావున భరణీ నక్షత్ర జననదోష శాంతి తప్పక చేయించాలి. మన పురోహితులున్నారు. వారు శాస్త్రోక్తంగా శాంతి జరిపిస్తారు. కాని, పురుడు అనగా 11 రోజులు వెళ్ళిన తర్వాత 27 రోజుల లోపల శాంతి జరిపించాలి. అంతా క్షేమంగా వుంటుంది. ఇక మరి మనం సెలవు తీసుకుందాం! మరొకరు లైన్లో వున్నారమ్మా!

(నవగ్రహాలు – అందరు) శాంతి మంత్రం పఠిస్తారు అందర్ని అనుగ్రహ పూర్వకంగా ఆశీర్వదిస్తారు!

తెర పడుతుంది!

ఇందలి పాత్రలు – పాత్రధారులు

సిద్ధాంతి (జ్యోతిష పండితుడు : డా॥ శ్రీ సాగి కమలాకరశర్మ గారు
పృచ్ఛకురాలు : శ్రీమతి గీతామూర్తిగారు
సూర్యుడు : శ్రీ మాడుగుల శశిభూషణశర్మ సోమయాజి గారు
చంద్రుడు : శ్రీ ముత్యంపేట గౌరీశంకరశర్మ గారు
కుజుడు : శ్రీ ముదిగొండ అమరనాథశర్మ గారు
బుధుడు : శ్రీ ఆద్రాసుపల్లి శ్యామోహన్‌శర్మ గారు
గురుడు : శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ గారు
శుక్రుడు : శ్రీమహదేవభట్ల రాంప్రసాద్ శర్మగారు
శని : శ్రీ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి గారు
రాహువు : శ్రీయలమంచి శ్రీధరశర్మ గారు
కేతువు : శ్రీ బోర్పట్ల విరాట్ స్వరూప్ గారు
వ్యాఖ్యాత : శ్రీ పగిడిమర్రి దక్షిణామూర్తి గారు

'సర్వేజనాస్సుఖినో భవంతు'



ఆలయాల ధర్మరక్షణలో జ్యోతిష్కుల పాత్ర

ఆత్మ స్వరూపులైన ధర్మవేత్తలకు నమస్సుమాంజలి ..!

ఆలయాలు భారత సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనాలు. స్రష్టలైన మహర్షులు, ద్రష్టలైన మహాత్ములు తమ తపః ఫలాన్ని ధారపోసి ఈ సమస్త చరాచర ప్రపంచ శ్రేయోదాయకమైన ధర్మాచరణ పద్ధతులను ఎన్నింటినో వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు, స్మృతులు, శాస్త్రాలు, ఇతిహాసాల రూపంలో అందించారు. ఈ మహత్కార్యానికి కేంద్రబిందువు మన ఆర్యావర్తనం కావడం మనందరి పూర్వజన్మ సుకృతం.! ఈ కృషిలో భాగంగా - వేదాంగాలైన "శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం" అనే ఈ ఆరు శాస్త్రాలు లోక విదితాలని మనకు తెలుసు! వీటిలో

యథా శిఖా మయూరాణాం నాగానాం మణయోయథా।
తత్త ద్వేదాంగ శాస్త్రాణాం జ్యోతిషం మూర్ధని స్థితం ॥

మయూరాలకు శిఖ, నాగులకు మణి ఎట్లా భూషణమో అట్లే వేదాంగాలందు "జ్యోతిషం" తలమానికమైన శాస్త్రమని పెద్దల మాట!

ఇటు వంటి జ్యోతిష శాస్త్రాన్ని "సూర్య, పితామహ, వ్యాస, వసిష్ఠ, అత్రి, పరాశర, కశ్యప, నారద, గర్గ, మరీచి, మను, అంగీరస, లోమశ, పౌలిశ, చ్యవన, యవన, భృగు, శౌనక, అగస్తాదులుగాగల మహర్షులు సంహితల రూపంలో విస్తరించినట్లు వారి, వారి రచనల ద్వారా తెలుస్తున్నది.

ఈ పరంపరలో 5వ శతాబ్దికి చెందిన "వరాహగ మిహిరుని" 'బృహత్సంహిత' ఎంతో ప్రామాణిక, ఆచరణీయ సిద్ధాంత గ్రంథంగా ప్రసిద్ధి పొందింది. ఈ జ్యోతిషశాస్త్రం స్థూలంగా 'సిద్ధాంత, హోరా, సంహిత' అనే 3 భాగాలుగా లభిస్తున్నది. వాటి గురించి సంక్షిప్తంగా చెప్తాను.

I. సిద్ధాంతభాగం : - ఇందులో పాటి గణితం (General Mathematics) రేఖాగణితము (Geometry) త్రికోణమితి (Trigonametry) బీజగణితం (Algebra) గోళీయరేఖాగణితము (Spheral Geomatry) మొ॥గు గణిత సంబంధ విషయాలతో పాటుగా పంచాంగ నిర్మాణం, (నక్షత్ర, చాంద్ర, సౌరమానాదులు) కాలగణనం, మొదలగునవి ఉన్నాయి.

II.హోరా భాగం :- ఈ భాగంలో జననము, జాతకము, ఆయుర్దాయం, విద్య, ఆదాయవ్యయాలు, కీర్తి, అపకీర్తి, దైవచింతన, మోక్షము మున్నగు అంశాలున్నవి.



వీటిని అనుసరించి ఫలితాలు చెప్పగలిగిన హోరా విభాగవేత్తయే జ్యోతిషునిగా వ్యవహరింపబడుతున్నాడు.

III. సంహితా భాగం :- ఈ విభాగంలో గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలు, వివిధ కిరణాలు, ఆకాశరహస్యాలు, భూకంపాలు, పంటలు, భూపొరలలో గల నీటి వివరాలు, ఉల్కపరివేష (అంటే Meteors, Halos, Hurricane) వంటి అంశాలతో పాటు దేవాలయ శిల్ప నిర్మాణ శిలలు, ప్రాసాద (Discriplions of Temples) ఎన్నెన్నో జీవజంతు వృక్షమానవ స్వభావ విషయాలు ఉన్నాయి.

ఇన్ని విధాలుగా గల జ్యోతిష శాస్త్రాన్ని కూలంకషంగా అవగాహన చేసుకోవడం కష్ట సాధ్యమే..! ముఖ్యంగా జ్యోతిష సంబంధమైన తిథి, వార, నక్షత్ర, గ్రహ పరిశీలన వల్ల కాలగమనంలో ఏర్పడే మార్పులకు అనుగుణంగా జ్యోతిష వేత్త కొన్ని ధర్మాలను, రహస్యాలను తెలుసుకుని, వాటి విశేషాలను ఆలయాలలోని అర్చన సేవ, కైంకర్యాదులకు అనుసంధానం చేయవలసి ఉంటుంది.

జ్యోతిషమంటే కేవలం గ్రహసంచారాలవల్ల మానవులకు కలిగే లాభనష్టాలు మాత్రమేకాదనీ; ఆలయాలలో గల యంత్ర, మంత్ర, అర్చన, విగ్రహ సంబంధ విషయమని గ్రహించాలి. ఉదాహరణకు, చంద్రుని షోడశ కళలకు (అమృత నుండి పూర్ణామృత) శివ, శక్తి స్వరూపాలకు సంబంధాన్ని నిరూపించుకోవాలి. మూల విగ్రహాలకు చంద్ర, సూర్య కళలతో అనుసంధానం ఉంటుందని ఆ సమయంలో దీపారాధన, అభిషేకాదులు అర్చనలు జరపడం వల్ల మానవులకు మేలు కలుగుతుందని తెలుసుకోవాలి.

జ్యోతిష వేత్తలైన సిద్ధాంతులు ఆయా వారాలలో ఆయా తిథి, నక్షత్రాల కలయిక వల్ల ఏర్పడే శుభా శుభనిర్ణయాలైన యోగాది విషయాలు తమ పంచాంగాలలో ఇస్తున్నట్లే, ఇంట్లో మరియు ఆలయాల్లో ఏయే విధానాలు పాటించాలో కూడా తెలియచేయడం వల్ల సంప్రదాయ ధర్మాన్ని ఆచరించే వీలు కలుగుతుంది. ఇందుకు ఉదాహరణంగా ఒకటి, రెండు విషయాలు మనవి చేస్తాను. (1) సోమవారం ఆర్ద్రా నక్షత్రం శివాలయంలో అర్చనాదులు (2) శుక్రవారం స్వాతీ నక్షత్రం ఇంట్లో ప్రధానమైన ద్వార కడపను ఆవుపాలతో కడిగి ముగ్గు వేయడం, అమ్మవారి ఆలయాల్లో పంచామృతాభిషేకం జరిపించుకోవడం. గోమాత సేవలు నిర్వహించుకోవడం.

ఈ విధంగా ప్రతి తిథిని, పరివారాన్ని, ప్రతి నక్షత్రాన్ని దృష్టిలో ఉంచుకుని - ఆలయాలను వీటితో అనుసంధానం చేసి - నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, బ్రహ్మోత్సవాదులను నిర్వహించినట్లైతే ఆలయాల శోభ ఇనుమడిస్తుందని, తద్వారా లోక కళ్యాణంతో పాటు ధర్మరక్షణ, సంప్రదాయ పరిరక్షణ కూడా సిద్ధిస్తుందని నా ఆశ. నా ఆశయం కూడాను.

ఇందుకు అనుకూలంగా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఒక సమయసారిణి (టైం టేబుల్) ఏర్పాటు చేసుకొని ఆలయాల నిర్వహణ కమిటీ, అర్చక బృందం, సిద్ధాంత జ్యోతిష వేత్తలు, ధర్మకర్తృత్వ మండలి నడుచుకోవడం ఎంతైనా అభిలషణీయంగా భావిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా॥ బెజుగామ రామమూర్తి

ఆలయ నిర్వహణ - అర్చకులు - పాలకులు - భక్తుల సమన్వయము



శో ॥ సర్వవేదేషుయత్పుణ్యం సర్వతీర్థేషుయత్ఫలం ।
తత్ఫలం పురుష ఆప్నోతి స్తుత్వా దేవం జనార్ధనం ॥

యావత్ చరాచర సృష్టిలోని విశ్వ ప్రపంచంలో భారతదేశం అత్యంత విశిష్టమై, పుణ్యప్రదమై. కర్మభూమియై, పుణ్యభూమియై విరాజిల్లుచున్నది. అనాదిగా ప్రాణికోటికి ఆనందసుఖ జీవన మార్గమును బోధించే వేదశాస్త్రములు భారతదేశమంటే భగవన్ముఖారవిందముగా ఉద్భవించినవి. వేద సమ్మితమైన ప్రామాణికమైన సంస్కృతీ సంప్రదాయ ములు ఋషిప్రోక్తమై నేటికీ ఆచరింప బడుచున్నాయి. మన భారతీయ సంస్కృతికి గల చిహ్నములలో దేవాలయములు ప్రముఖమైనవి.

దేవాలయాలను చూడగానే మన సంస్కృతి-నాగరికత అవగతమగును. దేవాలయాలు భూలోక-స్వర్గ ధామములు, ఆర్తులకూ, అన్నార్తులకూ, దీనజన బాంధవు లకూ, పేదలకు, ధనికులకు నిమ్నులకు, ఉన్నతులకూ, ఆబాల గోపాలమునకు పుట్టినిల్లు వంటివి. దేవాలయాలు శిల్పం, చిత్రకళా నాట్యం, సంగీతం మొ॥న కళలన్నింటికీ నిలయాలు. దేవాలయాల ద్వారా అనేక వృత్తుల వారు జీవించెదరు. వీటి అనుబంధంగా సత్రాలు, భూములు, తటాకములు, పుష్పఫల వనాలు మొ॥నవి ఉంటాయి. ప్రతీ దేవాలయం ఒక చిన్న రాజధాని వంటిదే.

రాజైనా రంగడైనా తనగోడు విని పించాల్సింది భగవంతునికే. సర్వప్రాణులందు సమదృష్టి గలిగి రక్షించు వాడు జగద్రక్షకుడు భగవంతుడే. మనదేశంలో జగద్విఖ్యాతి గాంచిన దేవాలయాలు శిల్పకళలకుప్రసిద్ధి చెందాయి. తిరుపతి, శ్రీశైలం, కంచి, మధుర, ద్రాక్షారామం, సింహాచలం, రామప్ప వంటి ఎన్నో సుప్రసిద్ధ దేవాలయాలు సంస్కృతీ చిహ్నాలుగా అద్భుతమైన శిల్పకళలతో అలరారు తున్నాయి. మన నిత్యజీవితానికి దేవాలయాలకు అవినాభావ సంబంధం కలదు. అందుకే ఇంటింటా ఊరూరా, పల్లె పల్లెల్లో, కొండకోనల్లో, నదీ తీరాల్లోకి అడవుల్లో భగవంతుడు కొలువుదీరని ప్రదేశం లేదంటే అతిశయోక్తి కాదు.

"ఈశావాస్య మిదం జగత్" అనే ఉపనిషద్ వాక్యము సత్యవిషయ బోధకము. మానవజీవితం సుఖంగా ఉండాలంటే నైతిక ప్రవర్తన ప్రధానము. నైతికప్రవర్తనకు ఆస్తికత ఉండాలి. ఆస్తికత ఉంటే దేవుడున్నాడనే దృఢ సంకల్పం కల్గును. ఇంద్రియాలకు అతీతమై, మాటలకందని భగవంతుడు ఉన్నాడని నమ్ముటకు ఆధారం అవసరము. ఆ ఆధారమే దేవతా విగ్రహ స్వరూపము. కొన్ని చోట్ల సాక్షాత్ భగవంతుడే వివిధ రూపాల్లో వెలిసినాడు. మరికొన్నిచోట్ల ప్రతిష్ఠింపడుతున్నాడు. అట్టి భగవంతుని సంరక్షించుటకై దేవాలయాలు రూపుదిద్దుకొన్నాయి.

శ్లో ॥ దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః ।
త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్ ॥

దేహమే దేవాలయమనీ, అందున్న జీవుడే దేవుడనీ, అజ్ఞానమను మాలిన్యాన్ని తొలగించుగాని, దైవంతో మమేకమై, పూజించాలని చెప్పుటయే దేవాలయ దేవతా ప్రతిష్టలోని రహస్యమని పెద్దలు బోధించారు. జ్ఞానులు. ఆత్మయందే దర్శిస్తారు. కాని జ్ఞానులనుండి సామాన్య జనంకొరకు శిల్పంతో కూడిన దేవాలయాలు వెలిసాయి. తప్పుచేస్తే శిక్షించి మనను కాపాడి సక్రమ మార్గంలో నడిపిస్తున్న దేవుణ్ణి భక్తి శ్రద్ధలతో ఆరాధించాలని, జ్ఞాపకం చేయడానికే దేవాలయాలు నిర్మింపబడుతున్నాయి. దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావాన్నేకాక, ఐకమత్యాన్ని కల్గిస్తాయి. లోకహితం కోరి మనపూర్వీకులు ఆలయాలు నిర్మించారు. దేవాలయాలు సౌందర్యసాధకాలై భక్తులకు ఆనందాన్ని కల్గిస్తున్నాయి. దేవాలయాలు పారమార్థిక అభ్యుదయాలకు చిహ్నాలు దేవాలయ గోపురాలలో స్తంభాలలో నేడు కనబడుచున్న శిల్పకళాచాతుర్యం. అద్భుతం, అనంతం. దేవాలయ నిర్మాణంలో మానవ జీవన పరమార్థం దాగి ఉంది. ఇది ఇహపర సౌఖ్య సాధన సోపానము.

వేల సంవత్సరాల నుండి అనాదిగా మహా రాజుల ఏలుబడిలో ఒక వెలుగు వెలిగి నేటికీ అనేక దేవాలయాలు



అత్యంత పురాతనమై, మహిమగలవై, పుణ్య క్షేత్రములై విరాజిల్లుచున్నాయి. మరికొన్ని కాల గర్భంలో కలిసి పోయాయి. అనేక పురాతన దేవాలయాలు జీర్ణోద్ధరణ గావింపబడి పునర్వైభవాన్ని సంతరించు కొనుచున్నాయి. నేటి కాలంలో కూడా అత్యంత శిల్ప కళావైభవంతో శిల్ప శాస్త్రానుసారంగా దివ్య భవ్య దేవాలయ నిర్మాణములు, సశాస్త్రీయ పద్ధతిలో యంత్ర, మూల మూర్తుల ప్రతిష్ఠాదులు జరిగి లోకోపకారకములై విరాజిల్లుచున్నవి.

దేవాలయాలు నిర్మించుటకు నాటి ప్రభువులు కోట్లాది రూపాయలు ఖర్చు చేయుటకు వెనుకాడలేదు. కారణమేమంటే ప్రజల్లో దైవభక్తిని కల్గించడమేకాకుండా మన సంస్కృతిని, చరిత్రను భావితరాలకు ముఖ్యముగా తలచారు. అప్పుడూ ఇప్పుడూ దాతలు కూడా అనేకమంది నిస్వార్థంతో ప్రతి ఫలం ఆశించకుండా భూరి విరాళాలు అందిస్తున్నారు దేవాలయాల నిర్మాణం వలన వేలాదిమందికి జీవనభృతి కలుగుచున్నది. ఇక ప్రాచీన నవీన దేవాలయముల అర్చనా విధి నిర్వహణ సర్వసాధారణంగా అనేక ఆగమములద్వారా జరుగుచున్నది. ఈనాడు మన ప్రాంతంలోని ప్రముఖ ఆలయాలు ఆగమశాస్త్రముల ద్వారా నడుపబడుతున్నాయి. అందులో తిరుపతి, భద్రాచలం, సింహాచలం, మొదలైన మహాక్షేత్రాల్లో పరంపరగా పాంచరాత్ర, వైఖానస ఆగమముల ద్వారా అలాగే శ్రీశైలం, కాళహస్తి, మొదలైన ప్రముఖ శైవక్షేత్రాల్లో శైవాగమాల ద్వారా అర్చనా విధులు నిర్వహింప బడుతున్నాయి.

పాంచరాత్ర వైఖానస విధానాలు తెలిపే-విష్వక్సేన సంహిత, సనత్కుమార సంహిత, పాద్మసంహిత శైవ విధానములు తెలిపే కారణాగమాది గ్రంధాలు. మనకు మార్గదర్శకములు అనగా ఆయా ఆగమములలో చెప్పబడిన అంశాలను పురస్కరించుకొని, నిత్యపూజల నైవేద్యవిధులు గాని ప్రత్యేక ఉత్సవాదులు, కల్యాణాదులు బ్రహ్మోత్సవాలు జరుపబడుతాయి.

మిగిలిన సాధారణమైన దేవాలయాలు స్మార్తాగమం ప్రకారం దేవతా విధులు నిర్వహింపబడుతున్నాయి. ఈ స్మార్తాగమం ప్రకారంగా జరిగే విధివిధానాలకు ఆధార గ్రంధాలు ధర్మసింధు, నిర్ణయ సింధు, బ్రహ్మకర్మ సముచ్చయము, వీరమిత్రోదయం ఇలాంటివి ప్రముఖమైనవి.

ఆగమాలు - శాస్త్రాల ద్వారానే ప్రతి ఆలయంలో మూల భేరమునకు మరియు ఉత్సవ మూర్తులకు నిత్యపూజా నైవేద్య కార్యక్రమాలు, ఆ పర్వదినాలలో విశేష అభిషేక అర్చనా కల్యాణాదులు మొదలైనవి నిర్వహింపబడుతున్నాయి. ఈ వివిధ రకాల కార్యక్రమాల వలన దేవాలయములోని దేవతామూర్తులకు, దివ్య-తేజో కళాభివృద్ధి, భక్తా నుగ్రహ కారకత్వము, లోకానుగ్రహకారకత్వము సిద్ధింపబడుచున్నది.

ఇక అర్చకులను గురించి, పైన పేర్కొనబడిన ఏదో ఒక ఆగమంలో నిష్ణాతులై, వేదశాస్త్రములయందు పరిజ్ఞానము కలవారై, తాము కేవలం ఉద్యోగం కొరకు కాకుండా భగవంతుని సేవకొరకని అత్యంత భక్తి శ్రద్ధలతో నిత్యపూజా నైవేద్యాది సేవలు నిర్వర్తించుట, ఆయా దేవతా సంబంధమైన ఉత్సవాలను ధర్మకర్తల మండలికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ. ఎప్పుడు ఏదిచెయ్యాలి? ఎలా చేయాలి? అనే విషయాలను శాస్త్రోక్తంగా ఆసక్తి కలిగేటట్లుగా తెలియజేస్తూ, ఆయా కార్యక్రమాలను నిర్వర్తింపచేయాలి.

-అర్చకస్య తపో యోగాత్ అర్చన స్యాతి శాయనాత్ ।
ఆభిరూప్యాచ్చబింబానాం దేవః సాన్నిధ్యమృచ్ఛతి ॥

పూజించువాని తపోనిష్ఠ, ఏకాగ్రత వలన, పూజా విధి యొక్క అతిశయమువలన, దేవతా మూర్తిమత్వం వలన దేవతా సాన్నిధ్యము కలిగి సంతోషాన్ని పొందగలడు.

- **"కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన"** మన కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహిస్తే ఫలాన్నిచ్చేది దైవమే.

రామాయణంలో భగవంతుడైన రాముడు ఇలా అభయ వరాన్నిస్తాడు.

- సకృదేవప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ॥

నీవు తప్ప నాకెవరూ లేరు అని ఒక్కసారి చేతులెత్తి నమస్కరిస్తే, శరణుజొచ్చినవారికి, నీకు "నేనున్నాను" అని -అభయకారాన్నిస్తూ, ఇది నా వ్రత నియమమని ప్రతిజ్ఞ చేసినాడు.

భగవద్గీతలో భగవంతులైన శ్రీకృష్ణుడూ గొప్ప అభయాలను ప్రసాదించినాడు **'మామేకం శరణం వ్రజ'.**

– అనన్యాశ్చింత యంతో మాం యేజనాః పర్యు పాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగఃక్షేమం వహామ్యహం ॥

నిరంతరం అనన్య భక్తితో భగవంతుణ్ణి ఆరాధించేవారి యోగక్షేమాలను తనపై వేసుకొని రక్షిస్తాడు భగవంతుడు.

"యేయధామాం ప్రపద్యంతే తాన్ తథైవ భజామ్యహం" పరమాత్ముడు తనను సేవించిన రీతికి అనుగుణంగానే ఫలితాన్ని అనుగ్రహిస్తాడు.

– దేవాన్ భావయతానేన తేదేవా భావ యంతునః ।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥

ఆరాధనల ద్వారా దేవతలను సంతృప్తిపరిస్తే, ఆ దేవతలు సంతోషపడి, మనను అనుగ్రహిస్తారు. నిస్వార్థ బుద్ధితో పరస్పరం సంతృప్తిని పరమ శ్రేయస్సును పొంద గలము.

– "ఉద్ధరే దాత్మానాత్మానం" దైవారాధనతో మనను మనమే ఉద్ధరించుకోవాలి.

– యద్యదాచరతిశ్రేష్ఠః తత్తదేవేతరోజనః ।
సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥

పెద్దల మంచి ప్రవర్తన మన పిల్లలకే కాక ఇతరులకూ కనువిప్పు కలిగించి, ఈ విధంగా మేమూ ఆచరించాలి అనే కోరిక కలిగి ఆ మంచిపనిని వారూ చేస్తారు.

– సర్వభవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః ।
సర్వేభద్రాణి పశ్యంతు మా కశ్చిద్దుఃఖమాప్నుయాత్॥

అందరూ సుఖసంతోష సౌభాగ్యాలతోనూ ఆరోగ్యంతో ఉంటూ, నిరంతరం క్షేమాన్ని చేస్తూ, ధార్మికమైన సన్మార్గంలో నడుస్తూ ఉండాలి, ఎవరూ దుఃఖాలను పొందగూడదు.

పైన సూచించిన ధర్మాలను స్వయంగా ఆచరిస్తూ– దేవాలయానికి దర్శనార్థులై వచ్చే భక్తులయందు, భేదభావము నిర్లక్ష్యము ఇత్యాదులు ప్రదర్శించకుండా –భగవదుద్దేశ్యంతో భగవద్దర్శనార్థమై వచ్చువారు కనుక అత్యంత ప్రేమా దరములతో, దేవాలయంలో. అందించవలసిన దర్శన – అర్చన – సేవాదులకు –సహకరించి వారిని సంతృప్తి పరచ వలెను. అదేవిధంగా ధార్మికులు, దాతలు అధికారులు వ్యాపార వేత్తలు నాయకులు, పండితులు, యతీశ్వరులు మొదలైనవాళ్లు–వచ్చి నప్పుడు దేవాలయ అభివృద్ధి కొరకు ఏమేమి అవసరములు ఉండునో అవి ఎందుకు చేయవతినో. చేసిన వారికి, భక్తులకు భగవదనుగ్రహంతో ఏరకమైన శు భములు కలుగునో తెలియజేస్తూ; నిరంతరం అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ;

– స్వయం తీర్త్వా పరాన్ తారయేత్ అనే విధంగా భగవదనుగ్రహం పొందుతూ, భగవదనుగ్రహాన్ని కల్గిస్తూ –ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ, ఉండడం అందరినీ సమన్వయ పరచడం ఎంతైనా అవసరము.

కొందరు పాలకులు స్వార్థపరులై అహంకారులై అర్చ కులను తమక్రింది సేవకునిగా భావిస్తూ, వ్యవహరించేవారు ఉంటారు. అలాంటి వాళ్లయందు జాగ్రత్త వహిస్తూ మానసికంగా వాళ్లను కూడా మీరు మేము అందరం భగవత్సేవకులమే; ఎవరు ఎవరికి లోకువకాదు; ఎవరమేమి చేసినా అందరూ భగవత్సేవలో ముఖ్యులమనే భావనలు పెంపొందింప చేసుకొని, సందర్భానుసారంగా శాస్త్రీయ విషయాలు బోధిస్తూ, దేవాలయ నిర్వహణలో సానుకూలంగా ఉంటూ భక్తులకు భగవంతునికి అనుసంధానంగా అర్చకులు పాలకులు సంయమనంతో వ్యవహరిస్తూ, ఉత్తరోత్తర విజయాభ్యుదయములకు తోడ్పాటునందించాలి.

దేవాలయ నిర్వహణలో అర్చకులు, పాలకులు. భక్తులు వారివారి సంప్రదాయముల శాస్త్రీయముగా–తెలుసుకొని పాటించి నడచుకోవాలి.

అర్చకుడు శుచిర్భూతుడై నిత్యస్నాన సంధ్యా వందనములు ఆచరించి, ఇంద్రియనిగ్రహముగలిగి సత్యము సదాచారము, ధర్మ బుద్ధి, అహింస, నిస్వార్థత, పరోపకార బుద్ధి, అలోలుపత, మొదలైన సద్బుద్ధి కలవాడై, ఆయా దేవతలయందు సద్భక్తి కలవాడై, ఆత్మీయంగా పూజాది కాల్లోసు శిక్షితుడై ఉండాలి. ధార్మికులై, సంప్రదాయజ్ఞులై దైవ భక్తులై, అర్చకులయందు దేవతాబుద్ధి కలిగి భక్తుల యందు ఆదరాభిమానములు కలిగి పక్షపాత బుద్ధి రహితులై సద్భక్తులై నిరంతర దేవాలయ అభివృద్ధి కారకులై మెలగ వలెను. ఉత్సవాదుల్లో అర్చకులతో సఖ్యంగా ఉంటూ భక్తులకు కావలసిన సదుపాయాలను కల్పిస్తూ, దాతలను ప్రోత్సహిస్తూ; అందరినీ కలుపుకొని ఆలయ పవిత్రతను కాపాడుతూ ఆదరణను పెంచాలి.

భక్తులు కూడా దైవంయందు పరిపూర్ణమైన విశ్వాసం కలవారై, సంప్రదాయబద్ధులై, అర్చకుల పాలకులయందు క్షమాగుణం గలిగి, దేవాలయ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండి, తమ వలన తోటిని భక్తులకు ఆటంకము కలుగకుండా భగవంతుని అనుగ్రహానికి పాత్రులుకావాలి. ఔదార్యబుద్ధితో సేవాతత్పరులై మెలగాలి.

'ధన మూలం ఇదం జగత్' అనే ఆర్యోక్తి ఏకాలానికైనా వర్తించే అంశమే. ఆర్థిక పరిపుష్టిన కలిగిన వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుంది. దేవాలయ వ్యవస్థలో కూడా ధనము ముఖ్యము. దానిని శాస్త్రీయంగా ఖర్చుపెడుతూ దేవాలయాలను భక్తుల చేరువకు తీసుకవెళ్లుటకు దేవాలయ పాలక మండలి; అర్చనాదులకు అర్చకులు - మరియు వదాన్యులు అవసరమే. ప్రస్తుత తరుణంలో అధార్మికత పెరిగినా, ధార్మికతకూడా అదే స్థాయిలో ఉంది. ఇందులో పాలకులు, అర్చకులూ, నాయకులు కొందరు భక్తులు భాగస్వాములే.

మన పుణ్యక్షేత్రాల్లో భక్తులకు సౌకర్యాలతో పాటుగా, భక్తి భావన జాగృతం చేసే అనేక నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల నిర్వహణ అందరినీ ఏకం చేస్తున్నది. ఈ వైభవమంతా భక్తులు సమర్పించే విరాళాలు, కానుకలు, మొక్కుబడులు మొదలైన వదాన్యత వలన సాధ్యమగుచున్నది.

దైవ కార్యక్రమాల నిర్వహణ భక్తుల సౌకర్యాల కల్పనలో ఆలయ పాలకమండలి బాధ్యత మిక్కిలి ప్రశంసనీయం.

ఈ నిర్వహణ కష్టతరమైనా, నిస్వార్థసేవా పరాయణత దైవభక్తి తత్పరత ఉంటేనే సాధ్యం. ఈ కష్టంలో అర్చకుల సంక్షేమం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంది.

కాని ఇటీవలకాలంలో ఆలయ పాలకమండలి సభ్యుల్లో కొందరు ఆధునిక పోకడలు, అత్యాశ, అభిజాత్యము, అభిజాత్యము స్వార్థంకోసమో, నాయకులను ప్రసన్నం చేసుకొనే పోటీతోనో చివరికి ముఖానికి రంగులు వేసుకొని తైతక్కలాడే వారిని సైతం మర్యాదలు చేస్తూ, పక్కదారి పట్టిస్తున్నారు.

కొందరు, దైవిక విషయాలకు పక్కనపెట్టి, వేదశాస్త్ర ఆగమాలందు నిష్ణాతులైన విద్వాంసులను నిర్లక్ష్యంచేస్తూ, తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు.

కనుక అర్చామూర్తుల వైభవోపేతమైన స్తుతిస్తోత్ర పూజా కైంకర్యాలను సక్రమంగా నిర్వహించడానికి ధర్మబుద్ధి, సత్యబుద్ధిగలవారు మాత్రమే పాలకులుగా సభ్యులుగా ఉండడం సర్వశ్రేయోదాయకము. ఇందుకు తగిన నిర్ణయాలు కేవలం ప్రభుత్వరంగ సంస్థలేకాకుండా ఆయా దేవాలయ ఆగమశాస్త్ర ప్రవీణులతో, స్వచ్ఛంద సేవాసంస్థలతో, ధార్మిక మండలితో, యతీశ్వరులతో, భక్త బృందంతో. ఆయా సంప్రదాయజ్ఞులతో, పీఠాధిపతులతో సంప్రదించి, ఒక స్వయం పరిపాలక ధార్మిక మండలిని ఏర్పాటుచేయటం శుభస్కరము.

ఆలయాల నిర్వహణలో ఆజమాయిషీ కొంతనిబద్ధత, మరింత అదుపు ఉండడంకూడా అవసరం. ఇందుకోసం, అర్చకుల-భక్తుల భాగస్వామ్యం కూడా తోడైతే ఆలయము సర్వాంగసుందరంగా భక్తిభావ బంధురంగా విలసిల్లుతాయి.

సాధారణంగా గురువులను, పెద్దలను దర్శించుకొనుటకు వెళ్ళేటప్పుడు కొన్ని మర్యాదలు పాటిస్తాము. అట్లే భక్తులు దైవదర్శనానికి వెళ్లేటప్పుడు పాదచారులై వెళ్లాలి. నది, పుష్కరిణి, సముద్ర దేవాలయం దగ్గర ఉన్నట్లైతే స్నానం చేసి, బట్టలు మార్చుకుని శుచిగా, శుభ్రంగా ఆలయానికి చేరుకోవాలి. మౌనంగా దైవనామస్మరణ చేస్తూ, ధ్వజ స్తంభంవద్ద ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరిస్తూ, గర్భ గుడిలోని దేవుని దర్శించుకొని నమస్కరించుకోవాలి. అర్చకులను దైవంగా భావిస్తూ, అర్చనలు చేయించుకోవాలి. ఆలయంలో శక్తి కిరణాలు సంచారం చేస్తుంటాయి. కనుక చెడు ఆలోచనలు రానీయకూడదు. అశౌచాదులు ఉన్నపుడు ఆలయంలోనికి వెళ్లవద్దు. నైవేద్యంపట్ల, తీర్థంపట్ల విశ్వాసం కల్గిఉండాలి. ఆలయ వస్తువులను దుర్వినియోగపరచరాదు. అందరి భక్తులతో కలిసి దేవాలయ నియమనిబంధనలు తప్పక పాటించి అర్చకులకు పాలకులకు సహకరించాలి.



చివరిమాట

ఆలయాలకు అనుబంధముగా విద్యాలయాలు, వైద్యాలయాలు నిర్వహింపబడుతున్నాయి. కోర్టులతో నిమిత్తం లేకుండా ఆలయాలు న్యాయస్థానాలుగా పరిష్కారమార్గాన్ని చూపిస్తున్నాయి. ఆలయాలు ధర్మరక్షణకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి.

కొత్త దేవాలయాల నిర్మాణం కంటే జీర్ణదేవాలయాల పునరుద్ధరణ పుణ్యప్రదమని పెద్దలు చెప్తున్నారు. అందుకే ఆలయాల జీర్ణోద్ధరణకై నూతన ఆలయాల నిర్మాణమునకై అఖిల భారతస్థాయిలో మహానిధిని ఏర్పాటు చేయాలి. వదాన్యులైన భక్తులు సంపన్నమైన దేవాలయాలు ధార్మిక సంస్థలు ఆయా దేవాలయాలు అభివృధ్ధికై పాటుపడాలి.

అర్చకుల శిక్షణకోసం ప్రత్యేక శిక్షణా సంస్థలను నెలకొల్పాలి. అందులో సుశిక్షితులైన వారినే అర్చకులుగా నియమించాలి వారికి సముచిత వేతనాలు అందించాలి.

ఆలయాలకు స్థానికులైన భక్తులతో పాలకమండలిని ఏర్పాటుచేయాలి. ఆలయ నిర్మాణ సందర్శన వేళల్లో. క్రమశిక్షణ పాటించుట, ఉత్సవాలను సక్రమంగా నిర్వహించడము దేవాలయ ఆస్తులరక్షణ మున్నగువాటిని ఆ మండలి చేపట్టాలి.

దేవాలయాల నిధులతో ధర్మరక్షకొరకై లోకకల్యాణదాయకమైన యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించాలి. ధార్మిక గ్రంధాలను ప్రచురించి భక్తులకు అందించాలి. దేవాలయచరిత్రను తెలుపాలి. భజనలు, హరికథలు, నాటక ప్రదర్శనలు చేయించాలి. వస్తుప్రదర్శన చేయించాలి. విద్యాసంస్థలు, వైద్యశాలలు నడపాలి.

వివాహాది శుభకార్యకలాపాలు దేవాలయాల్లో నిర్వహించుకోవాలి. శ్రద్ధాసక్తులు గలిగి ఉత్సాహంతో సమైక్యతతో కృషి చేసినపుడు మన ఆలయాలు సమాజ వికాసానికి ఎంతగానో తోడ్పాటు నందించగలవు.

గంగవరం ఆంజనేయశర్మ



మన పంచాంగములు పూర్వ పద్ధతి - దృక్ పద్ధతి ఒక సమీక్ష

1. కాలమనునది మానవ జీవితముతో అనాదిగ పెనవేసికొని యున్న ఒక అతి ముఖ్యాంశము. కాల పరిశీలనము, కాలగణనము అనేవి అన్ని కాలములందు, అన్ని దేశములందు, అందరకు, అన్నిట అని వార్యము. కాలగణనమునకు గంటలు, రోజులు, నెలలు, సంవత్సర ములు ఈ రీతిగ కొన్ని కొలతలు కూడ అనాదిగ ప్రపంచమంతటా వాడబడుచున్నాయి.

2. ప్రపంచములో ఇప్పటికి వెలసిన అన్ని సంస్కృతుల లోను మన భారతీయ సంస్కృతి పరమ విలక్షణమైనది. వైదిక వాఙ్మయ సంప్రదాయ సంస్కృతులే మన భారతీయ జీవన విధానమునకు జీవగఱ్ఱలు. మన మనఃప్రవృత్తికి, ఐహిక ఆముష్మిక ఆధ్యాత్మికములగు సకల శ్రేయస్సులకు, ఒక్క మాటలో, మన భారతీయతకు అవియే మూలనిధులు. మన కాలగణన విధానమునకు కూడ అవియే మూలా ధారములు. ఇతరుల వలె రోజులు, నెలలు, సంవత్సరము లని మాత్రమేగాక, మనకు, కాలగణనముతో పాటు సూర్యచంద్రాది గ్రహముల స్థితిగతులతో పెనవేసికొనియున్న తిథులు, వారములు, నక్షత్రములు, యోగములు, కరణములు అను ఐదు విశిష్టాంశములతో కూడిన, ఒక ప్రత్యేకమైన, ప్రపంచమున ఇతరులకు ఎవరికిని లేని, పంచాంగ సంప్రదాయము అనునది ఒకటి ఉన్నది. ఈ తిథ్యాదులు భూగోళముపై మన స్థితిని బట్టి, ఖగోళమున సూర్యచంద్రాది గ్రహముల స్థితి గతులను బట్టి కూడ నిర్ణయములగు చర రాశులు. ఏ రోజుకారోజు ఒక సంవత్సరమున వీటి సమాచారమును తెలిపెడి సాంకేతిక సమాచార గ్రంథమునకే పంచాంగమని పేరు.

3. ఇట్టి పంచాంగములు మన భారతీయ జీవితములో ఒక విడతీయరాని భాగము. మనము చేయవలసిన ప్రతి పుణ్య కార్యక్రమానికే గాక, మన సాంసారిక, వృత్తి వ్యాపారాది సమస్త ఐహికాముష్మిక కార్యక్రమములన్నిటికి అది చాల అవసరము. అంతేకాదు – గ్రహముల స్థితిగతుల నుబట్టి మనకు కలుగుచున్న, కలుగబోయే మంచి చెడ్డలను

తెలుసుకుని, మంచిని పెంచుకునేందుకు, చెడుకి విరుగుడు చేసికొనేందుకు కూడ పంచాంగమే మొదటి సాధనము. కనుక పంచాంగము ఖగోళ విజ్ఞాన విలసితము, ధర్మశాస్త్ర, సంప్రదాయానుగుణము కూడ అయి ఉండుట తప్పనిసరి.

4. పంచాంగ కర్తలు ఎందరు ఉన్నను, అందరకు అవే గ్రహగతులు గనుక – పంచాంగములన్నియు ఒకే రీతిన ఉండవలెను. కాని అట్లు ఉండుటలేదు. నేడు మనకు అనేక విధములగు పంచాంగములు లభించుచున్నాయి. వాటిలో సామాన్య మానవులు పెద్దగా గుర్తించని గ్రహ ప్రవేశ, సమాగమాదులేగాక – అందరకును అతి ముఖ్యములైన ఉగాది, దీపావళి వంటి పండుగలలో కూడ తేడాలు వచ్చి – వివాదాలు చెలరేగుచుండుట అందరకు చికాకుని కలిగించుచునే ఉన్నది. పంచాంగముల ప్రామాణికతయే చర్చనీయాంశమై పోవుచున్నది. ప్రజలకు పంచాంగ సంప్రదాయముపై విశ్వాసము సడలుచున్నది. సమాజ శ్రేయస్సునకై విజ్ఞులు పూనుకుని – ఈ పరిస్థితిని త్వరగ సరిచేయవలసిన అవసరము మీదకు వచ్చియున్నది. తదర్థమై ఎందరో పెద్దలు, పీఠాధిపతులు పూనుకుని కృషిచేయుచునే ఉన్నారు.

ఈ సందర్భముగ – మన పంచాంగ సంప్రదాయమును సామాన్యులకు పరిచయము చేయుటకు – ప్రస్తుత పంచాంగములలోని తేడాలను – వాటి పూర్వాపరములను తెలుపుటకు, విజ్ఞుల పరిశీలనకై ఈ సమీక్ష సమర్పించ బడుచున్నది.

పంచాంగములలో, పండుగలలో తేడాలపై విమర్శలు ప్రధానముగా ఈ తీరున ఉన్నాయి:

1. పంచాంగములకు మూలగ్రంథమేమైన ఉన్నదా? ఉన్నచో – దానిలో ఒకే పద్ధతి ఉన్నదా? లేక దానిలోనే భిన్న భిన్నపద్ధతులు ఉన్నాయా?

2. ఒకే పద్ధతి ఉంటే – ఇన్ని రకాల పంచాంగాలు ఎలా వస్తున్నాయి? పంచాంగకర్తలు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వ్రాస్తున్నారా?

3. ఏ పంచాంగం ప్రమాణం?

4. ఒకే పంచాంగములో సంవత్సరాదివంటి పండు గలని కూడా ఒక ఊర్లో ఆదివారం నాడు – మరోకచోట సోమవారమని వ్రాస్తారేమి? పండుగ అందరికి ఒకే రోజు రాదా?

5. పంచాంగకర్తలలో ఐకమత్యం లేకపోవటమే ఇట్టి చికాకులకి కారణం కనుక – అందరు ఒకే తీరుగ పంచాంగం చేయవలెననే నియమమే దానికి పరిష్కారము కనుక, దేశం మొత్తానికి ఒకే ఒక ప్రామాణికమైన మరియు అధికారికమైన పంచాంగము ఏర్పడటమే మంచిది కదా?

ప్రధాన విమర్శలు ఈ తీరున ఉన్నాయి – వీటిలో మొదటి నాలుగు విమర్శలకు – చివరిది పరిష్కారమువలె కనిపించుచున్నది. ఇవన్నీ పైకి ఎంతో సరళంగా, సుళువుగా కనిపించుచునే ఉన్నాయి గాని – ఇట వివరించవలసిన విషయము మాత్రము అతిగహనము, అతి క్లిష్టము, పరమ సాంకేతికమును అయిన శాస్త్రీయ విచారణ. ఖగోళ సిద్ధాన్తమునందును, ధర్మశాస్త్రమునందును సమగ్ర ప్రజ్ఞ ఉన్నవారు మాత్రమే చేయవలసినది. కాగా ప్రస్తుతానికి వీటిని ఇచట ఒకింత స్థూలంగానే సమీక్షిద్దాము:

విమర్శ – 1 : పంచాంగమునకు మూల గ్రంథమేమైనా ఉన్నదా? ఉంటే దానిలో ఒకే పద్ధతి ఉన్నదా? లేక దానిలోనే భిన్నభిన్న పద్ధతులు ఉన్నాయా?

సమీక్ష :– 1.పంచాంగము అనునది కేవలము గ్రహస్థితి – కాలగణనము మాత్రమే కాదు.ఆయా కాలములకు సంబంధించిన మన కర్తవ్యాకర్తవ్యములను కూడ అది తెలుపవలెను. కాలగణనమునకు ఖగోళ విజ్ఞానము (గ్రహ స్థితి గతులు) అవసరము. కర్తవ్యాదులకు ధర్మశాస్త్రము ఆధారము. కాలగణనమునకు వలయు సిద్ధాంత భాగము ఖగోళ విజ్ఞానముపై ఆధారపడును. పంచాంగమునకు వలయు విజ్ఞానభాగమును తెలిపెడి గ్రంథములకే సిద్ధాంత గ్రంథములని ప్రసిద్ధి. ఈ విజ్ఞానాంశములను మన ఉపయోగమునకు అనువుగా మలచి – పంచాంగరచన చేయు విధానము కరణ గ్రంథములపై ఆధారపడును.

2. ఇట్టి సిద్ధాంత – కరణ గ్రంథములు కూడ చాలానే ఉన్నాయి.

సూర్యః పితామహో వ్యాసః వసిష్ఠోత్రిః పరాశరః ।
కాశ్యపో నారదో గర్గః మరీచి ర్మనురంగిరాః ॥

లోమశః పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగుః ।
శౌనకోష్టాదశ హ్యేతే జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకాః ॥

అని సూర్యాదులు 18మంది ప్రాచీన సిద్ధాన్త కర్తలుగా సుప్రసిద్ధులు. వీరేగాక - తదనన్తర కాలీనులగు భాస్కరాచార్య, ఆర్యభట, బ్రహ్మగుప్తాదులు కూడ సిద్ధాంత గ్రంథములను వెలయించిరి. తదుపరి కేశవ గణేశ దైవజ్ఞాది మహాత్ములెందరో కరణ గ్రంథములను వెలయించిరి.

3. దీనిని బట్టి చాలా సిద్ధాంతములు, నానావిధ కరణములు ఉన్నట్లు అపోహ కలిగే అవకాశము ఉన్నది. కాని వాస్తవమేమనగా సిద్ధాన్తము ఒక్కటే, గ్రంథకర్తలు మాత్రము అనేకులు. అన్నిటికి మూలము సూర్యసిద్ధాంతమే-

శాస్త్రమాద్యం తదేవేదం యత్పూర్వం ప్రాహ భాస్కరః ।
యుగానాం పరివర్తేన కాలభేదో-త్ర కేవలః ॥

(సూర్యసిద్ధాంతం - మధ్యమాధికారం- శ్లో.9)

సూర్య భగవానుడు ఒకప్పుడు మహర్షులకు ఈ శాస్త్రాన్ని బోధించాడు. అదే చాలాకాలం తరువాత - కాలానుగుణ సవరణలతో - మయునకు ఉపదేశించబడెనని దీని భావం.

4. అయితే సిద్ధాంత గ్రంథాలలో ఏమీ తేడా లేదా? అంటే - మౌలిక సిద్ధాంతములో ఏమీ తేడా లేదు / ఉండదు అనే సమాధానము. కాని విషయము గ్రహ స్థితి గతులకు సంబంధించినది. అవి నిత్య చలనశీలములు. వాటిలో కొన్ని అంశములు త్వరత్వరగా మారుచుండటం మనం గమనించ గలము. మరికొన్ని అంశములు వందల / వేల / లక్షల సంవత్సరాలలో మాత్రమే తెలుస్తాయి. కాగా ఆ యా గ్రంథకర్తలు తమ తమ కాలాలకి అనుగుణముగా ఆ మౌలిక సిద్ధాంతాన్నే విశ్లేషించి తమ గ్రంథాలలో తెలిపారు. కాబట్టి స్థూల దృష్టికి అవి క్రొత్తవి వలె లేదా భిన్న సిద్ధాంతాల వలె కనపడవచ్చును. ఈ గ్రహ స్థితి గతులు ప్రత్యక్ష దృష్టికి సరిపోవాలనేదే వారి ఉద్దేశము. ఆ ప్రకారమే తగిన సర్దుబాట్లని (సంస్కారాలని) చేసి మరీ చెప్పారు. అందుకే ఆ తేడా.

5. ఇచట మరొక ఆసక్తికర విషయము :- వసిష్ఠ మహర్షి ఒకపుడు తన మనుమడు పరాశరునికి ఈ సిద్ధాంతాన్ని బోధించారు. అదొక వసిష్ఠ సంహిత. ఆ తరువాత చాల కాలానికి ఆ వసిష్ఠులవారే మాండవ్య మహర్షికి అదే సిద్ధాంతాన్ని బోధించారు. అయితే ఈసారి గ్రంథాన్ని మరింత సరళంగా, సులభ గ్రాహ్యంగా, సంగ్రహంగా చెప్పారు. అందువలన దీనికి లఘువాసిష్ఠమని పేరు. ఈ రెండు గ్రంథాల కాలాలలో చాలా తేడా ఉన్నది. అందువలన, దయాళువగు వసిష్ఠులవారు స్వకృత ప్రాచీన గ్రన్థే కాలానుసారేణ బీజం ప్రసార్య శాస్త్రాన్తరమివ ప్రాహ అనగా తన పాతగ్రంథములోని విషయాన్నే కాలానికి తగిన బీజమును (సంస్కారమును) చేసి - దీనినొక క్రొత్త గ్రంథము వలె మాండవ్యునకు ఉపదేశించారట. (వసిష్ఠ సంహితా - జగద్దీపికావ్యాఖ్యా - ఉపోద్ఘాత భాగము)

6. ఈ వ్యాఖ్యాతయే ఈ ఉపోద్ఘాతమునందే - తత్ త్యాలేఖ - తత్తత్కాల దృక్సిద్ధయే బీజం ప్రసార్య - తదేవ - వ్యాసాదిభి రష్టాదశభిః లోకే విస్తారితమ్ । అతో-ష్టాదశ సిద్ధాన్తా ఇతి లోకే ప్రసిద్ధిః ॥ అనగా వ్యాసాదులగు 18 మంది ప్రాచీన సిద్ధాంత ప్రవర్తకులు, సూర్యప్రోక్తమగు ఆ ప్రప్రథమ సిద్ధాంతమునే, వారి వారి కాలములలో తత్తత్కాలీన ప్రత్యక్ష దృష్టికి సరిపోవునట్లు బీజము (దృక్సంస్కారము)ను చేసియే లోకమున ప్రవర్తింపజేశారు. అందువలన లోకములో 18 సిద్ధాన్తాలని ప్రసిద్ధి ఏర్పడినది. (అనగా ఒకే సిద్ధాన్తము కాలానుగుణముగా దృక్సంసార సంపన్నమై కొంగ్రొత్త శోభలతో వెలుగొందుచున్నదని ఖరాఖండిగా తేల్చి చెప్పాడు.)

7. శాఖాచంక్రమణమే అయినను ఇట మరొక గణనీయ విషయము : విజ్ఞాన శాస్త్రరంగములందు అన్నిట ఆయా శాస్త్రవేత్తలు ఏవో కొన్ని పరిశీలనలను చేయటం, ఫలితాలను తమ ప్రజ్ఞ, అనుభవములతో విశ్లేషించి కొన్ని అభిప్రాయములను ఏర్పరచుకొని, వాటిని తాము కనిపెట్టిన సిద్ధాన్తములుగ లోకమునకు పరిచయము చేయటం ప్రసిద్ధమే. కాని మన భారతీయ సంప్రదాయము ఈ విషయ మున కూడ సర్వవిలక్షణమైనదే. మనకు అన్ని రంగములందు ఆయా విద్యలను / విజ్ఞానములను అందించిన మహర్షు లెవ్వరును తాము ఆ సిద్ధాంతములను కనిపెట్టినట్లు చెప్పుకొనరు. తదితరులందరు వారిని శాస్త్ర ప్రవర్తకులంటారే

గాని, వారు కనిపెట్టిరని అనరు. ఇంతకుముందు మనము గుర్తు చేసికొన్న సూర్యుఁ పితామహో వ్యాసుఁ వంటి వాక్యములు కూడ ఆ మహర్షులను శాస్త్ర ప్రవర్తకులనియే తెలుపుచున్నాయి. వీరు కష్టపడి తపస్సు జేసి భగవంతుని ద్వారా గాని, గురుశుశ్రూష చేసి గురువుల ద్వారా గాని విజ్ఞానమును తాము పొంది, తరువాతి తరములకు గురుపరంపరయా కాని లేక శాస్త్ర గ్రంథముల ద్వారా కాని దానిని అందించుచుందురు. ఇంతకు, ఈ ప్రస్తావన దేనికనగా మన భారతీయ విద్యలు, విజ్ఞానము, సిద్ధాంతములు ఎవరో ఒక మానవమాత్రుడు కనిపెట్టినవి కావని, అవి దైవదత్తములని, కాగా మన పంచాంగ సిద్ధాంతము అట్టి దైవదత్తమేనని, దానినే ఆయా మహర్షులు, ఆయా కాలములలో కాలానుగుణ సంస్కార సంపన్న మొనరించి, ప్రవర్తింప చేశారని గుర్తుచేసుకొనుటకే.

8. ఏతావతా తేలినదేమనగా –పంచాంగ కర్తలందరకు మూల గ్రంథము ఒకటే అని, అది సూర్య సిద్ధాంతమే అని, దానిలో భిన్న పద్ధతులు లేవని, గ్రహస్థితి గతులను బట్టి కాలానుగుణ దృక్సంస్కారములు మాత్రము చేసుకొను చుండవలెననీ.

9. ఇక పంచాంగ రచనలో రెండవ అంశము పండుగలకు, పర్వాలకు వలయు ధర్మశాస్త్ర విషయము. దానికి మన పంచాంగ కర్తలందరు – మన భారతదేశ మంతటా – అందరు ఏకగ్రీవంగా అంగీకరించిన గ్రంథములు కూడ ఒకటే. అవి శ్రుతి, స్మృతి, పురాణములు మరియు ధర్మసింధువు, నిర్ణయ సింధువు, వీరమిత్రోదయము, కాలమాధవీయము, వైద్యనాథ దీక్షితీయము మున్నగు నిబంధన గ్రంథములు. కనుక ఈ అంశంలో కూడ పంచాంగాలలో తేడా ఉండటానికి వీలు లేదు.

10. కాగా, గ్రంథాలని అర్థం చేసుకొనటంలో లేదా సమన్వయం చేసుకొనటంలో వ్యక్తుల ప్రతిభా సంస్కారాలు కూడ కీలకాలే కనుక తద్వారా వచ్చే తేడాలను ఎవరూ ఆపలేరు. ఆ సంగతి వదిలేస్తే, పంచాంగాలలో తేడాలకి ప్రధానంగా పూర్వపద్ధతి /దృగ్గణితం – మళ్ళీ వాటిలో కూడ ఎన్నో రకాలు ఎలా వస్తున్నాయి? ఇదే మన విచారణలోని రెండవ ప్రశ్న.

విమర్శ – 2 : ప్రమాణ గ్రంథాలు ఒకటే అయి, వాటిలో ఒకటే పద్ధతి ఉంటే, ఇన్ని రకాల పంచాంగాలు ఎలా వస్తున్నాయి?

సమీక్ష : మన ప్రకృత చర్చలో ప్రధాన భాగం ఇదే.

1. ప్రస్తుతం మనకు లభిస్తున్న పంచాంగాలు ప్రధానంగా (1) పూర్వపద్ధతి (2) దృగ్గణితం (దృక్సిద్ధాన్తం) అని రెండు రకాలుగా ఉంటున్నాయి. రెండిటికిని కాల విషయంలోను, గ్రహ గతుల విషయంలోను సూర్య సిద్ధాంతమే ప్రమాణమయినప్పటికిని, కాలానుగుణ సంస్కారముల విషయాలలో మతభేదము ఏర్పడినది. ఈ విషయంలో చాలాకాలంగా, తరచుగా, అనేక వివాదాలు తలఎత్తి కొనసాగుచూనే ఉన్నాయి. స్థూలంగా వీటి స్వరూపము –

- ✤ **పూర్వపద్ధతి** : సూర్య చంద్రులకు దృక్సంస్కారం చేయరు.
- ✤ **దృక్సిద్ధాంతం** : అన్ని గ్రహాలకు దృక్సంస్కారం చేస్తారు.
- ✤ **పూర్వపద్ధతి** : దృక్సిద్ధ తిథులు యజ్ఞ శ్రాద్ధాది ధర్మ కర్మలకు పనికి రావని వీరి మతము.
- ✤ **దృక్సిద్ధాంతం** : దృక్సిద్ధ తిథులే సమస్త కార్యాలకీ గ్రాహ్యములని వీరి మతము.
- ✤ **పూర్వపద్ధతి** : వీరిలో కొందరు, యాత్రా వివాహాది దృష్టఫల కర్మలకు, జాతక ముహూర్తాదులకు మాత్రము దృక్సిద్ధ తిథులను వాడవలెనని అంటారు.
- ✤ **దృక్సిద్ధాంతం** : వీరికి అన్నిటికీ దృక్సిద్ధ తిథులే.
- ✤ **పూర్వపద్ధతి** : గ్రహణాదుల కొరకు మాత్రం సూర్య చంద్రులకు కూడ దృక్సంస్కారం చేయాలి.
- ✤ **దృక్సిద్ధాంతం** : అన్నిటికి చేయవలసినదే.
- ✤ **పూర్వపద్ధతి** : కుజాది పంచ గ్రహాలకే ఏవో కొన్ని దృక్సంస్కారాలు చేస్తారు. అయితే

అవి నవీన వేధశాలల ప్రత్యక్ష పరిశీలనకు సరిపోవు.

✤ **దృక్సిద్ధాంతం** : అలా సరిపోయేటట్లే సంస్కారం జరిగి తీరాలని వీరి మతం.

✤ **పూర్వపద్ధతి** : గ్రహలాఘవం, గణకానందం, నరకంఠీరవం, తిథిచంద్రిక ఇత్యాది కరణ గ్రంథాలలో ఒక్కొక్కరు ఒక్కొక్క దానినే అనుసరిస్తారు. అందువలన ఈ పద్ధతిలో పంచాంగాలు అనేకం.

✤ **దృక్సిద్ధాంతం** : వీరిలో ప్రధానంగా ఇట్టి ప్రసక్తి లేదు.

✤ **పూర్వపద్ధతి** : ఇలా పూర్వ గ్రంథాల మీదనే ఆధారపడినది కనుక ఇది పూర్వ పద్ధతి అని అనబడును.

✤ **దృక్సిద్ధాంతం** : నవీన వేధశాలల ప్రత్యక్ష దృక్కుకి సర్దుబాటు అగును కనుక ఇది దృక్సిద్ధ పద్ధతి.

2. కాగా మతభేదం అంటూ వచ్చిందంటే, ఎవరివాదం వారిదే. ఏవో కారికలు చెప్పటం, వాటికి తమకు అనుకూలముగ భాష్యాలు చెప్పటం షరా మామూలే. వాటిని ఇచట స్థూలంగా, సంగ్రహంగా పరిశీలిద్దాము. నిర్ణయము విజ్ఞులు చేయవలసినదే.

(అ) పూర్వపద్ధతి వారు -

1. స్యాద్దేశోచిత నిర్బీజ గ్రహైః పంచాంగ శోధనమ్ । సబీజైః గ్రహణాదీనాం పుణ్య కర్మణి శస్యతే ॥

2. దృక్సిద్ధ గ్రహ కాలేన గ్రహణాదీని శోధయేత్ । శాస్త్ర సిద్ధ గ్రహగతిః అదృష్టార్థేషు కర్మసు ॥

ఇత్యాది కారికలను బట్టి అదృష్ట ఫల సిద్ధికరములగు - అనగా వ్రతోపవాస యజ్ఞ శ్రాద్ధాదులకు నిర్బీజ (దృక్సంస్కార రహిత) గ్రహములను / తిథులను గ్రహించాలనీ - గ్రహణ, గ్రహ సమాగమ, గ్రహోదయాస్తమయ, చంద్ర శృంగోన్నతి మున్నగు వాటికై దృక్సంస్కారమును చేయవలెనని చెప్పుచున్నారు.

ఇచట 1వ శ్లోకములోని దేశోచిత పదమునకు అర్థము ఏమిటో?

దృక్పద్ధతి వారు - **భ చక్ర నాభి దృక్సిద్ధే కుర్యాచ్ఛ్రాద్ధ వ్రతాదికమ్ । భ చక్ర నాభి దృశ్యస్య కర్మాంగత్వే చ హేతవః॥**

ఇత్యాది కారికలను బట్టి వ్రత శ్రాద్ధాది సమస్త ధర్మ కార్యములకు దృక్సిద్ధ తిథులనే గ్రహించాలని అంటున్నారు.

(ఆ) పూర్వపద్ధతి మతమును బట్టి -

1. దృష్ట ఫలములగు జాతక, ముహూర్త, యాత్రా, వివాహాదులకు దృక్సిద్ధ గ్రహములను

2. అదృష్ట ఫలములగు యజ్ఞ శ్రాద్ధాదులకు అదృష్ట (దృక్సంస్కార రహిత) గ్రహములను

గ్రహించవలెనని చెప్పినట్లైనది. అగుచో -

✤ ఈ అభిప్రాయము - లౌకిక వివాదమునకు లౌకిక పరిష్కారము వలె (పెద్ద వానికి పెద్ద భాగము, చిన్న వానికి చిన్నది యన్నట్లు) కనిపించుచున్నది కాని, యుక్తి సహముగా లేదు. ఎందువలన అనగా -

(అ) దృష్ట బ్రాహ్మణ సమారాధన, దృష్టాగ్నులలో హోమము, దృష్ట విగ్రహాదులకు పూజ, దృష్ట గురు వృద్ధ సేవ ఇత్యాదులు కేవలము దృష్టఫలములే కాదు గద!

(ఆ) అదృష్ట ఫలార్థము (అరణి, దర్భస్తంబము వంటి) అదృష్టాగ్నులలో మాత్రమే హోమము చేయబడుట లేదు కద!

(ఇ) వివాహాది సంస్కారాలలో అదృష్ట (అపూర్వ) ఫలం ఉన్నది కద!

✤ మన యుక్తికి సరిపోక పోయినను శ్రుతి, స్మృతి మూలకములే అగుచో సప్రమాణములే అగును కాని, పై విషయమున అట్టి ప్రమాణములు ఉన్నాయా? లేక ఆ అభిప్రాయములు ఆయా కారికాకారుల లేక వ్యాఖ్యాతల స్వాభిప్రాయములా?

✤ మన యుక్తికి సరిపోకపోయినను, విశిష్ట విజ్ఞాన సంపన్నులగు ఆ మహనీయ వ్యాఖ్యాతల స్వాభిప్రాయములు కూడ అస్మదాదులకు ప్రమాణభూతములై శిరోధార్యములే కావచ్చును కాని, అదే విషయమున, తత్సమకక్షులు మరొక

విధముగా చెప్పుచున్నప్పుడు తుల్య బల విరోధము ఏర్పడి ఆ రెంటిలో ఏది ఎక్కువ యుక్తి సహమో అదే గ్రాహ్యము కావలెగద! లేదా వ్యవస్థిత వికల్పము ఏర్పడవలెను. ఈ వ్యవస్థ ఏమి?

పూర్వపద్ధతి మతమును బట్టి దృష్టఫల కర్మలకు దృష్ట గ్రహములనే గ్రహించుటకైనను, వారు, ఆ దృక్సంస్కారమును ప్రస్తుత కాలమునకు కాక (గణకానందాది కరణ గ్రంథాలను బట్టి చేయుటచే) ఆయా పూర్వకాలములకే సరిపడునట్లు చేయుట న్యాయమా?

✤ ప్రప్రథమ సూర్యసిద్ధాన్తము ప్రకారము లభించే గ్రహములు ఈనాడు అదృష్టములే కావచ్చును గాని, ఆనాటికవి దృష్టములే గద. ఆనాటి అదృష్ట కర్మలకు వలయు గ్రహములెట్లుండవలెనో ?

✤ ఒకవేళ, ఆనాటికి అవి అట్లు గ్రహించక తప్పదు. కాని కాలాన్తరమున వాటికి ఎట్టి మార్పులు చేయరాదన్నచో, మరి తదుపరి సిద్ధాన్త ప్రవర్తకులందరు చేసిన పనియేమి? తదుపరి కరణ గ్రంథకర్తలు చేసినదేమి?

✤ ఒకవేళ, వారు చేసినది దృష్టఫలార్థమే యన్నచో, మరి ప్రస్తుతం పూర్వపద్ధతి యనబడు దానిలో అదృష్ట ఫలార్థం కేవలం సూర్యసిద్ధాన్తం ప్రకారమే గ్రహసాధన చేయుచున్నారా?

✤ ఒకవేళ, దృక్సంస్కారము బొత్తిగా వద్దని కాదు. వ్యాసాదులు మహర్షులు కనుక వారు చేయవచ్చును గాని, తదితరులు ఆ పని చేయరాదన్నచో, మరి కరణ గ్రంథకర్తలు మహర్షులు కాదు కనుక వారిని అనుసరించుటయేమి?

✤ కరణ గ్రంథకర్తలు మనకు పూర్వులు. పూర్వులను గౌరవించి, అనుసరించుట మన సంప్రదాయమన్నచో, మరి ప్రస్తుతము లభించుచున్న కరణ గ్రంథములు పలువిధములుగా ఉన్నాయి గద. వాటిలో ఏది గ్రాహ్యము? వాటి విషయమున శేషాచలస్య దక్షిణ భాగే సౌరాబ్దాः అన్నట్లు దేశ వ్యవస్థ కాని, చతురవత్త పంచావత్తులకు వలె గోత్ర ప్రయుక్త వ్యవస్థ కాని ఏమైనా ఉన్నదా?

✤ పూర్వులను గౌరవించుట, అనుసరించుట అనగా, వారు ఇచ్చిన పాత ఇంటికి తగిన మరమత్తులను గాని, కాలానుగుణములగు చేర్పులు / మార్పులు / కూర్పులను గాని చేసికొనరాదా? అట్లు చేయుట వారిపట్ల అపచార మగునా? అపచారమేయగుచో, సూర్యానన్తర సిద్ధాంత ప్రవర్తకులగు మహర్షులందరు అట్టి అపచార .... (శాన్తం పాపమ్ !)

✤ వేదోఽఖిలో ధర్మమూలం । తద్విదాం చ స్మృతిశీలే । అథ యది తే కర్మ విచికిత్సా వా వృత్త విచికిత్సా వా స్యాత్ ..... యథా తే తత్ర వర్తేరన్ । తథా తత్ర వర్తేథాः ॥ ఇదియే గద మనము అవశ్యము అనుసరించితీరవలసిన సామయాచారిక ధర్మము. మరి వ్యాసాది మహర్షులందరి స్మృతిశీలములు - గ్రహగతుల విషయమై కాలానుగుణ సంస్కార ప్రవణములై ఉండుటే గాక, తదనన్తరము కరణ గ్రంథకర్తలగు ఆ మహాత్ములందరి ప్రవర్తన తదనుగుణముగనే యుండగా, ఆ సంప్రదాయమును అనుసరించుటయే ధర్మము గద !

✤ ఇట్లు చూడగా, ప్రకృత కాలమున దృక్పద్ధతి అనబడుచున్న దానినే సాంప్రదాయిక పూర్వపద్ధతి యనజెల్లుననీ, ప్రకృతమున పూర్వపద్ధతి యనబడునదే అసాంప్రదాయిక మైనదనీ, దీనిలోని పూర్వత నేతి బీరకాయలోని నేతి వంటిదని తేలుచున్నది గద!

ఇత్యాదులను విజ్ఞులు విచారించవలెను.

మరొక ముఖ్య విషయము

1. ద్వైతాద్వైతమతములు ఉన్నాయి. రెండిటికీ వేదమే ప్రమాణము. కనుక రెంటిని వైదిక దర్శనములనియే అనుచున్నాము. రెండిట విచార్య విషయము జగజ్జీవేశ్వర తత్త్వమే. కనుక రెండిటిని తత్త్వ శాస్త్రములనియే వ్యవహరించుచున్నాము. ఆత్మ విషయమై ఆ రెండు మతములలో గల విస్పష్ట విభేదమును బట్టి అతివ్యాప్తి / అవ్యాప్తి దోషములు లేని ఆ పేర్లు వాటికి చక్కగ అతికినాయి. ఆ మతములలో ఒకటి ఎక్కువ అనిగాని లేక ఒకటి తక్కువ అని గాని ఆ పేర్లు సూచించుట లేదు. కనుక ఆ పేర్లు ఉభయ సమ్మతముగనే ఉన్నాయి.

2. దురదృష్టవశాత్తు మన పంచాంగ పద్ధతుల నామకరణము అట్లు జరిగియుండలేదు. పూర్వ పద్ధతి - దృక్పద్ధతి అనబడుచున్న ఈ రెండు పద్ధతులకు సర్వ

పూర్వమగు సూర్యసిద్ధాన్తమే ప్రమాణము. కనుక రెండిటిని పూర్వపద్ధతులనియే అనాలి. అట్లే రెంటిలోను ఎంతోకొంత / ఏదోవిధమగు దృక్సంస్కారము ఉండనే ఉన్నది. కనుక రెండును దృక్పద్ధతులే అగుచున్నాయి. ఇట్లు ఈ రెండు పేర్లలోను అతివ్యాప్తి దోషమున్నది. కాగా, పూర్వసిద్ధాన్తములు మరియు దృక్సిద్ధాన్తములు తదనన్తర కాలీనములే అయినను, నేటికి పూర్వకాలీనములే అగు కరణ గ్రంథములు అనబడు సమస్త పూర్వ గ్రంథములందు, పూసలలో దారము వలే, ఏకరీతిగా అనుస్యూతముగా వచ్చుచున్న, కాలానుగుణ దృక్సంస్కార భావన నేటి పూర్వపద్ధతిలో లేదు. కనుక దీనిలో పూర్వత ఒకవిధముగా / కొంత లోపించినది. కనుక పేర్లలో అవ్యాప్తి దోషము తగులుచున్నది. ఇట్లు ఈ పేర్లు ఈ పద్ధతులలోని విస్పష్ట భేదమును సూచించుట లేదు. పైగా సామాన్యులకు ఒకవిధమైన చికాకునే కలిగించుచున్నాయి. విషయముపై బాగా అవగాహన ఉన్నవారికి పేచీ లేదు గాని, తదితరులకు, ఆ పేర్లు ఏదోవిధముగా ఒక పద్ధతి మరొక దానికంటే మెరుగైనదన్న అపోహను కూడా కలిగించు చున్నాయి. కాబట్టి ఈ పేర్లు రెండును సమంజసములు గావనక తప్పదు.

3. కాబట్టి ఈ ఈ సిద్ధాన్తములు, పద్ధతులు, వీటిలోని మత భేదములు, వీటిని గూర్చి చర్చించునప్పుడు, వ్యవహార సౌలభ్యమునకై, వీటన్నిటికి - వీటిలోని గుణ దోషములతో నిమిత్తము లేని - అతివ్యాప్తి, అవ్యాప్తి దోషములు లేని - అందరకు ఆమోదయోగ్యమైన పేర్లను నిర్ణయించుట చాల అవసరము. లేదా ఆయా ఆధార గ్రంథములను బట్టి ఇప్పటి పూర్వపద్ధతి అనబడువాటిని గణకానంద పంచాంగము, గ్రహలాఘవీయ పంచాంగము .... ఇత్యాదిగా, అట్లే దృక్పద్ధతి అనబడు వాటిని కూడ కేత్కరీయ లేదా జ్యోతిర్గణిత దృక్పద్ధతి, మధుర కృష్ణమూర్తి శాస్త్రి గారి పద్ధతి .... ఇత్యాదిగా వ్యవహరించుట సమంజసము. ఇది అన్ని పద్ధతుల విజ్ఞులు తప్పక విచారించవలసిన విషయము.

(ఇ) ఈ సందర్భముగ తిథి విషయములో పూర్వపద్ధతి వారు తమ మతమునకు

దృక్సిద్ధ ఖేట గ్రహ సాధితాసు కుర్వంతి కేచిత్తిథిషు ప్రమాదాత్।
శ్రాద్ధాదికం తత్పితృ శాపతస్తే పుణ్యక్షయా ద్దుర్గతి మాప్నువంతి॥

అను స్కాంద పురాణ వచనము కూడ ప్రమాణమని అనుచున్నారు. కాగా -

1. పురాణములలో ఊర్ధ్వ పుండ్ర విహీనానాం నరకే శాశ్వతీ స్థితిః వంటి అర్ధవాదాలు తరచుగ తటస్థపడుచునే ఉంటాయని, ఇట్టి వాక్యములు తుల్య బల విరోధే వికల్పః అను న్యాయమునకు లోబడునవే కాని, స్వతంత్రముగా ఒక మతమును స్థాపింప జాలినవి మాత్రము కావు. కనుక ఈ వచన పూర్వాపరములను విజ్ఞులు విచారించాలి.

2. కొన్ని పురాణ ప్రతులలో ఇది కనిపించుట లేదని కొందరు అనుచున్నారు కూడ.

(ఈ) పూర్వపద్ధతి వారు -

గ్రహణాదుల (గ్రహణ, గ్రహ సమాగమ, గ్రహోత్తోద యాదుల) విషయంలో దృక్సంస్కారము చేయవలెనని చెప్పుచూ -

1. ఒక్క గ్రహణ విషయంలోనే గవర్నమెంటు వారి ఎఫిమెరీసుని ఆశ్రయించి సరిచేసుకుంటున్నారు. (కొందరు ఈ పనిని లోపాయికారిగా చేసుకుంటున్నారట) మరొక విధంగా చేస్తే ఆ గ్రహణాలు ప్రత్యక్ష పరిశీలనకు నిలవజాలవు కదా! మంచిదే. కాని,

2. అదే కారికను బట్టి గ్రహ సమాగమాదులకు కూడ అట్టి సంస్కారమే చేయవలసి యుండగా, వాటికి మాత్రం గణకానందాది కరణ గ్రంథములను బట్టి సంస్కారము చేయుట న్యాయమా?

3. గ్రహణము దృశ్యమే కావచ్చును కాని, గ్రహణ కాల కృత్యములగు స్నాన దానాదులు అపూర్వ ఫలకములే కనుక, తదర్థమై అదృష్ట గ్రహములను గ్రహించకూడదా? కారికాకారులు అట్లు చెప్పుటకు మౌలిక ప్రమాణము ఏమి?

(ఉ) గణకానందమున సూర్యజ్ఞయోః బీజ ఫల మనుక్తమ్ అని ఉన్నప్పటికిని, పూర్వపద్ధతి వారు బుధునకు కూడ దృక్సంస్కారము ఎందుకు చేయుచున్నారు? విజ్ఞులు విచారించాలి.

(ఊ) మరొక విషయము -

రవీందు మంద సంసిద్ధాత్ తత్తత్తిథ్యాది భోగతః ।
స్యాతాం తత్కాల బీజోత్థౌ బాణ వృద్ధీ రస క్షయః ॥

తిథ్యాది భోగమును బట్టి తిథియొక్క పరమవృద్ధి 5 ఘడియలు (2 గంటలు), పరమక్షయము 6 ఘడియలు (గం॥2:24 ని॥) అని దీని భావము. ఇది ఒక ప్రసిద్ధ కారిక. దీనిలోని తిథ్యాది భోగతః అనుచోట ఆది అనే పదానికి

పూర్వపద్ధతి వారు - తిథి యొక్క మొదలు అని

దృక్పద్ధతి వారు - తిథి మున్నగువాటి యొక్క (అనగా తిథి, నక్షత్ర, యోగముల యొక్క) అని అర్థమును చెప్పుచున్నారు. కరణము తిథ్యర్ధము కనుక వేరుగా గ్రహించనక్కరలేదుట. ఆ పైన దృక్పద్ధతి వారు బాణ వృద్ధీ రస క్షయః అనుదాని స్థానమున వసు వృద్ధి దశ క్షయః అను పాఠాంతరమును స్వీకరించుచున్నారు.

ఈ స్థితిలో - పూర్వపద్ధతి ప్రకారం తిథి పరమవృద్ధి 5 ఘడియలు (2 గంటలు), పరమ క్షయము 6 ఘడియలు (గం॥ 2:24 ని॥)

దృక్పద్ధతి ప్రకారం తిథి పరమవృద్ధి 8 ఘడియలు (3 గం॥ 12 ని॥), పరమ క్షయము 10 ఘడియలు (4 గంటలు) అగును.

దీనిపై ఇద్దరి వాదములు -

1. పూర్వపద్ధతి వారు బాణ వృద్ధీ రస క్షయః అంటారే కాని, వారి గణితంలో కూడ ఈ వృద్ధి క్షయాలు 5-6 అనే హద్దులను అప్పుడప్పుడు దాటిపోతూనే ఉంటాయి.

ఉదాహరణకు : బ్ర.వే.తెలకపల్లి వేంకటరమణశర్మ సిద్ధాంతి (పెసరవాయి సిద్ధాంతి)గారి ప్రమాథి నామ సంవత్సర పంచాంగము -

05.4.1999 చవితి వృద్ధి 5-14 (ఘ.వి.)
31.5.1999 పాడ్యమి వృద్ధి 5-37 (ఘ.వి.)
17.5.1999 విదియ క్షయం 6-50 (ఘ.వి.)
11.7.1999 త్రయోదశి క్షయం 6-12 (ఘ.వి.)

2. కొందరు పంచాంగ కర్తలు ఇలాంటి సందర్భాలలో ఇలా అధికమైన దానిని ముందు వెనుక తిథులకు పంచుతారట.

3. దృక్పద్ధతిలో ఇట్టి పరిస్థితి రాదు గాని, ఒక్కొక్కసారి వారికి ఒక తిథి ముందు - వెనుక రెండు రోజులలోను ఏనాడూ అపరాహ్ణ స్పర్శ లేకుండాపోతూ ఉంటుంది. అలా జరిగినప్పుడు ఆ తిథి నాటి శ్రాద్ధాదులు లోపిస్తాయి కనుక, ఈ పద్ధతి ధర్మానుగుణము కాదని పూర్వపద్ధతి వారి అభియోగము.

దానికి దృక్పద్ధతి వారి సమాధానము -

✤ ఇట్టి పరిస్థితి పూర్వపద్ధతిలో కూడ తప్పదు. ఉదాహరణకి పైన పేర్కొన్న పంచాంగములో 17.5.99 నాటి విదియ క్షయము 6.50 (ఘ.వి). పూర్వదినమున పాడ్యమి 24.28 (ఘ.వి). మధ్యాహ్నంతము 19.07. అపరాహ్ణంతము 25.30. ఒకవేళ పూర్వదినమున పాడ్యమి 25.40 వరకు ఉండి ఉన్నచో, ఈ పరిస్థితులో మరునాటి విదియ 18.50 అయి, రెండు దినములలోను అపరాహ్ణ స్పర్శ లేనిదే యగును.

కాబట్టి ఇట్టి పరిస్థితి రెండు పద్ధతులలోను సమానమే.

✤ కాగా, ఇది దోషము కాదు. ఇట్టి స్థితిలో శ్రాద్ధాదులను ఎప్పుడు ఆచరించనగునో కాలమాధవీయాది మౌలిక ధర్మ నిబన్ధన గ్రంథములందు స్పష్టముగ వివరింప బడియే ఉన్నది. కాలమాధవీయమున :- యదా తు దివసద్వయే-ప్యపరాహ్ణస్పర్శో నాస్తి - తదా (యద్యపి పరేద్యుః కుతప వ్యాప్తి రస్తి - తథాపి తత్పరిత్యజ్య) పూర్వవిద్ధైవ గ్రాహ్యా అనీ - కాల నిర్ణయ చంద్రికలో :- నోభయత్రాపరాహ్ణ వ్యాప్తి రిత్యస్మిన్ షష్ఠే పక్షే పూర్వైవ గ్రాహ్యా అని నిస్సందేహముగా, స్పష్టంగానే చెప్పారు. కనుక ఈ పరిస్థితి ధర్మ విరుద్ధము కాదు. కర్మ లోపము ఉండదు.

(ఋు) ఇంకొక ముఖ్య విషయము : వ్రత శ్రాద్ధాదు లన్నిటికిని దిన ప్రమాణమును ప్రాత స్సంగవాదిగా పంచధా విభాగము చేసి ఆ యా వ్రత శ్రాద్ధాదులకు వలయు కర్మకాలమున పూర్వేద్యు రేవ, పరేద్యు రేవ ఇత్యాదిగా షట్పక్ష విచారణ చేసిన గాని ఆ కార్యక్రమములు ఏ రోజు జరుగవలెనో నిర్ణయము కాదు. ఈ పంచకాల విభాగ - షట్పక్ష విచారణ అన్ని నిబంధన గ్రంథములయందు ఒకే రీతిగా ఉన్నది. ఈ కాల ప్రమాణము సామాన్యముగా 6 ఘడియలు. భారతదేశమున ఏ ప్రాన్తమున ఏ రోజున అయినను ఇది తప్పక 5 ఘడియలకు మించియే ఉండును. మరి పూర్వపద్ధతిలో తిథి పరమ వృద్ధి 5 ఘడియలే కనుక ఈ షట్పక్ష విచారణలో మూడవదియగు ఉభయేద్యుః

అనునది దీనిలో ప్రసక్తము కాదు. ప్రసక్తము కాని దానికై నిబంధన కర్తలందరు అంత పట్టుగా, ఏకరీతిగా విచారించి, నిర్ణయించిరనుట న్యాయము కాదు. కనుక పూర్వపద్ధతి వారి బాణ వృద్ధియే ధర్మ దూరము అగుచున్నదా?

ఏతావతా తేలినదేమనగా – 1. నిజముగా శాస్త్రములో రెండేసి సిద్ధాంతములు, రెండేసి పద్ధతులు ఉంటే భేదం తప్పదు. వాటిలో ఏది ఎక్కువ? ఏది తక్కువ? లేదా ఏది ఏ సందర్భములో ఉపయుక్తము ఇత్యాదుల నిర్ణయము చాలా క్లిష్ట సమస్య. కాని అదృష్టవశాత్తు మనకు ఆ బాధ లేదు. ఎందువలన అనగా వాస్తవముగా ఉన్నది ఒకటే సిద్ధాన్తము. రెండు లేనే లేవు కనుక.

2. సిద్ధాంతాన్ని అర్థం చేసుకుని పంచాంగాలు చేసే పద్ధతిలోనే భేదం వచ్చింది. కారణం మన పంచాంగ కర్తలలో చాలమందికి (క్షమించాలి) పంచాంగ రచనలో, జాతక ముహూర్తాదులలో చాలా ప్రతిభ, అనుభవం ఉన్నప్పటికీ దానికి తగినంతగా వారు సిద్ధాంత భాగాన్ని పట్టించుకొనక పోవుటయే. ముఖ్యముగా మన తెలుగునాట పంచాంగకర్తలు శతాధికముగా ఉన్నను వారిలో సిద్ధాంత పరిజ్ఞానము ఉన్నవారు ఇద్దరా? ముగ్గురా? అనునది అందరకు తెలిసినదే! కాబట్టే మనకు ఇన్ని రకముల పంచాంగాల బెడద దాపురించినది.

3. సౌర సిద్ధాంత రీత్యా గ్రహాలను సాధించుకుని కాలానుగుణ దృక్సంస్కారములను చేసుకోవాలి. తదర్థము శాస్త్రములో నిర్దుష్ట పద్ధతులు ఉన్నాయి. ఏ పద్ధతిని అనుసరించినా కావలసినది, జరుగవలసినది అవి ప్రత్యక్ష దృక్కుకి సరిపోవుటయే. అయితే, కావలసినది శాస్త్ర దృక్కే కాని, మానవ మాత్రులది కాదని అనవచ్చు. కాని జ్యోతిషము, వైద్యము మొదలగు శాస్త్రములకు ప్రత్యక్ష నిదర్శనము ప్రధానమని మహర్షులే నిర్దేశించారని మరువకూడదు.

4. దృగ్విషయమై అతీంద్రియ దృష్టులగు మహర్షులకు యంత్రాల, పరికరాల అవసరము ఉండదు. తదితరులు పూర్వకాలమున నాళికలు అనబడే పరికరములను ఉపయోగించిడి వారట. వాటి స్వరూప, నిర్మాణ, ప్రయోగాల సాహిత్యము ఇప్పుడు మనకు లభించుట లేదు. కాని ప్రస్తుత కాలమున మన వేధశాలలోని దూరదర్శినులు ఆ కోవకు చెందినవే కనుక వాటిని అనుసరించక తప్పదు. అది తప్పు కూడా కాదు.

5. కొందరు ఇవి నవీనములు కనుక వాటిని అనుసరించుటకు జంకుచున్నారు. కొందరు ఎందుకో – ఫలితములు సరిగా వచ్చుట లేదని రూఢిగా తెలియు చునేయున్నను – మొండిగా వాటికి దూరమగుచున్నారు. ఒకవేళ ఆ నాళికలకు – ఈ దూరదర్శినులకు ఏమైన కొంత వ్యత్యాసము ఉన్నదని అనుకున్నను – దంపుడు బియ్యం దొరకనప్పుడు తిండి మాని వేయుట కంటే మర బియ్యమును వాడి అయినా కడుపు నింపుకొనుటయే న్యాయమైనట్లు – ఈ దూరదర్శినులను వాడుకొనుట తప్పదు. అది తప్పు కూడా కాదు.

సారాంశము ఏమనగా: 1. దృక్సిద్ధాంతమే సౌర సిద్ధాంతము. ప్రత్యక్ష పరీక్షకు నిలిచే గ్రహణాలు, మౌఢ్యాలు అన్నీ దీనికే సరిపోతాయి. ధర్మశాస్త్రానికి ఇది ఏ మాత్రం విరుద్ధం కాదు. సర్వాత్మనా అనుగుణమే. ఫలితాలు, అనుభవాలు దీనికే దగ్గరగా ఉన్నాయి.

2. ప్రస్తుతం పూర్వపద్ధతి అని అనబడుచున్నది దీనిలో ఒక దశ మాత్రమే. గమ్యస్థానమును చేరని దశ. కాబట్టి ఆపూర్వపద్ధతి వారు చేయవలసినది ఏమనగా, వారికి ఈ బండి గిట్టనిచో మరొక బండిలోనైనా ఈ గమ్యానికే చేరాలి. తప్పదు.

3. గ్రహ గతులలోని మార్పును బట్టి గణిత సంస్కారములు జరుగుచున్నాయి అని అనటానికి సిద్ధాంత, కరణ గ్రంథములే సాక్ష్యము. గ్రహలాఘవీయ, గణకానందాదులన్నిట గ్రహ స్థితి గతులు ఒకే విధముగా ఉండకపోవుటకు కారణము ఏమనగా విశిష్ట విజ్ఞాన సుసంపన్నులు అగు ఆయా గ్రంథకర్తలు తమతమ కాలమునకు సరిపోవునట్లు వీలయినంత సంస్కారములను చేయుటయే. కాబట్టి దృక్సంస్కారమును అనాదిగా మహర్షులు మొదలు మాననీయ మానవులు అందరు చేయుచున్నదే. కనుక ఇప్పుడు ఇప్పటి సౌకర్యములను ఉపయోగించుకొనుట ఆ సంప్రదాయమును అనుసరించుటయే అవుతుంది కాని, ఉల్లంఘించుట ఏ మాత్రము కాదు. దృక్సంస్కారము చేయకుండుటయే సంప్రదాయ విరుద్ధము.

4. గ్రహగతులను బట్టి సంస్కార విధానములు మారు చుండునని చరిత్ర చాటుచునే యున్నది. దురదృష్టవశాత్తు గత 5-6 శతాబ్దములుగా ఇట్టి సంస్కారములు సరిగా జరుగని కారణంగా అనేక మత భేదములు తల ఎత్తినాయి. కేవలము అతీంద్రియములగు విషయములకు శ్రుతి స్మృతులే ప్రమాణము. జ్యోతిషము, వైద్యము మొదలగు శాస్త్రములు ప్రత్యక్ష విషయములని, కనుక వాటి విషయమున ప్రత్యక్ష మును కూడ పరిగణనలోనికి గ్రహించుటయే శాస్త్రీయమని మహర్షులు నిర్ణయించినదే. పైగా ఇట్టి పరిశీలనలను, సంస్కారములను తరచుగా చేసికొనుచుండవలయునే కాని ఏనాడో చేసిన పరిశీలనా ఫలితములనే అన్ని కాలములకు వేదానుశాసనమని అంటగట్టరాదు.

5. ధర్మే ప్రతీయమానే తు వేదేన కరణాత్మనా । ఇతి కర్తవ్యతా భాగం మీమాంసా పూరయిష్యతి ॥ అను రీతిన సిద్ధాంత గ్రంథాలు సూచించే సంస్కారాలకు కావలసిన పద్ధతులను ఆయా కాలాలకు వరాహమిహిరాది మహాత్ములు రూపకల్పన చేశారు. అనుష్ఠానానికి ఆచమనాది బ్రహ్మార్పణం వరకు కావలసిన తంతుని ప్రయోగ గ్రంథాలు వివరించి నట్లు, ఆయా కాలానుగుణ సంస్కారాలనే వివిధ పథకముల ద్వారా గ్రహలాఘవీయాది గ్రంథాలు ఒక్కొక్క పద్ధతిలో రూపొందించినాయి. ప్రస్తుత కాలంలో మనం ఆ ఫలితాలను మన వేధశాలల ద్వారా మరింత సులభంగా, మరెంతో నిర్దుష్టంగా పొందే అవకాశం ఉన్నందున వాటిని సద్వి నియోగం చేసుకొనటం వివేకవంతమే అవుతుంది. దాని వలన ఒకవేళ మనం సత్యానికి బెత్తెడు దూరమైతే, దానిని అసలే ఉపయోగించుకొననప్పుడు బారెడు దూరమవటం ఖాయం.

ఇక మన చర్చలోని మూడవ అంశానికి వద్దాము.

విమర్శ - 3 : ఏ పంచాంగము ప్రామాణికము?

సమీక్ష : గ్రహ, కాల విషయమున సూర్యసిద్ధాంతమును కాలానుగుణ సంస్కారములను చేసి, ధర్మానుగుణముగా పర్వాదులను నిర్ణయించెడి పంచాంగమే ప్రమాణమన జెల్లును.

ఈ సందర్భముగా మరికొన్ని ముఖ్య విషయములు -

1. వ్రత, శ్రాద్ధాదులకు వలయు పంచకాల - షట్పక్షాది విచారణకు, వార దుర్ముహూర్తాదులకు కూడ స్థానిక సూర్యోదయాస్తమయ - అహః ప్రమాణాదుల విచారము కూడ అవసరము. ఇవి ఒకే స్థానమున కూడ ఏరోజుకారోజు మారుచునే యుండును.

2. ధర్మ శాస్త్ర విషయములు కూడ కొన్ని దేశాచారాను బద్ధములే. కాబట్టి వీటన్నిటిని సరిగా పరిగణనలోనికి తీసుకున్నదే ఆ ప్రాంతమునకు ప్రమాణ పంచాంగము అగును. (వంశాచార, కులాచారములకు సంబంధించిన అంశములు ఎవరికి వారు సరిచూచుకొనవలెనే గాని, ఏ పంచాంగములో అయినా పూర్తిగా వివరించుట కుదరదు.)

3. పూర్వకాలమున పంచాంగములు సామాన్యముగా ఆయా ప్రాంతములకు పరిమితములై ఉండెడివి. కనుక తిథి, పర్వాదుల తేడాల ప్రసక్తి రాదు. ప్రస్తుత కాలమున ఒకే పంచాంగము అనేక ప్రాంతాలలో ఉపయోగపడుచున్నది. కనుక వివిధ ప్రాంతములలో ఆ పంచాంగము ప్రకారము తిథి పర్వాదులందు రాగల తేడాలను సూచించవలసిన ఆగత్యము ఏర్పడుచున్నది. కనుక విజ్ఞులగు పంచాంగకర్తలు కొందరు దేశాంతర సంస్కార పట్టికలను, సూచికలను ఇచ్చుచున్నారు. మంచిదే. అయినను దేశాంతరములందు తిథి పర్వాదులను, ఎక్కడికక్కడ, విద్వాంసుల సహాయముతో నిర్ణయించుకొనుటయే మంచిది.

4. కొందరు పంచాంగకర్తలు వారి పూర్వులు దేశాంతర ప్రసక్తి చేయలేదు గనుక అది అనవసరమని, అది లేకుండగనే, తమ పంచాంగము సర్వ ప్రాంతములకు పనికి వచ్చునని భావించుచున్నారు. వారి పంచాంగములో వారు వేసెడి ఉదయాస్తమయములు ఏ ప్రాంతమునకు చెందినవో? వారి ప్రాంతమునకు అవి సరిపోవునో లేదో? వారికి అనవసరము! వారి పూర్వులు కాశీలో పంచాంగములు చేసి కాశ్మీరమున ఉపయోగించిరా? కాని తాము మాత్రము అట్లు చేయుదురు. ఇది ఏమి విజ్ఞతయో! దానికొక నమస్కారము.

ఇక మన చర్చలోని నాల్గవ అంశము:

విమర్శ - 4 : ఒకే పంచాంగమున సంవత్సరాది వంటి పండుగలు ఒక ఊరిలో ఆదివారము నాడని, మరొకచోట సోమవారమని వ్రాయుచున్నారు. ఇదేమి చోద్యము? పండుగ అందరకు ఒకే రోజు రాదా?

సమీక్ష : 1. కొన్ని పండుగలు, అందున ముఖ్యమైన సంవత్సరాది, దీపావళి వంటివి కూడ ఒక పంచాంగంలో ఒక రోజు అని ఉంటే, మరొక దానిలో మరొక రోజు అనీ, ఒకే పంచాంగములో కూడ ఒక పండుగ ఒక ప్రాంతంలో ఒక రోజున, మరొక ప్రాంతంలో ఆ మరునాడు అని చూచుచున్నాము. ఇదేమి చోద్యము? పండుగ అందరకు ఒకే రోజు రాదా? పంచాంగాలు వ్రాసే వారిలో గాని, వ్రాసే పద్ధతిలో గాని లోపమున్నదేమో? లేకపోతే ఈ పిచ్చి వ్రాతలేమి? అని అనిపించవచ్చు. ఇట్టి చిక్కు ఏ పంచాంగాని కైనా తప్పదు. ఇలాంటి ఆలోచనలకి మూలకారణమేమనగా – మనకి – మహోన్నతము, అతీంద్రియ విజ్ఞతాపూర్ణమును అయిన మన సనాతన భారతీయ సంప్రదాయమునకు దూరమై – కేవలము ఐహిక, భౌతిక, సాంసారిక విషయ వ్యాకులతతో యున్న నేటి మనకి – మన పండుగల యొక్క మూల తత్త్వము, మన మహర్షుల దూరదృష్టి తెలియక పోవటమే.

అసలు విషయమేమనగా మన పండుగలన్నీ ఆధ్యాత్మిక చింతనతో పెనవేసుకొనియున్న ధార్మిక కార్యక్రమములే కాని సరదాల కొరకు ఏర్పడినవి కావు. వాటి కాల విశేషములు ఖగోళ భూగోళ విజ్ఞానముపై ఆధారపడి ఉన్నాయి. ఆకాశమున సూర్య చంద్రాదుల స్థితిగతులను, భూగోళముపై మన స్థానమును మేళవించి వాటి కాలములను మహర్షులు నిర్దేశించినారు. ఆ ఖగోళ భూగోళ విజ్ఞాన విశేషములపై మన పంచాంగ సరళి ఏర్పడియున్నది.

2. కాగా పండుగల కాలమును నిర్ణయించుటలో భూగోళముపై మనస్థానము కూడ ప్రధానాంశము అగుచున్నది. స్థానిక సూర్యోదయ సూర్యాస్తమయ కాలములు ఇచట కీలకాంశములు. ఇవి ప్రపంచమంతటా కాదు కద – ఒక దేశంలో – ఒక రాష్ట్రంలో – ఒక జిల్లాలో కూడ ఒకే సమయములో జరుగవు. ఒకే స్థానములో కూడ ఇవి రోజురోజుకి మారుతూంటాయి. వాటిని శాస్త్రీయముగ పరిశీలించి మాత్రమే నిర్ణయించాలి. స్థానిక అక్షాంశ రేఖాంశలను బట్టి ఉజ్జాయింపు చేయవచ్చు.

3. ఏతావతా మన పండుగలన్నియు ఇట్టి స్థానికాంశములపై కూడ ఆధారపడి ఉన్నవి కనుక ఒక పంచాంగం ప్రకారము ఒక పండుగ ఒక స్థానమున ఒక రోజున అని నిర్ణయమైనను అదే పంచాంగం ప్రకారం ఆ పండుగ మరొక స్థానమున మరో రోజు కావచ్చును. తిథి శ్రాద్ధాదులన్నింటి విషయమున ఇదే న్యాయము. కాకపోతే సన్నిహిత ప్రాంతములలో ఇట్టి తేడాలు అరుదు.

4. స్వాతంత్ర్య దినోత్సవము వంటి లౌకిక కార్యక్రమ ముల వలె మన ధార్మిక పర్వ దినములు కూడ దేశం మొత్తంలో ఒకే రోజు రావాలంటే ఈ పంచాంగ చర్చ, శ్రమ దేనికి? ఇంగ్లీషు క్యాలెండరులో వాటికై ఒక తేదీని కేటాయించుకొనవచ్చు. చాల సుఖము. అట్టి పండుగలలో ధార్మిక, ఆధ్యాత్మిక లాభము మాత్రము, ఏమాత్రము ఉండదు.

ఇక మన చివరి ప్రశ్న –

విమర్శ – 5 :– పంచాంగములలో, పండుగలలో తేడాలు, వాటి ద్వారా వచ్చే చికాకులన్నిటికి కారణం పంచాంగకర్తలలో ఐకమత్యం లేకపోవుటయే. కనుక పంచాంగకర్తలందరు ఒకే తీరుగ పంచాంగ రచన చేయ వలెనను నియమమే దానికి పరిష్కారము. దేశము మొత్తానికి ఒక ప్రామాణికమైన మరియు ఆధికారికమైన పంచాంగం ఏర్పడాలి.

సమీక్ష : 1. ఈ ఏకైక పంచాంగ భావన వినటానికి అందముగా కనిపించుచున్నదే కాని ఇది ఏ మాత్రం శాస్త్రీయము కాదు, కాజాలదు. ఏ పంచాంగమునకైనను గ్రహస్థితి గతులు, కాలమానము, ధర్మశాస్త్ర విషయములు ఇవన్నీ స్థానికాంశము లతో పెనవేసుకొని యున్నవే. వాటిని అట్లు పరిగణించని పంచాంగము పంచాంగమే కాదు. పంచాంగములలోని భేదములకు పంచాంగ కర్తల విజ్ఞత, సంస్కారములే ప్రధాన కారణములు. పంచాంగమును ఉపయోగించు కొనెడి సజ్జనుల విజ్ఞత – సంస్కారములే దానికి పరిష్కారము.

2. సమాజ శ్రేయస్కాములు, సంప్రదాయానువర్తులగు విద్వాంసులు, విజ్ఞులు, పంచాంగ కర్తలు అందరు ఈ విషయములను గుర్తించి, ప్రస్తుతానికి స్వయముగా సిద్ధాంత భాగమున కృషి చేయు పరిస్థితి లేకపోయినను, ఆ మార్గమును అనుసరించి సమాజమునకు సరియగు పంచాంగమును అందించవలసిన అగత్యము చాల ఉన్నది.

ఏ పద్ధతి ప్రకారమైనను, ఏ పంచాంగమును బట్టి అయినను స్థానమును బట్టి వచ్చెడి పండుగలలోని ఇట్టి తేడాలను మనమందరము విజ్ఞతతో, విజ్ఞాన దృష్టితో గ్రహించాలి - ఆహ్వానించాలి - ఆనందించాలి.

ఇక చివరి మాట

1. ఈ పూర్వపద్ధతి / దృక్సిద్ధాంత రాద్ధాంతము ఈ నాటిది కాదు. సుమారు రెండు శతాబ్దములుగా సాగుచునే ఉన్నది. అప్పటికే విజ్ఞులది ఒకబాట, తదితరులది ఒకబాట అయి ఉండెను. (ఇచట విజ్ఞులనగా ఖగోళ విజ్ఞాన, ధర్మశాస్త్ర పరిజ్ఞాన సంపన్నులని). ఏ రంగములోనైనను విశిష్ట విజ్ఞాన సంపన్నులు చాలా తక్కువ మందే ఉంటారు. తదితరులదే సంఖ్యలో ఆధిక్యము (మెజారిటీ). ఇది సహజము. అయినను, శాస్త్రీయ విషయములందు విజ్ఞుల నిర్ణయములనే అనుసరించి విజ్ఞాన ఫలములను ఆస్వాదించుటయే వివేకము. దురదృష్టవశాత్తు మన పంచాంగ రంగమున అది బాగా లోపించినది.

2. మన పంచాంగ రంగమును, మన ధర్మశాస్త్రను గుణముగా, విజ్ఞాన సంశోభితము చేయుటకై ఎందరో మహానుభావులు, పీఠాధిపతులు, ప్రభుత్వము వారు కూడ చిరకాలముగా ఎంతో శ్రమించుచునేయున్నారు. ఉదాహరణకు -

1. సుమారు 150 సంవత్సరముల నాడే అప్పటి కామకోటి పీఠాధిపతులు ఈ విషయమై సభ చేయించుటయే గాక, ఆ సభలో విజ్ఞులు నిర్ణయించిన ప్రకారమే తమ పీఠములో దృక్సిద్ధాంత పంచాంగమునే అనుసరించ నారంభించి నేటికిని కొనసాగించుచున్నారు.

2. శ్రీ వేంకటేశ (బాపూజీ) కేత్కరు అను పుణ్యశ్లోకుడు, బహుపరిశ్రమ చేసి, 1898లో ఇట్టి దృక్సిద్ధాంతమునకు తగిన జ్యోతిర్గణితమును అద్భుత ప్రామాణిక గ్రంథమును వెలయించెను. వేదభాష్య ప్రకాశకులగు (పూనా) ఆనందాశ్రమ సంస్థ వారే దానిని ప్రకటించిరి. తదాది అది విద్వల్లోకమున శిరోధార్యమాయెను.

3. 1953లో భారత ప్రభుత్వము వారు కూడ మన దేశమున నడచుచున్న వివిధ పంచాంగ రీతులను పరిశీలించి, ప్రామాణిక పద్ధతి తెలుపుటకై, ఒక పండిత బృందమును నియమించిరి. ఆ బృందము వారు మన దేశమున గల 30 పైబడిన పంచాంగ రీతులను పరిశీలించి, అన్ని ప్రాంతములందలి పండితులను సంప్రదించి, కేత్కరీయ జ్యోతిర్గణితమునకు సరిపడు పద్ధతియే ప్రామాణికమని ప్రభుత్వము వారికి తెలిపిరి. దానిని బట్టి 1956 నుండి భారత ప్రభుత్వము వారు అన్ని రాష్ట్రములకు ఆయా భాషలలో రాష్ట్రీయ పంచాంగములను ప్రకటించుచున్నారు.

4. 1966లో రాజమండ్రిలో శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల వారు జరిపించిన సభలో కూడ అట్లే నిర్ణయమైనది. ఇంకను ఇట్లేన్నో సభలు జరిగినాయి, జరుగుచున్నాయి. విజ్ఞులదొకదారి తదితరులదొకదారి అగుచునే యున్నది. ప్రభుత్వము వారు మత నిరపేక్షులు (సెక్యులర్) గనుక వారిని కాని, వారి కమిటీని కాని కాదన్నా, మన దేశంలో అన్ని ప్రాంతాలలోని ఖగోళ విజ్ఞాన సంపన్నులు, ధర్మశాస్త్ర పారంగతులు, సాంప్రదాయికులు కూడా అయి ఉన్న విద్వాంసులే రూపొందించినదీ, మరియు, ధర్మైకనిరతులు సంప్రదాయ పరిరక్షకులును అగు శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పరమాచార్యుల వంటి మహాత్ములు కూడా ఆమోదించి అమలు చేయుచున్న ఈ దృక్సిద్ధాంత పద్ధతిని అనుసరించకపోవటం కేవలం వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకొనటమే.

5. మంచిదే. వ్యక్తిగత స్వాతంత్ర్యము అందరు కోరుకొనవలసినదే. కాని పదార్థ ధర్మములు, గ్రహముల స్థితిగత్యాదులు, కాల విశేషములు, వాటి వలన కలిగెడి శుభాశుభములు తదర్థము చేయవలసిన ధార్మిక కార్యక్రమములు అన్నియు ప్రకృతి సిద్ధములు, భగవన్నిర్దిష్టములు. అవి ఆయా విజ్ఞానశాస్త్ర, ధర్మశాస్త్రాదుల ద్వారా మాత్రమే తెలియునట్టివి. వాటికి మన స్వాతంత్ర్యముతో సంబంధము లేదు. వాటిని తెలిసికొనుట, తెలిసికొనకుండుట, తెలిసియు సద్వినియోగమొనర్చుకొని శుభఫలితములను పొందుట, పొందకపోవుట మాత్రము మన ఇష్టము. మన ధార్మిక కార్యక్రమములకు వలయు కాలవిశేషములు, గ్రహస్థితి గత్యాదులు ఆ దృక్సిద్ధాంత పద్ధతిలో ఎక్కువ నిర్దుష్టములుగా తెలియుచున్నాయని, ఆయా శాస్త్ర విజ్ఞుల అభిప్రాయము. దానిని అనుసరించుట, అనుసరించకపోవుట కూడ మన ఇష్టమే.

కుప్పా ఆంజనేయ శాస్త్రి

ముహూర్తాలు - అభిజిత్ లగ్న విచారణ


అహస్సు 60 ఘటికలు లేక 24 గంటలున్నప్పుడు 30 ముహూర్తముల వ్యవస్థ ఏర్పడును అంటే ఒకొక్క ముహూర్తము రెండు ఘటికలు అనగా నలుభది ఎనిమిది నిమిషాల ప్రమాణము. పగలు ఎనిమిదవ ముహూర్తము ''అభిజిత్ ముహూర్తము'' అని దీనినే ''విజయ ముహూర్తము''అని కొందరి అభిప్రాయము. **"అష్టమే దివస స్యార్ధేత్వభిజిత్ సంజ్ఞకఃక్షణం"** మధ్యాహ్నము గం. 11:45 ని. నుండి గం.12:30ని. వరకు అభిజిత్ ముహూర్తము అని అంటారు. నారద పురాణం ప్రకారం మధ్యాహ్నం గం. 12:00 లకు పూర్వము ఒక ఘడియ తరువాత ఒక ఘడియ అనగా ఉదయం గం. 11:36 ని. నుండి మధ్యాహ్నం గం. 12:24 ని. వరకు అభిజిన్ముహూర్తము ప్రకారాంతముగ సూర్యోదయం నుండి నాల్గవ లగ్నం అభిజిత్ లగ్నము అభిజిత్ కాలము సుదర్శన చక్రము వలె సర్వ దోషములను నశింపజేస్తుందని చెప్పబడినది. **"దిన మధ్య గతే సూర్యే ముహూర్తే హ్యభిజిత్ ప్రభు! చక్రమా దాయ గోవిందః సర్వాన్ దోషాన్ నికృన్తతి" !!** కాని బుధవారము అభిజిత్ నిండ్యము మరియు దక్షిణ దిశకు ప్రయాణం చేయరాదు. **"అభిజిన్ని బుధే శస్తం యామ్యంతు గమనే తథా"**

1. నారద సంహిత తొమ్మిదవ అధ్యాయం దివారాత్రి ముహూర్త విచారణ అందలి ఆరవ శ్లోకము

శ్లో ॥ పౌరాణికారౌద్రసితమైత్రవారభవాఃక్షణాః ।
సావిత్రవైరాజికాఖ్యోగంధర్వశ్చాష్టమోభిజిత్ ॥

తాత్పర్యము:- పౌరాణికుల మతము నందు దివా ముహూర్తములు ఈ విధముగా చెప్పిరి. రౌద్ర, సిత, మైత్ర, సూర్య, సావిత్ర, వైరాజిక, గంధర్వ, అభిజిత్ అని ఎనిమిదవ ముహూర్తమే కుతప కాలమని చెప్పిరి. తరువాత పదవ శ్లోకము నందు నక్షత్రాధిపతులు ముహూర్తములలో శుభకార్యములు చేయవచ్చని చెప్పుచున్నారు.





శ్లో ॥ అభిజిద్బలయుక్తాస్తేసర్వకార్యేషుసిద్ధిదాః ।
ఏషుఋక్షేషుయత్కర్మకథితంనిఖిలంచయత్ ।
తదైవేత్యేతన్ముహూర్తేకార్యేయాత్రాదికంసదా ॥

తాత్పర్యం:- దినమందు ఎనిమిదవ ముహూర్తమగు అభిజిత్ ముహూర్తము మిక్కిలి బలమైనది మరియు సకల కార్యములను చేయునది అగుచున్నది. అని చెప్పిరి ఆయా నక్షత్రములయందు విధింపబడిన ఆయా కార్యములు చేయుట కుదరక పోయినచో ఆ నక్షత్రమునకు తగిన ముహూర్తమున ఆ కార్యమును చేయవచ్చని చెప్పిరి.

2. వసిష్ఠ సంహితవివాహాధ్యాయంలో రెండు వందల ఇరవై ఆరవ శ్లోకము

శ్లో ॥ మధ్యం దినగతే భానౌ ముహూర్తోఽభిజిదాహ్వయః।
యోఽష్టమః సర్వదోషఘ్నస్తృంథకారంయథా రవిః ॥ 226

తాత్పర్యము :- సూర్యుడు ఆకాశ మధ్య భాగములో వచ్చినప్పుడు అభిజిత్ ముహూర్తమంటారు. ఇది రోజులో ఎనిమిదవ ముహూర్తము, సూర్యుడు ఏ విధముగానైతే చీకటిని నశింపచేయునో అలాగే అభిజిత్ ముహూర్తము సర్వ దోషములను నశింపజేయును.

శ్లో ॥ సూర్యాచ్ఛతుర్థం యల్లగ్నమభిజిత్సంజ్ఞకం తుతత్।
సర్వ దోషం నిహంత్యాశు, పినాకీ త్రిపురం యథా॥ 227

తాత్పర్యము :- సూర్యోదయమునుండి నాల్గవ ముహూర్తము అభిజిత్ ముహూర్తము అందురు. పినాకపాణి త్రిపురాసురున్ని నశింపజేసినట్టు ఈ లగ్నము కూడ సర్వ దోషములను నశించేయును.

శ్లో ॥ సర్వదేశేష్విదం ముఖ్యం సర్వ వర్ణేషు సర్వదా ।
సర్వ దోష హరః యద్వద్ధరిరిత్యక్షర ద్వయమ్ ॥228

తాత్పర్యము :- శ్రీహరి నామ స్మరణ ఏ విధముగా దోషములను తొలగించునో అదే విధముగా ఈ అభిజిత్ ముహూర్తము సర్వ దోషములు తొలగించును ఇది సమస్త దేశీయులకు, సమస్త వర్ణములవారికి ప్రశస్తమైనది.

3) ముహూర్త రత్నావళి

యాత్రా ప్రకరణము నందు యాత్రాభిజిత్రాశస్యము అను అంశము నందు

శ్లో ॥ అష్టమోహ్యభిజి దాహ్వాయాక్షజో!
దక్షిణాభిముఖ యనమంతరా ।
కీర్తతోఽవరక కుప్పు సూరిభి!
ర్యాయినామభిమతర్ష సాధనే!!

తాత్పర్యము :- యాత్రా సమయము నందు దక్షిణ దిక్కుకు తప్ప తక్కిన దిక్కులకు పగలు పదనాలుగు ఘడియల పిదప పదహారు ఘడియల వరకు అభిజిన్ముహూర్తము మిక్కిలి ప్రశస్తమైనదని ఇష్ట సిద్ధిని ఇచ్చునని శ్రీపతి వచనము.

4) నారద సంహితాయాత్రా ప్రకరణ మందు

శ్లో ॥ అభిజిత్క్షణ యోగోఽయమభీష్ట ఫల సిద్ధిదః ।
పంచాంగ శుద్ధి రహితే దివసేఽపి ఫలప్రదః ॥

తాత్పర్యము :- యాత్రాకాలము నందు అభిజిత్ కాలమైనచో పంచాంగ శుద్ధి లేనిదైనా శుభకరమే అగును.

శ్లో ॥ అభిజిత్ సర్వ కార్యేషు శస్తం నాత్రోపనాయనమ్ ॥

తాత్పర్యము :- అభిజిత్ ముహూర్తమందు అన్ని కార్యములకు ప్రశస్తం కాని ఉపనయనమునకు పనికిరాదు.

5) ముహూర్త వల్లరి అనే సంకలనము గ్రంథ మందు ఈ విధముగా కలదు.

"అభిజిత్ సర్వ దోషఘ్నం" అనే వచనము ప్రయాణమునకు మాత్రమే వర్తించును. మిగిలిన అన్ని శుభకార్యములకు దానిని వర్తింపజేయుట తగదు. ఈ అభిజిత్ లగ్నము సర్వ దోషములను నశింపజేయును కాని వివాహం, ఉపనయనం, గర్భాధానము తప్ప మిగిలిన సర్వ శుభకార్యముల యందు ప్రశస్తమైనది అని మహర్షుల

వాక్యము. ఈ అభిజిత్ లగ్నము "అశేష దోషా పహరం" అని ఋషి వాక్యం. ఈ లగ్నం సుమారుగా మిట్ట మధ్యాహ్నము ఉండును ఈ లగ్నములో వివాహము చేసినచో నష్టము వాటిల్లునని బ్రహ్మ శపించునట్లు నారద సంహిత నందు గలదని వ్రాసినారు.

6) నారద సంహిత, వివాహ ప్రకరణము నందు

శ్లో ॥ చతుర్థ మభిజిల్లగ్నముదయాతత్తు సప్తయమ్ ।
గోధూలికం తదుభయం వివాహేపుత్ర పౌత్ర దమ్॥ 145

తాత్పర్యము :- సూర్యోదయము నుండి నాల్గవ లగ్నం అభిజిత్ ఏడవ లగ్నం గోధూలి లగ్నం వీని యందు వివాహం చేసినచో దంపతులు పుత్ర పౌత్రాభివృద్ధిగా నుందురు అని ఉన్నది.

శ్లో ॥ ప్రాచ్యానాంచ కలింగానాం ముఖ్యం గోధూలికం స్మృతమ్ ।
అభిజిత్ సర్వదేశేషు ముఖ్యం దోష వినాశకృత్ ॥ 146

తాత్పర్యము :- తూర్పు దేశీయులకు, కళింగ దేశీయులకు గోధూలి సమయం ప్రాశస్త్యము మిగిలిన దేశాలవారికి అభిజిత్ లగ్నము ప్రాశస్త్యము.

శ్లో ॥ మధ్యం దినగితేభానౌ ముహూర్తోఽభిజిదాహ్వయః ।
నాశయత్యఖిలాన్దోషాన్పినాకీత్రిపురం యథా ॥ 147

తాత్పర్యము :- సూర్యుని మధ్యాహ్న కాలసమయమే అభిజిల్లగ్న కాలము. ఇది పినాకపాణి త్రిపురాసురున్ని ఏ విధముగా నాశనం చేశాడో అదేవిధముగా అభిజిత్ లగ్నము సమస్త దోషములను నాశనము చేయును అని ఉన్నది.

శ్లో ॥ మధ్యందినగతే భానౌ సకలం దోషసంచయమ్ ।
కరోతి, మభిజిత్తూలరాశిమివానలః ॥ 148

తాత్పర్యము:- మధ్యాహ్నకాలమందలి అభిజిత్ లగ్నము దూదిరాశి యందు నిప్పుకణం వలె సర్వ దోషాలను దహింపజేయును అని ఉన్నది

7) జ్యోతిష్య రత్నమాల యందు అభిజిన్ముహూర్తమందు ప్రయాణమునకు అభిజిత్ ప్రశస్తము అని ఉన్నది.

శ్లో!! అష్ట మోహ్యాభిజిదాహ్వయాక్షదక్షిణాభిముఖయాన మంతరా
కీర్తితో పరకకుప్పు సూరిభిర్యాయినా మభమతర్ష సిద్ధిదః ।
ఉత్పాత విష్టి వ్యతిపాత పూర్వాన్ నిహన్తి దోషానభిజిన్ముహూర్తః
కరోతి యామ్యామపహాయ కాష్టాం దిగంతరాణి ప్రజతోర్ష సిద్ధం ॥

తాత్పర్యం :- ఎనిమదవ ముహూర్తమయిన అభిజిత్ ప్రయాణానికి సిద్ధినిచ్చునది అని, వ్యతీపాత, విష్టి కరణ, ఉత్పాతములయందు సర్వ దోషములను పోగొట్టునని మరియు అభిజిత్ దక్షిణ దిక్కు ప్రయాణానికి నిషేధించబడినది.

8) వాస్తు దుందుభి ఈ గ్రంధము నందు అభిజిత్ లగ్నము గూర్చి ప్రస్తావన

శ్లో ॥ ఉత్పాత విష్టి వ్యతిపాత పూర్వాన్నిహంతి దోషానభిజిన్ముహూర్తేః ।
వ్రతంచ యామ్యామపహాయ కార్యకర్తుః ప్రయాతుర్దిశతి స్వహృదయమ్ ॥

తాత్పర్యము :- ఈ అభిజన్ముహూర్తము ఉత్పాతాదులు, విష్టి కరణాలు, వ్యతీపాత యోగాలు మొదలుగా గల దోషములు అన్నింటిని హరించును. ఈ అభిజిల్లగ్నమున ఉపనయనము, దక్షిణ దిక్కు ప్రయాణము, వ్రతము గాక ఏ కార్యమును గావించినను ఏ దిక్కునకు ప్రయాణించినను కార్యకర్తకును, ప్రయాణికునకును మనస్సునందు ఏయే కోరికలు కలవో ఆ కోరికలన్ని వెరవేరును.

9) జ్యోతిర్విదా భరణము వివాహ ప్రకరణోత్తరార్ధము నందలి పదవ శ్లోకము.

శ్లో ॥ భగోడు వాల్మీకిరిహాహసౌమ్యం సీతా నిషేవేన సుఃఖం న తుష్టిం ।
భైమే తథైవాభిజిధృక్ష మత్రిస్తచ్ఛాపమాపోడు తదేయమస్మాత్ ॥

తాత్పర్యము :- వాల్మీకి మహర్షి సీతా వివాహము ఫల్గునీ నక్షత్రమున జరుగుటచే వైవాహిక సౌఖ్యము అబ్బ లేదని అదేవిధముగా అత్రి మహర్షి అభిజిత్ మంచిది కాదని తెలిపిరి. ఎందుకనగా ఆ నక్షత్రమున నలునికై దమయంతితో వివాహము జరిగెను అందుచే ఆమెకు కూడ వైవాహిక

జీవితము సుఖము కలుగలేదు. అందువలన పూర్వఫల్గుణి, అభిజిత్ నక్షత్రాలను ప్రజల వివాహమునకు వాడకుండ త్యజించినారు. ఆ మహాత్మురాంద్ర శాపమానక్షత్రములకు తగిలిందట అని వ్యాఖ్యానములో నున్నది.

10) కాలామృతము :- పంచమ బిందు 177 వ శ్లోకము

శ్లో ॥ స్యాద్భంగోఽభిజిదాహ్వయేచనిలయేధిష్ణ్యే ముహూర్తే తథా !
రోగస్స్యాద్వసుభస్యచోత్తర దళా దృక్షేషు పంచస్వపి,
దుఃఖం దక్షిణ దిక్ప్రయాతురథవా నాన్యత్ర యాతు స్వయం
మీనేచేదథ సర్వ దిక్షు గమనం యాతుశ్చ వక్రం భవేత్!!

తాత్పర్యము :- అభిజిల్లగ్నము నందు, అభిజిన్నక్షత్రము నందు, అభిజిన్ముహూర్తమందు ప్రయాణము చేయు వారికి శుభకరంబనియు, దక్షిణ దిక్కు ప్రయాణము చేయు వారలకు రోగకరమనియు అని ఉన్నది.

11) వాల్మీకి రామాయణము :- వాల్మీకి రామాయణము నందు యుద్ధ కాండ నాలుగవ సర్గ మూడవ శ్లోకము నందు గోవిందరాజీయ వ్యాఖ్యానమందు -

శ్లో ॥ అస్మిన్ ముహూర్తే సుగ్రీవ ప్రయాణ మభిరోచయే ।
యుక్తో ముహూర్తో విజయః ప్రాప్తో మధ్యం దివాకరః ॥

వ్యాఖ్యానం :- సుగ్రీవుడా ఈ ముహూర్తము నందే (దండయాత్ర) ప్రయాణమునకు ఇష్టపడుచున్నాను, ఈ ముహూర్తము ప్రయాణమునకు తగినది, విజయం కలిగించునది. సూర్యుడు దినమున నడి భాగము పొందినాడు, దండయాత్రకు విజయము కలుగు కారణము చెప్పుచున్నారు. దినమందు రవి నడిమి భాగమున ఆకాశ మధ్య భాగమున పొందినాడు, దినమందు! రాత్రికి పదునైదు ముహూర్తములు పగటికి పదునైదు ముహూర్తములు కలిసి ముప్పై ముహూర్తములు రెండు ఘడియలకొక ముహూర్తము ఇరువది నాలుగు నిమిషములకొక ఘడియ!

"అర్ద్రో, రోగ, మిత్ర, మఖ, వసు, జల, విశ్వ, భిజిద్విరించేంద్రాఃఐంద్రాగ్నిమూలం వరుణార్యమ భగతారా దివా ముహూర్తాస్స్యుః" ॥ ఆర్ద్ర, ఆశ్లేష, అనూరాధ, మఖ, ధనిష్ఠ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, అభిజిత్, రోహిణి, జ్యేష్ఠా, విశాఖ, మూల, శతభిషము, ఉత్తరఫల్గుని, పూర్వఫల్గుని అను నక్షత్రములకు చెందినవి పగటి పదునైదు. ముహూర్తములు అని **"విద్యామాధవీయం"** అనే జ్యోతిష్య గ్రంధమందు చెప్పబడినవి. వీనిలో దినము నడిభాగము నున్న ముహూర్తము అభిజిన్ముహూర్తము అగును ఇది విజయావహము.

అభిజిన్ముహూర్తములు దక్షిణయాత్రలందు విశిష్టములని **"జ్యోతిష్య రత్నాకరము"** నందు **"భుక్తా దక్షిణ యాత్రాయాం ప్రతిష్ఠాయాం ద్విజన్మని! ఆధానేచ ధ్వజారోహే మృత్యుదస్స్యాత్సదాభిజిత్"** (భుక్తి, దక్షిణ యాత్రా, దేవతాప్రతిష్ఠా, ఉపనయనము, ఆధానము. ధ్వజారోహణము అను కర్మలయందు ఎల్లప్పుడు మృత్యువు కలిగించును). అని చెప్పబడినది మరి అభిజిత్ ముహూర్తము దక్షిణ యాత్రకు ఎట్లు పనికి వచ్చును అని ఆక్షేపణ రాగా లంకా నగరము కిష్కింధకు దక్షిణ పూర్వము గలదు అనగా ఆగ్నేయదిశయందున్నది దక్షిణ దిశ కాదు కావున చెప్పబడిన దోషము లేదు.

విశేషము :- సర్వ సాధారణముగా ప్రయాణమందు యోగ్యమైన కాలమని ఆయా ఋషుల మతమిట్లున్నవి.

"గార్గ్య సిద్ధాంత ఋషిః కాలకలన శకునమూనుటయది బృహస్పతి మతంబు ।
విప్రజన వాక్యమరయంగ విష్ణు మతము సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతంబు"

(ప్రాతః కాలమున ప్రయాణము మంచిదని గార్గ్యముని మతం, శకునము చూచి ప్రయాణము చేయుట మంచిదని బృహస్పతి మతము, (బ్రాహ్మణ వాక్యమును బట్టి ప్రయాణము చేయుట మంచిదని విష్ణు మతము) అభిజిన్ముహూర్త ప్రయాణము చేయుట అందరికి సమ్మతమైన మతము.

12) ముహూర్త చంద్రిక యందు అభిజిత్ విశేషము

శ్లో ॥ ఉత్పాత విష్టి వ్యతిపాతపూర్వా న్నిహంతి దోషానభిజిన్ముహూర్తః ।
కరోతి యామ్యమపహాయ కాష్టాదిగంత రాణి ప్రజతోర్ధసిద్ధిం ॥

తాత్పర్యము :- అభిజిన్ముహూర్తము ఉత్పాత దోషము విష్టి దోషము వ్యతీపాత ప్రముఖ దోషము ఇత్యాది దోషములు పరిహరింప జేయును ప్రయాణములందు దక్షిణ దిక్కుకు తప్ప తదితర దిక్కులకు అర్థ లాభము చేయునని అర్థము.

13) ముహూర్త మార్తాండముఅభిజిత్ లక్షణం తత్ఫలం చాహ

శ్లో ॥ మిశ్రాఖైరువభైర్దనాదిమలవే తేక్షేర్ధితే యేన్తి మేక్షి
ప్రైర్నక్రమశో మృదూగ్ర చరభై రాత్రి త్రిభాగేష్వియాత్।
శ్రుత్యర్క్యజ్యమృగేష్వయంపనియోవైశస్త్వపాదశ్రవిస్థిత్యక
శన్స్థిధిజిద్గ మేసఫలదో యామిం వినావీక్షణః ॥

తాత్పర్యము :- అభిజిన్ముహూర్తమందు దక్షిణ దిక్కు తప్ప మిగిలిన దిక్కులకు పోవటం వలన సకల విధములకు శుభకరము విశేషఫలం అభిజిల్లక్షణ కాలం సమాప్తం (తాత్పర్యం సూక్ష్మంగా విశ్లేషణ చేడమైనది)

14) ముహూర్త దర్పణము అభిజిత్ మరియు గోధూళి సమయాలు

శ్లో ॥ మధ్యందిన గతే భానౌ ముహూర్తో ఽభిజిదాహ్వయః ।
సర్వదోషాన్నిహంత్యాశు పినాకీ త్రిపురం యథా ॥

శ్లో ॥ సూర్యాచ్చతుర్థం యల్లగ్నమభిజిత్సంజ్ఞకం చతత్ ।
సర్వ దేశేష్విదం ముఖ్యం సర్వ వర్గేషు సర్వదా ॥

శ్లో ॥ అశేష దోషాపహరం శుభప్రదం
జగుర్మునీంద్రా అభిజిన్ముహూర్తం
తద్వైవ గోధూళికనామధేయం వివాహ
యాత్రాద్యఖిలోత్సవేషు ॥

తాత్పర్యము :- అభిజిన్ముహూర్తం విష్టి, వ్యతీపాత. దోషాలు అపహరించును వివాహము ప్రయాణము గృహప్రవేశము,వాస్తు కర్మ మొదలయిన శుభ కార్యాలయందు శ్రేష్ఠమైనది అని చెప్పబడినది.

శ్లో ॥ అభిజిత్సర్వ కార్యేషు శస్తం నాత్రోపనాయనం ।
సూర్యాత్సప్తమలగ్నం చ గోధూళిక మితి స్మృతమ్ ॥

తాత్పర్యము :- అభిజిత్ ముహూర్తము ఉపనయనము నకు తప్ప మిగిలిన అన్ని శుభకార్యములకు ప్రసిద్ధము. విశేషమైనది ప్రాశస్త్యమైనది.

15) రత్నమాలా

శ్లో ॥ యస్మిన్ ధిష్ణ్యే యచ్ఛ కర్మోపధిష్టం తద్దైవత్యే
తన్ముహూర్తేపి కార్యమ్!!

తాత్పర్యము :- ఏ నక్షత్రమున ఏకర్మ చేయుట చేయుట శ్రేష్ఠమని చెప్పబడినదో ఆ నక్షత్రాధి దేవత యొక్క ముహూర్త మందు ఆ శుభ కర్మ చేయుట మంచిది.

- సర్వ దేశములయందును సర్వ వర్ణములయందును ఉపనయనము తప్ప సర్వ శుభకర్మలయందును, సర్వ శుభ కార్యములయందును ప్రశస్తమైనది అని మహర్షులు చెప్పుచున్నారు.

- దైవజ్ఞులు నిశ్చయించెడి సుముహూర్తములు లగ్న బల సంపదలచే స్వల్పదోషములు నశించును మహా దోషములు తొలుగుట గూర్చి చెప్పుట లేదు. ఈ అభిజిల్లగ్నము గూర్చి శాస్త్రము **"అశేష దోషాపహంగ"** అని చెప్పుచున్నది.

అభిజిత్ లగ్నాన్ని పల్లెటూళ్ళలో **"గడ్డపలుగు"** ముహూర్తం అని అంటారు. గడ్డపలుగు భూమిలో పాతిన దాని నీడ మాయమయ్యే మిట్ట మధ్యాహ్న సమయాన్ని అభిజిత్ ముహూర్తంగా, మంచి ముహూర్తంగా నిర్ణయించారు. పూర్వకాలంలో బ్రాహ్మణులు పంచాంగం చూడటం రాని పల్లె ప్రజలకు ఎటువంటి గందరగోళం లేకుండా స్థూలమైన మంచి ముహూర్తం ఈ విధంగా ఎన్నుకోవచ్చని తెలియజేశారు. ఈ ముహూర్తంలో సూర్యుడు దశమకేంద్రంలో ఉంటాడని ఈ యోగం ముహూర్తంలోని చాలా దోషాలను పోగొడుతుందని తెలియజేసేవారు.

- కావున దైవజ్ఞ భారము వహింపలేని వారు ఈ అభిజిల్లగ్నమును సర్వ కార్యములయందు ఆశ్రయించుట మంచిది.

- ఎక్కువగా యాత్రలకు శుభప్రదమని ప్రమా ణాలున్నవి.

సర్వేజనా స్సుఖినోభవంతు

గౌడవర్తి సంపత్కుమార్ అప్పలాచార్యులు



1. సులభముగా విజయాలు పొందాలంటే ఏమి చేయాలి? అన్ని పనులలో విజయం సాధించటానికి ఏమైనా రహస్య పద్ధతులు ఉన్నాయా? జీవితములో పదితరాలు పాటు నిలిచి ఉండి కీర్తిసంపదల్ని ఎలా సాధించాలి!

తలచిన కార్యాలన్నీ కార్యరూపంలో ఉంచటానికి విజయవంతమైన మార్గాలు ఎలా వెతకాలి?

సంతకములో కూడా విజయం దాగి ఉంది ...

డాక్టర్లు కూడా సాధ్యము కాదు అని తేల్చిచెప్పిన కొన్ని వ్యాధులను కూడా వివరణోపాయాలు కూడా ఉన్నాయని అంటున్నారు. రాష్ట్రపతి అవార్డుగ్రహీత, జ్యోతిష, సంఖ్యా శాస్త్రములలో (న్యూమరాలజీ) తనకంటూ విలక్షణమైన స్థానమును సుస్థిరము చేసుకున్న శ్రీమన్నారాయణ్ గారు.

జ్యోతిషశాస్త్రమును, న్యూమరాలజీలోను 10 సం॥ల నుండి అనేక లభ్యమైన ప్రాచీన గ్రంథములను, మహర్షులు, మేధావులు సూచించి మరియు రచించిన గ్రంథములను వారివారి అనుభవములను సూక్ష్మముగా అధ్యయనము చేసిన శాస్త్రములు గ్రంథములు మొదలైన వాటిలో దాగి ఉన్న వెలకట్టలేని విషయములు పామరులకు సైతం అర్థము కావాలి అనే సంకల్పముతో జ్యోతిషశాస్త్రముతో న్యూమరాలజీ, సంఖ్యాగణిత శాస్త్రమును మిలితము చేసి ఎన్నో విషయములను భవిష్యత్ "దర్శనమ్" కోసము మీ ముందుకు తీసుకుని వస్తున్నారు శ్రీమన్నారాయణ గారు.

ప్రపంచ వ్యాప్తముగా అనేకమంది విశ్వసించే శాస్త్రములలో సంఖ్యాగణిత శాస్త్రం ఒకటి. ఇది అదృష్ట శాస్త్రము అని కొందరు అంటారు. మరికొందరు ఇది నిరాధారమైన నమ్మకాల పరంపర అంటారు. మనిషి జీవితంలో జరిగినది, జరగబోయేది కేవలము శరీర లక్షణాలు పుట్టిన తేదీలు వారి పేరును ఆధారముగా చేసుకుని చెప్పబడుతుంది. న్యూమరాలజీ ఇది జ్ఞానముతో కూడిన దివ్యశాస్త్రము అని మా నమ్మకము. ఈ న్యూమరాలజీ ఆధారముగా దారిద్ర్యములో మగ్గుతున్న వ్యక్తులను ఉన్నత

స్థితిలో ఉంచగలశక్తి ఈ శాస్త్రమునకు కలదు. ఈ న్యూమరాలజీకి అంకెలు అక్షరములే ఆధారము. అంకె, కన్ను వంటిది. అక్షరం చెవి వంటిది. ఈ రెండింటి ద్వారా న్యూమరాలజీ వస్తుంది. ఈ శాస్త్రమును ఎంతో విపులముగా మనముందు ఉంచిన పుణ్యపురుషులకు యోగులకు ధన్యవాదములు.

మనకు ఉన్న 64 కళలలో జ్యోతిషశాస్త్రము అద్భుతమైన శక్తివంతమైన శాస్త్రము. ఈ శాస్త్రములో ఎన్నో పద్ధతులు ఉన్నాయి. వాటిలో ఒకటి అదృష్టనామ, సంఖ్యాగణిత శాస్త్రం.

గ్రీకు దేశస్థుడైన "డేకరిస్" అనే శాస్త్రవేత్త అంకెల లక్షణములను వివరించినాడు. అందరికి అందుబాటులోకి రావాలి అనే ఉద్దేశముతో ప్రపంచ భాష అయిన ఆంగ్లభాష అక్షరములను పునాదిగా, సంఖ్యలకు విలువలను ఆపాదించి రచించడము జరిగినది. పైధాగరస్ గణిత శాస్త్రము రీత్యా అంకెలశక్తిని వాటితత్వములను స్వభావములను తెలుసుకుని అక్షరాలు గాని అంకెల ప్రయోగ ప్రభావాలను పాశ్చాత్యుడైన "కెరో" కనుగొన్నాడు.

మన విభాగాలలో సంఖ్యాశాస్త్రమునకు (న్యూమరాలజీ) మంచి స్థానమును సంపాదించి పెట్టినారు మన పూర్వులు. కాని మనం దానిని తెలుసుకోలేక ఆచరించలేకపోతున్నాము. మనిషి జీవితములో జరిగిన విషయములు, శరీర లక్షణాలు అరచేతిలోని గీతలు, పుట్టిన తేదీలు, పుట్టినరోజు ఉన్న నక్షత్రములను మొదలైనవాటిని ఆధారముగా చేసుకుని చెప్పబడుతుంది ఈ సంఖ్యాశాస్త్రము. పగలు వెంట చీకటి ... కష్టం వెంట సుఖం ఉంటుందని వీటిపై ఆశను కల్పించడము ఈ రోజు అనుభవిస్తున్న దుఃఖానికి కొంత ఉపశనము కల్పించడము దీని లక్షణము. (న్యూమరాలజీ) మనం జన్మించగానే నామకరణము చేస్తారు మన పెద్దలు. అది సక్రమముగా కుదిరినట్లయితే అంచెలు అంచెలుగా అభివృద్ధి సాధ్యము అవుతుంది. పుట్టినప్పటి లగ్నాది విషయములు ప్రతికూలముగా ఉన్న అదృష్ట సంఖ్యలోని పేరును పెట్టుకున్నట్లయితే అదృష్టవంతులు అవుతారు.

పేరు సక్రమముగా ఉన్న వ్యక్తి ప్రకాశవంతమైన జీవితమును కల్గి ఉంటాడు. అతను చేస్తున్న 'పని'లో అభివృద్ధి ఉంటుంది. భార్యాపిల్లలతో సంపదలతో ప్రగతిపూర్వకమైన జీవితము అతడి స్వంతము అవుతుంది.

అక్షరములు, అంకెలు ఒక్క మనిషి జీవితము ప్రభావితము చేస్తాయి అనడానికి శాస్త్రరీతిగా అనేక ఉదాహరణలున్నాయి. ప్రపంచములోని సత్వశక్తులు (9)వ సంఖ్యలో ఇముడుతుంది. 9 అంకెను ఏ సంఖ్యతో గుణించినా వాటి సంఖ్య ఒక్కటిగా ఉంటుంది. మానవ శక్తులను, నవగ్రహాలు అదుపులో ఉంచుతున్నాయి. నవ



ధాన్యాలు, నవ రత్నాలు, నవరసాలలో ఇలా 9 లో లీనమై ఉంటుంది. నవగ్రహములైనా 1. సూర్యుడు 2. చంద్రుడు, 3. గురువు 4. రాహువు 5. బుధుడు 6. శుక్రుడు 7. కేతువు 8. శని 9. కుజుడు తమ విధులను నిర్వహిస్తుంటాయి. పంచ భూతములైన భూమి, నీరు, నిప్పు, ఆకాశము, గాలి, ఆధిపత్యమునకు లోబడినది ఈ ప్రపంచము.

పేరును మార్చడము వలన ఈ ధోరణి మీద భూత, వర్తమాన కాలములలో ప్రఖ్యాతిపొందినవారు అనేకమంది ఉన్నారు అలా మార్చిన తర్వాత వారి జీవితముతో క్రొత్త చైతన్యము వెల్లివిరిస్తాయి.

ప్రపంచములో రాజకీయ నాయకులు పారిశ్రామిక వేత్తలు రాజ్యాంగవేత్తలు, శాస్త్రవేత్తలు, క్రీడా రంగము వారు, డాక్టర్లు, న్యాయవాదులు ప్రఖ్యాతి గాంచిన రంగ ప్రముఖులు మొదలైనవారు వారివారి రంగములో పేరు మార్చుకొని (లేదా మార్పులు చేసుకుని) కీర్తి సంపదలు సంపాదించుకున్నారు.

గొప్ప కార్యము సాధించినవారు పుట్టుకను ఒకసారి పరిశీలిస్తే వారి అందరి నామములను (పేర్లు) పరిశీలిస్తే అంకెలలో అంతర్గతశక్తి మనకు బోధపడుతుంది.

పూర్వకాలములో రాజులు, రాణీలను, యువరాజులు, యువరాణులు, సంఖ్యాశాస్త్రమును అనుసరించి వారి పేర్లు మార్చుకొని సుప్రసిద్ధులైనారు. ఇది చరిత్ర సత్యము.

మదర్‌థెరిస్సా, రవీంద్రనాథ్‌ఠాగూర్, నెపోలియన్, అలెగ్జాండర్ మొ॥ వంటివారికి పెద్దలు పెట్టిన పేర్లు వేరు. వారు చెలామణి అయిన పేర్లకు చాల వ్యత్యాసము కనిపిస్తుంది. పేర్లు ప్రతిరోజు ఉచ్చరించడము, వ్రాస్తూ రావడము ఇతరులు ఆ పేరుతో వారి పిలవడము వంటి శబ్దములను పరిశీలిస్తే, మిత్రోచారణ పద్ధతిని తలపిస్తుంది. మాత్రం మనసును దృఢ పరుస్తుంది. అయినను ఏకోన్ముఖము చేసి కార్యాచరణ పూనుకుని విజయం సాధించడము అవుతుంది. ఈ విధముగా మనిషి మిత్రముగాను అతడి పేరు. సక్రమముగా ప్రవర్తిస్తాయి. రెండింటికి సంబంధము ఉంటే మంచి ఫలితాలను ఇస్తాయి. ఈ రెండింటికి మించి సంబంధము లేకపోతే చెడు ఫలితములను ఎదుర్కొనవలసి వస్తుంది.

పేరులో వశీకరణ శక్తులు ఉండాలి. ఆ పేరును వ్రాస్తున్నప్పుడు ... ఇతరుల పేరుతో పిలుస్తున్నప్పుడు వశీకరణ, ఆకర్షణ శక్తులు ప్రతిఫలించాలి.

పుట్టిన తేదీ, నెల సం॥ తెలియవారికి సైతం ఈ (సంఖ్యాగణితశాస్త్రం) న్యూమరాలజీ ద్వారా అదృష్టనామమును (నేం) సూచించి విజయం సాధించవచ్చు. వారి హస్తరేఖలు ముఖ్య లక్షణాలు, శారీరక స్థితిని బట్టి ఎటువంటి గ్రహ ఆధిపత్యానికి తేబడినవారు అన్నది గ్రహించి జ్యోతిష్య శాస్త్ర పరిజ్ఞానానికి ఉపయోగించుకొని వారికి తిరుగులేని విజయపరంపరలను వారి సొంతము చేయవచ్చును. ఇది నా మతము అక్షరసత్యము.

నక్షత్రములు - ముందుమాట

అఖిలాండ కోటి బ్రహ్మాండ సముదాయమునందు మన సౌరకుటుంబమున భూమిపై నివసించు ప్రాణికోటి సూర్యుని కుటుంబము నందున్న గ్రహములు - అవి సంచరించు నక్షత్రము యొక్క ప్రభావమునకు లోబడి ఉండుననుట సమస్త శాస్త్రసమ్మతము.

ఒక జననము జరిగిన ఆ జన్మము యొక్క విధానము మరియు స్థితి. నక్షత్ర గ్రహ సంచారముననుసరించి ఉన్నది. మన శాస్త్ర రచన చేసినటువంటి ఋషులు, యోగులు మొదలైనవారు నక్షత్రాల గురించి చాల స్పష్టంగా విశదీకరించిన విషయాలు సవివరముగా "దైవమ్" కోసము మన నక్షత్రములు 27 అన్నింటిని మీ కోసము.

అశ్విని

అశ్విని నక్షత్రము 27 నక్షత్రములలో ఈ అశ్విని ప్రథమము. ఈ నక్షత్రమునకు అధిపతి కేతువు. ఈ నక్షత్రమున జన్మించిన వారికి ప్రథమ పాదము వారు నక్షత్ర శాంతి చేసుకోవలయును. రెండు, మూడు, నాల్గు పాదముల వారికి అవసరము లేదు. అయినా ఎవ్వరైనా ఈ నక్షత్రములో జన్మించినా నక్షత్రశాంతి చేసుకున్న శుభఫలితములు కల్గుతాయి. ఈ నక్షత్రమునకు అధిపతులు అశ్వినీదేవతలు. ఈ నక్షత్ర గణం దేవగణం. ఆదినాడి జంతువు గుర్రము. దిక్కు నైఋతి. జాతి పురుషజాతి. ఈ నక్షత్ర వృక్షం అడ్డరైస.



అశ్విని నక్షత్రములో ఏ పాదములో జన్మించినా తామున్న వృత్తి, వ్యాపారమునందు ప్రథమస్థానాన్ని కోరుకుంటారు. అందుకోసం ఏ విషయమైనా కృషి చేస్తారు. ఈ నక్షత్రం వారు ఒక్క నిర్ణయము తీసుకోబోయే ముందు దానిపై వివరణను చాలా మందిముందు అడిగి తీసుకుంటారు. చివరికి వారు ..... అనుకుంటారు. అది చేస్తారు. ఈ నక్షత్రము .... సంగీతమున మక్కువ ఎక్కువగా ఉంటుంది. ఈ నక్షత్రములో జన్మించినవారు క్రీడారంగములోను రాజకీయ రంగములో బాగా రాణిస్తారు. అవకాశములు వస్తే నటనరంగమును కూడా వదలరు. ఈ నక్షత్రములో జన్మించినవారు 24 సం॥ వచ్చే వరకు కష్ట సుఖములతో సంబంధము లేకుండా గడిపేస్తారు. వీరికి సహోదరి, సహోదరులతో సంబంధములు సామాన్యముగానే ఉంటాయి. ముఖ్యంగా ఈ నక్షత్రము వారు స్వయంకృషితోనే జీవితములో ఎదుగుతారు. స్థిరాస్తులు ఎక్కువగా సంపాదించుకుంటారు. ముఖ్యముగా భూమికి సంబంధించిన పనులలో విజయం సాధిస్తారు. ఈ నక్షత్రముతో పుట్టిన పురుషులు పరస్త్రీలపై మోజు ఎక్కువగా కల్గి ఉంటారు. ముఖ్యంగా ఈ నక్షత్రము వారు పైకి కనిపించే జీవితము ఒక్క విధముగా ఉంటుంది. అంతర్గత జీవితము వేరుగా ఉంటుంది. 26 సం॥ వద్ద నుండి 50 సం॥ వచ్చే వరకు వీళ్ల యోగానికి ఎటువంటి భంగములు వాటిల్లవు. బంధు వర్గముతో సంబంధములు సామాన్యముగానే ఉంటాయి తప్పించి ఆప్యాయత, ... అంత దగ్గరగా ఉండదు. ముఖ్యంగా వీరు ఎవ్వరిని అంతత్వరగా నమ్మరు. అందరిని ముందుగా అనుమానిస్తూ ఉంటారు. ఈ నక్షత్రము వారు ఫ్రెండ్స్ అంతగా ఉండరు. ఎవ్వని ఎక్కడ ఉంచాలో వారిని చూసి నేర్చుకోవచ్చు.

ఈ నక్షత్రము వారు ముఖ్యంగా విద్యలో ముందంజలో ఉంటారు. మంచిపేరు ప్రఖ్యాతులతో ఉంటారు. అలాగే వ్యాపార రంగములలో కూడా మెడికల్ మరియు ఆయుర్వేద వైద్యం, హోమియో వైద్యము భూమికి సంబంధించిన వ్యాపారములయందు ఉన్నత అభివృద్ధిని కల్గి ఉంటారు. అలాగే నూతన వాహనములపై ఎక్కువ మక్కువను కల్గి ఉంటారు. ఈ నక్షత్రముల వారు ఎదుటివారి సలహాల మీద గనుక ఆధారపడకుండా, వీరి ఆలోచనల ప్రకారము పోతే విజయం వరిస్తుంది. అలాగే స్త్రీల విషయములో జాగ్రత్తగా మెలుగుట మంచిది. లేనిచో నిందలకు గురి కావాల్సి వస్తుంది. ఈ నక్షత్రము వారు ఖర్చు విషయము కూడా చాల జాగ్రత్తగా ఉంటారు. అయితే కొన్నిసార్లు విచ్చలవిడిగా ఖర్చు పెట్టేస్తారు. ఈ నక్షత్రము వారు ముఖ్యంగా "గోపూజ" మరియు గణపతిని ఆరాధించుట వల్లన ఉన్నత ఫలితాలు పొందుతారు. ఈ నక్షత్రం వారు జాయింట్ వ్యాపారము కాకుండా ఒంటరి వ్యాపారములయందే ఎక్కువ విజయాలు సాధిస్తారు.

- శ్రీమన్నారాయణ్



వేదార్థాన్ని క్రమబద్ధముగా తెలిసికొనుటకు, ఆచరణలో పెట్టుటకు ఉపయోగించునవి వేదాంగములు. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము కల్పము, నిరుక్తము అను నట్టి ఆరింటికి వేదాంగములని వ్యవహారము. దీనిలో కొన్ని వేదార్థమును తెలుసుకొనుటకు ఉపయోగించినా మిగిలినవి వేద ప్రతిపాదిత ధర్మానుష్ఠానమునకు సహకరించును.

వేదములలో మానవుని పూర్ణాయుష్యము నూరు సంవత్సరములని చెప్పచుండగా (శతం జీవత్వాని) అంతకంటే ఎక్కువ కాలము కూడా జీవించవచ్చుననియు, అది అతని ఆహార గ్రహణ జీవన విధానముపై ఆధారపడియుండునని, గరిష్టముగా 1000 సం ॥ లు జీవించవచ్చునని వేదము చెప్పుచున్నది. (యజు : 3-62) జఠరాగ్నిని జాగ్రత్తగా గాపాడుకొనినవాడు 300 సం॥ జీవించవచ్చును. జ్ఞానేంద్రియ నిగ్రహమును సంపాదించి ధ్యానముతో మంచి దృష్టిని పొందినవాడు ఇంకనొక 300 సం॥ల యోగాభ్యాసము చేసి, యమ నియమాదులు బాగుగా నభ్యసించి యాచరించువాడు మరియొక 300 సం॥లు జీవించవచ్చును. సాధారణాయువగు 100 సం॥లు కలిసిన వేయి సంవత్సరములు అగును. బ్రహ్మచర్యముతో ఊర్ధ్వరేతస్కుడు సులభముగా దీనిని సాధించగలడు.

"అగ్నేయం యజ్ఞ మధ్వరమ్" (ఋ 1-1-4)

ఇందు మొదట నాయుప్రసక్తియేల యనగా ఎవరైనను, ఏదియైనను సాధించుటకు నాయుస్సు అత్యవసరము. ఆయుర్దాయము జ్యోతిషము ద్వారమునే -

హోరాశాస్త్ర పరిశ్రమాత్ ప్రథమత శ్చాయుర్బలం జ్ఞాయతే
ఆయుర్జ్ఞానయన విశేషతశ్చ నితరాం సద్ధర్మ బుద్ధిర్భవేత్
తద్ధర్మాగత పుణ్యభాగ విభవాత్ స్యాద్బ్రహ్మ విద్యానిధిః
దివ్య జ్ఞాన విశేషస్యనుభవాత్మైవల్యమాప్నోతి సః ॥

అంతరాదిత్య విద్య అనుపేరుగల దీనినుపాసించుటచే మోక్షము ప్రాప్తించునని ఉపనిషత్తులు గూడ చెప్పుచున్నవి.

పథ్యాశినాం శీల వతాం నరాణాం
సద్వృత్తభాజాం విజితేంద్రియాణాం
ఏవం విధానా మిద మాయు రత్ర
చింత్యం సదా వృద్ధముని ప్రణీతమ్ సారా. 39 1-25 శ్లో.

అనగా జ్యోతిశ్శాస్త్రము ద్వారా నిర్ణయింపబడు నాయుర్దాయము పై గుణములు గలవారికి కాని రోగులకు కాదనుట. వారి కృత్యములే వారి యాయువును తగ్గించునని భావము **'ఆచారాద్వర్ధతే హ్యాయుః'** అని మనువు నుడివినాడు.

జ్యోతిషము వేదాంగ మనుటలోనే వేదసమ్మతమని తేలుచున్నది. అపౌరుషేయమనబడిన వేదములోని మంత్రములన్నియు ఛందోబద్ధములే వ్యాకరణ శిష్టములే. సూర్యాది గ్రహ నక్షత్రముల పరస్పరాకర్షణతో ఒకదాని ప్రభావమొకదానిపై పడుట తప్పనిసరియే. తద్విషయజ్ఞానమే జ్యోతిషము.

"యదా సూర్య మముమ్ దివి శుక్రం జ్యోతిరధారయః । ఆదిత్తే విశ్వా భువనాని యేమిరే" (ఋ. 8-12-30) అను ప్రమాణము. ఋగ్వేదము నందే వేరొక స్థలమున గ్రహాదులతో కలిసిన సూర్యునివలె పరస్పరానంతాకర్షణ అని అర్థము నిచ్చు ఋక్కు **"ఆకృష్ణేన రజసా వర్తమానో నివేశయన్ అమృతం మర్త్యంచ హిరణ్యయేన సవితా రథేన దేవో యాతి భువనాని పశ్యన్"** దీనిని బట్టి వేదములో జ్యోతిశ్శాస్త్రము గలదను ప్రసిద్ధియును గలదు. ఆర్యభట్ట సిద్ధాంతముననుసరించి హోరాశాస్త్రము హోరా అను గ్రీకు శబ్దము నాధారముగా నీ పేరు వచ్చినదంటారు. కాని అహోరాత్ర శబ్దమున ఆద్యంత వర్ణములు లోపించిన హోరా అగును రాశ్యర్ధమగు 2 1/2 ఘడియలకు హోర యని పేరు. ఆంగ్లమున HOUR యనునది ఈ కాలమునకు వ్యవహారము.

ఈ జ్యోతిషము సిద్ధాంత జాతక ముహూర్త భాగత్రయముగా గ్రహనక్షత్ర రాసుల ప్రభావము ప్రాణి కోటికి శుభాశుభముల గలిగించుననియు, అదియెప్పుడెప్పుడు ఎట్టి అనుభవముగా నుండునో దృష్టమైన దానితో బాటు అదృష్టమైన దానిని కూడ తెలియజేయుటకు మహర్షులు తమ దివ్య జ్ఞానముతో గ్రహించి, వర్గీకరించి, వివరించి అనుభవములోనికి తెచ్చిరి. జ్యోతిర్జ్ఞానము లేనిదే ఏ యజ్ఞము ఎప్పుడు చేయవలయునో నిర్ణయించుకొనుట కుదురదు. వేదములో ప్రత్యేక కాలములలో చేయవలసిన యాగములు కొన్నియున్నవి. **"సంవత్సర మేతద్వ్రతం చరేత్" (తై.ఆ. 1-32-1) "వసన్తో బ్రాహ్మణో అగ్నీనా దధీత" (తై.సం. 5-6-51)** ఇటువంటి వాటిని సరిగా ఆలోచించుటకు కాలనిర్ణయము కావలెను.

కాల స్తవః కాలేజ్యేష్ఠః కాలేబ్రహ్మ సమాహితమ్
సాలోహ సర్వస్యే, శ్వరో యః పితా సీత్ ప్రజాపతేః
(అధర్వ 9వ కాం.)

సా కంజానాం సప్తధమాపు రేకజం
షడిద్యమా ఋషయో దేవజా ఇతి
తేదా మిష్టాని నిహితాని ధామశ
స్థాత్రే రేజస్తే వికృతాని రూపశః (59-50-16)

సనేమి చక్ర మజరం వివావృత
ఉత్తానాయాం దశయుక్తా వహన్తి ।
సూర్యస్య చక్షు రజసైత్యావృతం
యస్మిన్నాతస్థు ర్భువనాని విశ్వా ॥ (అధ. 9-5 9-14)

ఏక ప్రకార బహిర్వలయ సంయుక్తమైన సంవత్సరాఖ్య చక్రము జరారహితమైనది పునఃపునః తిరుగునది. ఉపరి విస్తృత భూమిలో పదిమంది ఇంద్రాదులు, పంచలోక పాలురు నిషాద పంచారాదులలో గూడిన చతుర్వార్గాలు, దశ సంఖ్యాకులు వారి వారి వృత్తులలో నియుక్తులునై దానిని వహించుచున్నారు. సర్వజగత్తును నిర్వహిస్తున్నారు. సూర్యుని యొక్క చక్షుస్థానీయమైన సూర్యమండలము వృష్ట్యుదకముతో ఆవృతమై వెళ్లుచున్నది. సర్వ భూతజాతములు ఆ మండలములో అర్పితములై (తదధీనములై యున్నవి).

ద్యౌ ర్మ: సీతా జనితా నాభిరత్ర
బన్ధు ర్నోమాతా పృథివి మహేయమ్
ఉత్తాన యో శ్చమ్వో॒ర్యోని రన్త
రత్రా పితా దుహితు ర్గర్భ మాధాత్ (అధర్వ 9-5-12)

ఇంకను **"సప్తయుంజంతి రథమేక చక్ర మేకో**

అశ్వోవహతి సప్తనామా త్రినాభి చక్ర మజిర మనర్వం యత్రేమా విశ్వాభువనాని తస్థుః" సూర్యపరముగా సప్తాశ్వములు, సంవత్సరపరముగా షడృతువులు + సంవత్సరము కలిగి సప్తాశ్వములని చెప్పిన సరిపోవును. త్రినాభులు = ఆరు ఋతువులు, ఉష్ణనాభి (వేసవి) జలనాభి (వర్షాకాలము) శీతనాభి (చలికాలము).

ఇట్లు కాలవిభజనచేసి చేసిన గణనమే జ్యోతిషము. భూమ్యాకాశ గ్రహగోళముల ప్రభావమును అధర్వమును ద్యౌ: నః పితా అను మంత్రము ద్వారా నిరూపించినది. అందుకే జ్యోతిషము లోకోపకారమగుచున్నది.

అర్ధార్జనే సహాయః పురుషాణా మాపదర్ణనే పోతః
యాత్రా సమయే మంత్రీ జాతక మపహాయ నాస్త్యపరః.
(సారా. 2-5)

మానవుల దైనందిన కృత్యములు వారి తాత్కాలిక మనస్థితి నాశ్రయించి యుండును. ఏవిధమైన కార్యాచరణము గాని వారి జ్ఞానమును దీర్ఘాలోచన పరతను అనుసరించును. మహాపురుషుల యాంతరంగిక శక్తి స్వార్థ దృష్టితో కాకుండ పరిసర పరిస్థితుల ననుసరించి, యందలి మేలుగీళ్ల నూహించి కార్యసిద్ధి పొందుటకు తగు మార్గముల నన్వేషించును. సామాన్య ప్రజానీకమునకు తెలివితేటలు మట్టసముగ నుండును గనుక వారు మహనీయులు దారి ద్రొక్కయత్నింతురు.

ప్రాచీన కాలమున లోకక్షేమముగోరి మార్గదర్శనాపేక్షతో త్రికాలజ్ఞులగు పౌలిశ రోమశ వాసిష్ఠ యవన బాదరాయణ శక్తి అత్రి భారద్వాజ విశ్వామిత్ర గుడాగ్నికేశ గర్గాది ఆచార్యులు భవిష్యత్కాల ప్రజలకుపయోగకరముగ నుండు నిమిత్తము గ్రహాల స్థాన దృష్ట్యాదుల క్రమపరచి యున్నారు. సూత్ర విశేషములను ప్రకటించియున్నారు. శుభాశుభసమయ జ్ఞానము పొందిన రాబోవు నశుభము నెట్లుపశమింప జేసికొన వచ్చునో తెలియును. అశుభవిషయము ముందుగా తెలియుటవలన దుష్ఫల ప్రభావము సగము తగ్గును. దానితో మనోబలము పెరిగి తద్దోష నివారణకు మార్గము వెదికి కృతకృత్యులము కాగలుగుదుము. అయితే గణిత భాగ జ్ఞానాల్పులు, శ్రమకోర్వనివారు, కృషి సేయని వారు సత్వర స్వార్థలాభపరులు, దైవజ్ఞ నామధేయులు ఆధునిక విద్యావంతులకు ఈ శాస్త్రముపై నిరసనభావము కలుగునట్లు చేసి అపఖ్యాతి తెచ్చి పెట్టుచున్నారు. సమ్యగ్జ్ఞాన పరిశీలనాదులు గల వారిచే లోకమునకు ఉపకారమే కాని అపకారమెంత మాత్రమును కాదు. అందుకే వరాహమిహురుడు **"యదుపచిత మన్న జన్మని శుభాశుభం తస్య జన్మనః పత్తిం వ్యంజయతి శాస్త్రమేతత్ తమసి ద్రవ్యాణి దీపఇవ"** అని చెప్పియున్నాడు.

జ్యోతిషమున సంస్కృత భాష అపశబ్ద భూయిష్ఠముగా నుండునను అపవాదము కలదు. **"వ్యాకరణభీతిచే నప శబ్దములు జ్యోతిషమున తలదాచుకొనినవి"** అను జన వాక్యము కలదు. అట్టి అపకీర్తి చాల వరకు ముహూర్త భాగము నావరించినది. కాని జాతక భాగమున వరాహ మిహిర కళ్యాణవర్మ, వైద్య నాధాదులు, జైమినీ సూత్ర కారులు సలక్షణ సాలంకారిక సగుణ సంస్కృత భాషను సువృత్త బంధురము గావించియున్నారు.

విధాత్రా లిఖితా యాసౌ లలాటేక్షర మాలికా
దైవజ్ఞ స్తాం పఠేద్వ్యక్తం హోరానిర్మల చక్షుషా (2-1 సారా)

విస్తరకృతాని మునిభిః పరిహృత్య పురాతనాని శాస్త్రాణి
హోరాతంత్రం రచితం వరాహ మిహిరేణ సంక్షేపాత్
(1 అ. 2శ్లో. సారా)

దీనిని బట్టి వరాహమిహిరుడు సంక్షేపముగా వ్రాసినాడని చెప్పుటయే సారావళీకారుని ఉద్దేశ్యము, వరాహమిహిరుడే స్వయముగా చెప్పుకున్నాడు కూడా.

పృథువిరచిత మన్యై శాస్త్ర మే తత్సమస్తం
తదను లఘు మయేదం తత్ప్రదిష్టార్థ మేవ
కృత మిహహి సమర్థం థి విషాణా మలత్వే
మమ యది న సదుక్తిః సజ్జనైః క్షమ్యతాం తత్ (బృహజ్జాతకం)

జ్యోతిశ్శాస్త్రమున బ్రతి పాద్యమాననుగు దైవము పరం జ్యోతియగు ఆదిత్యుడు. ఈ యాదిత్య పరబ్రహ్మమే చంద్రరూప ప్రకృతి శక్తితో చరాచర ప్రపంచము యొక్క సృష్టి స్థితిలయములకు కారణభూతుడనియు, జ్యోతిర్మండల మంతయు నీతని శక్తి చేతనే ప్రకాశించుచున్నదనియు జ్యోతిస్తత్వ శాస్త్రజ్ఞులు నుడువుచున్నారు.

రుద్రాత్మా సవితా పితాచ జననీ శక్త్యాత్మకశ్చంద్రమాः
భౌమేందూద్భవ జీవ శుక్ర రవిజా స్తత్పంచ భూతా నిహి,
సత్త్వాజ్జీవ కవీందుజా శ్చ రజసో భౌమ స్తమోజ శ్శనిः
సూర్యేందూ న తు మారకౌ హి పితరౌ రంధ్రాధి
పత్యేఽపి చ.

సూర్యుడు పరమేశ్వరుడు, చంద్రుడు పార్వతి, పార్వతీ పరమేశ్వరులు ప్రపంచమునకు దల్లిదండ్రులయినట్లు **"జగతः పితరౌ వందేపార్వతీ పరమేశ్వరౌ"** అని జ్యోతిర్విదాభరణకర్త యగు కాళిదాస మహాకవి తన రఘువంశ కావ్యమున వర్ణించి యున్నవాడు ప్రకృతి శాస్త్రజ్ఞులు కూడ సూర్యచంద్రుల వలన లోకమున కావశ్యకమగు నది అంతయు కలుగు చున్నదని చెప్పువిషయము సత్యదూరము కాదు. సూర్యుడు పురుషుడు (Spirit) చంద్రుడు ప్రకృతి (Matter) ప్రకృతి పురుష సంయోగము శివశక్తి సంబంధము. సృష్టికి గారణము. పాశ్చాత్యులు కూడ సూర్యుని (He) పుంలింగము గను, చంద్రుని (She) స్త్రీలింగముగను వ్యవహరించు చుండుట వలన, సూర్య చంద్రులు పితృ మాతృ కారకులని జ్యోతిశ్శాస్త్రము స్పష్టముగా చెప్పియుండుట వలనను, జగదుత్పత్తికి హేతు భూతులనియు స్పష్టము. సూర్యుడు ఆత్మకారకుడు చంద్రుడు మనः కారకుడనియు వ్యవహారము ప్రకృతి శాస్త్రము, వేదాంత శాస్త్రములందు కూడ నిదర్శన ముగా కనిపించుచున్నది. సూర్యకిరణ ప్రసారణమున చంద్ర మండలము ప్రకాశ వంతమయినట్టు ఆత్మ సాన్నిధ్యము నందు జడమగు మనసు కూడా వృత్తి మంతమై ప్రకాశించు చుండును. మనస్సు ఆత్మయందు జేరిన యోగమయినట్టుల చంద్రుడు సూర్యునితో గూడిన యోగమనబడును. అందుకే భగణము (రాశిచక్రము) అర్ధనారీశ్వర స్వరూపము. ఈ భగణమునకు పార్వతీ పరమేశ్వర రూపులగు చంద్ర సూర్యులధిపతులగుచున్నారని సారావళికారుడు ఈ క్రింది శ్లోకము చేత తెలిపి యున్నాడు.

ద్వాదశ మండల భగణం తస్యార్ధే సింహతో రవిర్నాథः
కర్కటకాత్ప్రతిలోమం శశీ తదాఽన్యేపి తత్నాథాత్
(3 అ. 9 శ్లో.)

సింహరాశి నుండి క్రమముగ నారురాసులకు భగణార్ధమని పేరు. దీనికి సూర్యుడధిపతి (పరమేశ్వరుడు) కర్కటకాది విలోమముగా ఆరురాసులకు భగణార్ధమని పేరు. దీనికి చంద్రుడధిపతి. (పరమేశ్వరి) దక్షిణ భాగము పరమేశ్వరుడు సూర్యస్థానము. వామభాగము పరమేశ్వరి చంద్రస్థానము. వాని నుండి సవ్యాస సవ్యములుగ బుధాది గ్రహములకు నీయబడినట్లు తోచును. ఖగోళమునను సూర్యచంద్రులకు సమీపవర్తులు బుధుడు, శుక్రుడు, కుజుడు, గురువు, శని యున్నట్లు భచక్రమున అనులోమ విలోమముగా బుధాదులు రెండేసి స్థానములు పొందియున్నారు. కన్యామిథునములు బుధునకు, తులావృషభములు శుక్రునకు, వృశ్చిక మేషములు కుజునకు, ధనుర్మీనములు గురువునకు మకర కుంభములు శనికి స్థానములైనవి.

దీనికొక యైతిహ్యము చమత్కారావహముగా నున్నది. సూర్యచంద్రులు గ్రహములకు రాసులను బంచియిచ్చునపుడు బుద్ధిమంతు డగు బుధుడు ముందు అందుకొనుటచే కన్యామిథునములు బుధునకు, పిదప శుక్రుడు కుజుడు గురుడు స్వీకరించగా మందుడై

అలసత్వమునకు మూల పురుషుడనిపించుకున్న అని ఆలస్యముగా స్థానములు పొందుటతో అని రెండును మరక కుంభములు నమీపరాసులై బలాధిక్యతకు కారణమైనదనియు, గ్రహములలో అందుకే శని బలవంతుడైనట్లు చెప్పుకొందురు. మాంద్యమునకు నష్టమే ఫలితమని అందరు చెప్పుచుండగా శనియొక్క మాంద్య మిక్కడ శనికి గొప్ప బలమును సంపాదించినదను చమత్కార మిక్కడ ప్రకటమగుచునది. అది గాక మాంద్యశబ్దము మందునకు సంబంధించినది యగుటయు యాదృచ్ఛికమేనేమో?

ఇక **"రుద్రాత్మా ..."** అను శ్లోకమున చెప్పినట్లు కుజాది పంచగ్రహములు పంచభూతములుగా వర్ణించుటను బట్టి నాకు చిన్నప్పుడు ఒక జ్యోతిశ్శాస్త్ర వేత్తయయిన యతివరులు శ్రీశ్రీశ్రీ పుండరీకాక్ష చంద్రశేఖరేంద్ర స్వాములు నన్ను జ్యోతిగ విషయమున పరీక్ష సేయదలచి ప్రశ్నించిరి. దానికి నేను చెప్పిన సమాధానము ఇందు పొందు పరచుట అప్రస్తుతము

కాదనిపించినది.

వారు ఏకాంతమున ప్రశాంతముగా నున్నప్పుడు ఒకరిద్దరు ఆత్మీయులను బిలిచి నేనిప్పుడీ బాలుని జ్యోతిర్ జ్ఞానమును బరీక్షింపదలచినాను. వినుడని ఇట్లు నన్ను ప్రశ్నించెను.

"నాయనా! జ్యోతిషములో గ్రహసంఖ్య గూర్చి నీవేమి చెప్పగలవు? నవగ్రహములని కొందరు రాహుకేతువులు ఛాయాగ్రహములే గాక అర్ధశరీరులు కనుకను, అపసవ్య చారులు కనుకను ఏడే గ్రహములని కొందరు వాదించు చున్నారు. ఆధునికులు చంద్రుని గ్రహముగాక భూమిని గ్రహముగా గొని యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో సూర్యకేంద్రక ముగా నవగ్రహములను చెప్పుచున్నాడు. ఇందు నీ మతమేది?"

జ్యోతిష పరీక్ష ఫలిత భాగమున కాబోలుననుకున్నను, గ్రహసంఖ్యా విషయిక ప్రశ్న అగుటతో నాశ్చర్యము వేసి ఇంత పెద్దవారి ప్రశ్నలో ఎంతో నిగూఢ విషయముండునని యాలో చించి,

"స్వామీ! గ్రహములు ఐదు మాత్రమే" అని సమాధానమిచ్చితిని. దానికి వారు మరింత యాశ్చర్యమంది "అది యెట్లు" అని అడిగిరి.

"స్వామీ! పంచభూతాత్మకమైన సృష్టిలో గ్రహములును ఐదింటి కన్న ఎక్కువ ఉండవని నా యభిప్రాయము. ఆధునికుల పరిశోధనలో ఇంక కొన్ని యేండ్లకు ఇంక కొన్ని గ్రహములు దర్శనీయములు కాకపోవు. ఇట్లు గ్రహముల సంఖ్య పెరుగుచు బోయినచో మహర్షుల క్రాంత దర్శిత్వము నకు మచ్చరాకపోదు కనుక గ్రహములు పంచ భూతాత్మకములై ఐదింటికన్న మించు నవకాశముండదు"

"అయితే అవి ఏవి?".

"సూర్యుడు, చంద్రుడు, గురుడు, శుక్రుడు, భూమి సూర్యుడు తేజస్తత్వమునకు, చంద్రుడు జలతత్వమునకు, శుక్రుడు వాయుతత్వమునకు, గురుడాకాశ తత్వమునకు ప్రతీకలు" అంటిని అయితే సూర్యచంద్ర భూములు సరే గురుశుక్రుల తత్వ నిర్ణయమెట్లు?

"వాయువును ద్విధాకరించవచ్చును. శుక్రుడు స్వయముగా శుభగ్రహమయినను స్థాన దోషమును బట్టి శుభాశుభ ఫలముల నిచ్చును. వాయువు మందమైన యానందమును, రుంరుంగా మారిన అరిష్టమును గలిగించును గదా! గురుడు ఆకాశము వలె దుర్భేద్యుడు, శుభ స్థలమునమున్న శుభాధిక్యతను, అశుభ స్థలమున నున్న అల్పశుభమును కలిగించునే కాని కీడు చేయడు కావున ఆకాశ తత్వము గలవాడు" అంటిని.

"అయిన కుజ, బుధ శనుల మాటేమిటి?" అని తిరుగబ్రశ్నించిరి.

"కుజుడు భూమి పుత్రుడు, బుధుడు చంద్రపుత్రుడు, శని సూర్యపుత్రుడని పురాణములు చెప్పుచున్నవి. అంతేకాక కు-జ-సౌమ్య, సౌరి శబ్దములు తత్పర్యాయములు రూఢములైయున్నది కదా"

"అట్లయిన వానికి గ్రహత్వమెట్లు భావింపబడినది?"

"సాధారణమే భిన్నతత్వము గల పుత్రులు తండ్రులతో విడివడి ప్రత్యేక యాజమాన్యముతో కుటుంబములో పెద్దగా వ్యవహరించుట జరుగును కదా! అచలతత్వము గల భూమికి విరుద్ధమగు చలతత్వము గల అంగారకుడు జలతత్వము గలిగిన చంద్రునకు విరుద్ధమగు ద్వైత తత్వము (శుభగ్రహ ములతో గలిసిన శుభుడగుట, పాప గ్రహములతో గలిగిన పాపియగుట), తేజ స్తత్వము గలిగిన సూర్యునకు విరుద్ధమగు తమస్తత్వము గల శని విడిగా గ్రహములగుట అసంభవనము కాదు గదా!" "సూర్యేందూ నతు మార కౌహి పితరౌ రంధ్రాధి పత్యేఽ పి చ" అనుదానిని బట్టి అష్టమాధిపత్యము కలిగియు సూర్యచంద్రులు మారకులు కాదు. కారణమున వారు పార్వతీ పరమేశ్వర సమానులు జగత్పితరులు అని చెప్పబడి యున్నది."

"అప్పుడు భూమితో కలిపి గ్రహములు ఎనిమిది అగును గదా!?"

అంతయేగాక ప్రాచీనులు భూమిని గ్రహముగా చెప్పలేదుకదా అట్టిచో ఈ సమన్వయ మెట్లు?" అని ప్రశ్నించిరి.

"అందులకే భూమి అచలము, మారునది కాదు జాతక చక్రమున లగ్నము కూడా మారునది కాదు. అది భూమి మీద ప్రాణి ఉద్భవించిన క్షణమును నిర్ణయించునది కనుక లగ్నము భూమియే యగును. కనుకనే అష్టకవర్గ సిద్ధాంతము (7+1 భూమి) ఆనువానిపైననే ఆధారపడినది. లగ్నము నుండి, మరియు సప్తగ్రహములున్న స్థానముల నుండి యితర గ్రహముల స్థానముల వర్గీకరణతో బిందురేఖలు సూచించబడిన ఏయే గ్రహము ఏరాశియందు ఎన్ని బిందువులు కలిగియున్నదను దానిని బట్టి కారకత్వమును తెలుపునదియే అష్టకవర్గ సిద్ధాంతము.

ఒక్కొక్కసారి ఉచ్చయందున్న శుభగ్రహము కూడా ఈయదగినంత శుభము నీయలేక పోవుటకు తత్తత్థానము లందలి బిందురేఖలే కారణమని చెప్పుటకు అష్టకవర్గము నాధారముగానున్నది. ఈ గణనచేయలేక ఫలితమును జెప్పు జ్యోతిష్కుల వలననే జ్యోతిష్య మపఖ్యాతి నందుచున్నది" అని చెప్పితిని. వారు సంతోషించిరి.

అందుకే వరాహమిహిరాదులు ఎంత గొప్పగా చెప్పినను సారావళి కారుడైన కళ్యాణవర్మ క్షత్రియుడైనను వ్యాఘ్రభటేశ్వరుడను నామాంతర విఖ్యాతుడై, తానే జాతక ఫలముల నెక్కువగా చెప్పినట్లు ఇట్లు చెప్పుకొనినాడు.

"విషయ విభాగం సృష్టం కర్తుం నతు శక్యతే యత స్తేన
అత ఏవ విస్తరేభ్యో యవన నరేంద్రాది రచిత శాస్త్రేభ్యః
సకల మసారం త్యక్త్వా తేభ్యः సారం సముద్ధియతే"

అంతేకాక బృహజ్జాతకమునకు వ్యాఖ్య వ్రాసిన భట్టోత్పలుడును సారావళి యందలి యనేక శ్లోకములను బ్రమాణముగా స్వీకరించుటను బట్టి సారావళి విశిష్టత బోధ పడగలదు.

"హోరా త్యు ష్ణార్తానాం శిష్యాణాం స్ఫుట తరార్థశిశిరజలా
కల్యాణవర్మ శైలా న్నదీహ సారావళీ ప్రసృతా"

అని ధైర్యముగా చెప్పగలుగుటయే కాక ఎందరో క్రొత్త దైవజ్ఞులను చూడామణి, బ్రహ్మశౌండ కేతుమాల, లోకాక్ష, కాందల, దేవ కీర్తిరాజు, కనకాచార్యులను బేర్కొని తన పూర్వగ్రంథ పరిశీలన వైదుష్యము ప్రకటించినాడు. జ్యోతిషమున సంస్కృతము ఖూనీ చేయబడినదను కేవల సంస్కృత పండితుల ప్రవాద నపాకరించుచు వీరు కవితాత్మ యుట్టి పడునట్లుగాను, సలక్షణ భాషతోను అనుష్టుప్‌లో ఇముడగలిగిన యోగములను సైతము పెద్దవృత్తములలో చెప్పుటయు వర్ణన ప్రీతి చేతను, కావ్య, సౌందర్యపిపాస చేతను అని చెప్పవచ్చును.

హోరాశాస్త్రజ్ఞునకు సిద్ధాంత భాగము తెలిసిన బంగారమునకు తావి యబ్బినట్లుండును.

ఇత్యాధానం ప్రథమం ప్రసూతి కాలం వినిశ్చితం కృత్వా
జాతక విహితం విధిం విచింతయే త్తత్ర గణితజ్ఞः.
8 అ.- 52 శ్లో.

గణిత శాస్త్రజ్ఞుడైన దైవజ్ఞుడు ప్రథమమున ఆధాన కాలమును, పిమ్మట ప్రసూతి కాలమును నిశ్చయముగా దెలిసికొని జాతక శాస్త్ర ఫలములను జెప్పవలయునని నిర్దేశించుటచే గ్రహభావస్ఫుట షడ్బల సాధనములు లేక స్థూల దృష్టితో ఫలముల దైవజ్ఞుడు చెప్పెనేని అనుభవ సిద్ధముగ నుండక శాస్త్రమున కపవాదము కలుగును. కాబట్టి దైవజ్ఞుడు గణితజ్ఞుడై యుండవలెనని విదితమగుచున్నది.

కావున జన్మకాలము తెలిపిన వారికే గాక నష్టజాతకులకు (జన్మకాలాదులు తెలియని వారికి) సైతము జన్మకాలాదులను తెలిసికొని జాతకఫలాదులను చెప్పగల రీతిలో గల జ్యోతిషము వేద సమ్మతమై వేదాంగఖ్యాతమై యున్న దానియందు కృషి సేయ లేని మందమతుల వలననే తప్ప అసత్యారోపణము సమంజనము కాదని యభిప్రాయము.

లౌకికమైన తాత్కాలిక ప్రయోజనము నాశించిన ఉభయులు (అడిగేవారు చెప్పేవారు) పరిమిత కాలములో సిద్ధ ఫలముల విషయమై చూపుచున్న అశ్రద్ధ వలన మహామహర్షుల కృషిరూప జ్యోతిశ్శాస్త్రము అపనింద పొందుటయేకాక కనుమరుగయి పోకుండ కాపాడవలసిన బాధ్యత అందరిపై కలదని మనవి చేసుకుంటూ విరమిస్తున్నాను.

అష్టకాల నరసింహరామశర్మ



ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నప్పటికీ భారతీయ సనాతనధర్మం ఈనాటికి తన ప్రత్యేకతను నిలుపుకోవడానికి కొన్ని ప్రభావవంతమైన కారణాలున్నాయి. వాటిలో విగ్రహారాధన, వర్ణాశ్రమవ్యవస్థ, కర్మసిద్ధాంతం, షోడశ సంస్కారాలు ముఖ్యమైనవి. ఇవన్నీ సనాతన సంస్కృతికి విశిష్టతను కలుగజేశాయి. వీటిలో సామాన్యుడిని సైతం ఆకర్షించేవే ... సంస్కారాలు.

ఒకవస్త్రానికి మూడురంగులను అద్దితే, అందరూ గౌరవించే జాతీయపతాకం ఎలా అవుతుందో ... అలాగే సంస్కారములను ఆచరించినవాడు కూడా సమాజంలో విలక్షణమైన వ్యక్తిగా, అలౌకిక ప్రభావంతో గౌరవింప బడతాడు.

ప్రాణంలేని ఇనుపముక్కకూడా ఉపయోగంలోకి రావాలంటే "అగ్నిలోవేయడం" అనే సంస్కారం అవసర మవుతోంది. అందుకే మనిషికి సంస్కారాలు - అత్యంత ఆవశ్యకాలు.

జీవులన్నింటిలోకి మానవుడ్ని ఉన్నతుడిగా చేసేది జ్ఞానం. ఎవరివారి జ్ఞానాన్ని అనుసరించే వారి స్థాయి నిర్ణయమవుతుంది. మానవుడు తనలోని రాక్షస గుణాలను విడచి, మానవుడిగా మానవతా విలువలను కాపాడుతూ, సదాచారాలను పాటిస్తూ, సంస్కారాలను ఆచరిస్తూ, జ్ఞానవంతుడై మాధవుడిగా ఎదగడమే జీవన సంపూర్ణత్వానికి చిహ్నం.

అటువంటి పరిపూర్ణమైన జన్మను పొందడానికి; గర్భంలో ఉన్నప్పటినుండి - మరణం తరువాతి వరకూ శరీరానికి జరుపబడే క్రియలనే "సంస్కారాలు" అంటారు.

✤ ✤ ✤

భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం ఈ పంచభూతాల కలయికతో నిర్మితమైనదే శరీరం. శరీరం భూమిపై పడకమునుపు గర్భంలోనే వేద ప్రతిపాదితమైన క్రియలనుపొంది, అనంతరం పుట్టి, పెరిగి, గాయత్రిని

ధరించి, బ్రహ్మచర్యాశ్రమాన్ని, పిదప గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, వైశ్వదేవాది క్రియలద్వారా అగ్నిని ఉపాసిస్తూ, తాను సాధించిన సదాచారాలను, విద్యలను పుత్రులద్వారా సమాజానికి అందిస్తూ, క్రమక్రమంగా సంసార వ్యామోహాదులను దాటుకుంటూ వానప్రస్థం స్వీకరించి, జ్ఞానియై సన్యాసాశ్రమం ద్వారా మానవ జీవితానికి సఫలతను సిద్ధించుకుంటూ, దేహానంతరం కైవల్యాన్ని చేరుకునేలా రూపొందించినవే సంస్కారాలు.

"आत्मशरीरान्तरनिष्ठो विहित क्रियाजन्यो अतिशय विशेष संस्कारः" వేదములలో చెప్పబడినటువంటి కర్మలను ఆచరించడంచేత అంతఃకరణ శరీరాదులలో ఏ అతిశయమైతే ఏర్పడుతుందో దాన్నే సంస్కారం అంటారని **"వీర మిత్రోదయం"** చెబుతోంది.

ఒక వ్యక్తిని, లేదా ఒక పదార్థాన్ని నిర్ణీత ప్రయోజనానికి యోగ్యమైనదిగా చేసే ప్రక్రియే "సంస్కారం". ఇది జైమినీ సూత్ర భాష్యకారుడు ఇచ్చినటువంటి నిర్వచనం.

"శబరస్వామి" తన వ్యాఖ్యానంలో "ఒక వస్తువునుగాని, పదార్థమునుగాని, ఏదైనా ఒకవిశేష ప్రయోజనం కొరకు ఉపయోగించుకునేటట్లు చేసేదే సంస్కారమని" అంటాడు.

✤ ✤ ✤

"కోటి విద్యలూ కూటి కొరకే" అన్నది సామాన్యంగా వాడుకలో ఉన్న లోకోక్తి కానీ సనాతన భారతీయ విద్యల లక్ష్యం ..... కర్మలను ఆచరించడంద్వారా చిత్తశుద్ధిని పొంది, ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవడమే! సమస్త భారతీయ వాఙ్మయానికి ఆత్మజ్ఞానమే.... పరమావధి.

ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి కొందరు జ్ఞానమార్గంలో వెళితే, మరికొందరు కర్మమార్గంలో వెళతారు. ఈ రెండింటి మధ్య వారధిని ఏర్పరచేదే సంస్కారం.

✤ ✤ ✤

సంస్కారాల ద్వారా మనం మూడురకాలైన ప్రయోజనాలను పొందుతున్నాం.

1. దోషమార్జనము 2. అతిశయాధానము 3. హీనాంగపూర్తి

ఈ మూడింటినీ ఒక చిన్న ఉదాహరణలో చూద్దాం!

బట్టలు తయారుచేయడానికి ముడి పదార్థం పత్తి చెట్టునుండి కాయలను ఏరి, దాన్నుండి పత్తిని వేరుచేయడం **"దోషమార్జనం"**. రెండవదశలో..... పత్తినుండి దారాన్నితీసి, ఆ దారంతో చొక్కాలు తయారుచేయడం. **"అతిశయాధానం"**. చివరగా చొక్కాలకు గుండీలుపెట్టి వేసుకునేందుకు సిద్ధంచేయడమే **"హీనాంగపూర్తి"**.

అదేరకంగా.... సంస్కారాలనూ మూడురకాలుగా విభజించుకుంటే ...

గర్భాధానం-అన్నప్రాశనలవల్ల మనిషికి దోష మార్జనము జరుగుతుండగా... చూడాకర్మ మొదలైన వాటిద్వారా అతిశయాధానం అవుతోంది. ఇక వివాహం-అగ్న్యాధానం తదితరాలవల్ల హీనాంగపూర్తి అవుతోంది. ఈ మూడు ప్రక్రియలద్వారా మానవుని శరీరం సంస్కరింప బడుతున్నది.

సంస్కారం కంటికి కనపడుతుందా?

సంస్కారాలు కంటికి కనపడకపోవచ్చు. కానీ దాని ఫలితం కనపడుతుంది. ఎలాగంటే ...

రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంతకంతో రంగుకాగితం రూపాయినోటుగా మారుతుంది !!! అంటే "సంతకం" అనే సంస్కారం కాగితాన్ని నోటుగా మార్చింది.

అంతవరకు మనలో తిరిగిన మనిషే ఉన్నట్టుండి ఎమ్. ఎల్.ఏ.గా, ఆ తరువాత మంత్రిగా కూడా అవుతున్నాడు. ఎన్నికల ముందువరకూ అతడు సామాన్యమైన వ్యక్తియే. "ఎన్నికలు-ప్రమాణస్వీకారం" అనే సంస్కారాలద్వారా మంత్రిత్వమనే పదవి కలిగింది.

✤ ✤ ✤

"संस्कारोनाम संस्कारस्य गुणाधाने नवास्याद्दोष नयने न वा" అని శంకర భగవత్పాదులవారు తన భాష్యంలో చెప్పినట్లుగా సంస్కారం మనిషికి రెండురకాల యోగ్యతలని కలగిస్తుంది. ఒకటి దోషాన్ని పోగొట్టడం; రెండవది గుణాన్ని కలిగించడం.

దోషాలను తొలగించుకొని, గుణాలను పొందినవాడు ... వైదికకర్మలను చేయడానికి యోగ్యతను పొందుతాడు.

"జ్యోతిష్టోమం" మొదలైన యజ్ఞకర్మలు సశాస్త్రీయంగా నిర్వహించినప్పటికీ, యజమాని సంస్కారవంతుడు కాకపోతే అవి సంపూర్ణమైన ఫలితాన్ని ఇవ్వలేవు.

✣ ✣ ✣

మనిషి ప్రస్తుతం తానున్న స్థితికంటే ఉత్తమమైన స్థితిని కోరుకోవడం, అందుకోసం తగిన ప్రయత్నాలు చేయడం అత్యంత సహజం. కానీ అన్నీ అనుకున్నట్లు జరగవు. ప్రయత్నాలన్నీ సఫలంకావు.

ఆయా జన్మలలో మనచేత ఆచరించబడిన పాప కర్మలే ఈ జన్మలో మన శ్రేయస్సుకు ప్రతిబంధకాలుగా అవుతాయి. అందుకే జన్మజన్మాంతరార్జితమైన పాపాలను తొలగించుకునేందుకు మనం ప్రయత్నించాలి. ఆ ప్రయత్నమే సంస్కారం.

అలా..... సంస్కరింపబడ్డ మనస్సును బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందేందుకు ఉపయోగించుకోవాలి. దీనినే **"గుణాధానము"** అంటారు.

శ్లో॥ చిత్రకర్మ యథానేకైః అంగైరున్మీల్యతే శనైః ।
బ్రాహ్మణ్యమపి తద్విద్ధి సంస్కారైర్మంత్రపూర్వకైః ॥

దేవాలయ శిఖరంపై శిల్పులచేత చెక్కబడిన బొమ్మలు అందముగా కనబడతాయి. కాని కాలక్రమంలో దుమ్ము, ధూళిపడి వాటి నిజరూపాన్ని కోల్పోతాయి. వాటికున్న వస్త్రాలు, ఆభరణాలు ఏవీ కనపడకుండా పోయి కళా విహీనంగా కనబడుతాయి. అటువంటి సందర్భంలో దుమ్ము, ధూళినంతటినీ తొలగించి కొత్తగా రంగులు వేస్తే ఆ బొమ్మలు ఎలా ప్రకాశిస్తాయో, మనిషికి సంస్కారాలు కూడా అంతే! సమయానికి తగ్గట్టుగా.... ఆయా సంస్కారాలచేత సంస్కరింపబడితేనే మనిషి గొప్పగా ప్రకాశిస్తాడు.

సంస్కారాలకు అర్హులు

సంస్కారాలు ఆచరించడానికి అర్హులెవరు? ఈ సందేహానికి సమాధానంగా.... మనుధర్మశాస్త్రం 2వ అధ్యాయం 26వ శ్లోకంలో .....

శ్లో॥ వైదికైః కర్మభిః పుణ్యైః నిషేకాదిర్ద్విజన్మనాం ।
కార్యశ్శరీర సంస్కారః పావనః ప్రేత్య చేహచ ॥

అలాగే, యాజ్ఞవల్క్యస్మృతిలో.....

శ్లో॥ బ్రహ్మక్షత్రియ విట్శూద్రాః వర్ణాస్త్వాద్యాస్త్రయోద్విజాః।
నిషేకాది శ్మశానాన్తాః తేషాంవై మంత్రతః క్రియాః॥

నాలుగువర్ణములలోనూ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే ముగ్గురిని "ద్విజులు" అని అంటారు. ఈ ముగ్గురికీ గర్భాధానం మొదలుకొని "శ్మశానాంతం" అంటే, అపర క్రియలవరకుగల సంస్కారాలన్నీ వైదికంగానే జరిపించాలని మనువు, యాజ్ఞవల్క్యుని ఆదేశం.

శ్లో॥ శూద్రోప్యేవం విధఃకార్యో వినా మంత్రేణ
సంస్కృతః ॥

ఇతరులకు మంత్రరహితంగా సంస్కారాదులను జరిపించాలని, వేదాధికారం లేనందువల్ల ఉపనయనం మాత్రం నిషిద్ధమని "యమస్మృతి" నందు వివరించబడింది.

✣ ✣ ✣

సంస్కారాలెన్నీ?

సంస్కారాలు ప్రధానంగా రెండు రకాలు. 1. స్మార్త సంస్కారాలు, 2. శ్రౌత సంస్కారాలు, శ్రుతులలో చెప్పబడ్డవాటిని శ్రౌతకర్మలని, స్మృతులలో చెప్పినవాటిని స్మార్తకర్మలని అంటారు. స్మార్తములలో చేసే కర్మలే షోడశ సంస్కారాలు.

స్మార్తకర్మలను పూర్తి చేసుకున్నవారికే శ్రౌతకర్మల యందు అధికారం. వీటిలో కొన్నింటిని తండ్రి చేస్తే, మరి కొన్నింటిని తాను స్వయంగా ఆచరించుకునేవి. వేదవ్రతాలను గురువు ఆచరింపజేస్తాడు. అంత్యేష్టి సంస్కారం మరణానంతరం పుత్రునిచే చేయబడుతుంది.

✣ ✣ ✣

సంస్కారాల సంఖ్య విషయంలో ఆయా ధర్మశాస్త్రాలలో రాసిన విషయాలు భిన్నంగా ఉన్నాయి. **"యస్యైతే చత్వారింశత్ సంస్కారాః సబ్రహ్మణస్సాయుజ్యం సలోకతాంచ గచ్ఛతి"** అని **గౌతమస్మృతి** లో చెప్పబడింది.

గర్భాధానం మొదలుకొని పంచమహాయజ్ఞాలు, అష్టకశ్రాద్ధాలు, పార్వణశ్రాద్ధాలు ఇవన్నీ కలిపి సంస్కారాలు

నలభై అని గౌతముడు చెబుతే..... ఆంగీరసులు ఇరవై అయిదనీ, వ్యాసులవారు పదహారని అన్నారు. ప్రస్తుతం ఆచరణలో ఉన్నవి షోడశ సంస్కారాలే. ఇవి గర్భాధానంతో ప్రారంభమై అంత్యేష్టితో ముగుస్తాయి.

✣ ✣ ✣

1. **గర్భాధానం**తో బీజగర్భదోషాలు తొలిగి క్షేత్ర సంస్కారం సిద్ధిస్తుంది.

2. పుత్రుడు కావాలనే కోరికతో చేసేది **పుంసవనం**.

3. గర్భాన్ని ఆవహించే అమంగళకరమైన శక్తులను తొలగించేందుకు చేసేది **సీమంతం**.

4. తల్లిగర్భంలోని ఆహార పానీయాలను స్వీకరించిన దోషాలు తొలగించేదే **జాతకర్మ**.

5. **నామకరణం** వల్ల ఆయుష్షు, తేజస్సు కలుగుతాయి.

6. గర్భంలో ఉన్నప్పుడు మలమూత్రభక్షణ దోషం తొలగడానికి **అన్నప్రాశన** చేస్తారు.

7. ఏడవ సంస్కారం **చౌలం**. దీనినే చూడాకర్మ అని కూడా అంటారు. దీనిద్వారా ఆయురభివృద్ధి కలుగుతుంది.

8. ద్విజత్వసిద్ధి, వేదవిద్యాధ్యయన అధికారం కొరకు చేసేదే **ఉపనయనం**. దీనివల్ల ఋషిఋణం తీరుతుంది.

9,10,11,12. **వ్రతచతుష్టయాలు** (ప్రాజాపత్య, సౌమ్య, ఆగ్నేయ, వైశ్వదేవం) వీటిని గురుకులంలో గురువు నిర్వహిస్తాడు.

13. పదమూడవది **గోదానం**.

14. **స్నాతకం** లేక సమావర్తనం. ఇది... గురుకులంలో విద్యాధ్యయనం పూర్తి చేసుకున్న విద్యార్థి గురుకులానికి వీడ్కోలు పలికేందుకు ఉద్దేశించినది.

15. దేవ, పితృఋణాలు తీర్చుకునేందుకు ఉద్దేశించినదే **వివాహసంస్కారం**. **"అయజ్ఞోవా ఏషయో పత్నీకః"** అన్న వేదవాక్యానుసారం వివాహం కానివాడికి యజ్ఞాధికారం లేదు.

16. చివరగా.... **అంత్యేష్టి**. దీనినే పితృమేధము అనికూడా అంటారు. పంచభూతాల కలయికతో ఏర్పడిన శరీరాన్ని తిరిగి వాటిలో కలిపేదే ఈ సంస్కారం.

✣ ✣ ✣

ఒకరేమో నలభై చెప్పారు, మరొకరేమో ఇరవై అయిదు, ఇంకొకరు పదహారు. ఇలా ఇన్ని సంస్కారాలెందుకు ఎదోఒక్కటి చాలదా... ? అని సందేహం కలిగితే ....

ఏదైనా ఒక రాగిపాత్రను చక్కగా కడిగి శుభ్రం చేస్తే.... కొంతకాలానికి మళ్ళీ అది నల్లగా అవుతుంది. వాడుకోవాలంటే తిరిగి శుభ్రపరుచుకోవాల్సిందే.

అదేవిధంగా..... శరీరమనే రాగిపాత్రను సంస్కార మనే చింతపండుతో ఎప్పటికీ కడుగుతూనే ఉండాలి. అప్పుడే అది తళతళ మెరుస్తుంటుంది.

ఇదేరకంగా..... జన్మజన్మలనుండి వచ్చిన చిత్త మాలిన్యం పోవాలంటే సంస్కారం చేయాల్సిందే. వేదములలో చెప్పబడ్డటువంటి సంస్కారాలను వివిధ దశలలో ఆచరించడంద్వారా శరీరం సంస్కరింపబడుతుంది.

సంస్కారాల చరిత్ర

సంస్కారాల గురించి అవగాహన కలగాలంటే వేదాలు, గృహ్యసూత్రాలు, ధర్మసూత్రాలను చదవవలసి ఉంటుంది. సంస్కారాలలో కొన్నింటి ఉనికిని మనం ఋగ్వేదంలో చూడగలం. ఋగ్వేదంలోని పదవమండలంలో వివాహం, గర్భాధానం, అంత్యేష్టి వంటి సంస్కారాలు మనకు కనబడుతున్నాయి. యజుర్వేదంలో వీటి ప్రస్తావన శ్రౌతయాగాదుల రూపంలో కనపడుతుండగా... ఆ యాగాదులలో చెప్పవలసిన కొన్ని మంత్రాలు సామవేదంలో చెప్పబడ్డాయి. అథర్వవేదంలో అక్షరాభ్యాసం, గోదానం, ఉపనయనం, బ్రహ్మచర్యం (11.5), వివాహం (14.1.2), అంత్యేష్టి (18.1.4) మొదలైనవాటి గురించిన మంత్రాలు ఉన్నాయి.

ఇక బ్రాహ్మణాల విషయానికివస్తే..... గోపథ బ్రాహ్మణంలో ఉపనయనం గురించిన వివరణలు ఉన్నాయి.

శతపథబ్రాహ్మణంలోనూ బ్రహ్మచర్యం, గోదాన సంస్కారం, స్వాధ్యాయం అనే సంస్కారాలు మనకు కనిపిస్తున్నాయి. ఛాందోగ్యోపనిషత్‌లో వేదవిద్యారంభానికి సంబంధించిన విషయాలు చెప్పబడ్డాయి. తైత్తిరీయోపనిషత్తులో స్నాత కోత్సవం (గ్రాడ్యుయేషన్) గురించి ప్రస్తావనలను మనం గమనించవచ్చు. తైత్తిరీయ ఆరణ్యకంలో బ్రహ్మయజ్ఞానికి, పితృమేధ సంస్కారానికి కావలసిన మంత్రాలు చెప్పబడ్డాయి.

ఇలా సంహితలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులలో చెప్పబడ్డ వివరణలను కల్పసూత్రాలు మనకు విస్తృత పరుస్తున్నాయి. ఏ సంస్కారాన్ని ఎలా చేయాలి? వాటికి అనువైన సమయం ఏది? ఆ సందర్భంలో చెప్పవలసిన మంత్రాలేమిటి? తదితర విషయాలన్నింటికీ కల్పసూత్రాలే ఆధారం. వీటికి అదనంగా 'పరిశిష్టాలు', వ్యాఖ్యానాలు', 'ప్రయోగాలు', 'కారికలు', ఉండనే ఉన్నాయి. వీటన్నింటిలోనూ.... సంస్కారాల ప్రస్తావన ఉందంటే, పెద్దలు సంస్కారాలకు ఎంతటి ప్రాముఖ్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు.

✤ ✤ ✤

భారతదేశం యజ్ఞభూమి. అనాదిగా ఇక్కడ కర్మకాండలు సాగుతూనే ఉన్నాయి. కొన్ని మనకు కనపడే ప్రయోజనాలను అందిస్తే, మరికొన్ని అదృష్టప్రయోజనాలను ఇస్తుంది. కంటికి కనబడే ఫలితాలు కొన్నయితే..

కనబడనివి మరికొన్ని.

ఎందరో మహాత్ములు, మహర్షులు, ద్రష్టలు, మానవకళ్యాణం కోసం ఏయే మంత్రాలను ఏ సంస్కారాలకు ఉపయోగించాలో, ఎక్కడ వాటిని వినియోగించాలో తమ అతీంద్రియ శక్తులద్వారా దేశ, కాల, భౌగోళిక, సామాజిక విషయాలను దృష్టిలో ఉంచుకొని తయారు చేశారు.

✤ ✤ ✤

మహర్షులు సూచించిన మార్గంలో నడుస్తూ ... అరుణపారాయణములు - సూర్యనమస్కారాలు చేసి ఆరోగ్యాన్ని పొందినవారెందరో!! వర్షాలకోసం వరుణయాగాలు -సహస్రఘటాభిషేకాలు, కారీరేష్టి, పర్జన్యేష్టి మొదలైనవిచేసి ఫలితాన్ని పొందిన ఉదంతాలున్నాయి. పుత్రుని కోసం పుత్రకామేష్టి వుంసవనాడులుచేసి పుత్రసంతానాన్ని పొందిన వారి సంగతీ మనకు తెలుసు. ఇలా కొన్నింటికి ప్రత్యక్ష ఫలితాలు కలుగుతుంటే... మరణానంతరం పొందేటువంటి స్వర్గాదులు అదృష్టఫలితాలు.

✤ ✤ ✤

"కేవలాఘో భవతి కేవలాదీ" అంటోంది... వేదం! ఎవరికీ పెట్టక, తానొక్కడే తినేవాడు పాపమును మూటగట్టు కుంటున్నాడు" అనే శ్రుతివాక్యాన్ని మరువకుండా, "పంచమహాయజ్ఞాలనే" పేరుతో.... దేవతలను తృప్తి పరచేందుకు - దేవయజ్ఞాలను, పితృదేవతలకొరకు పితృ యజ్ఞాన్ని, భూతయజ్ఞం పేరుతో పశుపక్ష్యాదులకు ఆహారాన్ని, మనుష్యయజ్ఞంద్వారా బ్రాహ్మణులను-అతిథి-అభ్యాగతులను ఆదరిస్తూ; అన్నిటిపట్లా తనబాధ్యతని సమంగా నిర్వహిస్తాడు ... సంస్కారవంతుడైనవాడు! సమాజంలోని సాటి మానవులనే కాదు! సృష్టిలోని ప్రతిప్రాణినీ ప్రేమించాలనే భావనతో ఉన్నవ్యక్తి తాను బాగుపడడమే కాకుండా సంఘాన్నికూడా బాగుచేస్తాడు.

✤ ✤ ✤

మనం మాట్లాడే మాటలో, చేసేపనిలో, మన ఆలోచనావిధానంలో సంస్కారం ఉండాలి. ఇది అందరిలోనూ కలిగినప్పుడు ... సమాజాన్ని ఎవరూ పనిగట్టుకొని మార్చవలసిన పనిలేదు. తనంతట తానే ఉద్ధరింప బడుతుంది. వేదాలలో చెప్పబడ్డదీ.... ఇదే!

అందుకే.... సంస్కారాలద్వారా సంస్కరింపబడ్డ వారితో సమాజం బాగుపడుతుంది. మంచి సమాజం సమస్త మానవాళికీ శ్రేయస్సును కలిగిస్తుంది.

అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని



నక్షత్రోత్పన్న వ్యాధులు (జ్వరం) - పరిశీలన

భారతీయ జ్ఞాన సంప్రదాయంలో ఆయుర్వేదం మరియు జ్యోతిషశాస్త్రం పరస్పర పూరకమైన రెండు ప్రాచీన శాస్త్రాలుగా పరిగణించబడుతున్నాయి. శరీర ఆరోగ్యం, కాల ప్రభావం, ప్రకృతి చక్రాలు, గ్రహ--నక్షత్ర సంబంధాలు వంటి అంశాలను ఈ రెండు శాస్త్రాలు విభిన్న కోణాలలో పరిశీలించినప్పటికీ, వాటి అంతర్గత లక్ష్యం మానవ జీవన శ్రేయస్సే. ముఖ్యంగా వ్యాధి నిర్ధారణ, దాని తీవ్రత, వ్యవధి, ఫలితం వంటి అంశాలలో కాలతత్త్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడింది.

ఆయుర్వేదంలో జ్వరాన్ని "వ్యాధులలోరాజు"గా పేర్కొన్నారు. జ్వరం కేవలం శారీరక ఉష్ణత మాత్రమే కాక, దేహ దోష సౌమ్యస్థితి భంగాన్ని సూచించే ప్రధాన లక్షణంగా భావించబడింది. ఈ జ్వరం ఏ నక్షత్రంలో ప్రారంభ మవుతుందో దాని ఆధారంగా దాని స్వభావం, తీవ్రత, ప్రాణాపాయం, ఉపశమన కాలం వంటి అంశాలను ప్రాచీన ఆచార్యులు విశ్లేషించారు.

జ్యోతిషశాస్త్రంలో ప్రతి నక్షత్రానికి ప్రత్యేక స్వభావం, అధిదేవత, తత్త్వం, గుణం నిర్దేశించబడ్డాయి. మృదు, తీక్ష్ణ, ఉగ్ర, చర, లఘు వంటి నక్షత్ర స్వభావాలు మానవ జీవనంలో శుభాశుభ ఫలితాలనే కాక వ్యాధుల గమనాన్ని కూడా ప్రభావితం చేస్తాయని గ్రంథాలు సూచిస్తున్నాయి.

హారీత, శౌనక, గౌతమ, కౌశిక వంటి మహర్షులు నక్షత్రాధారిత జ్వర ఫలితాలను వివరించగా, నిశ్చలకరుడు, హేమాద్రి వంటి వ్యాఖ్యాతలు వాటిని మరింత స్పష్టీకరించారు. అలాగే వరాహమిహిరుడు తన బృహత్సంహితలో నక్షత్ర స్వభావ విభజనను ప్రతిపాదించి, వాటి ప్రయోజనాలను వివరించాడు.

ఈ పరిశోధనలో ఆయుర్వేద మరియు జ్యోతిష గ్రంథాలలో పేర్కొన్న నక్షత్రోత్పన్న జ్వర లక్షణాలను సమగ్రంగా పరిశీలించి, రెండు శాస్త్రాల మధ్య ఉన్న సంబంధాన్ని తులనాత్మకంగా విశ్లేషించడమే ప్రధాన లక్ష్యం.

అధ్యయన ఉద్దేశ్యాలు

1. నక్షత్రోత్పన్న జ్వర సిద్ధాంతాన్ని ఆయుర్వేద దృష్టిలో పరిశీలించడం.
2. జ్యోతిషశాస్త్రంలో నక్షత్ర స్వభావ విభజనను విశ్లేషించడం.
3. జ్వర తీవ్రత, వ్యవధి, ఫలితంపై నక్షత్ర ప్రభావాన్ని అధ్యయనం చేయడం.
4. ఆయుర్వేద మరియు జ్యోతిష శాస్త్రాల మధ్య ఉన్న అంతర్గత సంబంధాన్ని అవగాహన చేయడం.

పరిశోధనా పద్ధతి

ఈ అధ్యయనం ప్రధానంగా గ్రంథాధారిత (Textual Study) విధానంలో నిర్వహించబడింది. చరక సంహిత, సుశ్రుత సంహిత, అష్టాంగ హృదయం, చక్రదత్త, వంగసేన సంహిత, బృహత్సంహిత, ముహూర్త చింతామణి, ప్రశ్నమార్గం, గర్గ జ్యోతిషసారం, నక్షత్ర చికిత్స జ్యోతిషం మొదలైన గ్రంథాలలోని శ్లోకాలు, వ్యాఖ్యానాలు, సిద్ధాంతాలను సమీక్షించి తులనాత్మకంగా విశ్లేషించబడింది.

నక్షత్ర స్వభావ విభజన

వరాహమిహిరుడు నక్షత్రాలను వాటి స్వభావం ఆధారంగా విభజించాడు. ఈ స్వభావం వ్యాధుల తీవ్రతను అంచనా వేయడానికి ఉపయుక్తంగా భావించబడింది.

నక్షత్ర స్వభావం నక్షత్రాలు

మృదు	రోహిణి, మృగశిర, అనూరాధ, రేవతి
తీక్ష్ణ	ఆర్ద్ర, ఆశ్లేష, జ్యేష్ఠ, మూల
ఉగ్ర	భరణి, మఘ, పూర్వ ఫల్గుణి, పూర్వాషాఢ, పూర్వాభాద్ర
చర	పునర్వసు, స్వాతి, శ్రవణ, ధనిష్ఠ, శతభిష
లఘు	అశ్విని, పుష్య, హస్త
మిశ్ర	కృత్తిక, విశాఖ, ఉత్తర ఫల్గుణి, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర

ఈ వర్గీకరణ ఆధారంగా జ్వర తీవ్రతను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు:

- **లఘు మరియు మృదు** నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు సాధారణంగా తేలికపాటి స్వభావం కలిగి చికిత్సకు సులభంగా లోబడతాయి.
- **తీక్ష్ణ మరియు ఉగ్ర** నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు తీవ్రమైనవి, కొన్నిసార్లు ప్రాణాపాయానికి దారితీసేవిగా భావించబడ్డాయి.
- **చర** నక్షత్రాలలో సంభవించే జ్వరాలు మార్పులతో కూడిన స్వభావం కలిగి ఉంటాయి.
- **మిశ్ర** నక్షత్రాలలో జ్వరాలు మధ్యస్థ తీవ్రతతో ఉండి, సమయానికి చికిత్స చేస్తే ఉపశమనం పొందుతాయని భావించారు.

సాహిత్య సమీక్ష:-

హారీత సంహిత

జన్మాధానే చ నిధనే ప్రత్యాఖ్యానే విపద్గతే ।
యది వ్యాధిస్సముత్పద్యేత్ క్లేశాయ మరణాయ చ ॥

జ్యోతిశ్చక్రః ధనిష్ఠాది ధ్రువభైః దిన నిశ్చయాత్ ।
నిశ్చలకర --- (హారీత) 1/292॥

జ్యోతిషశాస్త్రే నక్షత్ర సంభవ రోగ మర్యాద

ముహూర్త చింతామణి (2/45--46)

స్వాతీంద్ర పూర్వా శివసార్పభే మృతిర్జ్వరేన్ద్వమైత్రే స్థిరతా భవేద్రుజః ॥

యామ్య శ్రవో వారుణ తక్షభే శివా ఘస్రైత్ర హి పక్షౌ ద్వ్యధిపార్క వాసవే ॥

మూలాగ్ని దాస్త్రే నవపిత్ర్యభే నఖా బుధ్న్యార్యమేజ్యాదితి ధాత్రుభే నగాః ॥

మాసోఽబ్జ వైశ్వేథ యమా హి మూలభే। మిశ్రేశ పిత్ర్యే ఫణిదంశనే మృతిః ॥

ప్రశ్నమార్గము (13/15--17)

వైశ్వే సౌమ్యే చ మాసాదుపరి తు వసు భబ్రహ్ను హస్త శూర్పేషు పక్షా-

ద్రోగో చిత్రా ప్రచేతో యమహరిషు సుఖం విందతే రుద్రసంఖ్యాత్ ।

వింశాదహనో మఘాయాం గురు భగసురసూ బుధ్ని వేధస్తు భూభృత్–

సంఖ్యాన్మూలాశ్వియుక్తే హుతభుజి నవమాన్మిత్రపుష్ణోస్తు కృచ్ఛ్రాత్ ॥

జ్యేష్మా సమీరోరగ రౌద్ర పూర్వత్రయేషు న ప్రాణితి జాతరోగః।

ఛిద్రాసమేతేషు సపాపవారేష్వాగ్నేయవస్వంతక వారుణేషు॥

గర్గ --- జ్యోతిషసారము

వ్యాధ్యుత్పత్తిర్యస్య పౌష్ణే సమైత్రే ప్రాణత్రాణం జాయతే తస్య కృచ్ఛ్రాత్ ॥

వైశ్వే సౌమ్యే రోగముక్తిస్తుమాసాత్రింశత్యాస్యాద్వాసరాణాం మఘాసు ॥

పక్షార్ధస్తే వాసవే సద్విదైవే మూలాశ్వినోరగ్నిధిష్ణ్యే నవాహాత్॥

యామ్యే త్వాష్ట్రే వైష్ణవే వారుణే చ నైరుజ్యం స్యాన్నాన మేకాదశాహాత్ ॥

అహిర్బుధ్న్యే తిష్య సంజ్ఞనభాగేప్రాజాపత్యాదిత్యయోాः సప్తరాత్రాత్ ॥

రోగాన్ముక్తిర్జాయతే మానవాణాంనిఃసందిగ్ధం జల్పితం గర్గముఖ్యైः ॥

నక్షత్రాల స్వభావ విభజన:- బృహత్సంహితా 98/7-11॥

తీక్ష్ణ నక్షత్రాలు :- మూల శివ శక్ర భుజగ అధిపాని తీక్ష్ణాని॥

ఉగ్ర నక్షత్రాలు :- ఉగ్రాణి పూర్వత్రిణి భరణీ మఘాని॥

లఘు నక్షత్రాలు :-లఘు హస్త అశ్విన పుష్యాः॥

మృదు నక్షత్రాలు :- మృదు వర్గా అనూరాధా చిత్రా పౌష్ణేందవాణి మిత్రార్థే॥

మృదు--తీక్ష్ణ నక్షత్రాలు:-హుతభుజి సవిశాఖం మృదు తీక్ష్ణం మిశ్రఫలకారి॥

చర నక్షత్రాలు:-శ్రవణ త్రయమాదిత్యానిలే చ చరకర్మణి హితాని॥

నక్షత్రోత్పన్న జ్వర సిద్ధాంతం -- తాత్విక నేపథ్యం

ఆయుర్వేద శాస్త్రంలో కాలం, దిక్కు, ఋతువులు, గ్రహాలు, నక్షత్రాలు వంటి అంశాలను ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైనవిగా పరిగణించారు. వ్యాధి ఉత్పత్తి, దాని ప్రబలత, రోగి శక్తి, చికిత్స ఫలితాలు వంటి అంశాలు కాల ప్రభావంతో అనుసంధానించబడ్డాయి. ఈ నేపథ్యంలో నక్షత్రాలను కేవలం ఖగోళ విభాగాలుగా కాకుండా, జీవ చైతన్యాన్ని ప్రభావితం చేసే శక్తి కేంద్రాలుగా కూడా దర్శించారు.

జ్యోతిషశాస్త్రంలో ప్రతి నక్షత్రానికి ఒక అధిదేవత, గుణం, తత్వం, స్వభావం నిర్దేశించబడింది. ఆ నక్షత్రంలో ప్రారంభమయ్యే శుభకార్యాలు, యజ్ఞాలు, వైద్యచికిత్సలు, ప్రయాణాలు, యుద్ధాలు వేర్వేరు ఫలితాలను ఇస్తాయని ముహూర్త గ్రంథాలు పేర్కొన్నాయి. అదే విధంగా జ్వరాలు, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఆయా నక్షత్రాల స్వభావాన్ని అనుసరించి ప్రభావితమవుతాయని భావించారు.

ఆయుర్వేదంలో జ్వరాన్ని దేహదోషాల అసమతుల్యతకు ప్రధాన సూచికగా పరిగణించారు. వాత, పిత్త, కఫ దోషాలు వివిధ కారణాల వల్ల క్షోభకు లోనైతే జ్వరరూపంలో వ్యక్తమవుతాయని చరకుడు పేర్కొన్నాడు. ఈ దోష క్షోభను ప్రేరేపించడంలో కాల ప్రభావం, గ్రహ--నక్షత్ర ప్రభావం కూడా ఒక భాగమని ప్రాచీన వైద్య సంప్రదాయం అంగీకరించింది.

హారీత సంహిత, వంగసేన సంహిత, అష్టాంగ హృదయం వంటి గ్రంథాలలో నక్షత్రాధారిత జ్వర మర్యాదను ప్రత్యేకంగా వివరించారు. ఏ నక్షత్రంలో జ్వరం ప్రారంభమైతే అది ఎన్ని రోజులు కొనసాగుతుంది, ఏ దశలో ప్రమాదకరమవుతుంది, ఎప్పుడు ఉపశమనం కలుగుతుంది అనే అంశాలను శ్లోకరూపంలో వివరించారు.

జ్యోతిష గ్రంథాలలో నక్షత్రాలను మృదు, ఉగ్ర, తీక్ష్ణ, చర, లఘు, మిశ్ర స్వభావాలుగా విభజించడం ద్వారా వాటి శక్తి స్వరూపాన్ని తెలియజేశారు. మృదు నక్షత్రాలు శాంతి, సౌమ్యతను సూచిస్తే, తీక్ష్ణ మరియు ఉగ్ర నక్షత్రాలు కఠినత, తీవ్రత, విష్ణు స్వభావాన్ని సూచిస్తాయి. అందువల్ల ఈ నక్షత్రాలలో ప్రారంభమయ్యే జ్వరాల తీవ్రత కూడా భిన్నంగా ఉంటుందని భావించారు.

ఇది కేవలం వైద్య సిద్ధాంతం మాత్రమే కాక, భారతీయ తాత్విక దృష్టిలో 'మానవ శరీరం -- ప్రకృతి -- ఖగోళ చక్రం' మధ్య ఉన్న అనుసంధానాన్ని ప్రతిబింబించే భావనగా కూడా పరిగణించవచ్చు.

ఆయుర్వేద, జ్యోతిషశాస్త్రానుసారం అశ్విని నుండి రేవతి వరకు నక్షత్రోత్పన్న జ్వరాలు:-

అశ్విని నక్షత్రంలో సంభవించిన జ్వరాన్ని హారీత, శౌనకులు ఆరు రోజులలో ఉపశమించేదిగా పేర్కొన్నారు. కౌశికుడు దీనిని ఒక రోజులో తగ్గుతుందని తెలిపాడు. జ్యోతిషశాస్త్ర దృష్టిలో అశ్వినీ దేవతల అనుగ్రహంతో ఈ జ్వరం తొమ్మిది రోజులలో తగ్గుతుందని భావించబడింది. వైద్యుల పట్ల నిర్లక్ష్యం, చికిత్స ఆలస్యం వంటి అంశాలతో దీనిని ప్రతీకాత్మకంగా అనుసంధానించవచ్చు.

భరణి నక్షత్రంలో ప్రారంభమైన జ్వరాన్ని కొంతమంది ఆచార్యులు ఐదు రోజులలో తగ్గేదిగా పేర్కొనగా, మరికొందరు దీనిని ప్రాణాంతక స్వభావమున్నదిగా వివరించారు. యమధర్మరాజుతో సంబంధం ఉన్న ఈ నక్షత్రం కఠిన, ఉగ్ర స్వభావాన్ని సూచిస్తుంది.

కృత్తిక నక్షత్ర జ్వరం అగ్నితత్వ ప్రభావంతో సంబంధించబడింది. ఇది శరీరంలోని పిత్తదోషం, వాపు, దహన సంబంధ వ్యాధులను సూచించేదిగా భావించబడింది. సాధారణంగా 7 నుండి 9 రోజులలో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

రోహిణి నక్షత్రంలో వచ్చిన జ్వరం స్వల్పకాలికంగా ఉండి 3 నుండి 11 రోజులలో తగ్గుతుందని ఆయుర్వేద మరియు జ్యోతిష గ్రంథాలు సూచిస్తున్నాయి. మృదు స్వభావం కలిగిన ఈ నక్షత్రం సాధారణంగా చికిత్సకు అనుకూలంగా భావించబడింది.

మృగశిర నక్షత్రంలో ప్రారంభమైన జ్వరం చంద్ర ప్రభావంతో అనుసంధానించబడింది. కఫ, మానసిక, నాడీ సంబంధ వ్యాధులతో దీనిని పోల్చారు. కొన్ని గ్రంథాలలో ఇది ఒక నెల వరకు కొనసాగవచ్చునని పేర్కొనబడింది.

ఆర్ద్ర నక్షత్రం తీక్ష్ణ స్వభావం కలిగి ఉండటంతో ఇందులో ప్రారంభమైన జ్వరాలు తీవ్రమైనవిగా భావించబడ్డాయి. హారీత, శౌనకులు ఐదు రోజులలోనే ప్రాణాపాయం సంభవించవచ్చునని పేర్కొన్నారు. శివదోష సంబంధిత జ్వరంగా దీనిని విశ్లేషించారు.

పునర్వసు నక్షత్రంలో సంభవించిన జ్వరం సాధారణంగా 7 నుండి 13 రోజులలో తగ్గుతుందని భావించబడింది. ఇది దేవతా అనుగ్రహం, పునరుద్ధరణ, శరీర శక్తి పునరుద్ధరణతో సంబంధించబడింది.

పుష్య నక్షత్రం లఘు స్వభావం కలిగి ఉన్నప్పటికీ కొన్నిసార్లు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుందని గ్రంథాలు పేర్కొన్నాయి. గురు సంబంధిత దోష ప్రభావంతో ఈ జ్వరం సంభవిస్తుందని భావించారు.

ఆశ్లేష నక్షత్రంలో ప్రారంభమైన జ్వరం నాగదోషంతో సంబంధించబడింది. దీర్ఘకాలికంగా కొనసాగి చివరకు ప్రాణాపాయం కలిగించవచ్చునని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి.

మఘ నక్షత్ర జ్వరాన్ని పితృదోష సంబంధితంగా పేర్కొన్నారు. 12 రోజుల వరకు రోగి ప్రాణాలతో ఉంటే కోలుకునే అవకాశముందని గ్రంథాలు వివరిస్తున్నాయి.

పూర్వ ఫల్గుణి నక్షత్రం ఉగ్ర స్వభావం కలిగినది. ఇందులో ప్రారంభమైన జ్వరాలు తీవ్రతరంగా ఉండి ప్రాణాపాయం కలిగించవచ్చునని భావించారు.

ఉత్తర ఫల్గుణి నక్షత్ర జ్వరాలు సాధారణంగా 7 నుండి 21 రోజులలో ఉపశమిస్తాయని పేర్కొన్నారు. రాక్షస సంబంధిత దోష ప్రభావంతో దీనిని అనుసంధానించారు.

హస్త నక్షత్రంలో ప్రారంభమైన జ్వరాలు సూర్యదోషంతో సంబంధించబడ్డాయి. కంటి, చర్మ, దాహ సంబంధ సమస్యలు దీనిలో కనిపించవచ్చునని భావించారు. సాధారణంగా 7 నుండి 15 రోజులలో ఉపశమనం కలుగుతుంది.

చిత్ర నక్షత్ర జ్వరం 8 నుండి 15 రోజుల వరకు కొనసాగవచ్చునని గ్రంథాలు సూచిస్తున్నాయి. విప్రదోష ప్రభావంతో దీనిని అనుసంధానించారు.

స్వాతి నక్షత్రం చర స్వభావం కలిగినప్పటికీ కొన్నిసార్లు తీవ్రమైన ఫలితాలను ఇవ్వగలదని పేర్కొన్నారు. వాయుదోష

ప్రభావంతో ఈ జ్వరం ప్రాణాపాయ స్థితికి దారితీయ వచ్చునని భావించారు.

విశాఖ నక్షత్ర జ్వరాన్ని అగ్నితత్త్వంతో అనుసంధా నించారు. 15 రోజుల వరకు కొనసాగి తరువాత ఉపశమిస్తుందని జ్యోతిష గ్రంథాలు పేర్కొంటాయి.

అనూరాధ నక్షత్రంలో సంభవించిన జ్వరం తొలిదశలో తగ్గకపోతే ప్రమాదకరమవుతుందని ఆయుర్వేదం పేర్కొంది. అయితే జ్యోతిష దృష్టిలో ఇది దీర్ఘకాలిక స్వభావంతో 60 రోజుల వరకు కొనసాగవచ్చునని భావించారు.

జ్యేష్ఠ నక్షత్ర జ్వరం తీవ్రమైనదిగా పేర్కొనబడింది. మొదటి ఐదు రోజులలో ప్రాణాపాయం ఉన్నప్పటికీ, ఆ దశ దాటితే కోలుకునే అవకాశముందని ఆయుర్వేద గ్రంథాలు వివరిస్తున్నాయి.

మూల నక్షత్రం తీక్ష్ణ స్వభావం కలిగి ఉండటంతో ఇందులో ప్రారంభమైన జ్వరాలు తీవ్రమైనవిగా భావించబడ్డాయి. అనాచారం, నిర్ఋతి సంబంధిత దోషాలతో దీనిని అనుసంధానించారు.

పూర్వాషాఢ నక్షత్ర జ్వరం 9 రోజుల నుండి ఒక నెల వరకు కొనసాగవచ్చునని పేర్కొన్నారు. జలతత్త్వం, వరుణ దోషంతో దీనిని అనుసంధానించారు.

ఉత్తరాషాఢ నక్షత్ర జ్వరాలు కొన్నిసార్లు దీర్ఘకాలికంగా కొనసాగవచ్చునని ఆయుర్వేదం పేర్కొంది. పితృకార్య నిర్లక్ష్యంతో దీనిని అనుసంధానించారు.

శ్రవణ నక్షత్ర జ్వరం సాధారణంగా 11 రోజులలో తగ్గుతుందని భావించబడింది. మాతృపితృ అవమానం, తర్పణ నిర్లక్ష్యం వంటి అంశాలతో దీనిని సంబంధింప జేశారు.

ధనిష్ఠ నక్షత్ర జ్వరాలు 12 నుండి 15 రోజుల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. వసుదేవతల పట్ల అవమాన భావం ఈ దోషానికి కారణమని భావించారు.

శతభిష నక్షత్ర జ్వరం వరుణదోషంతో అనుసంధా నించబడింది. వర్షాకాల వైరల్ జ్వరాలు, మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లతో దీనిని పోల్చారు.

పూర్వాభాద్ర నక్షత్రం ఉగ్ర స్వభావం కలిగి ఉండటంతో ఇందులో ప్రారంభమైన జ్వరాలు అత్యంత ప్రమాదకరంగా భావించబడ్డాయి. జీవహింస లేదా హత్యాదోషంతో దీనిని అనుసంధానించారు.

ఉత్తరాభాద్ర నక్షత్ర జ్వరం 3 నుండి 15 రోజులలో తగ్గుతుందని భావించారు. అహిర్బుధ్న్య దేవతా దోషంతో దీనిని సంబంధింపజేశారు.

రేవతి నక్షత్ర జ్వరం కొన్నిసార్లు స్వల్పకాలికంగా, మరికొన్నిసార్లు దీర్ఘకాలికంగా ఉండవచ్చునని గ్రంథాలు సూచిస్తున్నాయి. దేవతారాధన లోపంతో దీనిని అనుసంధానించారు.

నక్షత్ర స్వభావం మరియు జ్వర తీవ్రత

తీక్ష్ణ నక్షత్రాలలో సంభవించిన జ్వరాలు సాధారణంగా తీవ్రమైనవిగా పేర్కొనబడ్డాయి. ముఖ్యంగా ఆర్ద్ర, ఆశ్లేష, జ్యేష్ఠ, మూల నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు ప్రాణాపాయ స్థితికి దారితీయవచ్చునని ఆయుర్వేద మరియు జ్యోతిష గ్రంథాలు సూచిస్తున్నాయి.

ఉగ్ర నక్షత్రాలైన భరణి, మఘ, పూర్వ ఫల్గుణి, పూర్వాషాఢ, పూర్వాభాద్రలో సంభవించే జ్వరాలు కష్ట సాధ్యమైనవి, చికిత్సకు ఆలస్యంగా స్పందించేవిగా భావించబడ్డాయి.

మృదు నక్షత్రాలైన రోహిణి, మృగశిర, అనూరాధ, రేవతిలో సంభవించే జ్వరాలు సాధారణంగా చికిత్సకు అనుకూలంగా ఉండి ఉపశమనయోగ్యమైనవిగా పేర్కొన బడ్డాయి.

లఘు నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు తేలికపాటి లేదా మధ్యస్థ తీవ్రతతో ఉండి త్వరగా తగ్గుతాయని భావించారు.

చర నక్షత్రాలలో జ్వర స్వభావం మార్పులతో కూడినదిగా ఉన్నప్పటికీ చికిత్సకు లోబడుతుందని గ్రంథాలు సూచిస్తున్నాయి.

నక్షత్రాలు మరియు ఆధునిక వైద్య దృక్కోణం

ప్రాచీన ఆచార్యులు నక్షత్రోత్పన్న జ్వరాలను కేవలం ఆధ్యాత్మిక లేదా దైవదోష పరంగా మాత్రమే కాక, వాటి

లక్షణాలు, కాలవ్యవధి, ప్రాణాపాయ స్థితి ఆధారంగా కూడా వర్గీకరించినట్లు తెలుస్తుంది. ఆధునిక వైద్యశాస్త్ర దృష్టితో పరిశీలిస్తే, కొన్ని నక్షత్రాలకు సంబంధించిన జ్వర లక్షణాలు నిర్దిష్ట వ్యాధులతో పోలిక కలిగి ఉన్నట్లు గమనించవచ్చు.

- అశ్విని, పుష్య, హస్త వంటి లఘు నక్షత్రాలలో వచ్చే జ్వరాలు స్వల్పకాలిక వైరల్ ఫీవర్లు, అలెర్జిక్ ఫీవర్లు లేదా చికిత్సకు త్వరగా స్పందించే ఇన్ఫెక్షన్లతో పోల్చవచ్చు.
- కృత్తిక, విశాఖ వంటి మిశ్ర స్వభావ నక్షత్రాలలో సంభవించే జ్వరాలు శరీరంలో ఇన్ఫ్లమేషన్, పిత్తవృద్ధి, వేడి, వాపు వంటి లక్షణాలను కలిగించే వ్యాధులను సూచించే అవకాశముంది. అపెండిసైటిస్, హెపటైటిస్, సెల్యులైటిస్, హెర్పిస్ వంటి వ్యాధులు ఇందులోకి వస్తాయి.
- ఆర్ద్ర, ఆశ్లేష, జ్యేష్ఠ, మూల వంటి తీక్ష్ణ నక్షత్రాలలో సంభవించే జ్వరాలు సెప్టీసీమియా, మెనింజైటిస్, తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లు, నాడీ సంబంధ వ్యాధులు వంటి ప్రమాదకర పరిస్థితులతో పోల్చబడ్డాయి.
- పూర్వాభాద్ర, పూర్వాషాఢ, పూర్వ ఫల్గుణి వంటి ఉగ్ర నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు అధిక జ్వరం, శరీర దౌర్బల్యం, రక్తసంబంధ సమస్యలు, దీర్ఘకాలిక అంటువ్యాధులు వంటి పరిస్థితులను సూచించే అవకాశముంది. రేబీస్, డెంగ్యూ, స్వైన్ ఫ్లూ వంటి తీవ్రమైన వైరల్ వ్యాధులతో, దీర్ఘకాలిక మూత్రాశయ ఇన్ఫెక్షన్, సెప్సిస్, ఎరప్షన్ ఫీవర్స్ వంటి వ్యాధులుగా పేర్కొనవచ్చు.
- శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, స్వాతి, పునర్వసు నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు వైరల్ చెస్ట్ మరియు జుచీ ఇన్ఫెక్షన్, ఎపిడెమిక్ ఫ్లూ, వర్షాకాల వైరల్ జ్వరాలు, మూత్ర ఇన్ఫెక్షన్, చికెన్ పాక్స్, మీజిల్స్, మంప్స్, డెంగ్యూ వంటి వైరల్ వ్యాధులుగా చెప్పవచ్చు, ఒక దశలో తగ్గి మరొక దశలో మళ్లీ పెరగడం, లక్షణాలు మారుతూ ఉండటం వంటి స్వభావాన్ని ప్రదర్శించవచ్చునని గ్రంథాల విశ్లేషణ ద్వారా తెలుస్తుంది.

ఈ విధంగా పరిశీలించినప్పుడు, ప్రాచీన భారతీయ వైద్యులు జ్వర స్వభావాన్ని పరిశీలించడంలో కేవలం ఆధ్యాత్మిక కోణానికే పరిమితం కాకుండా, రోగ గమనాన్ని గమనించి ఒక పరిశీలనా విధానాన్ని అభివృద్ధి చేసినట్లు అర్థమవుతుంది.

నక్షత్రోత్పన్న జ్వరాలు -- తులనాత్మక విశ్లేషణ

ఆయుర్వేద మరియు జ్యోతిష శాస్త్రాలలో నక్షత్రోత్పన్న జ్వరాల వివరణలో అనేక సామ్యాలు కనిపిస్తున్నాయి. రెండు శాస్త్రాలు కూడా జ్వర కాలవ్యవధి, తీవ్రత, ప్రాణాపాయం వంటి అంశాలను నక్షత్ర స్వభావంతో అనుసంధానించాయి.

హారీత, శౌనక, కౌశికుల అభిప్రాయాలలో కొంత వ్యత్యాసం ఉన్నప్పటికీ, సాధారణ ధోరణి ఒకటే కనిపిస్తుంది. ఉదాహరణకు, ఆర్ద్ర, ఆశ్లేష, జ్యేష్ఠ, మూల వంటి తీక్ష్ణ నక్షత్రాలలో సంభవించే జ్వరాలు ప్రమాదకరమని అందరూ అంగీకరించారు.

అదేవిధంగా అశ్విని, పుష్య, హస్త వంటి లఘు నక్షత్రాలలో సంభవించే జ్వరాలు త్వరగా ఉపశమిస్తాయని గ్రంథాలు పేర్కొన్నాయి. ఇది నక్షత్ర స్వభావం మరియు జ్వర గమనానికి మధ్య సంబంధాన్ని సూచిస్తుంది.

కొన్ని నక్షత్రాలలో ఆయుర్వేద గ్రంథాలు స్వల్పకాలిక ఫలితాన్ని సూచిస్తే, జ్యోతిష గ్రంథాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని సూచించాయి. ఉదాహరణకు అనూరాధ, రేవతి నక్షత్రాలలో ఈ విధమైన వ్యత్యాసం కనిపిస్తుంది. దీనిని పరిశీలిస్తే, ఆయుర్వేదం ప్రధానంగా శారీరక లక్షణాలపై దృష్టి పెట్టగా, జ్యోతిషం దోష, కర్మ, దైవ సంబంధిత అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్న దానం, శాంతి, దేవతారాధన వంటి పరిహారాలు కేవలం ఆధ్యాత్మిక చర్యలుగానే కాక, రోగికి మానసిక ధైర్యాన్ని కలిగించే ఉపచారాలుగా కూడా భావించవచ్చు.

ఈ సిద్ధాంతాలను ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలతో పూర్తిగా నిర్ధారించడం కష్టమైనప్పటికీ, భారతీయ జ్ఞాన సంప్రదాయంలో ఆరోగ్యం--కాలం--ప్రకృతి--మనస్సు మధ్య ఉన్న సమగ్ర దృష్టిని అవి ప్రతిబింబిస్తున్నాయి.

పరిశీలన ఫలితాలు :

1. అశ్విని, రోహిణి, మృగశిర, పునర్వసు, పుష్య నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు సాధారణంగా స్వల్పకాలికంగా ఉండి ఒక వారం నుండి పది రోజులలో ఉపశమిస్తాయి.

2. కృత్తిక, హస్త, చిత్ర, శ్రవణ, ధనిష్ఠ, శతభిష, ఉత్తరాభాద్ర వంటి నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు మధ్యస్థ తీవ్రతతో 10--15 రోజుల వరకు కొనసాగుతాయి.

3. ఆర్ద్ర, విశాఖ, పూర్వాషాఢ వంటి నక్షత్రాలలో సంభవించిన జ్వరాలు దీర్ఘకాలికంగా ఉండి తీవ్రమైన ఫలితాలను ఇవ్వగలవు.

4. అనూరాధ, ఉత్తరాషాఢ, రేవతి వంటి నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు కొన్ని సందర్భాలలో రెండు నెలల వరకు కొనసాగవచ్చు.

5. ఆశ్లేష, జ్యేష్ఠ, మూల, పూర్వాభాద్ర, స్వాతి వంటి నక్షత్రాలలో సంభవించిన జ్వరాలు ప్రాణాపాయ స్థితికి దారితీయగల తీవ్రమైనవిగా పేర్కొనబడ్డాయి.

ఆయుర్వేదం మరియు జ్యోతిషశాస్త్రం రెండింటిలోనూ నక్షత్రాలకు వ్యాధి గమనంపై ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడినట్లు ఈ అధ్యయనంలో స్పష్టమవుతోంది. జ్వర ప్రారంభ సమయాన్ని నక్షత్రాల ఆధారంగా పరిశీలించడం ద్వారా దాని తీవ్రత, వ్యవధి, ఫలితాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించబడింది. తీక్ష్ణ మరియు ఉగ్ర నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు తీవ్రమైనవిగా, కొన్నిసార్లు ప్రాణాంతకమై ఉండవచ్చునని గ్రంథాలు సూచిస్తున్నాయి. లఘు మరియు మృదు నక్షత్రాలలో ప్రారంభమైన జ్వరాలు సాధారణంగా ఉపశమనయోగ్యమైనవిగా పేర్కొనబడ్డాయి.

ఆయుర్వేదం లో ముఖ్యంగా వ్యాధుల రాజు అని జ్వరము పై ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం:- జ్వరం అనేక వ్యాధులలో ప్రధాన లక్షణం కావడం, అది ప్రాణాపాయ సూచకంగా పరిగణించబడటం.

కానీ ఆధునిక కాలంలో Cancer, Diabetes, Hypertension, Viral epidemics, Autoimmune diseases, Mental disorders వంటి వ్యాధులు ఎక్కువ ప్రాముఖ్యం పొందాయి.

కాబట్టి --- "వ్యాధి బయటపడిన రోజు/సమయం లోని నక్షత్రం ఆధారంగా ఆ వ్యాధి గమనాన్ని అంచనా వేయవచ్చా?" అనే ప్రశ్నకు సంప్రదాయ జ్యోతిష దృష్టిలో సమాధానం:

కొంతవరకు అవును" అని చెప్పవచ్చు.

ఇందులో పరిశీలించవలసిన అంశాలు:-

1. వ్యాధి ప్రారంభమైన నక్షత్రం
2. చంద్రస్థితి
3. ఆ నక్షత్ర స్వభావం ఉదాహరణకు
   - క్షిప్ర/మృదు నక్షత్రాలు - వ్యాధి త్వరగా తగ్గుతుందని భావన.
   - స్థిర నక్షత్రాలు - దీర్ఘకాలం ఉండే అవకాశం.
   - ఉగ్ర/దారుణ నక్షత్రాలు - తీవ్రమైన లేదా కష్టసాధ్య వ్యాధి.
   - చర నక్షత్రాలు - వస్తూ పోతూ ఉండే స్వభావం.
4. ఆ సమయంలోని తిథి, వార, యోగ, కరణ
5. రోగ కారక గ్రహాలు
6. వ్యక్తి జన్మ నక్షత్రంతో సంబంధం వీటి ఆధారంగా కొంత అంచనా వేయవచ్చు.

అయితే కొన్ని వ్యాధుల పరిశోధనాత్మక దిశలు ఇలా ఉండవచ్చు:-

Cancer మొదట నిర్ధారణ అయిన నక్షత్రం

Diabetes బయటపడిన రోజు చంద్ర నక్షత్రం

Pandemic ప్రారంభ కాల నక్షత్ర విశ్లేషణ

Psychiatric disorders లో చంద్ర--నక్షత్ర సంబంధం

ఈ విధంగా నక్షత్ర స్వభావం, అధిదేవత, దోష ప్రభావం, జ్వర స్వభావం మధ్య ఉన్న సంబంధాన్ని ఆయుర్వేదం మరియు జ్యోతిషం పరస్పరపూరకంగా వివరిస్తున్నాయి. ప్రాచీన భారతీయ వైద్య--జ్యోతిష జ్ఞాన సంప్రదాయంలో కాలతత్త్వం ఎంత ముఖ్యమో ఈ సిద్ధాంతాలు తెలియజేస్తున్నాయి.

డా. వై. వి. రాజ్యలక్ష్మి రావు



అంతా ఒకే సూర్య సిద్ధాంతమైనను, ప్రాంతాల ననుసరించి కాలమాన గణనలో తేడాలున్నాయి. దక్షిణ ప్రాంతం అనగా శేషాచలానికి దిగువనగల తమిళనాడు, కేరళ రాష్ట్రాలు సౌరమానాన్ని ఆచరిస్తారు.

మధ్య ప్రాంతం అనగా వింధ్యాచలానికి, శేషాచలానికి మధ్యనున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా మొదలగు రాష్ట్రాలు చాంద్రమానాన్ని అనుసరిస్తాయి. వింధ్యాచలానికి ఉత్తరభాగంలో గల రాష్ట్రాలన్నీ బార్హస్పత్య మానం ప్రకారం కర్మలను ఆచరిస్తారు. ఈ మూడింటికి కూడా చాంద్రమాసాలు, చంద్ర తిథులే వర్తిస్తాయి.

సౌరమానం

సూర్యుడు ఒక రాశిలో సుమారు 30 రోజులుంటాడు. మొత్తం 12 రాశుల్లో కలిపి సుమారు 360 రోజులు అవుతుంది. ఒకరాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'సంక్రమణం' అంటారు.

సౌరమానానికి, చాంద్రమానానికి గల వ్యత్యాసం సవరణకే సుమారు ప్రతి 2 సం॥ 6 మాసాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఒక అధికమాసానికి మరొక అధికమాస ప్రారంభానికి సుమారు 2 సం॥ 8 నెలల 16 రోజుల కాలం అవుతుంది.

బార్హస్పత్య మానం

గురుగ్రహ గమనాన్ని అనుసరించి బార్హస్పత్యమానం ఉంటుంది. గురుడు సుమారు 1 సం॥ (360 రోజులు) ఒక రాశిలో సంచరిస్తుంటాడు.

గురుడు ఒక రాశిలో మధ్యభాగంలో నున్నపుడు బార్హస్పత్యమానం ప్రకారం సంవత్సరారంభం అవుతుంది.

ప్రధానంగా సౌర, చాంద్ర, బార్హస్పత్యమానాలే మన భారతదేశంలో ఆచరణలో ఉన్నాయి.

ఒక రోజులో కాల విభాగం

రోజు అనగా సూర్యోదయం నుండి తిరిగి సూర్యోదయం వరకైతే, పగలు (దినం) సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు అవుతుంది. పగటికాలం మొత్తం ఐదు విభాగాలు. సూర్యోదయం, సూర్యాస్తమయం సరిగా 6 గంటలకు అయినపుడు మొత్తం 12 గంటల కాలం అవుతుంది. దీన్ని ఐదు భాగాలు చేయగా ఒక్కో భాగానికి 2 గం. 24 ని॥లు అవుతుంది. పగటికాలం. ఉదా ॥

(1) సూ.ఉ. 6 గం + 2 గం. + 24 ని॥ = ఉ. 8 గం. 24 ని॥ల వరకు ప్రాతఃకాలం. (2) ఉదయం 8.24 + 2.24 = ఉ 10.గం 48 ని॥ వరకు సంగమ కాలం. (3) ఉదయం 10.గం. 48 ని॥ + 2.24 = మ. 1 గం. 12 ని॥ వరకు మధ్యాహ్న కాలం. (4) మ. 1-12 + 2.24 = మ. 3.గం ॥ 36 ని॥ వరకు అపరాహ్ణకాలం. (5) మ. 3.36 + 2.24 = సా. 6 గం॥ వరకు సాయంకాలం.

రాత్రి కాల విభాగంలో ముఖ్యమైనవి ప్రదోషకాలం, అరుణోదయకాలం. సూర్యాస్తమయం తర్వాత మూడు ముహూర్తాల కాలం అనగా 2 గం. 24 ని॥లు ప్రదోషకాలం. సూర్యోదయానికి ముందు ముహూర్తాల కాలం అనగా 2 గం. 24 ని॥లు అరుణోదయకాలం. ఉదా ॥ సూర్యాస్తమయం సరిగా 6 గంటలకు అయితే రా. 8 గం. 24 ని॥ల వరకు ప్రదోషకాలం ఉంటుంది.

సూర్యోదయం సరిగా 6 గంటలకు అయినపుడు రా. 3.36 ని॥ల నుండి అరుణోదయ కాలం ఉంటుంది. జనన, మరణ సమయాలలో ఆశౌచ నిర్ణయానికి గాను ప్రధానంగా రాత్రి కాలాన్ని మూడు భాగాలు చేయగా పూర్వరాత్రి, మధ్యరాత్రి, పరరాత్రి అవుతాయి.

రాత్రికాలం మొత్తం 12 గంటలయినపుడు ఒక్కో కాలానికి 4 గంటల కాలం అవుతుంది. అనగా - సూర్యాస్తమయం 6 గంటల కైతే రాత్రి 10 గం.ల వరకు పూర్వరాత్రి, రా. 2 గం.ల వరకు మధ్యరాత్రి, తర్వాత సూర్యోదయం 6 గం.ల వరకు పరరాత్రి అవుతుంది.

తిథి విశేషం

తిథులు రెండు విధాలు. 1) పూర్ణ తిథి 2) ఖండ తిథి.

సూర్యోదయం నుండి తిరిగి సూర్యోదయం వరకు 60 గడియలు అనగా 24 గంటలుండు తిథిని పూర్ణ తిథి అంటారు. ఖండ తిథి రెండు విధాలు.

1) శుద్ధ తిథి. 2) విద్ధ తిథి

సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు లేదా కర్మకాలం వరకు ఉండేతిథిని 'శుద్ధ తిథి' అవుతుంది. విద్ధ అనగా వేధ అని అర్థం. ఒక తిథి మరొక తిథితో కలియుటను వేధ అంటారు. కొన్ని వేధలు శుభప్రదం, మరికొన్ని అశుభం.

శ్లో ॥ కర్మణోయస్యయః కాలః, తత్కాలవ్యాపినీ తిథిః ।
తయా కర్మాణి కుర్వీత, హ్రాసవృద్ధీన కారణమ్ ॥

తా ॥ కర్మకు ఏ తిథి కావలెనో, ఏ కాలమందు, ఏ కర్మ చేయవలెనో, ఆ కాలానికి ఆ తిథి యుండగా ఆ తిథి యంతా, ఆ కర్మ చేయాలి. వృద్ధి, క్షయాలు కారణముగాదు.

తిథి వేధా ఫలములు

విదియతో తదియ, చవితి పంచములు, షష్ఠి సప్తములు, అష్టమి నవములు, ఏకాదశి ద్వాదశులు, చతుర్దశీ పూర్ణిమలు, అమావాస్య పాడ్యమిలు కలిపిన గొప్పఫలము. కలవని యెడల మహాదోషం.

సూర్యోదయానంతరం 6 గడియలు అనగా 2 గం. 24 ని॥ల వరకు ఉండుట, సూర్యాస్తమయానికి ముందు 6 గడియలుండుట (2 గం. 24 ని॥లు) అవసరం. కర్మ విశేషాలలో మిగతా విషయాలు తెలుస్తాయి.

తిథులకు అధి దేవతలు

1. పాడ్యమి - అగ్ని, 2. విదియ - బ్రహ్మ, 3. తదియ - గౌరి, 4. చవితి - గణేశుడు, 5. పంచమి - సర్పం 6. షష్ఠి - కుమారస్వామి, 7. సప్తమి - సూర్యుడు, 8. అష్టమి - శివుడు, 9. నవమి - దుర్గ, 10. దశమి - యముడు, 11. ఏకాదశి - శివుడు, 12. ద్వాదశి - విష్ణువు 13. త్రయోదశి - మన్మథుడు, 14. చతుర్దశి - శివుడు, పూర్ణిమ - చంద్రుడు, అమావాస్య - పితృదేవత.

నక్షత్ర విశేషం

కేవలం చంద్ర చారాన్ననుసరించి నక్షత్రకాల నిర్ణయం ఉంటుంది. మొత్తం 27 నక్షత్రాలు. నక్షత్రాధిపతి చంద్రుడు.

ప్రధానంగా తిథులను ఆధారంగా చేసికొని పండుగలు, వ్రతాలు, శ్రాద్ధ తిథులు నిర్ణయింపబడతాయి. అందుకే ఆయా పండుగల తిథుల పేర్లతోనే పిలువబడుతున్నాయి. ఉదా ॥ వినాయకచవితి, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, విజయదశమి మొ॥నవి. స్మార్తులు మరియు వీరిని అనుసరించువారు ఈ విధానం ప్రకారమే ఆచరిస్తున్నారు. కాని వైష్ణవులు, ఆ సంప్రదాయాన్ని ఆచరించే వారు మాత్రం తిథులతో సంబంధం లేకుండా కేవలం నక్షత్రకాల నిర్ణయానుసారం పండుగలు, వ్రతాలు, తిరునాళ్ళు మొ॥వి ఆచరిస్తున్నారు.

గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి



శ్లో ॥ సిద్ధాన్త మౌపనిషదం శుద్ధాన్తమ్ పరమేష్ఠినః ।
శోణాధరమ్ మహోత్ఫుల్లచిద్వీణాధర ముపాస్మహే ॥

శ్లో ॥ స్త్రీ మూర్తి రూపిణం దేవం త్రయీవేద్యం శుభావహామ్।
త్రిగుణాతీత మవ్యక్తం వందే సూర్యం సదా విభుమ్ ॥

సృష్టియందు కాలము అనంతము. భగవత్స్వరూపమే కాలము అని శ్రుతులు స్మృతులు తెలుపుచున్నవి. మానవ జీవితములో కర్మలు కాలస్వరూపము ఆధారముగా నడచుచుండును. కాలము యొక్క ప్రాముఖ్యత అత్యంత విశిష్టము. **కాలయంతా, కాలగోప్తా కాలః కాలాంతకోఽఖిలః, కాలగమ్యః, కాలకాలేశ్వరః.** కాలమునకు అధిపతి సూర్యనారాయణుడే. సూర్యచంద్రులు ప్రధాన సాక్షీభూతులుగా ప్రత్యక్ష ప్రమాణములకు మూలమైన జ్యోతిష శాస్త్రము. మానవులకందరకు శుభాశుభరూపమయిన అనేక కార్యములకు ఆధారభూతము **బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, యత్యాశ్రమములు** నాలుగు. ఈ చతురాశ్రమములలో రెండవది అయిన గృహస్థాశ్రమము ఉత్తమమైనది. మిగతా మూడు ఆశ్రమముల వారికి సమస్త ప్రాణులకు ఆధారము గృహస్థాశ్రమమే. ఋణత్రయ విమోచనము **(పితృఋణం, ఋషి ఋణం, దేవ ఋణము)** గృహస్థాశ్రమము వినా మరో మార్గాంతరము లేదు. గృహస్థాశ్రమము త్రివిధ ములయిన కామములను **(ధర్మ. అర్థ, కామ)** సిద్ధింపచేయును.

గృహస్థాశ్రమమునకు ఆధారము. పురుషునకు స్త్రీ అయి వున్నది. ఈ స్త్రీ సుశీలముచే సత్ప్రవర్తనతో కల్గి భర్తతో క్షీర-నీరన్యాయముగా వుండవలయును.

ఎలాంటి వరున్ని చూడాలి? వధువు ఎలా ఉండాలి? ఈ లాంటి ప్రశ్నలేన్నో మనకు కలుగుతూ వుంటాయి.

వీటన్నింటికి సమాధానములు పూర్వాచార్యులు (గురువులు) అనుగ్రహించారు.

శ్లో॥ లోకాచారస్తావదాదౌ విచిన్త్యో దేశేదేశే యా స్థితిః
సైవ కార్యా,
లోకేదిష్టం పణ్డితా వర్జయన్తి దైవజ్ఞోఽతో
లోకమార్గేణ యాయాత్ ॥

వివాహ విషయములో పండితులు ఎల్లప్పుడు లోకాచారమును పాటించవలయును. ప్రత్యేకముగా తమ తమ పద్ధతిని దృష్టిలో నుంచుకోవలయును. పండితులు

లోక పరంపరలో చెడువిషయములను వదిలి పెట్టవల యును. అందువలన దైవజ్ఞుడు లోకాచారమును గమనించ వలయును.

శ్లో ॥ స్వగోత్ర ప్రవరోపేతో హీనాధిక కులోద్భవా ।
కన్యా వయోధికానేష్టా దుర్లక్షణ గుణాన్వితా ॥

వరుని గోత్ర ప్రవరలతో గూడినట్టిదియు ఎక్కువ తక్కువ కులమునందు పుట్టినదియు. దుష్టలక్షణ దుష్ట గుణములతో గూడినట్టి వరుని కంటె నధికవయస్సు గల కన్యక వివాహము నకు విహితమైనది కాదు.

శ్లో ॥ కులంచ శీలంచ వపుర్వయశ్చ
విద్యాంచ విత్తంచ సనాథతాం చ ।
ఏతాన్గుణాన్ సప్త పరీక్ష్యదేయాఃకన్యా బుధై శ్శేష మ చింతనీయమ్ ॥

వరుని వంశమును స్వభావ సదాచార సంపత్తిని శరీర సౌష్ఠవ సౌందర్యములను వయస్సు వేద శాస్త్రాది విద్యలను భాగ్యము స్వామ్యము (రక్షకులను) ఈ 7 సద్గుణములను పరిశీలించి కన్యను యివ్వవలయును.

శ్లో ॥ కులస్య దేశస్య చ చిత్త వృత్తిర్న
ఖణ్డనీయా విదుషా కదాచిత్ ।
దోషం గుణం వాపి గుణంచ దోషం యో
భావయే జ్జ్యోతిషికఃసచాజ్ఞః ॥

విద్వాంసులు ఎప్పుడు కులము మరియు దేశీయాచార ములను ఖండించరాదు. వాటిలో దోషములున్నప్పటికి గుణములను చూడవలెను. లోకములో దోషములు కన్పించినప్పటికి జ్యోతిష్కుడు లోకవృత్తికే అధిక ప్రాధాన్యత యివ్వవలయును.

శ్లో ॥ బృహస్పతౌ గోచర శోభనస్థే
వివాహ మిచ్ఛన్తి హి దాక్షిణాత్యాఃరవౌ విశుద్ధే ప్రవదన్తి గౌడా
నాగోచరో హూలవకే ప్రమాణమ్ ॥

వివాహములో దక్షిణాది సంప్రదాయమునసరించి గురుడు శుభుడై శుభస్థానములో వుండవలయును. గౌడ మతమునసరించి రవి శుభుడై శుభస్థానములో నుండ వలయును. మాలవదేశములో గోచార ప్రమాణమునకు ప్రాధాన్యతనీయరు.

శ్లో ॥ భౌమే విశుద్ధా యమునా తటోద్భవా
హిమాలయస్థాఃశశిజే శుభర్క్షగే ।
కైలాస దేశ ప్రభవాఃశనైశ్చరే
భృగోఃసుతే సాగర సన్నివేశాఃll

యమునా నదీ ప్రాంతమువారికి గోచారములో కుజుడు శుద్ధిగా వుండవలయును. హిమాచల క్షేత్రము వారికి బుధుడు గోచారములో శుభుడుగా వుండవలయును. కైలాస దేశమందు శనిని సముద్ర తటమందు నివసించు జనులు శుక్రున్ని శుభునిగా వివాహమందు భావిస్తారు.

శ్లో ॥ దంపత్యోర్జన్మ తారాభ్యాం నామర్క్షాభ్యా మథాపివా ।
స్త్రీ జన్మతారా పూర్వాభ్యాం బ్రూయాత్ప్రాజ్ఞ
శ్శుభాశుభమ్ ॥

జ్యోతిషికుడు కన్యా జన్మనక్షత్రము పూర్వమందు కల్గిన కన్యా (వధూః) వరుల యొక్క జననకాల నక్షత్రము చేతనైనను అలాకాకుండా నామ నక్షత్రము చేతనైనను శుభా శుభములను చెప్పవలయును.

శ్లో ॥ జన్మధిష్ణ్య భవనోద్భవం ఫలం కామినీ
పురుషయోర్వి చింతయేత్ ।
జన్మదిష్ణ్య భవనాద్యభిజ్ఞయా
నామతోఽఖిలమిదం విచింతయేత్ ॥

స్త్రీ పురుషులకు జన్మనక్షత్ర జన్మరాశుల వలన ఉత్పన్నమైన శుభాశుభఫలములను విచారింపవలయును. జన్మ నక్షత్ర జన్మరాశులు తెలియకపోవుటచేత నామనక్షత్ర ప్రకారముగా సమస్తమైన ఈ పూర్వోక్తములగు శుభా శుభములను విమర్శింపవలయును.

శ్లో ॥ అజ్ఞాత జన్మనాం నృణాం నామభం పరికల్పయత్ ।
తేనైవ చింతయేత్సర్వం రాశికూటాది జన్మవత్ ॥

జన్మ నక్షత్రము తెలియని మనుజులకు నామనక్షత్రము కల్పింపవలయును. ఆ నామ నక్షత్రము చేత సమస్తమయిన రాశి గ్రహకూటాధికమును జన్మనక్షత్రము వలె విచారించ వలయును.

శ్లో ॥ జన్మనా జన్మకుర్వీత నామ్నా నామైవ కారయేత్ ।
ఉభయం బలహీనం చేత్పుంజన్మ స్త్రీషు నామతఃll

పురుషుని జన్మనక్షత్రము తోడ స్త్రీ జన్మ నక్షత్రము

చేయవలయును పురుషుని నామనక్షత్రముతో స్త్రీ నామ నక్షత్రమునే చేయదగును. అనగా పురుషునకు జన్మ నక్షత్రమున్న స్త్రీకిని జన్మ నక్షత్రము బట్టియు పురుషునకు జన్మ నక్షత్రము లేక నామ నక్షత్రమైన స్త్రీకిని నామ నక్షత్రమును బట్టి విచారించవలయును. స్త్రీ పురుషుల యొక్క నామ నక్షత్రములు రెండును బలము లేనివియైన పక్షము నందు పురుషునికి జన్మ నక్షత్రమును స్త్రీ నామనక్షత్రమును బట్టి ఫలము విచారించవలయును.

శ్లో ॥ రోహిణ్యార్ద్రా మఖేంద్రాగ్ని అతిష్యశ్రవణ పౌష్ణభమ్ ।
అహిర్బుధ్న్యస్తస్యథాష్టాచ నక్షత్రైక్యే శుభావహాః ॥

రోహిణి, ఆర్ద్ర, మఖ, విశాఖ, పుష్యమి. శ్రవణం, రేవతి, ఉత్తరాభాద్ర ఈ 8 నక్షత్రములు. స్త్రీ పురుష నక్షత్రము నందు శుభములు.

శ్లో ॥ అశ్వినీ చ యమస్వాతీ సార్పఫాల్గున మేవ చ ।
మైత్ర వారుణ మూలాఖ్యం నక్షత్రైక్యేఽపి మధ్యమా ॥

అశ్విని, భరణి, స్వాతి, ఆశ్రేష, పూర్వఫల్గుణి, అనూరాధ, శతభిషం. ఈ 8 నక్షత్రములు స్త్రీ పురుషుల నక్షత్రైక్యమునందు మధ్యమములు.

శ్లో ॥ అజైకపాచ్ఛవిష్ఠాచ పునర్వస్వథకృత్తికా
మృగశీర్షంచ చిత్రాచ సవితోత్తర ఫల్గునీ ।
జ్యేష్ఠా చ విశ్వతోయంచ నక్షత్రైక్యే వినశ్యతి
ఏకరాశౌ పృథగ్ధిష్ణ్యే చోత్తమం పాణి పీడనమ్ ॥

పూర్వాభాద్ర, ధనిష్ఠ, పునర్వసు, కృత్తిక, మృగశీర్ష, చిత్త, హస్త, ఉత్తర, జ్యేష్ఠ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ఈ నక్షత్రముల యొక్క ఏకత్వమునందు కన్యావరులకు నాశము సంభవించును. ఒకరాశియందు భిన్ననక్షత్రములందు వివాహము ఉత్తమము.

శ్లో ॥ రాశ్యైక్యే చేద్భిన్న మృక్షం ద్వయోస్యాన్నక్షత్రైక్యే
రాశి యుగ్మంతథైవ ।
నాడీదోషోనోగణానాంచ దోషో నక్షత్రైక్యే భిన్న
పాద శుభస్యాత్ ॥

దంపతులకు ఏకరాశిత్వమునందు నక్షత్ర భేదమైనను ఆ ప్రకారమే ఏక నక్షత్రమునందు రాశి భేదమైనను నాడీ దోషము గుణదోషములులేవు. ఏ నక్షత్రము నందు పాదభేదము వివాహమందు శుభకరమయినది అగును.

శ్లో ॥ ఏకర్షే చైక పాదేతు వివాహాః ప్రాణహానిదః ।
దంపత్యోరేక నక్షత్రే భిన్నపాదే శుభావహాః ॥

ఏక నక్షత్రము ఏక పాదమునందు వివాహము ప్రాణ నాశకరము. వధూ వరులకు ఒక నక్షత్రమందు పాద భేదమయినను వివాహము శుభము.

శ్లో ॥ యుగ్మపాదేచధిష్ణ్యేతు వరః పూర్వార్ధగోజయః ।
అపరార్ధోభ్వా నారీ చైకర్షేఽపి శుభావహాః ॥

శతభిషం, హస్త, అశ్విని, కృత్తిక, పూర్వాషాఢ, మృగశిర, మఖ ఈ నక్షత్రములయందు కన్య పూర్వపాదము పొంది యున్నను ఏకరాశిత్వమునందు వివాహము దోషకరము.

శ్లో ॥ ఏకరాశౌ ద్వినక్షత్రే పుంతారా ప్రథమా భవేత్ ।
అతీవ శోభనం ప్రోక్తం స్త్రీతారా చేద్వినాశనమ్ ॥

ఒక రాశియందు రెండు నక్షత్రముల యందు పురుషుని నక్షత్రము మొదటిది అయిన మిక్కిలి శుభము. స్త్రీ నక్షత్రము మొదటిది అయిన అశుభము తలుగును.

శ్లో ॥ శుభ మంశైక్య ముద్వాహే దంపత్యోర్నామ తారకే ।
గ్రామ సంగ్రామ సేవాసు నామాంశ మశుభం విదుః॥

వివాహ విధియందు కన్యావరులకు నామనక్షత్ర మందు యుద్ధమందు రాజసేవాదులయందు ఏకాంశమును అశు భకరమైనదిగా పెద్దలు చెప్పుదురు.

శ్లో ॥ విరుద్ధే రాశినక్షత్రే భవతా మపి చేత్తదా ।
దంపత్యోః ప్రీతయే నృణాం నామాంతర మథక్షిపేత్॥

దంపతుల యొక్క రాశి నక్షత్రములు విరోధాక్రాంతము లయినప్పుడు ఆసమయమున మనుష్యుల ప్రియము కొరకు మరియొక నామధేయము నుంచవలయును.

శ్లో ॥ దంపత్యోరేక నక్షత్రే ద్విపదర్షే మృతిర్భవేత్ ।
త్రిపదర్షే సదోత్పత్తిశ్చతుష్పాదే శుభావహాః ॥

జాయాపతులకు ఏక నక్షత్ర విషయమై ద్విపాన్నక్షత్రము నందు మరణము కలుగును. త్రిపాన్నక్షత్రము నందు రోగోత్పత్తి రూపమైన ఫలము. నాల్గు పాదములు గల నక్షత్రమునందు వివాహము శుభము.

శ్లో ॥ పంచత్వక్పిత సర్షపాన్విత జలం కుంభస్థితం నూతనం।
దూర్వాశ్వత్థ దళైర్వివాహ సమయే
సంప్రోక్షణం కల్పయేత్ ।
కన్యాయాస్తదనంతరం ద్విజవరస్తస్యాశ్చ పుణ్యాంగనా
పూర్వోక్తం పరిహృత్య మంగళకరం
నామాంతరం ప్రక్షిపేత్ ॥

వివాహము చేయునపుడు బ్రాహ్మణోత్తముడు నూతనమైన కలశము మట్టి, మామిడి, నేరేడు, రావి, జువ్వి, పువ్వుల యొక్క చర్మము తెల్ల ఆవాల గింజలతో కూడిన ఉదకమును దర్భలు రావిచిగుళ్ళు వీనిచేత కన్యకకు సంప్రోక్షించవలయును. జలప్రోక్షణానంతరమున ఒక బ్రాహ్మణ ముత్తయిదువ ఆకన్యకను పూర్వమందుంచిన నామమును పరిత్యజించి శుభకరమయిన మఱి యొక పేరును పెట్టవలయును.

వివాహ విషయములో వధూవరుల అన్యోన్య దాంపత్య జీవిత సుఖ శాంతులు పరస్పర అవగాహన విషయములు జన్మ లేదా నామ నక్షత్రముల ననుసరించి శాస్త్రీయ విధానములు.

శ్లో ॥ నాడీ రాశి, యోని, కూట వనితా దీర్ఘాగణాశ్చాపిష ।
ద్వర్గా ముఖ్యతరా వివాహసమయే శేషాస్తుమధ్యాస్తతః॥

1. నాడికూటము, 2. రాశికూటము, 3. గ్రహమైత్రి, 4. యోనివర్గు, 5. స్త్రీ దీర్ఘము, 6. గణకూటము యివి ముఖ్యము మిగతావి మధ్యమములు.

అష్టకూటములు :- 1. వర్ణకూటము, 2. వశ్య కూటము, 3. తారా కూటము, 4. యోనికూటము, 5. గ్రహకూటము, 6. గణకూటము, 7. రాశికూటము, 8. నాడీకూటములు.

శ్లో ॥ వర్గాణా మపివింశతిః పరిణయే జ్ఞేయాః
స్ఫుటం భూసురై ।
ర్విప్రాణాం గ్రహమైత్రి తైవ నియతా రాజ్ఞాం
ప్రధానం గణ ।
స్త్రీదూరంతు విశాంప్రధాన మ పరో
యోన్యాఖ్యవర్గోమహా
నన్యేషాం శుభదో భవేత్ స్ఫుటమిదం శాస్త్రం
విచింత్యం బుధైః ॥

యిరువది వర్గులు. (వింశతికూటములు).

1. గ్రహమైత్రి, 2. గణకూటము, 3. స్త్రీ దీర్ఘకూటము, 4. యోని కూటము, 5. నాడి కూటము, 6. రాశి కూటము, 7. మహేంద్ర కూటము, 8. గణితా గణాయుష్య వర్గము, 9. ఆయు వర్గము, 10. వశ్యా వర్గము, 11. దినవర్గము, 12. జాతి వర్గము, 13. వేధా వర్గము, 14. పక్షి వర్గము, 15. రజ్జు వర్గము, 16. యోగిని వర్గము, 17. లింగ వర్గము, 18. భూత వర్గము, 19. చంద్రయోగవర్గము, 20. గోత్ర వర్గము. యివి వధూవరుల పొంతనమందు ప్రధానమని తెలియుచున్నది. శాస్త్రోక్తముగా యిరువది వల్గులు చెప్పిననూ వర్గుల విషయములో దేశభేదముచేత ఏ ప్రాంతములదు ఏ వర్గులు ప్రాధాన్యమో ఆయా ప్రాంతములయందు వాటిని ఉపయోగించుకోవలయును.

శ్లో ॥ గ్రహమైత్రం ద్విజాతీనాం క్షత్రియాణాం గణస్తధా ।
కన్యాదూరం తు వైశ్యానాం శూద్రాణాంయోనిరేవచ ॥

వివాహ విషయములో బ్రాహ్మణులకు గ్రహమైత్రి క్షత్రియులకు గణకూటము. వైశ్యులకు స్త్రీ దీర్ఘకూటము తదితర వర్గముల వారికి యోనికూటము చూడవలయును. వధూవరుల యొక్క జన్మరాశ్యాధిపతులు మిత్రులైనను ఏక రాశ్యాధిపత్యము కల్గియున్ననూ శుభప్రదము. వధూవరులు శత్రువులైన పరస్పరము కలహము కలవారగుదురు.

శ్లో ॥ స్త్రీ రాక్షసం నకర్తవ్యం కర్తవ్యం పురుషరాక్షసమ్ ।
స్త్రీ రాక్షసం భవన్మేనత్యుః సద్యఏవ న సంశయః ॥

శ్లో ॥ స్వగణం చోత్తమం ప్రీతిః మధ్యమం దేవమానుషం ।
అధమం దేవదైత్యానాం మృత్యుర్మానుష రాక్షసమ్ ॥

అశ్విని, పునర్వసు, పుష్యమి, మృగశిర, హస్త, స్వాతి, అనూరాధ, శ్రవణం, రేవతి ఇవి 9 దేవగణ నక్షత్రములు. భరణి, రోహణి, ఆర్ద్ర, పుబ్బ, ఉత్తర. పూర్వాషాడ, ఉత్తరాషాఢ, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర. ఇవి 9 మనుష్యగణ నక్షత్రములు. కృత్తిక, ఆశ్లేష, మఖ, చిత్త, విశాఖ, జ్యేష్ఠ, మూల, ధనిష్ఠ శతభిషం ఇవి 9 రాక్షస గణ నక్షత్రములు. వధూవరుల నక్షత్రములు ఏకగణమైన ఉత్తమం దేవ మనుష్య గణములైన మధ్యమం. దేవ-రాక్షస గణములైన కలహం, మనుష్య రాక్షసగణములైన మృత్యుప్రదము అగును. వధూ నక్షత్రం మొదలు వర నక్షతం వరకు లెక్కింపగా ప్రథమ నవకములో

చేరియున్న అశుభం సదాకలహప్రదం 2వ నవకములో మధ్యమ ఫలము 3వ నవకములో చేరియున్న శుభదాయకము సుఖదాయకము వర నక్షత్రం వధూ నక్షత్రం నుంచి పదమూడు నక్షత్రములకు పైనయున్నా అత్యంత శుభదాయకము.

స్త్రీ పురుషులు ఏకయోని వర్గములో చేరియున్న సంపద వేరు వేరు వర వర్గములలో యున్న మధ్యమము శతృత్వము గల యోని వర్గములలో నున్న అశుభప్రదము ఒకరి నక్షత్రము అయిననూ స్త్రీ తార అయిన మధ్యమము. పురుష తారలకు పురుష తారల తోటి సంబంధము కల్గిన దాంపత్యము సర్వకాల సర్వావస్థల యందునూ కలహము కలదై అశుభమును పొందును. నైసర్గిక విరోధము గల జంటలు (జంతువులు) గోవ్యాఘ్రములు, గజసింహములు, అశ్వమహిషములు, శునక హరిణములు, వానరమేషములు, మార్జాల మూషికములు, పాము ముంగిసలు ఏయే నక్షత్రములకు పరస్పర విరోధము అట్టి విరోధ నక్షత్రముల సంబంధము కల్గిన వధూ వరులు సదాకలహము కలవారై ఉందురు. వధూవరుల నక్షత్రములు ఆదినాడియందున్న దంపతుల కరిష్టము. మధ్యనాడియందున్న వరుని కరిష్టము. అంత్యనాడియందున్న వధువుకు మృత్యువు కలుగును. నాడీ భేదమున్న శుభప్రదము. (సర్పాకారా తత్రనాడి) రాశివర్గములో స్త్రీరాశికి పురుషరాశి 12.11.10.9.8 అయిన. దీర్ఘాయుష్యం, సౌఖ్యం. ధనసమృద్ధి, శుభము. పుత్ర సంపద, కల్గును కావున శుభకరము - స్త్రీ రాశికి పురుషరాశి 2.3.4.5.6 అయిన మృత్యువు దుఃఖం-ధారిద్ర్యము. అశుభము పుత్రనాశము కల్గును కాన అశుభము. స్త్రీరాశికి పురుషరాశి ఒకటియైననూ సమసప్తక రాశులైనూ అత్యుత్తమము. పుత్రలాభము అన్యోన్యానురాగము మాంగల్యము సర్వ సంపదలు లభించును.

వధూ నక్షత్రము మొదలు వర నక్షత్రముగ చేయగా 4.7.10.13.16.19.22.25 ఈ సంఖ్యలు వచ్చిన దంపతులకు శుభప్రదము. గణితాగతాయుష్య వర్గ నందు వరశేషం వధూ శేషము కంటె తక్కువ అయినపుడు దంపతులలో ముందు పురుషునకు మృత్యువు. వరశేషం అధికమయిన స్త్రీకి మృత్యువు కలుగును. వరనక్షత్రములు గల ఆయమునకు 5వ ఆయములో వధువు నక్షత్రమున్న శుభము కలుగదు.

స్త్రీరాశి పురుషరాశి వశ్యమైనదిగా వుండవలయును.

1. మేషమునకు సింహ వృశ్చికములు, 2. వృషభమునకు కర్కాటక తులలు, 3. మిథునమకు కన్య, 4. కర్కాటకమునకు వృశ్చిక ధనుస్సులు, 5. సింహమునకు తుల, 6. కన్యకు మిథున, మీన. 7. తులకు మకర కన్యా 8. వృశ్చికమునకు కర్కాటక 9. ధనుస్సుకు మీన 10. మకరమునకు మేష కుంభములు 11. కుంభమునకు మేషము, 12. మీనమునకు మకరము వశ్యములు.

వధూనక్షత్రం మొదలు వరనక్షత్రం లెక్కించి 9 చే భాగించగా 1. మృత్యువు 2. ప్రేమ 3. ఆపద 4. సుఖం 5. పీడ 6. పశు లాభం 7. రోగ ప్రాప్తి 8. ప్రజావృద్ధి 9. సంతానము. శతృప్రాప్తి **'పుంభాదీతజగుః పరేత్వధ ఫలం పూర్వోక్త మత్రాపిచ?** కర్కాటక, మీన, వృశ్చికములు బ్రాహ్మణజాతి, సింహ, ధనూ, మేషములు. క్షత్రియజాతి, తులా మిథున కుంభములు వైశ్యజాతి. వృషభ, కన్య, మకరములు శూద్రజాతి. **"నదద్యాద్వర్ణ హీనస్య వర్ణ శ్రేష్ఠాంతు కన్యకాం"** వధూవరుల రాశులు ఒకవర్గం కలదైన అశుభకరం హీనరాశియైన మధ్యమఫలం జంట నక్షత్రములు పరస్పర విరోధము కలవి కొన్ని 3 ద్విపాన్నక్షత్రములు అన్యోన్య విరోధులు నక్షత్రముల జంటలలో ఒక జంట దంపతుల జన్మనక్షత్ర ద్వయమై యున్న దంపతులకు సదా విరోధముగా నుండును. అశ్విని 5 మొదలు 5 గరుడపక్షి ఆర్ద్రమొదలు 6 పింగళమను పక్షి ఉత్తరమొదలు 6 కాకి అనుపక్షి జ్యేష్ఠమొదలు 5 కుక్కుటమను పక్షి మొదలు 5 నెమలిపక్షి అధిపతులగుట వల్ల వివాహ విషయములో వధూవరుల జన్మనక్షత్రముల కోక పక్షి యధిపతి యున్న దంపతులకు ఒకరి యందొకరికి ప్రేమ కల్గియుండును. రెండు పక్షులయిన కలహము కలుగును.

వధూవరుల నక్షత్రములు భిన్న రజ్జులలో నుండుట శుభము. శిరోరజ్జుయందున్న భర్తనూ కంఠరజ్జుయందున్ని భార్యనూ ఉదరరజ్జుయందున్న కుమారులను నశింప చేయును. కటిరజ్జుయందున్న దారిద్ర్యము పాదరజ్జు యందున్న వ్యభిచారము కలుగచేయును.



యోగినివర్గ తూర్పుమొదలు ఈశాన్యం వరకు 1. బ్రాహ్మణి 2. కౌమారి 3. వారాహి 4. సిద్ధ 5. వైష్ణవి 6. మహేంద్రి 7. చాముండి 8. మహేశ్వరి అనునవి క్రమంబుగా శక్తులైయున్నవి. అశ్విని మొదలు ఒక్కొక్క దిక్కునకు ఒక్కొక్క నక్షత్రమును విభజించిన వధూవరుల నక్షత్రము ఒక శక్తి సంబంధులైయున్న పరస్పరమైత్రి కలుగును.

10 పుంలింగములు 14 స్త్రీ లింగములు. 3 న పుంసకలింగములు. వధూవరుల నక్షత్రములు ఏకలింగం కలవైయున్న పరస్పరము ప్రేమ కలవారై యుందురు. పంచభూతములగు పృథ్వి 5 జలము 6 తేజస్సు 6 దంపతుల జన్మ నక్షత్రములలో ఒక నక్షత్రము తేజోనక్షత్రముగా నుండి మరియొకరిది జలభూత నక్షత్రముగా నున్న మృత్యుప్రదము కాకున్న శుభకరమగును – **మరీచిః అత్రిః వసిష్ఠ ఆంగీరసః పౌలస్త్య పులహః క్రతుః** సప్తరుషుల యందు క్రమముగా అభిజిత్తు సహితముగా అశ్విని మొదలు నాల్గు నక్షత్రముల చొప్పున వధూవరుల జన్మ నక్షత్రములు ఒక గోత్రములో నున్న కలహము భిన్న గోత్రములకు చెందియున్న శుభప్రదం.

దాంపత్యము కృతి భూ సంబంధ విషయములు. గ్రామార్వణము. మంత్రార్వణము. ఔషధసేవ. గృహ నిర్మాణమునకు నామ నక్షత్రము ప్రాధాన్యము. మరియు 30 సం॥రముల పై బడిన తమ నామనక్షత్రమునకే ప్రాధాన్యము యివ్వవలయునని శాస్త్రవచనము.

శ్లో ॥ గౌతమ్యా యామ్య దిగ్భాగే కావేర్యోశ్చోత్తరేతటే ।
మాతులస్య సుతోద్వాహం ప్రశంసంతి మనీషిణః ॥

మేనత్త – మేనమామల పిల్లలు ఒకరినొకరు వివాహము చేసికొనుట మేనరికమనబడును. గోదావరీ కావేరీ నదుల మధ్యనున్న దేశములవారు. ఈ మేనరికపు వివాహముల చేసికొనుట దోషము కాదని శాస్త్రవచనము. వీరికి గ్రహమైత్రి ఏకనాడి షష్ఠాష్ఠ ద్విద్వాదశాది కూట దోషములు కూడ జూడనవసరములేదని గ్రంథాచార్యులు ముహూర్త గ్రంథములలో తెల్పియున్నారు. ఇంకా చాలా విశేషములన్నవి. వ్యాసము విస్తరమవుచున్నందున విరమించడమైనది. జ్యోతిష ఆగమ ధర్మశాస్త్ర సభలు నిర్వహిస్తున్న గాయత్రీపరం జ్యోతిర్మయ మహాపీఠం దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయశాఖ, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వారలకు అనేక శుభాభినందనలు. ప్రతి సంవత్సరము నదస్సులు నిర్వహించు శక్తిని యోగ్యతను శ్రీ సూర్యనారాయణమూర్తి కాలపురుషుడు ప్రసాదించాలని కోరుతూ వర్ధతాం, అభివర్ధతాం.

తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య



ఈ భూ మండలం మీద కాలచక్రానుసారం నియమరూపం లో శృంఖలాబద్ధమైన మార్పులు ఒక ప్రణాళికారూపంలో జరుగుతుంటాయి.

భారతీయ జ్యోతిష శాస్త్రంలోని సంహితా స్కంధం లో ఉత్పాతం అనే భావనకు ప్రత్యేక స్థానం ఉంది. "ఉత్పాతం" అనగా ప్రకృతిలో సాధారణంగా కనిపించని అసాధారణ పరిణామాలు లేదా విఘటనలు. ప్రకృతి తన సహజ నియమానికి విరుద్ధంగా భూమి, ఆకాశం లేదా వాతావరణంలో సంభవించే అసాధారణ సంఘటనలను "నైసర్గిక ఉత్పాతాలు" అని పిలుస్తారు. పురాతన జ్యోతిష గ్రంథాల ప్రకారం ఈ విధమైన సంఘటనలు భవిష్యత్తులో సంభవించబోయే సామాజిక, రాజకీయ లేదా భౌగోళిక మార్పులకు సూచనలుగా పరిగణించబడ్డాయి. ఇవి సాధారణ ప్రకృతి స్థితి నుండి వ్యత్యాసంగా ఉండటం వల్ల ప్రజలకు ఆశ్చర్యం లేదా భయాందోళనలు కలిగిస్తాయి.

సంహితా జ్యోతిషంలో నైసర్గిక ఉత్పాతాలు దేశ స్థాయి ఫలితాలను సూచించే సూచనలు గా పరిగణించబడ్డాయి. రాజ్యం, వర్షపాతం, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, మహామారి వంటి అనారోగ్యాలు, యుద్ధాలు లేదా రాజకీయ మార్పులు వంటి అంశాలను అంచనా వేయడానికి ఈ లక్షణాలను జ్యోతిషాచార్యులు సూచనలుగా భావించి పరిశీలించేవారు.

ఉత్పాతాలకు కారణం:- లోభం, నాస్తికత, అబద్ధాలు, అధర్మం, అనాచారం, అవినయత వల్ల పాపాలు పెరిగి ఉ త్పాతాల రూపంలో వస్తాయి. మానవ దుష్ప్రవర్తన పెరగడం వల్ల దేవతలు ఆందోళన చెంది విధ్వంసం సృష్టిస్తారు. ఈ ప్రతికూల పరిణామాలను నివారించడానికి, రాజు దేశంలో శాంతిని నెలకొల్పాలి.

నైసర్గిక ఉత్పాతాలు ప్రధానంగా దివ్య లేదా అంతరిక్ష, భౌమ ఉత్పాతాలు :-

1. అంతరిక్ష ఉత్పాతాలు :- ఆకాశంలో కనిపించే అసాధారణ ఖగోళ సంఘటనలు.

ఉదాహరణకు ఉల్కలు పడటం, ధూమకేతువుల దర్శనం, అసాధారణ గ్రహణాలు, పగటి సమయంలో నక్షత్రాలు కనిపించడం, పరివేశం, పరిఘ, దండ, నిర్ఘాతం, ఇంద్రధనస్సు, గంధర్వనగరము వంటివి కనిపించుట. (కొరొనా వచ్చేముందు చైనా లో ఆకాశంలో గంధర్వనగరం కనిపించింది).

దివ్య ఉత్పాతాలు:- దేవతా విగ్రహాలు కారణం లేకుండా విరగడం, విగ్రహాల నుండీ కన్నీరు, లేదా ఏదైనా చెమ్మగిల్లడం, మందిరాలలో జరిగే అనిష్టమైన సంఘటనలు ఝండా, గోపురాలు, రథయాత్రలలో ఏవైనా విరగడం, పడడం మొదలైన అశుభ సంఘటనలు కనిపించడం.

ఉదాహరణకు 21.9.1995 లో ఆ ఒక్క రోజు వినాయకుడి విగ్రహాలు పాలను పీల్చుకున్నాయి అని దేశం నలువైపుల నుండి వార్తలు వచ్చాయి. ఆ తర్వాత 8 నెలల తర్వాత 1996 సాధారణ ఎన్నికల తర్వాత వరుసగా మూడు ప్రభుత్వాలు (అటల్ బిహారీ వాజ్‌పేయ్, దేవేగౌడ, గుజ్రాల్) ఏర్పడ్డాయి. ఇది రాజకీయ అస్థిరతను సూచిస్తుంది.

దివ్య లేదా అంతరిక్ష ఉత్పాతాల ఫలితాల ఆధారంగా రాజులకు, రాజకుమారులకు, విత్తం (కోశాగారం), సైన్యం, నగరం, ప్రజలు, రాజపత్నులు, పురోహితులకు ఈ విధంగా ఎవరికి శుభాశుభాలు కలుగును అనేది 8 రకాల ప్రభావాలు తెలుసుకోవచ్చు.

2. భౌమ ఉత్పాతాలు:- భూమిపై సంభవించే సమస్త పంచభూతాత్మక అసాధారణ సంఘటనలు ఈ వర్గంలోకి వస్తాయి.

✤ ప్రాకృతిక ఉత్పాతాలు-భవిష్యత్తులో రాబోయే ప్రమాదాలకు సూచనలు భౌమోత్పాతం:- భూకంపాలు, నేల పగుళ్లు ఏర్పడటం, నదుల ప్రవాహం మారటం, అగ్నిపర్వత విస్ఫోటనలు మొదలైనవి.

ఈ సంఘటనలు భూభౌతిక మార్పులను సూచిస్తాయని పురాతన సంహితా గ్రంథాలు వివరిస్తున్నాయి.

✤ జలోత్పాతం:- వాతావరణంలో సహజ నియమానికి విరుద్ధంగా సంభవించే మార్పులు. ఉదాహరణకు అకాల వర్షపాతం, అధిక తుఫాన్లు, మేఘాలు లేకుండా మెరుపులు, అసాధారణ వర్ణం కలిగిన వర్షం మొదలైనవి.

✤ **అగ్ని సంబంధ ఉత్పాతం:-**

అగ్ని సహజంగా కారణం లేకుండా అనూహ్యంగా ఉద్భవించినప్పుడు లేదా ఎంత ప్రయత్నించినా మండనప్పుడు ఇలా అసాధారణంగా ప్రవర్తించినప్పుడు దానిని అగ్ని ఉత్పాతం అంటారు. ఉదాహరణకు దేవాలయాలలో, రాజప్రాసాదాలలో లేదా గ్రామాలలో అకారణంగా అగ్ని జ్వాలలు కనిపించడం, రాత్రి సమయంలో ఆకాశంలో అగ్ని వలయాలు లేదా అగ్ని రేఖలు కనిపించడం, నేల నుండి అగ్ని ఉద్భవించడం వంటి సంఘటనలు ఈ వర్గంలోకి వస్తాయి. ఏ ప్రాంతంలో అగ్ని సహజ కారణం లేకుండా ఉద్భవిస్తే అక్కడ రాజుకు కష్టాలు లేదా ప్రజలకు ఇబ్బందులు సంభవించే అవకాశం ఉంటుంది.

ఉదాహరణకు పూరీ జగన్నాధుడి ఆలయం (2008, 2020 మార్చ్)లో, ఉజ్జయిని మహాకాళేశ్వరుడి మందిరం (2024 మార్చ్)లో నూ సంభవించినవి.

అగ్ని ఉత్పాతం కనిపించినప్పుడు సాధారణంగా రాజ్యానికి ప్రమాదం, యుద్ధాలు లేదా కలహాలు, సామూహిక అగ్ని ప్రమాదాలు, ప్రజలకు కష్టాలకు సూచన.

✤ వాయూత్పాతం:- దైవ సంబంధ యాత్రలు, రథయాత్రలలో అపశకునాలు, దేవాలయాలలో సంగీత-నృత్య-వాద్యాలలోనూ, హారతి సమయంలో అపశృతులు, ఆకాశం నుండీ విచిత్ర శబ్దాలు వినిపించడం మొదలైనవి.

✤ జీవ సంబంధ ఉత్పాతం:- వృక్షాలు, జంతువులు లేదా పక్షుల అసాధారణ ప్రవర్తన కూడా ఉత్పాతం గా పరిగణించబడింది. ఉత్పాతాలను గణితం ద్వారా మాత్రమే కాకుండా శకునాలను కూడా గమనిస్తూ ఉండాలి.

ఉదాహరణకు జంతువులు అనూహ్యంగా పెద్ద సంఖ్యలో మరణించడం, పశు-పక్షులు అసహజంగా ప్రవర్తించడం, రాత్రి సంచరించే పక్షులు పగలు కనిపించడం, వృక్షాలనుండీ పాలు లేదా నీరు వంటివి స్రవించడము మొదలైనవి.



జ్యోతిష్య దృష్ట్యా ఉత్పాతాల ప్రాముఖ్యత, శాంతి విధానాలు:-

✤ ఉత్పాతాలు సంభవించిన కొద్ది కాలానికే అనర్థాలు సంభవించే అవకాశం ఉంటుంది.

✤ ఒక రాశి లో ఎక్కువ కాలం సంచరించే గ్రహాలైన శని, రాహు-కేతు, గురు గ్రహాల యొక్క సంచారం ఆధారంగా ఏ సమయంలో, ఏ ప్రాంతం లో ఏ విధమైన ప్రమాదాలు రాగలవో అంచనా వేయవచ్చు.

ఉదాహరణకు:- శని సామాజిక మార్పులు సూచించే గ్రహం. శని దృష్టి ఏ దేశాలు, ప్రజల మీద పడుతుందో వారి కర్మలను ఉద్దీపితం చేస్తుంది, కార్మిక పునరావృత్తి జరుగుతుంది. రాజకీయ, సామాజిక అశాంతి లేదా సంస్కరణలు పెరుగుతాయి.

గురు గ్రహం:- కొత్త నిర్ణయాలు, విద్యా, విజ్ఞాన, పాలన లలో మార్పులు, సాంస్కృతిక, మతపరమైన, నాయకత్వ మార్పులు తప్పనిసరిగా ఉంటాయి. దేశ-లోక నిర్ణయాలు మారే ఆవిర్భావ సమయం ఇది.

కుజ-రవి గ్రహాలు అగ్ని కి, చంద్ర-శుక్రులు జలానికి, బృహస్పతి ఆకాశానికి, బుధుడు పృధ్వీతత్వానికి, శని వాయువు కు, రాహు ఉగ్రవాదచర్యలకు కారకులు.

✤ జగల్లగ్నం, వర్షలగ్నం, తాజికం, గోచారం, కూర్మచక్రం, గ్రహణాలు మొదలైన వాటి ద్వారా గ్రహస్థితి-గతి-యుతి-దృష్టులను గమనించి ఫలాదేశం చేయవలసి ఉంటుంది.

✤ ప్రాచీన కాలంలో జ్యోతిష్కులు వీటిని గమనించి రాజ్య భవిష్యత్తు ను అంచనావేయడానికి ప్రయత్నించేవారు. రాజులతో దానాలు, యజ్ఞాలు, శాంతి కర్మలు నిర్వహించి దోషనివారణ ప్రయత్నాలు చేసేవారు.

శాంతి విధానాలు:-

✤ భౌమ, జల, వాయు, అగ్ని ఉత్పాతాలకు సంహితా గ్రంధాలలో చెప్పిన విధంగా ఆయా దేవతల శాంతి మంత్రాలు, హోమ, జప, దానాదులు చేయవలెను. ఉదాహరణకు:- అగ్ని సంబంధమైన అవాంతరాలు సంభవించినప్పుడు, పాలు ఇచ్చే చెట్లు (జిల్లేడు, రావి, మర్రి, మొదలైనవి) యొక్క సమిధలను అర్పించి, అగ్ని దేవునికి మంత్రాలు జపిస్తూ, ఆవాలు మరియు నెయ్యితో హవనాన్ని చేయాలి. బ్రాహ్మణులకు దక్షిణగా స్వర్ణదానం, అన్నదానం చేయవలెను.

✤ భౌమోత్పాతాలకు శాంతివిధానాల ద్వారా నివృత్తి జరుగుతుంది. అంతరిక్ష ఉత్పాతాలు కొంత మధ్యమ రూపంలో నివృత్తి చెందుతాయి, కానీ దివ్య ఉత్పాతాలకు శాంతి చేసినా కూడా శాంతినొందవు అనేది కొందరు జ్యోతిషాచార్యుల అభిప్రాయం. అయితే దివ్య ఉత్పాతాలను కూడా శాంతింపజేయడానికి సమృద్ధిగా అన్నదానం, స్వర్ణ దానం, భూదానం చేయడం, శివాలయంలో నేలపై ఆవు పాలు పితకడం మరియు అగ్నిలో కోటి ఆహుతులు సమర్పించడం ద్వారా శాంతింపచేయవచ్చు అని వరాహమిహిరుల వారి అభిప్రాయం.

ఈ విషయంపై వివరణలు ముఖ్యంగా బృహత్సంహిత, అద్భుతసాగరం, కశ్యప సంహిత, గర్గ సంహిత, భద్రబాహు సంహిత వంటి జ్యోతిష, ఆయుర్వేద గ్రంధాలలోనూ మరియు అగ్నిపురాణం, గరుడపురాణాలలో లభిస్తాయి.

డా. వై. వి. రాజ్యలక్ష్మి రావు



మన భరతభూమి వేదభూమి, జ్ఞానభూమి, కర్మభూమి, ధర్మభూమి, యోగభూమి, త్యాగభూమి. ఇంతటి పవిత్రమైన ఈ ధరిత్రిలో జన్మించిన ప్రతి ప్రాణి హృదయంలో ధర్మకర్తలయందు సహజంగానే శ్రద్ధాభక్తులు ఉండి ఉంటాయి. అందువల్లనే ఎక్కడో ఒకచోట ఏదో ఒక వ్యక్తి నోట పాపం, పుణ్యం ధర్మం-అధర్మం, న్యాయం-అన్యాయం అనే మాటలను తరచుగా వింటూ ఉంటాం. వీటి శబ్దార్థాలు గానీ, వాటి ఉపయోగాలుగానీ, వాటి వినియోగాలు గానీ బొత్తిగా తెలియనివారి నోట కూడా ఈ మాటలు వింటూ ఉంటాము. మన దేశంలోని ప్రతి ప్రాణిలోనేగాక, జడములైన తరులు, గిరులు, ఝరులు, నేలలు, సమస్తము వైదిక సనాతనధర్మంచేత ప్రభావితమై భావించడమనే ఉత్తమ సంస్కారం యొక్క ప్రభావమే ఇందుకు ప్రబలమైన కారణంగా పేర్కొనవచ్చును.

సృష్ట్యాదిలో అపౌరుషేయములైన వేదములు ఆవిర్భవించినవి. సృష్టిధర్మాన్ని సంరక్షించడానికి గాను లోకహితమునకై అఖండ తపస్సంపన్నులైన ఋషి-మహర్షి మునీశ్వరులకు వేదమాత అనుగ్రహించింది. తద్వారా వారు వేదమంత్రాలను దర్శించి 'మంత్రద్రష్ట'లయ్యారు. తాము దర్శించిన మంత్రాలను మననం చేస్తూ తమ శిష్యులకు వారు అందించారు. గురువు ద్వారా ఎన్నో మంత్రాలను వారు తమ శిష్యులకు అందించారు. వారు వారి శిష్య ప్రశిష్యులకు అందించారు. ఈ విధమైన శిష్య ప్రశిష్య పరంపరాగతంగా వేదవిజ్ఞానములు పదిలంగా కాపాడ బడినవి. కాపాడుటమే గాక, లోక కళ్యాణమున ప్రజల అభ్యుదయమునకై వారు వేదమంత్రములను అనేక విధాలుగా వినియోగించారు. అంతేగాక, రాబోవు తరాలకు సులభంగా ఉపయోగపరచటానికై మరింత సరళీకరణము చేస్తూ ఇతిహాస, పురాణ, సంహితాది ధర్మశాస్త్రాది గ్రంథాలను రచించి మనకు అందించారు. ఈ విధంగా ఆనాటి నుండి ఈనాటివరకు వారసత్వంగా తమకు అందింపబడిన వేద మంత్రాలను, వైదిక ధర్మశాస్త్ర గ్రంథాలను నిరంతరాయంగా అధ్యయన అధ్యాపనల ద్వారా వైదికజ్ఞాన విజ్ఞానములను కాపాడినవారే "బ్రాహ్మణులు" అని పిలిచారు. ఈ బ్రాహ్మణులే ఈ జాతికి జీవనాడులుగా పేర్కొనవచ్చును. వైదిక సనాతన ధర్మపరిక్షణయే తమ

ఊపిరిగా తద్ద్వారా లోకహితమునకు, సమస్త మానవాళి శ్రేయః ప్రేయములకు అహర్నిశలు కృషిచేయుటయే తమ స్వధర్మంగా ఎంచుకొని యదృచ్ఛాలాభ సంతుష్టులై భగవదర్పణ బుద్ధితో తమ జీవనయాత్రను కొనసాగిస్తున్న వారు బ్రాహ్మణులు.

అయితే వీరిలో అర్చకులు, పురోహితులు, దైవజ్ఞులు (జ్యోతిష్కులు), ఆచార్యులుగా ఏర్పడినారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో, నగరంలో ఉండే దేవాలయాలకు అర్చకులుగా కొందరు ఉంటున్నారు. ఈ అర్చకులు తమ అర్చకత్వాన్ని నిర్వహిస్తూ మరొకవైపున ధర్మ పరిరక్షణార్థంగా దేవాలయానికి వచ్చే భక్త జనులకు ధర్మమార్గాన్ని నిర్దేశిస్తున్నారు. వీరు కేవలం ఆలయ ప్రాంగణమునకే పరిమితం అయ్యారు. ఆలయానికి వచ్చి తమకు కలిగిన ధర్మ సందేహాన్ని అడిగినవారికి మాత్రమే తమ సమాధానం ద్వారా వారికి ధర్మమార్గాన్ని నిర్దేశిస్తుంటారు ఈ అర్చకులు. ఇక రెండవ వర్గం వారు – తాము నివసించే గ్రామంలోగానీ, పట్టణంలో గానీ, నగరంలోగానీ ఉండే ప్రజలందరికి అతి చేరువగా ఉంటారు. వీరినే 'పురోహితులు' అన్నారు. పురము అంటే – నివసించే గ్రామం, నగరం అని అర్థంగా చెప్పవచ్చు. పురం అంటే శరీరం-దేహం అని మరొక అర్థం కూడా చెప్పబడింది. కావున పురమునకు హితమును, మేలును చేకూర్చువారు 'పురోహితులు'. వీరు చేపట్టిన వృత్తిని 'పౌరోహిత్యం' అని పేర్కొన్నారు.

"శాంతిక పౌష్టికాది కర్మసు పురోధీయత ఇతి పురోధాః – పురోహితశ్చ" అనగా శాంతి, పౌష్టికాది క్రియలయందు ముందర ఉంచబడేవారు. పురోహితుడు అని అమరకోశం వివరించింది. తాను ముందుండి కావలసిన వారికి శాంతి-పుష్టి కర్మలను శాస్త్రబద్ధంగా నిర్వహించే వారు పురోహితుడు అని మనం గ్రహించాలి.

సమాజంలో పురోహితుల పాత్ర చాలా గొప్పది. అది ప్రతిష్ఠాత్మకమైనది. తన చుట్టూరా నివసించే ప్రజలకు పురోహితుడు చాల దగ్గరగా ఉంటాడు. వృద్ధిపరమైన, అభ్యుదయకరమైన కర్మలన్నింటిని గూర్చి ధర్మశాస్త్రం నిర్దేశించిన విధానాలను వివరించుటకు, వాటిని చక్కగా ఆచరింపచేయడానికి ప్రధానమైన హితుడు, సన్నిహితుడు పురోహితుడే అని చెప్పాలి. పురమును అంటే ప్రజలను ధర్మమార్గంలో నడిపించగలిగినవాడే పురోహితుడు. వారికి ఏది హితమో? ఏది అహితమో? విడమరచి నచ్చచెప్పివారిని సరియైన ధర్మమార్గంలో నడిపించగలవాడే పురోహితుడు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు అనెడు చతుర్విధ పురుషార్థముల ఆచరణ ద్వారా వాటి ఫలాన్ని పొందగలిగే సరియైన మార్గాన్ని దిశా నిర్దేశం చేసి అందుకు తగిన సంస్కారాలను, శాంతి పౌష్టికాది క్రియలను జనులచేత చేయించ గలిగేవాడు పురోహితుడే కదా! ధర్మమును నిర్వహించుట ద్వారా అర్థకామాదులను సంపాదించుటకు తగిన ఉపాయాలను చెప్పుతూ తురీయమైన మోక్షమార్గమునకు సులువైన దారిని చూపే వాడే పురోహితుడు.

మానవాళి మనుగడకు ధర్మమే ప్రధానమైనది. **"ధర్మో విశ్వస్యజగతః ప్రతిష్ఠా"** – ధర్మము సమస్త జగత్తునకు ఆశ్రయభూతము అని శ్రుతి ప్రతిపాదించింది. దీనికి అనుగుణంగా వ్యాసవాల్మీక్యాది ఋషీశ్వరులు ధర్మలక్షణాలను వివిధ దృక్కోణాలనుండి వ్యాఖ్యానించారు. **"ధ్రియతే వా జనైరితి ధర్మిః"** – జనులచేత ధరింపబడేది ధర్మము; **"ధరతి లోకా నితి ధర్మః"** – లోకాలను ధరించేది ధర్మము అనే వ్యాసమునీంద్రుని నిర్వచనాలను నిఘంటుకారులు తమ గ్రంథాల్లో పొందుపరచినారు. **"లోకయాత్రార్థమేవ ధర్మస్య నియమః కృతః"** – లోకయాత్ర కొరకే ధర్మనియమము చేయబడినది. **"లోక సంగ్రహసంయుక్తం విధాత్రా విహితం పురా"** లోకసంగ్రహం కొరకు విధాత అనగా బ్రహ్మ ధర్మమును ఏర్పరచినాడని; **'ప్రభవార్థాయ భూతానామ్'** – ప్రజల అభివృద్ధి కొరకు **"భూత భవ్యార్థమే వహ"** – భూతముల ప్రాణుల హితము కొరకే, ఈ ధర్మ నిర్ణయం చేయబడిందని శ్రీ వేదవ్యాసమహర్షి చెప్పారు. దీన్నే **"లోక సంగ్రహమే వాపి సంపశ్యన్ కర్తు మర్హసి"** అని భగవద్గీతలో చెప్పబడింది. ఇహ పరలోకాల సుఖాలను సంపాదింపచేసేది ధర్మమే. అయితే అది అందరికీ ప్రియమును, అభ్యుదయాన్ని కలుగజేసేదిగా ఉండాలని చెప్పారు. ఇక్కడ ప్రత్యేకంగా **"అహింసార్థాయ భూతానామ్"** అని ప్రాణులకు ఏ విధమైన బాధ కలుగకుండుటయే దీని నిశ్చితార్థమని నొక్కి చెప్పారు. **"మర్యాదాయాం స్థితో ధర్మః" – "శమశ్చైవాస్య లక్షణమ్"** అనగా ప్రతి మనిషి తన మర్యాదను అనగా హద్దును

దాటకుండా ఉండడమే ధర్మమని, అది శమము వలన మాత్రమే పొందదగినదని సార్వకాలికము. సార్వజనీనము, సార్వదేశికము అయిన మరొక నిర్వచనాన్ని చెప్పారు. ఈ ధర్మాన్ని తరతమ భేదం లేకుండా అందరూ ఆచరించడానికి వీలుగా సులువైన మరొక సూత్రాన్ని ఈ విధంగా చెప్పారు – **"న తత్పరేషు కుర్వీత జానన న్న ప్రియ మాత్మనః" – "ఆత్మనః ప్రతికూలాని పరేషాం న సమాచరేత్"** అనగా నీకు అప్రియము – అనిష్టము అయినది, నీకు ఇబ్బందిని, బాధను కలిగించేదాన్ని నీవు ఇతరులపట్ల ఆచరించకూడదు అని సంగ్రహంగా చెప్పబడింది. "ఇతరులకు ఎటువంటి ఆయాసం కలుగకుండా జీవించడం నేర్చుకో" – అని అవతారవరిష్ఠులు. శ్రీపాండురంగాశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ యతివరభావానందభారతీ భగవత్పాదులవారు తరచుగా తమ అమూల్యమైన ఈ ఉపదేశవాక్యాన్ని ఉద్బోధించేవారు.

ధర్మానికి, అధర్మానికి పుణ్యం, పాపం అని మరో పేర్లు పెట్టి **"పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్"** – పరులకు సాయపడుట పుణ్యమనీ, ఇతరులను పీడించుట పాపమని సులువైన మాటలో తెలిపారు. ఈ మాటను ధర్మాచరణంలో అతి జాగ్రత్తగా తెలిపారు. ఈ మాటను ధర్మాచరణంలో అతి జాగ్రత్తగా గమనించి, ఆచరించదగిన అంశమని గుర్తించాలి. అందుకే భగవద్గీతలో –

ఏది చేయాలి? ఏది చేయకూడదు? అని తెలుసుకోవడానికి ధర్మశాస్త్ర గ్రంథములే ప్రమాణములు. శాస్త్రంలో చెప్పబడినదాన్ని బాగుగా విచారించి నీ కర్తవ్యకర్మలను ఆచరించవలెనని శ్రీభగవానుడు విస్పష్టంగా చెప్పాడు. ఈ మాటలన్నీ చెప్పడం ఎందుకంటే? ధర్మమార్గ నిర్దేశకులైన పురోహితులను గూర్చి ప్రాక్కథనంగా ధర్మాన్ని గూర్చి సంగ్రహంగా విచారణ ద్వారా వివరింపబడింది. అస్తు.

ఇక పురోహితులకు ఉండవలసిన లక్షణాలను గూర్చి వారు ఆచరించవలసిన ధర్మాలను గూర్చి అనేక శ్రుతి స్మృత్యాది ధర్మశాస్త్ర గ్రంథాలలో, పురాణేతిహాసాదులలో చాల చక్కగా స్పష్టంగా వివరింపబడింది. వాటిని గూర్చి సంక్షిప్తంగా తెలియచేయడానికి ప్రయత్నిద్దాం –

"సర్వతోధురం పురోహితం వృణుయాత్", "తస్య శాసనే వర్తేత" అనగా సర్వసమర్థుడైన వ్యక్తిని పురోహితునిగా నియమించుకోవాలి. అతడు చెప్పినట్లుగా రాజు – ప్రజలు అందరు నడచుకోవాలని బోధాయనధర్మసూత్రాలలో చెప్పబడింది. (ప్రథమప్రశ్నః – 20–18 సూత్రం 7–8).

పురోహితుడు విద్యావంతుడు, న్యాయపద్ధతిలో నడుచుకొనువాడు. ఒక తపస్వి కావలెనని గౌతమస్మృతిలో పేర్కొనబడింది. **"న హ వా అపురోహితస్య రాజ్ఞో దేవా అన్న మదంతి"** అని పురోహితుని గూర్చి ఐతరేయ బ్రాహ్మణంలో (40–1) చెప్పబడింది.

శ్రీ విష్ణు ధర్మోత్తర పురాణంలోని ద్వితీయ ఖండంలోని ఐదవ అధ్యాయంలో భార్గవరాముడు ప్రశ్నించిన మీదట పుష్కరుడు సమాధానంగా పురోహిత లక్షణాలను గూర్చి చాల చక్కగా వివరించాడు –

భార్గవరామ ఉవాచ –

రాజ్ఞా పురోహితః కార్యస్తథా మంత్రీచ కీ దృశః ।
మహిషీ చ తథా జ్యేష్ఠా తన్మమాచక్ష్వ పృచ్ఛతః ॥ 1

అనగా – రాజు గారి పురోహితుడు, మాత్రము ఎట్టివాడై యుండవలెను? పట్టమహిషి (జ్యేష్ఠభార్య) ఏ విధమైనదిగా ఉండాలి? తెలుపవలసినదని పరశురాముడు ప్రశ్నించగా పుష్కరుడు ఇట్లు చెప్పెను –

పుష్కర ఉవాచ –

అవ్యంగ లక్షణోపేత మనకూలం ప్రియం వదమ్ ।
అథర్వవేద విద్వాంసం యజుర్వేద విశారదమ్ ॥ 2

ద్వివేదం బ్రాహ్మణం రాజా పురోహిత మథర్వణమ్ ।
పంచకల్ప విధానజ్ఞం వరయేత సుదర్శనమ్ ॥ 3

నక్షత్రకల్పోవైతాన స్తృతీయ స్సంహితా విధిః ।
చతుర్థోంగిరసాం కల్పః శాంతి కల్పస్తు పంచమః ॥ 4

పంచకల్ప విధానజ్ఞం ఆచార్యం ప్రాప్యభూపతిః ।
సర్వోత్పాత ప్రశాంతాత్మా భునక్తి వసుధాంచిరమ్ ॥ 5

అనగా – పురోహితుని లక్షణాలను వివరిస్తూ పుష్కరుడిట్లు చెప్పెను. పురోహితుడు ఎట్టి అవయవ లోపము లేనివాడై చక్కని శారీరక లక్షణాలను కలిగినవాడై ఉండాలి. అనుకూలుడై, ప్రియంగా మధురంగా మాట్లాడువాడై యుండాలి. అథర్వణవేద పండితుడై యజుర్వేద పారంగతుడై

అనగా ద్వివేదియై ఉండాలి. అథర్వణవేదశాఖీయుడు కావాలి. పంచకల్పవిధానము ఎరిగినవానిని, సుదర్శనుడు అనగా చూడచక్కనివారుగా, మంచిచూపు అనగా సమదర్శిగా భవిష్యద్దర్శనమునకు సమర్థుడై ఉన్న వ్యక్తిని పురోహితునిగా వరింపవలెను. నక్షత్ర కల్పము, వైతానకల్పము, సంహితా కల్పము, అంగిరసాకల్పము, శాంతికల్పము అను ఈ ఐదు కల్పముల విధానమును పూర్తిగా తెలిసి వానిని ఆచార్యునిగా స్వీకరింపవలెను. తద్ద్వారా సమస్త ఉత్పాతమును, ఆది భౌతిక, ఆధి దైవిక, ఆధ్యాత్మిక రూపములైన ఆపదలను అధిగమించి రాజు ప్రశాంత మనస్కుడై చిరకాలము ఈ పుడమిని అనుభవించగలడు.

స చ రాజ్ఞస్తథా కుర్యాన్నిత్యం కర్మ స చైవతు ।
నైమిత్తికం తథా కామ్యం దైవజ్ఞ వచనే రతః ॥ 6

న త్యాజ్యస్తు భవే ద్రాజ్ఞా దైవజ్ఞేన పురోధసా ।
పతితస్తు భవే త్త్యాజ్యో నాత్ర కార్యా విచారణా ॥ 7

తథైవ పతితౌరామ! నత్యాజ్యౌతౌ మహీభుజా ।
తయోస్త్యాగేన రాజేంద్ర రాజ్యభ్రంశో వినిర్దిశేత్ ॥ 8

దుర్గతిః పరలోకే చ బహుకాల మసంశయమ్ ।
సాంవత్సర విరుద్ధస్తు త్యాజ్యో రాజ్ఞా పురోహితః ॥ 9

పురోహితోఽన్యథా రాజ్ఞో యథా మాతా యథా పితా।
అనిష్టమన్య వ్యసనం హన్యాద్దైవోపఘాతజమ్ ॥ 10

బ్రాహ్మణో నిష్కృతిస్తస్య కుత్ర శక్యా మహీభుజా ।
యావన్నరాజ్ఞా విద్వాంసౌ సాంవత్సర పురోహితౌ ॥11

వృత్తేచ్ఛేదే తమోరాజ్ఞః కులం త్రిపురుషం వ్రజేత్ ।
నరకం వర్జయేత్ తస్మాత్ వృత్తిచ్ఛేదం తయోస్సదా ॥12

స్థావరేణ విభాగశ్చ తయోః కార్యో విశేషతః ।
అనురూపేణ ధర్మజ్ఞైః సాంవత్సర పురోహితా ॥ 13

భావ్యం సదా భార్గవ వంశచంద్ర! పురోహితస్యాత్మ సమస్యరాజ్ఞా ।
రాజ్ఞో యథాపి స్వజనేన భావ్యో, విద్వాన్ ప్రభుస్స్యాన్నృపతేః పురోధాః ॥ 14

అనగా - ఎల్లప్పుడు ఏయే వేళల యందు రాజు చేయవలసిన నిత్య నైమిత్తిక కామ్యకర్మలుండునో, వాటినన్నింటినీ దైవజ్ఞుని మాటపై దృఢ విశ్వాసముంచి ఆచరింపవలెను. దైవజ్ఞుడు, పురోహితుడు అను ఈ ఇరువురిచేత రాజు ఎన్నడు కూడా పరిత్యక్తుడు కాకూడదు. ఒకవేళ వారిచే త్యజింపబడినవాడైనచో ఆరాజు తప్పక పతితుడు అనగా రాజ్యభ్రష్టుడైపోవును. ఇక్కడ ఈ విషయంలో మరి వేరే విచారం లేనేలేదు. రాజుగూడ వారిని స్థానభ్రష్టులను చేయరాదు. వారిని విడిచిపెట్టకూడదు. వారిని పదవీచ్యుతులను చేయుటవలన అతనికి రాజ్యభ్రంశము తప్పదు. పరలోకమునందు బహుకాలమువరకు దుర్గతి పాలగుట తథ్యము. సాంవత్సర అనగా జ్యోతిష్కుని విరుద్ధుడయిన పురోహితుడిని రాజు విడువవచ్చును. పురోహితుడు తల్లి - తండ్రి వంటివాడు. రాజునకు సంఘటించిన అనిష్టమును, వ్యసనమును, దైవోపఘాతము వలన వచ్చిన దేనికైనను పురోహితుడు నివారింపగలడు. దాని నిష్కృతికి బ్రాహ్మణుడే - పురోహితుడే కావలయును. అతడు తప్ప అందుకు మరెవరనూ శక్తులు కారు. దానిని పరిష్కరించుటకు అతడు గాక రాజునకు మరొకదారిగాని, వేరొకరి దిక్కుగాని లభింపదు. కావున రాజస్థానమునందు జ్యోతిష్కుడు, పురోహితుడు అను ఇరువురు మహా విద్వాంసులు ఉండి తీరవలెను. వారి వృత్తికి భంగము కలిగించిన యెడల త్రిపురుష పర్యంతం అనగా ఆరాజు గారి మూడు తరములకు చెందిన వారు నేరుగా నరకము పాలయ్యెదరు. కావున, వారికి ఏనాడూ వృత్తి భంగము చేయరాదు. పైగా వారికి విశేషించి స్థావరమును కల్పించి - భూమి, గృహము అగ్రహారాదులను సమరూపంగా ఏర్పాటు చేయవలెను. ఓ భార్గవవంశచంద్రమా! రాజునకు ఆత్మసమానుడు పురోహితుడు అతనిని స్వజనములోని వాడుగా, తన కుటుంబ సభ్యునిగా భావించవలెను. ప్రభువునకు కూడా ప్రభువు పురోహితుడు అని ఈ విధంగా పురోహితుని లక్షణములను గూర్చి విష్ణుధర్మోత్తర పురాణమునందు వివరింపబడినది. అయితే పురోహితుడు అథర్వణ విద్వాంసుడే ఎంచుకోవాలి? ద్వివేదిగా ఉండాలని ఎందుకు చెప్పబడింది. అనే మాటకు **"పౌరోహిత్య మీమాంసా"** అను గ్రంథంలో మన తెలంగాణా రాష్ట్రానికే ఒకనాడు తలమానికంగా నిలిచిన మహావిద్వాంసులు శ్రీ శాస్త్రుల విశ్వనాథశాస్త్రి గారు 8, 9 పుటలలో చక్కగా వివరించినారు -

అథర్వణ వేదమును చక్కగా అధ్యయనం చేసిన విద్వాంసుడు దానికి సంబంధించిన దశభేదాలను తెలియ గలరు. కౌశిక, కైతాన, నక్షత్ర, ఆంగిరస, శాంతి కల్పముల సూత్రాలకు పెక్కు ఇతర రహస్య విద్యలను ఎన్నింటినో తెలిసి సమర్థవంతంగా వాటిని వినియోగించగలడు.

"తత్ర సాకల్యేన సంహితా మంత్రాణాం శాంతిక పౌష్టికాదిషు కర్మసు వినియోగవిధానాన్ సంహితా విధిర్నామ కౌశికం సూత్రమ్. తదేకమేవ ఇతరస్సూత్రైరుపజీవ్యత్వాత్ ప్రధానంచ. కౌశిక సూత్రాదితాని అథర్వవేద ప్రతిపాద్యాని సంతి. పరస్సహస్రకర్మాణి పురోహితైర్ బ్రాహ్మణైః జగచ్ఛ్రేయసే

పురోహితుడు ఎంతటి గొప్పవారో, అతడు నిర్వహించే ధర్మకర్మలు ఎంతటి మహత్తరమైనవో లోకంలో రాజులను, రాజ్య ప్రజలను తాను ఏయే విధంగా ఎన్ని రకాలుగా రక్షింపగలరో, దేశహితమును గోరి అన్ని విధాల సంపదలను ఇతోధికవృద్ధి సాధించుటకు, దేశము యొక్క పురోగతికి, శాంతికి తగు సాధనములను వినియోగించి, సమగ్ర అభివృద్ధికి ఏ విధంగా పాటుపడగలడో పైన చక్కగా వివరింపబడినది. ప్రజలు, రాజ ధర్మమార్గంలో నడవడానికి తగు మార్గాలను నిర్దేశించగలడు పురోహితుడు. స్వీయ అనుష్ఠానాదులద్వారా లోకశ్రేయస్సునకు పాటుపడగలడు. గ్రామము, నగరము, రాష్ట్రము, దేశము యొక్క సమస్త అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యాలను శాస్త్రీయంగా నిర్వహించగలడు తద్వారా పుత్ర సంపద, పశు సంపద, ధనధాన్య సంపద, స్త్రీ సంపద మొదలగు వాటి వృద్ధికి, రక్షణకు వారి మధ్య ఐకమత్య సాధనకు కృషి చేయగలడు. రాజు లేదా దేశపాలకుల విజయాన్ని గూర్చి, వారి శత్రు పక్షముల వారిని నిర్వీర్య పరచుటకు సిద్ధహస్తుడై యుండగలడు.

సంధ్యా స్నానం జపోహోమః దేవతాతిథి పూజనమ్।

ఇవన్నీ బ్రాహ్మణునకు నిత్యము అనుష్ఠింపవలసిన విహితములైన ధర్మకర్మలుగా విధింపబడినవి. ఇవిగాక, యజనయాజన, అధ్యయన-అధ్యాపన, దాన-ప్రతి గ్రహములు షట్‌కర్మలు, షట్‌ధర్మాలుగా చెప్పబడినవి. ఇందులో విశేషంగా స్నాన సంధ్యలనేవి నిత్యము చేయవలసిన విహితకర్మలు ఇక మిగిలిన యాజన, అధ్యాపన, ప్రతి గ్రహములనెడు కర్మలు మరియు -

శమోదమ స్తపః శాచం క్షాంతిరార్జవ మేవ చ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥

శమము - అంతఃకరణ నిగ్రహము, ధమము - ఇంద్రియములను వశమునందుంచుకొనుట, ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టాలను సహించుట, బాహ్య భ్యంతరముల శుచిత్వము, ఇతరుల అపరాధములను క్షమించుట. ఋజు మార్గ జీవనము, వేదశాస్త్రములయందు, ఈశ్వరునియందు, పరలోకాదులందును విశ్వాసమును కలిగి యుండుట, వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము, పరతత్త్వానుభవము - ఇవన్నీ బ్రాహ్మణుల స్వాభావిక కర్మలుగా భగవద్గీతలో వివరింపబడినవి.

పైన చెప్పబడిన నిత్య విహితములైన ధర్మకర్మలను బ్రాహ్మణ పురోహితులు తప్పకుండా అనుష్ఠింపవలెను. తాము అనుష్ఠించినప్పుడే ఇతరులకు మార్గనిర్దేశకులుగా మన్నన పొందెదరు.

యద్యదా చరతిశ్రేష్ఠః తత్తదేవేతరో జనః।
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥
(గీత 3-21)

శ్రేష్ఠుడైన పురుషుడు ఆచరించిన దానినే ఇతరులు అనుసరించెదరు. అతడు నిల్పిన ప్రమాణములనే లోకులం దరును ఆచరించెదరు. పురోహితుడు వైదిక ధర్మకర్మలను చక్కగా పాటించెదరు గాక! తమ ఆచరణయే జనులకు ప్రేరణాత్మకములుగా, ఉపదేశ ప్రదములుగా నిలవాలి. అప్పుడు తాను వేరే ఉపదేశించవలసిన పని ఉండదు గాక ఉండదు.

పురోహితులు, అర్చకులు, ఆచార్యులు, దైవజ్ఞులు అని వ్యవహరింపబడే వారందరిలోకెల్ల జనులకు అతి చేరువగా చేరి వారికి నచ్చిన రీతిలో ధర్మాన్ని గూర్చి తనదైన శైలిలో చెప్పి ఒప్పించి, ఆచరింపచేయగల నిపుణుడు నేర్పరి ఒక్క పురోహితుడే. ప్రజలను ధర్మమార్గంలో నడిపించుటకు తగు సమర్థులు పురోహితులు మాత్రమే అని ఖచ్చితంగా చెప్పవచ్చును. అయితే పురోహితులు ఇంతకుముందు చెప్పినట్లుగా వేదశాస్త్ర పురాణ ఇతిహాసాది గ్రంథాలను చక్కగా అధ్యయనం చేసినవారై ఉండాలి. వైదిక సదాచార సంపన్నులై ఉండాలి. ఆచారవంతుడు సహజంగానే సమాజం ద్వారా

ఆదరింపబడును. **"ఆచారః ప్రభవో ధర్మః ధర్మస్య ప్రభు రచ్యుతః"** అని శ్రుతి వచనం అందరికీ తెలిసిందే కదా!

కావున వైదికాచార సంపన్నుడై, ధర్మకర్మలను చక్కగా అనుష్ఠించునట్టి పురోహితుడే ధర్మమార్గ నిర్దేశకుడు కాగలడు. అతడేది నిర్దేశించునో, దానినే జనులందరు విశ్వసించి ఆ మార్గమునే అనుసరించెదరు. **"యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరోజనః। స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే" (4-21)** అని గీతలో శ్రీ భగవానుడు చెప్పిన మాట ఇక్కడ స్మరించదగినదని పేర్కొనబడినది. సమాజమును సువ్యవస్థితము చేసి ప్రజలను ఋజు మార్గంలో నడిపించ గల వ్యక్తి పురోహితుడే అని నిర్ద్వంద్వముగా చెప్పవచ్చును. అయితే ఇక్కడ ఒక ముఖ్యాతి ముఖ్యమైన మాటను మరువకూడదు.

"రాజా రాష్ట్రకృతం పాపం రాజ పాపం పురోహితః" (విందతీతి శేషః) - దేశ ప్రజలు చేసిన పాపం రాజుకు అనగా ప్రజాపరిపాలకులకు చుట్టుకుంటుందట. ఇక రాజు లేదా పరిపాలకులు చేసిన పాపం పురోహితునకు చుట్టుకుంటుందని శ్రీరామాయణ సేతు వ్యాఖ్యానకర్త అంటారు. ఇత్యాది శాస్త్ర వచనములను అనుసరించి పౌరోహిత్యమును సమస్త మానవాళి అభ్యుదయమునకై పురోహితులు నిర్వహించెదరు గాక!

ముగింపుగా మరొక ముఖ్యమైన రెండు మాటలు ప్రస్తావిస్తాను. వర్తమానకాలంలో ఎన్నియో వేదపాఠశాలలు వెలసినవి. వేదవిద్యను అభివృద్ధి పరచడానికి ఎన్నియో సంస్థలు, ఎందరో మహానుభావులు, ఎందరో వదాన్యులు కృషిచేయుచున్నారు. ఎందరో విద్యార్థులు స్మార్తవిద్యను పూర్తి వేదభాగమును, రెండేసి వేదములను బహుశ్రద్ధగా అధ్యయనం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేదాధ్యయనమునకై చక్కగా ప్రోత్సహిస్తున్నారు. ఇదంతా సంతోషింపదగినదే గాక మిగుల అభినందనీయం కూడా అయితే సదాచారము లోపిస్తున్న మాట పెద్దలందరూ గమనిసున్నదే ఇదొక బాధాకరమైన అంశం. దానినే ఇచట ప్రస్తావించడానికి ప్రయత్నిస్తున్నాను. పఠితలు నన్ను క్షమింతురుగాక!

1. వైదిక కార్యకలాపములను నిర్వహిస్తున్నప్పుడు ప్యాంటు, షర్టు వేసుకోకుండా అఖండ వస్త్రమైన ధోవతిని, ఉత్తరీయమును తప్పక ధరించాలి. కేవలం నిర్వాహకులే కాకుండా పాల్గొనేవారు కూడా ఈ నియమాన్ని పాటించాలి.

2. నిలబడి భోజనం చేయకుండా, ప్యాంటు, షర్టులు, చెప్పులతో భుజించుట పనికిరాదు. బ్రాహ్మణులందరూ ఈ సదాచారాన్ని విధిగా పాటించాలి.

3. స్మృతయశ్చ భిన్నా మతయశ్చభిన్నా ... అని ఏనాడో చెప్పబడింది. కావున, అతడు చెప్పింది తప్పు. నేను చెప్పిందే ఒప్పు. ఇదే సరైన పద్ధతి. దీన్నే ఆచరించాలి. అతడికేమి తెలుస్తుంది. అనే మాటలు వాడకుండా ఉండాలి. ముఖ్యంగా వేదికలపైన, పదిమందిలో పల్కడం అంత సులువైనది కాదు. తమను తామే కించపరచుకోవడం వంటిదని గమనించ ప్రార్థన.

4. పురోహితులు చేయించే వైదిక కార్యాలలో వివాహాది శుభ కార్యాలలో, ప్రతిష్ఠాపనాది ఉత్సవాదులలో పాల్గొనడానికి, దర్శించడానికి వచ్చే జనావళికి బొట్టు, కట్టు, జుట్టు మొ॥ ఉత్తమ సంస్కారాలను గూర్చి, వైదిక ధర్మాన్ని గూర్చి బోధించాలి. సనాతన ధార్మిక భారతీయతను పోషించాలను మంచిమాటలతో నచ్చ చెప్పాలి.

5. కార్యక్రమాలల్లో విరామం ఉన్నప్పుడు, అనువైన సమయం దొరికినప్పుడు తప్పనిసరిగా సనాతన ధర్మాన్ని గూర్చి, దాని విశిష్టతను గూర్చి, ధర్మాచరణ వలన కలిగే ప్రయోజనాలను, ధర్మ ప్రభావాన్ని తత్ ప్రాభవాన్ని తెలియచెప్పే ప్రయత్నం చెయ్యాలి. అని నా ప్రత్యేక అభ్యర్థన.

ఓమ్ స్వస్తి ॥ శేషం భగవత్కృప.

"యతో ధర్మస్తతో జయః"

"యత్ర యోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః।
తత్రశ్రీర్విజయో భూతిః ధ్రువానీతిర్మతిర్మమ ॥"
(గీత 18.78)

మదునూరి వెంకటరామశర్మ



భారతీయుల సంస్కారాలలో వివాహ సంస్కారానికి చాలా విశిష్టమైన స్థానం కల్పించబడింది. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలలో గృహస్థాశ్రమం శ్రేష్ఠతరమైనదిగా సంభావించబడుతున్నది.

సర్వేషామపి చైతేషాం వేద స్మృతి విధానతః ।
గృహస్థ ఉచ్యతే శ్రేష్ఠః సత్రీనేతాన్ బిభర్తిహి ॥

వేదము, ధర్మశాస్త్రము అనుసరించి గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన వ్యక్తియే శ్రేష్ఠుడు. అతడే మిగిలిన మూడు ఆశ్రమాల వారిని భరించేవాడు అని మనుస్మృతి గృహస్థాశ్రమ విశిష్టతని తెలియపరుస్తున్నది. అదే విధంగా భారత రామాయణాదులు కూడా గృహస్థాశ్రమ వైభవాన్ని కీర్తిస్తున్నాయి.

స్త్రీ పురుషుల వైవాహిక జీవితము ఐహిక సుఖ శాన్తులకు, ఆముష్మిక ఉన్నతికి ఆలంబనమే కాకుండా, బాధ్యతాయుతమైన సామాజిక జీవనానికి కూడా ఆధారభూతమౌతున్నది. ఇలాంటి వైవాహిక జీవనముపై ప్రధానంగా ప్రభావం చూపించే దోషం కుజదోషం. భార్యాభర్తలలో ఎవరికైనా ఈ దోషం ఉంటే తద్వారా వారి వైవాహిక జీవనంపై ప్రభావాన్ని చూపించి ఇబ్బందులకు గురి చేస్తుంది. కుజదోషం యొక్క ముఖ్య లక్షణము, లక్ష్యము ఇదే. అదే విధంగా ఆలస్య వివాహాలు, వివాహాలు తప్పిపోవడం, వివాహమైన వారికి గొడవలు సంభవించడం, అశాంతి, కుజదోషం తీవ్రతరంగా ఉంటే ప్రాణాంతకమైనదిగా అది దారి తీస్తుంది. ఇలా వైవాహిక జీవనంపై ప్రభావాన్ని కుజ దోషం ద్వారా చూపించే గ్రహం కుజుడు. మరే ఇతర గ్రహాలకి ఈ అధికారం లేదు. ఇలా ఓ ప్రత్యేకమైన అధికారం కలవాడు కుజుడు.

నవగ్రహాల వరుసలో ఈయనది మూడవ స్థానం. కుజునికి భౌముడని, మంగళుడని, అంగారకుడని మొదలైన నామాన్తరాలు మనకు కనిపిస్తాయి. 'కు' అంటే భూమి, 'జ' అంటే పుట్టినవాడు. అంటే భూకుమారుడని అర్థం. ఈయన జననం గురించి పురాణాలలో ఇలా చెప్పబడింది. సతీదేవి వియోగంతో తప్తుడైన శంకరుని దేహం నుండి జాలువారిన స్వేదబిందువు భూమిపై బడి మగ శిశువుగా మారింది. ఆ పిల్లవాడిని భూదేవి పుత్రభావంతో స్వీకరించింది. ఈ విధంగా కుజుడు భూమి పుత్రుడయ్యాడు అని పద్మపురాణం, స్కాందపురాణాలలో చెప్పబడింది.

బ్రహ్మవైవర్త పురాణంలో కుజుడు విష్ణుమూర్తి వలన భూదేవికి పడగరూపంలో విడిచిన బీజమువలన జన్మించాడని చెప్పబడింది. అందుకే కాబోలు కుజుని ప్రీతికై పగడాన్ని దానం చేయడం, పగడపు ఉంగరాన్ని ధరించడం జరుగుతున్నది. మరొకచోట విష్ణు స్వేదం నుండి లోహితాంగుడైన పుత్రుడు భూదేవికి జన్మించాడని, ఆ పిల్లవాడు బ్రహ్మకోసం తపస్సు చేసి గ్రహమయ్యాడని పేర్కొనటం జరిగింది.

అలా కుజుడు జన్మించింది అక్షయనామ సంవత్సరంలో భాద్రపద (వైశాఖ / ఆషాఢ) శుక్ల ద్వితీయ (చతుర్దశీ) పూర్వఫల్గుణి నక్షత్రంలో జన్మించాడు. కుజునిది భారద్వాజస గోత్రం, సామవేదీయుడు.

ఎర్రని రంగు కల కుజుడు నాలుగు భుజములతో, ఎర్రటి వస్త్రం, ఎరుపు రంగు మాలికను, చేతిలో శూలాన్ని, శక్తి ఆయుధాన్ని ధరించి, అజవాహనారూఢుడై విరాజిల్లుతుంటాడు. కాల పురుషుని అంగాలలో శిరస్థానమైన మేషరాశికి, జననాంగ స్థానమైన వృశ్చికరాశి కుజుడు అధిపతి. కుజుడు ఉచ్ఛస్థానం మకరం, నీచస్థానం కర్కటకం.

తీవ్రక్రోధ స్వభావం కల కుజుడు మానవులు ఆరోగ్య, యుద్ధ, భూవనరులు, ఋణబాధలు, సోదర కలహాలు, భార్యాభర్తల సంబంధాలు మొదలైన వాటికి కారకుడుగా పేర్కొనబడుతున్నాడు. ఈ వివరాన్ని అంతా సంగీత కర్నాటక త్రయంలో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షితులు ఇలా తమ కీర్తనలో శ్లాఘించారు –

ప ॥ అంగారక మాశ్రయామ్యహం వినతాశ్రితజనమందారం।
మంగళవారం, భూమి కుమారం వారం, వారం ॥

అ ॥ శృంగారక మేష వృశ్చిక రాశ్యధిపతిం ।
రక్తాంగం, రక్తాంబరాది శక్తి శూలధరం ॥

మ॥సా॥ మంగళం, కంబుగళం మంజులతరపదయుగళం।
మంగళదాయక మేషతురంగం మకరోత్తుంగం ॥

చ॥ దానవ సురసేవిత మందస్మిత విలసితవక్త్రం
ధరణీప్రదం, భ్రాతృకారకం రక్తనేత్రం
దీనరక్షకం, పూజితవైద్యనాథక్షేత్రం
దివ్యోఘాది గురుగుహ కటాక్షానుగ్రహపాత్రం ॥

మ॥సా॥ భానుచంద్రగురుమిత్రం భాసమాన సుకళత్రం
జానుస్థ హస్తచిత్రం చతుర్భుజ మతి విచిత్రం ॥

అని

కుజగ్రహం యొక్క అనుగ్రహం లేనిదే దంపతులు సౌఖ్యాలను పొందలేరని చెప్పబడుతున్నది. గ్రహరాజ్యంలో సైన్యాధిపతిగా (మనమే కాదు పాశ్చాత్యులు కూడా కుజుని యుద్ధదేవతగా మహాక్రూరునిగా భావిస్తారు. అలా భావించిన వారిలో రోమన్లు ఒకరు. వారు కుజుని మార్స్ అని అంటారు. ఆ పేరే కుజగ్రహానికి స్థిరపడింది. ఈ మార్స్ రోములస్ మరియు రోమస్‌ల పుత్రుడు. ఈ మార్స్ పదం నుంచే మార్చ్ నెల ఏర్పడింది. గ్రీకులు కుజుడిని 'ఏరిస్' అని అంటారు. దేవరాజు జూస్ యొక్క కుమారుడు ఈ 'ఏరిస్' ఆంగ్ల శాక్జన్ భాషలో కుజుడిని 'ట్యూస్' అని పిలుస్తారు. ఈ పదం నుండే ట్యూస్‌డే ఏర్పడింది.

సూర్యుని నుండి నాల్గవ గ్రహమైన కుజుని వారు ఎర్రటి గ్రహంగా పిలుస్తారు. కుజునిపై పరిశోధనలు చేసినవారు కుజ గ్రహంపై ఉండే మట్టి మొదలైనవి ఎరుపు రంగుతో ఉంటాయని పేర్కొంటున్నారు. ఏ వ్యోమ నౌకల సాయం లేకుండానే భారతీయ ప్రాచీన మహర్షులు, జ్యోతిషశాస్త్రవేత్తలు ఏనాడో విషయాన్ని తెలియజేశారు. పాశ్చాత్యులు మహిని చూచారు, మనము మహిమను చూశాము అదే తేడా. సర్వుల చేత సర్వశక్తిమంతునిగా భావించబడే కుజుని గురించిన క్లుప్త వివరాలు.

ఇంతటి శక్తి సంపన్నత కలిగిన కుజగ్రహం వలన ఏర్పడే దోషమే కుజదోషం. పురుష జాతకచక్రంలో గాని స్త్రీ జాతకచక్రంలో కాని 'ల' అని ఉంటుంది. అది ఏ రాశిలో ఉంటుందో అది వారి లగ్నం అవుతుంది. ఉదాహరణకి జాతకచక్రంలో వృషభరాశిలో 'ల' ఉంటుంది అది వారి లగ్నమని గమనించాలి. ఈ లగ్నాన్నే కేంద్రబిందువు చేసుకుని ఫలితాలు నిర్ణయించబడతాయి. అలానే కుజదోషం కూడా పరిగణించబడుతుంది.

కుజదోషం ఉన్నదని ఎలా చెప్పవచ్చు? అంటే **"ధనేవ్యయే పాతాళే జామిత్రే చాష్టమే కుజే"** అన్న ప్రమాణాన్ని

అనుసరించి జాతకచక్రంలో లగ్నం నుండి ద్వితీయస్థానంలో, చతుర్థస్థానంలో, సప్తమస్థానంలో, అష్టమ స్థానంలో, ద్వాదశ స్థానంలో కుజుడు ఉంటే దాన్ని కుజదోషము అని అంటారు. ఈ కుజదోషం వధువుకంటే వరునికి ఇబ్బంది కలుగుతుందని చెప్పబడింది.

అయితే కొన్ని జ్యోతిష గ్రంధాలలో ఇప్పుడు మనం చెప్పుకున్న 2, 4, 7, 8, 12, స్థానాలలోనే కాక మరికొన్ని స్థానాలలో ఉన్నా కుజదోషము కలుగుతుందని వర్ణించబడింది. కేరళీయ భావదీపికలో లగ్నేవ్యయే చ పాతాళే అని, తను ధనసుఖం అంటూ భావరత్నాకరంలోను, **"అంగ మారమృతమంగలం తథా"** అని జ్యోతిర్విదాభరణంలోను లగ్నంలో కుజుడు ఉంటే అది కుజదోషమని అభివర్ణించబడింది.

అదే విధంగా దేవకేరలలో ధనసుతసప్త్య అంటూ పంచమస్థానంలో కుజుడు ఉన్నా అది కుజ దోషమే అని, భావరత్నాకరంలో **"ముదనాయిర్లాభవ్యయదః"** అని పదకొండవస్థానంలో కుజుడు ఉన్నా అది కుజ దోషమే అని చెప్పబడింది. కాని ఎక్కువగా వాడకంలో మాత్రం 2, 9, 7, 8, 12 భావాలే ఉన్నాయి.

కుజదోష పరిశీలన చంద్రశుక్రుల నుండి

ఇది ఇలా ఉంటే కుజదోషాన్ని లగ్నం నుండే కాక చంద్రుడి నుండి, అలాగే శుక్రుని నుండి కూడా చూడాలని చెప్పబడ్డాయి. నారద సంహితలో **"స్త్రీ పుంసోర్జన్మకాలే వ్యయధనహిబుకే మ్యానలగ్నాష్టమస్థో । భౌమో మృత్యు ప్రదస్యాదథ భృగుజివశాత్ కేచిదాహుశ్చ చంద్రాత్"** అని కొంతమంది లగ్నం నుండే కాక, శుక్రుడున్న స్థానం నుండి చంద్రుడున్న స్థానం నుండి కుజదోష పరిగణనను చేయాలని చెప్పారని అభివర్ణించబడింది.

అదే విధంగా బృహత్పరాశరహోరాశాస్త్రం స్త్రీ జాతక ఫలాధ్యాయములో పతిఘాతక యోగం గురించి చర్చిస్తూ-

పాతాళేఽపి తనౌ రంధ్రే జామిత్రే వాపి చవ్యయే ।
స్థితః కుజః పతిం హన్తి నచేచ్ఛు భయుతక్షితః ॥
ఇందోరప్యుక్త గేహేషు స్థితో భౌమోధవాశనిః ।
పతిహంతా స్త్రియాంశ్చైవం వరస్య యది స్త్రీ మృతిః ॥

అని చంద్రుని నుంచి కుజుడు 1, 4, 7, 8, 12 లందు వధువుకంటే వరునికి, వరునికుంటే వధువుకు ఇబ్బంది కలుగుతుందని వివరింపబడింది.

ఈ విధంగా పై ప్రమాణాదులను బట్టి చూస్తే శుక్ర చంద్రుల నుండి కూడా కుజదోషాన్ని పరిగణించాలన్న విషయం స్పష్టమౌతున్నది. కాని అధికశాతం లగ్నం నుండే కుజదోషము పరిగణన చేయబడుతున్నది. **"లగ్నమేవ ప్రశంసంతి గర్గనారద కశ్యపాః"** అన్న ప్రమాణాలు బట్టి కూడా లగ్నం నుండే కుజదోషం పరిశీలించాలని చాలా మంది భదన్తుల వదంతి.

అయితే వాడుకలో జన్మలగ్నం నుండి 50 పాళ్ళు, చంద్రుని నుండి 33 పాళ్ళు, శుక్రుడి నుండి 17 పాళ్ళు కుజదోషం పరిగణించాలని వివాహార్థ ప్రకాశిక చెబుతున్నది.

బలీలగ్నేందు శుక్రేషు యః స్యాత్ రాశీశ్వరశ్చయః ।
కళత్రభావం తన్నాశం జ్ఞాత్వా ఫలముదీరయేత్ ॥

జన్మలగ్న, చంద్రలగ్న, శుక్రలగ్నములలో బలీయమైన లగ్నమును నిర్ణయించుకుని కూడా ఫలితం చెప్పమని నారద సంహిత అంటున్నది.

ఇప్పటివరకు ఏయే స్థానాలలో కుజుడు ఏ దోషమో చర్చించుకున్నాం, ఇప్పుడు కుజదోషానికి చెప్పిన పరిహారాలను కూడా ఓసారి ముచ్చటించుకుందాం.

కుజదోషం లేని నక్షత్రాలు :-

తిష్యశ్రవణమైత్రాణి శీర్షే స్వాతీచ రేవతీ
ఉత్తరాత్రయ ఆదిత్యే అశ్విన్యాం చైవ వారుణే ।
ఏవం ద్వాదశ ఋక్షేషు కుజదోషోనవిద్యతే ॥

అశ్విని, మృగశిర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, ఉత్తర, స్వాతి, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణ, ఉత్తరాభాద్ర, రేవతి ఈ నక్షత్రాలలో జన్మించిన వారికి కుజదోషముండదు అని దైవజ్ఞ సంపూర్ణచంద్రిక, వివాహార్థ ప్రకాశికలాంటి గ్రంథాలు తెలియచేస్తున్నాయి. (ఈ విషయంపై అధ్యయనం ఎంతైనా అవసరం).

అలాగే కొన్ని చోట్ల గుణాలతో కూడా పరిహారం, కుజదోషపరిహారం అవుతుందని చెప్పడం జరిగింది. గుణసంఖ్య మొత్తం 36, 18 లేదా అంతకంటే ఎక్కువ

గుణాలు వచ్చిన వారికి కుజదోషం పరిహారమవుతుందని, దానికంటే అంటే 18 కంటే తక్కువ వస్తే కుజదోషపరిహారం కాదని ఇలా చెప్పారు.

- **రాశిమైత్రం యదాయాతి, గుణైక్యం వా యదాభవేత్।**
  అథవా గుణబాహుళ్యే, భౌమదోషో న విద్యతే ॥
- **ఏవం విధే కుజే చైవ వివాహోనకదాచన ।**
  కార్యోవా గుణబాహుళ్యే, కుజే చతాదృశేద్వయోః ॥
- **భౌమతుల్యోయదాభౌమః, పాపోవాతాదృశేభవేత్ ।**
  ఉద్వాహ శుభదః ప్రోక్తః, చిరాయుః పుత్రపౌత్రదః ॥

ఇలా గుణసంఖ్యతో కుజదోష పరిహారం చెప్పబడింది.

ఇదే విధంగా ఇందాక చెప్పుకున్నాం కదా లగ్నం నుండి 2, 4, 7, 8, 12 స్థానాలలో కుజుడుంటే కుజదోషము. ఈ స్థానాలకు కూడా కుజదోష పరిహారం చెప్పబడింది.

ద్వితీయే భౌమదోషస్తు యుగ్మకన్యకయోర్వినా ।
ద్వాదశే భౌమదోషస్తు వృషతౌళికయోర్వినా ।
చతర్థే భౌమదోషస్తు మేషవృశ్చికయోర్వినా ।
అష్టమేభౌమదోషస్తు ధనుర్మీనద్వయం వినా ।

మిథునరాశి కన్యారాశి రెండోస్థానమై అందులో కుజుడు ఉంటే కుజదోషం లేదు. అదే విధంగా పన్నెండవ స్థానం వృషభతులలైనా, నాల్గవస్థానం మేషవృశ్చికములైనా, ఏడవస్థానం మకర కర్కాటకాలైనా, అష్టమస్థానం ధనుర్మీన రాసులైనా కుజదోషం ఉండదు అని దేవకేరళాదులలో వివరించబడింది.

ఇలానే మరికొన్ని పరిహారాలు చెప్పబడ్డాయి.

అర్కేందు క్షేత్ర జాతానాం, కుజదోషోన విద్యతే ।
స్వోచ్చమిత్రభజాతానాం, పీడకో నభవేత్కిల ।
కుజః కటకలగ్నస్య సింహస్యచన దోషకృత్ ॥

కర్కాటక సింహరాశుల వారికి, కుజుని ఉచ్చస్థాన, మిత్రగ్రహ రాశులవారికి, కటక, సింహ, లగ్నం వారికి, కుజుడు దోషకారి కాడని నారదసంహిత తెలియచేస్తున్నది.

చంద్రమంగళ సంయోగేభౌమదోషంనవిద్యతే ।
గురుమంగళ సంయోగే భౌమదోషం న విద్యతే ॥

చంద్రమంగళయోగం ఉన్న వారికి, గురుమంగళ యోగం ఉన్నవారికి కుజదోషం ఉండదని కూడా అభివర్ణించబడింది.

ఇదే ప్రకారం కుజదోషం వధూవరులకిద్దరికి ఉంటే వారు వివాహం చేసుకోవచ్చని **"కుజదోషవతీ కన్యాదేయా కుజదోషవతః పుమాన్"** అన్న ప్రమాణాన్ని అనుసరించి కుజదోషం ఉన్న కన్యను కుజదోషం ఉన్న వరునికి ఈయవచ్చు అనటాన్ని బట్టి పరస్పర కుజదోషం ఉన్న వ్యక్తులకు, అది ఎటువంటి ఇబ్బందులను కలిగించదు.

పై ప్రకారం పరిహారాలు చెప్పబడినప్పటికి కొన్నికొన్ని సందర్భాలలో కుజదోష ప్రభావం ప్రకటితమౌతున్నదని ప్రాజ్ఞుల అనుభవవాక్కుల ద్వారా అవగతమౌతున్నది. అంటే దోష పరిహారం పూర్తిగా కాదని తెలుస్తున్నది. అయితే కుజదోషమున్నవారు జపశాస్తుల మొదలైనవాటి ద్వారా ఉపశాన్తిని పొందవచ్చు. కుజదోష ఉపశాన్తికై కుంభకళ్యాణం, కదలీకళ్యాణం మొదలైనవి ధర్మశాస్త్ర నిబంధ గ్రంథాలలో పేర్కొనబడినాయి.

సుబ్రహ్మణ్య ఆరాధన, స్తోత్ర పఠనాలు, ఆంజనేయ ఆరాధన, స్తోత్ర పఠనాలు, నృసింహారాధనాధులు, కుజగ్రహ జప హోమస్తోత్ర పారాయణాదులు మొదలైనవి ఆచరించటం వలన కుజదోష ఉపశాన్తిని పొందవచ్చు. అలాగే మత్స్య, పద్మ, భవిష్యోత్తర పురాణాలలోను, వర్ష క్రియా కౌముది, వ్రతరాజం, కృత్య కల్పతరువు చతుర్వర్గ చిన్తామణి, వ్రత చూడామణిలాంటి ధర్మనిబంధ గ్రంథాలలో అంగారక ప్రీతికై అంగారక చతుర్థి, అంగారక చతుర్దశీ, భౌమవ్రతం, భౌమవారవ్రతం, మంగళగౌరీవ్రతం, మంగళచండీ వ్రతాదుల ఆచరణ ద్వారా కుజదోష ఉపశమనాన్ని, కుజగ్రహ అనుగ్రహాన్ని పొందవచ్చు.

మంగళవారం నాడు ఆవుకు నానపెట్టిన కందులను తినిపించడం ద్వారా, చీమలకు పంచదార వేయటం ద్వారా, రావివేపచెట్లు కలిసి ఉన్న వృక్షాలకు ప్రదక్షిణం చేయటం ద్వారా కూడా కుజదోష ఉపశాన్తిని పొందవచ్చని కాబట్టి కుజదోష విషయమై భీతిని పొందనవసరంలేదని పెద్దలు, అనుభవజ్ఞులు పేర్కొంటున్నారు.

మంగళో మంగళప్రదః.

ఎస్‌టిజి అంతర్వేది కృష్ణమాచార్య



ప్రకృతిలో సహజంగా ఏర్పడి, భూమి పొరల్లో, సముద్రజలాల్లో, వృక్షాల్లో, సర్పాల్లో ఇలా వివిధ విధాలుగా కాలగమనంలో అనాదిగా ఏర్పడిన, ఏర్పడుతున్న అమూల్యమైన రత్నాలు, వాటి విలువలు, అవి మానవజాతికి మానసిక, శారీరక ఆరోగ్యాలు ప్రసాదించే విషయాలను ఏనాడో ఋగ్వేదంలో నిక్షిప్తం చేశారు మహర్షులు.

విజ్ఞానఖని, జ్యోతిషశాస్త్ర దిగ్గజం, అయిన వరాహ మిహిరుడు, నవరత్నాలపై విశేష పరిశోధన చేశాడు. గగనంలో గల నవగ్రహాల కదలికలకు, నవరత్నాల ధారణ, ప్రక్రియకు గల శాస్త్రీయ అవగాహన, పరిశోధన చేసి విశదీకరించిన మహనీయుడు వరాహ మిహిరుడు.

నవరత్నాలు భూమి ఏర్పడిన నాటినుంచీ సహజప్రక్రియ ద్వారా రూపుదిద్దుకున్నవి. భూమి ఏర్పడి నేటికి ఎన్నివేల కోట్ల సంవత్సరాలు అయిందో చెప్పడం అంత సులభం కాదు. అయితే గగనాంతర గ్రహాలు, వాటివాటి ప్రక్రియలు, అందులో భూగ్రహం తొలినాటి ఆవిర్భావ విశేషాలు వివరణలు, సూచన ప్రాయంగా, విహంగ వీక్షణలో చెప్పగలిగేవే కానీ, నిర్దిష్టమైన గణాంకాల ద్వారా చెప్పడం ఇంకా సుసాధ్యం కాలేదు.

అయితే భూమిపై లభ్యమయ్యే నవరత్నాల ప్రస్తావన పురాతన రచనలైన బృహత్ సంహిత, భావిప్రకాశ, రసరత్న సముచ్చయ, ఆయుర్వేద ప్రకాశ గ్రంథాలలో నవరత్న విశేషాలను సవివరణాత్మకంగా పొందుపరిచారు ఆనాటి పండితులు. ఆయుర్వేదానికి ఆదిపురుషుడు అనదగ్గ చరకుడు తన రచనల్లో ఆరోగ్య విషయాలకే పెద్దపీట వేశాడు.

ఆయుర్వేద చికిత్సా విధానాల్లో పలు విషయాలు ప్రస్తావిస్తూ, మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఆనందకరజీవన యానానికి, నవరత్నధారణ కూడా తోడ్పడుతుందని

చెప్పాడు. అయితే ఏ ఆరోగ్య సమస్యలు, ఏ రకమైన రత్నాన్ని ధరించాలి వంటివాటి పరిమాణాలు, వాటి రంగురూపులు, ఇత్యాది విషయాలు అనుభవజ్ఞులు ద్వారా తెలుసుకుని, వారి సలహాలమేరకు, సూచించిన రత్నాలు మాత్రమే ధరించాలనే విషయాలు కూడా చరకుడు తెలియజేశాడు.

నవరత్న ధారణ

నవరత్నాలు అంటే తొమ్మిది రత్నాలు అని అర్థం. అంతేగాక ఎప్పుడూ నవ్యమైనవే అని. అంటే కొత్తదే అనే అర్థం కూడా ఉంది.

1. కెంపు 2. ముత్యం 3. పగడం 4. పచ్చ 5. పుష్యరాగం 6. వజ్రం 7. నీలం 8. గోమేధికం 9. వైఢూర్యం.

ఈ నవరత్నాల గురించి త్రేతాయుగం, ద్వాపరయుగం నాటి నుంచి సమయం సందర్భం బట్టి, మహర్షులు ఉటంకిస్తూనే ఉన్నారు. రామాయణంలో పలు సందర్భాల్లో ఈ రత్నాల ప్రస్తావన ఉంది. స్త్రీ, పురుషభేదం లేకుండా బషారా తోడుగా నవరత్నాలను అలంకరణ వస్తువులుగా నాటి రాణులు, రాజులు ఉపయోగించారు. అలాగే మహాభారతంలో కూడా నవరత్నహార ధారణల వివరాలు ఉన్నాయి. నాటి చిత్రాలు, నాటి చలన చిత్రాల్లో పాత్రధారుల నగలు, అలాగే రంగస్థలనటుల అంతరాళాల్లో ఈ ఖరీదైన రాళ్లు, రత్నాల ప్రస్తావన, అలంకరణలు మనకు చిరస్మరణీయములు.

అన్నమయ్య కీర్తనలో నవరత్నాలు

అన్నమయ్య తన కీర్తనల్లో బాల కృష్ణున్ని యువకృష్ణున్ని వర్ణిస్తూ, భక్తి తన్మయత్వంలో కీర్తించిన ఈ కీర్తనల్లో నవరత్నాలను పొందుపరచాడు. ఇది ఒక అద్భుతకీర్తన. ఇందులో ప్రధాన విషయం, వివిధ సందర్భాల్లో కృష్ణుడు ఏయే రత్నాలను, మణిమకుటాలను పోలియున్నాడు, ఇతర పాత్రలకు ఏ రకమైన రసానుభూతులకు లోను చేశాడు. అన్ని భావావేశాలకూ ఆ నవరత్నాలే ఉదాహరణలుగా ఉండడం ఇక్కడ విశేషం. అది నవరత్నాల ప్రాశస్త్యమే గాక, నవరస భక్తాగ్రేసరుడు అయిన అన్నమాచార్యుని యుక్తి విశేషమూ, చమత్కార భావప్రకటనా సామర్థ్యమును ఆదితాళంలో కురంబి రాగంలో సాగిన ఈ కీర్తన బహుకీర్తి పొందింది.

ముద్దుగారే యశోద ముంగిటి ముత్తెము వీడు
దిద్దరాని మహిమల దేవతా సుతుడు ॥

అంతనింత గొల్లతల అరచేతి మాణిక్యము
పంతమాడే కంసుని పాలిట వజ్రము ॥

కాంతుల మూడు లోకాల గరుడపచ్చపూస
చెంతలో మాలోనున్న చిన్నికృష్ణుడు ॥

రతికేళి రుక్మిణికి రంగుమెరవి పగడము
యితి గోవర్ధనపు గోమేధికము ॥

సతమై శంఖచక్రాల సందుల వైఢూర్యము
గతియై మమ్ముగాచే కమలాక్షుడు ॥

కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీవేంకటాద్రి ఇంద్రనీలము ॥

పాలజలనిధిలోన పాయుని దివ్యరత్నము
బాలునివలే తిరిగీ పద్మనాభుడా ॥

ద్వాపరయుగం నాటి శ్రీకృష్ణుని ఆహార్యంలో నవరత్నాలనూ ఒకేచోట చేర్చి అన్నమయ్య అద్భుత ప్రయోగం చేశాడు. నవరత్నాల నామధేయులను తమకు ఇష్టమైన కృష్ణభగవానుని పరంగా చెప్పడంతో కృష్ణ భక్తులకు మరింత ఆనంద రసానుభూతిని కలిగించాడు.

రాజులు-రాజ్యాల కాలం నుంచీ

గతంలో రాజులు, మహారాజులు, చక్రవర్తులు ఇలా ఒకే వంశానికి చెందిన వారు రాజ్యాలు ఏలారు. ఆనాడు నవరత్న ఖచిత కిరీటాలు, నవరత్నఖచిత సింహాసనాలు, ఖడ్గాలు, ఇలా బోలెడన్ని నరవత్నాలకు సంబంధించినవే వారు వాడినారు. ఇప్పటికీ నవరత్నాలు పొదిగిన ఉంగరాలు పెట్టుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. నవరత్నహారాలు, ఆభరణాలే గాక, కొన్ని కొన్ని

ప్రత్యేకమైన రత్నాలతో, రాళ్లతో ఉంగరాలు ధరించేవారూ లెక్కకు మిక్కిలే ఉన్నారు. అయితే ఎవరికినచ్చిన రత్నం లేక రాయితో ఉంగరాలు చేయించుకుని ధరించడము లేక అనుభవజ్ఞుల సలహాతో కుటుంబ శ్రేయస్సు వ్యక్తి ఆరోగ్యం ఆర్థికపరమైన ఒడిదుడుకులు నుంచి అధిగమించడం ఇత్యాది శతాధిక విషయాలను పరిగణనలోకి తీసుకుని, ఏ జాతకుడు ఏ తరహా రాళ్ళను, లేక రత్నాలను ధరించాలి, ఎప్పుడూ ధరించాలి, ఇత్యాది విషయములు తెలుసుకుని మరీ కార్యాచరణ చేయాల్సి ఉంటుంది. వ్యక్తి జాతకం, నవగ్రహాలు, నవరత్నాలు, ఇవన్నీ ఒకదానికొకటి అంతర్గతంగా అంతర్లీనంగా ముడిపడ్డ విషయాలు. సశాస్త్రీయ అవగాహనతో, ఆధ్యాత్మికానుభూతితో, నియమ నిష్ఠలతో అనుసరణీయాలు.

పౌరాణిక గాథ

నవరత్నాలకు 'అమృత గుళికలు'గా కొందరు భావిస్తారు. అలా భావించడానికి ఒక పురాణ ఇతిహాసం ఉంది. అమృతం కోసం దేవాసురులు సముద్ర మథనం చేశారు. ముందు విషయము ఉద్భవించిన తర్వాత అమృతం పుట్టింది. కానీ ఆ అమృతం దేవతలకు దక్కకుండా రాక్షసులు అపహరించారు. ఇది గ్రహించిన దేవతలు, దానవులను నిలదీశారు. రాక్షసులు ససేమిరా అంగీకరించక, అమృత భాండంతో పరుగులు తీశారు. అప్పుడు అమృతభాండం నుంచి కొంత అమృతం నేల నాలుగు చెరుగులు వెదజల్లబడింది. అలా భూమిని తాకిన అమృత బిందువులు, కాలక్రమేణా ఘనీభవించి, రాళ్లుగా, రత్నాలుగా రూపాంతరం చెందాయి అంటారు పెద్దలు.

ఇంకో ఇతిహాసం ఇలా చెబుతోంది. వృత్రాసురుడనే రాక్షసుడు, దేవలోకం మీదకు దండెత్తాడు. నానా భీభత్సం సృష్టించాడు. ఆ రాక్షసుడిని ఎదుర్కోవడం దేవతలకు సాధ్యపడలేదు. అయితే దధీచి మహర్షి శల్యాలతో ఒక ఆయుధం తయారుచేసి, దానితో ఎదుర్కొంటే ఆవృత్రాసురుడి పీడ వదులుతుంది అని విష్ణుదేవుడు చెప్పాడు. ఒక రాక్షసుణ్ణి అంతం చేయడానికి, తనని తానే అంతం చేసుకోవడానికి ఎవరు అంగీకరిస్తారు? అని దేవగణం సంశయిస్తారు. అయితే దధీచి మహర్షి ఈ విషయాన్ని గ్రహించి తనను తాను అంతం చేసుకోవడానికి ఎవరు అంగీకరిస్తారు? అని దేవగణం సంశయిస్తారు. అయితే దధీచి మహర్షి ఈ విషయాన్ని తనను తాను అంతం చేసుకున్నాడు. మహర్షి అస్థికలతో ఒక బలమైన ఆయుధాన్ని తయారు చేసి, వృత్రాసురుణ్ణి అంతం చేశారు దేవతలు. ఆ ఘర్షణలో ఆ ఆయుధం భిన్నాభిన్నం అయింది. అత్యంత కాఠిన్యం, బలం, శక్తి కలిగిన ఆ ఆయుధాన్ని వజ్రాయుధంగా నామకరణము చేశాడు శ్రీమహావిష్ణువు. ఒక మంచిపనికి ప్రాణత్యాగం చేసిన ఋషిశల్యాల శకలాలన్నీ 'నవరత్నాలు'గా జ్ఞాననిధి అయిన ఋషిశల్యాల నుండి ఉద్భవించాయి గాబట్టి ఆనాటి నుండి అవి 'నవ' రత్నాలుగా, మానవ జీవనానికి కరదీపికలుగా ఉపయుక్తం అవుతాయని, సకలదేవతలు, ఋషులు నవరత్నాలను మరింత శక్తివంతం కావాలని ఆశీర్వదించారు. నవనవోన్మేషణా శక్తితో, రాబోయే నవశకానికి, సకలమానవకోటికి 'రక్షణ కవచాలు'గా ఈనాడు నవరత్నాలూ విలసిల్లుతున్నాయి.

నవరత్నాల ప్రభావం

సర్వ చరాచర ప్రాణికోటిలో ఒకే మానవజాతికి మాత్రమే ఆలోచించే మేధాశక్తి ఉంది. నిరంతరం అనేక విషయాలను తెలుసుకునే తపనలో తపస్సులో ఉన్నాడు. ముఖ్యంగా నవగ్రహాలకు, నవరత్నాలకు సంబంధించిన పరిజ్ఞానం పెంపొందించుకుంటున్నాడు. నవరత్నాలకు, నవగ్రహాలకు మధ్య తేజఃప్రసరణ, కిరణ కాంతుల సంకోచ వ్యాకోచాలు మానవ జీవనంపై సుఖదుఃఖాల ప్రామాణికతని తెలుసుకునేదిశగా తన ఆలోచనా ప్రయాణాలు చేశాడు. దీని ద్వారా అనేక వేవ్‌లెంగ్త్స్ అంటే ఆలోచన తరంగాల దూరాలు తెలుసుకున్నాడు. ఇవి కిరణ కాంతుల ప్రసారాల ఆధారంగా లెక్కకట్టారు శాస్త్రజ్ఞులు.

సూర్యుడు-కెంపు వీటిమధ్య వేవ్‌లెంగ్త్ 70 వేలు, చంద్రుడు-ముత్యం 70 వేలు, అంగారకుడు-పగడం 65 వేలు, బుధుడు-పచ్చ 75 వేలు, గురువు-పుష్యరాగం 50 వేలు, శుక్రుడు-వజ్రం 60 వేలు, శని-నీలం 75 వేలు, రాహువు-గోమేధికం 75 వేలు, కేతువు-వైఢూర్యం 70 వేలు, ఇవీ గ్రహాలు, రత్నాల మధ్య వేవ్‌లెంగ్త్స్. భూగ్రహంపై మనిషి మనుగడకు, ఇతరగ్రహాల చలనాలు కూడా తమ ప్రభావం చూపిస్తాయని యుగాల నాటి, మేధావులు గ్రహించారు. ఆ ప్రభావ పర్యవసానం ఆనందంగా ఉంటే పర్వాలేదు. ఆ ప్రభావం కష్టాలు కలిగిస్తే మనిషి భరించడం కష్టం. అందువలన మానవ జీవితంపై సూర్యుడు, చంద్రుడు మొదలైన గ్రహాల ప్రభావతీవ్రత తగ్గించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్న పర్యవసానంతో నవరత్నాల ప్రభావం, ప్రాభవం, వెలుగులోకి వచ్చింది. ఈ నవరత్నాలు మానవులను కష్టాలు, కడగండ్లు, అవమానాలు, బాధలు, వృద్ధాప్యపు అనారోగ్యాల నుంచి, ఇబ్బందికర స్థితిగతుల నుంచి కాపాడతాయి. నవగ్రహాల చలనంవల్ల, వాతావరణంలో మార్పుల వల్ల కొందరు వ్యక్తులకు శారీరక, మానసికమైన అవరోధాలు ఏర్పడుతుంటాయి. అలా గ్రహ ప్రభావాల బారినుండి ఉపశమనం బాధా నివారణ కలిగిస్తాయి నవరత్నాలు. మన్నికైన నవరత్నాలు మాత్రమే మంచి ఫలితాలను ఇస్తాయి. వీటిని ఎంపిక చేసేది రత్నశాస్త్ర నిపుణులు. ఎవరి మట్టుకు వారు చేయకూడదు. ఎవరి సలహాలను అనుసరించకూడదు. రత్నశాస్త్ర నిపుణుల సలహాలను మాత్రమే పాటించాలి. లేకపోతే దుష్పరిణామాలు వచ్చే ప్రమాదం ఉంది. అయితే ఈ రత్నాల బరువు, వాటి సాంద్రత, రంగు, పురాతనత, పారదర్శకత, గట్టితనం, కైవారం, వీటిపై నవగ్రహాల నుంచి వెలువడే శీతోష్ణాల ప్రభావం ఇలా అనేకానేక విషయాలను వరాహ మిహరుడు 'రత్నదీపిక' గ్రంధంలో సోదాహరణంగా చెప్పాడు. ఈ అమూల్య విషయాలను సశాస్త్రీయంగా అవగాహన చేసుకుని, చెడు ప్రభావాలను తుంచుతూ మంచిని పెంచుతూ, నవరత్నాల ఉపయోగాన్ని సాధారణ మానవునికి అందించారు వరాహ మిహిరుడు. అదే సదాశయంతో సమాజ శ్రేయస్సుని ఆశిస్తూ, ప్రజాహిత కార్యక్రమాలను అంకితభావంతో చేసే నిష్కామకర్మ యోగులు ఉన్నారు. నవరత్న విశేషాలను అటువంటి వారి ద్వారా ఇది అనుసరిస్తే తప్పకుండా మనిషికి సుఖసంతోషాలు దక్కుతాయి.

సప్తవర్ణాలు - పంచభూతాలు

సకల చరాచరకోటి, ముఖ్యంగా మానవుడు సప్త వర్ణాలతో, పంచభూత సమన్వితంగా రూపొందించ బడ్డాడు. ఈ వర్ణాల్లో ఏది కాంతి తగ్గినా అది మనిషి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక పరిపూర్ణత్వాన్ని దెబ్బ తీస్తుంది. అది గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఆ లోటును పద్ధతి ప్రకారం అవసరమైన ప్రమాణంలో భర్తీ చేస్తుండాలి. అలా చేయక నిర్లక్ష్యం చేస్తే వర్ణాలు వెలవెలబోతాయి. శరీరంలోని పంచభూతాలూ శక్తిహీనం అవుతాయి. వాటిని పూరించాలి. లేకపోతే మనుగడకే ప్రమాదం.

శరీరంలో రక్తం తగ్గితే రక్తం పెరగడానికి మాత్రలు, టానిక్కులు వాడతాం. అవి పని చెయ్యకపోతే రక్తమే నేరుగా శరీరంలోకి ఎక్కిస్తారు వైద్యులు. అంటే తగ్గిన శారీరక శక్తులను అలా వదిలేయకుండా వాటిని కాపాడుకునేందుకు, ప్రత్యామ్నాయాలు వాడతాం. సంపూర్ణ ఆరోగ్యం పొందుతాం.

సూర్యుడి కాంతిలోనూ, వేడి తీవ్రతల్లోనూ త్రిసంధ్యల్లో వేరువేరుగా ఉంటాయి. మధ్యాహ్న సూర్యుడి వేడినుండి ఉపశమనం పొందేందుకు చల్లగా ఉండే చెట్టు నీడకు చేరతాం. విసనకర్రతో విసురుకోవడమో, పంకా కింద కూర్చోవడమో చేస్తాం. సూర్యతాపాన్ని తగ్గించుకుంటాం. అంటే ఆగ్రహం నుండి వచ్చే ఆగ్రహ జ్వాలలని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాము. సరిగ్గా ఇలాగే నవరత్నాలు తమలో నిక్షిప్తం అయి వున్న, నిబిడీకృతం అయి ఉన్న రహస్యశక్తుల ప్రసారాలను, నవగ్రహాల తీక్షణతలను తగ్గించేందుకు ఉపయోగిస్తాయి. మనిషిపై

గ్రహాల ఆగ్రహ కాంతికిరణాలు ధాటిని రత్నకాంతులు తగ్గిస్తాయి. గ్రహరాశుల అశాంతి కిరణ ప్రసారాన్ని భూమిపై నవరత్నాలు అదుపు చేస్తుంటాయి. విజ్ఞుల సూచనమేరకు మనం మనకు మేలు చేసే రత్నాన్ని లేదా రత్నాలను మన చేతికి ఉంగరంగానో, మెడలో హారంగానో ధరిస్తే గ్రహబాధల నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.

అంగళ్ల రతనాలు అమ్మినారిచట

రత్న నిక్షేపాలను, వాడుకకు, విదేశీ ఎగుమతులకు, వివిధ రత్నరాశులకు ఆదినుంచీ మన భారతదేశమే అగ్రగామిగా ఉండేది. విపణీవీధిలో, కూరగాయలు కుప్పల్లా, రతనాలు రాశులు పోసి, కుంచులతో కొలిచి అమ్మేవారని, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యం ఏలినరోజుల్లో సాధారణ విపణి వీధుల్లో (వీధి దుకాణాలు) కుప్పలు తెప్పలుగా నవరత్నాలు అమ్మేవారట. నిజానికి ఇది ఎంతో గర్వించదగ్గ పట్టపురాణులకు అలంకరణల్లో కనులు మిరుమిట్లు గొలిపే రత్నాభరణాలు తిలకించి, పులకించిపోయేవారట నాటి ప్రజలు, ఇతర రాజ్యాల రాజులు, చక్రవర్తులను మన దేశం ఆదినుంచీ రాజులు, మహారాజులు, చక్రవర్తులు, జమీందారులు, సంస్థానాధిపతులు మొదలైన వారి పరిపాలనలో ఉండేది. వారివారి ప్రాభవాలను వజ్ర వైఢూర్యాలరాశుల బట్టి కొలిచేవారు. బంగారానికి, వజ్రాలు, వైఢూర్యాలు, మరకత మాణిక్యాలు ఇత్యాదివి జోడించి నగలుగా తయారు చేయించి, భోషాణపెట్టెల్లో భద్రపరిచేవారు. మరి కొందరైతే తమ శయనాగారంలో తాము విశ్రమించే మంచంలోనే అరలు ఏర్పరచి, భద్రపరచేవారు.

ఒకప్పుడు హైదరాబాద్ గోల్కొండ ప్రాంతమంతా రత్నరాశులు లభించే గనుల ప్రాంతమని, ప్రతినిత్యం వేలాది కార్మికులు, ఈ రతనాల గనుల తవ్వకపు పనుల్లో తలమునకలయ్యేవారని, ఒక ఫ్రెంచ్ రచయిత తన 'యాత్రానుభవాలు'లో రాశాడు. ఒకనాడు అత్యంత విలువైన వజ్రం మన గోల్కొండ రాజాంతఃపురంలో ఉండేది. ఆనాడు వారు ఆ వజ్రాన్ని 'బ్లూ మాప్ వజ్రం' అనేవారు. అది ఎలా చేతులు మారిందో, ఎప్పుడు మారిందో గాని ప్రస్తుతం ఆ విలువైన వజ్రం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. మొగిలాయి సామ్రాజ్య ప్రభువుల ఆస్థానంలో, నవరత్నాలతో, బంగారు తాపడంతో నిర్మించబడ్డ ఆసనాలు, సింహాసనాలు, ఎన్నో వుండేవట. నెమలి సింహాసనం అందులో ఒకటి. మయూర నృత్య భంగిమలో అత్యంత విలువైన మిక్కిలి పెద్దది అయిన నవరత్నాలతో విలసిల్లుతూ ఉండేది. ఇంతటి విలువైన నెమలి సింహాసనం తర్వాతి కాలంలో పర్షియన్ల దండయాత్రలో పరహస్తాల్లోకి వెళ్లిపోయింది.

నవరత్నాల ధారణ

నవరత్నాల్లో ఏ రత్నానికి ఆ రత్నం కొన్నికొన్ని ప్రత్యేకతలతో, విలువలతో, శక్తితో విరాజిల్లుతుంటూంది. ఏ రత్నం వాడితే ఏ ప్రయోజనం కలుగుతుందో జ్యోతిషంలో చెప్పబడింది. మానసికమైన అస్థిరతగల వ్యక్తి కెంపును, శారీరక ఆరోగ్యం సరిగ్గా లేనివారు ముత్యం, ధైర్యంకోల్పోయి భయపడుతున్న వారు పగడం దాంపత్య సుఖానికి పచ్చ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు, అనుబంధాలు పటిష్టం కావడానికి పుష్యరాగం అమాయకత్వం, మెతకదనం, ఆత్మన్యూనతా భావం కలిగిన వ్యక్తి వజ్రం, మనసు అధీనంలో లేక, సదా పరిపరి విధాలుగా పరుగులు తీసే ఆలోచనలతో కకావికలమయ్యే వ్యక్తి నీలం, ప్రతిదానికీ వితండవాదన చేస్తూ అందర్నీ దూరం చేసుకుని తర్వాత బాధపడే వారు గోమేధికం, ప్రయత్నం, కృషి పట్టుదలతో ముందుకు అడుగుతీసే ఆత్మవిశ్వాసం లేనివారు వైఢూర్యం ధరించాలి. నవరత్నాలను ఒకే ఉంగరంలో పొదిగి, ధరిస్తే అన్ని సమస్యలనూ అధిగమించవచ్చనేది పండితులమాట. రత్నశాస్త్ర నిపుణులను (జియాలజిస్టులను) సంప్రదించి వారి సూచనల మేరకు సరిపడే రత్నాన్ని ధరిస్తే జీవితం నవరసభరితం.

డాక్టర్ మరుదాడు అహల్యాదేవి

జ్యోతిష పండితుల సమాగమం

మహోన్నతమైన సంస్కృతీ, సాంప్రదాయాల చరిత్రగలిగిన తెలంగాణా రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన తెలంగాణా రాష్ట్ర జ్యోతిష మహాసభలు రెండు రోజులపాటు రాష్ట్ర రాజధాని భాగ్యనగరంలో దిగ్విజయంగా సాగాయి. దీనికి రాష్ట్రం నలుమూలల నుండి సిద్ధాంతులు, పండితులు హాజరై తమ అభిప్రాయాలను పంచుకోవడంతో ఒక కొత్త సంప్రదాయానికి నాంది పడినట్లయింది.

"స్పర్ధయా వర్ధతే విద్యా" అన్నది ఆర్యోక్తి. సామాన్యంగా లోకంలో వయోభేదంతో నిమిత్తం లేకుండా ఒకరిని మించి మరొకరు ఆయారంగాలలో జ్ఞానవంతులై ఉండవచ్చు. అటువంటి వారంతా ఒకచోట చేరి, పరస్పర సహకార బుద్ధితో వారి పాండిత్యాన్ని, పాండిత్యంద్వారా పొందిన అనుభవాలను ఇతరులతో పంచుకున్నప్పుడు వారి అనుభవసారం లోకానికి ఎంతో ఉపయోగపడుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అయితే ఇక్కడ కావలిసింది వారందరినీ ఒక్కచోటికి తేవడమే!

ఇదే సంగతి జ్యోతిష్యానికీ వర్తిస్తుంది. సామాన్యంగా జ్యోతిషశాస్త్రంలో ఉద్దండులైన పండితులలో చాలామంది "ఎవరికివారే యమునాతీరే" అన్న చందంగా ఉండటం మనం గమనిస్తూనే ఉన్నాం. కేవలం లోకోపకారమే ప్రయోజనంగా, శాస్త్రాభివృద్ధే పరమావధిగా భావించి అటు వంటి వారందరినీ ఒకచోటికి చేర్చి వారి ద్వారా ఎన్నో అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించి తద్వారా భవిష్యత్తరాల వారికి మార్గనిర్దేశనంగా నిలిచింది... తెలంగాణా రాష్ట్ర జ్యోతిష మహాసభ.

ఒకప్పుడు పండితుల మధ్యలో విరివిగా శాస్త్రపరమైన గోష్ఠులు, చర్చలు మొదలైనవి జరిగేవి. ఆనాటి పాలకులైన రాజులు, జమీందార్లు వీటిని పోషించేవారు. ఎంతోమంది పీఠాధిపతులు ఇలాంటి సభలు నిర్వహించి తద్వారా సమాజం లోని వివిధ అంశాలకు పరిష్కార మార్గాలను చూపేందుకు కృషి చేశారు. ప్రస్తుత పరిస్థితులలోనూ అలాంటి సభలు అక్కడక్కడా జరుగుతున్నాయి. శ్రీశృంగేరీ జగద్గురువులు వాక్యార్థ సదస్సు పేరుతో ప్రతి సంవత్సరం శాస్త్ర సభలను నిర్వహిస్తున్నారు. కానీ ఆనాటితో పోల్చినప్పుడు ఈనాడు బాగా తగ్గిపోయాయి. దాంతో ఎన్నో శాస్త్రీయమైన అంశాలు వెలుగులోకి రాకుండా పోతున్నాయి.

ఈ విషయంలో ఇక పరిష్కారం దొరికినట్లే కనబడుతోంది. గాయత్రీపీఠం, జ్యోతిర్మయ మహాపీఠం



మరియు దర్శనమ్ మాసపత్రికల సంయుక్త నిర్వహణలో, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వారి సౌజన్యంతో సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వంవారి ఆధీనం లోని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖవారి ఆధ్వర్యంలో జరిగిన తొలి "తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు" విజయవంతంగా నిర్వహింపబడడం పండితులకేగాక, సామాన్యులకు సైతం సంతోషాన్ని కలిగించేదే.

ఒకవైపు ప్రసారమాధ్యమాలలో జ్యోతిషమంటే మూఢ విశ్వాసం, అశాస్త్రీయం అంటూ ఒకపథకం ప్రకారం జనాలలో జ్యోతిషంపై నమ్మకాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్న వేళ... సాక్షాత్తూ రాష్ట్రప్రభుత్వమే ఇందులో పాలుపంచుకోవడం ఇక్కడ గమనార్హం. ఇలా ఒక రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జరిగిన జ్యోతిషసభ ఇదే మొదటిదనండంలో ఆశ్చర్యంలేదు.

సామాన్యుడికి ఏ పండుగను ఏనాడు ఆచారించాలో తెలియక స్థానికంగా అందుబాటులో ఉండే పురోహితులను గానీ, లేదా దేవాలయాలలోని అర్చకులనో ఆశ్రయించినప్పుడు వారు రెండు రకాల పంచాంగాలను పరిశీలిస్తే రెండు ఉగాదులు, రెండు దసరాలు. అడిగినవారికి చెప్పడం అనే మాట పక్కనబెడితే వీరికే పెద్ద తలనొప్పిగా మారిన వ్యవహారం మనకందరికీ తెలిసిందే! చివరకిది శాస్త్రంపైనే అనుమానాలను రేకిత్తించిన మాట వాస్తవం.

ఇలాంటి పరిస్థితులలో... పరమహంస పరివ్రాజకులు, దక్షిణామ్నాయ శ్రీశృంగేరీ శారదాపీఠాధీశ్వరులు, జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు, మరియు విధుశేఖర భారతీ స్వామివారల అనుగ్రహంతో, రెండు రోజుల ఈ సదస్సు వేదికగా... గత కొన్ని దశాబ్దాలుగా పంచాంగ గణితం చేస్తూ ఎంతో అనుభవజ్ఞులైన సిద్ధాంతులు, వారితో బాటుగా నేటి తరానికి ప్రతీకగా యువసిద్ధాంతు లంతా కలిసి రాబోయే సంవత్స రానికి ఏకగ్రీవంగా పండుగలను నిర్ణయించడం అత్యంత సంతోష కరమైన విషయం.

మొదటిరోజు లలితాకళాతోరణం వేదికగా, రెండవరోజు రవీంద్రభారతి వేదికగా జరుపబడ్డ ఈ సభలలో జ్యోతిష్య శాస్త్రంలోని 24 అంశాలపై ప్రసంగాలు చేసి, సమర్పించిన ప్రసంగప్రతులు భవిష్యత్తులో ప్రామాణికంగా నిలుస్తాయనడంలో సందేహంలేదు. వీటన్నింటినీ పుస్తకం రూపంలో వెలుగులోకి తీసుకురానుండటంతో త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానున్నాయి.

నిస్వార్థంగా ఆచరించే పనులు విజయ వంతమవు తాయని నిరూపించేందుకు ఈ సభ ప్రత్యక్ష నిదర్శనం. సుమారుగా 2000 మంది హాజరై అక్కడి కార్యక్రమాలను ఆసక్తిగా గమనించడం వారికున్న శాస్త్రాభిమానానికి తార్కాణంగా చెప్పవచ్చు.

తెరవెనుక - కార్యక్రమ నిర్వహణలో "దర్శనమ్" మాసపత్రికది ప్రత్యేక శైలి. ఇదివరకు "గురువందనం" పేరుతో శృంగేరీ, ద్వారకా, బదరీ, పీఠాధీశ్వరులైన ఆయా జగద్గురువులకు సమర్పించిన వందన సభలు ఎంతోమంది కళ్ళముందు ఇంకా మెదలుతూనే ఉన్నాయి. అంతటి మహోన్నతమైన కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడం వెనుక ఉన్న ధైర్యం, బలం ఏమిటని ఆలోచిస్తే... దర్శనమ్ అంటే అభిమానించే కార్యకర్తలు.

సభ విజయవంతం అవడమనేది ఏ ఒక్కరిమీదా ఆధారపడి ఉండదు. వేదికపై కనిపించేవారేగాక, తెరవెనుక దీని విజయ వంతానికై కృషిచేసిన కార్యకర్తలెందరో... వారంతా ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా, కేవలం జ్యోతిష శాస్త్రాభివృద్ధిని మాత్రమే కోరుకునేవారు. వారివల్లే సభ దిగ్విజయ మైందనడంలో సందేహం లేదు.

నేను సైతం ... రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమందిలో ఆసక్తిని, శాస్త్రంపై అనురక్తిని కలిగించిన తెలంగాణా రాష్ట్ర జ్యోతిష మహా సభలలో చివరిదైన రెండవరోజు సభలో వేదికపై పాల్గొని "దోష పరిహారాల నిర్ణయం ప్రయోజనం" అనే అంశంపై ప్రసగించి, ప్రసంగ ప్రతిని సమర్పించే అవకాశం నాకు లభించింది. ఇది ఉన్నతమైన గౌరవంగా నేను భావిస్తున్నాను.

చారిత్రాత్మకమైన ఇలాంటి కార్యక్రమాలు కేవలం తెలంగాణ వ్యాప్తంగానే కాదు, సాటి తెలుగురాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తోపాటుగా, దేశవ్యాప్తంగా మరెన్నో రాష్ట్రాలకు ఆదర్శ మవ్వాలని, తద్వారా జ్యోతిష శాస్త్రాభివృద్ధి జరగాలని కోరుకుంటూ, నిర్వాహకులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

అప్పాల శ్యామప్రణీత శర్మ

జ్యోతిషం - శుద్ధి ప్రక్రియ

అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్ ... అని కర్మ సిద్ధాంతం తెలియజేస్తుంది. మనస్సు, వాక్కు, కాయం ద్వారా చేసిన ప్రతికర్మకు కూడా ఫలితం ఉంటుంది. అనుభవించే సమయం వెంటనే కావచ్చు. సమయమూ పట్టవచ్చు. ఆ సమయాన్ని గమనించే అవకాశం జాతకం ద్వారా మాత్రమే తెలుస్తుంది. ఒక వృక్షాన్ని పెట్టినప్పుడు వృక్ష విధానాన్ని బట్టి ఫలాలు వేరు వేరు సమయాల్లో వస్తుంటాయి. కొత్తిమీర, తోటకూర, వంకాయ, టమాట, వరి, మామిడి, జామ, కొబ్బరి, టేకు, ఎర్ర చందనం వంటి మొక్కలు, వృక్షాలను స్థాపించినపుడు వాటి ఫలితం వచ్చే సమయాలు వేరు వేరుగా ఉంటాయి. అదేవిధంగా చేసే పనిని (కర్మను) అనుసరించి ఫలితాలు వేరువేరుగా ఉంటాయి.

సాధారణంగా ప్రస్తుత జన్మలోని కర్మలు తర్వాతి జన్మలో అనుభవిస్తుంటారని భావిస్తూ ఉంటాం. కానీ ఈ జన్మలో తీవ్రంగా చేసిన మంచి, చెడు పనులు ఈ జన్మలోనే అనుభవిస్తుంటామనే భావన కూడా ప్రచారంలో ఉంది. **'అత్యుత్కటై: పుణ్య పాపై: ఇహైవ ఫలమశ్నుతే...'** అనే మాట ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఈ భావాలన్నింటినీ గమనిస్తే కర్మల ప్రభావమే జీవితం అని అర్థం అవుతుంది. ఈనాడు మనం అనుభవిస్తున్న దేహం, సామాజిక స్థితి, ఆర్థిక స్థితి, తల్లిదండ్రులు, భార్యాభర్తలు, సంతానం, దగ్గరి బంధువులు, స్నేహితులు, ఉద్యోగ జీవితం, అక్కడ తోడు అయ్యేవారు, ఉండే ఇల్లు, చుట్టూ ఉండి ప్రభావితం చేసే వ్యక్తులు అన్నీ మన కర్మ బంధాలే. ఈ విషయాలను గమనించడానికి జ్యోతిషమొక్కటే ఆధారం. జాతకం ద్వారా మాత్రమే గత కర్మలకు సంబంధించిన గుణ దోషాలు తెలుసుకునే అవకాశం ఉంది.

జాతకం కర్మఫల ప్రకాశిక :

పూర్వ కర్మల్లో చేసిన గుణదోషాలు, రాగద్వేషాలు జీవితంలో ప్రతిఫలిస్తాయి. ఆయా అంశాలు అన్నీ జాతకాదులు గ్రహ, నక్షత్ర, రాశి, భావాల రూపంలో సూచిస్తుంటాయి. ఆయా గ్రహాలు అక్కడే ఉన్నప్పుడు ఎందుకు పుట్టాలి? ఆయా ప్రత్యేక దశల్లోనే ఇబ్బందులు కాని ఉన్నతి కాని ఎందుకు ఏర్పడుతుంది? ఇటువంటి సందేహాలకు కర్మ సిద్ధాంతాన్ని ఆశ్రయించక తప్పదు. జాతకం ద్వారా ముందుగా అనేక రకాల అంశాలను పరిశోధించి అవి రాకుండా ప్రయత్నం చేయడమే జ్యోతిర్వైద్యం. ముందు జాగ్రత్తగా నివారణ చర్యలపై దృష్టి సారించే అవకాశం ఉన్నందువల్ల జాతకంలో వైద్యజ్యోతిషానికి ప్రాధాన్యం పెరిగింది. గ్రహాల స్థితిగతులను



చిన్నవయసు నుండి చూసి లోపాలను ఆ వయసునుండే తగ్గించడానికి అనేక మార్గాలలో ప్రయత్నం చేయవచ్చు.

విశ్వం పూర్తిగా శక్తిమయం. శక్తి అన్ని చోట్లా విస్తరించినట్లే పదార్థాలలోనూ విస్తరిస్తుంది. శక్తి సూర్యునిలోనూ ఉంది. సూర్యుని శక్తి ప్రభావం వెలుగు, వేడి రూపంలో అన్ని గ్రహాలపైనా ఉంటుంది. ఆ గ్రహాలలో భూమి కూడా ఒకటి. భూమి చుట్టూ ఉన్న ఇతర గ్రహాలపైనా ఉన్న సూర్య శక్తి ప్రభావం కూడా పరావర్తనం చెంది భూమిపైనా పడుతుంది. భూమిపైన ఉన్న ప్రకృతి ఈ ప్రభావాలకు స్పందిస్తుంది. సూర్యకాంతిని, ఇతర గ్రహాలపై పడిన సూర్య పరావర్తన కాంతిని, ఉపగ్రహం అయిన చంద్రుని పరావర్తన కాంతిని కూడా భూమి గ్రహిస్తుంది. ప్రతి క్షణం ఈ కాంతివిధానాలు మార్పులు పొందుతూ ఉంటాయి. ఆ మార్పులు పొందుతున్న సమయంలో ఈ భూమి స్పందించే వ్యవహారమే ప్రకృతి స్పందన. ఈ ప్రకృతి స్పందనే వ్యక్తి స్పందన. దానిని గ్రహాదుల దూరాన్ని అనుసరించి గణించిన శాస్త్రమే జ్యోతిషం.

ప్రపంచం అంటే పంచభూతాల సమన్వయంతో కూడుకున్నది. ప్రపంచంలో మానవ జీవనం కూడా ఒక భాగమే. ప్రకృతి అంటే సరియైన విధంగా తయారుచేయబడింది అని అర్థం. మానవుని దేహం, మనస్సులు కూడా ప్రకృతికి అనుకూలంగానే ఉంటాయి. ప్రపంచంలో, ప్రకృతిలో ఏదో ఒక లోపం ఏర్పడినప్పుడు ఏవో ప్రమాదాలు (వాయు, అగ్ని, జల, భూసంబంధ) ఏర్పడుతూనే ఉంటాయి. అదేవిధంగా మనసులో, శరీరంలో చిన్న చిన్న లోపాలు ఏర్పడినప్పుడు కూడా అటువంటి ప్రమాదాలు శరీరానికి ఏర్పడుతుంటాయి. ఈ లోపాలు అనేక రూపాల్లో ఉంటాయి. కొన్ని తీవ్రమైనవి. కొన్ని స్వల్పమైనవి. కొన్ని వేరు వేరు జాగ్రత్తలు, నివారణ చర్యలు, మందుల ద్వారా తగ్గేవి. కొన్ని కొంతకాలం పీడించి తగ్గేవి. కొన్ని అసలు తగ్గకుండా ఉండి మరణానికి చేరువ చేసేవి. ఈ విధంగా విశ్వశక్తి ప్రకృతి ద్వారా ఈ ప్రపంచంలోని జీవులకు అందుతూ ఉంటుంది. ఈ విషయాలను పరిశీలించాలంటే జాతకం ఒక మార్గదర్శిగా ఉంటుంది.

వ్యక్తి పుట్టినప్పుడు కూడా ఒక ప్రకృతి ఉంటుంది. ఆ ప్రకృతిని చుట్టూ ఉన్న గ్రహాలు నిర్దేశిస్తుంటాయి. ఆ ప్రకృతి ఒక మనస్సుగా నిర్దేశం అవుతుంది. అయితే వ్యక్తి యొక్క కర్మను తెలుసుకోవాలంటే ఆ వ్యక్తి పుట్టిన సమయంలోని జాతకాన్ని పరిశీలించాలి. ఏ భావాల్లో శుభ కర్మల వల్ల కలిగే ఫలితాలు, ఏ భావాల్లో అశుభకర్మల వల్ల కలిగే ఫలితాలుంటాయో గమనించారు. **ఫలాని గ్రహచారేణ సూచయన్తి మనీషిణ: ...** అన్నట్లుగా జాతకంలోని గ్రహాలు, దశలు వ్యక్తుల శుభాశుభాలను సూచిస్తుంటాయి.

జాతకం - పుణ్యపాపాలు :

పరోపకార: పుణ్యాయ పాపాయ పరపీడనం ... అని పుణ్యపాపాల గూర్చి వ్యాసబోధ. వ్యక్తి లోకానికి వచ్చినప్పటినుండి ఏదోరూపంలో కొందరికి ఉపకారం, కొందరికి పీడన కలిగిస్తూనే ఉంటాడు. ఇక్కడ **'పర'** శబ్దం కేవలం మన ప్రక్కనున్న కొందరు వ్యక్తులకు మాత్రమే కాకుండా వ్యక్తులతో కూడుకున్న సమాజం, పంచభూతాత్మకమైన ప్రకృతి, పశుపక్ష్యాదులన్నింటికీ వర్తిస్తుంది. త్రికరణాలైన మనస్సు, వాక్కు, కాయకర్మలన్నింటికీ ఇది వర్తిస్తుంది. త్రికరణాలతో పరుల శ్రేయస్సు కోరుకుంటే పుణ్యం, పర పీడన కోరుకుంటే పాపం. మరి పాపపుణ్యాలను మనం ఎలా అర్థం చేసుకోవాలి? అనేది ప్రశ్న. ఏ పని చేద్దామని అనుకున్నా ముందుకు వెళ్ళలేని అశక్తత పాపం. సమస్యలు ఏర్పడటం, అవమానాలు పొందడం, అనుకూలత లోపించడం, ఆర్థిక, సామాజిక, ఆరోగ్యాది సమస్యలన్నీ పాపాలకు సంకేతాలు. ప్రస్తుత కాలంలో **'బ్లాక్స్'** అని పిలుచుకుంటే సులువు. రక్తనాళాల బ్లాక్స్, నర్వస్ సిస్టం బ్లాక్స్ వంటి పదాలు వింటూనే ఉంటాం. శరీరంలోని వేరు వేరు భాగాల్లో అవి చేయాల్సిన పనులు చేయలేక పోయినప్పుడు, ఏవో అడ్డంకులు ఏర్పడినప్పుడు పాపం అని అనడం సహజం. కార్యనిర్వహణ సాధ్యం కానపుడు, అనారోగ్యానికి లోనైనపుడు, ఇతర ఇబ్బందులు వ్యక్తులకు ఏర్పడినప్పుడు అందరూ **'అయ్యో! పాపం'** అని అనడం లోకవిదితమే. శరీరంలో శక్తి ప్రసరణ సరిగా లేనప్పుడు, అడ్డంకులు ఏర్పడితే బ్లాక్స్ అన్నట్లుగానే, జీవన విధానంలో వచ్చిన సమస్యలను ఎదుర్కునే శక్తి లేకపోవడం, అడ్డంకులు ఏర్పడటమే పాపం అనే అర్థంలో వినియోగిస్తుంటాం. దీనికి వ్యతిరేక దిశలో...శరీరం ఆరోగ్యంగా ఉండడం, అన్ని పనుల్లో అనుకూలత ఏర్పడటం, ఆర్థిక, సామాజిక వ్యవహారాల్లో ఉన్నతి, గౌరవాలు, మనస్సు ఎప్పుడూ

సంతోషంగా ఉండడం, కుటుంబ వృద్ధి, కీర్తి ప్రతిష్ఠలు, ఎన్నో గొప్ప కార్యక్రమాలను నిర్వహించే నేర్పు మొదలైనవి పూర్వపుణ్యకార్యాల వల్ల ప్రస్తుతం జరిగే శుభాదులు. దీనికి తార్కాణంగా **'పుణ్యమూర్తి'** అనీ, **'ఎప్పటి పుణ్యమో! ఇప్పుడు ఉపయోగపడింది'** అనీ లోకంలో మాట్లాడుకోవడం సహజం. శరీరంలో సకారాత్మక (పాజిటివ్) శక్తి యొక్క అధికమైన ప్రసరణమే పుణ్యం. ఇది లేకపోవడం లేదా నకారాత్మక (నెగటివ్) శక్తి శరీరంలో నిండి ఉండడం పాపం. పాజిటివ్ శక్తి ప్రసరణ వల్ల ఉత్సాహం అధికంగా ఉంటుంది. నెగటివ్ శక్తి వల్ల దీనత్వం, బాధ, చికాకు, ఒత్తిడి, రోగాదులు అధికమౌతాయి.

శరీరం, మనస్సు, ఆత్మ అనేవి త్రిపురాలకు సంకేతాలు. శరీరం లోహపురం, మనస్సు రజతపురం, ఆత్మ స్వర్ణపురం. ఆత్మ శక్తివంతమైంది. ఆత్మశక్తిని శరీరానికి పూర్తిగా అందించడానికి, ఈ లోకంలోని కర్మలను పూర్తిచేసుకోవడానికి మనస్సు వినియోగ పడుతుంది. ఇలా వినియోగపడిన మనస్సు ఈ లోక వ్యవహారాలతో మమైకం అవుతుంది. అనవసర సమాచారం అంతా సేకరిస్తుంది. కొత్త కర్మలను తయారు చేసుకుంటుంది. దీనివల్ల మనశ్శక్తి తద్వారా శరీరశక్తి తగ్గిపోతూ వస్తుంది. ఆత్మశక్తి పూర్ణంగా అందించడానికి ప్రయత్నం జరిగినా, మనస్సు దానిని పూర్ణంగా తీసుకునే శక్తిలో ఉండదు. ఈ క్రమంలో శరీరంలోనూ అనేక అడ్డంకులు (బ్లాక్స్) ఏర్పడతాయి. శరీరం, మనస్సుల్లో తగినంత శక్తి లేకపోవడం వల్ల, ఉన్న శక్తి సరియైన ప్రదేశాల్లో వినియోగపడక పోవడం వల్ల ముందు మనస్సు తద్వారా శరీరం రోగగ్రస్తమవుతుంది.

ప్రకృతికి, పశుపక్ష్యాదులకు, సమాజానికి ... త్రికరణాలతో (మనస్సు, వాక్కు, కాయ కర్మలు) చేసే వ్యతిరేకతల వల్ల పాపం కలుగుతుంది. ఆ పాపం యొక్క ప్రభావమే తరువాతి జీవనానికి హేతువు అవుతుంది. త్రికరణాలతో చేసే అనుకూలత వల్ల పుణ్యం పెరుగుతుంది. దాని ప్రభావం వల్ల ఆనందాదులు కలుగుతుంటాయి. జ్యోతిష శాస్త్రం ఈ అంశంపై విశేషంగా కృషి చేసి, ఒక జాతకునిలో ఇటువంటి ఆలోచనాలోపాలు, శరీర రోగాలకు కారణమైన గ్రహాల విషయంలో ఒక అవగాహనకు వచ్చింది. ఆ యా గ్రహ, రాశి, భావాలను వేరు వేరు సూత్రాల రూపంలో వ్యక్తం చేస్తూ వచ్చింది.

జాతకంలో వేరు వేరు భావాలలో ఉన్న చెడు గ్రహాల ప్రభావం లేదా ఆ భావం వేరు వేరు సూత్రాల ద్వారా లోపాలు ఏర్పడినప్పుడు జ్యోతిష్కుడు గమనించే పద్ధతిలో మార్పు రావాలి. ఆ లోపం ఆ భావానికి మాత్రమే ఎందుకు చెందాలి? అటువంటి సమయంలోనే జాతకుడు ఎందుకు జన్మించాలి. కొంచెం ఆలస్యంగానో, ముందుగానో జన్మించడం వల్ల ఆ దోషం తగ్గించుకోవచ్చు కదా! కాని పుట్టుక ఆ ప్రత్యేక సమయంలో ఉండడం దైవ నిర్దేశం కావడం వల్ల దానిని అనుసరించి కర్మ సిద్ధాంతం వైపు దృష్టి సారించాల్సి ఉంటుంది. జాతకంలో ఒక భావానికి సంబంధించి గుణం ఏర్పడినా, లోపం ఏర్పడినా అది ఈ జాతకుడు తమ పూర్వ కర్మలలో చేసిన గుణదోషాలకు మాత్రమే సంకేతం. దానికి ఎవ్వరూ కారణం కాదు. తాను చేసివచ్చిన మంచి, చెడు కర్మలు, తమ కోరికలు, తమ వ్యతిరేకతలు, రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు, ప్రకృతికి చేసే నష్టలాభాలు, పశుపక్ష్యాదులను ఆదరించిన విధానం అన్నీ కూడా ఈ జన్మలో వ్యక్తియొక్క స్థాయిని, సామాజిక, ఆర్థిక స్థితిని, వృత్తిని, వైవాహిక జీవితాన్ని, సంతాన సౌభాగ్యాన్ని, సహకారాన్ని, సంతృప్తినీ నిర్ణయిస్తుంటాయి. పూర్వకర్మలలో లోపం చేసిన విషయాన్ని బట్టి సంబంధిత భావంపై దోష గ్రహాదుల ప్రభావం, గుణాన్ని బట్టి శుభగ్రహాదుల ప్రభావం ఉంటాయి. సప్తమ భావం లోపం ఉన్నట్టుగా జ్యోతిష్కుడు ధ్రువీకరిస్తే పూర్వకర్మలలో సమాజాన్ని ఇబ్బంది పెట్టివచ్చినవారని అర్థం. పంచమ భావ లోపాలు కనిపిస్తే పూర్వకర్మలలో ఎదుగుదలను, సంతానాన్ని నిరోధించడానికి ప్రయత్నించారని అర్థం. అదేవిధంగా అన్ని భావాలు కూడా ఉంటాయి.

తాము ఈ ప్రపంచానికి చేసిన పుణ్యకర్మల వల్ల ఉన్నతమైన జీవనం సంప్రాప్తిస్తుంది. వ్యక్తి శరీరాంగాలు సరియైన విధంగా ఉండడం, ఆరోగ్యంగా ఉండడం, ఆర్థికమైన ఇబ్బందులు తగ్గి ఉండడం, సామాజికమైన గౌరవాదులు పొందడం మొదలైనవన్నీ చిన్న వయస్సు నుండీ ఉంటే పూర్వకర్మల్లో ఎక్కువగా శుభకర్మలు చేసినవారు అని అర్థం. వీరికి కష్టాలు రావు అని మాత్రం అర్థం కాదు. వంద మామిడి చెట్లు పెట్టినప్పటికీ, పది ముళ్ళ చెట్లు పొరపాటున పడినా, వాటి అనుభవం కూడా వ్యక్తి పొందాల్సి ఉంటుంది. కాని, ఈ జాతకులు కొంత జీవిత విధానాన్ని అర్థం చేసుకుని మనస్సును నియంత్రించుకుని ఉన్నతివైపు

దృష్టి సారిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి ఏర్పడి మోక్షసాధనకు హేతువు అవుతుంది.

తాము తెలిసికాని, తెలియకకాని సమాజం, ప్రకృతి, పశుపక్ష్యాదుల పట్ల చేసిన క్రూర లేదా పాపకర్మల వల్ల ప్రస్తుతం ఏదోరూపంలో ఇబ్బందికరమైన జీవనం ప్రాప్తించే అవకాశం ఉంటుందని కర్మసిద్ధాంతం నిర్దేశిస్తుంది. చిన్నవయస్సు నుండీ ఆర్థిక, సామాజిక పరమైన ఒత్తిడులు, ప్రమాదాలు, ఆరోగ్య లోపాలు, కష్టంతో కూడుకున్న జీవన విధానం అన్నీ కూడా కొందరికి బాధలను పెంచి, ఇంకా ద్వేషపూరితులవుతారు. కొందరు తమ విధానాన్ని మార్చుకొనేందుకు ప్రయత్నిస్తూ ఉన్నతికి చేరుకుంటారు. దీనికి తగిన జ్ఞానమే అవసరం. జ్ఞానంతో కూడుకున్న ప్రయత్నం వల్ల సమస్యలకు పరిష్కారం వెంటనే లభిస్తుంది. ఆ విషయాలకు సంబంధించిన జ్ఞానాన్ని జ్యోతిష్కుడు సమాజానికి ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఎదుటివ్యక్తి బాధలను, కష్టాలను తమ ఆర్థిక మార్గాలుగా మార్చుకోవడం వల్ల జ్యోతిష్కునికి కూడా అటువంటి జీవనవిధానమే మళ్ళీ సంక్రమించే అవకాశం ఉంటుంది.

జాతకంలోని వేరువేరు భావాల పరంగా వేరు వేరు అంశాల్లో గుణదోషాలు కనిపిస్తుంటాయి. ఆ యా భావాల్లోని శుభ గ్రహాలు, దృష్టులు, భావాధిపతులు శుభులతో సమ్మేళనాల వంటివి ఆ భావాన్ని వృద్ధిలోకి తీసుకు వస్తుంటాయి. అవే భావాల్లో నైసర్గిక పాపగ్రహాలు, వాని దృష్టులు, ఆ భావాధిపతులు పాపగ్రహాలతో సమ్మేళనం, భావాధిపతులు దోష స్థానాల్లో ఉండడం వంటి విశేషాల వల్ల భావలోపాలు ఏర్పడతాయి. ఆ యా భావాలను సవరించుకోవడం కోసం చేసే ప్రయత్నాలే శాంతికర్మలు.

భావమంటే మనోభావమే. మన మనస్సుల్లోని కొన్ని అంశాల్లో లోపాలు, కొన్ని అంశాల్లో గుణాలతో ఈ లోకంలోని వ్యక్తి వస్తాడు. అని తమ పూర్వకర్మల్లో భాగాలే. ఏ భావాల్లో గుణాలున్నాయో, ఏ భావాల్లో దోషాలున్నాయో గమనించడానికే జాతకశాస్త్రం సూచనలు చేస్తుంది. దాని ద్వారా తమను తాము సరిదిద్దుకునే అవకాశం కలుగుతుంది. ముందుగా ఆయా విశేషాలు తెలుసుకోవడం ద్వారా లోపనివారణ, గుణ వృద్ధి చేసుకోవడమే జాతకశాస్త్ర లక్ష్యం. గత కర్మలలోని లోపాలు జాతకం ద్వారా గమనించి వాటి ద్వారా రాబోతున్న ఇబ్బందులను అధిగమించడం, గత కర్మలలోని గుణాలను గమనించి వాటి ద్వారా వస్తున్న సంతోషాదులతో విర్రవీగకుండా మరిన్ని పుణ్యకార్యాలు చేసే ప్రయత్నం చేయడం ద్వారా వ్యక్తి శక్తిగా మారుతాడు. మానవ వికాసం సాధ్యం అవుతుంది. జాతకం చూసుకోవడం కూడా దానికోసమే. ముందు జాగ్రత్తలకోసమే జాతక పరిశీలన చేయాలి గానీ, లోపం ఏర్పడిన తర్వాత కాదు అనే విషయం దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయం ప్రస్తుత సమాజం మరిచిపోయి కేవలం లోపం ఏర్పడిన తర్వాత మాత్రమే జ్యోతిష్కుని సంప్రదిస్తున్నది. జ్యోతిష్కుని సలహాల మేరకు పుణ్యకర్మలను వృద్ధి చేసుకుంటూ, పాపకర్మల ప్రభావాన్ని తగ్గించుకునే శక్తిని పెంచుకుంటూ ఉండాల్సిన అవసరం నిరంతరం తెలుసుకోవాలి.

పుణ్యకర్మలు చేసి వచ్చినవారు అహంకరించకుండా, పాపకర్మలు చేసినవారు ఆత్మన్యూనతకు లోనుకాకుండా చేయడంలో జ్యోతిష్కుని పాత్ర కీలకం. పుణ్యకర్మలతో కూడుకున్న వారి జీవితం ఇంకా ఎదగడానికి, మళ్ళీ సాధ్యమైనంత వరకు లోపాలు చేయకుండా ఉండడానికి మార్గనిర్దేశాన్ని జ్యోతిష్కుడు ఇవ్వాలి. అదేవిధంగా పాపకర్మల ప్రభావంతో ప్రతిక్షణం వేదనకు గురి అవుతున్న జాతకుల జీవితానికి ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నూరిపోయాల్సిన అవసరం కూడా జ్యోతిష్కులదే. జాతకాన్ని అనుసరించి వారి పూర్వకర్మ ప్రభావాలను గుర్తు చేస్తూ ఈ జన్మలో ఉన్నత కర్మల నిర్వహణ ద్వారా ధ్యాన, దానాదుల ద్వారా ఉన్నతివైపు తీసుకువెళ్ళే బాధ్యత కూడా జ్యోతిష్కునిదే.

పై రెండు అంశాల ద్వారా జ్యోతిష్కుడు నిరంతరం తనను తాను ఉద్ధరించుకుంటూ, ఆశ్రయించిన ఇతర జాతకులకు మేలును కోరుతూ వారు ప్రస్తుతం ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి వెళ్ళడానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. స్థాయి పెంచుకోవడానికి మార్గాలు కూడా సూచించాలి. వ్యక్తిని శక్తిగా మార్చాలి. మానవుణ్ణి మహనీయునిగా మార్చడంలో జ్యోతిష్కుడు కూడా తగిన పాత్ర పోషించాలి. దైవజ్ఞుడు అందుకే అనేక శాస్త్రాలను అధ్యయనం చేసి ఉండాలి. సమాజంలోని వేరు వేరు సమస్యలపై కొద్దో గొప్పో అవగాహన కలిగి ఉండాలి. శరీర నిర్మాణాదులు, వచ్చే వ్యాధులపై కొంత దృష్టి సారించాలి. ఒక సామాజిక, విజ్ఞాన, మనస్తత్వవేత్తగా తనదైన ముద్ర వేయగలిగిన జ్యోతిష్కుడు తన పూర్వకర్మల లోపాలను కూడా

తొలగించుకునే అవకాశం ఉంటుంది. జ్యోతిషం చెప్పడం ద్వారా తన పూర్వకర్మలోపాలను కూడా జ్యోతిష్కుడు తగ్గించుకోగలగాలి తప్ప పెంచుకునే విధంగా ఉండకూడదు.

కర్మలలోనూ పుణ్యపాప భావాలుంటాయి. గ్రహాలను కూడా పుణ్యపాప గ్రహాలు లేదా శుభాశుభ గ్రహాలని పిలుస్తుంటాం. పాప గ్రహాలంటే మన మనస్సులో పాప భావాలను పెంపొందించేవి అవుతాయి. సమాజానికి ఇబ్బంది పెట్టే వ్యవహారాలు చేయడానికి, తప్పులు చేయడానికి కూడా వీరు సిద్ధపడుతుంటారు. మనోభావాల్లో తప్పులు ఉన్నా శక్తిహీనులవుతారు. శుభ గ్రహాల ప్రభావంవల్ల శక్తి సమకూరుతుంది. మనోభావాల్లో ప్రకృతికి, పశుపక్షులకు, సమాజానికి మేలు జరగాలనే భావన వల్ల మేలు కలుగుతూ ఉంటుంది. వాని వల్ల గతకర్మల లోపాలు తగ్గి, పుణ్యం కలుగుతుంది. జాతకం అందించే మూలసూత్రం ఇదే. దీనినే జ్యోతిష్కులు వేరు వేరు పద్ధతుల్లో గుణించి, గణించి తెలియజేస్తుండడం సంప్రదాయం. లోపాల నివారణకు శాంతికర్మలను, గుణ వృద్ధికి పుష్టికర్మలను చేసే విధానాలను జ్యోతిష్కులు సూచిస్తుంటారు.

శాంతి కర్మలు దోషం ఏర్పడిన తర్వాత చేసుకునేవి. పుష్టికర్మలు దోషం ఏర్పడకుండా ఉండడానికి చేసేవి. ప్రకృతికి, పశుపక్ష్యాదులకు, సమాజానికి వేరు వేరు రూపాల్లో వినియోగపడటమే ఈ పుష్టికర్మల రహస్యం. ఈ అవకాశాలను సూచన చేసేది జ్యోతిషం. ఈ శాస్త్రం తప్ప మరే శాస్త్రంలోనూ ఈ ముందుజాగ్రత్తల అవకాశాలు ఉండవు. ఈ జాగ్రత్తలు తీసుకునే విధానాలకే జ్యోతిర్వైద్యం అని పేరు. అంతేకాకుండా వ్యక్తి స్వయంగా ఇటువంటి విషయాలను తెలుసుకుని జ్ఞానవంతుడై తనకు తాను చేసుకునే ఉపాసనల వల్ల శక్తివంతుడవుతాడు. ఆత్మశక్తి ఎక్కువగా ఉన్నవారికి రోగం ఉన్నా అది బయటకు రాదు. అది రోగనిరోధక శక్తి రూపంలో శరీరాన్ని రక్షిస్తూ ఉంటుంది. ఆత్మశక్తి తగ్గిపోతూ ఉన్నవారికే ఈ రోగాలు, సమస్యలు, బాధలు అన్నీ వస్తుంటాయి. అందుకే మానవ జీవన ధర్మంలో శక్తిని పెంచుకోవడం ఒక్కటే తాను చేయగలిగిన పని. మిగిలిన పనులన్నీ పూర్వ కర్మానుసారంగా జరుగుతూనే ఉంటాయి. ఆత్మశక్తిని పెంచుకునే మార్గాలే శాంతి, పుష్టి కర్మలు.

జాతకం ద్వారా పుణ్యాన్ని పెంచుకోవడం, పాపాన్ని తగ్గించుకోవడం తెలుసుకోవాలి. కేవలం పూజలు చేయించడమే కాకుండా వ్యక్తిలో సంస్కారాన్ని పెంచడానికి జ్యోతిష్కుడు ప్రయత్నించాలి. పుణ్యమంటే శక్తిని పెంచుకోవడం. పాపమంటే శక్తిని కోల్పోవడం. శక్తితో నిరంతరం కలిసి ఉంటే శక్తి వస్తుంది. సమస్యలతో, ఇబ్బందులతో మనసును ముడివేస్తే ఉన్న శక్తి కోల్పోతాం. మనకన్నా ఉన్నత శక్తితో కలిసి ఉండడం వల్ల మనకు శక్తి సంక్రమిస్తుంది. మనకన్నా పనికిరాని అంశాలపై మనసును కేంద్రీకరిస్తే మన శక్తిని మనం కోల్పోయే అవకాశం ఉంది. అందుకే మనలో శుద్ధతను పెంచుకుంటే శక్తి వస్తుంది, పుణ్యం పెరుగుతుంది. మనలో శుద్ధత తగ్గిపోతుంటే, శక్తితో సమాగమం తగ్గుతూ ఉంటే శక్తి నశిస్తుంది, పాపకర్మలపై మనసు కేంద్రీకరించి అనేక సమస్యలకు పాత్రమవుతుంటాం.

శుద్ధతను పెంచుకోవడం ద్వారా పుణ్యం వస్తుందనుకుంటే శుద్ధత ఎన్ని రూపాల్లో చేసుకోవాలో నిర్ణయించుకోవాలి. బాహ్యశరీరాన్ని శుద్ధి చేసుకోవాలనుకుంటే రెండు పూటలా స్నానం చేస్తూ ఉండాలి. వారానికి ఒకసారి అభ్యంగనం చేస్తే మరీ మంచిది. పండుగలున్నప్పుడైనా అభ్యంగన స్నానం విశేషం. అదేవిధంగా దంతాలు, నాలుకను రెండుసార్లు శుభ్రం చేసుకోవడం అవసరం. శరీరం పైన కనిపించే నవరంధ్రాలన్నీ మలినాలను వెదజల్లేవే. చర్మం సరేసరి. అందువల్ల బాహ్యదేహ శుద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలి.

బాహ్యదేహం మలినం కావడంలో అంతరదేహం ప్రాధాన్యం వహిస్తుంది. అంతరదేహంలో మనం తీసుకునే వేరు వేరు అంశాలకు చెందిన క్రియలు జరుగుతుంటాయి. ఆహారం, జలం, వాయువులు ప్రత్యక్షంగా మనం తీసుకుంటాం. వీటిలో శుద్ధత లేనప్పుడు అంతరదేహం లోపాలకు గురి అవుతుంది. అధికంగా తీసుకున్నా, అల్పంగా తీసుకున్నా ఆ యా అంతర శరీరాంగాలు ఇబ్బందులకు గురి చేస్తాయి. అందువల్ల ఆహారం శుద్ధమైనది, పవిత్రమైనది, అరగడానికి సులువైనది, పోషక పదార్థాలు కలిగినది తీసుకోవాలి. జలం లేదా జల సంబంధమైన పండ్లరసాల వంటివి కూడా ఎక్కువ తీసుకోవడం ద్వారా శుద్ధత బాగా ఉంటుంది. ఈ విధమైన ఆహారం తీసుకోకపోతే ఇబ్బందులు ఎదురు అవుతాయి.

వాయు శుద్ధత కోసం ప్రాణాయామాదులు బాగా

చేసుకోవాలి. ప్రాణశక్తి తగ్గకుండా చూసుకోవాలి. ప్రతికణం కూడా ఆక్సిజన్‌తో నిండిపోయే విధమైన ప్రాణాయామ సాధన ప్రతిరోజూ చేస్తూనే ఉండాలి. భస్త్రిక, కపాలభాతి, అనులోమ విలోమ, భ్రామరి, అగ్నిసార, ఉద్గీత ప్రాణాయామాల వల్ల శరీరంలో ప్రతికణం ఆమ్లజనితో నిండిపోతుంది. తొందరగా అనారోగ్య దగ్గరికి రాకపోవడమే కాకుండా విశ్వశక్తి శరీరానికి అందుతూ ఉంటుంది. శరీరంలోని వేరు వేరు అంతరాంగాలైన లివర్, పాంక్రియాస్, కిడ్నీస్, ఊపిరితిత్తులు, గుండె, ఆహార నాళాలు, ప్రేవులు మొదలైన గ్రంథులన్నింటినీ శుభ్రం చేయడానికి యోగసాధన అవసరం. సూర్యనమస్కారాలు యోగ సాధన ద్వారా అంతరాంగాల శుద్ధత ఏర్పడుతుంది. భ్రామరి ప్రాణాయామం ద్వారా మెదడును ప్రతిరోజూ శుద్ధం చేసుకోవచ్చు. సరియైన హార్మోన్‌ల విడుదల, సకాలానికి కావాలంటే కూడా యోగ, ప్రాణాయామాలే అవసరం అవుతాయి. రోజూ కనీసం ఒక గంట వీటికోసం వెచ్చించడం వల్ల అంత: శరీర శుద్ధత పెరుగుతుంది.

మనం పరోక్షంగా స్వీకరించేది ఆలోచనలు. ఇంద్రియాల ద్వారా గమనించిన ప్రతి అంశాన్నీ మనం స్వీకరిస్తాం కాబట్టి వాటి వల్ల శరీరం గుణదోషాలకు గురి అవుతుంది. మన ఆలోచనలలోని లోపాల వల్ల మనకు బి.పి., షుగర్., వంటి వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెప్తుంటారు కదా! మనం చూసిన, విన్న అంశాలన్నింటిలోనూ తగిన జ్ఞానంతో ప్రవర్తిస్తే వాటి ప్రభావం మనపై ఉండదు. జ్ఞాన రహితమైతే వ్యతిరేకమైన ఆలోచనలతో ఇబ్బంది పడతాం. అందుకే సత్సంగాదుల ద్వారా జ్ఞానాన్ని సముపార్జించుకోవాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది.

మనస్సును జ్ఞానంతో శుద్ధి చేసుకోవాలి. అంతేకాదు జపం, ధ్యానం ద్వారా కూడా శుద్ధి చేసుకోవాలి. జాతక లోపాల ప్రకారం పూర్వకర్మ దోషాల వల్ల మనస్సు వేరువేరు అంశాలపై సంచరిస్తున్నప్పుడు మనం చేసే పూజ, స్తోత్రం, జపం, ధ్యానం నిరంతరం చేయడం ద్వారా బహుముఖమైన ఆలోచనలు, ఏకోన్ముఖం అవుతాయి. అది శక్తికేంద్రం అయితే మన శక్తి వికసిస్తుంది. తద్వారా సమస్యా పరిష్కార శక్తి లభిస్తుంది. అందుకే నిరంతర జపం చేస్తూ ఉండడం అవసరం. ఆలోచనలేవీ రాకుండా చూసుకోవడం జపం మీద దృష్టి కేంద్రీకరించడమే సాధన, ఉపాసన అవుతుంది.

కర్మశుద్ధి లేకపోవడం వల్లనే సమస్యలు వస్తాయి. అందుకోసం ప్రస్తుత కర్మల్లో మనస్ఫూర్తిగా ఈ ప్రకృతికి, పశు పక్ష్యాదులకు, మన చుట్టూ ఉండే సమాజానికి దానధర్మాలు అధికంగా చేస్తుండాలి. జాతక లోపాలను తెలుసుకొని చేయడం ఇంకా మంచిది. వ్యక్తి స్థాయిని అనుసరించిన దానాలుండాలి. సామాజిక ఆర్థిక వ్యవహారాల్లో చిన్న స్థాయిల్లో ఉంటూ పనులు చేసుకునే వారు, అనాథలు, నిరుపేదలను దైవంగా భావించి వారి వద్దకు వెళ్ళి దైవస్వరూపానికి ఇస్తున్న భావనతో దానధర్మాలు చేయడం మంచిది. అదేవిధంగా ప్రకృతి హిత, సమాజ హిత కార్యక్రమాలలోనూ సహకారం అందించడం, వృక్షస్థాపన చేయడం వంటివాని ద్వారా కర్మశుద్ధతకు అవకాశం ఏర్పడుతుంది. సేవ, దానం అనే రెండు అంశాలు మాత్రమే వ్యక్తి కర్మశుద్ధతకు మార్గాలుగా మారుతాయి.

బాహ్యదేహ శుద్ధతకు స్నానం, అంతర దేహ శుద్ధతకు యోగ, ప్రాణాయామాలు, వ్యాయామాలు, నడక, ఆహార నియమాలు పాటించడం, మనస్సు శుద్ధతకు పూజ, స్తోత్రం, జపం, ధ్యానం వంటి కార్యక్రమాలు, కర్మశుద్ధతకు సేవ, దానధర్మాలు అధికంగా చేస్తూ ఉంటే క్రమంగా శక్తి పెరుగుతుంది. అప్పుడు పాప సంబంధమైన పూర్వ కర్మల ప్రభావాలు అనుభవించే శక్తి కలుగుతుంది. పుణ్యకర్మల ప్రభావాలను ఆనందంగా అనుభవించే అవకాశమూ కలుగుతుంది.

ఈ విధంగా పుణ్యాన్ని పెంచుకునే కర్మలు నిర్వహిస్తూ, పాపాన్ని తగ్గించుకుంటూ, నిత్యం చైతన్యవంతులుగా మారుతూ జీవితాన్ని కొనసాగించడమే వ్యక్తి లక్ష్యం. జాతకం ద్వారా ఆ యా అంశాలలో గుణదోషాలను గమనించి ఎవరెవరు ఎటువంటి మార్గాలు అనుసరించాలో నిర్ణయించుకోవాలి. నిత్యం బలహీనుడై కష్టనష్టాలకు గురి అవుతున్న మానవుడు, జాతక శాస్త్రం ద్వారా ఈ మార్గదర్శనాన్ని పొంది, శక్తిని పెంచుకొని ఉన్నతిని సాధించాల్సిన అవసరం ఎంతో ఉంది. జీవన లక్ష్యం కూడా ఇదే. ఈ శుద్ధిప్రక్రియే మానవ జన్మ ప్రయత్నం.

సాగి కమలాకర శర్మ

అష్టకవర్గ - జ్యోతిర్వైద్యం

ఫలిత నిర్దేశంలో ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ అష్టకవర్గ లేకుండా ఫలితాలను చెప్పడం సాధ్యం కాదు అని ఎందరో జ్యోతిష గ్రంథకర్తలు తెలియజేసారు. ఇది అత్యంత సులువుగా ఫలితాలు చెప్పడానికి అవకాశం ఉంటుంది. అన్ని గ్రహాలనుండి చూసే గోచార ఫలితాల సమన్వయమే ఈ అష్టకవర్గ. ఏడు గ్రహాలు లగ్నంతో కలిపి ఎనిమిది అంశాలవుతాయి. వీటన్నింటిని కలిపి అష్టకవర్గ అనే ప్రత్యేక విధానంగా గుర్తించడం జరిగింది. దశ అంతర్దశ ఫలితాలు తెలుసుకోవాలన్నా, భావ ఫలితాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నా సాముదాయికంగా జీవన విధానాన్ని తెలుసుకోవాలన్నా అష్టకవర్గ అవసరం చాలా ఉంటుంది.

రవి, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, శని లగ్నం అనే ఎనిమిది అంశాల పౌనఃపున్య సమాహారమే అష్టకవర్గ. సాముదాయిక అష్టకవర్గలో మొత్తం 337 బిందువులుంటాయి. వేరువేరు గ్రహాలు తామిచ్చే శుభ ఫలితాలను అనుసరించి ఒక్కో గ్రహానికి కొన్ని బిందువులు ఉంటాయి. అవి రవి-48, చంద్ర-49, కుజ-39, బు-54, గురు-56, శుకరక-52, శని-39 బిందువులుగా నిర్ణయించారు. ఇవి అన్నీ కలిపితే పైన సంఖ్య వస్తుంది. సాముదాయిక అష్టకవర్గలో ఒక్కో భావంలో దాదాపు 24 నుండి 28 బిందువులు కలిగి ఉంటే ఆ భావం బలయుతంగా ఉన్నట్లు అర్థం చేసుకోవాలి.

ఒక్కో భావం నుంచి కారకత్వాలు చూసుకునే విధానం మనకు కనిపిస్తుంది.

ప్రథమభావం నుండి ఆత్మవిశ్వాసం; ద్వితీయం నుండి ధనం, వాక్కు విత్తం; తృతీయం నుండి సహకారం, దగ్గరి ప్రయాణాలు, చతుర్థం నుండి ప్రాథమిక విద్య, గృహ, వాహన, ఆహారాది సౌఖ్యాలు, పంచమం నుండి సంతానం, ఉపాసన, షష్ఠం నుండి పోటీలు, శత్రువులు, రోగనిరోధక శక్తి, సప్తమం నుండి సామాజిక అనుబంధాలు, భాగస్వామ్యాలు, అష్టమం నుండి ఆకస్మిక ఆకస్మిక లాభనష్టాలు, అనారోగ్యం, నవమం నుండి పూర్వపుణ్యం, దూరప్రయాణాలు, తృప్తి, దశమం నుంచి కీర్తి, హోదా, సంఘంలో గౌరవం, లాభం నుండి అన్నిరకాల లాభాలు,



వ్యయం నుండి అన్ని రకాల ఖర్చులు, విశ్రాంతి మొదలైన వాటిని పరిశీలించాలి.

ఈ పరిశీలన భిన్నాష్టకవర్గు ద్వారా ఒక్కో భావంలో గ్రహం ఇచ్చిన బిందువుల ఆధారంగా ఆ గ్రహ సంచారాన్ని అనుసరించి, జరిగే దశ, అంతర్దశను ఆధారం చేసుకుని వ్యక్తికి ఏ విధంగా ఉంటుంది అనే విషయాన్ని సులువుగా చెప్పడానికి అవకాశం ఉంటుంది.

భిన్నాష్టకవర్గులో ఒక గ్రహం 4 బిందువుల కంటే ఏ భావంలో ఎక్కువ ఇచ్చినదో ఆ భావం అభివృద్ధి చెందుతున్నదని కొంత శ్రమతో ఎక్కువ ఫలితాలు సాధిస్తారని అర్థం. అదే గ్రహం 1,2,3 బిందువులు ఏ భావంలో ఇచ్చినదో ఆ భావానికి సంబంధించిన ఒత్తిడి అధికంగా ఉంటుంది. లగ్నమైతే ఆత్మవిశ్వాసం, శారీరక శ్రమ తక్కువగా ఉంటుందని తెలుసుకుని ప్రతిరోజు తప్పనిసరిగా యోగ, ప్రాణాయామాలు చేయాలి. ద్వితీయంలో తక్కువ ఇచ్చినట్లైతే తక్కువ మాట్లాడి, ఎక్కువగా జపం చేసుకుంటూ ఉండాలి, తృతీయంలో తక్కువ ఉన్నట్లైతే ఎదుటివారికి సహకారం బాగా అందించాలి అని, చతుర్థంలో ఉన్నట్లైతే సమయానికి వాహనం దొరకడం కాని, లేదా తనకు ప్రాథమిక విద్యపై దృష్టి తక్కువ పెట్టడం జరుగుతుంది. పంచమంలో తక్కువ ఉన్నట్లైతే సంతానం కోసం ఎప్పుడూ ఏదో ఒక ఒత్తిడి ఉంటుంది. నిరంతరం అన్ని రకాల దానాలు చేస్తూ ఉండాలి. షష్ఠంలో తక్కువగా ఉన్నట్లైతే పోటీల్లో నిలబడే శక్తి, రోగనిరోధకశక్తి కూడా తక్కువగా ఉంటుంది. చిన్న చిన్న వాటికి ఒత్తిడికి లోనవుతారు. సప్తమంలో తక్కువగా ఉన్నట్లైతే సామాజికంగా తొందరగా ముందుకు వెళ్ళరు. ఎప్పుడూ భయపడుతూ ఉంటారు. ఎవరో ఒకరి సహాయం కోరుతూ ఉంటారు. అష్టమంలో తక్కువగా ఉన్నట్లైతే ఆకస్మిక కష్టాలు వస్తాయి. నవమంలో తక్కువగా ఉన్నట్లైతే తృప్తి తక్కువగా ఉంటుంది. ఎంత చేసినా తనది తనకే తృప్తి తక్కువ. దశమంలో తక్కువగా ఉన్నట్లైతే శ్రమకు తగిన గుర్తింపు రాదు. లాభంలో తక్కువగా ఉన్నట్లైతే పెద్దల ఆశీస్సులు తగ్గుతాయి. వ్యయంలో తక్కువగా ఉన్నట్లైతే ప్రమోషన్లు మొదలైనవి ఆలస్యం అవుతాయి.

సర్వాష్టకవర్గులో మొత్తం బిందువుల సంఖ్య ఏ భావంలోనైనా సరే 24 నుంచి ఆ పైన ఎంత ఎక్కువగా ఉన్నట్లైతే ఆ భావం అంత బలంగా ఉన్నదని అర్థంచేసుకోవచ్చు. 24 బిందువులు లేదా అంతకంటే తక్కువ బిందువులు ఉన్నట్లైతే ఆ భావం బలహీనపడుతున్నట్లుగా అర్థం చేసుకోవాలి. సర్వాష్టకవర్గులో ఎక్కువ బిందువులు ఉన్నప్పుడు ఏ విధంగా నడుచుకోవాలి తక్కువ బిందువులు ఉన్నప్పుడు ఏ విధంగా ఉండాలి అనే విషయాన్ని చూద్దాం.

ప్రథమభావంలో బిందువులు పైన చెప్పుకున్నట్లుగా తక్కువగా ఉన్నట్లైతే వ్యక్తి ఏవైనా పనులు చేయాలంటే తొందరగా అలసిపోతారు. శారీరక శ్రమ ఎక్కువ చేయలేరు. ఒకపని చేస్తే వేరే పనిని నిర్వహించలేరు. ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు అయితే తమ ఉద్యోగ వ్యాపారాలు చూసుకుంటూ ఉంటారు. మరే పనులు చేయడానికి తమ శరీరం శక్తి సరిపోదు. వీరు వారానికి కనీసం 5 రోజులు యోగా ప్రాణాయామాలు చేయాల్సి ఉంటుంది. ఈ యోగా ప్రాణాయామాలు ఎప్పుడు చేస్తుంటారో అప్పుడు ఆరోగ్యంగా ఉంటారు. ఇవి చేయనిరోజు కొంచెం అలసటగా ఉంటారు. ఇది ఏ రకమైన మందులు అవసరం లేకుండా తమ శక్తిని తామే తయారు చేసుకోవడం. అవే బిందువులు ఎక్కువగా ఉన్నట్లైతే వీరు ఎలాంటి శారీరక శ్రమకైనా సిద్ధపడతారు. ఎంత పని చేసినా తమకు అలసట అనే మాట ఉండదు. అన్నిటినీ నిర్వహించ గలుగుతారు. ఇలాంటి వారు తమ శారీరక శక్తిని దుర్వినియోగం చేసుకోకుండా తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడానికి తమ సాధనని పెంచుకోవాలి. వీరు ఏకాగ్రతగా కూర్చుని ఎక్కువసేపు జపం చేయడం అలవాటుచేసుకోవాలి. దీని వలన మేలు జరుగుతుంది.

ద్వితీయభావంలో తక్కువగా ఉన్నట్లైతే వీరు మొదట తక్కువగా మాట్లాడుతూ ఎక్కువగా ఎదుటివారి మాటలు వినడం అలవాటు చేసుకోవాలి. కుటుంబ సంబంధాల విషయంలో తొందరపాటు నిర్ణయాలు పనికిరావు. దాచుకున్న నిల్వ ధనం ఏదో రకంగా ఖర్చు అయిపోతుంది. దానిని కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. ఎక్కువ బిందువులు ఉన్నట్లైతే వీరి మాటకు విలువ పెరుగుతుంది.

వాక్‌చాతుర్యంతో కుటుంబ సంబంధాలు బావుంటాయి. అందరినీ ఆకర్షిస్తారు. కాని ఈ వాక్‌చాతుర్యం, కుటుంబ సంబంధాలు ధనం ఎప్పటికీ ఇలాగే ఉండాలంటే వీరు తాము ప్రోగుచేసుకోవడం కాస్త తగ్గించుకుని దాన ధర్మాలు చేయాలి. అవసరార్థికి అవసరమైన వస్తువులు ఎలాంటి గుర్తింపు లేకుండా చేయాలి.

తృతీయంలో బిందువులు తక్కువ ఉన్నట్లైతే వీరికి అవసరమైన సమయంలో సహకారం లభించదు. ప్రయాణాల్లో ఎప్పటికీ ఆటంకాలు వస్తూ ఉంటాయి. వీరు తాము సహకారాన్ని తీసుకోకుండా తమకు చేతనైన సహకారం ఇవ్వడం అలవాటు చేసుకుంటే తమకు కావల్సిన సమయంలో సహకారం లభిస్తుంది. ప్రయాణాల్లో కూడా ఆటంకాలు తగ్గుతాయి. బిందువులు ఎక్కువ ఉన్నట్లైతే తాము ఏ మాత్రం కొంచెం పుణ్యం చేసినా వెంటనే తమకు సహకారం లభిస్తుంది. ఏదో ఒకరకమైన ప్రయాణాలు ఎప్పుడూ చేస్తూ సంతోషంగా గడుపుతారు. సహకారం లభించింది కదా అని వాడుకోకూడదు. సహకారం లభించగానే తమకు చేతనైన పని తాను చేసుకోవడానికి ప్రయత్నించాలి.

చతుర్థంలో తక్కువ బిందువులు ఉన్నట్లైతే వీరికి ఎప్పుడూ సమయానికి తినడానికి ఆహారం లభించదు, ఎక్కడికైనా వెళ్ళడానికి ప్రయాణ సాధనాలు ఇబ్బంది, ఇంట్లో ఎవో రకమైన సమస్యలు ఉంటాయి. ఎప్పుడూ ఎదుటివారిని చూస్తూ వారికి అన్నీ ఉన్నాయి. తాము ఎంత కష్టపడినా తమకు ఏమీ దొరకడం లేదనే వేదన ఎక్కువౌతుంది. సమయానికి దొరికిన ఆహారాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. ప్రయాణసాధనాలు లేవని ఆ సౌఖ్యం దొరకడం లేదని ఇబ్బంది పడకుండా భగవంతుడు ఇచ్చిన కాళ్ళు ఉన్నాయి. అవే ప్రయాణ సాధనాలుగా వినియోగించుకోవాలి. గృహం తాము కావాలని కోరుకోకూడదు. బిందువులు ఎక్కువ ఉంటే తాము ఏ మాత్రం కొద్దో గొప్పో మంచి పనులు చేయగానే అవి కాస్త ఈ భావానికి వచ్చి సమయానికి కూడు, గూడు, వాహనం అన్నీ సమకూరుతాయి. ఎవరో వచ్చి తమ పనులు చేసి ఇచ్చి వెళతారు. దీనివల్ల సంపాదించుకున్న కొద్ది పుణ్యం తొందరగా అయిపోతుంది. కాబట్టి ఆ సౌకర్యాలకు దూరంగా ఉంటూ అనవసరమైన సందర్భాల్లో ఎక్కువ ఆహారం తినకుండా అన్నిటినీ జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

పంచమంలో తక్కువ బిందువులు ఉన్నట్లైతే ఎప్పుడూ సంతానం గురించిన ఏదో రకమైన చింత అధికంగా ఉంటుంది. క్రియేటివిటీ తక్కువగా ఉంటుంది. చెప్పినది చెప్పినట్లు చేస్తారు అంతే కొత్త ఆలోచనలు రావు. పుణ్యం కొద్ది పురుషుడు దానం కొద్ది బిడ్డలు అనే సామెత ప్రకారం వీరు నిరంతరం దానాలు అధికంగా చేయాలి. పంచమంలో బిందువులు ఎక్కువగ ఉంటే క్రియేటివిటీ అధికంగా ఉంటుంది. ఎప్పుడూ కొత్త కొత్త ఆలోచనలు చేస్తూ అందరినీ మన్ననలు పొందుతారు. సంతానం మంచి అభివృద్ధిలోకి వస్తారు. ఇవి అన్నీ తమకే వినియోగపడాలంటే కూడా దానాలు చేయాలి. లేకపోతే అన్నీ ఉంటాయి కాని తమకు ఉపయోగపడకుండా ఉంటాయి.

షష్ఠంలో బిందువులు తక్కువగా ఉంటే వాతావరణంలో మార్పులు రాగానే వెంటనే వీరి శరీరంలో మార్పులు వస్తాయి. ప్రతీ చిన్నఅంశానికి బాగా భయపడతారు. తమలోని అంతశ్శత్రువులను పెంచుకుంటారు. ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడతారు. వాటిని తగ్గించుకోవాలంటే తమలోని అంతశ్శక్తిని పెంచుకోవడానికి నిరంతరం తాము ఉన్నత శక్తితో ఉన్నామని, తమకు లోటు ఏదీ లేదని ఆలోచించాలి. బిందువులు ఎక్కువగా ఉంటే మొండితనంతో పనులు చేస్తారు. అన్నీ తాము చేస్తేనే అవుతాయి ఎవ్వరూ ఏమీ చేయలేరు అనే భావనతో ఒక్కోసారి అహంకారం కూడా వస్తుంది. ఈ అహంకారం వల్ల తమవారు దూరమౌతారు. ఈ మొండితనం తాను తన శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నం చేస్తే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతారు. అందరికీ ఆదర్శంగా నిలబడతారు.

సప్తమంలో బిందువులు తక్కువగా ఉంటే సామాజిక అనుబంధాలు చాలా తక్కువ. తమ స్నేహితులను కూడా వేళ్ళ పైన లెక్కపెట్టుకోవచ్చు. వీరి వల్ల వారి భార్య / భర్తకు ఒక్కోసారి ఇబ్బందిపడతారు. కారణం బయట ఎవరితో కలవలేరు కాబట్టి అన్ని విషయాలకు వారే అవుతారు. ఇది

ఒక్కోసారి మంచిది ఒక్కోసారి ఇబ్బంది కూడాఅవుతుంది. బిందువులు ఎక్కువగ ఉన్నట్లైతే సామాజికి అనుబంధాలు అధికంగా ఉంటాయి. పనులు ఏవి కావాలన్నా తొందరగా పూర్తిచేసుకోవడానికి పదిమందితో పరిచయాలు ఏర్పడ తాయి. తమని తాను నిరూపించుకునే అవకాశం ఉంటుంది.


అష్టమంలో బిందువులు తక్కువగా ఉంటే ఆకస్మిక నష్టాలు, అనారోగ్యాలు, మనసిక చింతన ఎక్కువగా ఉంటుంది. అనారోగ్య భావన ఎక్కువగా ఉంటుంది. వీరు ఎక్కువగా జప, ధ్యాన, దానాదులు నిరంతరం ఎక్కువగా చేసుకోవాలి. బిందువులు ఎక్కువగా ఉంటే వీరికి అన్నిరకాల లాటరీలు, శ్రమలేని ఆదాయాలు ఎక్కువగా వస్తాయి. ఇవి అన్నీ కంటికి కనిపించినా తమకు అనుభవంలోకి రావడం చాలా తక్కువ. విలువ తెలియదు. వీరికి అన్ని అదృష్టాలు కలిసి వస్తున్నాయి అనుకుంటారు కాని చూడడానికి సంపద అనుభవించడానికి భయం ఉంటుంది. దీని వల్ల బంధువులు, మిత్రుల ఆశింపు ఎక్కువగా ఉంటుంది. ఇవ్వకపోతే శత్రువులుగా మారతారు. వీరు తమకి వచ్చినదాంట్లో దాదాపు 75 నుంచి 80% వరకు దానధర్మాలు చేస్తే తమకు ఉన్నదానిలో సంతోషంగా గడపుతారు. లేకపోతే ఎప్పటికీ ఏవో చికాకులు వస్తాయి.

నవమంలో బిందువులు తక్కువగా ఉంటే సంతృప్తి తక్కువగా ఉంటుంది. ఎప్పుడూ ఏదో వెలితి పడుతుంటారు. పక్కవారితో పోల్చి చూసుకుంటారు. ఉన్నవాటి గురించి సంతోషం ఉండదు. లేనిదాని గురించి ఆరాటం, ఇంకా ఏదో కావాలని ఆలోచనతో నిరంతరం చికాకుగా ఉంటారు. వీరు ఉన్నదానితో తృప్తిపడడం అలవాటు చేసుకోవాలి. జప దానాలు నిరంతరం చేస్తూ తమ శక్తిని పెంచుకోవాలి. బిందువులు అధికంగా ఉన్నట్లైతే వీరి జీవితం సంతృప్తికరంగా ఉంటుంది. ఎప్పుడు ఏది వారికి అవసరమో అది ఆలోచించకుండా వీరిముందు ఉంటుంది. తమ చుట్టూ ఉన్నవారు కూడా ఎప్పుడూ సంతృప్తిగా ఉండాలని చూస్తారు. తమను తాము సమాజానికి ఏదో రకంగా వినియోగపడుతూ ఇంకా తమ పుణ్యాన్ని పెంచుకోవడానికి ఆరాటపడతారు.

దశమంలో బిందువులు తక్కువగా ఉంటే సమాజంలో గుర్తింపు చాలా తక్కువగా ఉంటుంది. కీర్తి ప్రతిష్టలు రావు. దానికోసం ఆరాటం ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తారు. తమ గుర్తింపు పెరగడం కోసం నానా రకాల పనులు చేస్తూ ఉంటారు. వీరు అందరిలో దైవాన్ని రాజరాజేశ్వరి అమ్మటవారిని దర్శిస్తూ అందరినీ ఉన్నతులుగా చూడడం అలవాటు చేసుకోవాలి. బిందువులు ఎక్కువగా ఉంటే సంఘంలో గుర్తింపు ఎక్కువగా ఉంటుంది. కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఈ కీర్తి ప్రతిష్టలు వ్యక్తికి అహంకారాన్ని పెంచకుండా చూసుకోవాలి. ఈ కీర్తి ప్రతిష్టలు రావడం వలన తమ పుణ్యం తగ్గిపోతుంది. దానిని పెంచుకునే ప్రయత్నం చేయాలి.

లాభంలో బిందువులు తక్కువగా ఉంటే పెద్దల ఆశీస్సులు తొందరగా లభించవు. లాభాలు సద్వినియోగం చేయలేరు. తమకోసం తాము దాచిపెట్టుకుని లెక్కలు వేసుకుంటూ ఉంటారు. వీరు యోగాసనాలు, జప దానాలు చేసుకోవాలి. బిందువులు ఎక్కువగా ఉంటే అనుకున్న పనులు అన్నీ పూర్తి అవుతాయి. ఎప్పటికప్పుడూ సంతోషంతో హాయిగా కాలం గడుపుతారు. తనకు ఉన్న పుణ్యం లాభంగా మారి తమకు ఉపయోగపడుతుంది. వచ్చిన లాభాల్లో అందరినీ భాగస్వాములు చేయాలి. అన్నీ తనకే అన్నీ తనవే అనే ఆలోచన రాకూడదు.

వ్యయంలో బిందువులు తక్కువగా ఉంటే మంచి పనులు చేయడానికి ఆలోచన రాదు. అనవసరమైన ఒత్తిడి రాత్రి నిద్రపట్టకపోవడం పెద్ద లోపం. ఆ ఎఫెక్ట్ రోజంతా చేసే అన్ని పనులపైన పడుతుంది. చేసే అన్ని పనుల్లో కనిపిస్తుంది. విశ్రాంతి తక్కువగా ఉంటుంది. ధ్యానంవైపుదృష్టి పెట్టాలి. కద్దిసేపు విశ్రాంతి దొరికినా ఆనందంగా ఉండేట్లు ప్రయత్నం చేయాలి. బిందువులు ఎక్కువగా ఉన్నట్లైతే తాము దాచుకునేది తక్కువ ఖర్చు చేసేది ఎక్కువగా ఉంటుంది. మంచి పనులకు ఎక్కువగా వెచ్చించాలి. లేకపోతే ఎవరో డబ్బులు అడిగి తీసుకుని మళ్ళీ తిరిగి ఇవ్వకుండా ఉంటారు. వీరు అనవసర ఖర్చులు కూడా పెడతారు. అవి ఏవీపెట్టకుండా ప్రకృతిని కాపాడే పనులు చేయాలి. హోమాలు చేయించడం, మొక్కలు నాటించడం వలన తమకే కాక సమాజానికి ఉపయోగపడుతుంది.



మొత్తంపైన జాతకాన్ని పరిశీలించినట్లైతే వ్యక్తికి వ్యయభావంకంటే ప్రథమభావంలో బిందువులు ఎక్కువగా ఉండాలి. తాము ఎంత ఖర్చుపెట్టినా తిరిగి శ్రమతో సంపాదించుకుంటారు. దశమం కంటే లాభంలో ఎక్కువ లాభం కంటే వ్యయంలో తక్కువ బిందువులు ఉండాలి. దశమం అంటే వ్యక్తి పడే శ్రమ. శ్రమ పడినదానికంటే లాభం ఎక్కువ రావాలి. వచ్చిన లాభం కంటే ఖర్చు తక్కువగ ఉంటే కాస్త మిగిల్చుకుంటారు. చతుర్థం కంటే పంచమంలో బిందువులు బాగా ఉంటే అనవసర సౌఖ్యాల జోలికి పోకుండా తమ ఆలోచనలతో సమాజానికి మేలు చేకూరే పనులు ఎక్కువగా చేస్తారు. తను తనతోటివారు సంతోషంగా ఉంటారు. ద్వితీయ తృతీయాలు దాదాపు సమానంగా ఉంటే నోరు మంచిదైతే ఊరు మంచిది అవుతుంది అనుకుంటూ సహకారం అందివ్వడానికి వస్తారు. మనతో సఖ్యంగా ఉంటారు. అష్టమంలో బిందువులు ఎక్కువగా ఉన్నా తక్కువగా ఉన్నా ఎప్పుడూ ఇబ్బందే కాబట్టి ఆ భావాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. మొత్తంపైన ఐదు, తొమ్మిది భావాలు బలంగా ఉన్నట్లైతే జాతకంలో ఉన్న లోపాలన్నిటినీ నివారించుకుని తమ జీవితాన్ని తాము సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

ఎన్నిరకాల లోపాలు ఉన్నా నిరంతరం నామ పారాయణ, దాన ధ్యానాదుల వల్ల పంచమ నవమ భావాలు బలోపేతం అవుతాయి. వీటివల్ల ఆలోచన బావుంటుంది. దానివల్ల సంతృప్తి ఉంటుంది. మిగతా లోపాలన్నీ నివారించబడతాయి. ఈ రెండు భావాలు బలం చేకూర్చాలంటే ప్రతీ వ్యక్తి యోగాసానాలు చేయడం, వాకింక్ లేదా దేవాలయంలో ప్రదక్షిణలు చేయడం, ప్రాణాయామాలు చేయడం, దానాలు చేయడం, హోమాలకు కావాల్సిన వస్తువులు ఇవ్వడం, చెట్లను కాపాడే పనులు చేయడం వల్ల తమ లోపాలను నివారించుకోవచ్చు. ఈ పనులు అన్నీ కూడా జాతకంలో గ్రహాలు ఏ ఏ స్థానాల్లో ఉన్నా కూడా, లేద దశల్లో మార్పులు జరుగుతున్న సమయంలో కూడా చేయాలి. సమయం అనుకూలంగా ఉన్నప్పుడు చేసే పనులు పుష్టి ప్రక్రియలుగాను, సమయం బాగా లేనప్పుడు చేసేవి శాంతి ప్రక్రియలుగా మారతాయి. పుష్టిప్రక్రియలు నిరంతరం అలవాటు చేసుకుంటే శాంతి ప్రక్రియలవైపు ఆలోచన రాదు. వ్యక్తి నిరంతర శక్తివంతుడుగా ఉంటూ ఉన్న స్థితినుంచి ఉన్నత స్థితివైపు వైపు తాము లోకానికి ఎందుకు వచ్చారో ఆ పనిని పూర్తిచేసుకుంటారు.

డా.ఎస్.ప్రతిభ

ధర్మశాస్త్ర కోవిదుల విద్వత్సభ

హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట పుష్పగిరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానంలో, పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారి దివ్య సమక్షంలో, జులై 13 ఆదివారం నాడు సుమారు 10 గంటలపాటు నిర్వహించిన, నవమ వార్షిక విద్వత్సమ్మేళనం, చివరి అంకంలో ఒక అత్యద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఆ సందర్భంగా ప్రతిసంవత్సరం ఆ సభలకు వెళ్లిన విధంగానే, ఈసారీ పోయినందున, ఆ ఘట్టాన్ని వీక్షించే అదృష్టం నాకు కలిగింది. ఈ సమావేశాల వేదికకు తెలంగాణ వైతాళికులు, వేద, శాస్త్ర విద్వన్మణి స్వర్గీయ శాస్త్రుల విశ్వనాధశాస్త్రి పేరు పెట్టారు. శ్రీ పరాభవనామ సంవత్సర పండుగల తేదీల నిర్ణయం జరిగింది.

యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి అధ్యక్షుడిగా, గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి కార్యదర్శిగా ఏర్పాటైన తెలంగాణ విద్వత్సభ, గత 9 సంవత్సరాలుగా, మరుమాముల వెంకట రమణశర్మ (దర్శనమ్ శర్మ) నిర్వహణ, దర్శకత్వంలో, ఆయనే కర్తా, కర్మా, క్రియగా, నిర్వహించబడుతున్న ఈ విద్వత్సమ్మేళ నాలు, అంతకు ముందులాగా కాకుండా, వివాదాలకు

శ్రీ పరాభవ నామ సంవత్సరానికిగాను అన్ని పండుగల తేదీల నిర్ణయం పూర్తిగా, ఏకగ్రీవంగా, సుదీర్ఘ సమీక్ష అనంతరం నిర్ణయమయ్యాక, విజయదశమి పండుగ తేదీ నిర్ణయించడానికి పండిత చర్చ ఆసక్తికరంగా సాగింది. దీని వివరానికి పోయే ముందర కొన్ని విషయాలు తెలుసుకుంటే, అసలీ తేదీల నిర్ణయం నేపధ్యం అర్థం చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము, కల్పము, నిరుక్తము. అనే ఆరింటిని షట్ శాస్త్రాలు అతీతంగా ఏకగ్రీవంగా, చర్చోపచర్చల అనంతరం, రాబోయే సంవత్సరానికి పండుగ తేదీలు నిర్ణయించి, ప్రభుత్వానికి (ముఖ్యమంత్రికి, లేదా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి) సమర్పిం చడం, వాటిని ప్రభుత్వం యధాతథంగా అంగీకరించడం ఆనవాయితీగా వస్తున్నది. ఆదివారం జరిగిన విద్వత్ సమ్మే ళనంలో ఎప్పటిలాగే, తెలంగాణాకు చెందిన ప్రముఖ పంచాంగ కర్తలు, సిద్ధాంతులు, జ్యోతిష్యపండితులు, వేదశాస్త్ర నిష్ణాతులు, పురోహితులు, అర్చకులు పాల్గొన్నారు. సమ్మేళనానికి శ్రీమాన్ సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి అధ్యక్షత వహించారు.

సభలో, దివ్యజ్ఞాన సిద్ధాంతి, దర్శనం వెంకటరమణ శర్మ. తూండ్ల కమలాకరశర్మ సిద్ధాంతి, శాస్త్రుల వేంకటేశ్వరశర్మ, గాడి చర్ల నాగేశ్వరశర్మ సిద్ధాంతి, సాగి కమలాకరశర్మ, సంధ్యాలక్ష్మి, శంకరమంచి రామకృష్ణశర్మ, లక్ష్మీ నృసింహాచార్యులు, సత్యనారాయణశర్మ, జోషి శ్రీకాంత్ శర్మ బోరభట్ల సిద్ధాంతి, బ్రహ్మభట్ల శ్రీనాథ్ శర్మ. మోత్కూరి రామేశ్వరశర్మ, వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, మరుమాముల రామచంద్రశర్మ, తదితరు లున్నారు. నాకూ, పూర్వ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలా చారికి ముగింపుకు ముందు గంటన్నర సమయం పాల్గొనే అవకాశంతో పాటు, విద్యాశంకర భారతీస్వామివారి అనుగ్రహ భాషణం వినే అదృష్టం కలిగింది.

అంటారు. వీటిలో ఎన్ని ఎక్కువగా అధ్యయనం చేస్తే, అలాచేసినవారిని అంత గొప్ప పండితుడు అని అనవచ్చు.

సూర్య, చంద్రుల సాక్షిగా జ్యోతిశ్శాస్త్రం, ఇతర శాస్త్రాల కన్నా వివాదం లేకుండా సఫలమైంది. అలాంటి సనాతన జ్యోతి శ్శాస్త్రాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజం మీద వుంది. ఆ దిశగా తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో వున్న అనుభవజ్ఞులైన సిద్ధాంతులను, పంచాంగకర్తలను, జ్యోతిష పండితులను ఒకే వేదిక పైకి తీసుకురావలన్న ఆలోచనతోనే దర్శనమ్ నిరవధికంగా కృషి చేయడం బ్రాహ్మణ సమాజం చేసుకున్న అదృష్టం అనాలి.

జ్యోతిశ్శాస్త్రంలో ప్రధానమైన రెండు భాగాలలో ఒకటైన గణితభాగాన్ని 'సిద్ధాంతం' అంటారు. వేదకాలం నుండి

నేటివరకు జ్యోతిశ్శాస్త్రం కాలానుగుణమైను మార్పులతో, సమ న్వయ సాధనతో, ధర్మపరిరక్షణకై వర్ధిల్లుతున్నది. సమాజానికి అనుక్షణం జ్యోతిశ్శాస్త్రం మార్గదర్శనం కూడా చేస్తున్నది. పంచాంగం లేకుండా నిత్యజీవితం కొనసాగించలేమనేది వంద శాతం వాస్తవం. ధర్మాచరణకు పంచాంగం అత్యంతావశ్యక మైందనీ, తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే ఐదు అంగాలతో కాలాధీనులైన కర్మ సాధకులకు పంచాంగం ప్రసిద్ధి చెందిందనీ సిద్ధాంత నిపుణులు అంటారు.

నిత్య జీవితంలో పండుగలు భక్తి శ్రద్ధలతో ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచారం. దశాబ్దం క్రితం పంచంగాలలో పండుగలపై విభేదాలు రావడం, సమాజాన్ని ఇబ్బందులకు గురి చేయుట జరిగింది. తెలంగాణ రాష్ట్ర జ్యోతిష్య మహాసభల ద్వారా వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించిందనాలి. రాష్ట్రంలోని సిద్ధాంతులందరూ ఒక వేదికపై నిర్ణయాలు తీసుకు న్నందున భవిష్యత్తు పండుగల్లో విభేదాలు వచ్చే అవకాశాలు లేకపోవడమే దీనికి కారణం. అందుకే, సిద్ధాంతులందరితో 'విద్వత్సభ' జరిగింది.

ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విద్వత్సమ్మేళనంలో, ప్రముఖంగా, ఇతర అగ్రశ్రేణి సిద్ధాంతులతో పాటు జ్యోతిష్య, పాండిత్య, పంచాంగ సంబంధిత అంశాలలో అద్భుతంగా తన అభిప్రాయాలు చెప్పిన తూండ్ల కమలాకరశర్మ సిద్ధాంతి, పండగల నిర్ణయంలో ధర్మశాస్త్ర ప్రమాణాలు గురించి దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రికలో రాసిన వ్యాసంలోని విషయాలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. స్థూలంగా ఆ విషయాలు కొన్ని సందర్భోచితంగా ప్రస్తావించడం విద్వత్సమ్మేళనాల నిర్వహణ నేపథ్యంలో ముఖ్యం అనాలి.

ధర్మాచరణకు మూలమైన వేదంలో చెప్పిన యజ్ఞయాగాది క్రతువులను నియమితకాలంలోనే ఆచరించాలి. అటువంటి కాలనిర్ణయ సాధనకు ఆధారభూతమైన, వేదాంగాలలో ప్రధాన మైన 'జ్యోతిశ్శాస్త్రము' పండుగల నిర్ణయంలో ప్రధానమైనది. సిద్ధాంత భాగమైన కాలగణనద్వారా ప్రధానంగా సంవత్సర, అయన, ఋతు, మాస, పక్ష, తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాది విషయాలు పంచాంగాల ద్వారా తెలియచేయడం విశేషం. కాలగణన ద్వారా గణించిన పంచాంగాల ఆధారంగానే నిత్య, నైమిత్తిక, కామ్యకర్మలను, పర్వదిన నిర్ణయాలను, ఇతర ప్రామాణిక సంస్కారాలను, క్రౌత, స్మార్త యజ్ఞయాగాది క్రతువుల కాలనిర్ణయం చేస్తూ ఉంటారు విద్వత్ పండితులు.వీటిలో ఒకరోజుకు చెందిన ముఖ్యకాల, వ్యాప్తి ప్రాముఖ్యత కలిగినపండుగలు, పర్వదినాల నిర్ణయాన్ని విద్వత్సభలు చేపట్టాయి.

అనలొచ్చిన చిక్కల్లా, ఈ ముఖ్యకాలవ్యాప్తి విషయంలోనే సందేహాలు, చర్చోపచర్చలు వస్తుంటాయి. ముఖ్యకాలం ఒక్కో పండుగకు ఒక్కో విధంగా ఉండడమే దీనికి కారణం. ఉదాహరణకు ఉగాదికి సూర్యోదయవ్యాప్తి, శ్రీరామనవమి, గణేశ చతుర్థులకు మధ్యాహ్నవ్యాప్తిని, మానశివరాత్రికి ప్రదోషవ్యాప్తినీ, మహాశివరాత్రి కృష్ణాష్టమిలకు అర్ధరాత్రివ్యాప్తి ఇలా వేర్వేరుగా చెప్పడం జరిగింది. అలాగే, పండుగ రోజులను నిర్ణయించే క్రమంలో 'షట్పక్ష విధానం' పేర్కొనడం జరిగింది. ముఖ్యకాలవ్యాప్తి ముందురోజే కలిగివుండడం, లేదా తరువాతి రోజు వుండడం సందర్భాలలో ఏవిధమైన సందేహానికీ తావులేదు. ఏ రోజు ముఖ్యకాలవ్యాప్తి వుంటే ఆ రోజునే పండుగగా నిర్ణయిస్తారు.

ఇలా కాకుండా,ముఖ్యకాలవ్యాప్తి రెండు రోజులూ ఉండడం, లేదా రెండు రోజులూ ఉండకపోవడం సంభవించినప్పుడు, తత్సంబంధిత పండుగను ఎలా నిర్ణయించాలో కూడా ధర్మశాస్త్ర గ్రంథాలలో చెప్పినప్పటికీ, కొన్ని పండుగలకు ఒకవిధంగాను, మరి కొన్ని పండుగలకు మరొక విధంగాను వుండడం విశేషం. ఉదాహరణకు 'సంకష్టహర చతుర్థి' నిర్ణయంలో రెండు రోజులూ చంద్రోదయకాలవ్యాప్తి ఉన్నా, రెండు రోజులూ చంద్రోదయ కాలవ్యాప్తి లేకపోయినా, రెండవ రోజునే సంకష్టహర చతుర్థి ఆచరించాలనీ, అలాగే, మాసశివరాత్రి సందర్భంలో రెండు రోజులూ ప్రదోషవ్యాప్తి వున్నా, లేకపోయినా, మొదటిరోజునే పాటించాలి అని శాస్త్రం చెప్పడం విశేషం.

తిథి రెండురోజుల్లోనూ ముఖ్యకాలంలో కొంతభాగం మాత్రమే వ్యాప్తి కలిగివుండడం, లేదా, రెండురోజులు సమానం గాను, లేక ఒకరోజు ఎక్కువ, మరొకరోజు

తక్కువగా తిథి వ్యాప్తి వున్న సందర్భంలో ఆయా తిథులకు కలిగిన ఇతరయోగాలు, నక్షత్రయోగాలు, పూర్వవిద్ధ, పరవిద్ధ (ఇతర తిథుల సంయోగాల ఆధారంగా) పండుగలను నిర్ణయించాలి. కొన్ని తిథులకు పూర్వతిథి యోగం ప్రశస్తమైతే కొన్ని తిథులకు తరువాత తిథి యోగం ప్రశస్తమని ధర్మశాస్త్ర గ్రంథాలలో వున్నది. వాటి ఆధారం గానే నిర్ణయించాలి. విజయదశమి విషయంలో శ్రవణానక్షత్ర యోగము ప్రశస్తమని చెప్పబడినది. వీటిని సూక్ష్మంగా పరిశీలించి పర్వదిన నిర్ణయం చేయాలి. పంచాంగాల ద్వారా ధర్మ కార్యాచరణకు నియమబద్ధమైన కాలాన్ని తెలుసుకుని పండుగ లను ఆచరిస్తే, భగవదనుగ్రహాన్ని పొందడానికి వీలు కలుగుతుందని ధర్మశాస్త్రం చెప్తున్నది. ఇంత అద్భుతమైన నేపథ్యంలో వచ్చే ఏడాది దసరా తేదీ నిర్ణయం ఆసక్తికరంగా జరిగింది.

కాకపొతే మిగిలిన పండుగల తేదీలన్నీ ధర్మశాస్త్రంలో చెప్పిన విధంగా కూలంకషంగా, సిద్ధాంతులు ప్రామాణికాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఉమ్మడి అభిప్రాయానికి రావడం పెద్ద కష్టం కాలేదు. గంటల తరబడి చర్చలు మాత్రం జరిగాయి. రాబోయే శ్రీ పరాభవ నామసంవత్సరంలో, 2026 ఆంగ్ల సంవత్స రంలో జరుపుకునే కొన్ని పండుగలు: నూతన సంవత్సరాది మార్చ్ 19, వ్యాస పౌర్ణమి మే నెల 1, గురు పౌర్ణమి జులై 29, వరలక్ష్మీవ్రతం ఆగస్ట్ 21, వినాయకచవితి సెప్టెంబర్ 14, మహాలయామావాస్య అక్టోబర్ 10, దుర్గాష్టమి అక్టోబర్ 18, దీపావళి నవంబర్ 8, నాగుల చవితి నవంబర్ 13: అలాగే 2027 సంవత్సరంలో భోగి-సంక్రాంతి జనవరి 14-15, రథసప్తమి ఫిబ్రవరి 13, తదితర పండుగలున్నాయి.

విజయదశమి పండుగ తేదీ నిర్ణయించడానికి పండిత చర్చ జరిగినప్పుడు ఒకవైపు అధ్యక్షుడు సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, మరోవైపు కమలాకరశర్మ సిద్ధాంతి, శాస్త్రబద్ధంగా తమ తమ వాదనలు వినిపించిన విధానం ఇతర సిద్ధాంతు లందరితోపాటు మాకు ఆసక్తి కలిగించింది. ఇరువురూ తమ తమ వాదనకు అనుగుణంగా పలు శాస్త్రీయమైన ఆధారాలు చూపించారు. సంపత్కుమార కృష్ణమాచార్య తన అభిప్రాయానికి అనుకూలంగా మాట్లాడుతూ, శ్రీ పరాభవ నామ సంవత్సరానికి గాను ఆశ్వయుజ శుద్ధ నవమీ మంగళవారం నాడు (అక్టోబర్ 20, 2026) నవమి ఘడియలు, విఘడియలు, శ్రవణా నక్షత్ర ఘడియలు, విఘడియలు వున్నందున ఆ రోజు విజయదశమి కావడాకి కుదరదన్నారు.

బుధవారంనాడు (అక్టోబర్ 21, 2026) దశమి ఘడియలు, విఘడియలు, ధనిష్టానక్షత్రం ఘడియలున్నందున ఆ రోజుననే విజయదశమి (దసరా పండుగ) జరుపుకోవడం శ్రేష్టమని, భావ్యమని అన్నారు. ఇంకా ఇలా అన్నారు: తిథుల వృద్ధిని అనుసరించి, రెండు దశమీ తిథులు సంభవించినప్పుడు, మహానవమినాడు పూజాది కార్యక్రమాలు నిర్వహించి, శేష దశమి రోజున (అక్టోబర్ 21, 2026) విజయదశమి జరపు కోవాలన్నారు. చాలా ప్రమాణాలను ఆయన ఉటంకించారు ఆసక్తికరంగా. వింటున్నంత సేపు ఆయన చెప్పినదే వాస్తవం అనేలా తన వాదనను సోదాహరణగా వినిపించారు.

కమలాకరశర్మ సిద్ధాంతి కూడా దసరా పండుగ మంగళవారం నాడు (అక్టోబర్ 20, 2026) ఎందుకు జరపాలో చక్కగా వివరించారు. ఆశ్వీయుజ శుక్ల దశమి శ్రవణానక్షత్రంతో కలిసివస్తే అది విజయదశమి అనబడునన్నారు. ప్రమాణాలను అనుసరించి, బుధవారంనాడు (అక్టోబర్ 21, 2026) రోజున దశమికి ముఖ్య గౌణకాలవ్యాప్తి లేనందున, మంగళవారం వున్నందున, అలాగే ముఖ్య కాలంలో శ్రవణాయోగం కలిగినందున, మంగళవారంనాడు (అక్టోబర్ 20, 2026) నాడు మాత్రమే విజయదశమి జరుపుకోవాలన్నారు. 'ధర్మప్రవృత్తి' అనే అనేకానేక ధర్మ సందేహాలకు సంబంధించిన పుస్తకంలోని ప్రామాణికాన్ని కొందరు పేర్కొన్నారు.

వాదప్రతివాదాల ఆనంతరం జరిగిన ముగింపు సభలో విద్యాశంకర భారతీ స్వామివారు తమ అనుగ్రహ భాషణంలో పలు ప్రామాణికాలను పేర్కొంటూ మంగళవారంనాడు (అక్టోబర్ 20, 2026) నాడు విజయదశమి- దసరా

పండుగ జరుపుకోవడ సరైనదని తన అభిప్రాయంగా, సిద్ధాంతులు అందరూ అంగీకరిస్తే (ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని నవ్వుల మధ్య అంటూ) అదే నిర్ణయంగా పేర్కొన్నారు. అనుగ్రహభాషణ అనంతరం సత్కార కార్యక్రమం, శాలువాలు కప్పడం, సర్టిఫికెట్లు ఇవ్వడం స్వామివారి ఆశీర్వచనం తీసుకోవడం జరిగింది.

మన పురాణాలు, ఇతిహాసాలు, బృహత్తర, మహత్తర గ్రంథాలు. ఇవి అనేక జ్యోతిష విషయాలను సోదాహరణంగా పేర్కొన్నాయి. కాకపోతే నేటి మానవాళికి అర్థమయ్యేలా తెలియచేయడంలో కొంత పరిశోధన జరగాలి. బహుశా ఆధునిక విజ్ఞానానికి అనుగుణంగా జ్యోతిశ్శాస్త్రానికి ప్రత్యేక విశ్వవిద్యా లయం ఏర్పాటైతే బాగుంటుందేమో! అనాదిగా వస్తున్న శాస్త్రీయ పరిణతి జ్యోతిష్యం. ఆధునిక కాలంలో అందరికీ జ్యోతి శ్శాస్త్రంపై విశ్వాసం పెరిగింది. గణితం చేయడానికి ప్రస్తుతం శ్రమ లేకుండా, కంప్యూటర్ ఉ పయోగించుకోవచ్చేమో కాని ఫల నిర్ణయానికి మాత్రం అనుభవజ్ఞులైన జ్యోతిష్య పండితుల అవసరం చాలా వుంది.

శాస్త్రాన్ని అభ్యసించడం ఒక ఎత్తైతే, అనుభవాన్ని సంపాదిం చడం మరొక ఎత్తు. శాస్త్రజ్ఞానంలో కూడా అనుభవజ్ఞానం చాలా ముఖ్యం. అనుభవజ్ఞులైన జ్యోతిష్య పండితులు ఈ కాలంలో లభించడం చాలా కష్టం. వేదానికి ధర్మం మూలమైతే, ధర్మానికి జ్యోతిశ్శాస్త్రమే మూలం. జ్యోతిశ్శాస్త్రం ద్వారా ధర్మబుద్ధి కలుగుతుంది. సమాజంలో, ధర్మపరిరక్షణలో జ్యోతిష్యుల పాత్ర అత్యంత కీలకమైంది. ధర్మాచరణలోని జ్యోతిష్యులనే సమాజం గౌరవిస్తుంది. ధర్మపరిరక్షణ అంటే ధర్మాన్ని ఆచరించడమే.

'సర్వేజనా స్సుఖినోభవంతు' అని అనడం కాదు, ఆచరణలో చూపించాలి. బ్రాహ్మణోత్తములంతా సర్వ సమాజ శ్రేయస్సును కోరుతారు. అట్టి బ్రాహ్మణోత్తములలో పంచాంగకర్తలైన సిద్ధాం తులు, సమాజ శ్రేయస్సుతో పాటు బ్రాహ్మణోత్తములకు మార్గదర్శిగా వుంటారు. సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషి స్తున్న సిద్ధాంతులను కాపాడుకోవాల్సిన బాధ్యత, బ్రాహ్మణో త్తములందరితో పాటు సమాజానికీ, ప్రభుత్వానికీ వుంది. పరోక్ష పాత్రలో వున్న సిద్ధాంతులను గుర్తించడం మంచిది. ఈ సభల

ద్వారా కొంత చైతన్యం కలిగించే ప్రయత్నం చేసిన నిర్వాహ కులను (ముఖ్యంగా దర్శనమ్ శర్మ) మనస్ఫూర్తిగా అభినం దించాలి. విద్వత్ మహాసభ అభిప్రాయ వివరాలను, ప్రామాణికాలను గ్రంథ రూపంలో తీసుకువస్తే భవిష్యత్ సమాజానికి ఉపయోగపడ్తుంది.

ఈ 'విద్వత్సభ' అంతా శాస్త్ర పరంపర, అనుభవ సంపద, ధర్మపథ గమనం పరస్పర సమన్వయానికి ఒక అద్భుత మేల్కొలుపు. తర్కం, ప్రమాణం, సంయమనం, సంభాషణ, గౌరవం, ఇవన్నీ కలిసి శాస్త్ర ధర్మానికి సేవ చేసిన అనిర్వచనీయ దృశ్యం ఇది. ఆధ్యాత్మిక, సాంప్రదాయ, సామాజిక పునర్నిర్మా ణానికి ఇది ఒక ఆధారశిల అవుతుంది. పండితుల చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబించిన నిశ్చల ధర్మనిష్ఠ, మధుర భాషణ పద్ధతి, పరస్పర గౌరవ భావం, ఇవన్నీ ఈ కాలంలో అత్యంత అరుదైనవే. శాస్త్రోక్తతను నిబద్ధంగా రక్షిస్తూ, ఆధునికతతో సమన్వయాన్ని సూచిస్తూ, సమాజానికి పంచాంగ పథం, జ్యోతిష్యం ద్వారా ఒక కరదీపిక లాంటి మార్గాన్ని ఈ సభచక్కగా చూపించింది.

భారతీయ, హైందవ సంస్కృతి శక్తిని, భవిష్యత్ పథాన్నీ 'విద్వత్సభలు' భవిష్యత్తులో నిర్దేశిస్తాయి. యుగయుగాలుగా నిలిచే ధర్మబీజాలు నాటబడుతున్నాయనే భావన ఈ సభ చివర్లో అందరిలోనూ విపరీతంగా ప్రతిధ్వనించాయి. జ్యోతిశ్శాస్త్రం అనేది పంచాంగపు గణనల్లోనూ, పండుగల నిర్ణయాల్లోనూ మాత్రమే కాదు; ఆచరణలో ధర్మాన్ని ప్రసాదించడంలోనూ ఒక జీవన పద్ధతిగా నిలుస్తున్నదన్న తత్వజ్ఞానం ఈ విద్వత్సభలో ప్రతిఫలించింది. సనాతనధర్మ శాస్త్రాల పునరుజ్జీవన ప్రయత్నంలో, అందరం భాగస్వాములమవ్వాలి. ధర్మాన్ని ధర్మబద్ధంగా, ధర్మ నిర్ధారణచేసే విధానాలపై గౌరవం కలిగించేవిగా ఇలాంటి 'విద్వత్సభలు'ఒక చారిత్రకఘట్టంగా గుర్తుంటాయి. దర్శనమ్ మరుమాముల శర్మకు అభినందనలు.

వనం జ్వాలా నరసింహారావు

సంస్కారాలు - సంస్కరణల అవసరాలు

ఒక వృక్షాన్నిపెంచడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకుని పెంచాలో ఒక సంతానాన్ని పెంచడానికి కూడా అన్నే జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనం పెట్టడానికి సరియైన కాలం, బలమైన బీజం, మంచి క్షేత్రం ఎలా అవసరమో సత్ సంతానానికి కూడా మంచి కాలం, క్షేత్రం, బీజం అవసరం అవుతాయి. ఒక సంతానం పుట్టి పెరగడానికి అవసరం అయ్యే వానిని సంస్కారాలు అని అంటారు.

మనిషి పుట్టుకనుంచి చనిపోయేవరకు చేసే అన్నీ పనులూ సంస్కారమయమే.

చిత్రలేఖిని (కలము) మాటిమాటి కట్టిట్లు త్రిప్పబడుట వలన చిత్రము (చిత్తరువు) సర్వాంగములతో సంపూర్ణ మైనట్లు విధి పూర్వకములగు సంస్కారములు చేయుట వలన మానవులందరి జీవితం సుఖమయము సార్థకము అవడానికి కావలసిన సకల సద్గుణములు, యోగ్యతలు వికసిస్తాయి.

వేదవాఙ్మయములో, ప్రాణులలో శరీరము, ఆత్మ వేరువేరని చాలా లోతైన వేదాంత జ్ఞానముతో చర్చించబడి నిర్ణయించబడినది. ప్రాణి శరీరము పంచభూతాత్మిక శక్తి స్వరూపము. ఇది కాలధర్మం ప్రకారం నశిస్తుంది. శరీరమునాశ్రయించిన ఆత్మ, సృష్టిలో వున్న చైతన్యమునకు ప్రతీక. దీనికి నాశనము లేదు. అందువలన, నిర్దేశించిన సంస్కారములన్నియు జీవించుటకై శరీరమునకే అవసర మైనవి. అయితే ఇవి ఆత్మకు ఉన్నతిని, గుణాత్మకముగా జన్మాంతరమున కూడా ఉత్తమమైన జీవితమును పొందుటకు ఉపకరిస్తాయి.



షోడశ సంస్కారములు - ప్రయోజనములు

మానవుల జీవన విధానమును లోతుగా పరిశీలిస్తూ కొనసాగించిన ఋషుల పరిశోధనా ఫలితముగానే, మనిషి పుట్టుకనుంచి చనిపోయేవరకు ముఖ్యంగా 16 సంస్కారములు ఆచరణ కొరకు నిర్దేశించబడినవి.

ఆధునిక కాలములో సంస్కారముల ఆచరణ వెనుక వున్న శాస్త్రీయత మరుపున బడి కేవలం ఆచారాలుగా, తమ తమ ఆర్థిక స్థితిని చూపించుకోవడానికి సందర్భాలుగా మార్చి వేయ బడినాయి.

సంస్కారాల ఆచరణ మనిషి జన్మించడానికి ముందు గానే, అంటే, తల్లి గర్భంలో పిండంగా ఏర్పడే ముందు నుండే, పిండం పవిత్రంగా ఏర్పడాలన్న లక్ష్యముతో తలి దండ్రుల (స్త్రీ పురుష) సంయోగం మంత్రం చేత పునీత మగుటకు "గర్భాధాన" సంస్కారముతో మొదలవుతుంది. అంటే తల్లి గర్భంలో ఏర్పడే పిండం పవిత్రంగా ఏర్పడి అనంతర సంస్కారముల ద్వారా మనిషిగా జన్మించి, సార్థకంగా జీవించుటకు మార్గం సుగమం అవుతుంది.

ఈ సంస్కారాల వెనుకనున్న వైజ్ఞానిక రహస్యాలు పరిపూర్ణ పరిశోధన ద్వారానే తెలిసి వస్తాయి.

"సంస్కార" ప్రక్రియలు (Reform processes) ప్రధానముగా మూడు.

1. దోష మార్జనములు (cleaning process),
2. అతిశయాధానము (value addition),
3. హీనాంగపూర్తి (additional inputs)

ప్రకృతిలో ఏ పదార్థమైనా మొదట కల్మషముగానే ఉంటుంది. ఏ పదార్థమునైనను సంస్కరించుటకు ఈ మూడు ప్రక్రియలు అవసరమే. ఉదాహరణకు - గని లో నుండి తీయబడిన లోహము ఖనిజ రూపమున మిక్కిలి మలినముతో గూడి యుండును. దానిని ఉపయోగించుకొనుటకు (ఇనుప ఖనిజము తో కత్తిని చేయుటకు) ముందుగా ఖనిజమును శుద్ధి చేయవలసివుంటుంది. ఇదియే "దోషమార్జనము". తరువాత దానికి యధోచితముగా అగ్ని, వాయు, ద్రవములతో ఉపయోగకరమైన రూపము కలిపించాలి. (ఇనుముకు కత్తి రూపము ఇవ్వాలి) దీనినే "అతి శయాధానము" అంటారు. అనంతరము ఆ రూపమునకు కావలసిన ఇతర సింగారములు చేసిన తరువాతే అది ఉపయోగకరమైన వస్తువు అవుతుంది. (కత్తి కి పిడిని కూర్చడం). ఇది "హీనాంగపూర్తి" ప్రక్రియ. పత్తిచెట్టు కాయలనుండి పత్తిని వేరుచేసి, శుభ్రం చేసి (దోషమార్జనము) దారము గా మార్చి వస్త్రములు తయారుచేసి (అతిశయా ధానము) కావలసిన విధముగా కుట్టుకోవడం (బొత్తాములు - గుండీల తో సహా) "హీనాంగపూర్తి" తరువాత వస్త్రధారణ వీలవుతుంది. ఇదంతా పత్తిని, ధరించు వస్త్రముగా, సంస్కరించు ప్రక్రియ.

షోడశ సంస్కారములు - సంస్కార ప్రక్రియలు

1. దోష మార్జనములు -- గర్భాధానం, పుంసవనం, సీమంతోన్నయనం, జాతకర్మ, నామకరణం, నిష్క్రమణం, అన్నప్రాశనం, చౌలము (చూడాకర్మ)
2. అతిశయాధానము -- ఉపనయనం నుండి సమావర్తనం వరకు
3. హీనాంగపూర్తి -- వివాహం, అంత్యేష్టి

ఆశ్రమాలు - సంస్కారాలు

ఇహపరములలో సుఖములు పొందుటకు మన ఋషులు ఒక సమగ్రమైన జీవన విధానమునకు రూపకల్పన చేసి నిర్దేశించిన క్రమం లోనే నాలుగు ఆశ్రమాలు, 16 సంస్కారాలు జీవన్ముక్తికి మార్గములయ్యాయి.

వివాహం - గృహస్థాశ్రమం - కుటుంబ వ్యవస్థ

ప్రపంచం లోని ఏ ఇతర నాగరికతలలోనూ నిర్దిష్టంగా స్థిరీకరించని జీవన విధానములు ఉండేవి. అందువలన అశాంతి, అహింసలతో ఆ నాగరికతలు కూడా అంత రించాయి. కానీ భారతీయ నాగరికత లో మనిషి వ్యష్టిగా, సమిష్టిగా ఐహిక ఆముష్మిక పురోగతి ని పొందుటకు ఋషులు ఏర్పరిచిన వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ కారణంగా వేలయేళ్ళ చరిత్రతో ఇది పరిఢవిల్లుతుంది.

ఇటీవలి కాలం లో కొన్ని శతాబ్దాలుగా ఋషులు ఏర్పరిచిన జీవన విధానం మరియు సంస్కారాలు, కాలాను



గుణంగా సంస్కరింపబడనందువలన ఈ నాగరికతకు, జీవన విధానానికి గౌరవం తగ్గి మానవుల వ్యక్తిగత జీవితాలు గమ్యరహితమై వ్యక్తిగత మరియు సామాజిక ప్రశాంతత కు దూరమవుతున్నాయి.

సంస్కారముల సంస్కరణ -- పండితులు, జ్యోతిష్కుల బాధ్యత

ధర్మ సంస్థాపన కొరకు తాను మళ్ళీ అవతరిస్తానని గీతకారుడు నుడివినా, ధర్మ రక్షణ బాధ్యత మాత్రం ఎప్పుడూ సమాజం లో వుండే జ్ఞానులు పండితులకే ఉంటుంది.

జ్ఞానము, పాండిత్యము కూడా సాధారణ జీవనోపాధి మార్గాలుగా పరిణమించడం ఈ కాలం లో సమాజానికి ప్రత్యేక దౌర్భాగ్యం. అలాగని ఈ పరిస్థితి ని నిరోధించకుండా వూరకుండడం ధర్మ హాని అవుతుంది.

అందుకే సమాజాన్ని ప్రభావితం చేయడానికి సామాన్య ప్రజలకు అత్యంత సమీపం లో వుండే జ్యోతిష్కులు కలిసికట్టుగా ఆత్మావలోకనం చేసుకొని మన ఆచారాలను సంప్రదాయాలను పునఃనిర్వచించి సంస్కారాలను సంస్కరించాలి.

అందులోనూ ముఖ్యంగా వివాహ సంస్కారాన్ని మరియు వివాహ విధానాలను ఆమూలాగ్రంగా సమీక్షించాలి. గాయపడుతూ గాడి తప్పుతున్న కుటుంబ వ్యవస్థను పునరుత్తేజితం చేయాలి.


వివాహం "వేడుక" కాదు, రెండు జీవితాలకు ఒక అతి ముఖ్యమైన "సంస్కారం" అన్న విషయాన్ని మన వ్యవస్థ లోని తలిదండ్రులకు, వారి సంతానానికి బోధించి ఒప్పించ గలిగే 'శాస్త్ర జ్ఞాన' సామర్థ్యం ఇటు పురోహితులు, అటు జ్యోతిష్కులు పెంపొందించుకోవాలి.

పంచాంగములను అందించే సిద్ధాంతులు, అన్ని సాంప్రదాయ విషయాలలో పంచాంగము ప్రామాణికం అనుకునే ఎక్కువ మంది విద్యావంతులున్న ఈ కాలంలో శాస్త్ర విషయాలు సరైన విధంగా తమ పంచాంగములలో వుంచి మొత్తం సమాజం లోని వ్యక్తుల భావజాలాన్ని మార్చగలరు.

పురోహితులు పెళ్ళిళ్ళలో ఫోటోలు, ఫోటోగ్రాఫర్ లే ముఖ్యులైనారనుకుని నిస్సహాయత చెందుతూ తమకు యజమానులు సరిఅయిన విలువ గౌరవం ఇవ్వడం లేదనుకుంటున్న స్థితి నుండి, అందరం కలిసి, కావలసిన మంచి మార్పు తేవడానికి మేధోమధనం చేసి మొదటగా వివాహ సంస్కార విధానాన్ని శాస్త్ర చర్చలతో విద్వత్సభ వంటి వేదికల మీద సంస్కరించే ప్రయత్నం ఆరంభించాలి.

ఎవరికి వారు ఏమీ చేయలేము అనుకుంటూ గడిపే కన్నా, ఋషులు ఆశించిన జీవన విధానం ఆధునిక ఆలోచనలతో సంస్కరణలతో పునఃసమాజం లో అందరి కోసం ఐకమత్యంగా నిర్దేశిద్దాం.

జాలా సోమనాథ శాస్త్రి



వేదాంగ జ్యోతిషం : కాలజ్ఞాన మహత్త్వం – మహర్షుల దార్శనికత, శాస్త్రీయ దృక్పథం (ఒక సమగ్ర పరిశోధనాత్మక విశ్లేషణ)

"జ్యోతిషామయనం చక్షుఃʼʼ (పాణినీయ శిక్ష)

(అంటే వేద పురుషునికి జ్యోతిషం నేత్రం వంటిది. కళ్ళు లేనిదే సృష్టిని ఎలా దర్శించలేమో, కాలనిర్ణయ శాస్త్రమైన జ్యోతిషం లేకుండా సృష్టి ధర్మాన్ని గ్రహించలేము.)

ప్రవేశిక (Introduction)

అనంతమైన, అగోచరమైన కాల స్వరూపాన్ని గణితం, ఖగోళం అనే కొలబద్దలతో కొలిచి, విశ్వ పర్యావరణానికి మరియు మానవ జీవనానికి మధ్య ఉన్న విడదీయరాని సంబంధాన్ని మానవాళికి అందించిన మహత్తర విజ్ఞాన భాండాగారం 'జ్యోతిష శాస్త్రం'. ఇది కేవలం భవిష్యత్తును చెప్పే సాధనం కాదు; పదివేల సంవత్సరాల క్రితమే అంత రిక్షంలోని గ్రహాల గతులను, భూమిపై వాటి అయస్కాంత, గురుత్వాకర్షణ ప్రభావాలను అంచనా వేసిన అత్యున్నత ఖగోళ, గణిత, మనోవిజ్ఞాన శాస్త్రాల సమ్మేళనం. అంతర్జాతీయ వేదికలపై భారతీయ మేధోసంపత్తిని గర్వంగా చాటిచెప్పే ఈ ప్రాచీన విజ్ఞానం, నేటి ఆధునిక పరిశోధనలకు సైతం ఒక కరదీపిక.

1. వేద కాలంలో జ్యోతిషం – తగిన ప్రమాణాలు

భారతీయ జ్ఞాన సంపదకు వేదాలే మూలం. వేద కాలంలో జ్యోతిషం యజ్ఞయాగాదుల నిర్వహణకు కాలనిర్ణయం చేసే గణిత, ఖగోళ శాస్త్రంగా ఆవిర్భవించింది.

ఋగ్వేద ప్రమాణం : ఋగ్వేదంలో సూర్యుని గమనం, 12 నెలలు, 360 రోజులు (సౌర సంవత్సరం) గురించిన స్పష్టమైన ప్రస్తావన ఉంది.

"ద్వాదశారం నహి తజ్జరాయ వర్వర్తి చక్రం పరి ద్యామృతస్య" (ఋగ్వేదం 1-164-11)

(పన్నెండు ఆకులు గల కాలచక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది.)

యజుర్వేద ప్రమాణం : యజుర్వేదంలో నక్షత్రాలను పరిశీలించే ఖగోళ శాస్త్రవేత్తను "నక్షత్ర దర్శ" అని పిలిచేవారు.

లగధ మహర్షి 'వేదాంగ జ్యోతిషం' : క్రీస్తు పూర్వం 1400 సంవత్సరాల నాటి లగధ మహర్షి రచించిన 'వేదాంగ జ్యోతిషం' ప్రపంచంలోనే మొట్టమొదటి ఖగోళ గణిత గ్రంథం. ఇందులో తిథి, నక్షత్ర, అయన (ఉత్తరాయణ, దక్షిణాయన) సాధన పద్ధతులు అద్భుతంగా వివరించ బడ్డాయి.

2. యుగయుగాలుగా జ్యోతిష పరిణామ క్రమం, ప్రాధాన్యత

కాలం మారుతున్న కొద్దీ మానవుని అవసరాలు మారాయి. దానికి అనుగుణంగా జ్యోతిష శాస్త్రం తన పరిధిని విస్తరించుకుంది.

కృత, త్రేతా యుగాలలో: ప్రకృతి శక్తులను ఆరాధించే ఈ కాలంలో, రుతువులు, వర్షపాతం, వ్యవసాయం, యజ్ఞాలకు అనువైన ముహూర్తాలను నిర్ణయించడానికి మాత్రమే జ్యోతిషాన్ని ఉపయోగించారు. ఇది పూర్తిగా 'ఖగోళ వీక్షణం' (Observational Astronomy) పై ఆధారపడి ఉండేది.

ద్వాపర, కలి యుగాలలో: మానవుని కర్మ ఫలాలను, మానసిక సంఘర్షణలను, సామాజిక మార్పులను విశ్లేషించే 'ఫలిత జ్యోతిషం' (Predictive Astrology) గా ఇది పరిణామం చెందింది. కర్మ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని, మనిషి తన పరిమితులను తెలుసుకుని సన్మార్గంలో నడవడానికి ఒక మార్గదర్శిగా మారింది.

3. జ్యోతిష ప్రాభవానికి మూలపురుషులు - అష్టాదశ మహర్షులు

ఈ అమోఘమైన శాస్త్రానికి భౌతిక, గణిత సూత్రాలను రచించి, ఒక పటిష్టమైన పునాది వేసిన ఘనత 18 మంది మహర్షులకు దక్కుతుంది. వారినే 'అష్టాదశ జ్యోతిష ప్రవక్తలు' అంటారు.

సూర్యః పితామహో వ్యాసో వశిష్ఠో అత్రిః పరాశరః ।
కశ్యపో నారదో గర్గో మరీచిర్మనురంగిరాః ॥
లోమశః పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగుః ।
శౌనకోఽష్టాదశశ్చైతే జ్యోతిః శాస్త్ర ప్రవర్తకాః ॥

పరాశర మహర్షి: నేటికీ ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న 'పరాశర విధానానికి' ఆద్యుడు. జాతక చక్ర విశ్లేషణ, దశల విధానం (వింశోత్తరి దశ), వర్గ చక్రాలను సృష్టించిన దార్శనికుడు.

గర్గ మహర్షి : వాతావరణ మార్పులు, భూకంపాలు, వర్షపాత ముందస్తు అంచనాలకు సంబంధించిన అద్భుతమైన సూత్రాలను అందించారు.

సూర్య భగవానుడు (మయుడు): మయ దానవునికి సూర్య భగవానుడు ఉపదేశించిన 'సూర్య సిద్ధాంతం' ఖగోళ గణితంలో మకుటాయమానం. గ్రహాల గతులను సెకన్ల వంతు కచ్చితత్వంతో లెక్కించే సూత్రాలు ఇందులో ఉన్నాయి.

వీరి తర్వాత కాలంలో ఆర్యభట్టు (భూభ్రమణ సిద్ధాంతం), వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు (గురుత్వాకర్షణకు ఆద్యుడు), భాస్కరాచార్యులు (కలన గణితం - Calculus) ఈ శాస్త్రాన్ని శిఖరాగ్రానికి చేర్చారు.

4. శాస్త్ర స్వరూపం: త్రిస్కంధాలు - మూల గ్రంథాలు

జ్యోతిషం ప్రధానంగా మూడు విభాగాలుగా (త్రిస్కంధాలు) విస్తరించింది. ఒక్కో విభాగానికి అనేక ప్రామాణిక గ్రంథాలు పుట్టుకొచ్చాయి.

ఎ. సిద్ధాంత స్కంధం (Mathematical Astronomy)

ఇది పూర్తిగా గణితం, త్రికోణమితి (Trigonometry), బీజగణితం (Algebra) లతో కూడుకున్నది. భూమి ఆకారం, గ్రహణాల లెక్కింపు, అక్షాంశ రేఖాంశాలు ఇందులో చర్చిస్తారు.

మూల గ్రంథాలు: సూర్య సిద్ధాంతం, ఆర్యభటీయం (ఆర్యభట్టు), సిద్ధాంత శిరోమణి, లీలావతి గణితం (భాస్కరాచార్య). ఆధునిక టెలిస్కోప్ లు లేని కాలంలోనే గ్రహాల కక్ష్యా మార్గాలను (Orbits) వీరు కచ్చితంగా లెక్కించారు.

బి. సంహితా స్కంధం (Mundane Astrology & Meteorology)

ఇది సామూహిక పరిణామాలను విశ్లేషిస్తుంది. దేశాల ఆర్థిక స్థితులు, యుద్ధాలు, భూకంపాలు, వాతావరణం, వాస్తు శాస్త్రం, జంతు శాస్త్రం ఇందులో అంతర్భాగాలు.

మూల గ్రంథాలు : వరాహమిహిరుని 'బృహత్ సంహిత' ఒక అద్భుతమైన ఎన్‌సైక్లోపీడియా. ఇందులో భూగర్భ జలాలను పసిగట్టే విజ్ఞానం (ఉదకార్గళం), వృక్ష ఆయుర్వేదం లాంటి ఎన్నో శాస్త్రీయ అంశాలు ఉన్నాయి.

సి. హోరా స్కంధం (Predictive / Natal Astrology)

ఇది వ్యక్తిగత జాతక విశ్లేషణ. జన్మ సమయ గ్రహస్థితులను బట్టి వ్యక్తి గుణగణాలు, కెరీర్, ఆరోగ్యం అంచనా వేసే మానవతావాద శాస్త్రం.

మూల గ్రంథాలు : బృహత్పరాశర హోరాశాస్త్రం (పరాశరుడు), బృహజ్జాతకం (వరాహమిహిరుడు), జాతక పారిజాతం (వైద్యనాథ దీక్షితులు), ఫలదీపిక (మంత్రేశ్వరుడు), సర్వార్థ చింతామణి.

5. భాష్యాలు – వ్యాఖ్యానాల విశిష్టత

ప్రాచీన మూల గ్రంథాలలోని సూత్రాలు అత్యంత నిగూఢమైనవి (సంక్షిప్త శ్లోక రూపంలో). ఆ రహస్యాలను తర్వాతి తరాల పండితులకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పడానికి ఎందరో మేధావులు అద్భుతమైన భాష్యాలు (Commentaries) రాశారు.

భట్టోత్పలుడు : వరాహమిహిరుని బృహజ్జాతకం, బృహత్ సంహితలకు ఈయన రాసిన వ్యాఖ్యానం అత్యంత ప్రామాణికమైనది.

పృథుయశస్సు : వరాహమిహిరుని కుమారుడైన ఇతను రచించిన 'హోరాసారం' తండ్రి గ్రంథానికి అద్భుతమైన కొనసాగింపు.

శ్రీనాథుడు, మల్లినాథ సూరి లాంటి ఉద్దండ పండితులు ఎన్నో కావ్యాల్లో జ్యోతిష శాస్త్ర పదాలను, ముహూర్తాలను అన్వయించి భాష్యాలు రాయడం ద్వారా ఈ శాస్త్ర ప్రామాణికతను పరిరక్షించారు.

6. ఆధునిక విజ్ఞాన శాస్త్ర సమన్వయం – అంతర్జాతీయ పరిశోధనా దృక్పథం

నేడు అంతర్జాతీయ వేదికలపై జ్యోతిషాన్ని కేవలం నమ్మకంగా కాకుండా, 'కాస్మిక్ సైకాలజీ' (Cosmic Psychology) మరియు 'బయో-రిథమ్స్' (Bio-rhythms) గా అధ్యయనం చేస్తున్నారు.

కాస్మిక్ రేడియేషన్ ప్రభావం: సౌర కుటుంబంలోని గ్రహాల నుండి వెలువడే విద్యుదయస్కాంత కిరణాలు (Electromagnetic radiations), సూర్యునిపై ఏర్పడే మచ్చలు (Sunspots) భూమిపై ఉన్న వాతావరణాన్ని, మానవుల నాడీ వ్యవస్థను (Nervous system) ప్రభావితం చేస్తాయని ఆధునిక క్వాంటం ఫిజిక్స్ నిర్ధారిస్తోంది.

మానసిక శాస్త్ర అన్వయం (Psychology) : ప్రముఖ పాశ్చాత్య మనోవిజ్ఞాన శాస్త్రవేత్త కార్ల్ జంగ్ (Carl Jung) జ్యోతిషాన్ని తీవ్రంగా అధ్యయనం చేసి 'సింక్రోనిసిటీ' (Synchronicity – అర్థవంతమైన యాదృచ్ఛికత) అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. విశ్వంలో జరిగే మార్పులకు, మానవుని అంతరంగంలో జరిగే మార్పులకు కచ్చితమైన అనుసంధానం ఉందని ఆయన నిరూపించాడు.

వైద్య జ్యోతిషం (Medical Astrology) : పౌర్ణమి, అమావాస్యల నాడు సముద్రాలపై ఆటుపోట్లు వస్తాయని అందరికీ తెలుసు. 70% శాతం పైగా నీరు (Fluids) ఉన్న మానవ దేహం మీద కూడా ఆ ఆకర్షణ శక్తి ప్రభావం ఉంటుందనేది శాస్త్రీయ సత్యం. గర్భస్థ శిశువు పెరుగుదల, జన్మ సమయ గ్రహ స్థితులు భవిష్యత్తులో రాబోయే జన్యుపరమైన వ్యాధులను (Genetic issues) ఎలా సూచిస్తాయో జ్యోతిషం అద్భుతంగా విశ్లేషిస్తుంది.

ఉపసంహారం (Conclusion)

వేదాంగ జ్యోతిషం అనేది ఏ గుడ్డి నమ్మకమో లేదా కేవలం భయపెట్టి పబ్బం గడుపుకునే విద్యో కాదు. అది పదివేల సంవత్సరాల భారతీయ మహర్షుల నిరంతర పరిశీలన (Observation), మేధోమథనం (Brainstorming), మరియు గణిత నిర్ధారణ (Mathematical Validation) లతో రూపుదిద్దుకున్న అద్భుతమైన కాస్మిక్ సైన్స్ (జశీంఎఱఎ ూఎఱవఅఎవ).

గణితం (Mathematics), ఖగోళం (Astronomy), పర్యావరణం (Environment), మరియు మనోవిజ్ఞానం (Psychology) కలగలిపిన ఈ అనంత జ్ఞానాన్ని అంతర్జాతీయ వేదికలపై మరింత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహర్షులు అందించిన ఈ దివ్య జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో, కంప్యూటర్ అల్గారిథమ్స్ తో జోడించి పరిశోధనలు చేస్తే, ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టడంలోనూ, మానవ మానసిక వికాసంలోనూ జ్యోతిషం ప్రపంచానికి ఒక అద్భుతమైన కరదీపికగా మారుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

"సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః"

(ఈ జ్యోతిష విజ్ఞానం లోక కల్యాణానికి, సర్వజన సుఖానికి ఉపకరించాలని ఆశిస్తూ ...)

మరుమాముల వేంకటరమణ శర్మ

సూర్యసిద్ధాంతమే శిరోధార్యం

భారతీయ ధర్మవ్యవస్థలో కాలం అనేది కేవలం గడియారం చూపే సంఖ్య కాదు. కాలం అనేది కర్మకు ఆధారం, వ్రతానికి మూలం, యజ్ఞానికి శరీరం, పంచాంగానికి ప్రాణం, ధర్మాచరణకు నియమం, దేవతారాధనకు మార్గదర్శి, మానవ జీవనానికి దిశానిర్దేశకుడు. ఈ కాలాన్ని దర్శింపజేసే శాస్త్రమే వేదాంగ జ్యోతిషం. ఆ వేదాంగ జ్యోతిషానికి ఖగోళ గణితరూప మహాగ్రంథమే సూర్యసిద్ధాంతం.

సూర్యసిద్ధాంతం ప్రారంభమవుతున్న మొదటి శ్లోకంలోనే పరబ్రహ్మను నమస్కరిస్తుంది:

అచింత్యావ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।
సమస్తజగదాధార మూర్తయే బ్రహ్మణే నమః ॥

ఈ శ్లోకంలో సూర్యసిద్ధాంతం తన స్వరూపాన్ని ప్రకటిస్తుంది. బ్రహ్మ అచింత్యం, అవ్యక్తం, నిర్గుణం అయినప్పటికీ, జగత్తులో గుణరూపంగా, కాలరూపంగా, గతిరూపంగా, చక్ర రూపంగా, యుగరూపంగా వ్యక్తమవుతాడు. ఖగోళ గణితంలో కూడా ఇదే భావం కనిపిస్తుంది. గ్రహాలు యాదృచ్ఛికంగా కదలవు. వాటి గతి కాలానికి ఆధీనంగా ఉంటుంది. కాలం సంఖ్యగా మారినప్పుడు అహర్గణం అవుతుంది. అహర్గణం గ్రహభగణాలతో సంయుక్తమైనప్పుడు మధ్యమ గ్రహస్థానం వస్తుంది. మంద శీఘ్ర సంస్కారాల ద్వారా స్ఫుట స్థానం లభిస్తుంది. ఆ స్ఫుటస్థానాల నుంచి తిథి, నక్షత్రం, యోగం, కరణం, సంక్రాంతి, గ్రహణం, ఋతువు, అయనం, సంవత్సరం అన్నీ నిర్ణయించబడతాయి.

అందువల్ల సూర్యసిద్ధాంతంలో మొదటి నమస్కారం కేవలం భక్తి నమస్కారం కాదు. అది ఒక మహా శాస్త్ర దర్శనం. జగత్తు ఒక సమగ్ర నియమంలో నడుస్తోంది. ఆ నియమం బ్రహ్మతత్త్వం. ఆ నియమం కాలంగా వ్యక్తమవు తుంది. కాలం గతిని కలిగిస్తుంది. గతి ద్వాదశరాశ్యాత్మక చక్రాన్ని సృష్టిస్తుంది. చక్రం యుగాన్ని నిర్మిస్తుంది. యుగం ధర్మపరిణామానికి ఆధారమవుతుంది. ఈ విధంగా బ్రహ్మం నుండి పంచాంగం వరకు ఒకే కాలసూత్రం విస్తరించి ఉంది.

సూర్యసిద్ధాంతం రెండవ శ్లోకంలో మయాసురుడు కృతయుగాంత సమీపంలో అత్యున్నతమైన, పవిత్రమైన, రహస్యమైన జ్ఞానాన్ని తెలుసుకోవాలని సంకల్పిస్తాడు :

అల్పావశిష్టే తు కృతే మయో నామ మహాసురః ।
రహస్యం పరమం పుణ్యం జిజ్ఞాసుర్జ్ఞానముత్తమమ్ ॥

ఇక్కడ "రహస్యం" అనే పదం చాలా గంభీరమైనది. కంటికి కనిపించేది సూర్యోదయం, చంద్రకళ, పౌర్ణమి, అమావాస్య, గ్రహణం, గ్రహసంచారం. కానీ వాటి వెనుక గల గణిత నియమం కంటికి కనిపించదు. చంద్రుడు పెరుగుతున్నాడని చూస్తాం; కాని తిథి 12 డిగ్రీల సూర్యచంద్ర కోణాంతరంతో నిర్ణయమవుతుందని గణితమే చెబుతుంది. సూర్యుడు రాశి మారుతున్నాడని పంచాంగం చెబుతుంది; కాని ఆ సంక్రాంతి క్షణం సూర్య దీర్ఘాంశం 30 డిగ్రీల మలుపు దాటినప్పుడు సంభవిస్తుందని గణితం నిర్ధారిస్తుంది. కనిపించే గతి వెనుక కనిపించని నియమమే రహస్యం. ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనే తపననే జిజ్ఞాస అంటారు.

మూడవ శ్లోకం సూర్యసిద్ధాంతం యొక్క స్థానం స్పష్టంగా ప్రకటిస్తుంది:

వేదాంగమగ్ర్యమఖిలం జ్యోతిషాం గతికారణమ్ ।
ఆరాధయన్వివస్వంతం తపస్తేపే సుదుశ్చరమ్ ॥

జ్యోతిషం వేదాంగం. వేదకర్మలు కాలబద్ధమైనవి. ఏకాదశి ఏ రోజున? అమావాస్య ఎప్పుడు? పౌర్ణిమ ఎప్పుడు? సంక్రాంతి పుణ్యకాలం ఎప్పుడు? గ్రహణస్నానం ఎప్పుడు చేయాలి? ఉపాకర్మ ఎప్పుడు? నవరాత్రారంభ తిథి ఎప్పుడు? చాతుర్మాస్యం ఎప్పుడు ప్రారంభం? ఇవన్నీ

ఖచ్చిత కాలం మీద ఆధారపడతాయి. కాలం(గణన) తప్పితే కర్మ తప్పుతుంది. కర్మ తప్పితే ఆచరణలో లోపం వస్తుంది. అందువల్ల జ్యోతిషం వేదానికి కన్నులాంటిది.

ఈ శ్లోకంలో "జ్యోతిషాం గతికారణమ్" – ఈ పదమే శ్లోక హృదయం. ఇక్కడ "గతి" అంటే కేవలం కదలిక కాదు.

గతి అంటే సూర్యుని రాశి సంచారం, చంద్రుని నిత్య గతి, గ్రహాల మధ్యమ గతి, వక్రగతి లాంటి ప్రత్యక్ష భేదాలు, మందగతి, శీఘ్రగతి, ఉత్తరాయణ, దక్షిణాయణ సంబంధం, నక్షత్రపథంలో స్థాన మార్పు

కారణం అంటే ఆ గమనాన్ని వివరించే సూత్రం, ఆ గమనానికి ఉపయోగించే కాలప్రమాణం, ఆ గమనాన్ని గణించడానికి తీసుకునే భగణాలు, ఆ గమనాన్ని స్ఫుటం చేసే సంస్కారాలు

అందుకే "గతికారణం" అంటే : ("దృశ్యగ్రహ గమనానికి వెనుక ఉన్న గణితనియమం") గ్రహాల గతి కనిపిస్తుంది. కానీ ఆ గతి ఎందుకు, ఎలా, ఏ సమీకరణంతో, ఏ కాలప్రమాణంతో, ఏ సంస్కారంతో నిర్ణయించబడుతుంది అన్నదే గతికారణం. సూర్యసిద్ధాంతం కేవలం గ్రహం ఎక్కడ ఉందో చెప్పే పట్టిక కాదు. కాలాన్ని ఆధారంగా చేసుకుని గ్రహస్థితి ఎలా గణించాలో చెప్పే దివ్యశాస్త్రం.

నాలుగవ శ్లోకంలో సూర్యుడు స్వయంగా మయునికి గ్రహచరితాన్ని ఉపదేశిస్తాడు:

తోషితస్తపసా తేన ప్రీతస్తస్మై వరార్థినే ।
గ్రహాణాం చరితం ప్రాదాన్మయాయ సవితా స్వయమ్ ॥

ఇక్కడ "సవితా స్వయమ్" అనే పదం ఎంతో ముఖ్యమైనది. సూర్యుడు కాలస్వరూపుడు. మన అనుభవంలో కాలం ముందుగా సూర్యుని ద్వారానే తెలిసేది. సూర్యోదయం దినాన్ని ఇస్తుంది. సూర్యాస్తమయం రాత్రిని ఇస్తుంది. సూర్యక్రాంతి ఋతువులను ఇస్తుంది. సూర్యుని ఉత్తరాయణ, దక్షిణాయణ గమనాలు దేవతల పగలు, రాత్రి భావాన్ని ఇస్తాయి. సూర్యుని రాశి ప్రవేశాలు సంక్రాంతులను ఇస్తాయి. సూర్యుని పూర్తి చక్రం సంవత్సరం అవుతుంది. కాబట్టి కాలాశ్రయ గ్రహగణితాన్ని సూర్యుడే ఉపదేశకుడిగా ప్రకటించడం కేవలం పురాణకథ కాదు; అది ఖగోళపరంగా సార్థకమైన నిర్మాణం.

ఐదవ శ్లోకం సూర్యసిద్ధాంతపు ప్రధాన సూత్రాన్ని ఇస్తుంది:

విదితస్తే మయా భావస్తోషితస్తపసా హ్యహమ్ ।
దద్యాం కాలాశ్రయం జ్ఞానం గ్రహాణాం చరితం మహత్ ॥

"కాలాశ్రయం జ్ఞానం" – ఈ పదం మొత్తం శాస్త్రసారం. గ్రహగతి కాలంపై ఆధారపడింది. కాలం లేకుండా గ్రహ స్థానం లేదు. ఏ గ్రహం ఎక్కడ ఉంది అని అడగడం సరిపోదు; ఏ సమయంలో ఎక్కడ ఉంది అని అడగాలి. సూర్యసిద్ధాంతం ముందుగా కాలాన్ని అహర్గణగా మార్చు తుంది. తర్వాత గ్రహభగణాలను తీసుకుని మధ్యమ స్థానాన్ని గణిస్తుంది. తర్వాత మంద, శీఘ్ర సంస్కారాలతో స్ఫుట స్థానాన్ని ఇస్తుంది. అక్కడి నుంచి పంచాంగం పుడుతుంది.

ఆరవ, ఏడవ శ్లోకాల్లో సూర్యుడు తన తేజస్సు నేరుగా భరించలేరని, తన అంశపురుషుడు మయునికి నిశ్శేషంగా చెప్పుతాడని పేర్కొంటాడు. ఇది గణితపరంగా కూడా లోతైనది. ప్రకృతి సత్యాన్ని మనం నేరుగా సంపూర్ణంగా పట్టలేము. సూర్యుని నేరుగా చూడలేనట్లే, ఆకాశ గమనాల సమగ్రతను కూడా మనం నేరుగా గ్రహించలేం. దానికి శాస్త్రరూప మధ్యవర్తి అవసరం. ఆ శాస్త్రపురుషుడే సూర్యాంశ పురుషుడు.

ఎనిమిదవ, తొమ్మిదవ శ్లోకాలు ఈ జ్ఞానం యుగ యుగాలపాటు మహర్షులకు ఉపదేశించబడిందని, మూలశాస్త్రం అదే అయినప్పటికీ యుగపరివర్తనంతో కాలభేదం మాత్రమే వస్తుందని చెబుతాయి:

శాస్త్రమాద్యం తదేవేదం యత్పూర్వం ప్రాహ భాస్కరః ।
యుగానాం పరివర్తేన కాలభేదోఽత్ర కేవలః ॥

ఇది అత్యంత ముఖ్యమైన వాక్యం. శాస్త్రస్వరూపం

స్థిరం. కానీ కాలభేదం రావచ్చు. యుగం మారినప్పుడు అహర్గణాది, కాలసూచిక, గణన స్థానం, సంస్కార భావం మారదు. సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలంటే మూలశాస్త్రమైన సూర్య సిద్ధాంతాన్ని తెలుసుకోవాలి; కేవలం కాలభేదమేకాని గణితభేదంకాదని గ్రహించి గణన చేయాలి. ఇదే వైదిక సంప్రదాయంలో శాశ్వతత మరియు కాలానుగుణంగా ధర్మాచరణ.

పదవ శ్లోకం కాలాన్ని రెండు విధాలుగా చూపుతుంది:

లోకానామంతకృత్కాలః కాలోఽన్యః కలనాత్మకః ।
స ద్విధా స్థూలసూక్ష్మత్వాన్మూర్తశ్చామూర్త ఉచ్యతే ॥

కాలం ఒకటి లోకాల అంతానికి కారణమైన మహా కాలం. మరొకటి గణనకు పనికొచ్చే కలనాత్మక కాలం. ఆ కలనాత్మక కాలం మూర్తం, అమూర్తం. ప్రాణం మొదలైనది మూర్తం; తృటి మొదలైనది అమూర్తం. ఇక్కడ సూర్య సిద్ధాంతం కాలాన్ని సూక్ష్మం నుండి స్థూలం వరకు నిర్మిస్తుంది. ఆరు ప్రాణాలు ఒక వినాడి; అరవై వినాడులు ఒక నాడి; అరవై నాడులు ఒక అహోరాత్రం. ఇలా ప్రాణం నుండి దినం, మాసం, సంవత్సరం, దివ్య సంవత్సరం, యుగం, మన్వంతరం, కల్పం వరకు కాలం గణించ బడుతుంది.

ఇక్కడ ప్రాణం అనే పదం చాలా గంభీరమైనది. యజుర్వేదంలో"ప్రాణాయ త్వా, అపానాయ త్వా, వ్యానాయ త్వా" అనే వాక్యాలు కనిపిస్తాయి. ప్రాణం యజ్ఞశరీరానికి జీవశక్తి. సూర్యసిద్ధాంతంలో అదే ప్రాణం కాలగణనకు మూర్త ప్రమాణం. దీనివల్ల సూర్యసిద్ధాంతం కాలాన్ని నిర్జీవ సంఖ్యగా కాకుండా జీవస్పందనగా చూస్తుంది. ప్రాణం జీవిలో కాలాన్ని కదిలిస్తే, సూర్యుడు జగత్తులో కాలాన్ని కదిలిస్తాడు.

సూర్యసిద్ధాంతం మాసాలనూ ఒకే రకంగా చూడదు. తిథుల ఆధారంగా చాంద్ర మాసం. సంక్రాంతి ఆధారంగా సౌర మాసం. సూర్యోదయాల ఆధారంగా సావన మాసం. నక్షత్ర సంబంధంగా నాక్షత్ర మాసం. ఇది అద్భుతమైన ఆచరణీయ బుద్ధి. వ్రతాలకు చాంద్రమానం అవసరం. సంక్రాంతి, ఋతు, అయనాలకు సౌరమానం అవసరం. యజ్ఞదినచర్యకు సావన మానం అవసరం. నక్షత్రకర్మలకు నాక్షత్ర మానం అవసరం. అందువల్ల సూర్యసిద్ధాంతం ఒకే కాలాన్ని అనేక ఆచరణల అవసరానికి అనుగుణంగా విభజిస్తుంది.

వ్రతాలు, పూజలు, ధార్మిక పండుగలు సూర్యసిద్ధాంత గణితాన్ని శిరోధార్యం చేసుకోవలసిన అవసరం ఇక్కడే స్పష్టమవుతుంది. ఏకాదశి తిథి సూర్యచంద్ర కోణాంతరం లేకుండా నిర్ణయించబడదు. అమావాస్య, పౌర్ణిమ చంద్ర సూర్య సంబంధం లేకుండా నిర్ణయించబడవు. సంక్రాంతి సూర్యరాశి ప్రవేశం లేకుండా నిర్ణయించబడదు. గ్రహణం సూర్యచంద్రులు రాహు-కేతు సమీపంలో ఉండకపోతే సంభవించదు. నక్షత్రాలు చంద్రస్థానంతో నిర్ణయించ బడతాయి. ఋతువులు సూర్యసంచారంతో నిర్ణయించ బడతాయి. అయనాలు సూర్యక్రాంతితో సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి సిద్ధాంతగణితం లేకుండా ఆచరణకు బలం లేదు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. సూర్యసిద్ధాంతం దృశ్య ఖగోళాన్ని లెక్కించడానికి ఒక గణిత శాస్త్రం; కానీ అది కేవలం లౌకిక నేత్ర దృక్తుల్య సాక్ష్యం మాత్రమే కాదు. ప్రారంభ శ్లోకాలు ఆప్తోపదేశం, శాస్త్రప్రవేశం, కాలతత్త్వం, జిజ్ఞాస, తపస్సు, సవిత్ర ఉపదేశం, కాలాశ్రయ జ్ఞానం అనే అంతరంగాన్ని ఇస్తాయి. కొన్ని గణిత సూత్రాలు ఆకాశ దృశ్యంతో పరీక్షించబడగల ఫలితాలను ఇస్తాయి.

గ్రహసాధనకు మధ్యమగతి మూలం

ఈ శాస్త్రంలో మధ్యమగతి ఎందుకు అవసరం? స్పష్టగతి క్షణక్షణం మారుతుంది. చంద్రుడు భూమికి దగ్గరగా ఉన్నప్పుడు వేగంగా, దూరంగా ఉన్నప్పుడు నెమ్మదిగా కదులుతాడు. సూర్యుని ప్రత్యక్ష గతి కూడా సంవత్సరమంతా సమంగా ఉండదు. బుధ, శుక్ర, కుజ, గురు, శని గ్రహాలకు వక్రగతి, మందగతి, శీఘ్రగతి వంటి ప్రత్యక్ష భేదాలు ఉంటాయి. కాబట్టి నేరుగా స్పష్టగతిని మూలంగా తీసుకుంటే స్థిరమైన గణన సాధ్యం కాదు. అందుకే ముందు మధ్యమగతి అనే సమగతి అవసరం.

మధ్యమగ్రహం గణితానికి ఆధారం; స్పష్టగ్రహం దృగ్గోచరమవుతుంది. మధ్యమం లేకుండా స్పష్టం గణింపబడదు.

ధర్మపాదవ్యవస్థ

యుగగణనలో సూర్యసిద్ధాంతం మరింత గొప్ప నిర్మాణాన్ని ఇస్తుంది. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు ధర్మపాదవ్యవస్థ ప్రకారం 4:3:2:1 నిష్పత్తిలో ఉన్నాయి. ధర్మం కృతయుగంలో నాలుగు పాదాలతో, త్రేతాలో మూడు పాదాలతో, ద్వాపరంలో రెండు పాదాలతో, కలిలో ఒక పాదంతో నిలుస్తుందని పురాణధర్మం చెబుతుంది. సూర్య సిద్ధాంతం అదే ధర్మపాదాన్ని కాలగణితంగా కూర్చుతుంది. మహాయుగం 10 భాగాలుగా భావించబడుతుంది, ఎందుకంటే 4+3+2+1 = 10. ఈ దశమ భాగమే కలియుగ పరిమాణంగా నిలుస్తుంది. దానిని 4, 3, 2, 1తో గుణించి నాలుగు యుగాల కాలం నిర్ణయించ బడుతుంది.

ప్రతి యుగానికి సంధ్యా, సంధ్యాంశం కూడా ఇవ్వబడుతుంది. యుగం ఒక్కసారిగా మారదు. ఉదయ సంధ్య రాత్రి నుండి పగలుకు మార్పు చూపినట్లు, యుగ సంధ్య పూర్వ యుగధర్మం నుండి కొత్త యుగధర్మానికి మార్పు చూపుతుంది. యుగప్రధాన భాగంలో ఆ యుగధర్మం బలంగా పనిచేస్తుంది. యుగాంత సంధ్యాంశంలో ఆ ధర్మం క్షీణించి తదుపరి యుగానికి మార్గం చేస్తుంది. ఇది కాలాన్ని యాంత్రిక లెక్కగా కాకుండా ధర్మపరిణామంగా చూపే అత్యంత లోతైన సిద్ధాంతం.

కలియుగం విషయంలో ఆది సంధ్యా 36,000 మానవ సంవత్సరాలు. ప్రస్తుతానికి కలియుగం సుమారు 5,127 సంవత్సరాలు మాత్రమే గడిచిందని సంప్రదాయంగా లెక్కిస్తే, మనం ఇంకా కలి ఆది సంధ్యాలోనే ఉన్నామని చెప్పవచ్చు. కాలగణన ప్రకారం కలియుగం ప్రారంభమైంది; కానీ యుగధర్మ పరిణామదృష్టిలో కలి ప్రధాన ప్రభావం ఇంకా సంధ్యా దశలోనే వ్యక్తమవుతోంది. ఇది పురాణవాక్యాలకు విరుద్ధం కాదు; యుగధర్మం పరిణామక్రమంగా ప్రవేశి స్తుందని చెప్పవచ్చు.

మన్వంతరకాలం– ప్రజాపతి పాలన

మన్వంతర గణన మరింత లోతైనది. 71 చతుర్యుగాలు ఒక మన్వంతరం. ప్రతి మన్వంతరాంతంలో కృతయుగ పరిమాణం గల సంధి జలప్లవంగా చెప్పబడింది. ఒక కల్పంలో 14 మనువులు, 15 సంధులు ఉంటాయి. 14 మన్వంతరాలు, వాటి సంధులు కలిపి 1000 చతుర్యుగాలు అవుతాయి. ఇదే బ్రహ్మదేవుని పగలు. రాత్రి కూడా అంతే. ఇక్కడ కాలం మానవ కాలం కాదు. ఇది దేవతా–ప్రజాపతి–బ్రహ్మాండ కాలం.

ఇక్కడ ఒక గొప్ప ప్రశ్న వస్తుంది : 1000 మహా యుగాలు అని చెప్పేస్తే సరిపోదా? మధ్యలో మనువుల ప్రస్తక్తి ఎందుకు? సమాధానం --- 1000 మహాయుగాలు అనేది గణిత పరిమాణం; 14 మన్వంతరాలు అనేది దైవ–ధర్మ–పాలన పరిమాణం. యుగధర్మం కాలస్వభావం. మనుధర్మం ప్రజల నిర్వహణ వ్యవస్థ. ఒక మన్వంతరంలో మనువు, ఇంద్రుడు, దేవగణాలు, సప్తర్షులు, ప్రజాపతులు, అవతార ధర్మం, ధర్మవ్యవస్థ ఉంటాయి. కాబట్టి యుగం కాలధర్మాన్ని చెబుతుంది; మన్వంతరం ఆ కాలంలో నడిచే దైవ(ప్రజాపతి) పరిపాలనను చెబుతుంది. ఇవి రెండూ అవసరం.

ఏడవ మనువు వైవస్వతప్రజాపతి

మన ప్రస్తుత స్థానం వైవస్వత మన్వంతరం. ఈ కల్పంలో ఆరు మన్వంతరాలు గడిచాయి. ఇప్పుడు ఏడవ మనువు వైవస్వతుడు పాలిస్తున్నాడు. అతని మన్వంతరంలో 27 చతుర్యుగాలు గడిచాయి; మనం 28వ చతుర్యుగంలోని కలియుగంలో ఉన్నాము. అందుకే ప్రతి సంకల్పంలో "శ్వేతవరాహ కల్పే, వైవస్వత మన్వంతరే, అష్టావింశతితమే కలియుగే" అని చెప్పబడుతుంది. ఇది కేవలం శబ్దాచారం కాదు. మన పూజను బ్రహ్మాండ కాలస్థానంలో నిలబెట్టే మహత్తర ప్రక్రియ.

ఒక వ్యక్తి ఇంట్లో దీపం వెలిగించి పూజ చేస్తాడు. అది చిన్న ఆచరణగా కనిపించవచ్చు. కానీ సంకల్పంలో

అతను తనను బ్రహ్మదేవుని ద్వితీయ పరార్ధంలో, శ్వేతవరాహ కల్పంలో, వైవస్వత మన్వంతరంలో, కలియుగంలో, భారత వర్షంలో, తన మాసం, పక్షం, తిథి, నక్షత్రం, వారంతో స్థాపిస్తాడు. అంటే వ్యక్తిగత పూజ బ్రహ్మాండ కాలంతో అను సంధానం పొందుతుంది. ఇదే వైదిక ధర్మం యొక్క మహిమ. ఇదే సూర్యసిద్ధాంత కాలగణన యొక్క ఆచరణీయత.

సూర్యసిద్ధాంతం అర్థం కావడానికి గణితం అవసరం. కానీ పూర్తిగా అర్థం కావడానికి జన్మాంతర సంస్కారం అవసరం. వేదాలు, స్మృతులు, పురాణాలు, ధర్మశాస్త్రాలు, యజ్ఞకర్మలు, పంచాంగాచరణ, సంకల్ప విధానం తెలిసిన సంస్కారంతో చదివితే సూర్యసిద్ధాంతం కేవలం సంఖ్యా గ్రంథంగా కనిపించదు. అది కాలస్వరూపుడైన సవితా భగవానుని శాస్త్రోపదేశంగా ప్రకాశిస్తుంది.

గణితం మాత్రమే చూసేవారికి సూర్యసిద్ధాంతం మధ్యమగతి, మందఫలం, శీఘ్రఫలం, అహర్గణం, గ్రహణ గణితం, తిథి గణితం వంటి శాస్త్రరూపంగా కనిపిస్తుంది. అది నిజమే. కానీ వేదాంగ దృష్టితో చూసినప్పుడు అది ధర్మాచరణకు కాలాన్ని ఇచ్చే శాస్త్రంగా కనిపిస్తుంది. పురాణ దృష్టితో చూస్తే అది యుగ, మన్వంతర, కల్ప మహాకాలాన్ని గణనీయంగా చూపే బ్రహ్మాండ కాలశాస్త్రంగా కనిపిస్తుంది. తత్త్వ దృష్టితో చూస్తే కాలమే దైవస్వరూపం అని దర్శనమిస్తుంది.

అందుకే సూర్యసిద్ధాంతం ముక్తిసాధనకుమూలమై వైదిక కర్మానుష్ఠానాలకు శిరోధార్యం. వ్రతాలు దాని మీద ఆధారపడాలి. పండుగలు దాని గణనతోధర్మశాస్త్ర నియమాలతో స్పష్టత పొందాలి. తిథి, నక్షత్ర, సంక్రాంతి, అయన, ఋతు, మాస, పక్ష నిర్ణయాలు వేదాంగ విహితమైన సిద్ధాంతోపదేశ ఖగోళ గణితంతో బలపడాలి. సూర్య చంద్రులు, రాహు-కేతువులు, గ్రహాలు, నక్షత్రాలు, కాల ప్రమాణాలు అన్నీ కలిసి మానవ జీవనాన్ని ధర్మబద్ధంగా నడిపే పంచాంగరూపంలో నిలుస్తాయి.

వైదిక ధర్మంలో కర్మకు కాలం ప్రాణం. కాలానికి సూర్యుడు ప్రాణం. ఆ సూర్యుడి ప్రసాదంగా వచ్చిన కాలగణిత శాస్త్రమే సూర్యసిద్ధాంతం. అందువల్ల అది కేవలం ఖగోళ పుస్తకం కాదు; అది పూజా శాస్త్రం, వ్రత శాస్త్రం, యజ్ఞ కాలశాస్త్రం, ధర్మ జీవన మార్గదర్శి, మహాకాల దర్శన శాస్త్రం.

ముఖ్యంగా చెప్పాలంటే -

వేదం కాలాన్ని యజ్ఞస్వరూపంగా దర్శిస్తుంది. పురాణం కాలాన్ని యుగ - మన్వంతర - కల్ప ధర్మచక్రంగా విస్తరిస్తుంది. సూర్యసిద్ధాంతం ఆ కాలాన్ని గణనీయమైన ఖగోళ శాస్త్రంగా కూర్చుతుంది. పంచాంగం ఆ గణనను మానవ ఆచరణలోకి తీసుకువస్తుంది.

యజుర్వేదం కాలాన్ని యజ్ఞ-దేవత-ఋతు-సూర్య-చంద్ర-నక్షత్ర సంబంధంగా చూపుతుంది;

సూర్యసిద్ధాంతం అదే కాలాన్ని గణనీయమైన ఖగోళ-పంచాంగ వ్యవస్థగా కూర్చుతుంది.

అంటే : ("యజుర్వేదం" = "కాలం యొక్క యజ్ఞాత్మక దర్శనం")

("సూర్యసిద్ధాంతం" = "అదేకాలంయొక్కఖగోళ" - "గణితనిర్మాణం")

తైత్తిరీయ సంహితా పాఠంలో కూడా దీనికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన వాక్యాలు కనిపిస్తున్నాయి - ఉదాహరణకు "దేవో వః సవితా...", "దేవస్య సవితుః ప్రసవే...", "సూర్యస్య రశ్మిభిః", "ఋతూన్ కల్పయాతి / ఋతుభిః కల్పయాతి", "నక్షత్రాణాం..." వంటి పదాలు కాలం, సూర్యుడు, ఋతువులు, నక్షత్రాలు, యజ్ఞకర్మల మధ్య సంబంధాన్ని స్పష్టంగా చూపుతున్నాయి.

సూర్యుడు - కాలస్వరూపుడు, యజ్ఞప్రేరకుడు. "దేవో వః సవితా ప్రార్పయతు శ్రేష్ఠతమాయ కర్మణే" అని వేదప్రమాణం. అంటే సవితా దేవుడు శ్రేష్ఠమైన కర్మకు ప్రవృత్తి కలిగించుగాక. ఇది సూర్యసిద్ధాంతంతో ఇలా కనిపిస్తుంది:

"గ్రహాణాం చరితం ప్రాదాన్ మయాయ సవితా స్వయమ్" అంటే సవితా స్వయంగా గ్రహచరితం ఉపదేశించాడు.



యజుర్వేదం చెబుతుంది: సవితా కర్మకు ప్రేరకుడు. సూర్యసిద్ధాంతం చెబుతుంది: సవితా కాలాశ్రయ గ్రహ గణితానికి ఉపదేశకుడు. ఇవి కలిపితే: ?("సవితా" = "కర్మప్రేరకుడు" + "కాలప్రేరకుడు" "గ్రహగతిజ్ఞాన ఉపదేశకుడు")

అందువల్ల వ్రతం, యజ్ఞం, పూజ, పంచాంగం – ఇవన్నీ సవితృ ప్రేరణ/ఆజ్ఞలోనే నిలబడతాయి.

"దేవస్య సవితుః ప్రసవే" – కర్మ కాలబద్ధం. వేదంలో పదేపదే "దేవస్య త్వా సవితుః ప్రసవే" అని వస్తుంది. అర్థం – "సవితా దేవుని ప్రసవం/ప్రేరణ/ఆజ్ఞలో ఈ కర్మను చేస్తున్నాను." ఇది సూర్యసిద్ధాంతంలో: "కాలాశ్రయం జ్ఞానం" అనే భావంతో కలుస్తుంది. వేదకర్మ చేయటానికి తిథి ఆధారం, నక్షత్రం ,మాసం, పక్షం, ఋతువు, అయనం, సంక్రాంతి ఆధారంగా నిర్ణయించబడుతుంది.

సూర్యసిద్ధాంతం: "తిథి, నక్షత్రం, సంక్రాంతి, అయనం, మాసం, సంవత్సరం" వాటిని ఖగోళ గణితంతో నిర్ధారి స్తుంది.

("యజుర్వేదంకర్మనుసవితృప్రసవంతోకట్టుతుంది" ; "సూర్యసిద్ధాంతం ఆ కర్మకాలకు ఖగోళగణన ఇస్తుంది")

"సూర్యస్య రశ్మిభిః" – సూర్యకిరణం, పవిత్రతకు, కాలానికి ప్రతీక. "దేవో వః సవితోత్పునాతు అచ్ఛిద్రేణ పవిత్రేణ వసోః సూర్యస్య రశ్మిభిః" అని శ్రుతి. సవితా దేవుడు సూర్యకిరణాలతో పవిత్రం చేయుగాక అని భావం. ఇది సూర్యసిద్ధాంతంతో రెండు విధాలుగా కలుస్తుంది: ఆధ్యా త్మికంగా సూర్యకిరణం పవిత్రతకు సూచక.ఖగోళంగా సూర్యకిరణమే దినరాత్రి భేదం ఇస్తుంది, ఋతుభేదం ఇస్తుంది, అయన గమనాన్ని అనుభవంలోకి తెస్తుంది,శంకు-ఛాయా గణితానికి ఆధారం. సూర్యోదయ-సూర్యాస్తమయా లకు కారణం,యజ్ఞకాలాన్ని స్థాపిస్తుంది

సూర్యసిద్ధాంతంలో సూర్యక్రాంతి, శంకు, ఛాయా, దినమానం, దిశ, దేశాంతర మొదలైన గణితాలు ఈ "సూర్యస్య రశ్మిభిః" భావానికి ఖగోళ రూపం.

ఋతువులు – "స ఋతూన్ కల్పయాతి" మరియు మరోచోట "దేవాన్ ఋతుభిః కల్పయాతి" అనే భావం కనిపిస్తుంది. ఇది అత్యంత ముఖ్యమైనది. ఋతు అనే పదానికి మూలం ఋతం -(కాస్మిక్ ఆర్డర్) ఋతువులు అంటే కాలంలో ఋతస్వరూప క్రమం. సూర్యసిద్ధాంతంలో ఋతువులు సూర్య సంచారంతో గణించబడతాయి:

("సూర్యసంచారం" – "ఋతుచక్రం" – "యజ్ఞకాలం")

సూర్యసిద్ధాంతం మనకు చెబుతున్నది ఒకటే కాలం సంఖ్య కాదు; కాలం దైవం. గ్రహగతి గణితం కాదు; అది కాలస్వరూప దర్శనం. పంచాంగం తేదీల పట్టిక కాదు; అది ధర్మాచరణకు దేవతారాధనకు ముఖద్వారం.

కాబట్టి వైదిక కర్మానుష్ఠానాలకు, వ్రతాలకు, పండుగలకు, మానవ జీవన ధర్మానికి సూర్యసిద్ధాంతమే శిరోధార్యం.

డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

జ్యోతిష్యశాస్త్ర మూలాలు - వైజ్ఞానిక విశ్లేషణ

జ్యోతిష్య శాస్త్ర వైదిక మూలాలు మరియు గ్రహ విజ్ఞాన ఉద్భవం

సనాతన వైదిక వాఙ్మయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన విజ్ఞాన విభాగాలలో జ్యోతిష్య శాస్త్రం ప్రథమ శ్రేణికి చెందినది. శాస్త్ర పరిభాషలో 'జ్యోతి' అనగా వెలుగు లేదా కాంతి అని అర్థం. అంతరిక్షంలో ప్రకాశించే నక్షత్రాలు, గ్రహాలు, సూర్యుడు, చంద్రుడు వంటి ఖగోళ కాంతిగోళాలు భూమి యొక్క వాతావరణంపై, సమస్త ప్రాణులపై నిరంతరం చూపే భౌతిక, రసాయనిక, మానసిక ప్రభావాలను, మానవ జీవితంతో వాటికి గల పరస్పర సంబంధాలను అధ్యయనం చేసే పరమ వైజ్ఞానిక శాస్త్రమే జ్యోతిష్యం .వేద పురుషునికి నేత్రం వంటిది జ్యోతిష్య శాస్త్రం కాబట్టి దీనిని వైదిక యుగం నుండి "వేదాంగం" అని పిలుస్తారు. వేదాలను దర్శించిన మహర్షులు ఎటువంటి భౌతిక లాభాలను ఆశించకుండా, కేవలం సత్యాన్వేషణలో భాగంగా సృష్టికి మూలకారణమైన పరమాత్మ చైతన్యాన్ని, కాలచక్రాన్ని నిర్దేశించే గ్రహ గతులను విశ్లేషించారు.

ఈ సృష్టి అంతా పృథ్వి, ఆపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశము అనే పంచభూతములతో నిర్మితమై ఉంది. సమస్త జీవకోటిని నియంత్రించే ఏడు ప్రధాన గ్రహాలు ఈ పంచభూతముల ఆధీనంలోనే పనిచేస్తాయి; మన పూర్వులైన మహర్షులు, సిద్ధులు దీనిని ఒక క్రమ పద్ధతిలో మలచి 'స్వరశాస్త్రం' అని పిలిచారు . సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శనిలతో పాటు రాహు, కేతువులు అనే ఛాయాగ్రహాల సంయుక్త గమనం ద్వారా సమస్త భూగోళంపై ప్రాణుల ఆలోచనలు, శారీరక కదలికలు నియంత్రింపబడుతున్నాయని ప్రాచీన విజ్ఞానం స్పష్టం చేస్తోంది. పరాశర మహర్షి సిద్ధాంతాలు మరియు జ్యోతిష్య అనుబంధం వైదిక జ్యోతిష్య శాస్త్రానికి పితామహుడిగా పరాశర మహర్షి పూజింపబడుతున్నారు. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలే నేటికీ సమస్త ఫలిత జ్యోతిష్యానికి ప్రాథమిక ప్రమాణాలుగా నిలిచాయి. పరాశర మహర్షి రచించిన 'బృహత్ పరాశర హోరా శాస్త్రం' జాతక చక్ర విశ్లేషణకు, వివిధ దశా విధానాలకు అత్యంత విశ్వసనీయమైన మార్గదర్శిగా నిలుస్తోంది. ఆయన అందించిన హోరా మార్గ సిద్ధాంతాలు మరియు నియమాలే 'పూర్వ పరాశరి', 'అనుభవజాతక తరంగిణి' వంటి అమూల్యమైన గ్రంథాలకు జీవనాడి అయ్యాయి.

గ్రహాల ఉచ్ఛ, నీచ, మిత్ర, శత్రు స్థితులు, వివిధ రాశులలో వాటి బలాబలాలు, ద్వాదశ భావాల వృద్ధి మరియు హాని వంటి సున్నితమైన అంశాలను పరాశర సిద్ధాంతం అత్యంత వైజ్ఞానికంగా వివరిస్తుంది . వైదిక జ్యోతిషశాస్త్రంలో పరాశర సిద్ధాంతం ప్రకారం జాతక చక్రంలోని 12 భావాలు మనిషి జీవితాన్ని పూర్తిగా నిర్దేశిస్తాయి. ఆ ద్వాదశ భావాల పేర్లు, అవి సూచించే ముఖ్య విషయాలు ఇవి:

ప్రథమ భావం (లగ్న భావం/తను స్థానం) : ఇది మనిషి యొక్క శారీరక రూపం, ఆరోగ్యం, వ్యక్తిత్వం, స్వభావం మరియు సాధారణ జీవిత గమనాన్ని సూచిస్తుంది.

ద్వితీయ భావం (ధన స్థానం) : ఇది సంపాదించే ధనం, కుటుంబం, ప్రాథమిక విద్య, నేత్రాలు మరియు మనిషి యొక్క మాట తీరును (వాక్కు) తెలియజేస్తుంది.

తృతీయ భావం (భాతృ స్థానం/విక్రమ స్థానం) : ఇది తోబుట్టువులు (ముఖ్యంగా తమ్ముళ్లు, చెల్లెళ్లు), ధైర్యం, పరాక్రమం, చిన్న ప్రయాణాలు మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను సూచిస్తుంది.

చతుర్థ భావం (మాతృ స్థానం/సుఖ స్థానం) : ఇది తల్లి, మనశ్శాంతి, ఇల్లు, భూములు, వాహనాలు మరియు ప్రాథమిక సుఖాలను తెలియజేస్తుంది.

పంచమ భావం (పుత్ర స్థానం/పూర్వపుణ్య స్థానం) : ఇది సంతానం, మేధస్సు, ఉన్నత చదువులు, సృజనాత్మకత, ప్రేమ వ్యవహారాలు మరియు గత జన్మల పుణ్యాన్ని సూచిస్తుంది.

షష్ఠ భావం (శత్రు స్థానం/రోగ స్థానం) : ఇది శత్రువులు, రోగాలు, అప్పులు, కోర్టు గొడవలు, పోటీ పరీక్షలు మరియు రోజువారీ ఉద్యోగ బాధ్యతలను తెలియజేస్తుంది.

సప్తమ భావం (కళత్ర స్థానం) : ఇది జీవిత భాగస్వామి (భార్య/భర్త), వివాహ జీవితం, వ్యాపార భాగస్వామ్యాలు (పార్టనర్‌షిప్స్) మరియు సమాజంలో ఇతరులతో మనకున్న సంబంధాలను సూచిస్తుంది.

అష్టమ భావం (ఆయుష్షు స్థానం) : ఇది ఆయుర్దాయం, అకస్మాత్తుగా వచ్చే మార్పులు లేదా ధనలాభం, దీర్ఘకాలిక సమస్యలు, రహస్యాలు మరియు పరిశోధనలను తెలియజేస్తుంది.

నవమ భావం (భాగ్య స్థానం) : ఇది అదృష్టం, తండ్రి, గురువులు, ఉన్నత విద్య, ధర్మం మరియు ఆధ్యాత్మిక ప్రయాణాలను సూచిస్తుంది.

దశమ భావం (కర్మ స్థానం) : ఇది మనిషి చేసే వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, కీర్తి ప్రతిష్టలు, అధికార హోదా మరియు సమాజంలో గుర్తింపును తెలియజేస్తుంది.

ఏకాదశ భావం (లాభ స్థానం) : ఇది జీవితంలో వచ్చే లాభాలు, ఆదాయ మార్గాలు, కోరికల నెరవేరడం, అన్నదమ్ములు (అక్కాచెల్లెళ్లు) మరియు స్నేహితుల బలాన్ని సూచిస్తుంది.

ద్వాదశ భావం (వ్యయ స్థానం) : ఇది ధన వ్యయం (ఖర్చులు), నష్టాలు, విదేశీ ప్రయాణాలు లేదా స్థిరపడటం, నిద్ర మరియు మోక్షాన్ని తెలియజేస్తుంది.

భావ వృద్ధికి దోహదం చేసే ముఖ్య అంశాలు

భావ అధిపతి బలం (భావాధిపతి) : ఆ ఇంట అధిపతి (ఉదాహరణకు మేష లగ్నానికి కుజుడు) తన స్వక్షేత్రంలో గానీ, ఉచ్ఛ స్థానంలో గానీ లేదా మిత్ర క్షేత్రంలో గానీ బలంగా ఉన్నప్పుడు ఆ భావం వృద్ధి చెందుతుంది.

జ్యోతిష్య శాస్త్రంలో "భావ శుద్ధి" అంటే జాతక చక్రంలోని ఒక నిర్దిష్టమైన ఇల్లు (భావం) ఎటువంటి చెడు ప్రభావాలు లేదా దోషాలు లేకుండా, పరిపూర్ణమైన పవిత్రతను, బలాన్ని కలిగి ఉండటం. జాతక పరిశీలన చేసేటప్పుడు కేవలం గ్రహాల స్థితులను మాత్రమే చూసి, భావ శుద్ధిని విస్మరించడం పెద్ద లోపంగా పరిగణించబడుతుంది.

పరాశర సిద్ధాంతం ప్రకారం ఒక భావానికి "భావ శుద్ధి" ఈ పరిస్థితులలో కలుగుతుంది..

పాప గ్రహాల ప్రభావం లేకపోవడం : ఒక భావంలో శని, కుజుడు, రాహువు, కేతువు లేదా సూర్యుడు (క్రూర గ్రహం) వంటి పాప గ్రహాలు ఉండకూడదు, అలాగే ఆ భావంపై వాటి దృష్టి కూడా పడకూడదు. ఇలా దుష్ట గ్రహాల నీడ పడకుండా ఉండటమే భావ శుద్ధికి మొదటి లక్షణం.

శుభ గ్రహాల నివాసం లేదా వీక్షణ : ఆ భావంలో గురువు, శుక్రుడు, బుధుడు లేదా పూర్ణ చంద్రుడు వంటి నైసర్గిక శుభ గ్రహాలు ఉండటం లేదా ఆ ఇల్లను శుభ వీక్షణతో చూడటం వల్ల ఆ భావానికి ఉన్న దోషాలన్నీ తొలగిపోయి శుద్ధి జరుగుతుంది.

శుభ కర్తరి యోగం ఏర్పడటం : ఒక భావానికి ఇరువైపులా శుభ గ్రహాలు మాత్రమే ఉన్నప్పుడు, ఆ భావానికి ఒక బలమైన రక్షణ వలయం ఏర్పడుతుంది. దీనినే శుభ కర్తరి అంటారు, ఇది భావ శుద్ధిని మరింత పెంచుతుంది.

భావ అధిపతి (భావాధిపతి) సద్గతిలో ఉండటం : ఆ భావానికి యజమాని అయిన గ్రహం ఆరవ ఇల్లు (రోగ/శత్రు), ఎనిమిదవ ఇల్లు (ఆయుష్షు/కష్ట), లేదా పన్నెండవ ఇల్లు (వ్యయ) వంటి దుస్థానాలలో పడకుండా, కేంద్ర (1, 4, 7, 10) లేదా త్రికోణ (5, 9) స్థానాల్లో శుభప్రదంగా ఉండాలి.

భావాధిపతికి పాప గ్రహాల కలయిక లేకపోవడం : భావ

అధిపతి అయిన గ్రహం జాతకంలో మరెక్కడున్నా, అక్కడ శత్రు గ్రహాలతో గానీ లేదా పాప గ్రహాలతో గానీ కలిసి ఉండకూడదు. భావాధిపతి ఎంత పవిత్రంగా ఉంటే, ఆ భావానికి అంత శుద్ధి చేకూరుతుంది.

గ్రహ అస్తమయం లేదా యుద్ధం లేకపోవడం : ఆ భావంలో ఉన్న గ్రహాలు గానీ, లేదా ఆ భావాధిపతి గానీ సూర్యుడికి అత్యంత దగ్గరగా వచ్చి అస్తమయం (జశీఎ-ఎబర్) చెందకూడదు, అలాగే ఇతర గ్రహాలతో గ్రహ యుద్ధంలో ఓడిపోయి ఉండకూడదు.

ఒక భావానికి (ఉదాహరణకు వివాహాన్ని తెలిపే 7వ భావానికి) ఎటువైపు నుండి చూసినా పాప గ్రహాల చెడు చూపులు లేకపోవడమే "భావ శుద్ధి". భావ శుద్ధి ఉన్న ఇల్లు జాతకుడికి ఆయా జీవిత విషయాలలో ఎటువంటి ఆటంకాలు లేని అత్యుత్తమ ఫలితాలను అందిస్తుంది.

గోచార రాశి ఫలితాలు:

సమాజంలో దినపత్రికలు, టెలివిజన్లలో వచ్చే ద్వాదశ రాశుల ఫలితాలు కేవలం గోచార చంద్రుని స్థానాన్ని బట్టి రాసే సామూహిక అంచనాలు మాత్రమే . (సీతారామ జ్యోతిష్యాలయం పాఠములు, పుట 1). మనం రోజూ పేపర్లలో, టీవీల్లో చూసే రాశిఫలాలు "మేష రాశి వారికి ఈరోజు ఇలా ఉంటుంది", "సింహ రాశి వారికి అలా ఉంటుంది" అని అందరికీ కలిపి (సామూహికంగా) చెబుతుంటారు కదా! అలా చెప్పడానికి వాడే ప్రధానమైన ఆధారమే ఈ "గోచార చంద్రుడు".

గోచారం అంటే (Transit) : 'గో' అంటే ఆకాశం, 'చారం' అంటే ప్రయాణం. ప్రస్తుతం ఈ రోజు, ఈ నిమిషంలో ఆకాశంలో గ్రహాలు ఏయే రాశులలో తిరుగుతున్నాయో చెప్పే దాన్నే "గోచారం" అంటారు. గ్రహాలు ఎప్పుడూ ఒకే చోట ఉండవు, అవి ఒక రాశి నుండి ఇంకో రాశికి మారుతూ ప్రయాణం చేస్తూనే ఉంటాయి.

చంద్రుని స్థానం: జ్యోతిషశాస్త్రంలో మనస్సుకి, ఆలోచనలకి చంద్రుడు కారకుడు. అలాగే గ్రహాలన్నింటిలోకి చంద్రుడు చాలా వేగంగా ప్రయాణిస్తాడు. ఒక రాశిలో కేవలం రెండున్నర రోజులు (2.5 రోజులు) మాత్రమే ఉంటాడు.

మీరు పుట్టినప్పుడు చంద్రుడు ఏ రాశిలో ఉన్నాడో, అది మీ "జన్మ రాశి" అవుతుంది (ఉదాహరణకు మీరు పుట్టినప్పుడు చంద్రుడు సింహ రాశిలో ఉంటే, మీది సింహ రాశి).

ఇక "గోచార చంద్రుడు" అంటే... ఈ రోజు, ప్రస్తుత సమయంలో ఆకాశంలో చంద్రుడు ఏ రాశిలో ప్రయాణిస్తున్నాడో ఆ చంద్రుడిని గోచార చంద్రుడు అంటారు.

రాశిఫలాలు ఎలా రాస్తారంటే : మీ జన్మ రాశి నుండి, ఈ రోజు ఆకాశంలో తిరుగుతున్న 'గోచార చంద్రుడు' ఎన్నో ఇంట్లో ఉన్నాడో లెక్కగట్టి (ఉదాహరణకు జన్మ రాశి నుండి చంద్రుడు 3, 6, 11 ఇళ్లలో ఉంటే శుభప్రదం అని) టీవీల్లో, పేపర్లలో సాధారణ అంచనాలు రాస్తారు.

అందుకే దీనిని "సామూహిక అంచనా" అన్నారు. ఎందుకంటే ప్రపంచంలో సింహ రాశి ఉన్న కోట్ల మందికి ఈ గోచార చంద్రుని స్థానం ఒకేలా ఉంటుంది, కానీ ప్రతి ఒక్కరి వ్యక్తిగత జాతకం (మహర్దశలు, మిగతా గ్రహాల బలాలు) వేరుగా ఉంటుంది కాబట్టి ఈ రాశిఫలాలు అందరికీ 100% నిజం కావు.

ఒకే రాశిలో పుట్టిన కోట్ల మంది ప్రజలందరికీ ఒకే రోజున ఒకే విధమైన ఫలితాలు సంభవించడం అసాధ్యం. జాతకుని జీవితంలోని వాస్తవ సంఘటనలు కేవలం నడుస్తున్న వింశోత్తరీ మహాదశ, అంతర్దశలు మరియు జన్మ లగ్నాధిపతి బలంపై మాత్రమే ఆధారపడి ఉంటాయి . ఒకవేళ జన్మ చక్రం లో బలమైన అరిష్టాలు ఉంటే, గోచారంలో గ్రహాలు అనుకూలించినా ఫలితం శూన్యంగానే మిగులుతుంది కావున, సాధారణ రాశి

ఫలితాలను కేవలం ప్రాథమిక సూచనలుగా మాత్రమే గ్రహించాలి తప్ప అత్యంత విశ్వసనీయమైన మార్గదర్శకాలుగా భావించరాదు.

జ్యోతిష్య శాస్త్రం ప్రస్తుతం సమాజంలో అవహేళన పాలు కావడానికి కొన్ని అపసవ్య సిద్ధాంత ధోరణులు, జ్యోతిష విశ్లేషకుల వ్యక్తిగత క్రమశిక్షణ లోపాలే ముఖ్య కారణాలు.

వ్యాపార ధోరణి మరియు దోపిడీ : జాతకులను విపరీతంగా భయపెట్టడం, శాంతి పరిహారాలు లేని అవయోగాలకు కూడా కల్పిత దోషాలు సృష్టించి డబ్బులు వసూలు చేయడం అవహేళనకు కారణమవుతోంది .

ఉత్తమ జ్యోతిష్య పండితుడికి కావలసిన ప్రామాణిక గ్రంథాలు మరియు అనుష్ఠాన నియమావళి

నిజమైన దైవజ్ఞుడు లేదా జ్యోతిష్య పండితుడు కావాలనుకునే సాధకుడు సిద్ధాంత, సంహిత, హోరా అనే మూడు స్కంధాలలో సంపూర్ణ పాండిత్యం సంపాదించాలి.

సిద్ధాంత భాగం (గణిత భాగం) : ఇది పూర్తిగా ఖగోళ శాస్త్రం మరియు గణితానికి (Astronomy & Mathematics) సంబంధించింది. భూమి నుండి సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాల దూరం ఎంత? అవి ఏ వేగంతో ప్రయాణిస్తున్నాయి? గ్రహణాలు ఎప్పుడు వస్తాయి? తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే పంచాంగ భాగాలు ఎలా ఏర్పడతాయి? వంటి ఖగోళ గణిత విషయాలన్నీ ఇందులో ఉంటాయి. సులభంగా చెప్పాలంటే, జాతక చక్రం గీయడానికి కావాల్సిన "గణిత పునాది" ఈ సిద్ధాంత భాగం.

2. సంహిత భాగం (సామూహిక/ప్రకృతి భాగం): ఇది ప్రకృతిలో జరిగే మార్పులు, గ్రహాల చలనం వల్ల సమాజంపై పడే సామూహిక ప్రభావాలను వివరిస్తుంది. భూకంపాలు, వరదలు, కరువులు, వర్షాలు ఎప్పుడు పడతాయి? దేశ విదేశాల భవిష్యత్తు (మేదినీ జ్యోతిష్యం), వాస్తు శాస్త్రం, శకున శాస్త్రం, ముహూర్త బలాలు మరియు సాముద్రిక లక్షణాలు (హస్తసాముద్రికం వంటివి) అన్నీ ఈ సంహిత కిందికే వస్తాయి. అంటే, ఇది "సమష్టి లేదా విశ్వ జాతకం" అన్నమాట.

3. హోరా భాగం (వ్యక్తిగత జాతక భాగం): దీనినే మనం సాధారణంగా పిలిచే 'ఫలిత జ్యోతిష్యం' (Predictive Astrology) అంటారు. ఒక వ్యక్తి పుట్టిన సమయం, పుట్టిన స్థలాన్ని బట్టి లగ్న చక్రం (జాతకం) వేసి... ఆ వ్యక్తి గుణగణాలు, విద్య, ఉద్యోగం, వివాహం, ఆయుష్షు, ఆరోగ్యం మరియు వారికి వచ్చే మహర్దశల ఫలితాలను విశ్లేషించే భాగమే హోరా. మానవ జీవితంలోని "వ్యక్తిగత సుఖదుఃఖాలను" అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

గ్రహాల కదలికలను లెక్కగట్టేది సిద్ధాంతం; ఆ కదలికల వల్ల ప్రకృతిపై, దేశాలపై పడే ప్రభావాన్ని చెప్పేది సంహిత; కేవలం ఒక మనిషి జీవితంపై పడే ఫలితాన్ని వివరించేది హోరా. ఈ మూడు తెలిసినప్పుడే ఒక జ్యోతిష్కునికి పరిపూర్ణత వస్తుంది.

హిందూ పండుగల నిర్ణయాలలో తలెత్తుతున్న సిద్ధాంత భేదాలు మరియు తిథి వ్యత్యాసాలు

హిందువుల పండుగల తేదీలలో భేదాలు రావడానికి గల ప్రధాన కారణం సిద్ధాంత పరమైన వైవిధ్యం మరియు ఆయనాంశ గణనలలో తేడాలు. సాంప్రదాయ పూర్వ సూర్య సిద్ధాంత ఆధారిత పంచాంగాలకు మరియు ఖగోళ ప్రత్యక్ష గమనాన్ని అనుసరించే దృక్-సిద్ధాంత పంచాంగాలకు మధ్య సూక్ష్మ ఆయనాంశ తేడాలు ఉంటాయి

మన భూమి తన అక్షం (Axis) మీద తిరిగేటప్పుడు బొంగరం లాగా స్వల్పంగా ఊగుతుంది. దీనివల్ల ఆకాశంలో నక్షత్రాల పొజిషన్లు, రాశి చక్రం ప్రతి సంవత్సరం చాలా సూక్ష్మంగా వెనక్కి జరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఈ తేడాను సరిచేసే "గణిత విలువనే" జ్యోతిష్యంలో ఆయనాంశ అంటారు. జాతకం లేదా



పంచాంగం కచ్చితంగా రావాలంటే ఈ ఆయనాంశ లెక్క 100% కరెక్ట్ కావాలి.

ఛాయార్క (ఛాయాం అర్క) : 'అర్క' అంటే సూర్యుడు, 'ఛాయా' అంటే నీడ. పూర్వకాలంలో శంకువు (ఒక కర్ర) ను భూమిపై నిలబెట్టి, సూర్యుని ఎండ వల్ల పడే దాని నీడ పొడవును బట్టి ఖగోళ కదలికలను కచ్చితంగా కొలిచేవారు. అంటే, కేవలం ఊహాజనిత గణితం కాకుండా, ప్రత్యక్షంగా కంటికి కనిపించే సూర్యుని నీడ ఆధారంగా రుజువైనది అని అర్థం.

సంస్కృత : ఇక్కడ సంస్కృత అంటే భాష కాదు, 'సంస్కరించబడినది' (Refined / Corrected) అని అర్థం. పాత గణిత పద్ధతులలో కాలక్రమేణా దొర్లిన తప్పులను సరిచేసి, ఆధునిక టెలిస్కోప్/శాస్త్ర విజ్ఞానానికి సరిపోయేలా దీనిని పాలిష్ చేశారు.

కరణార్క : జ్యోతిష్య గణిత గ్రంథాల ఆధారంగా సూర్యుడి కచ్చితమైన గమనాన్ని, స్థితిని లెక్కించే ఖగోళ శుద్ధి పద్ధతి.

ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల నియమాలను పాటిస్తూనే ... ఆకాశంలో సూర్యుని గమనాన్ని మరియు ఆయన నీడను (ప్రత్యక్ష ప్రయోగాల ద్వారా) ఆధారంగా చేసుకుని, పాత లెక్కల్లోని తప్పులను సరిదిద్ది కనుగొన్న "అత్యంత కచ్చితమైన, నిజమైన ఆయనాంశల విలువనే" ఛాయార్క సంస్కృత కరణార్క ఆయనాంశలు అంటారు.

దీనివల్ల తిథులు, నక్షత్రాలు మరియు జాతక చక్రాలు త్రాసులో తూచినట్లు కచ్చితంగా వస్తాయని మధుర కృష్ణమూర్తి శాస్త్రి గారు నిరూపించారు.

దేశంలోని వివిధ పంచాంగకర్తలు వేర్వేరు ఆయనాంశ విలువలను, 'తిథి వ్యాప్తి' నియమాలను అనుసరించడం వల్ల సూర్యోదయ సమయంలో ఏ తిథి ఉందో లెక్కించే క్రమంలో భేదాలు ఏర్పడతాయి . ఈ తిథి వ్యాప్తి తేడాల వల్లనే పండుగలను కొన్ని ప్రాంతాలలో ఒకరోజు ముందుగాను, మరికొన్ని ప్రాంతాలలో ఒకరోజు తర్వాతను జరుపుకునే గందరగోళ పరిస్థితులు ఏర్పడు తున్నాయి.

అనంతమైన విశ్వంలో గ్రహాల కదలికలకు, భూమిపై మానవ జీవిత గమనానికి మధ్య ఉన్న నిగూఢ సంబంధాన్ని అత్యంత శాస్త్రీయంగా విశ్లేషించే అద్భుతమైన దివ్య చక్షువు జ్యోతిష్య శాస్త్రం. సూర్యుడు, చంద్రుడు మరియు నక్షత్రాల గమనాన్ని గణితాధారంగా లెక్కిస్తూ, కాల గమనాన్ని ముందే దర్శించగల సామర్థ్యం ఉన్నందునే దీనిని వేద పురుషుని యొక్క ప్రకాశవంతమైన "నేత్రం" (కన్ను) గా పెద్దలు అభివర్ణించారు. మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాల చీకట్లలో అధైర్యపడకుండా, రాబోయే కాలం పట్ల స్పష్టమైన అవగాహనను కల్పిస్తూ ఆశావహ దృక్పథంతో ముందుకు నడిపించే ఒక దివ్యమైన మార్గదర్శి ఈ శాస్త్రం. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల రహస్యాలను విప్పుతూ, కేవలం అంచనాలకు పరిమితం కాకుండా మానసిక ప్రశాంతతను మరియు ఆధ్యాత్మిక పరిణితిని ప్రసాదించే అమూల్యమైన ప్రాచీన భారతీయ విజ్ఞాన నిధి మన జ్యోతిష్యం. జ్యోతిష్యశాస్త్రానికి జై. ఉత్తమ జ్యోతిష్కులకు జై. తెలంగాణా విద్వత్సభకి జై.

ఆచార్య తాడేపల్లి పతంజలి

గ్రహణ నిర్ణయ విశేషము


గగన దృశ్య వికారములలో గ్రహణములు ప్రతి మానవుని దృష్టిని ఆకర్షించి విస్మయము పొందించును. ప్రాచీన కాలమునందలి మానవులను భయభ్రాంతులను కలుగజేసెడివి. ఆ దినములలో గ్రహణముల సంభవమును గురించి పలువురు పలువిధాలుగా భావించెడివారు. రాహు కేతువులు సూర్య చంద్రబింబములను కబళించుటచే గ్రహణములు సంభవించునని కొందరు తలంచెడివారు. మరికొందరు భయంకర పన్నాగమేదో సూర్యచంద్ర బింబములను మ్రింగివేయుటచే గ్రహణములు సంభవించుచున్నవని భావించెడివారు. అందుచేతనే వారు గ్రహణములు సంభవించు మాసములను 'నాగమాసములనెడివారు'.

రాహుకేతువులను లేదా ఆ నాగమును భయపరిచి సూర్యచంద్రులకు విముక్తిని కలుగచేయుటకు గ్రహణ సమయమున వారు డప్పులు, ధంకాలు వాయించుచు బాగా విహారము చేసెడివారు. ఈవిధంగా చేయనివారిని రాజులు శిక్షించెడివారట. మరికొందరు గ్రహణము విడిపోయే వరకు సూర్యచంద్రులకు విముక్తి కొరకు మంత్రశాస్త్రములను పఠించెడివారట. కాల్డియన్‌లు, అసిరియనులు, బాబిలోనియనులు, ఖగోళ విద్యాపారంగతులు, గ్రహణ కాలము 18 సంవత్సరముల 10 లేక 11 దినములు అని వారు అనుభవించే సిద్ధాంతీకరించిరి. వరాహమిహిరుడు తనకు పూర్వులకు, గర్గ, వసిష్ఠ, దేవల, వ్యాస, వృద్ధ గర్గ, మను మొదలగు జ్యోతిష్కులు సిద్ధాంతములను వివరించి యున్నారు. ఋగ్వేదము (5-40-9)లో గ్రహణ విషయము వివరింపబడినట్లు వ్రాసియున్నారు.

శ్లో॥ యాం వై సూర్యం స్వర్భానుః తమసా
అవిద్యాత్ అసురః ।
అత్రయః తం అను అవిందన్
న హి అన్యే అశక్నువన్ ॥



అర్థము. అసురుడగు స్వర్భానువు, హేసూర్య నిన్ను తమస్సుచే ఆవరించునప్పుడు లోకములు భ్రమించి ఇతరులను కనుగొనజాలవు అని అర్థము.ఈ మంత్రము వలన గ్రహణమునకు కారణము ఛాయ యని తెలియుచున్నది.



సూర్యునిచుట్టూ భూమి దీర్ఘవృత్తమార్గంలో భ్రమించు చున్నది. సూర్యుడు భూమికి మిక్కిలి దూరంలో వున్నపుడు సుమారు 15,29,00,000 కి.మీ. దూరంలో వుండును. కనిష్ఠ దూరంలో వున్నపుడు 14,64,00,000 కి.మీ. దూరంలో ఉండును. చంద్రుడు కూడ భూమిచుట్టూ దీర్ఘవృత్తంలో భ్రమించుచున్నాడు. భూమికి చంద్రుడు సమీపములో ఉన్నపుడు 3,57,000 కి.మీ. దూరం, గరిష్ఠ దూరంలో వున్నపుడు 4,07,000 కి.మీ. చంద్రుని ఛాయ యొక్క నిడివి 3,67,000 కి.మీ. నుండి 3,80,000 కి.మీ. వరకు మారుచుండును. కొన్ని సమయాలలో ఆ ఛాయ భూమి వరకు విస్తరించును, కొన్ని సమయాలలో ఆ ఛాయ భూమి వరకు విస్తరించదు. చంద్రుడు తన పథమున పడమర నుండి తూర్పుకు గంటకు 3,200 కి.మీ. వేగంతో పరిభ్రమించును. అదే దిశలో అదే వేగముతో చంద్రుని ఛాయ 257 కి.మీ. భూమిని ఆవరించును. పూర్ణ గ్రహణము సంభవించు ప్రాంతము కిరువైపులా కొన్ని ప్రదేశాలకు కూడ గ్రహణము గోచరించును.

చంద్రుడు సూర్యుని సమీపముగను భూమికి దూరముగను ఉన్నప్పుడు సూర్యచంద్రులచే ఏర్పడు ఛాయ శంకువు భూమికి చేరదు. అప్పుడు ఎ.బి. ప్రదేశములలో ఉన్నవారికి 'కంకణ గ్రహణము' గోచరించును. ఆ కంకణ గ్రహణము గోచరించు ప్రాంతము ఇంచుమించు 360 కి.మీ. ఈ ప్రాంత బాహ్యము ఖండగ్రహణము మాత్రమే గోచరించును. కంకణ గ్రహణము మొత్తం సుమారు 12 నిముషములు, పూర్ణ సూర్యగ్రహణ కాలము సుమారు 7 1/2 నిముషములు. గ్రహణాలు ఆశ్చర్యకరమగు మార్పును కలుగచేయుచుండుట చేత గ్రహణములు వచ్చు దినములను ముందుగా తెలుసుకొనుటకు ఎందరో ప్రయత్నించిరి. చిట్టచివరకు కాల్డియన్‌లు గ్రహణములు వచ్చు దినములను తెలుసుకొనుటకు ఒక సూత్రము కనుగొనిరి. చాంద్రమాసమునకు 29.53 మాధ్యమిక సౌరదినములు అటువంటి 223 చాంద్ర మాసములు 6585.32 దినములకు సమానము. ఒక పాతమును సూర్యుడు రెండుసార్లు సంక్రమించుటకు మధ్యకాలము 346.62 దినములు 19 అట్టి సంక్రమణము లకు 6585.78 దినములు అందుచే 6585.32 లేదా 18 సంవత్సరముల 10 లేదా 11 దినముల 8 గంటల కాలములో సూర్యుడు చంద్రుడు పాతములు తిరిగి తమ సాపేక్ష స్థానములు చేరును. అనగా ఒక దినము వచ్చిన గ్రహణము మాదిరి గ్రహణము మేరకు 18 సం॥ల 10 లేదా 11 దినముల 8 గంటలకు సంభవించును. ఈ అవీత్తకాలమును 'గ్రహణము' అందురు.

సాదరముగా ఒక సంవత్సర కాలములో నాలుగు గ్రహణములు వచ్చుచుండును. కాని ఒక సంవత్సరంలో ఏడు గ్రహణముల వరకు సంభవించుటకు అవకాశము ఉన్నది. సంవత్సరాంతములో సూర్యగ్రహణము వచ్చినచో ఆ సంవత్సరములో అయిదు సూర్యగ్రహణములు రెండు చంద్ర గ్రహణములు సంభవింపవచ్చును. సంవత్సర ఆరంభమున చంద్రగ్రహణము సంభవించినచో ఆ సంవత్సరములో నాలుగు సూర్యగ్రహణములు మూడు చంద్రగ్రహణములు సంభవింపవచ్చును. లోకములు భ్రమించి ఇతరులు కనుగొన జాలవు అని అర్థము. ఈ మంత్రము వలన గ్రహణమునకు కారణము ఛాయ యని తెలియుచున్నది.

శాస్త్రుల కృష్ణమూర్తి సిద్ధాంతి

తెలంగాణ ధార్మిక చైతన్య ప్రతీక
తెలంగాణ విద్వత్సభ దశాబ్ది ప్రస్థానం

సనాతన ధర్మ సౌధానికి వేదచక్షువైన జ్యోతిష్య, ఆగమ శాస్త్రాల వెలుగులను నలుదిశలా ప్రసరింపజేస్తూ, పండుగల నిర్ణయంలో నెలకొనే గందరగోళాలను పటాపంచలు చేస్తూ సామాన్యులకు, ప్రభుత్వాలకు ఏకీకృత మార్గదర్శకత్వం చేస్తున్న అద్వితీయ సమన్వయ వారధి "తెలంగాణ విద్వత్ సభ". బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ గారి అధ్యక్షతన, బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి మార్గదర్శకత్వంలో, శ్రీ మరుమాముల వెంకటరమణ శర్మ గారి సహకారంతో అంకురించిన ఈ సంస్థ.. పంచాంగ కర్తలు, సిద్ధాంతులను ఒకే గొడుగు కిందకు చేర్చి సమాజంలో అఖండ చైతన్యాన్ని రగిలించింది. శృంగేరి మహాసన్నిధానం వారి శ్రీముఖాలతో పాటు కంచి జగద్గురువులు, చిన్నజీయర్ స్వామి తదితర త్రిమత పీఠాధిపతుల అవ్యాజమైన ఆశీర్వనుగ్రహాలు పొందుతూ, నాడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నుండి నేడు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి వరకు ప్రభుత్వాల సంపూర్ణ ఆదరణను చూరగొంటూ పండితుల ఏకగ్రీవ నిర్ణయాలకే అధికారిక గుర్తింపు సాధించిన చారిత్రక ఘనత ఈ సభ సొంతం. రవీంద్ర భారతిలో అద్వితీయంగా మొదలైన ఈ సమ్మేళనాల అసిధారా వ్రతం.. నల్లకుంట శృంగేరి మఠం, వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం, తూముకుంట రామభద్ర క్షేత్రం, యాదాద్రి హయగ్రీవ ఆశ్రమం, బేగంపేట పుష్పగిరి మఠం వంటి పుణ్యక్షేత్రాలలో తొమ్మిదేళ్ల పాటు ఏకోన్ముఖంగా సాగి, నేడు దశాబ్ది ఉత్సవాలకు చేరుకుంది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని 2026 ఆగస్టు 1, 2 తేదీలలో రవీంద్ర భారతిలో అంగరంగ వైభవంగా జరగనున్న 10వ మహా సమ్మేళనంలో.. 'గేయ వాల్మీకి' బ్రహ్మశ్రీ రుక్మాభట్ల నరసింహ స్వామి వారికి జీవన సాఫల్య పురస్కారంతో పాటు మరో 12 మంది దిగ్గజాలకు విశేష సేవా పురస్కారాలను సగౌరవంగా ప్రదానం చేయనున్నారు. పదేళ్ల పండిత మేధోమథనానికి నిలువుటద్దంగా, భవిష్యత్ తరాలకు ప్రామాణిక మార్గదర్శకంగా ఉభయ తెలుగు రాష్ట్రాల విద్వాంసుల పరిశోధనా వ్యాసాలు, గత సమ్మేళనాల సమగ్ర విశేషాలతో రూపుదిద్దుకున్న అక్షర జ్యోతి "విద్వత్ సభ సంహిత - దశాబ్ది దీపిక" ఆవిష్కృతం కాబోతుండగా.. ధార్మిక సమాజానికి ఒక విజ్ఞాన ఖనిగా మారనున్న ఈ విశేష సంచికను ప్రతి ఒక్కరూ ఆదరించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాం.

మొత్తం పది సంవత్సరాల విద్వత్ సమ్మేళనాలు, ప్రాంతీయ సమ్మేళనాలు, విద్వద్గోష్ఠుల సమగ్ర నివేదికల సమాహారం ...

మీకోసం!

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2017

శ్రీ విళంబి నామ సంవత్సర పండుగల నిర్ణయం

భాగ్యనగరంలో అపూర్వఘట్టం ఆవిష్కృతమయింది. మునుపెన్నడూ కనీవినీ ఎరగని రీతిలో నగరం నడిబొడ్డులోని లలితకళాతోరణం, రవీంద్రభారతి వేదకల మీద తెలంగాణ ప్రాంత జ్యోతిష మహాసభలు రెండురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. శృంగేరి శారదా పీఠాధీశ్వరులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి, శ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి, శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి, మధుసూదనానంద సరస్వతీ స్వామివారల దివ్యాశీస్సులతో తెలంగాణలోని 31 జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలనుంచి పెద్దయెత్తున తరలివచ్చిన స్వామీజీలు, జ్యోతిషపండితులు, సిద్ధాంతులు, ధార్మికవేత్తల కోలాహలంతో సభలు వైభవంగా జరిగాయి. శ్రీగాయత్రీపీఠం, జ్యోతిర్మయ మహాపీఠం, 'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ జ్యోతిషమహాసభల తొలిరోజు తొమ్మిదోతేదీ శనివారం లలితకళాతోరణంలో 'సిద్ధాంత సదస్సు', రెండోరోజు పదోతేదీ ఆదివారం రవీంద్రభారతిలో 'జాతక సదస్సు' దిగ్విజయంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన విద్వత్సభలో సిద్ధాంతులంతా రాబోయే విళంబినామ సంవత్సర పండగలు, ముహూర్తాలను నిర్ణయించి ఆ జాబితాను ప్రభుత్వానికి సమర్పించారు. 'నవగ్రహ అనుగ్రహం' జ్యోతిష రూపకం సభలకే సరికొత్త వన్నె తీసుకురాగా సమాపనోత్సవంలో ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు పాల్గొని సభలనిర్వహణతీరును కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జ్యోతిషసభల విజయవంతం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రగతిభవన్‌లో సభల నిర్వాహకులను అభినందించటం.. పండగల9 జాబితాను ఆమోదించి అధికార ముద్ర వేయటం విశేషం.. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన తెలంగాణ రాష్ట్ర మహాసభలపై దర్శనమ్ అందిస్తున్న నివేదిక...

శ్రీ గాయత్రీ పీఠం (అన్నోజిగూడ), జ్యోతిర్మయ మహాపీఠం (మేడిపల్లి), 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తాపత్రిక





వారి సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లో సెప్టెంబర్ తొమ్మిది, పది తేదీలలో తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు ఘనంగా జరిగాయి. తొలిసారిగా అపూర్వరీతిలో జరిగిన సభలు తొమ్మిదవ తేదీ శనివారం నాడు లలితకళా తోరణం వేదికలో జరగగా, పదవ తేదీ ఆదివారం నాడు రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో మహాసభలు జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున పండితులు ఆధ్యాత్మిక వేత్తలతో పాటు ప్రధాన క్షేత్రాల స్థానాచార్యులు, ఆగమ పండితులకు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సెప్టెంబర్ తొమ్మిదిన లలితకళా తోరణంలో జరిగిన సభలో శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గురుమదనానంద సరస్వతీ స్వామివారు, శ్రీ వనం జ్వాలా నరసింహారావుగారు, శ్రీ చెప్పెల హరనాథశర్మ గారు పాల్గొన్నారు. సభాధ్యక్షులుగా శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ వ్యవహరించారు. శ్రీ మరుమాముల వెంకట రమణశర్మ స్వాగతోపన్యాసం చేశారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామివారు తమ అనుగ్రహ భాషణంలో ఇంతవరకూ ఎప్పుడు, ఎక్కడా జరగని విధంగా రాష్ట్ర స్థాయిలో జ్యోతిష మహాసభలు నిర్వహించడం కడు ముదావహమన్నారు.

శ్లో ॥ విఫలానన్య శాస్త్రాణ, వివాదాస్తేషు కేవలం ।
సఫలం జ్యోతిషం శాస్త్రం, చంద్రార్కౌయత్ర సాక్షిగా ॥

సూర్యచంద్రుల సాక్షిగా జ్యోతిశ్శాస్త్రం, ఇతర శాస్త్రాలకన్నా వివాదం లేకుండా సఫలమైందని తాత్పర్యం, సనాతన జ్యోతిశ్శాస్త్రాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో గల విశేష అనుభవజ్ఞులైన సిద్ధాంతులు, పంచాంగ కర్తలు, జ్యోతిష పండితులను ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది మహాసభల యొక్క ప్రధాన ఉద్దేశ్యమని తమ స్వాగతోపన్యాసంలో మరుమాముల వెంకట రమణ శర్మ గారు తన స్వాగతోపన్యాసంలో పేర్కొన్నారు.



విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రజా సంబంధాల అధికారి, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు తన ప్రసంగంలో ఈ మహాసభల యొక్క పూర్తి ప్రసంగ వివరాలను రికార్డు చేసి సమర్పిస్తే, ప్రభుత్వం తరఫున గ్రంథాన్ని ముద్రించడానికి ప్రయత్నిస్తామన్నారు.

జ్యోతిశ్శాస్త్రం ప్రధానంగా రెండు భాగాలు. ఒకటి గణిత భాగమైతే, రెండవది ఫలిత భాగం. గణిత భాగాన్ని 'సిద్ధాంతం' అంటారు. ఫలితభాగాన్ని 'జాతకం' అంటారు. అందుకే ఈ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో రెండు రోజులు మొదటి రోజు సిద్ధాంత సదస్సును, రెండవ రోజు జాతక సదస్సును నిర్వాహకులు ఏర్పాటు చేశారన్నారు.

ఒక్కో సదస్సులో 12 ప్రధానాంశాలను ఎంపిక చేసి, విశేష అనుభవజ్ఞులైన సిద్ధాంతులు, పండితులచే ఒక్కో ప్రసంగాన్ని అందిస్తూ, ప్రసంగపత్రం సమర్పిస్తారన్నారు.

మొదటి రోజు సిద్ధాంత సదస్సులో మొదటి అంశమైన "వేదాంగ జ్యోతిషం - శాస్త్ర వైభవం" గూర్చి శ్రీ గుడి ఉమామహేశ్వర శర్మ సిద్ధాంతి గారు ప్రసంగించారు.

శ్లో ॥ శిక్షా వ్యాకరణం ఛందో, జ్యోతిషం నిరుక్తం తథా ।
కల్పశ్చేతి షడంగాని, వేదస్యాహుర్మనీషిణః ॥

శిక్షా, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, నిరుక్తం, కల్పం అని ఆరు వేదాంగాలుగా పండితులు తెలియజేశారు. అన్నింటిలోనూ జ్యోతిశ్శాస్త్రం అత్యంత ప్రధానమైంది.

శ్లో ॥ యథా శిఖా మయూరాణాం, నాగానాం,
మణయో యథా ।
తద్వద్వేదాంగ శాస్త్రాణాం, జ్యోతిషం మూర్ధని
స్థితమ్ ॥

నెమళ్లకు శిఖలాగా, పాములకు మణిలాగా, వేదాంగ శాస్త్రాలన్నింటికీ జ్యోతిశ్శాస్త్రం తలమానికమైంది.

వేదకాలం నుండి నేటి వరకు జ్యోతిశ్శాస్త్రం కాలాను గుణమైన మార్పులతో, సమన్వయ సాధనతో, ధర్మ పరి రక్షణకై వర్ధిల్లుతుంది. సమాజానికి అనుక్షణం జ్యోతిశ్శాస్త్రం మార్గదర్శనం చేస్తుంది. వేదానికి కన్నులాంటిది అందుకే 'జ్యోతిషావంయనం చక్షుః' అన్నారు.

శ్రీ ఆకెళ్ల జయకృష్ణ శర్మ సిద్ధాంతిగారు రెండవ అంశం 'సూర్యసిద్ధాంతం'పై ప్రసంగిస్తూ అది ఒక అపౌరుషేయ సిద్ధాంత గ్రంథమన్నారు. కృతయుగాంతాన గ్రహగతులు రహస్యాలను తెలుసుకోవడానికి మయాసురుడు సూర్యుని గూర్చి తపస్సు చేశాడు. సూర్యభగవానుడు తన అంశ పురుషుని మయాసురునికి గ్రహగతి రహస్యాలను ఉపదేశించమని ఆదేశించాడు. అందుకే ఈ గ్రంథానికి 'సూర్య సిద్ధాంతమని పేరు వచ్చింది. ఈ శాస్త్రం పూర్వం సూర్యునిచే చెప్పబడింది.

సూర్య సిద్ధాంతంలోనే అనాదిగా దృక్ రహిత రవి, చంద్రులనే శ్రౌత, స్మార్త, వ్రత, ధర్మ కర్మల నిమిత్తం ఆచరించాలని, దృక్ సహిత రవి, చంద్రులచే గ్రహణ జాతక

ఫలితాలు తెలుసుకోవాలని నిర్ణయించబడింది. ప్రస్తుతం మనం ఉపయోగించే పంచాంగాలన్నీ ఈ విధానాన్నే అనుసరిస్తున్నాయి. ఇందులో ఎలాంటి వివాదం లేదు. సశాస్త్రీయమైంది. మన పూర్వీకులు అనుసరించిన ఉత్తమ మార్గం.

'పంచాంగ ప్రామాణికత – ప్రయోజనం' అనే అంశంపై శ్రీ బ్రహ్మభట్ల శ్రీరామశర్మ సిద్ధాంతిగారు ప్రసంగపత్రం సమర్పించారు. పంచాంగం లేకుండా మనం నిత్యజీవితం కొనసాగించలేం. ధర్మాచరణకు పంచాంగం అత్యంతావశ్యకమైంది.

శ్లో ॥ తిథిర్వారంచ నక్షత్రం, యోగః కరణమేవచ ।
పంచాంగమితి విఖ్యాతం, కాలోయం కర్మ సాధకః॥

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అను ఐదు అంగాలతో కాలాధీనులైన కర్మ సాధకులకు పంచాంగంగా ప్రసిద్ధి చెందింది. మన ప్రాంతాచారాన్ననుసరించి, సిద్ధమైన పంచాంగాలను మనం ఉపయోగించడం వల్లనే సరియైన ప్రయోజనం చేకూరుతుంది అన్నారు.

తదుపరి 'ముహూర్త నిర్ణయ రహస్యం' అనే అంశంపై శ్రీ అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి గారు ప్రసంగిస్తూ ప్రస్తుత కాలంలో ముహూర్తం అత్యంతావశ్యకమైన విషయమన్నారు. ప్రతి ఒక్కరూ శుభముహూర్తం కావాలని కోరుకుంటారు. ముహూర్తం అనగా 48 నిమిషాల సమయం అనే అర్థం ఉన్నా, వ్యవహారంలో మాత్రం ముహూర్తం అంటే 'సమయం' అనే అర్థంలో ఉంది. శుభ ముహూర్తం నిర్ణయానికి పంచాంగం అవసరం. ఎలాంటి దోషాలు లేని ముహూర్తం లభించటం దుర్లభం. అందుకే 'దోషాస్స్వల్పం – గుణాధిక్యం' అను వాక్యానుసారం ముహూర్త నిర్ణయాలు చేయడం జరుగుతుంది.

మనకున్న పంచదశ సంస్కారాలతో ఏ ఇతర అవసరాలకైనా శుభ ముహూర్తానికి ప్రాధాన్యతనిస్తున్నారు.

తర్వాత శ్రీ ఎదునోజ నరసింహాచార్య సిద్ధాంతిగారు 'దేశ కాల పరిస్థితులు – పంచాంగ ప్రభావం' అనే అంశంపై వివ రించారు. సనాతన సాంప్రదాయానుసారం మనం ఆచరిస్తున్న విధానం చాలా ఉత్తమమైంది. ప్రస్తుత కాలంలో కూడా దాని ప్రభావం ప్రత్యక్షంగా కనిపిస్తుంది. కాలానుగుణ



మార్పుల కనుగుణంగా, ధర్మమార్గాన్ని వీడకుండా దేశ కాల పరిస్థితులను దృష్టి యందుంచుకొని సిద్ధాంతులు పంచాంగాలనందిస్తున్నారు.

దీన్ని సద్వినియోగపరచుకోవడం మన కర్తవ్యం సంవత్సరానికి ముందే, వర్ష సూచనలు, రాశిఫలాలు, శుభముహూర్తాలు మొదలగునవి సమాజ శ్రేయస్సుకై తెలియజేయు పంచాంగాలు అద్భుతమైనవి.

'పండుగల నిర్ణయ సమీక్ష – పరిశీలన' అనే అంశంపై శ్రీ గాడిచెర్ల నాగేశ్వర శర్మ సిద్ధాంతి ప్రసంగిస్తూ మన నిత్య జీవితంలో పండుగలు – వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచారం. సమాజంలోని ప్రజలందరూ ఒకే రోజున పండుగ జరుపుకోవడం అత్యంత ప్రధానమైంది. గత కొన్నేళ్ళుగా పంచాంగాలలో పండుగలపై విభేదాలు రావడం, సమాజాన్ని ఇబ్బందులకు గురిచేయడం విదితమే. అయినా విద్వత్సభల వల్ల కొంత నివారణోపాయం ఉన్నా, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల ద్వారా మాత్రం వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్రంలోని సిద్ధాంతులందరూ ఒకే వేదికపై నిర్ణయాలు తీసుకున్నందున భవిష్యత్తు పండుగలలో విభేదాలు వచ్చే అవకాశాలు లేవు. ఇందుకు తీవ్ర కృషి చేసిన శ్రీ గాయత్రీ పీఠం (అన్నోజిగూడ), జ్యోతిర్మయ మహాపీఠం (మేడిపల్లి), 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తాపత్రిక వారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ వారికి రాష్ట్ర ప్రజలందరూ అభినందించి, కృతజ్ఞతలు తెలియాలన్నారు.

'వర్ష సూచనలు పంచాంగ ఆవశ్యకత' అంశంపై శ్రీ ఓరుగంటి మనోహరశర్మ సిద్ధాంతిగారు ప్రసంగపత్రం సమర్పించారు.

రాబోయే సంవత్సరం పంచాంగం సుమారు ఆరు మాసాల ముందే వస్తుంది. ఇందులో వచ్చే సంవత్సరంలో కార్తి చక్రాన్ని అనుసరించి వర్షసూచనలుంటాయి. దీనివల్ల వ్యవసాయం చేసే రైతులకు చాలా మేలు జరుగుతుంది. అంతేగాదు, యావత్ సమాజానికి జీవనాధారమైన ఆహారం, నీరు రెండింటినీ పొందడానికి పరోక్షంగా పంచాంగం ఉపయోగపడుతుంది. ఇది ప్రభుత్వానికి కూడా చాలా అవసరం. వ్యవసాయ శాఖకు వాతావరణంలో కలిగే



మార్పులకనుగుణంగా ముందస్తు ప్రణాళికలు చేయడానికి సులభమవుతుంది.

'వస్తు ధరల నిర్ణయ విశ్లేషణ' అనే అంశంపై శ్రీ బోర్పట్ల రాఘవేంద్రాచార్య సిద్ధాంతిగారు ప్రసంగించారు. సమాజంలోని ప్రతి వ్యక్తికీ నిత్యావసర వస్తువుల దగ్గర నుండి బంగారం లాంటి వస్తువులు కొనుగోలు చేయవలసిందే. పంచాంగం ద్వారా మనకు ఏ వస్తువుల ధరలు ఏ సమయంలో పెరుగుతాయి, ఏ సమయంలో తగ్గుతాయన్న విషయాన్ని కేవలం పంచాంగం ద్వారా తెలుసుకోవడం ఆశ్చర్యకరమైన విషయం. ఇది మన పూర్వీకులు మనకందించిన అద్భుత వరం. దీన్ని అర్థానర్థాలంటారు. దీనివల్ల సమాజానికే గాక వ్యాపార వృత్తికల వారందరికీ ఉపయోగపడుతుంది. ఇది ఆధారంగా చేసుకుని సరుకులు నిల్వ చేసుకొనేవారు లాభాలను పొందడం ప్రత్యక్ష నిదర్శనం.

'మౌఢ్య నిర్ణయ వ్యత్యాసం' అనే అంశాన్ని గురించి శ్రీ చికిలి లక్ష్మీవేంకటేశ్వర శర్మ సిద్ధాంతిగారు వివరించారు. మనకు అవసరమయ్యే శుభ ముహూర్తాలకు ప్రతిబంధకమైన 'మూఢమ' విషయంలో పంచాంగాలన్నీ ఒకే విధంగా నిర్ణయిస్తే సమాజానికి, పురోహితులకు ఇబ్బందులుండవు. గ్రహగతుల ననుసరించి మూఢమ నిర్ణయం ఉంటుంది. ప్రతి సంవత్సరం సుమారు గురు, శుక్ర మూఢమలు వస్తుంటాయి. కొందరు సిద్ధాంతులు తమ ప్రత్యేకతను చాటుకోవడం కోసం వారు వేరే శాస్త్రాలననుసరించి మూఢమ వ్యత్యాసానికి కారకులవు తున్నారు. దీనివల్ల మనం సమాజాన్ని ఇబ్బందులకు గురిచేసిన వారమవుతున్నాం. ఇక ముందు ఇలాంటి వ్యత్యాసాలు రాకుండా జాగ్రత్తపడుట కొరకు ఈ సభలు ఉపయోగపడాలని ఆశిస్తున్నానన్నారు.

'వార దుర్ముహూర్త - రాహుకాల ప్రభావం' అనే అంశంపై శ్రీ పెండ్యాల హనుమంతరావు గారు ప్రసంగించారు.

ప్రాంతాచారాలను అతిక్రమించవద్దని ధర్మశాస్త్రం నిర్ణయించింది. ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతాచారాలనే అనుసరించాలని, ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వారికి ఇహ, పర సుఖాలుండవని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో కూడా బోధించాడు. వారాల వారీగా ఏర్పడింది వార దుర్ముహూర్తం. దుర్ముహూర్తం అంటేనే అర్థమవుతుంది ఇది



చెడు సమయం. అనగా అశుభాలు కలుగుతాయని అర్థం. ఇక నక్షత్రాన్ని అనుసరించి నిర్ణయించబడేది వర్జ్యం. వర్జ్యం అనగా వదిలివేయవలసిన సమయం. ఈ రెండు మాత్రమే మన ప్రాంతాలలో అనాదిగా ఆచరిస్తున్నవి.

ప్రస్తుత కాలంలో కొందరు రాహుకాలాన్ని ఆచరిస్తున్నారు. ఇది వ్యక్తిగతమే కాని ప్రాంతానికి సంబంధించిన అంశం కాదు. ఈ రాహుకాలం కేవలం దక్షిణాది వారికి మాత్రమే వర్తిస్తుందని శాస్త్రం నిర్ణయించింది. దీన్ని అందరూ దృష్టియందుంచుకొని, సహకరించాలని ఈ సభ ద్వారా అందరికీ సూచిస్తున్నాను.

మొదటి రోజు చివరి అంశమైన 'ప్రస్తుత సమాజంలో సిద్ధాంతుల పాత్ర'పై శ్రీ యాయవరం దయాకరశర్మ సిద్ధాంతి గారు వివరించారు. 'సర్వేజనా స్సుఖినోభవంతు' అని అనడం కాదు. సర్వ సమాజ శ్రేయస్సును కోరతారు. అట్టి బ్రాహ్మణోత్తములలో పంచాంగకర్తలైన సిద్ధాంతులు, సమాజ శ్రేయస్సుతో పాటు బ్రాహ్మణోత్తములకు మార్గదర్శిగా ఉంటారు. సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న సిద్ధాంతులను కాపాడుకోవాల్సిన బాధ్యత, బ్రాహ్మణోత్తములందరితో పాటు సమాజానిది మరియు ప్రభుత్వానికి కూడా ఉంది. పరోక్ష పాత్రలో ఉన్న సిద్ధాంతులను గుర్తించకపోవడం బాధాకరం. ఈ సభల ద్వారా కొంత చైతన్యం కలిగించే ప్రయత్నం చేసిన నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఇంతవరకు 'సిద్ధాంత సదస్సు'లో సమర్పించవలసిన 12 అంశాలు పూర్తి అయ్యాయి. అనంతరం సాయంకాలం ఐదు గంటలకు యువ సిద్ధాంతుల సమ్మేళనం జరిగింది. సుమారు 25 మంది ఈ పాల్గొన్న ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన సిద్ధాంతులు వీరికి భవిష్యత్తు 'మార్గ నిర్దేశం' చేశారు. తదుపరి సిద్ధాంతులందరితో 'తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య' సహకారంతో 'విద్వత్సభ' జరిగింది. ఈ సభకు అధ్యక్షులుగా శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, సమన్వయకర్తలుగా శ్రీ వెన్నంపల్లి జగన్మోహన శర్మ, శ్రీ బోర్వట్ల హనుమంతాచార్యులు వ్యవహరించారు.

ఈ విద్వత్సభలో శ్రీయుతులు గుడి సోమనాథ శర్మ సిద్ధాంతి, గుండు వేంకట నరసింహ శర్మ, శాస్త్రుల కృష్ణమూర్తి



శర్మ, యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి, దేశాయిపేట మహేశ్వర శర్మ, గుండేశ్వర శర్మ సిద్ధాంతి, కమలాకర శర్మ సిద్ధాంతి, ప్రశాంత్ జోషి సిద్ధాంతి, ఓరుగంటి నాగరాజ శర్మ సిద్ధాంతి, కొడమగల్ల వేణుగోపాలాచార్య, జి సంపత్కుమార అప్పలాచార్య, నిత్యనిర్మల యోగ కృష్ణమాచార్య, ఓరుగంటి రామారావు, బోర్పట్ల రాఘవాచార్య, గౌరీభట్ల రామకృష్ణ శర్మ పాల్గొన్నారు. వీరేగాక అర్చకులు, పురోహితులు, జ్యోతిష పండితులు కూడా పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు యాదాద్రి దేవస్థాన చైర్మన్ శ్రీ బి. నరసింహమూర్తి, స్థానాచార్యులు శ్రీ నల్లందిగల్ నరసింహాచార్యులుగారు, ప్రధాన పురోహితులు శ్రీ గౌరీభట్ల సత్యనారాయణ శర్మ గారు, భద్రాద్రి దేవస్థానాచార్యులు శ్రీ స్థలశాయిగారు, బాసర దేవస్థానం నుండి ప్రధానార్చకులు వేములవాడ దేవస్థానం నుండి శ్రీ శంకరయ్యగారితో పాటు వివిధ బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యదర్శులు కూడా పాల్గొన్నారు.

రాబోయే శ్రీ విళంబి నామ సంవత్సర పండుగల ప్రతాల నిర్ణయాన్ని అందరి సమక్షంలో తీర్మానం చేశారు. సభాధ్యక్షులు వాటి వివరాలను సభకు వివరించారు. శ్రీ మరుమాముల వెంకట రమణ శర్మ గారి వందన సమర్పణతో మొదటి రోజు సభ ముగిసింది. అనంతరం శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి (సురభి) ఆర్. నాగేశ్వరరావు (బాబ్జి) బృందం వారిచే 'మాయాబజార్' రంగస్థల నాటక ప్రదర్శన జరిగింది.

10వ తేదీ ఆదివారం రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో రాష్ట్ర జ్యోతిష మహాసభల రెండవ రోజు కార్యక్రమం శ్రీశ్రీశ్రీ గోవిందానంద సరస్వతీ స్వామి, పంపాక్షేత్రం హంపి వారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా అనంతసాగర్ శ్రీ సరస్వతీ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ అష్టకాల నరసింహరామశర్మ అవధాని గారు విచ్చేశారు. సభాధ్యక్షులుగా డా. సాగి కమలాకరశర్మ గారు వ్యవహరించారు. మరుమాముల వెంకట రమణ శర్మగారి స్వాగతోపన్యాంతో సభ ప్రారంభమైంది. రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న జ్యోతిష మహాసభలకు విచ్చేసిన పండితులందరికీ నిర్వాహకులు శ్రీ



దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు.

శ్రీ గోవిందానంద స్వామివారు అనుగ్రహ భాషణం చేస్తూ ఇప్పుడు భాగ్యనగర నామం సార్థకమైందన్నారు. ప్రతి జిల్లాలో, ప్రతి తాలూకాలో ఒక సిద్ధాంతిని నియమించాలన్నారు. ప్రభుత్వానికి కూడా ఒక ఆస్థాన సిద్ధాంతి అవసరమని సూచించారు. జ్యోతిశ్శాస్త్రానికి ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉండాలన్నారు. నిర్వాహకులకు, సభలోని వారికందరికీ, రాష్ట్ర ప్రజలకు దివ్యాశీస్సులందించారు.

శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి ప్రియశిష్యులైన శ్రీ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి గారిచే గుణింపబడిన శ్రీ విళంబి నామ సంవత్సర పాకెట్ సైజు పంచాంగం, 2018 క్యాలెండర్‌ను శ్రీ గోవిందానంద స్వామివారి సమక్షంలో ముఖ్య అతిథి అష్టకాల నరసింహ రామశర్మగారు ఆవిష్కరించారు.

జ్యోతిశ్శాస్త్రానికి మించిన శాస్త్రం లేదు. ఇది సైన్స్ అని, జన్మ తేదీ లేని వారికి జన్మ తేదీని కనుగొనే పద్ధతిని నష్ట జాతకం అంటారు. పరాశర హోరా శాస్త్రంలో దీని గూర్చి ప్రత్యేక అధ్యాయం ఉందని నరసింహరామశర్మ గారు తన సందేశంలో పేర్కొన్నారు.

సభాధ్యక్షులు కమలాకర శర్మ గారి తమ ప్రసంగంలో జాతకంలో ఎన్నో విభాగాలున్నాయి కానీ ప్రస్తుతం ఈ సభల్లో మాత్రం కేవలం జాతకం పైనే అంశాలు నిర్ణయించారన్నారు. ఇది ఒక ప్రయత్నం మాత్రమే అయినా అద్భుతంగా జరుగుతున్నదని నిర్వాహకులను అభినందించారు.

జాతక సదస్సులో మొదటి అంశమైన 'ఆధునిక కాలంలో జ్యోతిష ప్రభావం'పై శ్రీ మాడ్గుల శశిభూషణ శర్మ సోమయాజి గారు సంస్కృతంలో ప్రసంగించారు. ఆధునిక కాలంలో అందరికీ జ్యోతిశ్శాస్త్రంపై విశ్వాసం పెరిగింది. గణితం చేయడానికి ప్రస్తుతం శ్రమ లేకుండా, కంప్యూటర్ ఉపయోగించుకోవచ్చు. కాని ఫల నిర్ణయానికి మాత్రం అనుభవజ్ఞులైన జ్యోతిష పండితులు అవసరం అని పేర్కొన్నారు.

'నేటి సమాజంలో జ్యోతిష్యుల కర్తవ్యం' అనే రెండవ



అంశంపై డా. తిరుక్కోవెల జితేంద్ర ప్రసాద్ గారు ప్రసంగించారు. ప్రస్తుతం జ్యోతిష్యులు సమాజాన్ని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇది శాస్త్ర సమ్మతం కాదు. ధర్మ పరిరక్షణకు కృషి చేయాల్సిన జ్యోతిష పండితులు అధర్మ కార్యాలకు పాల్పడరాదన్నారు. ధర్మమయమైన వేదానికి ప్రధానాంగం అంటే జ్యోతిశ్శాస్త్రం కూడా ధర్మబద్ధమైందని అర్థమని ప్రతి జ్యోతిష పండితుడూ తెలుసుకోవాలన్నారు.

'వివాహంలో రాశి కూట ఆవశ్యకత'పై శ్రీ గంగవరం నారాయణ శర్మగారు ప్రసంగించారు. నేటి సమాజంలో రాశికూటాలపై క్షుణ్ణంగా అవగాహన లేనివారు వారికి తోచిన విధంగా నిర్ణయిస్తున్నారు. ఇది సరియైన పద్ధతి కాదు. దోషాలను విశ్వసించినపుడు శాస్త్రంలో తెలిపిన పరిహారాలను కూడా విశ్వసించాలి. ఎన్నో విషయాలకు మరెన్నో మినహాయింపులున్నాయి. కేవలం గుణాలు తక్కువగా ఉన్నాయని మంచి మంచి సంబంధాలు పోగొట్టుకొని వివాహం అయిన వెంటనే కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శాస్త్రం ఎప్పుడూ ఇది ఖచ్చితంగా పనికిరాదని నిర్ణయించదు. మన మేలు కోమే శాస్త్రం ఆవిర్భవించిందని నొక్కి వక్కాణించారు.

గోచార 'ప్రాముఖ్యత - రాశి ఫలాల విశిష్టత అనే అంశంపై శ్రీ గౌరీభట్ల సుబ్రహ్మణ్య శర్మగారు వివరించారు.

శ్లో ॥ ఫలాని గ్రహచారేణ, సూచయంతి మనీషిణః ।
కో వక్తా తారతమ్యస్య తమేకం వేధసం వినా ॥
(పరాశరులు)

పండితులు గ్రహ స్థితిగతుల ననుసరించి ఫలితాలను సూచిస్తారే గాని, ఖచ్చితమైన ఫల నిర్ణయం చేయడం బ్రహ్మదేవుడికి ఒక్కడికి తప్ప ఎవరికీ సాధ్యం కాదని తాత్పర్యం. అనగా ఎవరూ చెప్పలేరని సారాంశం.

అదేమాదిరి ప్రతి సంవత్సరం పంచాంగంలో తెలిపే గోచార రాశి ఫలితాలు కూడా సూచనగానే స్వీకరించాలి తప్ప. ఖచ్చితంగా జరిగి తీరుతుందనడానికి వీలు లేదు. ఇలాంటి సూక్ష్మ విషయాలను పండితులు, ప్రజలు గమనించాల్సి ఉందన్నారు. ఏ గ్రహం ఏ రాశిలో ఉన్నప్పుడు శుభఫలితా లిస్తాయో, అదేమాదిరిగా అశుభ స్థానాల్లో సంచరించిపుడు అశుభ ఫలితాలిస్తాయి. వీటిని తొలగించడానికి





తగిన శాస్త్రోక్త పరిహారాల ద్వారా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'ప్రస్తుత కాలంలో గ్రహాల ప్రభావం' అనే అంశంపై శ్రీ జాలా సోమనాథ శాస్త్రిగారు ప్రసంగించారు. సృష్టి ఆరంభం నుండి, గ్రహాల ప్రభావం మానవునిపై ఉంటోంది. సూర్యుని ప్రభావం వల్లనే మనం కర్మలకు పూనుకుంటున్నాం. మిగతా గ్రహాలన్నీ సూర్యుని ప్రకాశంతోనే ప్రభావితమవుతాయి. రాత్రి పూట చంద్రుని ప్రభావంచే మనస్సు ప్రేరేపితమవుతుంది. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న ప్రపంచంలోని అన్ని వస్తువులు, వాతావరణంపై గ్రహాల ప్రభావం ఉంటుంది.

పూర్వకాలం ఋషులంతా ద్రష్టలై మనకు వాని ప్రభావ విశేషాలనందించారు. అయితే ఇప్పుడు వాటిని విశ్వసించడం లేదు. కాని మన శాస్త్రాల ఆధారంగా పాశ్చాత్యులు పరిశోధనలు జరిపి, ఇది నిజమేనని చెప్పేంతవరకు వాటిని మనం నమ్మడం లేదు. అందువల్ల మన శాస్త్రాలను మనం క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం శ్రీ మేళ్లూరి వేంకటేశ్వర శర్మగారు కారకత్వాలు, కాలానుగుణ సమన్వయం అనే అంశాన్ని వివరించారు. గ్రహాలన్నిటికీ కారకత్వాలున్నాయి. కారకత్వాలే జాతకానికి చాలా ముఖ్యం. ప్రధానంగా సూర్యుడు ఆత్మ కారకుడు, చంద్రుడు మనః కారకుడు. ఇలా ప్రతి గ్రహానికీ ఒక ప్రధాన కారకత్వంతో పాటు మిగతా అనేక కారకత్వాలున్నాయి. వీటన్నింటినీ కూలంకషంగా తెలుసుకున్నపుడే జ్యోతిష పండితులు జాతకం చెప్పగలుగు తారన్నారు.

కాలానుగుణ సమన్వయం కూడా అవసరం. ఉదాహరణకు వాహన యోగం అంటే పూర్వకాలం ఎడ్లబండ్లు, గుర్రపుబండ్లు ఉండేవి. నేడు ఆ స్థానంలో కార్లు, బైకులు వచ్చాయి. అదే మాదిరిగా మిగతా విషయాలను సమన్వయం చేసుకుని ఫలితాలను సూచించాలన్నారు.



శ్రీ తత్త్వానంద ఋషి స్వాగతోపన్యాసంతో మధ్యాహ్న సమావేశం ప్రారంభమైంది. డా. శ్రీమతి సూరన్నగారి ప్రతిభ గారు 'పరాశర హోరాశాస్త్ర పరిశీలన' అనే అంశంపై వివరంగా ప్రసంగించారు.

'కలౌ పారాశరీ హోరా, ప్రత్యక్ష ఫలదర్శిని' అన్నారు. ప్రస్తుత కలికాలంలో పరాశర హోరా శాస్త్రం ఫలితాలను, జాతక విశేషాలను గూర్చి ప్రమాణంగా తీసుకోవాలన్నారు.

పరాశర హోరా శాస్త్రంలో అనేకాంశాలు ప్రత్యేక అధ్యాయాలుగా పేర్కొనబడ్డాయి. ఇందులోని శ్లోకాలు కూడా సులభంగా అర్థమయ్యే విధంగా ఉన్నాయన్నారు.

దోష పరిహారాల నిర్ణయం - ప్రయోజనం అనే అంశంపై అప్పాల శ్యాంప్రణీత శర్మగారు ప్రసంగించారు. జాతకంలోనైనా, గోచారంలోనైనా నవగ్రహాలే ప్రధానం. అందరి జాతకాల్లో ద్వాదశ రాశులు, నవగ్రహాలు కదా! ఇవి సంచరించే స్థానాల ననుసరించి, భావ ఫలితాలు ఆధారపడి ఉన్నాయి. అశుభ స్థానాల్లో సంచరిస్తున్నపుడు అశుభ ఫలితాలిస్తారు. అందుకే పరిహారాలు అవసరమైనాయి.

జనన సమయంలోదోష నక్షత్రాలున్నప్పుడు శాంతులు జరిపించుకోవాలని శాస్త్రం చెప్పింది. అయితే పరిహారాల వల్ల పూర్తి ఫలితం రాకపోయినా, చాలా వరకు ఉపశమనం కలుగుతుంది. ఇది మనకు ప్రత్యక్ష నిదర్శనం. బాలారిష్ట దోషాలు, వివాహ నక్షత్ర దోషాలు, జాతక ప్రకారం కలిగే దోషాలు. ఇలా ఏ దోషాలకైనా శాస్త్రోక్త పరిహారాలున్నాయి. అనుభవజ్ఞులైన పండితులు మాత్రమే శాస్త్రోక్త పరిహారాలు సూచిస్తారు. వానివల్ల తప్పక ప్రయోజనముంటుందన్నారు.

'జాతక ఫల విశ్లేషణా విధానం' అనే అంశంపై శ్రీ రాయప్రోలు ఆదినారాయణగారు ప్రసం గించారు. ఈ అంశం ప్రస్తుత జ్యోతిష పండితులకు చాలా ముఖ్యమైంది. జాతకాన్ని పరిశీలిస్తున్నపుడు పైపైన కాకుండా, లోతుగా పరిశీలించినపుడే ఫలితాలు సరిగా సూచించగలుగుతున్నారు. జాతక ఫల నిర్ణయం ప్రధానంగా ఐదు అంశాలపై ఆధారపడి ఉంటుంది. జాతకం లోని గ్రహస్థితి, కారకత్వం, దశాంతర్దశా, గోచారం, ప్రశ్న కాలం ఇవన్నీ దృష్టియందుంచుకుని ఫలనిర్ణయం చేయాలి. అలాగే ఫలితాలను సూచించునపుడు ఊహాపోహ జ్ఞానం కూడా ఉండాలన్నారు.

'జ్యోతిషుల లక్షణాలు - యోగ్యతలు' అనే అంశంపై శ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి వివరించారు.

శ్లో ॥ అద్వేషి, నిత్యసంతోషి, గణితాగమ పారగః ।
సౌమ్యశ్చ, సత్యభాషీచ, సదైవజ్ఞః ప్రకీర్తితాః ॥

అని దైవజ్ఞులైన జ్యోతిషుల లక్షణాలను శాస్త్రంలో తెలిపారు. ద్వేషం లేకుండా ఉండాలి. ఎల్లప్పుడూ సంతో

షంగా ఉండాలి. గణితం, ఆగమ శాస్త్రాల్లో నిష్ణాతులుగా ఉండాలి. సౌమ్యులు, సాత్వికులై, సత్యంగానే మాట్లాడాలి. ఇవి జ్యోతిషుల ప్రధాన లక్షణాలు. శాస్త్రాన్ని అభ్యసించడం ఒక ఎత్తయితే, అనుభవాన్ని సంపాదించడం మరొక ఎత్తు. ఈ శాస్త్రంలో శాస్త్రజ్ఞానంతో కూడా అనుభవజ్ఞానం చాలాముఖ్యం. అనుభవజ్ఞులైన జ్యోతిష పండితులు ఈ కాలంలో లభించుట చాలా కష్టం. మనం ఎంపిక చేసుకునే విధానంలో మార్పు రావాలి. కేవలం ఆడంబరాలను చూసి మోసపోకుండా జాగ్రత్తపడడం అవసరం.

చివరగా 'ధర్మ పరిరక్షణలో జ్యోతిష్యుల పాత్ర' అనే అంశంపై శ్రీ ఉమాపతి బాలాంజనేయ శర్మగారు ప్రసంగపత్రాన్ని సమర్పించారు.

శ్లో ॥ వేదోఖిలం ధర్మమూలం, ధర్మః కాలవశం గతః ।
శాస్త్రోధారస్తదా కాలః, తచ్ఛాస్త్రం జ్యోతిషం స్మృతమ్॥

అని ఈ మహాసభల బ్రోచర్‌లో సూచించారు. వేదానికి ధర్మం మూలమైతే, ధర్మానికి జ్యోతిశాస్త్రమే మూలం. జ్యోతిశ్శాస్త్రం ద్వారా ధర్మబుద్ధి కలుగుతుంది. అందుకే జ్యోతిష్యున్ని ఈశ్వరునిగా భావించాలన్నారు.

సమాజంలో ధర్మ పరిరక్షణలో జ్యోతిష్యుల పాత్ర అత్యంత కీలకమైంది. శాస్త్రం అనుభవం ఎంత ఉన్నా ఆచరణ చాలా ముఖ్యం. ధర్మాచరణలోని జ్యోతిష్యులనే సమాజం గౌరవిస్తుంది. ధర్మపరిరక్షణ అంటే వేదికలపై ఉపన్యసించడం కాదు. ధర్మాన్ని ఆచరించడమే ధర్మపరిరక్షణ అవుతుందన్నారు.

సభాధ్యక్షులే, రెండవ అంశమైన 'దశాంతర్దశా ఫల నిర్ణయ సమీక్ష'పై ప్రసంగించారు. కాల నిర్ణయం జ్యోతిషంలో ప్రధానమైంది. జనన కాల సమయం ఆధారంగా దశలు, అంతర్దశలు విదశలు, సూక్ష్మదశలు, ప్రాణ దశలు అని ఐదు విధాలుగా ఉంది. అయితే గ్రహాలకు దశా ప్రమాణాలు రెండు విధాలుగా ఉంది. 108 సంవత్సరాలు ఒక పద్ధతి, 120 సంవత్సరాలు మరొక పద్ధతి. ఆయా గ్రహాలకు ఆయా సంవత్సరాలను శాస్త్రంలో నిర్ణయించారు. ఈ విషయంలో మనం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

సభా కార్యక్రమం ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చి॥ గౌరీభట్ల అభిజ్ఞచే స్వాగత నృత్యం ప్రదర్శన జరిగింది. అనంతరం శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారిచే రూపొందించబడిన 'నవగ్రహ అనుగ్రహం' అనే జ్యోతిష రూపకాన్ని జ్యోతిష పండితులచే ప్రదర్శింప చేశారు. ఈ రూపకం ద్వారా సమాజానికి కొన్ని జ్యోతిష సందేశాలను అందించగలిగారు.

1. పుట్టిన వెంటనే జాతాశౌచం లేనివారు శిశువు జాతకం నిరభ్యంతరంగా చూపించుకోవచ్చు.
2. నామకరణ విషయంలో నక్షత్ర నామాన్ని వ్యవహార నామంగా నిర్ణయిం చడం శాస్త్ర సమ్మతం కాదు.
3. నవగ్రహాల ప్రభావంతోనే జాతక ఫలితాలు నిర్ణయిస్తారు.
4. అనుభవజ్ఞులైన జ్యోతిష పండితులనే సంప్రదించాలి.
5. శాస్త్రోక్త దోష పరిహారాల వల్ల తప్పకుండా ఫలితం లభిస్తుంది.

ఉదా : బుధ దోష పరిహారానికి వంద మొక్కలు నాటి హరిత హారంలో పాల్గొనాలని జ్యోతిష్యుడు సూచించారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైంది. ఈ విషయంపై సభలోని వారంతా హర్షధ్వానాలు తెలిపారు.



ఈ జ్యోతిష రూపకంలో డా. సాగి కమలాకర శర్మ గారు, శ్రీమతి గీతామూర్తి, మాడ్గుల శశిభూషణ శర్మ సోమయాజి, ముదిగొండ అమరనాథ శర్మ, ఆదరాసుపల్లి శ్యాంమోహనశర్మ, మరుమాముల దత్తాత్రేయశర్మ, మహాదేవభట్ల రాంప్రసాద్ శర్మ, యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి, యలమంచి శ్రీధరశర్మ, బోర్పట్ల విరాట్ స్వరూప్ నటించారు. వ్యాఖ్యాతగా మడిపల్లి దక్షిణామూర్తి, మేకప్ మెన్‌గా అమరేందర్ వ్యవహరించారు.

సాయంత్రం సభల సమాపనోత్సవ శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారి దివ్యాశీస్సులతో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు డా. కె.వి. రమణాచారిగారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సర్వార్థ సంక్షేమ సమితి వ్యవస్థాపకులు శ్రీ పి.వి. మనోహర్‌రావుగారు సభాధ్యక్షులుగా, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ సభ ప్రారంభకులుగా వ్యవహరించారు.

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు డా. సముద్రాల వేణుగోపాలచారి గారు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ వనం జ్వాలా నరసింహారావు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారులు శ్రీ సుద్దాల సుధాకర తేజ, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు శ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ, శ్రీ అష్టకాల రామ్మోహన్ శర్మ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.

వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, సంఖ్యా శాస్త్ర నిపుణులు శ్రీ దైవజ్ఞశర్మ, సిద్ధిపేట డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు శ్రీ చెప్పెల హరనాథ శర్మ, విశ్రాంత అధ్యాపకులు, చారిత్రక పరిశోధకులు శ్రీ శాస్త్రుల రఘురామశర్మ, శ్రౌత సంవర్ధనీ సభ అధ్యక్షులు శ్రీ నరేంద్ర కాప్రే పాల్గొన్నారు.

మామిడి హరికృష్ణ గారు మాట్లాడుతూ ఇది రవీంద్రభారతి కాదు ఈ రోజు వేదభారతిగా మారిందన్నారు. రాష్ట్రంలోని పండితులందరిచేత రవీంద్రభారతి నిండిపోవడం వల్ల మన జన్మ ధన్యమైందన్నారు. ముఖ్య అతిథి రమణాచారి గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు ఇంత ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, నిజంగా ఈ సభ ఇక్కడ జరగడం విశేషమన్నారు. ముందరోజు సిద్ధాంత సదస్సులో జరిగిన తీర్మానాలను యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గారు వినిపించిన వన్నీ ఆమోదయోగ్యములని నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. త్వరలో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాక బ్రాహ్మణుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు అత్యంత శ్రద్ధతో కేటాయించిన బడ్జెట్ సిద్ధంగా ఉంది. ఇందులో తెలుపబడిన సంక్షేమ పథకాలను బ్రాహ్మణులందరూ సద్వినియోగ పరచుకోవాలని సభా ముఖంగా కోరారు.

తదుపరి అతిథులనందరినీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. దర్శనమ్ శర్మగారి వందన సమర్పణతో తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు ముగిశాయి.

తెలంగాణ రాష్ట్రంలో పండగల నిర్ణయం, ఇతర పంచాంగ సంబంధ విషయాల సమన్వయం, ప్రభుత్వానికి తగిన సూచనలు ఇచ్చే విషయమై జ్యోతిష మహాసభల్లో భాగంగా తొలిరోజు జరిగిన విద్వత్సభలో సారథ్య సంఘం



(కోర్ కమిటీ)ని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులుగా బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి (సికింద్రాబాద్), కమిటీ సభ్యులుగా గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి (మేడ్చల్), గాడిచెర్ల నాగేశ్వరశర్మ సిద్ధాంతి (నిర్మల్), ఐనవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి (వరంగల్), సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి (జనగామ), ఓరుగంటి మనోహర శర్మ సిద్ధాంతి (వనపర్తి), బోర్పట్ల రాఘవేంద్రాచార్య సిద్ధాంతి (సంగారెడ్డి), చికిరి వెంకటేశ్వర శర్మ సిద్ధాంతి (ఆదిలాబాద్)లతో ఈ కమిటీ ఏర్పాటయింది. సమన్వయ కర్తగా 'దర్శనమ్' సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ వ్యవహరిస్తారు.

జ్యోతిష విభాగంలో సభ్యులుగా సాగి కమలాకర శర్మ, సూరన్నగారి ప్రతిభ, అనంతాచార్యులు, గంగవరం నారాయణ శర్మ ఎన్నికయ్యారు. ఈ రెండు రోజుల మహా సభల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష పండితులు, వేద పండితులు, అర్చకులు, ఆధ్యాత్మిక వేత్తలు హాజరయ్యారు.

రెండు రోజుల్లో సభల్లో పాల్గొన్న వారిలో శ్రీయుతులు కాశావఝుల శివరామశర్మ, చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు, కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, గోపీకృష్ణ శర్మ, వంశీధర శర్మ, అప్పాల సత్యనారాయణ శర్మ, మదునూరి వెంకటరామశర్మ, గుండు శేనుగోపాల శర్మ, వేదాటి రామన్నపంతులు, మహదేవభట్ల లక్ష్మణ ప్రసాద శర్మ, మరుమాముల రామచంద్రమూర్తి, అప్పాల మాధవ శర్మ, దేశపతి అనంతశర్మ, త్రిపురారి ప్రసాదశర్మ, శాస్త్రుల చంద్రమౌళి శర్మ, సిద్ధిరామేశ్వర శర్మ, ఫణిశశాంక శర్మ, వావిలాల దామోదర శర్మ, కొడకండ్ల రామశర్మ, శంకరమంచి రామకృష్ణ శర్మ సిద్ధాంతి, ఆదరాసుపల్లి శశిధర శర్మ, మదునూరి రామానంద శర్మ, కామధేను ట్రస్ట్ సుబ్రహ్మణ్య శర్మ, ఆదరాసుపల్లి శ్యామమోహన శర్మ తదితరులు ఉన్నారు. ఈ రెండు రోజుల జ్యోతిష మహాసభల నిర్వహణలో కార్యనిర్వాహక కమిటీలోని గౌరీభట్ల రామకృష్ణ శర్మ సిద్ధాంతి, మరుమాముల నటరాజ శర్మ, వేలేటి కార్తీక శర్మ, చెరువు వెంకట ఆదిత్య శర్మ, కె. భీంసేన్ మూర్తి, సత్యసుధ, తిగుళ్ల సనాతన సారథి, అల్లాడి ఆనందశర్మ గార్లు క్రియాశీలక పాత్ర నిర్వహించారు. మహాసభ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. శ్రీ విళంబి నామ సంవత్సర పండుగలు, వ్రతాల తేదీల నిర్ణయం. ప్రధాన ఆలయాల్లో ఆస్థాన సిద్ధాంతుల నియామకం. రాష్ట్ర దేవాదాయ శాఖలో ఆగమ, జ్యోతిష సలహాదారుల నియామకం. రాష్ట్ర ప్రభుత్వానికి ఆస్థాన సిద్ధాంతిని నియమించడం. రాష్ట్రంలో ప్రత్యేకంగా జ్యోతిష విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటుచేయడం. జ్యోతిష పండితులు, సిద్ధాంతులకు జీవనభృతిని అందించడం. ఈ తీర్మానాల ప్రతిని సిద్ధాంతుల కోర్ కమిటీ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో సిద్ధాంతులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి. రమణాచారి గారికి సభా ముఖంగా అందించారు.

ముఖ్యమంత్రి అభినందనలు



తొలిసారి ప్రతిష్ఠాత్మకంగా, వైభవంగా తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలను నిర్వహించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు సంతోషాన్ని వ్యక్తంచేస్తూ నిర్వాహకులను అభినందిం చారు. మహాసభలు ముగిసిన మరుసటి రోజున ముఖ్య మంత్రి కార్యాలయం ఆహ్వానం మేరకు సభల నిర్వాహ కులు తత్త్వానంద ఋషి, గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి, మరుమాముల వెంకటరమణ శర్మ, సిద్ధాంతుల కోర్ కమిటీ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మలు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. సభల్లో నిర్ణయించిన పండగల జాబితాను అందజేయగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి వాటినే అధికారిక ఉత్తర్వుల ద్వారా ఈ పండగల జాబితాను ప్రకటించాలని అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. పండగల విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సిద్ధాంతులు, జ్యోతిష పండితులు ఏకగ్రీవంగా నిర్ణ యించడం రాష్ట్ర జ్యోతిష మహాసభలను దిగ్విజయంగా నిర్వ హించడం పట్ల ముఖ్యమంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సభల నిర్వాహకులు కేసీఆర్‌ని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.



2017లో తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి విద్వత్సభ తొలి జ్యోతిష మహాసభల నిర్ణయాలను తెలియచేస్తున్న సందర్భం



పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2018

శ్రీ వికారి నామ సంవత్సర పండుగల నిర్ణయం

అది పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతి ప్రాంగణం. రెండు రోజులపాటు పండగ వాతావరణం. ఉదయం నుంచి రాత్రి దాకా సిద్ధాంతులు, పంచాంగకర్తలు, వేద, జ్యోతిష, శాస్త్ర పండితులు కోలాహలంగా గడిపిన అద్భుత సన్నివేశం. తొలి రోజు జ్యోతిష సిద్ధాంత భాగం, జ్యోతిష ఫలిత భాగంపై విద్వద్గోష్ఠి. రెండవ రోజు ఆలయ, ఆగమ, ధర్మ శాస్త్రాలపై విద్వన్మూర్తుల ప్రసంగపత్రాలు. వందమంది దాకా సిద్ధాంతులు విద్వత్సమ్మేళనంలో రాబోయే వికారి నామ సంవత్సర పండగలను నిర్ణయించిన సందర్భం. ఇలా ఈ రెండు రోజుల పాటు భాగ్యనగరంలోని రవీంద్రభారతిలో రెండవ జ్యోతిష మహాసభలు అపూర్వ, అద్వితీయంగా సాగాయి. తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభల ప్రత్యేక నివేదిక ఆస్తికలోకం కోసం...

తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో ద్వితీయ తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు అద్వితీయంగా, అంగరంగ వైభవంగా జరిగాయి. దేశంలోనే తొలిసారిగా జ్యోతిష, ఆగమ, ధర్మశాస్త్ర సదస్సులు జరగడం విశేషం. ఇందులో రాష్ట్రంలోని 31 జిల్లాల సిద్ధాంతులు, జ్యోతిష పండితులు, వేద, ఆగమ, శాస్త్ర పండితులు, అర్చకులు, పురోహితులేగాక ప్రధానాలయాల స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ప్రధాన పురోహితులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పాల్గొన్నారు. అంతేగాక పొరుగు రాష్ట్రంలోని వైజాగ్, తిరుపతి, ఏలూరు, విజయవాడ నుండి కూడా పండితులు అధిక సంఖ్యలో హాజరైనారు. తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సంయుక్త సహకారంతో రవీంద్రభారతి ప్రధాన మందిరం, 'శ్రీ పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతి ప్రాంగణం' భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. రెండవసారి "తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు" ఆగస్టు 13, 14 తేదీల్లో అత్యద్భుతంగా జరిగాయి.

రెండు రోజుల మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమం పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీ స్వామివారి కరకమలములచే జ్యోతి ప్రజ్వలనతో సభలు



ఆరంభమయ్యాయి. వేదపండితులచే వైదిక ప్రార్థన జరిగింది. ఈ కార్యక్రమాన్ని 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ పరిచయం చేశారు. ఈ మధ్య బ్రహ్మైక్యం చెందిన తెలంగాణ ప్రాంతంలోని జ్ఞాన వయోవృద్ధ పండితులు కీ.శే. శ్రీ పాలకుర్తి నృసింహరామశర్మ సిద్ధాంతిగారి ప్రాంగణంగా నిర్ణయించబడింది. ఈ సభ వారి దివ్యాశీస్సులకై రెండు నిముషాలు సభ మౌనం పాటించి శ్రద్ధాంజలి సమర్పించింది.

తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి స్వాగతోపన్యాసం చేశారు. కేవలం ధర్మాచరణ నిమిత్తం, సమాజ శ్రేయస్సుకై రాబోవు సంవత్సరంలో పండుగల నిర్ణయాలపై ఏకాభిప్రాయం సాధించడానికి జ్యోతిష మహాసభలు నిర్వహిస్తున్నామని వారు తమ స్వాగతోపన్యాసంలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ సభకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి శ్రీ సముద్రాల వేణుగోపాలాచారి అధ్యక్షత వహించారు.

తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో నిర్వహించే జ్యోతిష మహాసభలు సమాజ శ్రేయస్సుకై, తెలంగాణ రాష్ట్ర సంక్షేమానికి ఎంతగానో తోడ్పడతాయని గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి ధార్మిక చింతన వల్ల మనం ఇంత గొప్ప సభలు నిర్వహించుకునే అవకాశం లభించిందని, ఈ నిర్వాహకులందరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు శ్రీ జి. జగదీశ్వర్‌రెడ్డి తమ ప్రసంగంలో తెలియజేశారు.

గత సంవత్సరం శ్రీ గాయత్రీపీఠం, జ్యోతిర్మయ మహాపీఠం, 'దర్శనమ్' ఆధ్యాత్మిక మానవత్రిక సంయుక్తాధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు - 2017 విశిష్ట సంచికను శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారి కరకమలములచే ఆవిష్కరించి, తొలి ప్రతిని శ్రీ గాయత్రీ పీఠం తత్త్వానంద ఋషిగారికి అందజేశారు.

ఈ కార్యక్రమాల నుద్దేశించి చాతుర్మాస్య దీక్షలోనున్న శ్రీ గురు మదనానంద శారదాపీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీస్వామి వారి దివ్యానుగ్రహభాషణం చేశారు.

శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారు తమ అనుగ్రహభాషణంలో - ప్రస్తుత సమయంలో సమాజానికి ఇలాంటి జ్యోతిష మహాసభలు ఆవశ్యకత వుందన్నారు. ప్రతి ఒక్కరికీ సనాతన జ్యోతిశ్శాస్త్ర విషయాలు అవగాహన చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఇందులో ఎలాంటి సందేహాలుండరాదు. సందేహాలుంటే వాటిని అనుభవజ్ఞులైన దైవజ్ఞుల నాశ్రయించి నివారించుకోవాలి





తప్ప తెలిసి, తెలియని వారిని సంప్రదించుట శాస్త్ర సమ్మతంగాదని చెప్పారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కొరకు శాస్త్రాన్ని తప్పుదోవ పట్టించడం మంచిది గాదన్నారు. ఈ సందర్భంగా సభలను నిర్వహించే వారినే గాకుండా ప్రతి ఒక్కరికి మా దివ్యాశీస్సులుంటాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ సభా కార్యక్రమంలో నిర్వాహకులు సభను అలంకరించిన పెద్దలందరిని సత్కరించారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞులు, శ్రీ దైవజ్ఞ శర్మ, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు శ్రీ బోర్పట్ల హనుమంతాచార్య పాల్గొన్నారు. చివరగా విద్వత్సభ కార్యదర్శి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి వందన సమర్పణ చేసారు.

తదనంతరం తొలిరోజు జరుగవలసిన మొదటి సదస్సు జ్యోతిశ్శాస్త్ర సదస్సు (పంచాంగ విభాగం) ప్రారంభమైంది. ఈ సభకు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి అధ్యక్షత వహించారు. ఇందులోని నాలుగు అంశాలపై ప్రసంగించడానికి శ్రీ ఆకెళ్ళ జయకృష్ణ శర్మ సిద్ధాంతి, శ్రీ కవేలి అనంతాచార్యులు, శ్రీ తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, శ్రీ టి.జి.టి. అంతర్వేది కృష్ణమాచార్యులు తమ ప్రసంగ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్వత్సభ ఉపాధ్యక్షులు శ్రీ ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి, తెలంగాణ ప్రభ పత్రికా సంపాదకులు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు అయిన శ్రీ అష్టకాల రామ్మోహన్‌శర్మ పాల్గొన్నారు.

మనం ఆచరించే సకల శుభకార్యాలకు ముహూర్తం తప్పనిసరి అవసరం. ఇది నిత్యసత్యం. ముహూర్త నిర్ణయానికి పంచాంగమే ఆధారం. పంచాంగంలో ఎలాంటి దోషాలు లేని, శాస్త్ర ప్రమాణమైన ముహూర్తాలనే సూచించడం జరుగుతుంది. దేశ, కాల, పరిస్థితుల ననుసరించి ఆపత్కాల ముహూర్తాలను నిర్ణయించే అధికారం పురోహితులకుంటుందని శ్రీ ఆకెళ్ళ జయకృష్ణ సిద్ధాంతి తమ ప్రసంగంలో తెలిపారు.

ప్రస్తుత కాలంలో కాలసర్ప, పితృదోషాలు గూర్చి ఆందోళన చెందడం, వాటి నివారణకై అనేక ప్రయత్నాలు

చేస్తుండటం చూస్తున్నాం. కాని దోష నిర్ధారణ శాస్త్రప్రకారం అనుభవజ్ఞులైన దైవజ్ఞులచే జరిగినా, నివారణ విషయంలో పొరపాట్లు జరుగడం కూడా వాస్తవం. కారణమేమిటంటే ప్రజల అవసరాలను పండితులు ఆసరాగా చేసుకుని తప్పుద్రోవ పట్టించడమేనన్నారు. ఇలాంటి పొరపాట్లు జరుగకుండా, ప్రజలు, పండితులు జాగ్రత్త పడాల్సిన అవసరముందని శ్రీ కవేలి అనంతాచార్యులు రెండవ అంశం ప్రసంగంలో సూచించారు.

మూడవ అంశంపై శ్రీ తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి ప్రసంగిస్తూ - వివాహ పొంతన విషయంలో తమ పురోహితుణ్ణి ఒకరినే సంప్రదిస్తే ఏ సమస్యలూ ఉండవు. ఇరువురిని సంప్రదించుట వల్ల భిన్నాభిప్రాయాలకు కారణమవుతుంది. ఎవరైనా అష్టకూటాలనే శాస్త్ర ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలి. కాని చివరకు పనికిరాదని చెప్పడం శాస్త్ర సమ్మతం కాదు. అలాగే నామ నక్షత్ర విషయంలో కూడా నక్షత్రం ప్రకారం నామకరణం చేయుట శాస్త్ర సమ్మతం గాదన్నారు.

శ్రీ టి.జి.టి. అంతర్వేది కృష్ణమాచార్యులు నాల్గవ అంశం కుజదోష ప్రభావం గూర్చి వివరించారు. కుజదోష నిర్ణయంతోపాటు, నివారణ విషయంలో అనేక సవరణలు శాస్త్రంలోనే పేర్కొనబడ్డాయి. ఇవన్ని క్షుణ్ణంగా పరిశీలించిన మీదట నిర్ణయం తీసుకోవాలి తప్ప, తొందరపడి కుజదోషముందని తీర్మానించకూడదన్నారు.

తదుపరి సాయంత్రం శ్రీ రాబోవు శ్రీ వికారి నామ సం।। పండుగల నిర్ణయం కోసం ఏర్పరచిన విద్వత్సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 50 మంది సిద్ధాంతులు, 50 మంది జ్యోతిష పండితులు, ఒకే వేదికపై చేరి, శ్రీ అహోబిల మఠ రామానుజ జీయర్‌స్వామి సమక్షంలో వారి మంగళాశాసనాలతో పండుగల నిర్ణయాలు ఏకగ్రీవంగా ఆమోదించి, తీర్మానం చేశారు. సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన వారికి 200 మంది పండితులకు వసతి సదుపాయాన్ని విద్వత్సభ నిర్వాహకులు కల్పించారు. రెండు రోజుల కార్యక్రమంలో సుమారు 2000 మందికి భోజన ఏర్పాట్లు చేయడమైనది. సిద్ధాంతులందరికీ స్వామీజీ గారిచే సత్కరించడం జరిగింది.

14-08-18, మంగళవారం రెండవ రోజు

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లోని రెండవరోజు కార్యక్రమంలో వేదానికి ధర్మం ఏవిధంగా మూలమో, ఆగమశాస్త్రానికి, ధర్మాచరణకు జ్యోతిశ్శాస్త్రమే మూలమైనందున ఈ జ్యోతిష మహాసభల్లో ఈ రోజు ఆగమశాస్త్ర సదస్సుల్లో, ధర్మశాస్త్ర సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్రంలోని ధర్మశాస్త్ర పండితులు, ఆగమశాస్త్ర పండితులు, ప్రఖ్యాతి గాంచిన పౌరాణికులు, సంస్కృత పండితులు పాల్గొన్నారు.

ఉదయం 9 గం.లకు శ్రీ జగన్నాథ మఠాధిపతి, శ్రీశ్రీశ్రీ వ్రతధర శ్రీనివాస రామానుజ జీయర్ స్వామివారి కరకమలములచే జ్యోతి ప్రకాశనంతో సభ ప్రారంభమైంది. సభాధ్యక్షులుగా శ్రీ సరస్వతీ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ అష్టకాల నరసింహరామశర్మ అవధాని, గౌరవ అతిథులుగా జ్యోతిష పండితులు శ్రీ వావిలాల దామోదరశర్మ, శ్రీ కొండగడప శ్రీధరశర్మ, శ్రీవఝుల నరహరి శర్మ విచ్చేశారు.





ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ అజ్మీర చందూలాల్ పాల్గొన్నారు. శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ కార్యక్రమ పరిచయం చేయగా, తర్వాత విద్వత్సభ అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి స్వాగతోపన్యాసం చేశారు.

ఈ సభలు అందరికీ ఆదర్శంగా జరుగుతున్నాయి. మన తెలంగాణ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారి నేతృత్వంలో జరుగుతున్న ఇలాంటి ధార్మిక కార్యక్రమాలవల్ల రాష్ట్రం సుభిక్షంగా వుంటుంది. ఇలాంటి కార్యక్రమాలకు మన ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడం మా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సభల నిర్వాహక పండితులందరికి నమస్కారాలు తెలియజేస్తున్నానని ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ అజ్మీర చందూలాల్ అన్నారు.

సమాజ శ్రేయస్సుకై సంకల్పించిన ఈ మహాసభలు జరగడం చాలా ఆనందదాయకం. మా మంగళాశీస్సులు మీ అందరిపై సంపూర్ణంగా వుంటాయని శ్రీశ్రీశ్రీ వ్రతధర శ్రీనివాస రామానుజ జీయర్ స్వామివారు తమ అనుగ్రహభాషణంలో తెలియజేశారు.

తదుపరి గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారిచే ప్రచురింపబడిన శ్రీ మహాభారతము, శ్రీ గురుచరిత్ర గ్రంథాలను, వారి ప్రతినిధిగా తెలుగు అనువాదక నిర్వాహకులైన శ్రీ మదునూరి వేంకట్రామశర్మగారు శ్రీ స్వామివారిచే ఆవిష్కరింపజేశారు. విఖ్యాత జ్యోతిష పండితులు, ధర్మపురి వాస్తవ్యులు శ్రీ వఝుల నరహరి శర్మ సుదీర్ఘ ప్రసంగం చేశారు.

గౌరవ అతిథులుగా విచ్చేసిన వారి ప్రవచనాల తర్వాత ప్రారంభోత్సవ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ తత్త్వానంద ఋషి కూడా పాల్గొన్నారు. అతిథులందరినీ తెలంగాణ విద్వత్సభ సత్కరించింది.

ఉదయం 10 గంటల నుండి జరుగవలసిన ఆగమశాస్త్ర సదస్సు కార్యక్రమానికి డా॥ శ్రీ చెప్పెల హరనాథ శర్మ అధ్యక్షత వహించారు. ఇందులోని నాలుగు అంశాలపై తమ ప్రసంగ పత్రాలను సమర్పించడానికి...

1. "ఆలయాలు - ఆగమాలు" అనే అంశంపై శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి
2. "ఆలయపాలన - ధర్మరక్షణ" అను అంశంపై శ్రీ కాశావఝుల శివరామశర్మ
3. "అర్చకుల విధ్యుక్త ధర్మాలు" అనే అంశంపై శ్రీ గంగవరం నారాయణశర్మ
4. "ధార్మిక స్ఫూర్తి కేంద్రం - ఆలయం" అను అంశంపై శ్రీ కాకునూరి సూర్యనారాయణ మూర్తి విచ్చేశారు.

రెండవరోజు మొదటి సదస్సు ఆగమశాస్త్ర సదస్సులో మొదటి అంశంపై దివ్యజ్ఞాన సిద్ధాంతి ప్రసంగిస్తూ ఆగమశాస్త్రాధారంగా ఆలయాల నిర్మాణం, నిర్వహణ

జరుగుతాయన్నారు. శైవ, వైష్ణవ, శాక్తేయాలని ఆగమశాస్త్రాలు భిన్నంగా వున్నా, లక్ష్యం మాత్రం ఒక్కటిగానే వుంటుందన్నారు.

శ్రీ కాశావఝుల శివరామశర్మ, ఆలయపాలన - ధర్మరక్షణ అనే అంశాన్ని వివరిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆలయ కార్యనిర్వహణాధికారికి సంపూర్ణ పరిజ్ఞానం అవసరమన్నారు. ఇందుకు సరియైన శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత వుందన్నారు. ధర్మరక్షణలో భాగమే ఆలయ పరిరక్షణ అనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.

మూడవ అంశమైన అర్చకుల విధ్యుక్త ధర్మాలు అనే విషయం గూర్చి గంగవరం నారాయణ శర్మ ప్రసంగిస్తూ, తమ తమ సంప్రదాయానుసారం, ఆలయ ఆగమ శాస్త్రాలకనుగుణంగా విధులు నిర్వర్తించాల్సింది తప్ప, తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం శాస్త్ర సమ్మతంగాదన్నారు. అంతేగాక అర్చకులే ఆలయాలకు ప్రధానం. మాట్లాడే దేవుడు అర్చకులన్నారు.

కాకునూరి సూర్యనారాయణ మూర్తి నాల్గవ అంశమైన ధార్మిక స్ఫూర్తి కేంద్రం - ఆలయం గూర్చి ప్రసంగిస్తూ, పూర్వకాలం గ్రామానికి ఆలయమే అన్నివిధాల స్ఫూర్తిదాయకంగా వుండేది. కాలక్రమేణ కేవలం దైవదర్శనాలకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. ఇంకా చాలా మార్పులు ప్రస్తుత సమాజానికి ఉపయుక్తమయ్యే విధంగా ఆలయాల్లో మార్పులు అవసరమన్నారు.

ఆలయాల పరిరక్షణ మనందరి ప్రధాన కర్తవ్యమని, ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజలందరూ ఇందులో తప్పనిసరి భాగస్వాములు కావాలని సభాధ్యక్షత వహించిన చెప్పెల హరనాథశర్మ నొక్కి వక్కాణించారు. వక్తలందరిని ఘనంగా సత్కరించారు.

జ్యోతిశ్శాస్త్ర ఫలిత విభాగ సదస్సు

భోజన విరామం తర్వాత మధ్యాహ్నం జ్యోతిశ్శాస్త్ర సదస్సులో రెండవదైన ఫలిత విభాగం ప్రారంభమైంది. ఈ సదస్సుకు శ్రీ సాగి కమలాకరశర్మ అధ్యక్షత వహించారు. అనాదిగానున్న జ్యోతిశ్శాస్త్రం నేటికి ముందు కాలానికి మన నిత్యజీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందనడం నిర్వివాదాంశం. ఎన్ని విమర్శలు, అపోహలు వచ్చినా, ఆ సూర్య, చంద్రులున్నంతకాలం జ్యోతిశ్శాస్త్రం వుంటుందని తమ అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు.

మొదటి రోజు - రెండవ సదస్సులో మొదటి అంశంపై శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి ప్రసంగిస్తూ - జాతక ఫల





నిర్ణయంలో ఎంతో అనుభవం వుంటేగాని ఫలితాలు సూచించలేం. మన మహర్షులందించిన అన్ని గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. మిడిమిడి జ్ఞానంతో ఫలితాలు సూచించి ప్రజలను అయోమయ పరిస్థితికి, భయభ్రాంతులకు గురిచేయడం శాస్త్రసమ్మతం గాదని ఖచ్చితంగా చెప్పారు.

ఆధునిక దృక్కోణంలో జ్యోతిషం అనే రెండవ అంశాన్ని ప్రస్తావిస్తూ, దేశ, కాల, పరిస్థితులు మార్పు చెందుతున్న కొద్దీ, శాస్త్రాన్ని చక్కగా సమన్వయం చేసే పండితులు ప్రస్తుత కాలానుగుణంగా ఫలితాలు తెలియజేస్తారు. శాస్త్రం మార్పు చెందదు. కాని మన అవసరాలకోసం సమన్వయం అవసరమని శ్రీ మాడ్గుల శశిభూషణ శర్మ సోమయాజి వివరించారు.

శ్రీమాన్ కొదుమగల్ల వేణుగోపాలచార్య సిద్ధాంతి మూడవ అంశమైన జ్యోతిశ్శాస్త్ర విభాగాలను క్షుణ్ణంగా విశ్లేషించారు. ప్రశ్న, శకున, సాముద్రిక విషయాలను వివరించారు. రామాయణ కాలంనాటి నుండి ఈ ఆధారాలున్నాయని ప్రమాణాలను తెలియజేశారు. ఖచ్చితమైన జన్మ తేది, సమయం లేని వారికైనా, ఉన్న వారికైనా ఈ శాస్త్రాలు తప్పనిసరిగా ఉపయోగ పడతాయన్నారు.

చివరి అంశమైన వాస్తు విజ్ఞాన ప్రయోజనంపై శ్రీ పాలెపు రాజేశ్వరశర్మ తమ ప్రసంగ పత్రంలో వాస్తుశాస్త్ర విజ్ఞానం మనకు అనాదిగా వుంది. స్థలపరీక్ష నుండి నిర్మాణం పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సవివరంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా శ్రీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ విద్వత్సభ కోరిక మేరకు శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ, తప్పకుండా పూర్వపు మెదక్ జిల్లాలో ఒక ఆగమశాస్త్ర శిక్షణ, పరిశోధనలకు గాను ప్రత్యేక స్థలంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సభలోని అందరూ హర్షధ్వానాలు చేశారు.

ధర్మశాస్త్ర సదస్సు

భోజన విరామానంతరం రెండవ రోజు రెండవ సదస్సు

అయిన "ధర్మశాస్త్ర సదస్సు"కు సంస్కృతాంధ్ర పండితులైన శ్రీ దోర్బల ప్రభాకరశర్మ అధ్యక్షత వహించారు.

ఈ సదస్సులోని నాలుగు అంశాలు వరుసగా –

1. "ధర్మాచరణలో దైవజ్ఞుల పాత్ర" అను అంశంపై శ్రీ పురాణం మహేశ్వర శర్మ
2. "ధర్మమార్గ నిర్దేశకులు – పురోహితులు" అంశంపై శ్రీ మదునూరి వేంకట్రామశర్మ
3. "ధర్మ స్థాపనలో ధర్మాచార్యులు" – అంశంపై శ్రీ బాచంపల్లి సంతోషకుమార శాస్త్రి
4. "సంస్కారాల ప్రయోజనం" అంశంపై శ్రీ అప్పాల శ్యాం ప్రణీతశర్మ ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డా॥ ఆర్. అనంతపద్మనాభ రావు పాల్గొన్నారు.

ధర్మాచరణలో దైవజ్ఞుల పాత్ర అనే అంశంపై పురాణం మహేశ్వరశర్మ ప్రసంగిస్తూ ధర్మరక్షణ అంటే ధర్మాచరణమే అవుతుంది. దైవజ్ఞులు ధర్మాచరణలో వుంటే మిగతా వారందరు వారిని అనుసరిస్తారు. అందుకే ధర్మశాస్త్రంలో ఆచారకాండకు మిక్కిలి ప్రాధాన్యతనిచ్చారన్నారు.

మదునూరి వేంకట్రామశర్మ రెండవ అంశమైన 'ధర్మమార్గ నిర్దేశకులు – పురోహితులు' విషయమై ప్రసంగిస్తూ గ్రామంలో పురోహితులే ప్రధాన పాత్ర పోషిస్తారు. వీరి సూచనల మేరకే గ్రామమంతా నడచుకునే సంప్రదాయం మనకు అనాదిగా వస్తుంది. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు.

ధర్మసంస్థాపనలో ధర్మాచార్యుల పాత్ర చాలా విశిష్టమైంది. శ్రీ జగద్గురువుల సంప్రదాయంలో మనకు శృంగేరి పీఠం ప్రధానమైంది వారి ఆదేశానుసారమే మన ప్రాంతాచార ధర్మాలను ఆచరిస్తున్నాం. మనకు ధర్మమే ప్రధానం. ప్రస్తుతకాలంలో ధర్మహాని జరుగకుండా జాగ్రత్తపడుతున్న తరుణంలో ఈ జ్యోతిష మహాసభల్లో ధర్మశాస్త్ర సదస్సు ద్వారా ప్రజలకు ఒక మంచి స్ఫూర్తిదాయకంగా నిలిచే అవకాశం లభించిందని బాచంపల్లి సంతోష్‌కుమార శాస్త్రి ప్రసంగించారు.





చివరి అంశమైన సంస్కారాలు - ప్రయోజనంపై శ్రీ అప్పాల శ్యాంప్రణీతశర్మ ప్రసంగిస్తూ మనకు గల షోడశ సంస్కారాల్లో ప్రధానమైన వానినే మనం ప్రస్తుతం ఆచరిస్తున్నాం. వీటి ప్రయోజనం చాలా వుంది. మన క్షేమం గోరి మన పూర్వీకులు నిర్ణయించిన విధానం మనకు శిరోధార్యమన్నారు.

ధర్మాచరణకు అందరం బద్ధులం కావాల్సిందే. ఎవరెవరి స్థాయిననుసరించి వారు వారు ఆయా ధర్మాలను ఆచరించడానికి సిద్ధపడాలి. ధర్మసందేహాలు నివారణ చేయుడానికి మనవద్ద అనుభవజ్ఞులైన పండితులు సిద్ధంగా వున్నారని దోర్బల ప్రభాకరశర్మ తమ అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు. నిర్వాహకుల సూచన మేరకు కొందరు సభలో నుండి ధర్మ, ఆగమ, జ్యోతిష విషయాలపై ప్రశ్నలు వేయగా, వేదికపై వున్న పెద్దలు తగు సమాధానాలు తెలిపి సంతృప్తిపరచారు. వీరందరినీ తెలంగాణ విద్వత్సభ ఘనంగా సత్కరించింది.

సాయంకాలం 5 గంటలకు జ్యోతిష మహాసభల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు చి॥ గౌరీభట్ల అభిజ్ఞ స్వాగత నృత్యంతో ప్రారంభమైనాయి. తదుపరి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి రూపొందించిన "జ్యోతిరాదిత్యమ్" అను రూపకం ప్రదర్శించారు.

వినూత్న రీతిలో జ్యోతిశ్శాస్త్రాన్ని పండితులకు, పామరులకు సులభంగా అర్థమయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ జ్యోతిశ్శాస్త్రానికి సమన్వయం చేస్తూ, సమాజానికి తెలియజేసే పద్ధతిలో ఒక ప్రత్యేక రూపకాన్ని అద్భుతంగా రూపొందించి, ప్రదర్శించారు. ఇందులో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా హరితహారము, మిషన్ భగీరథ, ఆధునిక విజ్ఞాన పద్ధతిలో విద్యుచ్ఛక్తిని ఆదా చేసే మార్గం, స్మార్ట్ ఫోన్ల వినియోగం, సులభంగా విదేశాలకు వెళ్ళే పద్ధతిలో వీసా విషయాలను పంచభూతాల ద్వారా పౌరోహితుడి నిమిత్తంతో తెలంగాణ రైతు బిడ్డలనుద్దేశించి తెలియజేశారు. సూర్యుడి ద్వారా "బంగారు తెలంగాణ" నుద్దేశించి ఒక అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించారు. ఇందలి పాత్రలు, పాత్రధారులంతా కూడా సిద్ధాంత, జ్యోతిష పండితులు కావడం విశేషం. పాత్రలు - పాత్రధారులు... పురోహితులుగా - శ్రీ ఎ. శ్యామోహన్‌శర్మ, రైతు దంపతులుగా శ్రీ కొమాండూరి రంగానాథాచార్య, స్వాతి దంపతులు, భూమాతగా శ్రీమతి గీతామూర్తి, వరుణుడిగా శ్రీ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి, అగ్నిదేవుడుగా శ్రీ యలమంచి శ్రీధరశర్మ సిద్ధాంతి, వాయుదేవుడిగా శ్రీ బోర్వట్ల విరాట్ స్వరూపాచార్య సిద్ధాంతి, ఆకాశదేవుడిగా శ్రీ వద్దిచర్ల వేంకటరమణశర్మ సిద్ధాంతి, సూర్యునిగా శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ పాత్రలు పోషించారు.



ఇక చివరగా సమాపనోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు శ్రీ కె.వి. రమణాచారి గారికి తొలిరోజు సాయంత్రం ఏకగ్రీవంగా తీర్మానించిన రాబోవు వికారి నామ సంవత్సర పండుగల నిర్ణయాలతో పాటు, తెలంగాణ విద్వత్సభ ఆమోదించిన తొమ్మిది తీర్మానాలను నిర్వాహకులు అందజేశారు. ఈ తీర్మానాలను సావధానంగా పరిశీంచి, రాబోవు సంవత్సరంలో జరుగబోవు రెండు రోజుల తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు 2019 జులై 27, 28గా నిర్ణయించినందులకు సంతోషం తెలియజేశారు.

ప్రత్యేక ఆగమ సలహా మండలిని నియమించే విషయమై ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకొచ్చేందుకు తగు శ్రద్ధ వహిస్తానని తెలిపారు. దేవాదాయ శాఖ ద్వారా రాష్ట్రంలోని దేవాలయాలకు ఆగమ సలహాదారులను నియమించడానికి తగు ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఉద్ధండులైన జ్ఞాన, వయోవృద్ధులు సిద్ధాంతులు, జ్యోతిష పండితులకు మాసవారీ భృతిని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అందించుటకు కృషి చేస్తానన్నారు.రాష్ట్ర రాజధానిలో సిద్ధాంతులకు, పురోహితులకు, అర్చకులకు, పురశ్చరణ తరగతులు నిర్వహించుటకు గాను శాశ్వత వసతి ఏర్పాట్ల నిమిత్తమై బర్కత్‌పురాలోని అర్చక సదనాన్ని ఉపయోగించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మొట్టమొదట ఈ పురశ్చరణ తరగతులను శ్రీవిద్యా సరస్వతీ దేవాలయం, వర్గల్‌లో నిర్వహిస్తున్నందుకు వ్యవస్థాపకులైన శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతిగారిని అభినందించారు. ప్రభుత్వ పక్షాన రాష్ట్రంలో సంస్కృత, వేదశాస్త్ర, జ్యోతిష, ఆగమ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయుటకు తగువిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సనాతన జ్యోతిషశాస్త్రంపై వ్యతిరేకంగా గాని, విమర్శించినాగాని, అవహేళన చేసేవారిని కాలమే వారికి సరియైన సమాధానం అందిస్తుందన్నారు.

జ్యోతిరాదిత్యమ్ అనే రూపకాన్ని అద్భుతంగా రూపకల్పన చేసి, ప్రదర్శింపజేసిన శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారిని సభలో సత్కరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలనుండి విచ్చేసిన ద్వాదశ విద్వన్మూర్తులకు విద్వత్సభ విశిష్ట పురస్కార సత్కారము ముఖ్య అతిథిచే జరిగింది. ముందుగా జ్యోతిష మహాసభలు జరపాలని సంకల్పం చేసిన శ్రీ గాయత్రీ తత్త్వానంద ఋషి, గాయత్రీ పీఠం దంపతులను, శ్రీ దుద్దిళ్ళ మనోహరశర్మ అవధాని, గంగాపురం హరిహరనాథ శర్మ, శ్రీ నల్లగొండ పురుషోత్తమ శర్మ, శ్రీ పాండురంగాచార్యులు, శ్రీ పార్నంది లక్ష్మీనారాయణ శర్మ గారిని, శ్రీ త్రిగుళ్ళ ప్రభాకరశర్మ, శ్రీ యాయవరం రామశర్మ, శ్రీ ఎం. లక్ష్మీనరసింహాచార్య, దోర్బల విశ్వనాథ శాస్త్రి, శాస్త్రుల భార్గవ రామశర్మ, శ్రీమాన్ మురళీ కృష్ణమాచార్యులను ఘనంగా సత్కరించారు.

ఈ ద్వాదశ విద్వన్మూర్తుల విశిష్ట పురస్కార సత్కారంలో మొట్టమొదటి సత్కారాన్ని అందుకోవాల్సిన శ్రీ పాలకుర్తి నృసింహరామశర్మ సిద్ధాంతి గారు ఈ మధ్యనే బ్రహ్మైక్యం చెందినందున వారి స్మృత్యర్థం ఈ జ్యోతిష మహాసభల



ప్రాంగణానికి 'శ్రీపాలకుర్తి నృసింహరామశర్మ సిద్ధాంతి ప్రాంగణం'గా పేర్కొంటూ ఈ జ్యోతిష మహాసభలను వారికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రభుత్వ సంబంధాల అధికారి (పి.ఆర్.ఓ.) శ్రీ వనం జ్వాలా నరసింహారావు, ముఖ్యమంత్రి గురువుగారైన శ్రీ చెప్పెల మృత్యుంజయశర్మ , తెలంగాణ ప్రభ పత్రికా సంపాదకులు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు శ్రీ అష్టకాల రాంమోహన్‌శర్మ, శ్రీ దైవజ్ఞశర్మ, పార్లమెంటు సభ్యులు శ్రీ ఎం. రామచంద్రరావు, శాసనసభ్యులు శ్రీ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ , బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు శ్రీ బోర్పట్ల హనుమంతాచార్య, విద్వత్సభ ఉపాధ్యక్షులైన శ్రీ చెప్పెల హరనాథ శర్మలతో పాటు కార్యనిర్వాహక సభ్యులందరూ పాల్గొన్నారు.

సాయంకాలం, రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సమాప నోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సమాపనోత్సవ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు శ్రీ కె.వి. రమణాచారి, సభా ప్రారంభకులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.కె. జోషి, విశిష్ట అతిథిగా ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా డా।। శ్రీ సముద్రాల వేణుగోపాలాచారి, గౌరవ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు శ్రీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ వనం జ్వాలా నరసింహారావు, గౌరవ శాసన మండలి సభ్యులు శ్రీ పురాణ సతీశ్, గౌరవ శాసనసభ్యులు శ్రీ ఎన్. రామచంద్రరావు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ గార్లు పాల్గొన్నారు.

ఆత్మీయ అతిథులుగా - తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు శ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ గారు, శ్రీ అష్టకాల రాంమోహన్ శర్మ గారు, శ్రీ చకిలం అనిల్‌కుమార్ గారు, శ్రీ జోషి గోపాల శర్మగారు, శ్రీ భద్రకాళి శేషు గారు, శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ గారు, శ్రీమతి సుమలత శర్మ గారు, శ్రీమతి సువర్ణ సులోచన గారు, శ్రీ బోర్పట్ల హన్మంతాచార్య గార్లు పాల్గొన్నారు.

తెలంగాణ విద్వత్సభ పక్షాన అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ, కార్యదర్శి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారు కార్యదర్శి నివేదికతో పాటు శ్రీ వికారి నామ సంవత్సర పండుగల నిర్ణయ జాబితాను, సభల తీర్మానాల ప్రతిని ప్రభుత్వ సలహాదారులైన శ్రీ కె.వి. రమణాచారికి వేదికపై అందరి సమక్షంలో సమర్పించారు. తెలంగాణ విద్వత్సభ పక్షాన కార్యనిర్వాహక వర్గం వారు అతిథులందరినీ, జిల్లా సమన్వయకర్తలను సన్మానించారు. సభల నిర్వహణ కమిటి వారిని అభినందించి, ఆశీస్సులందించారు. తెలంగాణ విద్వత్సభ సమన్వయకర్త శ్రీ కె. భీంసేన్ మూర్తి గారిని అందరూ అభినందించారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవసభ్యులు, తెలంగాణ విద్వత్సభ కోశాధికారి శ్రీ మరుమాముల వెంకటరమణ శర్మ స్వాగతోపన్యాసం చేశారు. ప్రధాన కార్యదర్శి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి వందన సమర్పణతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. ఈ జ్యోతిష మహాసభలకు శ్రీ పాండురంగాశ్రమ నిర్వాహకులైన శ్రీ అప్పాల సత్యనారాయణ శర్మ, శ్రీ భండారు రాంప్రసాదరావు, శ్రీ కొడకండ్ల రాధాకృష్ణశర్మ, శ్రీమతి కల్పవల్లి, శ్రీమతి పద్మ తదితరులు ఇంకా ఎందరో ప్రముఖులు పాల్గొన్నారు.

2018లో రవీంద్రభారతిలో జరిగిన
రెండవ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో
విశిష్ట ప్రతిభా పురస్కారంతో
తెలంగాణ విద్వత్సభ
సమానించిన విద్వాంసులు



శ్రీ పాండురంగాచార్యులు గారు



శ్రీ తిగుళ్ళ ప్రభాకర శర్మ గారు



శ్రీ శాస్త్రుల భార్గవ రామ శర్మ గారు



శ్రీ దోర్బల విశ్వనాథశాస్త్రి గారు

2018లో రవీంద్రభారతిలో జరిగిన
రెండవ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో
విశిష్ట ప్రతిభా పురస్కారంతో
తెలంగాణ విద్వత్సభ
సమ్మానించిన విద్వన్మూర్తులు



శ్రీ పార్నంది లక్ష్మీనారాయణశర్మ గారు



శ్రీ గంగాపురం హరిహరనాథశర్మగారు



శ్రీ నల్గొండ పురుషోత్తమ శర్మ



శ్రీ దుద్దిళ్ల మనోహరశర్మ అవధాని గారు

2018లో రవీంద్రభారతిలో జరిగిన
రెండవ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో
విశిష్ట ప్రతిభా పురస్కారంతో
తెలంగాణ విద్వత్సభ
సమ్మానించిన విద్వన్మూర్తులు



శ్రీ యాయవరం రామశర్మ గారు



శ్రీమాన్ నల్లీగ లక్ష్మీ నరసింహాచార్యులు



శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు గారు



శ్రీ గాయత్రీ తత్త్వానంద ఋషి గారు



శ్రీమాన్ నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు

తెలంగాణ విద్వత్సభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానము

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో భాగంగా ఏర్పడిన 'తెలంగాణ విద్వత్సభ' బ్ర.శ్రీ. యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతిగారి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మాన వివరము.

ఇంతవరకు పండుగల నిర్ణయాల విషయంలో విభేదాలు పరిష్కరించుకోవడంలో ఇబ్బందులేర్పడిన దృష్ట్యా, ప్రస్తుతం అందరం కలిసి తెలంగాణ రాష్ట్రంలో 'తెలంగాణ విద్వత్సభ'ను ఏర్పరుచుకున్నాం. ఇకమీదట పండుగల నిర్ణయాల్లో విభేదాలు రావడానికి అవకాశం లేదనేది సుస్పష్టం. ఇందుకు నిదర్శనం రాబోవు శ్రీవిళంబి నామ సం॥ర పండుగల నిర్ణయం. ఇదేమాదిరిగా భవిష్యత్తు కూడా జరగాలనే ఈ తీర్మానం చేయడమైంది.

సిద్ధాంత సదస్సు ప్రధాన వక్తలు ప్రసంగించిన అంశాలను, మనకు లభించిన వివిధ శాస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి మరియు మా స్వానుభవాన్ని జోడించి ప్రస్తుతం మనం ఆచరిస్తున్న విధానం నూటికి నూరు శాతం సరియైనదని ఋజువైంది. ఇకమీదట ఈ విషయంపై చర్చలు అనవసరం. దృక్‌పద్ధతి, పూర్వపద్ధతి అనే రెండు వేర్వేరు పద్ధతులున్నను ఏ పద్ధతిని దేనికి ఉపయోగించుకోవాలో స్పష్టమైంది. కావున ఇకపై ఈ చర్చకు మనం స్వస్తి పలకాలి.

పూర్వ, దృక్ సమన్వయ పద్ధతిలో పంచాంగ గణనద్వారా నిర్ణయించిన పండుగలు – వ్రతాలను 'సభ' ఆమోదిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహాలు లేవు. అనగా పూర్వపద్ధతి ద్వారా వ్రత, ధర్మాదులను ఆచరించాలి. దృక్ పద్ధతి ద్వారా గ్రహణ, మౌఢ్య, జాతక ఫలితాదులను తెలుసుకోవాలి. ఇంతకు మించి ఇందులో చర్చించాల్సిన అవసరం లేదు.

కేవలం పూర్వపద్ధతినే అన్నింటికి ఉపయోగించే పంచాంగాలు గాని, కేవలం దృక్ పద్ధతిద్వారానే గణింపబడిన పంచాంగాలను గాని 'తెలంగాణ విద్వత్సభ' ఎట్టి పరిస్థితిలో ఆమోదించదని సభాముఖంగా ఏకగ్రీవంగా తీర్మానించడమైనది.

ఇది వ్యక్తిగత ప్రతిభాపాటవాల్ని పెంపొందించుట కొరకుగాని, స్వలాభాపేక్షతో గాని జరిగిన నిర్ణయం కాదు. కేవలం లోకకళ్యాణార్థం, సమాజ శ్రేయస్సుకై, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమం కోసమే తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం. అంతేగాక మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారి సంకల్పం మేరకు బంగారు తెలంగాణ సాకారానికి దోహదమయ్యే విధంగా తీసుకున్న ఒక గొప్ప ఆదర్శాత్మక తీర్మానం ఈ రోజు మన 'తెలంగాణ విద్వత్సభ' ద్వారా జరుగుట దేశానికే గర్వకారణం.

ఈ తీర్మానం పంచాంగకర్తలైన సిద్ధాంతులేగాక, మహాపండితుల సమక్షంలో జరిగినందున అందరం విధిగా ఆచరించవలసిందే. మనందరికి తెలంగాణ విద్వత్సభ నిర్ణయమే శిరోధార్యం.

మన పంచాంగం 'తెలంగాణ విద్వత్సభ' ఆమోదం పొందాల్సిందే. ఇకముందు రాబోవు పంచాంగాల్లో ఈ విషయాన్ని ప్రచురించాలని సభాముఖంగా తెలియజేస్తున్నాం. వ్యక్తిగత నిర్ణయాలకు స్వస్తి పలికి సభా తీర్మానానికి కట్టుబడి వుందాం! సమాజ శ్రేయస్సును కాంక్షిద్దాం!

"సర్వేజనాస్సుఖినోభవన్తు"

2018 సంవత్సరంలో తెలంగాణ విద్వత్సభ తీర్మానాలు



13.08.2018 సోమవారం రోజున తెలంగాణ విద్వతసభ నిర్వహించిన రెండవ తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభల్లో రాష్ట్రంలోని సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష పండితులు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు కలిసి ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మాన వివరములు.

1) ప్రతి సంవత్సరం రెండు రోజులు రవీంద్రభారతి, ప్రధాన మందిరం, భాగ్యనగరం (హైదరా బాద్)లో 'తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు' నిర్వహించుట. అవ కాశాన్నుసరించి, శని, ఆదివారాలకు కలిసే విధంగా సవరించే ప్రయత్నం చేయుటకు నిశ్చయించడమైనది.

రాబోవు శ్రీ వికారి నామ సం॥లో జ్యోతిష మహాసభలు 2019, జులై, 27, 28 తేదీలు, శని, ఆదివారాల్లో జరుపుటకు నిర్ణయించడమైనది.

2) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రత్యేక ఆగమ సలహా మండలిని ఏర్పాటు చేయుటకు సూచించడమైనది.

3) రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో గౌరవ వేతనంతో కూడిన ఒక ఆగమ సలహాదారును నియమించుటకు ప్రభుత్వాన్ని కోరడమైంది.

4) రాష్ట్రంలో ఉద్ధండులైన జ్ఞాన, వయోవృద్ధులైన సిద్ధాంతులకు, జ్యోతిష పండితులకు నగదు రూపంలో మాసవారి భృతిని కల్పించుటకు చర్యలు తీసుకోవాలి.

5) రాష్ట్ర రాజధానియైన భాగ్యనగరం (హైదరాబాద్)లో సిద్ధాంతులకు, అర్చకులకు, పురోహితులకు పురశ్చరణ తరగతులు నిర్వహించుటకుగాను తగిన శాశ్వత వసతి, ఏర్పాట్లను ప్రభుత్వ పక్షాన కల్పించాలని కోరడమైనది.

6) ప్రస్తుతం తాత్కాలిక పురశ్చరణ శిబిరాలను నిర్వహిం చుటకు ప్రయత్నంలో భాగంగా మొట్టమొదట శ్రీ విద్యాసరస్వతీ దేవాలయం, వర్గల్‌లో ఏర్పాట్లు చేయుటకు నిర్ణయించడమైనది. తేదీలు తదుపరి ప్రకటిస్తారు.

7) తెలంగాణ విద్వతసభ ద్వారా నిర్వహించు అర్చక, ఆగమ, పురోహిత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వామోదం కల్పించుటకు అవకాశమివ్వాలి.

8) వేదాంగమైన జ్యోతిశ్శాస్త్రాన్ని అవహేళన చేసిన, వ్యాపారంగా మార్చిన, ప్రోత్సహించిన, సహకరించిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు గైకొనాలని కోరడమైనది.

9) రాష్ట్రంలో జ్యోతిష, ఆగమ, వేద, శాస్త్ర, సంస్కృత, స్మార్త విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పుటకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నిశ్చయించడమైనది.

ఈ సంవత్సరం పై ఎనిమిది తీర్మానాలను తెలంగాణ విద్వత్సభ పక్షాన ప్రభుత్వానికి సమర్పించారు.





తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఇ.ఎల్.నరసింహన్ గారికి
తెలంగాణ విద్వత్సభ పండుగల జాబితా సమర్పణ





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి
2018 సంవత్సర తెలంగాణ విద్వత్సభ ఆహ్వానపత్రిక



పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2019
శ్రీ శార్వరి నామ సంవత్సర పండుగల నిర్ణయం

తెలంగాణ విద్వత్సభ తృతీయ వార్షిక విద్వత్సమ్మేళనం విజయవంతమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష పండితుల కోలాహలంతో నల్లకుంట శృంగేరి శంకరమఠం శోభిల్లింది. జ్యోతిష సిద్ధాంత అంశాలపై విద్వన్మూర్తుల ప్రసంగాలతో కూడిన గోష్ఠి, రాబోయే 'శార్వరి' నామ సంవత్సర పండుగలను సిద్ధాంతులంతా చర్చించి ఏకాభిప్రాయంతో నిర్ణయించడం విద్వత్సమ్మేళనంలో ముఖ్య ఘట్టాలుగా నిలిచాయి.


తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో శ్రీ శృంగేరి శంకరమఠం, నల్లకుంట హైదరాబాద్ వేదికగా ఆగస్టు 18వ తేదీ ఆదివారం రోజున తృతీయ వార్షిక విద్వత్సమ్మేళనం ఘనంగా జరిగింది.

జగద్గురువుల, స్వామీజీల, మహాత్ముల దివ్యాశీస్సులతో లోకకళ్యాణార్థం, ధర్మపరిరక్షణార్థం, సమాజ శ్రేయస్సుకై తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధాంతులు, జ్యోతిష పండితులు, విద్వాంసులందరూ ఒకే వేదికపై దర్శనమిచ్చారు.

రాబోయే శ్రీ శార్వరి నామ సంవత్సర పండుగల నిర్ణయమే ప్రధాన ధ్యేయంగా సభ జరిగింది. గడచిన మూడు సంవత్సరాలుగా పండుగలపై ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయించి ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుంది.

ఆగస్టు 18న ఉదయం తొమ్మిది గంటలకు సభ ప్రారంభమైంది. విద్వదాహితాగ్ని బ్రహ్మశ్రీ మాడుగుల మాణిక్య సోమయాజులుగారు జ్యోతి ప్రకాశనం చేయగా, శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ స్వాగతోపన్యాసం చేశారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా శ్రీ గాయత్రీ తత్త్వానంద ఋషి విచ్చేశారు. శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి సభాధ్యక్షత వహించారు.

ప్రారంభ సభలో ముఖ్య అతిథి ప్రసంగిస్తూ ఈ తెలంగాణ విద్వత్సభ అందరిది. పండితులు, సిద్ధాంతులు,



విద్వాంసులందరూ ఇందులో సభ్యులే. కీర్తికాంక్ష కొరకో, ధనకాంక్ష కొరకో ఏర్పడిన సభ కాదు. కేవలం సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఈ విద్వత్సభ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. దీనికి అందరూ తరతమ భేదం లేకుండా సహకరించాలని కోరారు.

ప్రారంభ సభానంతరం విద్వత్సమ్మేళనంలో ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ వక్తల ప్రసంగాలు జరిగాయి. ప్రస్తుత సమాజంపై జ్యోతిశ్శాస్త్ర ప్రభావం అనే అంశంపై సాగి కమలాకరశర్మ, ధర్మపరిరక్షణలో జ్యోతిష్కుల పాత్ర అను అంశం గూర్చి శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి, పండుగల నిర్ణయాలలో ధర్మశాస్త్రాల ఆవశ్యకత అనే అంశంపై కొదుమగల్ల వేణుగోపాలాచార్య సిద్ధాంతి, పండుగల నిర్ణయాల ఆచరణలో ప్రధాన పాత్రధారులు అనే అంశాన్ని గూర్చి పాలెపు రాజేశ్వర శర్మ ప్రసంగించారు. సమన్వయకర్తగా సభాధ్యక్షులు వ్యవహరించిన తీరు సభికులందరినీ ఆకట్టుకుంది.

మధ్యాహ్న భోజనానంతరం 'విద్వత్సభ' జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన సిద్ధాంతులు, జ్యోతిష పండితులందరినే వేదికపైకి నిర్వాహకులు దివ్యజ్ఞాన సిద్ధాంతి సాదరంగా ఆహ్వానించారు.

విద్వత్సభలో పాల్గొన్న ప్రముఖ సిద్ధాంతులు శ్రీయుతులు ఆకెళ్ల జయకృష్ణ శర్మ, గాడిచెర్ల నాగేశ్వర శర్మ, ఐనవోలు అనంతమల్లయ్య, చికిలి లక్ష్మీవేంకటేశ్వరశాస్త్రి, ఓరుగంటి మనోహరశర్మ, శ్రీరాంభట్ల రాజేశ్వరశర్మ, రామడుగు పాండురంగ శర్మ, ఎదునోజి నర్సింహాచార్య, తూండ్ల కమలాకర శర్మ, కొదుమగల్ల వేణుగోపాలాచార్య, ప్రశాంత్ జోషి, ఎస్.జి.టి. యతీంద్ర ప్రవణాచార్య, బోర్పట్ల గోపాలాచార్య, ఓరుగంటి రామారావు, బోర్పట్ల భాస్కరాచార్య, గౌరీభట్ల రామకృష్ణ శర్మ, మొకరాల లక్ష్మణమూర్తి, గొడవర్తి సంపత్కుమారాచార్య, యాత్ర యోగీశ్వర స్వామి, రాజన్న, బేతోజు సత్యనారాయణాచారి, బోర్పట్ల విరాట్ వేంకటరమణశర్మ, యలమంచి శ్రీధరశర్మ, రంగనాథాచార్య, మదనాచారిలతో పాటు ప్రముఖ స్మార్త పండితులు గంగవరపు నారాయణ శర్మ సమక్షంలో బోర్పట్ల హనుమంతాచార్య సమ న్వయంతో శ్రీ శార్వరి నామ











సంవత్సర పండుగల విష యమై చర్చించి, నిర్ణయిం చారు. వెంటనే నిర్ణయించిన జాబితాను అందరి హర్ష ధ్వానాల మధ్య ప్రకటించారు. ఆ జాబితాను రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు, డా. కె.వి. రమణా చారికి, ముఖ్యమంత్రి ప్రధాన ప్రజాసంబంధాల అధికారి వనం జ్వాలా నరసింహారావుకి తెలంగాణ విద్వత్సభ అందజేసింది.

ఈ కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల అనారోగ్య కారణాలతో రాలేని ప్రముఖ సిద్ధాంతులు శ్రీమాన్ తి.న.చ సంపత్కుమార కృష్ణమాచార్య, గుడి సోమనాథశర్మ, బ్రహ్మభట్ల శ్రీరామశర్మ, బోర్పట్ల రాఘవేంద్రాచార్య, బ్రహ్మభట్ల శ్రీనాథశర్మ, సంగనభట్ల నర్సింహమూర్తి, దేశాయిపేట మహేశ్వరశర్మగార్లు కూడా సభ నిర్ణయాలతో ఏకీభవించినట్లు తెలియజేశారు.

కె. భీంసేన్‌మూర్తి వందన సమర్పణ చేస్తూ ఈ శంకరమఠంలో మనకు తగిన వసతి సౌకర్యాలనందించిన ధర్మాధికారి వై. కృష్ణారావుగారికి, భోజన, ఫలహారాలను అందించిన శ్రీనివాస్, మల్కాజిగిరి గారికి, ఈ ద్రవ్యాన్ని సమర్పించిన గాయత్రీ పీఠం అన్నోజిగూడ వారికి, శాలువాలను బహూకరించిన పాలెపు రాజేశ్వరశర్మగారికి, లైవ్ ప్రసారాన్ని సమాజానికి అందించిన పురుషోత్తం గారికి, సభకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు



పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2020
శ్రీ ప్లవ నామ సంవత్సర పండుగల నిర్ణయం

తెలంగాణ రాష్ట్ర చతుర్థ జ్యోతిష మహాసభలు జూలై 19వ తేదీన సిద్దిపేట జిల్లా వర్గల్ లోని శ్రీ విద్యాసరస్వతీ దేవా లయంలో జరిగాయి. తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో జరి గిన ఈ సభలు ఆరోజున ఉదయం 9 గంటలకు ఆరంభమయ్యాయి. సభకు విచ్చేసిన సిద్ధాంతులు, జ్యోతిష పండి తులు, వేద పండితులు, పురోహితలు అందరూ శ్రీ విద్యాసర స్వతి దేవిని దర్శించుకుని సభామందిరంలోకి ప్రవేశించారు.

ముందుగా జ్యోతి ప్రకాశనం, అనంతరం వేద సదస్సు జరిగింది. దర్శనమ్ సంపాదకులు, విద్వత్సభ కోశాధికారి శ్రీ మరుమాముల వేంకట రమణ శర్మ సభకు ఆహ్వానం పలికారు. సభకు అధ్యక్షత వహించాల్సిందిగా ఆలయ వ్యవస్థాపకులు, తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతిని కోరారు. ప్రధాన కార్యదర్శి శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి, ముఖ్య అతిథి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు శ్రీ బోర్పట్ల హనుమంతాచార్య, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంఘ సేవా సమాఖ్య అధ్యక్షులు శ్రీ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, తెలంగాణ విద్వత్సభ సంయుక్త కార్యదర్శి శ్రీ గాడిచెర్ల నాగేశ్వరశర్మ సిద్ధాంతి వేదికను అలంకరించగా మహాసభలు ప్రారంభమయ్యాయి.

ఇటీవల దివంగతులైన వేదభవన్ వ్యవస్థాపకులు



వేంకట్రామన్ ఘనపాఠి గారు, ప్రఖ్యాత జ్యోతిర్వాస్తు పండితులు ఉమాపతి బాలాంజనేయ శర్మగారు, బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కోట శంకరశర్మగారు, ప్రముఖ పంచాంగకర్త ఎదునోజు నర్సింహాచార్య సిద్ధాంతి గార్లకు సభలో సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

తొలుత చి।। ఉప్పల శ్రీహర్షిణి ప్రార్థనాగీతం ఆలపించింది. యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గారు అధ్యక్షోపన్యాసం చేయగా, దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు కార్యదర్శి నివేదికను సమర్పించారు. తదుపరి వేదికను అలంకరించిన వారు వరుసగా ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్ర విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మగారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన తెలంగాణ విద్వత్సభద్వారా సమాజ శ్రేయస్సుకై రాష్ట్రంలోని సిద్ధాంతులు, జ్యోతిష పండితులందరూ రాబోవు సంవత్సరం పండుగలు-వ్రతాల నిర్ణయాలు ఏకగ్రీవంగా ఆమోదించి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతోందన్నారు. ఈ విషయంలో ఇతర రాష్ట్రాల వారికి విద్వత్సభ ఆదర్శంగా నిలిచిందన్నారు.

అనంతరం విద్వత్సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు మాట్లాడుతూ తెలంగాణ విద్వత్సభ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఏర్పడిందని, దీన్ని కాపాడుకుంటూ అభివృద్ధి పరచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సభలకు సహకరించిన వారందరికీ, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందలు తెలియజేశారు.

ప్రారంభ సభ అనంతరం 'విద్వత్సమ్మేళనం' జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సిద్ధాంతులతో పాటు పంచాంగకర్తలు, పురోహితులు, వేద పండితులు పాల్గొన్నారు. ఇందులో తెలంగాణ విద్వత్సభ ఉపాధ్యక్షులు శ్రీ అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి ప్రసంగించారు.

భోజన విరామానంతరం, సభ తిరిగి ప్రారంభమై

















రాబోవు శ్రీ ప్లవ నామ సంవత్సర పండుగలు వ్రతాల నిర్ణయంపై చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో సమన్వయకర్తంగా బోర్పట్ల హనుమంతాచార్య పాల్గొన్నారు. సిద్ధాంతులు శ్రీయుతులు ఓరుగంటి రామారావు, బోర్పట్ల గోపాలాచార్య, తూండ్ల కమలాకరశర్మ, దేశాయిపేట మహేశ్వరశర్మ, జ్యోషి ప్రశాంత శర్మ, బోర్పట్ల భాస్కరాచార్య, గౌరీభట్ల రామకృష్ణ శర్మ, బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య (సంస్కృత పంచాంగకర్త), వడిగచర్ల వేంకటరమణ శర్మ (హిందీ పంచాంగకర్త), కొమండూరి పార్థసారథాచార్య, కొమండూరి రంగనాథా చార్యులతో పాటు పురోహితులు శ్రీయుతులు దేశపతి అనంతశర్మ, అప్పాల మాధవశర్మ, నరేష్ కులకర్ణి. విశాల నరసింహరామశర్మ, నందగిరి శ్యామోహన్ శర్మ, చేర్వెల శశిధరశర్మ, నాగరాజశర్మ, త్రిగుళ్ళ శ్రీనివాసశర్మ, మొకిరాల చైతన్యశర్మ, మరుమాముల శ్రీరామ సిద్ధార్థ శర్మ పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దాచేపల్లి వేంకట కృష్ణ, ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి రఘుపవన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహాసభల సమాపనోత్సవంలో భాగంగా కీ.శే. బోర్పట్ల శేషాచార్య సిద్ధాంతిగారి స్మారక పురస్కారాన్ని వారి పుత్రులు హన్మంతాచార్యగారు శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారికి అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రముఖ శాక్తేయాగమ పండితులు, సిద్ధాంతి కీ.శే. పాలకుర్తి నృసింహరామశర్మగారి స్మారక పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మగారు విద్వత్సభఅధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గారికి అందజేసి ఘనంగా సత్కరించారు ఆహుతులైన అతిథులందరినీ విద్వత్సభ ఘనంగా సత్కరించింది. చివరగా దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తాపత్రిక సంపాదకులు, విద్వత్సభకోశాధికారి శ్రీ మరుమాముల వేంకట రమణశర్మ వందన సమర్పణతో మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి.

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2021
శ్రీ శుభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయం

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం జరుగుతున్న తెలంగాణ విద్వత్సభ వార్షికోత్సవాలు ఈ సంవత్సరం కొవిడ్ నిబంధనల దృష్ట్యా భాగ్యనగర పరిసర ప్రాంతంలోని శ్రీరామభద్ర క్షేత్రం, తూంకుంటలో వైభవంగా జరిగాయి. ఆగస్టు 7వ తేదీ శనివారం నాడు తెలంగాణ విద్వత్సభ పంచమ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందంచే భక్తి సంగీత కార్యక్రమం జరిగింది. పది గంటలకు పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ శంకరభారతీ స్వామివారిచే జ్యోతి ప్రకాశనంతో సభా కార్యక్రమం ఆరంభమయింది. మరుమాముల వేంకటరమణ శర్మ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

ఈ విద్వత్సమ్మేళన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వామివారితో పాటు, సభాధ్యక్షులుగా విద్వత్సభ ఉపాధ్యక్షులు తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, విశిష్ట అతిథులుగా పురాణం మహేశ్వరశర్మ, శాస్త్రుల వేంకటేశ్వర శర్మ, దోర్బల ప్రభాకరశర్మ, శంకరమంచి రామకృష్ణ శర్మ సిద్ధాంతి, సాగి కమలాకర శర్మ, గౌరీభట్ల సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు. దివ్యజ్ఞాన సిద్ధాంతి కార్యదర్శి నివేదిక సమర్పించిన అనంతరం అతిథుల ప్రసంగించారు. తర్వాత శ్రీ స్వామివారు అనుగ్రహభాషణం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధాంతులు, జ్యోతిష పండితులు, శాస్త్ర పండితులు, పౌరాణికులు, సంస్కృత పండితులు, వేద పండితులు, అర్చకులు, స్థానాచార్యులు, పురోహితులు అంతా ఒకే వేదిక ద్వారా రాబోయే శ్రీ శుభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయాలను ఏకీకృతం చేసి, ప్రభుత్వానికి సమర్పించి ప్రజలందరికీ ఇబ్బంది లేకుండా చేయడం చాలా ముదావహమైన విషయం. ఇది మన రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమన్నారు. ఈ సంప్రదాయాన్ని పొరుగు రాష్ట్రాల వారు అనుసరించడం సంతోషాన్ని కలిగించింది. ఇలాగే ముమ్ముందు 'తెలంగాణ



విద్వత్సభ' అద్భుతంగా కొనసాగాలని, ఇందులో పాల్గొన్న వారందరికీ, నిర్వహించువారందరికీ నారాయణస్మరణ పూర్వక ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని శ్రీ స్వామివారు తమ అనుగ్రహ భాషణంలో పేర్కొన్నారు.

భోజన విరామానంతరం తిరిగి 2.30 గం.లకు రాబోయే శ్రీ శుభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయానికి గాను, సిద్ధాంతులు, పండితుల సమావేశం ప్రారంభమైంది. ఈ సభకు ముఖ్య అతిథిగా బోర్వట్ల హన్మంతాచార్యులు, అధ్యక్షులుగా తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, విశిష్ట అతిథిగా అష్టకాల రామ్మోహన్ శర్మ, బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రే విచ్చేశారు.

ఇందులో విద్వత్సభ గౌరవ సలహాదారులైన ఆకెళ్ల జయకృష్ణ శర్మ సిద్ధాంతి, ఓరుగంటి మనోహరశర్మ సిద్ధాంతి, చికిలి లక్ష్మీవేంకటేశ్వర శర్మ సిద్ధాంతి, గాడిచెర్ల నాగేశ్వర శర్మ సిద్ధాంతి, బివియస్ సిద్ధాంతి, చివుకుల శేషాచల శర్మ సిద్ధాంతి, డా. శేషభట్టర్ లక్ష్మణమూర్తి సిద్ధాంతి, శాస్త్రుల కృష్ణమూర్తి శర్మ సిద్ధాంతి, రామడుగు పాండురంగశర్మ సిద్ధాంతి, రాంభట్ల రాజేశ్వర శర్మ సిద్ధాంతి, కాసుల రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి, ఓరుగంటి రామారావు సిద్ధాంతి, బ్రహ్మభట్ల శ్రీనాథశర్మ సిద్ధాంతి, తూండ్ల కమలాకర శర్మ సిద్ధాంతి, ఎస్టిజి యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి, ఓరుగంటి నాగరాజశర్మ సిద్ధాంతి, జ్యోషి ప్రశాంత్ సిద్ధాంతి, బోర్వట్ల భాస్కరాచార్య సిద్ధాంతి, పడిగచర్ల వేంకటరమణ శర్మ సిద్ధాంతి, బోర్వట్ల విరాట్ స్వరూపాచార్య సిద్ధాంతి, గౌరీభట్ల రామకృష్ణ శర్మ సిద్ధాంతి, శంకరమంచి శివ శర్మ సిద్ధాంతి, కొమాండూరి పార్థసారథి అయ్యంగార్ సిద్ధాంతి, కొమాండూరి రంగనాథాచార్య సిద్ధాంతి, రథం మదనాచార్య సిద్ధాంతి, తి.న.చ లక్ష్మీనారాయణ పార్థసారథి, అనంతాచార్య సిద్ధాంతి పాల్గొన్నారు.

వీరితో పాటు పరిసర ప్రాంత, వివిధ దేవాలయాల నుంచి దేవదాయ శాఖ నుంచి డిప్యుటేషన్పై వచ్చిన వేదపండితులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ప్రధాన పురోహితులు భాస్కర శర్మ, ఋగ్వేద పండితులు శ్రీ పెద్దమ్మ దేవాలయం –జూబ్లీహిల్స్: విష్ణుభట్ల మాధవ ఘనపాఠి: జొన్నాభట్ల శేషశర్మ, వీరాంజనేయ స్వామి దేవాలయం:











శంకరమంచి భార్గవ అవధాని: రాచర్ల చంద్రకాంత ఘనపాఠి, శ్రీ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం-కర్మన్ ఘాట్: నందిభట్ల ఆంజనేయశర్మ, శ్రీ కనకదుర్గ ఆలయం-అమీర్‌పేట్, మార్తి సత్యనారాయణ శర్మ, వేదమూర్తుల బలరామశర్మ, తటాకం నాగ సాయినాథ్ శర్మ, కీసర శ్రీ రామలింగేశ్వర దేవస్థానం : రాజగోపాలాచార్యులు, శ్రీ గణపతి దేవాలయం- సికింద్రాబాద్:

యనమండ్ర కృష్ణప్రసాదశర్మ; పి. సాయినాథాచార్యులు; గిరీశ్ కులకర్ణి, శ్రీ వేంకటేశ్వరాలయం-చిక్కడపల్లి: దోర్బల కాశీనాథశర్మ, బాలానగర్, ఆదరాసుపల్లి చంద్రశేఖర శర్మ. హైదరాబాద్: తిగుళ్ళ శ్రీనివాసశర్మ, దేశపతి అనంతకుమార్ శర్మ, ఆదరాసుపల్లి శివరామకృష్ణ శర్మ పాల్గొన్నారు.

దైవికంగా ఈ సభకు కంచి కామకోటి పీఠం ధర్మాధికారి చల్లా విశ్వనాథ శాస్త్రి విచ్చేసి, ప్రసంగించారు. సాయంత్రం 5 గంటల వరకు పండుగలన్నిటిపై సమగ్రంగా చర్చలు జరిపి ఏకాభిప్రాయ సాధనకు వచ్చి తీర్మానం చేశారు. విచ్చేసిన అతిథులకు, సిద్ధాంతులకు, పండితులందరినీ తెలంగాణ విద్వత్సభ ఘనంగా సత్కరించింది. సమన్వయకర్తగా కె. భీంసేన్ మూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అవధాన పంచానన, శతావధాని గౌరీభట్ల మెట్రోమ శర్మ అవధానిచే అష్టావధానం జరిగింది. ముఖ్య అతిథిగా అయాచితం నటేశ్వరశర్మ, అధ్యక్షులుగా మరుమాముల దత్తాత్రేయ శర్మ, పృచ్ఛకులుగా బోర్పట్ల హనుమంతాచారి, డా. సంగనభట్ల నరసయ్య, విష్ణుదత్తు, రంగి సత్యనారాయణ శర్మ, బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య సిద్ధాంతి, గౌరీభట్ల సత్యనారాయణ శర్మ, పండరి రాధాకృష్ణ, కొమాండూరి రంగనాథాచార్య సిద్ధాంతి, నెమలికొండ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక ఆకర్షణగా దేశపతి శ్రీనివాస్ శర్మ వాయిద్య సహకారం అందించారు.

సమాపనోత్సవ కార్యక్రమంలో అందరినీ సత్కరించారు. చివరగా పండరి సంతోష్ వందన సమర్పణ చేశారు. ఈ ఆలయంలో ఈ సంవత్సరం విద్వత్సభ ఏర్పాటు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2023
శ్రీ శుభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయం

తెలంగాణ విద్వత్సభ షష్ఠ (ఆరవ) వార్షిక విద్వత్సమ్మేళనం శ్రీ విద్యా సరస్వతీ క్షేత్రం వర్గల్ లో ఘనంగా జరిగింది. జులై 23 శనివారం రోజున ప్రారంభమై, జులై 24 ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రముఖ సిద్ధాంతులు పంచాంగకర్తలు, జ్యోతిష పండితులు, వేద, శాస్త్ర పండితులు పాల్గొన్నారు. ఈ రెండు రోజుల సభల్లో జ్యోతిశ్శాస్త్ర అంశాలపై పండితుల ప్రసంగాలు, అష్టావధానం, రాబోయే శోభకృత్ నామ సంవత్సర పండగల నిర్ణయం, విద్వట్గోష్ఠి జరిగాయి.

ఇటీవలి కాలంలో బ్రహ్మైక్యమైన శ్రీశ్రీశ్రీ బ్రహ్మానంద తీర్థ స్వామి (పూర్వాశ్రమంలో మాడుగుల మాణిక్య సోమయాజులు) వేదికగా ప్రకటించారు. అలాగే ఈ మధ్య పరమపదించిన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్రశేఖర శాస్త్రి, యాయవరం దయాకరశర్మ సిద్ధాంతి, శాస్త్రుల భార్గవ రామశర్మలకు సభశ్రద్ధాంజలి ఘటిస్తూ, రెండు నిమిషాలు మౌనం పాటించింది

మొదటి రోజు ఉదయం శ్రీ విద్యాసరస్వతి అమ్మవారి దర్శనం చేసికొని, స్థానిక వేద పాఠశాల విద్యార్థుల వేద ఘోషతో సభ ప్రారంభమైంది. తెలంగాణ విద్వత్సభ కోశాధికారి మరుమాముల వేంకటరమణ శర్మ స్వాగతోపన్యాసం చేసారు. విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సంస్కృత విద్వాంసులు శాస్త్రుల వేంకటేశ్వర శర్మ, ప్రత్యేక ఆహ్వానితులుగా జగద్గురు శ్రీ శృంగేరి ఆస్థాన జ్యోతిష పండితులు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి పాల్గొన్నారు.

ముందుగా వేద స్వస్తితో పాటు జ్యోతి ప్రకాశనంతో సభా కార్యక్రమం మొదలైంది. అధ్యక్షోపన్యాసం తరువాత దివ్యజ్ఞాన సిద్ధాంతి కార్యదర్శి నివేదికను సమర్పించారు. అనంతరం , జ్యోతిష పండితులు శ్రీమతి సంధ్యాలక్ష్మి, 'జ్యోతిష శాస్త్రం నేటి కాల పరిస్థితులు' అంశంపై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యదర్శి, విద్వత్సభసహాయ కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి మాట్లాడుతూ విద్వత్సభ రాష్ట్రంలోని








పండితులందరికీ సమాన ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. మన రాష్ట్రంలోని విద్వత్సభ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ముఖ్య అతిథి సందేశంలో పేర్కొన్నారు.

మధ్యాహ్నం రెండవ విభాగ సభ ప్రారంభం అయింది. ఈ సభకు విద్వత్సభ సలహాదారులైన ఆకెళ్ళ జయకృష్ణ శర్మ సిద్ధాంతి అధ్యక్షత వహించగా, బోర్పట్ల హనుమంతాచార్య సమన్వయ కర్తగా ఉన్నారు. ఈ సభలో ఓరుగంటి మనోహర శర్మ సిద్ధాంతి, శాస్త్రుల కృష్ణమూర్తి సిద్ధాంతి, బోర్పట్ల భాస్కరాచార్య సిద్ధాంతి, తూండ్ల కమలాకర శర్మ సిద్ధాంతి, ఓరుగంటి నాగరాజ శర్మ సిద్ధాంతి, బ్రహ్మోభట్ల శ్రీనాథ శర్మ, సిద్ధాంతి, జ్యోషి ప్రశాంత శర్మ సిద్ధాంతి, మొకిరాల లక్ష్మణ శర్మ సిద్ధాంతి, లక్ష్మీ గణపతి శర్మ సిద్ధాంతి, గౌరీభట్ల రామకృష్ణ శర్మ సిద్ధాంతి, యాయవరం రాజశేఖర శర్మ సిద్ధాంతి, మధుసూదన చారి సిద్ధాంతి. ఇంకా వేద శాస్త్ర పండితులు, పురోహితులు పాల్గొన్నారు. రాబోవు శ్రీ శోభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయాలను చాలా లోతుగా చర్చలు చేసారు. సుమారు 4 గంటల పాటు జరిగిన ఈ సభలో అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. భీంసేన్ మూర్తి వందన సమర్పణ చేసారు.

సాయంత్రం చిరంజీవి సాహిత్ (ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి) అష్టావధానం సాహితీప్రియులను రంజింపజేసింది. ముఖ్య అతిథిగా అయాచితం నటేశ్వర శర్మ, ప్రత్యేక ఆహ్వానితులుగా శతావధాని గౌరీభట్ల మెట్రామ శర్మ పాల్గొన్నారు. ఈ సభకు మరుమాముల దత్తాత్రేయ శర్మ అధ్యక్షత వహించారు.

27వ తేదీ ఆదివారం ఉదయం శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, వారి పుత్రులు శివ శర్మ సిద్ధాంతి, శిష్యులు వరప్రసాద్ శర్మతో కలిసి శ్రీ సూర్య సిద్ధాంత పారాయణం చేసారు. సరిగ్గా 10 గంటలకు సమాపనోత్సవ సభ ప్రారంభం అయింది.

ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ సంస్కృత పండితులు దోర్బల ప్రభాకర శర్మ, ప్రత్యేక ఆహ్వానితులుగా శ్రీ శృంగేరి ఆస్థాన పౌరాణికులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి విచ్చేసారు. వేదస్వస్తితో జ్యోతి ప్రకాశనం అనంతరం అతిథుల ప్రసంగాలలో విద్వత్సభ కృషిని కొనియాడారు.



సభాధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి విద్వత్సభ ఏకీకృతం చేసిన శ్రీ శోభకృత్ పండుగల నిర్ణయ జాబితాను సభలో అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

పౌరోహితుల పక్షాన మరుమాముల రామచంద్రమూర్తి మాట్లాడుతూ విద్వత్సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. వర్గల్ వేదపాఠశాల వేదపండితులు ఆశీస్సులు అందించారు. వర్గల్ దేవాలయ కమిటీ వర్కింగ్ చైర్మన్ దాచేపల్లి వేంకటకృష్ణ వందన సమర్పణ చేస్తూ, ప్రతి



సంవత్సరం విద్వత్సభ వార్షికోత్సవాలు ఈ క్షేత్రంలోనే జరపాలని కోరారు.

ఈ రోజు నుండి మూడు రోజుల పాటు కాకినాడలో కంచి కర విజయేంద్ర సరస్వతి స్వామి వారి పంచాంగ వార్షిక సదస్సు వారి ఆహ్వానం న పక్షాన పండుగల జాబితా సమర్పించుటయ, ధర్మాదాయ శాఖామాత్యులు అల్లోల్ల భుత్వ సలహాదారులు, బ్రాహ్మణ సంక్షేమ రమణాచారికి తెలంగాణ విద్వత్సభ పక్షాన సమర్పించగా వారు ఎంతో ఆనందాన్ని ంచారు. తాము ప్రభుత్వం తరపున తగు గౌరవనీయులైన మాన్యశ్రీ ముఖ్యమంత్రి డతామని హామీ ఇచ్చారు.

పండగల నిర్ణయం జాబితా సమర్పణ

కృత్ నామ సంవత్సర పండగల జాబితాను దక్షిణామయ శృంగేరి శారదాపీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారికి కంచి కామకోటి పీఠాధిశ్వరులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారికి విద్వత్ సభ ప్రతినిధివర్గం అందజేసి వారి ఆశీరనుగ్రహం పొందింది.

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2023
శ్రీ శుభకృత్ నామ సంవత్సర పండుగల నిర్ణయం

సిద్ధిపేట జిల్లా వర్గల్‌లోని శ్రీ విద్యానరస్వతీ శనైశ్చరాలయంలోని కంచికామకోటి పీఠం శంకర మఠంలో తెలంగాణ విద్వత్సభ సప్తమ వార్షిక విద్వత్ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో సిద్ధాంతులు, పంచాంగకర్తలతో పాటు జ్యోతిష, వేద శాస్త్ర పండితులు, పురోహితులు, అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే శ్రీ క్రోధి నామ సంవత్సర పండగలను సిద్ధాంతులు ధర్మ శాస్త్ర పరంగా చర్చించి ఏకగ్రీవంగా నిర్ణయించారు. జూలై 15, 16 తేదీల్లో ఈ విద్వత్సమ్మేళనం జరిగింది.

15వ తేదీ శనివారం ఉదయం జరిగిన ఆరంభ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లాపరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రకాశనంతో సమ్మేళనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు దేశంలో ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణ సంక్షేమం కోసం చేస్తున్న అనేక కార్యక్రమాలు ఎంతో హరినాథ శర్మ, గాడిచెర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి, గుడి సోమనాథ ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఇలాంటి సమాజ శ్రేయస్సుకై జరిపే విద్వత్సభ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి సంవత్సరం ప్రత్యక్షంగా ప్రభుత్వం ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోని పండితులందరి సంపూర్ణ సహకారంతో ఈ విద్వత్సభ గత ఏడు సంవత్సరాల నుంచి ప్రజలకు, ప్రభుత్వానికి ఒక వారధి లాగా కృషి చేస్తుందని సభాధ్యక్షులు, వర్గల్ దేవాలయ వ్యవస్థాపకులు, విద్వత్సభఅధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అన్నారు..

ఈ సభలో సీనియర్ నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ, వేద శాస్త్ర పండితులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, సంతానం మల్లికార్జున స్వామి దేవాలయం వ్యవస్థాపకులు చెప్పెల హరినాథ శర్మ సిద్ధాంతి. విద్వత్సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, జోషి జరిపే విద్వత్సభ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి ప్రశాంత శర్మ సిద్ధాంతి, తూండ్ల కమలాకర శర్మ సిద్ధాంతి, త్రిగుళ్ల శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో పాల్గొన్న వారందరికీ విద్వత్సభ కోశాధికారి మరుమాముల వేంకటరమణ శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

అంతకుముందు ఉదయం 8 గంటలకు బాసర వేదపండితులు పార్శంది శివకుమార శర్మ, వర్గల్



విద్యాసరస్వతి వేదపాఠశాల ఆచార్యులు శనగల నాగరాజ శర్మ, వేద విద్యార్థుల వేద స్వస్తితో ప్రారంభమైంది. గంటి నరేశ్ శర్మ శంఖనాదం తర్వాత కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, దేశపతి శ్రీనివాస శర్మ బృందంతో నామ సంకీర్తన కార్యక్రమం అద్భుతంగా జరిగింది.

క్రోధినామ సంవత్సర పండుగల నిర్ణయ సభ

మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ క్రోధి నామ సంవత్సర పండగల నిర్ణయ సభ ప్రారంభమైంది. విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి సమన్వయకర్తగా వ్యవహరిస్తూ, రాబోవు శ్రీ క్రోధి నామ సంవత్సర పండుగల నిర్ణయం గూర్చి సమగ్రంగా చర్చించి ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ సభలో గాడిచర్ల నాగేశ్వరరావు, చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి, గుడి సోమనాథ శర్మ, ఓరుగంటి మనోహర శర్మ, శాస్త్రుల కృష్ణమూర్తి శర్మ, తూండ్ల కమలాకర శర్మ, బోర్పట్ల భాస్కరాచార్య, బ్రహ్మభట్ల శ్రీనాథశర్మ, ఓరుగంటి రామారావు, జోషి ప్రశాంత శర్మ, యతీంద్ర ప్రవణాచార్య, రాంభట్ల రాజేశ్వర శర్మ, కొమ్మెర దత్తమూర్తి, బొర్రా వెంకటేశ్వర శర్మ, నరేశ్ కులకర్ణి, గౌరీభట్ల రామకృష్ణ శర్మ, ఐనవోలు రాధాకృష్ణ శర్మ, చింతమల్లు రవి శర్మ యాత్రా యోగేశ్వర, యాయవరం రాజశేఖర శర్మ మొదలైన సిద్ధాంతుల గాక శ్రీ యాదాద్రి దేవస్థాన ప్రధాన అర్చకులు నల్లంథిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, ప్రధాన పురోహితులు గౌరీభట్ల సత్యనారాయణ శర్మతో పాటు మిగతా దేవాలయ ప్రధాన అర్చకులు, పురోహితులు, వేదపండితులు, స్థానాచార్యులు, రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన పురోహితులు, అర్చకులు పాల్గొన్నారు. మరుమాముల వేంకటరమణ శర్మ అందరినీ సభకు పరిచయం చేయగా, దివ్యజ్ఞాన సిద్ధాంతి వందన సమర్పణ చేశారు.

రాత్రి 7 గంటల నుండి చిరంజీవి యెర్రంశెట్టి ఉమా మహేశ్వరరావుచే అష్టావధానం జరిగింది. సభాధ్యక్షులుగా శాస్త్రుల వేంకటేశ్వర శర్మ ముఖ్య అతిథిగా డా. జి.యం. రామశర్మ, విశిష్ట అతిథిగా చెప్పెల హరనాథ శర్మ, సంయోజకులుగా యం. దత్తాత్రేయ శర్మ, పృచ్ఛకులుగా



డా. జి. రఘురామ శర్మ- నిషిద్ధాక్షరి, గీతా వ్యాఖ్యానం- కె.వియన్ ఆచార్య, ఎ. రాజశేఖర్ శర్మ- అప్రస్తుత ప్రసంగం. కె. పవన్ శర్మ- న్యస్తాక్షరి, కె. హరిణి- వర్ణన, జి సత్యనారాయణ శర్మ-సమస్య, నరసింహాచార్య- ఆశువు, దత్తపది- ఆర్. విశ్వేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవాది రాజశేఖర్ శర్మ రచించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పద్య గ్రంథం ఆవిష్కరించారు. అందరినీ విద్వత్సభ పక్షాన అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఘనంగా సత్కరించారు.

సిద్ధాంతులు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, శంకరమంచి శివశర్మ, జ్యోషి ప్రశాంత శర్మల శ్రీ సూర్య సిద్ధాంత పారాయణంతో రెండవ రోజు 16 తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు సభ ప్రారంభమైంది. 9 గంటలకు శ్రీ విద్యా సరస్వతీ క్షేత్ర వేద పాఠశాల ఆచార్య, విద్యార్థులచే వేదపఠనం జరిగింది. తదుపరి శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి, పాలెపు రాజేశ్వర శర్మ, శ్రీమతి కల్పవల్లిలచే జ్యోతిష ప్రధానమైన అంశాలపై ప్రవచనం దీశీ?.

11 గంటలకు సమాపనోత్సవ సభా కార్యక్రమం

ప్రారంభమైంది. సభాధ్యక్షులుగా యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా సంబంధాల అధికారి జ్వాలా నరసింహారావు, విశిష్ట అతిథులుగా పురాణం మహేశ్వర శర్మ, చెప్పెల హరనాథ శర్మ, డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి, శ్రీ యాదాద్రి దేవస్థాన ప్రధానార్చకులు నల్లంథిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, సీనియర్ పాత్రికేయులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముందుగా మరుమాముల వెంకట రమణ శర్మ స్వాగతం పలుకగా, రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి విద్వత్సభకు పూర్తి సహకారం అందిస్తోందని సభాధ్యక్షుల తొలి పలుకులలో అన్నారు. ప్రస్తుత అత్యంత ఆధునిక నెట్ కాలంలో ఈ విద్వత్సభ ఇంత ఘనంగా సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తోందని ముఖ్య అతిథిగా విచ్చేసిన జ్వాలా నరసింహారావు కొనియాడారు. తరువాత సుమారు 50 మంది సిద్ధాంతులచే వంద మంది పాల్గొన్న సభలో



ఏకోన్ముఖమై నిర్ణయించిన శ్రీ క్రోధి నామ సంవత్సర పండుగల జాబితాను విద్వత్సభఅధ్యక్షులు అందరి కరతాళధ్వనుల మధ్య ముఖ్య అతిథికి అందజేశారు. అతిథులందరినీ విద్వత్సభ ఘనంగా సత్కరించింది. దివ్యజ్ఞాన సిద్ధాంతి వందన సమర్పణతో, శాంతి మంత్రాలతో కార్యక్రమం ముగిసింది.

ఈ సభలో ప్రతి సంవత్సరం ఆషాఢ బహుళంలో విద్వత్సభవిద్వత్సమ్మేళనం జరుగుతుందని, వచ్చే సంవత్సరం శ్రీ యాదాద్రి ప్రధానార్చకుల కోరిక మేరకు శ్రీ యాదాద్రిలో అష్టమ వార్షికోత్సవ విద్వత్సమ్మేళనం జరుగుతుందని తీర్మానం చేసారు.

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2024
శ్రీ క్రోధి నామ సంవత్సర పండుగల నిర్ణయం

వేదాంగమైన జ్యోతిషశాస్త్రం, పంచాంగ గణనం సిద్ధాంత భాగంలో నిష్ణాతులైన విద్వన్మూర్తుల వేదిక తెలంగాణ విద్వత్సభ అష్టమ వార్షిక విద్వత్సమ్మేళనం యాదగిరిగుట్టలో హయగ్రీవ మఠంలో ఘనంగా జరిగింది. జూలై 27, 28 తేదీలలో జరిగిన ఈ సమ్మేళనంలో జ్యోతిష ఫలితాంశాలు, సిద్ధాంత భాగం, పండగల నిర్ణయంపై విద్వద్గోష్ఠి జరిగింది. రాబోయే 'విశ్వావసు' నామ సంవత్సర పండగల నిర్ణయాన్ని దాదాపు వంద మంది సిద్ధాంతులు ధర్మశాస్త్రాల ప్రమాణంగా చర్చించి, నిర్ణయించారు. ఈ పండగల జాబితాను జగద్గురువులు, ధర్మాచార్యులకు సమర్పించి వారి ఆశీరనుగ్రహాలు పొందడంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి సహా ప్రభుత్వ పెద్దలకు అందించి ప్రభుత్వ ఆమోదం పొందేలా కార్యాచరణ గావించారు.

తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో, దేవదాయ, ధర్మదాయ శాఖ సహకారంతో, ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా, అష్టమ వార్షికోత్సవ విద్వత్సమ్మేళనం, రాబోయే శ్రీ విశ్వావసు నామ సంవత్సర పండుగల నిర్ణయ కార్యక్రమం శ్రీ హయగ్రీవ గాయత్రీ ఆశ్రమం, శ్రీ లక్ష్మీ నృసింహ వేద విద్యాలయం, యాదగిరిగుట్టలో తేదీ 27, 28 జూలై శని, ఆదివారాలలో కీ.శే. ఐనవోలు అనంతమల్లయ్య గారి సృత్యర్థం, వారి పేరుతో గల వేదికపై వైభవంగా జరిగాయి.

మొదటి రోజు 27 జూలై శనివారం ఉదయం 8 గంటలకు ఐనవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి, శ్రీ లక్ష్మీ నరసింహ వేద విద్యాలయ విద్యార్థులచే వేద పారాయణంతో మొదలైంది. తర్వాత కొడకండ్ల రాధాకృష్ణ శర్మ బృందంచే సంకీర్తన కార్యక్రమం తన్మయత్వంతో జరిగింది. 10 గంటల నుండి సభా కార్యక్రమం ప్రారంభమైంది. మరుమాముల వేంకట రమణ శర్మ స్వాగతోపన్యాసం చేసారు. జ్యోతి ప్రకాశన అనంతరం తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి సభకు అధ్యక్షత వహించారు. యాదగిరిగుట్ట దేవస్థాన చైర్మన్, ధర్మకర్త, బి. నరసింహమూర్తి గారు ముఖ్య అతిథిగా విచ్చేసారు. శ్రీ హయగ్రీవ గాయత్రి సన్నిధి వ్యవస్థాపకులు, యాదగిరిగుట్ట ప్రధానార్చకులు, ఈ సంవత్సరం విద్వత్సమ్మేళన కార్యక్రమానికి ఆతిథ్యాన్ని అందించిన నల్లందిగల్ నరసింహాచార్యులు, ప్రధాన పురోహితులు గౌరీభట్ల సత్యనారాయణ శర్మ, ప్రత్యేక ఆహ్వానితులుగా, విద్వత్సభ గౌరవ ప్రధాన కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, విద్వత్సభ సంయుక్త కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ ప్రధాన కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి సభను ఉద్దేశించి ప్రసంగించారు.



విపంచి సంగీత సంస్థ, సిద్ధిపేట వ్యవస్థాపకులు మరుమాముల శశిధర శర్మ కుటుంబంచే సంగీత విభావరి అందరినీ ఆనందంలో ఓలలాడించింది.

మధ్యాహ్నం భోజనానంతరం 2 గంటల నుండి రాబోయే శ్రీ విశ్వావసు నామ సంవత్సర పండుగల నిర్ణయానికి విద్వత్ గోష్టి కార్యక్రమం ప్రారంభమైంది. యాయవరం చంద్రశేఖర శర్మ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన వందమంది ప్రముఖ సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష పండితులు, శాస్త్ర పండితులు, రాష్ట్ర దేవదాయ శాఖ ఆదేశాలతో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ప్రధాన అర్చకులు, ప్రధాన పురోహితులు, స్థానాచార్యులు, వేదపండితులు, రాష్ట్రంలోని నలుమూలల నుండి పురోహితులు, అర్చకులు అందరూ పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో ప్రతి పండుగ, వ్రతం గూర్చి క్షుణ్ణంగా చర్చించి నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో విద్వత్సభ గౌరవ సలహాదారులు ఆకెళ్ల జయకృష్ణ శర్మ సిద్ధాంతి, విద్వత్సభ ఉపాధ్యక్షులు, యాదగిరిగుట్ట దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి, శ్రీమాన్ తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, విద్వత్సభ గౌరవ సభ్యులు చికిలి లక్ష్మి వేంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి, శ్రీరాంభట్ల రాజేశ్వర శర్మ సిద్ధాంతి, శాస్త్రుల కృష్ణమూర్తి శర్మ సిద్ధాంతి, కొమ్మెర దత్తుమూర్తి సిద్ధాంతి, ముద్దు రాజన్న సిద్ధాంతి, సంగెనభట్ల నరసింహమూర్తి సిద్ధాంతి, తూండ్ల కమలాకర శర్మ సిద్ధాంతి, గౌరీభట్ల రామకృష్ణ శర్మ సిద్ధాంతి, జ్యోషి ప్రశాంత శర్మ సిద్ధాంతి, బోర్పట్ల భాస్కరాచార్య సిద్ధాంతి మొదలైన ప్రముఖులతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

సమాపనోత్సవ కార్యక్రమం 28 వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి విద్వత్సభ సిద్ధాంతులచే శ్రీ సూర్య సిద్ధాంత పారాయణం జరిగింది, 9 గంటల నుండి స్థానిక వీరప్రతాపమారుతి భక్త బృందం వారిచే భజన కార్యక్రమ అనంతరం సభా కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గారు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎ. భాస్కర్ రావు గారు విచ్చేసారు. మరుమాముల వేంకటరమణ శర్మ



గారి స్వాగతోపన్యాసంతో సభ మొదలైంది. సూర్య సిద్ధాంత ప్రాశస్త్యంపై, పండుగల ధర్మ శాస్త్ర నిర్ణయాల గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. ముందురోజు జరిగిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పండుగల నిర్ణయాలను విద్వత్సభ అధ్యక్షులు సభాముఖంగా వినిపించి, దేవదాయ కమిషనర్ సూచన ప్రకారం నిర్ణయ జాబితాను దేవస్థాన కార్యనిర్వహణాధికారికి అందరి హర్షధ్వానాల మధ్య అందజేసారు.

విద్వత్సభ ఉపాధ్యక్షులు తి.న.చ. సం. కృష్ణమాచార్య సిద్ధాంతి, ప్రధాన కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, శృంగేరి ఆస్థాన పండితులు, ప్రముఖ పౌరాణికులు బాచంపల్లి సంతోష్ కుమార శాస్త్రి, యాదగిరిగుట్ట దేవస్థాన చైర్మన్ బి. నరసింహా మూర్తి, భద్రకాళీ దేవస్థానం వరంగల్ ధర్మకర్త శేషు శర్మ, వేదపండితులు శ్రీనివాస శర్మ, దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారి దోర్బల భాస్కర శర్మ పాల్గొన్నారు. తూండ్ల కమలాకర శర్మ ధర్మ శాస్త్ర విషయాలను వివరంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రముఖులకు విద్వత్సభ గౌరవ సత్కారాలు అందజేసింది.

ధార్మిక ప్రముఖులు శ్రీ పాండురంగాశ్రమ నిర్వహకులు అప్పాల సత్యనారాయణశర్మ, సిద్ధాంత ప్రముఖులు ఓరుగంటి మనోహర శర్మ సిద్ధాంతి, ఆధ్యాత్మిక ప్రముఖులు, శ్రీ హయగ్రీవ గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు, దేవస్థాన ప్రధాన అర్చకులు నల్లందిగల్ నరసింహాచార్యులును ఘనంగా సత్కరించారు. ప్రత్యేకంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారి నృత్య ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. విచ్చేసిన వారందరికీ మరుమాముల నటరాజశర్మ ప్రత్యేక ధన్యవాదాలు అందజేసారు. త్రిగుళ్ల శ్రీనివాశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్వత్సభ నిర్ణయాల జాబితా ప్రముఖులకు అందజేత

ప్రతి సంవత్సరం సభలు పూర్తి అయిన వెంటనే ప్రభుత్వానికి, పీఠాధిపతులకు, స్వాములకు, ప్రముఖులకు పండుగల నిర్ణయ జాబితాను అందించుట జరుగుతుంది. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా తెలంగాణ విద్వత్సభ అష్టమ వార్షికోత్సవ విద్వత్సమ్మేళనం, యాదగిరిగుట్టలో జరిగిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర 2025-26 పండుగల నిర్ణయ జాబితాను జూలై 29 వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర దేవదాయ శాఖామాత్యులు కొండా సురేఖకి, దేవదాయ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శైలజా అయ్యర్‌కి, దేవదాయ కమిషనర్ యం. హన్మంతరావుకి విద్వత్సభ పక్షాన అందజేయడమైంది.

విద్వత్సభ కృషి తెలంగాణ రాష్ట్రానికి ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభినందిస్తూ, ఇందుకు తప్పకుండా ప్రభుత్వ సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. వెంటనే తగుచర్య గైకొనాలని దేవదాయ శాఖా మంత్రి అధికారులను ఆదేశించారు.

శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల సదస్సులో పాల్గొని, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారికి తెలంగాణ విద్వత్సభ పక్షాన మరుమాముల వేంకటరమణ శర్మ సారథ్యంలో వెళ్ళిన బృందం పండుగల నిర్ణయ జాబితాను సభక్తి పూర్వకంగా సమర్పించారు. స్వామి వారు సంతసించి త్వరలో ఉభయ తెలుగు రాష్ట్రాల సిద్ధాంతులతో ఒక ప్రత్యేక సభ ఈ పీఠంలో ఏర్పాటు చేయాలని తమ అనుగ్రహ భాషణంలో తెలిపారు.

రంగంపేటలోని శ్రీ గురుమదనానంద శారదా క్షేత్ర పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారికి విద్వత్సభ పక్షాన పండుగల నిర్ణయ జాబితాను సభక్తి పూర్వకంగా సమర్పించడమైంది. ఇందులో నిర్ణయించిన పండుగలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆచరించుటకు తగు ప్రణాళిక చేయాలని వారి అనుగ్రహ భాషణంలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో శ్రద్ధగా సభలు నిర్వహిస్తున్నందులకు అభినందిస్తూ, ఆశీస్సులు అందించారు.

బేగంపేటలోని పుష్పగిరి జగద్గురు మహా సంస్థానం పీఠాధి పతి శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యా శంకర భారతీ స్వామి వారికి తెలంగాణ విద్వత్సభ పక్షాన పండుగల నిర్ణయ జాబితాను సభక్తి పూర్వకంగా సమర్పంచి, ఆశీస్సులు అందుకోవడం జరిగింది. గతంలో ఒకసారి ఈ పీఠంలో సిద్ధాంతుల సభ జరిగింది. అయినా అవకాశం ఉన్నప్పుడు ప్రత్యేకంగా ఒక సభ ఏర్పాటు చేయుటకు అంగీకరిస్తూ, ప్రజలందరు ధర్మ శాస్త్ర నిర్ణయాలను ఖచ్చితంగా ఆచరించాలని అనుగ్రహభాషణం చేసారు. ఇం దులో తెలంగాణ విద్వత్సభ సమన్వయకర్త శ్రీ కె. భీంసేన్ మూర్తి పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి విద్వత్సభ నిర్ణయాలను అందచేస్తున్న సందర్భం



తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండాసురేఖ గారికి విద్వత్సభ నిర్ణయాలను అందచేస్తున్న బృందం

పండితుల, సిద్ధాంతుల విద్వద్గోష్ఠి - 2025

శ్రీ పరాభవ నామ సంవత్సర పండుగల నిర్ణయం

జ్యోతిష్య, ధర్మ శాస్త్రాలపై విద్వద్గోష్ఠి... పండుగల నిర్ణయంపై విద్వత్సమ్మేళనం... సూర్యసిద్ధాంత పారాయణం... భజన సంకీర్తనం... వెరసి తెలంగాణ విద్వత్సభ నవమ విద్వత్సమ్మేళనం ఇటీవల ఘనంగా జరిగింది. బేగంపేటలోని జగద్గురు ఆదిశంకరాచార్య పుష్పగిరి మహా సంస్థానంలో జూలై 13 ఆదివారం రోజున ఉద్దండులైన వేద, శాస్త్ర, జ్యోతిష, ఆగమ పండితులు, సిద్ధాంతులు, పంచాంగకర్తలు, పురోహితులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరాగా, పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి సమక్షంలో కోలాహలంగా జరిగింది. దాదాపు మూడున్నర గంటలకు పైగా సాగిన సిద్ధాంతుల సమ్మేళనంలో రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పండుగల నిర్ణయాన్ని వేద, ధర్మ శాస్త్రాల ప్రమాణాలకు అనుగుణంగా సమన్వయంతో చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు.

వచ్చే సంవత్సరం పండులన్నింటిలో విశేషంగా విజయదశమి నిర్ణయమై లోతైన చర్చ జరిపి, ధర్మ శాస్త్ర పరిశీలన గావించారు. చివరకు శ్రీ స్వామివారు తమ అనుగ్రహ భాషణంలో అత్యధిక సిద్ధాంతుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన ధర్మశాస్త్ర ప్రమాణాలను ఉటంకిస్తూ 20వ తేదీ మంగళవారమే శమీపూజ, అపరాజిత పూజ జరుపుకోవాలని అన్నారు.

ఈ సంవత్సరం ప్రముఖ సిద్ధాంతులు, జ్యోతిష శాస్త్ర పండితులు గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి, డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి సిద్ధాంతి లకు విశిష్ట సత్కారాలను స్వామి వారి సమక్షంలో విద్వత్సభ నిర్వాహకులు అందించారు.

ఉదయం 6 గంటలకు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి బృందంచే శ్రీ సూర్య సిద్ధాంత పారాయణంతో విద్వత్సమ్మేళనం ప్రారంభమైంది. 9 గంటల నుంచి శ్రీమతి శారదా రసజ్ఞ బృందం ఆలపించిన భక్తి సంగీతం అందరినీ అలరించింది. 11 గంటలకు సభ ప్రారంభమైంది. శ్రీ పుష్పగిరి మహా సంస్థాన పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ



అభినవోద్దండ విద్యా శంకర భారతీ స్వామి వారు జ్యోతి ప్రకాశనం సభను లాంఛనంగా ప్రారంభించారు. వేద పఠనం, శంఖనాదం, ప్రార్థనా గీతం అనంతరం మరుమాముల వేంకటరమణ శర్మ, తెలంగాణ వైతాళికులు, వేద విద్వన్మణి కీ. శే. శ్రీ శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి వేదికపై విద్వద్గోష్టి సభకు స్వాగతం పలికారు. ఈ సభకు తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి అధ్యక్షత వహించగా, శాస్త్రుల వేంకటేశ్వర శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సభలో నాలుగు ప్రధాన అంశాలపై వక్తలు ప్రసంగించారు. శాస్త్రీయ జ్యోతిషంపై సాగి కమలాకర శర్మ, వర్ధమాన సిద్ధాంతులు-ఆచరించే నియమాలు అంశంపై కృష్ణమాచార్య సిద్ధాంతి, వర్ధమాన జ్యోతిషులు-శాస్త్ర సలహాలు అనే అంశంపై మహావాది సంధ్యాలక్ష్మి, పండుగల నిర్ణయం-శాస్త్ర ప్రమాణాల అంశంపై తూండ్ల కమలాకర శర్మ సిద్ధాంతి ప్రసంగించారు.

భోజనానంతరం మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీ పరాభవ నామ సంవత్సర పండుగల నిర్ణయం గూర్చి విద్వత్సమ్మేళనం జరిగింది. ఈ సభలో రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన వంద మంది సిద్ధాంతులు, వేద, శాస్త్ర పండితులు, అర్చకులు, పురోహితులందరూ పాల్గొన్నారు. ఈ సభలో పుష్పగిరి ఆస్థాన సిద్ధాంతి ఓరుగంటి మనోహర శర్మ పరిశీలకులుగా, విద్వత్సభ ప్రధాన కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి సమన్వయ కర్తగా ఉన్నారు. విశిష్ట అతిథులుగా మాజీ మంత్రివర్యులు శ్రీ సముద్రాల వేణుగోపాలాచార్యులు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్తు ఉపాధ్యక్షులు, ముఖ్యమంత్రి పూర్వ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి వనం జ్వాలా నరసింహారావు, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర బ్రాహ్మణ సంఘ సేవా సమాఖ్య అధ్యక్షులు మోత్కూరి రాము, మాజీ అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన శర్మ, శలాక రాజశేఖర శర్మ, మరుమాముల రామచంద్ర మూర్తి, తిగుళ్ళ శ్రీనివాస శర్మ, దేశపతి అనంత శర్మ, పీఠం ఆస్థాన సిద్ధాంతులు బ్రహ్మపట్ల శ్రీనాథ శర్మ, ఓరుగంటి మనోహర్ శర్మ, ఓరుగంటి నాగరాజ శర్మ తదితరులు పాల్గొన్నారు. కె. భీంసేన్ మూర్తి వందన సమర్పణ చేసారు.



తెలంగాణ విద్వత్సభ ప్రాంతీయ విద్వత్సమ్మేళనం

ప్రాంతీయ విద్వత్సమ్మేళనం

తెలంగాణ విద్వత్సభ ప్రతి సంవత్సరం పండుగల నిర్ణయం గూర్చి వార్షిక విద్వత్సమ్మేళనం నిర్వహిస్తూ, అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రాంతాల వారీగా పురోహితులు, సిద్ధాంతులు,జ్యోతిష పండితులను సమన్వయ పరచుటకు ప్రాంతీయ విద్వత్సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించుట జరిగింది.

మొదటి ప్రాంతీయ విద్వత్సమ్మేళనం



ప్రప్రథమంగా శ్రీ శ్వేతార్క గణపతి దేవాలయం కాజీపేట, వరంగల్ లో విద్వత్సభ ఉపాధ్యక్షులు కీ.శే. బ్ర.శ్రీ అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో 2018 మే నెలలో దిగ్విజయంగా జరిగింది.

రెండవ ప్రాంతీయ విద్వత్సమ్మేళనం

2019 అక్టోబర్ లో రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ సన్నిధి బాసరలో విద్వత్సభ సహాయ కార్యదర్శి బ్ర. శ్రీ. గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అనేకమంది పురోహితులు, అర్చకుల సమక్షంలో జరిగింది.





మూడవ ప్రాంతీయ విద్వత్సమ్మేళనం

రెండవ ప్రాంతీయ విద్వత్సమ్మేళనం 2019 ఏప్రిల్‌లో జ్యోతిర్మయ మహా పీఠం, మేడిపల్లి, హైదరాబాదులో శ్రీ సిద్ధకుంజికా మహాకాల శాంతి యాగంలో భాగంగా విద్వత్సభ కార్యదర్శి బ్ర. శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ వేదికపైనే విద్వత్సభ ఉపాధ్యక్షులు బ్ర.శ్రీ. సాగి కమలాకర శర్మ గారి ద్వారా వాతావరణ పంచాంగం ఆవిష్కరించుట జరిగింది.



తెలంగాణ విద్వత్సభ ఆవిష్కరణలు

రాబోవు 12 సంవత్సరాల (పుష్కర) పంచాంగం





విద్వత్సభ ప్రధాన కార్యదర్శి బ్ర. శ్రీ. దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి ప్రియ శిష్యులు, చిక్కడపల్లి హైదరాబాదు వాస్తవ్యులు శ్రీమాన్ టి. యస్. జి. యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి గారిచే రూపొందించిన రాబోవు పన్నెండు సంవత్సరాల పుష్కర పంచాంగం నవంబర్ 2022 లో ఆవిష్కరణ జరిగింది.

90 సంవత్సరాల పంచాంగం

తెలంగాణ రాష్ట్రములోని ప్రముఖ పంచాంగ కర్త, సుప్రసిద్ధ జ్యోతిష పండితులు కీ. శే. బ్ర. శ్రీ. గాడిచర్ల నారాయణ సిద్ధాంతి గారి పుత్రులు విద్వత్సభ సహాయ కార్యదర్శి బ్ర. శ్రీ. గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి గారు రూపొందించిన 90 సంవత్సరాల పంచాంగం 17 మార్చి



2020 తేదీన రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ప్రధాన సమావేశ మందిరంలో నాటి దేవదాయ శాఖా మంత్రి వర్యులచే ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ సిద్ధాంతులు, జ్యోతిష పండితులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సంస్కృత, హిందీ, ఆంగ్లంలో పంచాంగ ఆవిష్కరణ

లోక కళ్యాణార్థం ప్రస్తుత కాలానుగుణంగా సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఇతర భాషలలో పంచాగాలను అందించాలని శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి ప్రియ శిష్యులు వరుసగా శ్రీ బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య సిద్ధాంతి, బడంగ్ పేట్, హైదరాబాద్ గారు రూపొందించిన సంస్కృత పంచాగాన్ని పౌరాణిక సార్వ భౌమ బ్ర. శ్రీ. మాల్లాది చంద్రశేఖర శాస్త్రి గారిచే ఆవిష్క రించబడింది.

శ్రీ యలమంచి శ్రీధర్ శర్మ సిద్ధాంతి, రాంపల్లి, హైదరాబాదు గారు రూపొందించిన ఆంగ్ల పంచాంగం ప్రభుత్వ సలహాదారులు శ్రీమాన్ కె. వి. రమణాచారి గారిచే ఆవిష్కరణ జరిగింది.

శ్రీ వడిగచర్ల వేంకటరమణ శర్మ సిద్ధాంతి అంబర్ పేట్, హైదరాబాద్ గారిచే రూపొందించిన హిందీ పంచాంగాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. కె. జ్యోషి గారు ఆవిష్కరించారు.



హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషలలో ప్రచురించిన పంచాంగాలను ఆవిష్కరిస్తున్న పండితులు, ప్రముఖులు



2006 సం॥లో అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు తెలంగాణ తొలితరం సిద్ధాంతి మరుమాముల శ్రీరామ సిద్ధాంతి శతజయంతి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



'దర్శనమ్' ప్రచురించిన జ్యోతిర్మయ పంచాంగాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు



తెలంగాణ విద్వత్సభ ఏర్పాటైన తరువాత జరిగిన తొలికార్యవర్గ సమావేశంలో పాల్గొన్న సిద్ధాంతులు



తెలంగాణ సిద్ధాంతుల సమ్మేళనం ఓ అపురూప దృశ్యం



'దర్శనమ్' నిర్వహించిన అవధాన సప్తకం కార్యక్రమాల పరంపరలో
దివ్యజ్ఞాన సిద్ధాంతి గారి జ్యోతిష అవధానం



తెలంగాణ జ్యోతిష మహాసభలో వరిష్ఠ సిద్ధాంతుల సమాలోచన



ఉడిపి పెజావర మఠాధిపతి శ్రీశ్రీశ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వాముల వారికి
విద్వత్సభ నిర్ణయాలను అందచేస్తున్న సందర్భం



2007లో రవీంద్రభారతిలో 'దర్శనమ్' నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణం, విద్వద్గోష్ఠి


శ్రీగురుమదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు, పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి దివ్యాశీస్సులతో...
శ్రీగాయత్రీ పీఠం, అన్నోజిగూడ, హైదరాబాద్
జ్యోతిర్మయ మహా పీఠం, మేడిపల్లి (ఉప్పల్), హైదరాబాద్
దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక సంయుక్త నిర్వహణలో
తెలంగాణరాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ సౌజన్యంతో...
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు
9.9.2017 శనివారం లలిత కళాతోరణం
10.9.2017 ఆదివారం రవీంద్ర భారతి
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహా సభలు-2017
జ్యోతిషామయం భవతు
ఓం
ఆస్తిక మహాశయులందరికీ సాదర స్వాగతం
పూర్తివివరములకు
గాయత్రీతత్వానంద ఋషి
శ్రీ గాయత్రీ పీఠం
9866183369
దివ్యజ్ఞాన సిద్ధాంతి
జ్యోతిర్మయ మహా పీఠం
9849567669
యం.వెంకటరమణశర్మ
దర్శనమ్, సంపాదకులు
9441015469

తెలంగాణరాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ సౌజన్యంతో...

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు

శ్రీగురుమదనానంద సరస్వతీ పీఠాధీశ్వరులు, పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ మోహనానంద సరస్వత స్వామి వారి దివ్యాశీస్సులతో...

వేదానికంతటికీ ధర్మం మూలమైతే, ధర్మాచరణకు కాలం మూలమైంది. కాలనిర్ణయ సాధనకు 'జ్యోతిశ్శాస్త్రం' ఆధారమైంది. వేదాంగాల్లో ప్రధానమైన జ్యోతిశ్శాస్త్రం వేదానికి నేత్ర స్థానమైంది. జ్యోతిస్స్వరూపులైన సూర్యాది గ్రహాల ఆధారంగా కాలగణనమే గాక ఫల సూచనలను తెలుపుతుంది. కాలగణను సిద్ధాంతమని, ఫల సూచనలను జాతకమని జ్యోతిశ్శాస్త్రం ప్రధానంగా రెండు భాగాలుగా వుంది. సంక్షిప్త జ్యోతిశ్శాస్త్ర స్వరూపమే మనం నిత్యం ఉపయోగించే పంచాంగం. పంచాంగం ఆధారంగానే మనం సకల కర్మలను ధర్మబద్ధంగా ఆచరించగలుగుతున్నాం. శ్రీ లగధ మహర్షితో ప్రారంభమైన వేదాంగ జ్యోతిషానికి అనేకమంది ఋషులు ప్రవర్తకులైనారు. మన పూర్వీకుల వల్ల మనకు లభించిన జ్యోతిశ్శాస్త్రం అత్యద్భుతమైంది. వారికి మనమెంతో ఋణపడియున్నాం.

ధర్మాచరణమే లక్ష్యంగా లభించిన జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానాన్ని కాలానుగుణ సమన్వయంతో సమాజశ్రేయస్సుకై అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. తెలంగాణరాష్ట్రంలో ప్రముఖ సిద్ధాంతులు, అనుభవజ్ఞులైన జ్యోతిష పండితులెందరో ఉన్నారు. కొందరు లబ్ధప్రతిష్ఠులై కీర్తిశేషులైనారు. మరికొందరు సమాజానికి పరిచయం లేకుండానే ఎనలేని కృషిచేస్తున్నారు. కీర్తిశేషులైన వారికి సంస్మరణలు తెలియజేయుట ఎంత అవసరమో, విశేష సేవలందిస్తూ సమాజ శ్రేయస్సు కోరే వారిని సత్కరించుట కూడా అంతే అవసరంగా భావించి "తెలంగాణరాష్ట్ర ప్రథమ జ్యోతిష మహాసభలు" ఏర్పాటు చేయాలనే సంకల్పం కలిగింది.

కార్యక్రమ స్వరూపం - రెండు రోజుల కార్యక్రమంలో సిద్ధాంత సదస్సు ఒకరోజు, జాతకసదస్సు రెండవరోజు. మొదటిరోజున ప్రారంభోత్సవంతోపాటు ఉదయం, సాయంకాలం రెండుపూటల సమావేశాలుంటాయి. సాయంత్రం 'జ్యోతిషరూపకం' సాంస్కృతిక కార్యక్రమం.

రెండవరోజు రెండు పూటల సమావేశాల అనంతరం ముగింపు సభా కార్యక్రమం, పురస్కార ప్రదానోత్సవం, సన్మాన కార్యక్రమాలు.

తేది - 9.9.2017, శనివారం, వేదిక - లలితకళాతోరణం, సిద్ధాంత సదస్సు

తేది - 10.9.2017, ఆదివారం, వేదిక - రవీంద్రభారతి, జాతక సదస్సు

పై అంశాలలో నిష్ణాతులై ఆసక్తికలవారు సమగ్ర వ్యాసాలను ముందుగా పంపగలరు. ఎంపిక చేయబడిన వ్యాసాలను మహాసభల ప్రత్యేక సంచికలో ప్రచురించబడును.

పూర్తివివరములకు

గాయత్రీతత్త్వానంద ఋషి	దివ్యజ్ఞాన సిద్ధాంతి	యం.వెంకటరమణశర్మ
శ్రీ గాయత్రీ పీఠం	జ్యోతిర్మయ మహా పీఠం	దర్శనమ్, సంపాదకులు
9866183369	9849567669	9441015469


ఓం
శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి,
శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి,
శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి,
శ్రీశ్రీశ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామి వారల
దివ్యాశీస్సులతో...
శ్రీగాయత్రీ పీఠం (అన్నోజిగూడ), జ్యోతిర్మయ మహా పీఠం, (మేడిపల్లి),
దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక సంయుక్త నిర్వహణలో
తెలంగాణరాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ మరియు
తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సౌజన్యంతో...
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు
తేది: 9.9.2017
శనివారం
వేదిక
లలితకళాతోరణం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి
హైదరాబాద్
ఆహ్వానమ్
తేది: 10.9.2017
ఆదివారం
వేదిక
రవీంద్రభారతి
ప్రధాన మందిరం
హైదరాబాద్
తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహా సభలు-2017
జ్యోతిషామయనం చక్షుః
ఓం
విద్యానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్
ఆస్తిక మహాశయులందరికీ సాదర స్వాగతం

సభా కార్యక్రమం

తేది: 10.9.2017, ఆదివారం, వేదిక: రవీంద్రభారతి ప్రధాన మందిరం సా॥ 6 గంటలకు

శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారు

శ్రీగురుమదనానంద సరస్వతీ పీఠం, తొగుట వారి దివ్యాశీస్సులతో...

ముఖ్యఅతిథి **డా॥ శ్రీ కె.వి.రమణాచారి** I.A.S, Rtd **గారు**

ప్రభుత్వసలహాదారు, తెలంగాణ రాష్ట్రం, అధ్యక్షులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

సభాధ్యక్షులు **శ్రీ పి.వి. మనోహర్ రావు గారు** వ్యవస్థాపకులు, సర్వార్థ సంక్షేమ సమితి

సభాప్రారంభకులు **శ్రీ మామిడి హరికృష్ణ గారు** సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ

గౌరవ అతిథులు

శ్రీ కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు గారు రాజ్యసభ సభ్యులు, గౌరవసభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

డా॥శ్రీసముద్రాలవేణుగోపాలాచారిగారు ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి, గౌరవసభ్యులు,తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ పురాణం సతీష్ గారు శాసనమండలిసభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గౌరవ సభ్యులు

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు ఉపాధ్యక్షులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ సి.ఎల్.రాజం గారు కోశాధికారి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ సుద్దాల సుధాకర్‌తేజ గారు వాస్తు సలహాదారు, తెలంగాణ ప్రభుత్వం

శ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ అష్టకాల రామ్మోహన్ శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ చకిలం అనిల్‌కుమార్ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ బోషి గోపాలశర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ భద్రకాళి శేషు గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీమతి సుమలత శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీమతి సువర్ణ సులోచన గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

ఆత్మీయ అతిథులు

శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రి గారు విఖ్యాత పాత్రికేయులు

శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారు వ్యవస్థాపకులు, శ్రీ విద్యా సరస్వతీ క్షేత్రం, వర్గల్

శ్రీ దైవజ్ఞ శర్మ గారు సంఖ్యాశాస్త్ర నిపుణులు

శ్రీ చెప్పెల హరనాథ శర్మ గారు తెలుగు అధ్యాపకులు, డిగ్రీ కళాశాల, సిద్దిపేట

శ్రీ శాస్త్రుల రఘురామ శర్మ గారు విశ్రాంత అధ్యాపకులు, చారిత్రక పరిశోధకులు

శ్రీ నరేంద్ర కాప్రే గారు అధ్యక్షులు, శ్రౌతసంవర్ధనీ సభ

శ్రీ వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ గారు, శ్రీ గంగు భానుమూర్తి గారు, శ్రీ చిలకమర్రి లక్ష్మీనాధాచార్యులు గారు, శ్రీమతి గీతామూర్తి గారు, శ్రీ గంగు ఉపేంద్ర శర్మ గారు, శ్రీ బండారు రాంప్రసాద్‌రావు గారు, శ్రీ గట్టు శ్రీనివాసాచార్యులు గారు, శ్రీ సుధాకర శర్మ గారు, శ్రీ రాహుల్ దేశ్‌పాండే గారు, శ్రీ కోటంరాజు సీతారాం ఘనాపాఠి గారు, శ్రీ గిరిప్రసాద్‌శర్మ గారు, శ్రీ మల్లాది చంద్రమౌళి శర్మ గారు, శ్రీ అవధానుల ప్రసాద్ శర్మ గారు, శ్రీ కోనేటి శ్రీనివాస్ గారు, శ్రీ గోగులపాటి కృష్ణమోహన్ గారు, శ్రీ బొంగులూరి రామ్మూర్తిశర్మ గారు, శ్రీఆదరాసుపల్లి శ్యామ్‌మోహన్‌శర్మ గారు, శ్రీ మహంకాళి కృష్ణమూర్తిశర్మ గారు, శ్రీ మహదేవభట్ల లక్ష్మణప్రసాద్ శర్మ గారు, శ్రీ ఉప్పల బాలసుబ్రహ్మణ్య శర్మ గారు మరియు వివిధ బ్రాహ్మణ సంఘాలు మరియు ధార్మిక సంస్థల సహకారంతో...

ఆహ్వానించువారు

గాయత్రీతత్త్వానంద ఋషి	దివ్యజ్ఞాన సిద్ధాంతి	యం.వెంకటరమణశర్మ
శ్రీ గాయత్రీ పీఠం	జ్యోతిర్మయ మహా పీఠం	దర్శనమ్, సంపాదకులు
9866183369	9849567669	9441015469

సమన్వయకర్తలు

గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, మరుమాముల నటరాజశర్మ, వేలేటి కార్తీక్ శర్మ, చెరువు వేంకట ఆదిత్యశర్మ, కె. భంసేన్‌మూర్తి, ఆర్.మల్లిఖార్జునశర్మ, శ్రీమతి సత్యసుధ, త్రిగుళ్ళ సనాతనసారథి, అల్లాడి ఆనందశర్మ

ఓం

జగద్గురువులు, స్వామీజీలు, మహాత్ముల దివ్యాశీస్సులతో!

తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో...

(రిజిస్టర్డ్ నెం. 160/2018)

తెలంగాణరాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ, పర్యాటకశాఖలు,
తెలంగాణరాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ మరియు
తెలంగాణరాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సంయుక్త సహకారంతో...

తెలంగాణరాష్ట్ర జ్యోతిషీ మహాసభలు - 2018

జ్యోతిష, ఆగమ, ధర్మశాస్త్ర సదస్సులు

ఆహ్వానము

ధర్మార్థ సిద్ధ్యర్థం జ్యోతిశ్శాస్త్రమనుత్తమమ్
తెలంగాణ విద్వత్సభ
పండితాః సమదర్శినః

తేది: 13.8.2018 సోమవారము మరియు
తేది: 14.8.2018 మంగళవారము (2 రోజులు)
ఉ॥ 9 గం.ల నుండి రా॥ 9 గం.ల వరకు

వేదిక
రవీంద్రభారతి ప్రధానమందిరము
భాగ్యనగరము (హైదరాబాద్)

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష మహాసభలు - 2018

రవీంద్రభారతి ప్రధానమందిరము-భాగ్యనగరము (హైదరాబాద్)

ప్రారంభోత్సవం

13.8.2018 సోమవారం (మొదటిరోజు)

ఉ.9 గం. - శ్రీ పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు
శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకరభారతీ స్వామి వారి
కరకమలములచే **జ్యోతిప్రకాశనం**

ముఖ్యఅతిథులు - **శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి గారు,** రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖామాత్యులు
శ్రీ జి. జగదీశ్వర్ రెడ్డి గారు, రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
సభాధ్యక్షులు - **శ్రీ సముద్రాల వేణుగోపాలాచారి గారు,** కేంద్ర మాజీమంత్రివర్యులు, ఢిల్లీలో తెలంగాణరాష్ట్ర ప్రతినిధి
విశిష్ట అతిథి - **శ్రీ ఎన్. శివశంకర్** IAS **గారు,** రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి, ఆర్థిక, రెవెన్యూ (దేవదాయ) శాఖలు
గౌరవ అతిథులు - **శ్రీ నరేంద్రకాప్రే గారు,** అధ్యక్షులు, శ్రౌతసంవర్ధినీసభ, సంస్కృతభారతీ
శ్రీ చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు గారు, విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు
శ్రీ డా॥ జ్ఞానేశ్వర్ గారు, జ్యోతిషపండితులు
స్వామివారిచే **"జ్యోతిశ్శాస్త్ర వైభవమ్"** ఆవిష్కరణ
(తెలంగాణరాష్ట్ర జ్యోతిష మహాసభలు-2017 విశిష్టసంచిక)
తొలిప్రతి స్వీకర్త **శ్రీ గాయత్రీతత్త్వానందబుషి గారు,** శ్రీ గాయత్రీపీఠం వ్యవస్థాపకులు

ఉ.10 గం.ల నుండి మ.1 గం.ల వరకు

1. జ్యోతిశ్శాస్త్రసదస్సు (పంచాంగ విభాగం)

సభాధ్యక్షులు - **శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతిగారు**

మ.2 గం.ల నుండి సా. 5 గం.ల వరకు

2. జ్యోతిశ్శాస్త్రసదస్సు (ఫలిత విభాగం)

సభాధ్యక్షులు - **శ్రీ సాగికమలాకరశర్మ గారు**

సా.5.30 గం. నుండి 6.30 గం. వరకు

యువసిద్ధాంతుల సమ్మేళనం

సా.6.30 గం. నుండి 8.30 గం. వరకు

తెలంగాణరాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య సహకారంతో

రాబోవు శ్రీవికారి నామ సం॥ర పండుగల నిర్ణయాలపై

విద్వత్సమ్మేళనం

ముఖ్యఅతిథులు - **శ్రీ నాయిని నర్సింహారెడ్డి గారు,** రాష్ట్ర హోంశాఖామాత్యులు
సభాధ్యక్షులు - **శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారు,** వర్గల్ సరస్వతీదేవాలయ వ్యవస్థాపకులు
సమన్వయకర్త - **శ్రీ బోర్వట్ల హనుమంతాచార్య గారు,** తెలంగాణరాష్ట్రబ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు
గౌరవఅతిథులు - **శ్రీ దైవజ్ఞ శర్మ గారు,** సంఖ్యాశాస్త్రజ్ఞులు, సరస్వతీ ఉపాసకులు
శ్రీ బుగ్గారపు మధుసూదనశర్మ గారు, జ్యోతిష పండితులు
శ్రీ శాస్త్రుల రఘురామశర్మ గారు, విశ్రాంత అధ్యాపకులు, చారిత్రక పరిశోధకులు
శ్రీ పాలెపు బద్రినాథ శర్మ గారు జ్యోతిష పండితులు

14.8.2018 మంగళవారం (రెండవరోజు)

ఉ.9 గం. - **శ్రీశ్రీశ్రీ వ్రతిధర శ్రీనివాసరామానుజ జీయర్‌స్వామి**

శ్రీ జగన్నాథమఠం, సీతారాంబాగ్, హైదరాబాద్ వారి కరకమలములచే **జ్యోతిప్రకాశనం**

ముఖ్యఅతిథి - **శ్రీ అజ్మీర చందూలాల్ గారు,** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖామాత్యులు

సభాధ్యక్షులు - **శ్రీ అష్టకాల నరసింహరామశర్మ గారు,** అష్టావధాని, శ్రీసరస్వతీక్షేత్ర వ్యవస్థాపకులు, అనంతసాగర్

విశిష్ట అతిథి - **శ్రీ బుర్రా వెంకటేశం** IAS **గారు,** రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి, పర్యాటక, సాంస్కృతికశాఖలు

గౌరవ అతిథులు - **శ్రీ వావిలాల దామోదరశర్మ గారు,** జ్యోతిష పండితులు

శ్రీ కొండగడప శ్రీధరశర్మ గారు, జ్యోతిష పండితులు

శ్రీ వర్ధుల నరహరిశర్మ గారు, జ్యోతిష పండితులు

ఉ.10 గం.ల నుండి మ.1 గం.ల వరకు

3. ఆగమశాస్త్రసదస్సు

సభాధ్యక్షులు – డా॥ శ్రీ చెప్పెల హరనాథశర్మ గారు

మ.2 గం.ల నుండి సా. 5 గం.ల వరకు

4. ధర్మశాస్త్రసదస్సు

సభాధ్యక్షులు – శ్రీ దోర్బల ప్రభాకరశర్మ గారు

సా.5.30 గం. నుండి 6.30 గం. వరకు సాంస్కృతిక కార్యక్రమాలు

చి॥ గౌరీభట్ల అభిజ్ఞచే స్వాగత నృత్యం,

జ్యోతిరాదిత్యం

(జ్యోతిషరూపకం)

శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ, శ్రీ ఆదరాసుపల్లి శ్యామ్మోహనశర్మ,
శ్రీమతి గీతామూర్తి, శ్రీ కొమాండూరి రంగనాథాచార్య, శ్రీమతి కొమాండూరి స్వాతి,
శ్రీ యతీంద్ర ప్రణవాచార్య సిద్ధాంతి, శ్రీ యలమంచి శ్రీధరశర్మ సిద్ధాంతి,
శ్రీ బోర్వట్ల విరాట్‌స్వరూప్ సిద్ధాంతి, శ్రీ వడిగచర్ల వెంకటరమణశర్మ సిద్ధాంతి

రెండు రోజుల మహాసభల్లో పాల్గొనే ప్రత్యేక ఆహ్వానితులు

శ్రీ వెన్నంపల్లిజగన్మోహన్‌శర్మ గారు, శ్రీ గంగు భానుమూర్తి గారు, శ్రీ గంగు ఉపేంద్రశర్మ గారు,
శ్రీ గట్టు శ్రీనివాసాచార్యులు గారు, శ్రీ బండారురాంప్రసాద్‌రావు గారు, శ్రీ గిరిప్రసాద్‌శర్మ గారు,
శ్రీ సుధాకర శర్మ గారు, శ్రీ డా॥ పి. కమలాకరశర్మ గారు,
శ్రీ కుప్పా వాసుదేవశర్మ గారు, శ్రీ వ్యాసాజుల రాధాకృష్ణశర్మ గారు, శ్రీ పి.మంగపతిరావు గారు,
శ్రీ కోటంరాజు సీతారాం ఘనాపాఠి గారు, శ్రీ వ్యాసాజుల గోపీకృష్ణశర్మ గారు, శ్రీ పి.చంద్రమౌళి గారు,
శ్రీ రాహుల్ దేశ్‌పాండే గారు, శ్రీ ముల్లాటి చంద్రమౌళిశర్మ గారు, శ్రీ అవధానుల ప్రసాద్‌శర్మ గారు,
శ్రీ కోనేటి శ్రీనివాస్ గారు, శ్రీ గోగులపాటి కృష్ణమోహన్ గారు, శ్రీ బొంగులూరి రామ్మూర్తిశర్మ గారు,
శ్రీ మహంకాళి కృష్ణమూర్తిశర్మ గారు, శ్రీ మహదేవభట్ల లక్ష్మణప్రసాద్‌శర్మ గారు, శ్రీ నేరెళ్లపల్లి ఆంజనేయశర్మ గారు,
శ్రీ గౌరీభట్ల విజయకుమార్‌శర్మ గారు, శ్రీ చింతలపల్లి వినోద్‌శర్మ గారు, డా॥ శ్రీ యజ్ఞం పవన్‌కుమార్‌శర్మ గారు,
శ్రీ సూతిపండరిరావు గారు, శ్రీ ఉప్పల బాలసుబ్రహ్మణ్యశర్మ గారు
వివిధ బ్రాహ్మణ సంఘాల, ధార్మిక సంస్థల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు
తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష విభాగ ఆచార్యులు

తెలంగాణ రాష్ట్ర జ్యోతిష్ మహాసభలు - 2018

రవీంద్రభారతి ప్రధానమందిరము-భాగ్యనగరము (హైదరాబాద్)

సమాపనోత్సవము

ద్వాదశ విద్వన్మూర్తులకు విద్వత్సభ విశిష్ట పురస్కార సత్కారము

ముఖ్యఅతిథి

డా॥ శ్రీ కె.వి.రమణాచారి I A S, Rtd గారు

ప్రభుత్వసలహాదారు, తెలంగాణ రాష్ట్రం, అధ్యక్షులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

సభాప్రారంభకులు డా॥ శ్రీ ఎస్.కె.జోషి గారు I A S గారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి

విశిష్టఅతిథి

డా॥శ్రీ సముద్రాల వేణుగోపాలాచారి గారు

ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి, గౌరవసభ్యులు,తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

సభాధ్యక్షులు శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారు అధ్యక్షులు, తెలంగాణవిద్వత్సభ

గౌరవఅతిథులు

శ్రీ కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు గారు గౌరవ రాజ్యసభ సభ్యులు

శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి గారు గౌరవ పార్లమెంట్ సభ్యులు

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు ఉపాధ్యక్షులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ పురాణం సతీష్ గారు గౌరవ శాసన మండలి సభ్యులు

శ్రీ ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ గారు గౌరవ శాసన సభ్యులు

శ్రీ ఎన్.రాంచందర్‌రావు గారు గౌరవ శాసన మండలి సభ్యులు

శ్రీ మామిడి హరికృష్ణ గారు సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ

ఆత్మీయ అతిథులు

శ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ పి.వి.మనోహర్‌రావు గారు అధ్యక్షులు, సర్వార్థసంక్షేమసమితి

శ్రీ అష్టకాల రామ్మోహన్ శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ చకిలం అనిల్‌కుమార్ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ జోషి గోపాలశర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ భద్రకాళి శేషు గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ మరుమాముల వేంకటరమణశర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీమతి సుమలత శర్మ గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీమతి సువర్ణ సులోచన గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

శ్రీ బోర్పట్ల హనుమంతాచార్య గారు గౌరవ సభ్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

విద్వత్సభ తీర్మానాలు, నివేదిక సమర్పణ

శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు కార్యదర్శి, తెలంగాణ విద్వత్సభ

వ్యాఖ్యాతలు - శ్రీ మడిపల్లి దక్షిణామూర్తి గారు, శ్రీ రంగి సత్యనారాయణశర్మ గారు

భవదాగమనాభిలాషులు

తెలంగాణ విద్వత్సభ

9440792801, 9441015469, 9440551520, 9849567669

అస్తిక మహాశయులందరికీ సాదర స్వాగతం!!

లోకాసమస్తాసుఖినోభవన్తు!!


ఓం
ధర్మాచరణ సిద్ధ్యర్థం జ్యోతిశ్శాస్త్రమనుత్తమమ్
తెలంగాణ విద్వత్సభ
పండితాః సమదర్శినః
జగద్గురువులు,
పీఠాధిపతులు,
స్వామీజీలు, మహాత్ముల
దివ్యాశీస్సులతో!
GOVERNMENT OF TELANGANA
తెలంగాణరాష్ట్ర
భాషా, సాంస్కృతికశాఖ,
పర్యాటకశాఖలు,
దేవదాయ, ధర్మదాయశాఖ
సహకారంతో...
తెలంగాణ విద్వత్సభ
దశాబ్ది మహోత్సవాలు
సిద్ధాంత,జ్యోతిష,ఆగమ,ధర్మ శాస్త్ర సదస్సులు-విద్వద్గోష్ఠి
విద్వత్సమ్మేళనం-రాబోయే శ్రీ ప్లవంగ నామ సంవత్సర పండుగల నిర్ణయం
వేద,ధర్మ,ఆగమ,సిద్ధాంత,జ్యోతిష శాస్త్ర
ద్వాదశ వరిష్ఠ విద్వన్మూర్తులకు
విశిష్ట సేవా పురస్కారంతో సత్కారం
01-08-2026 శనివారము
02-08-2026 ఆదివారము
ఉ॥ 9 గం.ల నుండి రా॥ 9 గం.ల వరకు
రవీంద్రభారతి ప్రధానమందిరము
భాగ్యనగరము

తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు

రవీంద్రభారతి ప్రధానమందిరం-భాగ్యనగరం (హైదరాబాద్)

01.08.2026 శనివారం (మొదటిరోజు) ఉ.9 గం. లకు ప్రారంభ సభ

శ్రీ పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ శ్రీ అభినవోద్దండ విద్యాశంకరభారతీ స్వామి వారి
కరకమలములచే జ్యోతిప్రకాశనం

"విద్వత్సభ సంహిత-దశాబ్ది దీపిక" తెలంగాణ విద్వత్సభ దశాబ్ది విశిష్ట సంచిక ఆవిష్కరణ

సభాధ్యక్షులు: శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారు

గౌరవ అతిథులు - శ్రీ నరేంద్రకాప్రే గారు, అధ్యక్షులు, శ్రౌతసంవర్ధినీసభ, సంస్కృతభారతీ
శ్రీ చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు గారు, విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు
శ్రీ వ్యాసోర్ముల రాధాకృష్ణ శర్మ గారు, తెలంగాణ వేదశాస్త్ర ప్రవర్ధక సభ అధ్యక్షులు

ఉ.10 గం.ల నుండి మ.1 గం.ల వరకు 1. జ్యోతిశ్శాస్త్ర సదస్సు

సభాధ్యక్షులు - డా.శ్రీ సాగి కమలాకరశర్మ గారు
1.శాస్త్రీయ జ్యోతిషం-పండితుల పాత్ర : శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి గారు
2. జ్యోతిర్వైద్యం: శ్రీమతి డా.వై.వి.రాజ్యలక్ష్మి గారు (నాగపూర్)
3. జ్యోతిశ్శాస్త్రం మాధ్యమాల ప్రభావం: శ్రీ జాలా సోమనాథ శర్మ గారు
4. ఫలితాలు , పరిహారాలు: శ్రీమతి ఎస్ .ప్రతిభ గారు

మ.2 గం.ల నుండి సా. 4గం.ల వరకు 2. ఆగమశ్శాస్త్ర సదస్సు

సభాధ్యక్షులు : డా.శ్రీ చెప్పెల హరినాథశర్మ గారు
1.ఆలయాలు-ఆగమాలు: డా.శ్రీ చిలకపాటి విజయరాఘవాచార్యులు గారు
2.ఆలయాలు-ధర్మరక్షణ: శ్రీ కాకునూరు సూర్యనారాయణ మూర్తి గారు
3..గ్రామదేవతలు - పుట్టుపూర్వోత్తరాలు: శ్రీ అప్పాల శ్యాంప్రణీతశర్మ గారు

సా.4.00 గం. నుండి 6.00 గం. వరకు విద్వత్సమ్మేళనం - మొదటి రోజు

తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య సహకారంతో
రాబోవు శ్రీప్లవంగ నామ సం॥ర (చైత్రం నుండి భాద్రపదమాసం వరకు) పంచాంగకర్తలచే పండుగల నిర్ణయాలు

సభాధ్యక్షులు - శ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి గారు, తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు
సమన్వయకర్త - శ్రీ గాడిచెర్ల నాగేశ్వరసిద్ధాంతి గారు, తెలంగాణ విద్వత్సభ, సంయుక్త కార్యదర్శి
ఆత్మీయ అతిథి - శ్రీ కవేలి అనంతాచార్యగారు, ప్రముఖ జ్యోతిష పండితులు

సా.6 గం.లకు జ్యోతిరాదిత్యం (జ్యోతిషరూపకం)



పాత్రధారులు : శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ గారు ,
శ్రీ మావుడూరు సూర్యనారాయణమూర్తి గారు, కుమారి కె.శ్రుతి గారు,
శ్రీమతి శిరీష గారు , శ్రీ కౌండిన్య తిలక్ గారు, శ్రీ కె.రవీంద్రనాథ్ గారు,
శ్రీ ముత్యంపేట గౌరీశంకరశర్మ గారు, శ్రీ కె.వి.ఎన్.ఆచార్య గారు,
శ్రీ వజ్జల శరత్ బాబు గారు, ఆహార్యం: అమరేందర్ రెడ్డి గారు

02.08.2026 ఆదివారం (రెండవరోజు)

ఉ.7 గం.ల నుండి శ్రీ శంకరమంచి రామకృష్ణశాస్త్రిగారి ఆధ్వర్యంలో సిద్ధాంతులచే శ్రీసూర్యసిద్ధాంత పారాయణం

ఉ.9గం.ల నుండి 1 గం. వరకు 3. జ్యోతిష సిద్ధాంత సదస్సు

సభాధ్యక్షులు: శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు

ఆత్మీయ అతిథి : శ్రీ చికిలి వేంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి గారు

1. సూర్యసిద్ధాంత విశిష్టత: డా.శ్రీ శంకరమంచి రామకృష్ణశాస్త్రి సిద్ధాంతి గారు
2. సిద్ధాంతులు-పురోహితుల సమన్వయం: శ్రీమాన్ సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి గారు
3. ఆధునిక సాంకేతిక విజ్ఞానం-జ్యోతిషం: డా.శ్రీ శంకరమంచి శివశర్మ సిద్ధాంతి గారు
4. పంచాంగం-ప్రామాణికత: శ్రీ తూండ్ల కమలాకరశర్మ సిద్ధాంతి గారు



శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారి శిష్యులు శ్రీ వడిగచెర్ల వేంకటరమణశర్మసిద్ధాంతి గారి మనోన్మన: గ్రంథావిష్కరణ

మ.2గం.ల నుండి సా.4 గం. వరకు 4. ధర్మశాస్త్ర సదస్సు

సభాధ్యక్షులు: శ్రీ శాస్తుల వేంకటేశ్వరశర్మ గారు

విశిష్ట అతిథి : మహామహోపాధ్యాయ డా.శ్రీ దోర్బల ప్రభాకరశర్మగారు

1. ధర్మపరిరక్షణకు ధర్మాచార్యుల దిశానిర్దేశం: శ్రీ పురాణం మహేశ్వరశర్మగారు
2. ధర్మాచరణలో పురోహితులు అర్చకుల కర్తవ్యం: డా.శ్రీ బాచంపల్లి సంతోష్ కుమార శాస్త్రిగారు
3. ఆర్షధర్మ పరివ్యాప్తంలో వేదపాఠశాలలు: శ్రీమాడుగుల శశిభూషణశర్మ సోమయాజి గారు

సా.4.00 గం. నుండి 6.00 గం. వరకు విద్వత్సమ్మేళనం - రెండవ రోజు

రాబోవు శ్రీప్లవంగ నామ సం॥ర (ఆశ్వీయుజం నుండి ఫాల్గుణమాసం వరకు) పంచాంగకర్తలచే పండుగల నిర్ణయాలు

సభాధ్యక్షులు - శ్రీ ఆకెళ్ళ జయకృష్ణశర్మ సిద్ధాంతి గారు, తెలంగాణ విద్వత్సభ గౌరవ సలహాదారులు

సమన్వయకర్తలు- శ్రీ ఓరుగంటి మనోహరశర్మసిద్ధాంతి గారు, తెలంగాణ విద్వత్సభ, సంయుక్త కార్యదర్శి

శ్రీమాన్ నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు గారు , శ్రీ హయగ్రీవ గాయత్రీ ఆశ్రమం, యాదగిరిగుట్ట

ఆత్మీయ అతిథులు

శ్రీవెన్నంపల్లి జగన్మోహనశర్మ గారు : తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఛైర్మన్

శ్రీమోత్కూరు రామేశ్వరరావు గారు : తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు

శ్రీ గంగు ఉపేంద్రశర్మ గారు : రాష్ట్ర అర్చక సంఘం వరిష్ఠ నాయకులు

శ్రీ దౌలతాబాద్ వాసుదేవశర్మ గారు : ధూపదీప నైవేద్య సంఘం, అధ్యక్షులు

శ్రీ బండారు రాంప్రసాదరావు గారు : రాష్ట్ర కరణం నియోగి సంఘం అధ్యక్షులు

శ్రీచింతపల్లి మంగపతిరావు గారు : బ్రాహ్మణ సంఘం వరిష్ఠ నాయకులు

సా.6 గం.ల నుండి తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాల సమాపనోత్సవం

ఓం

తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు

ముఖ్యఅతిథులు

శ్రీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గారు
రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖల మంత్రి

శ్రీ జూపల్లి కృష్ణారావు గారు
రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి

శ్రీమతి కొండా సురేఖ గారు
రాష్ట్ర దేవదాయ,ధర్మదాయ శాఖ మంత్రి

విశిష్ట అతిథులు

శ్రీ హర్కర వేణుగోపాలరావు గారు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

శ్రీ డా.కె.వి.రమణాచారి గారు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు

శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు
ఛైర్మన్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమపరిషత్తు

శ్రీ పాన్నాడ సుబ్రహ్మణ్యం గారు
వైస్ ఛైర్మన్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమపరిషత్తు

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు
తెలంగాణ ముఖ్యమంత్రి పూర్వ ప్రధాన ప్రజాసంబంధాల అధికారి

శ్రీ ఎస్ వేణుగోపాలాచారి గారు
పూర్వ కేంద్ర మంత్రి

గౌరవ అతిథులు

శ్రీమతి శైలజారామయ్యర్ గారు
ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, దేవదాయ,ధర్మదాయ శాఖ

శ్రీ ఎం. హనుమంతరావు గారు
కమిషనర్, రాష్ట్ర దేవదాయ,ధర్మదాయ శాఖ

శ్రీ ఏనుగు నరసింహారెడ్డి గారు
సంచాలకులు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ

జీవన సాఫల్య పురస్కారం

గేయవాల్మీకి, సుప్రసిద్ధ విద్వాంసులు

బ్రహ్మశ్రీ రుక్మాభట్ల నరసింహస్వామి గారికి జీవనసాఫల్య పురస్కారం

వరిష్ఠ విద్వన్మూర్తులకు విశిష్ట సేవా పురస్కారంతో సత్కారం

విఖ్యాత వేదపండితులు బ్రహ్మశ్రీ గట్టు నరహరిశర్మ అవధాని గారు

వైదిక స్మార్తాగమ పండితులు బ్రహ్మశ్రీ రాంపల్లి నారాయణశర్మ అవధాని గారు

ప్రముఖ పంచాంగకర్త,పండితులు బ్రహ్మశ్రీ ఆకెళ్ల జయకృష్ణశర్మసిద్ధాంతి గారు

ప్రముఖ పంచాంగకర్త బ్రహ్మశ్రీ బోర్భట్ల రాఘవేంద్రాచార్యసిద్ధాంతి గారు

ప్రముఖ సాహితీ వేత్త శ్రీమాన్ పెరంబదూరు డా. శ్రీరంగాచార్య గారు

విఖ్యాత వైదికాగమ పండితులు బ్రహ్మశ్రీ యల్లంభట్ల సీతారామశాస్త్రి గారు

ఉభయభాషా,ఆగమ పండితులు శ్రీమాన్ కోదండరామాచార్యులు గారు

విఖ్యాత వేద,శాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వేంకటేశ్వరశర్మ గారు

ధార్మికవేత్త, గీతాప్రచారకులు బ్రహ్మశ్రీ మధునూరి వేంకటరామశర్మ గారు

విఖ్యాత జ్యోతిష పండితులు శ్రీమతి మహావాది సంధ్యాలక్ష్మి గారు

ప్రముఖ పంచాంగకర్త బ్రహ్మశ్రీ శాస్త్రుల కృష్ణమూర్తిశర్మసిద్ధాంతి గారు

ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు బ్రహ్మశ్రీ గౌరీభట్ల సత్యనారాయణశర్మ గారు

ప్రముఖ అధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ బోర్భట్ల హనుమంతాచార్య గారు

ఈ విశిష్ట కార్యక్రమంలో ఆస్తిక మహాశయులందరు పాల్గొనగలరని ప్రార్థన

యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి
తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు
9440792801

దివ్యజ్ఞాన సిద్ధాంతి
తెలంగాణ విద్వత్సభ కార్యదర్శి
9849567669

మరుమాముల వేంకటరమణశర్మ
తెలంగాణ విద్వత్సభ కోశాధికారి
9441015469

జ్యోతిషం... శాస్త్రచర్చ

సమ్మాన్ ఎన్నికే సీనాజ్ ఎందుకు ఎక్కువిస్తాయి. ఆ ఎందుకే మనకి పట్టక్కాన్ని ప్రభవిస్తు, సమాజ పట్ట అవిని అర్థశతం తీర్చివచ్చాయి. అందుకే ప్రాచీన కాల మేధావులు కాస్త్రాన్ని సమ్మాన్ చారంతర పరిణామము పట్టికేనేమి, సమగ్రం పరిపూర్ణ ప్రతిరూపము. ఆ కాస్త్రాని అతనం ఎన్నికే సమ్మాన్ సూత సమ్మాలా స్థితికి సీనాజు. బర అనుసరం సాక్షిని కాస్త్రిళ్ళ, మన విద్వత సారస్వత్ళో క్షేతిల గాస్త్రం ఒకటి.

■ విగళ్ళ శ్రీలత

జ్యోతిష్య మహాసభలు



ఏకాలంలో పన్నే సందర్భంలో కూడా వీటిని ప్రోత్సహించడం వీటిమీద అభిమానం ఉండటం.

ఇందులోని మొదటి అంశం 'ఆహ్వానం-అలంకారం'. మొదట అంశం 'అలంకారవర్గకథలు'. మూడవ అంశం 'అవధాన ధర్మాలు'. వాటిలో అంశం 'సాహిత్య సమ్మేళనాలు' అనేది ప్రధానమైన అంశం. ఇందులోనే సాంగు అంశాలుంటాయి. అవి వరుసగా.. ధర్మాచరణలో ప్రేమలు పాత్ర, ధర్మమార్గ నిర్ణేతలు ఫలితాలు, ధర్మసంస్థాపనలో ధ్యానాధ్యాన. సమస్యాల ప్రభావాలు.

అవి రోజు సాయంత్రం జ్యోతిష సందేహాలలో విద్వాంసులే జ్యోతిలిఖిత్సు' అనే చరిత్ర ఉంటుంది.

రయాత్ర సమారోహోత్సవ సమారాధ్యమం అయింది ప్రభాకరం భక్తుల సమక్షంలో పెళ్ళకరం సమక్షంలో ఉన్నారు. అంతకు ముందు ధర్మాచరణ ఆధ్యాత్మిక 12 మంది పండితులు సత్కరించారు. ఈ జ్యోతిష్య మహాసభలు రాష్ట్రంలోని విద్వాంసులు, మేధావులు, అధికారులు ఆత్మసాక్షులు హాజరయ్యారు. ఇంకా ప్రాంతం ఆధ్యాత్మానికి ప్రాచీన్యం ప్రాధాన్యత ఇస్తూ ఈ సభలు ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ 2017 సెప్టెంబర్ 9, 10 తేదీలలో హైదరాబాద్ లో జరిగిన సభలో పాల్గొన్న ప్రముఖులు, పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు, ప్రవచనకర్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ఆధ్యాత్మిక ప్రముఖుల

దశాబ్ది మహోత్సవాల విశిష్ట సంచిక (2017-2026)































తెలంగాణలో విఖ్యాతి గడించి కీర్తిశేషులైన ప్రముఖ సిద్ధాంతులు


1. శ్రీ మరుమాముల శ్రీరామశర్మ సిద్ధాంతి గారు
2. శ్రీ రాంభట్ల చంద్రశేఖర శర్మ సిద్ధాంతి గారు
3. శ్రీ శ్రీరాంభట్ల ముక్తేశ్వర శర్మ సిద్ధాంతి గారు
4. శ్రీమాన్ అప్పన్ కందాడై శ్రీనివాసా చార్య సిద్ధాంతి గారు
5. శ్రీ గాడిచర్ల నారాయణ శర్మ సిద్ధాంతి గారు
6. శ్రీ బోర్వట్ల శేషాచార్య సిద్ధాంతి గారు
7. శ్రీమాన్ మరింగంటి మణనాళాచార్య సిద్ధాంతి
8. శ్రీ గురజాల గోపాలకృష్ణయ్య సిద్ధాంతి గారు
9. శ్రీ చిరువెల్లి శ్యాం సుందర శర్మ సిద్ధాంతి గారు
10. శ్రీ కటకం శంకర శర్మ సిద్ధాంతి గారు
11. శ్రీ వారణాసి బుచ్చన్న స్వామి సిద్ధాంతి గారు
12. శ్రీ రామడుగు రామకృష్ణ శర్మ సిద్ధాంతి గారు
13. శ్రీ గుడి నరసింహ శర్మ సిద్ధాంతి గారు
14. శ్రీ గుండా మహారాజ్ సిద్ధాంతి గారు
15. శ్రీ అన్నోజ్జల కిషన్ రావు సిద్ధాంతి గారు
16. శ్రీ చికిలి నారాయణ శాస్త్రి సిద్ధాంతి గారు
17. శ్రీ చొల్లేటి లక్ష్మయ్య సిద్ధాంతి గారు
18. శ్రీ సిరసనగండ్ల సాంబయ్య సిద్ధాంతి గారు
19. శ్రీ నండుల అచ్యుతరామయ్య శర్మ సిద్ధాంతి గారు
20. శ్రీ కానాదిభట్ల వేంకట్రామ సిద్ధాంతి గారు
21. శ్రీమాన్ కొమాండూరి శేషాచార్య సిద్ధాంతి గారు
22. శ్రీ యాయవరం కృష్ణ శర్మ సిద్ధాంతి గారు
23. శ్రీ త్రిపురారి రామకృష్ణ శర్మ సిద్ధాంతి గారు
24. శ్రీమాన్ కొమాండూరి రంగాచార్య సిద్ధాంతి గారు
25. శ్రీ మక్కపాటి సోమసుందర శర్మ సిద్ధాంతి గారు
26. శ్రీ పాలకుర్తి నృసింహ రామశర్మ సిద్ధాంతి గారు
27. శ్రీ బ.యన్. శర్మ సిద్ధాంతి గారు
28. శ్రీ గౌరీభట్ల సీతారామ శర్మ సిద్ధాంతి గారు
29. శ్రీ బ్రహ్మభట్ల శ్రీరామ శర్మ సిద్ధాంతి గారు
30. శ్రీ అయినవోలు అనంతమల్లయ్య సిద్ధాంతి గారు
31. శ్రీ యాయవరం దయాకరశర్మ సిద్ధాంతి గారు
32. శ్రీ శ్రీరాంభట్ల రాజేశ్వరశర్మ సిద్ధాంతి గారు
33. శ్రీ అగ్రహారం సృష్టి సత్యనారాయణ సిద్ధాంతి గారు
34. శ్రీ దేవులపల్లి వేంకట సుబ్రహ్మణ్యం సిద్ధాంతి గారు
35. శ్రీ గుడి రాజేశ్వర శర్మ సిద్ధాంతి గారు
36. శ్రీ మరింగంటి వేంకట పీతాంబరాచార్య సిద్ధాంతి గారు


తెలంగాణలో విఖ్యాతి గడించి కీర్తిశేషులైన ప్రముఖ సిద్ధాంతులు




తెలంగాణలో విఖ్యాతి గడించి కీర్తిశేషులైన ప్రముఖ సిద్ధాంతులు









జ్యోతిష శాస్త్రజ్ఞుడు వరాహమిహిరుడు
బృహత్సంహిత
తాత్పర్యం
తెలంగాణ విద్వత్సభ
పండితాః సమదర్శినః



బ్రహ్మస్వభవనం ట్రస్టు,వారణాసి

సోనార్‌పురా,క్షీర్‌సాగర్ స్వీట్‌హౌజ్ పక్కన,కేదారఖండం



కాశీలో సదాచారసంపన్నులకు సకల వసతులతో రూ.ఐదు కోట్ల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక బ్రహ్మస్వ భవనం నిర్మాణం

కాశీలోని కేదారఖండం సోనార్‌పురాలో శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందతీర్థస్వామివారి సంకల్పంతో ఏర్పాటుచేసిన బ్రహ్మస్వభవనం ట్రస్టులో సదాచారసంపన్నులు, కాశీలో నిష్ఠగా దీక్షతో వాసంచేసేవారికి శుచిగా అన్నప్రసాదం, వసతి అందించటం, ధార్మిక సేవాకార్యక్రమాలు నిర్వహించుకోటానికి తగిన వ్యవస్థను అందించే సమున్నత లక్ష్యంతో బ్రహ్మస్వభవనం ట్రస్టు ఏర్పాటయింది. ఈ లక్ష్యంతో గత రెండున్నర సంవత్సరాలుగా తాత్కాలిక భవనంలో లక్ష మందికి మడితో భోజనం,వసతి అందించి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు, సత్సంగాలను నిర్వహించింది. ప్రస్తుతం ఐదుకోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక భవనాన్ని నిర్మాణం చేస్తోంది. శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామివారు తమ కరకమలములచే ఈ భవననిర్మాణానికి శిలాన్యాసం చేసి అనుగ్రహించారు. ఈ మహత్తర కార్యాచరణలో ఆస్తికమహాజనులందరూ భాగస్వాములై బ్రహ్మస్వ భవనం నిర్మాణానికి తమ శక్తిమేర విరాళాలు అందించి అన్నపూర్ణా,విశాలాక్షీ సమేత కాశీ విశ్వనాథుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరుతున్నాము.

BRAHMASWA BHAVANAM TRUST VARANASI

SBI

Merchant Name : BRAHMASWA BHAVANAM TRUST

UPI ID : brahmaswabhavanam@sbi

BHIM UPI

G20

ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

BRAHMASWA BHAVANAM TRUST

SBI A/C NO 43207617077 SARASWATHI NAGAR BRANCH

IFSC CODE SBIN0021461 SAIDABAD, HYDERABAD

SWIFT CODE SBININBB

వివరాలకు 9441015469, 9866351972, 9440507716, 9440734105 నెంబర్లకు సంప్రదించగలరు

బ్రహ్మస్వభవనం నిర్మాణంలో భాగస్వాములయ్యే వదాన్యులకు సూచనలు... విన్నపం

లక్ష రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం మూడు రోజుల ఉచిత వసతి

ఐదు లక్షల రూపాయల విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 15 రోజుల ఉచిత వసతి

పది లక్షల రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 30 రోజుల ఉచిత వసతి

ఇరవై ఐదు లక్షల రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 60 రోజుల ఉచిత వసతి

కోటి రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు శాశ్వత వసతిగా ఒక గది కేటాయింపు (ఒక అంతస్తుకు వారిపేర శిలాఫలకం)